

# శాక్కో-వాంజెట్టి

వ్యథార్త జీవిత యథార్థ దృశ్యం

బి. చంద్రశేఖర్

# శాక్కో-వాంజెట్టి

## వ్యధార్త జీవిత యథార్ధ దృశ్యం

బి. చంద్రశేఖర్

పర్స్పెక్టివ్స్
హైదరాబాదు
1995

నవంబరు 1995

ప్రచురణ నెం : 15

# శాక్కో-వాంజెట్టి

347.075
చం.29.50

C16580

44026

రచన : బి. చంద్రశేఖర్
అడ్వకేటు
చర్చికాంపౌండ్ గేటు, బ్రాడీపేట, గుంటూరు - 522 002
ఫోన్ : 233492

కవర్ డిజైన్ : ఆర్.కె. (నవ్య)
ఆల్బం లేఅవుట్ : హరిశంకర్ (ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్)

కంపోజింగ్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్, బాగ్‌లింగం పల్లి,
హైదరాబాదు - 40. ఫోన్ : 660000

ముద్రణ : నవ్య ప్రింటర్స్, బాదమ్‌సోహన్ అపార్ట్‌మెంట్స్,
రాజ్‌భవన్‌రోడ్, హైదరాబాదు. ఫోన్ : 314147

పబ్లిషర్స్ : పర్‌స్పెక్టివ్స్
3-6-252, శిల్ప అపార్ట్‌మెంట్స్, ఎర్రమంజిల్ కాలని
సోమాజిగుడ, హైదరాబాద్ - 500 482.

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : నవోదయ బుక్ హౌస్,
3-3-865 ఆర్య సమాజ్ ఎదురు, కాచిగూడ
హైదరాబాదు - 500 027. ఫోన్ : 552387

వెల : 75/-

నూరుపూలు వికసించనీ
వేయి ఆలోచనలు సంఘర్షించనీ



స్వప్నాలనుంచి వాళ్ళు విముక్తమయ్యారు
జిడ్డోడే జైలు దుస్తుల నుంచి వారు
విడుదలయ్యారు
ఒకే పాట పాడుతూ
వారి గొంతుకలు వేయిరెట్లు ప్రతిధ్వనిస్తాయి
సాహసముంటే
నువ్వు దాన్ని పద్యంగా మార్చు

- జాన్‌డాస్‌పాస్సోస్

పీడితవర్గం, ధనికవర్గం అనే రెండు వర్గాల మధ్య ఈ కేసు నడిచిందని నాకు తెలుసు. ఆ రెండింటి మధ్య ఘర్షణ ఎప్పుడూ ఉంటూనే వుంది. పుస్తకాల ద్వారా, సాహిత్యం ద్వారా మేం ప్రజలతో స్నేహం చేస్తాం. మీరు వారిని వేధిస్తారు. వారిపై దౌర్జన్యం చేస్తారు. వాళ్ళను చంపుతారు. ప్రజల్ని విజ్ఞాన వంతులను చేసేందుకు మేము అహర్నిశలూ ప్రయత్నిస్తాం. మాకూ, మరొక జాతికీ మధ్య విబేధాలను సృష్టించేందుకు మీరు ప్రయత్నిస్తారు. సరే మీరు పీడకులు. . . . .

- శాక్కో

మా కేసును అర్థం చేసుకోవాలంటే (బహుశా) ఒక లాయర్ అవసరం కావచ్చు. ఒక సోషియాలజిస్టు లేదా సైకాలజిస్టు అవసరం కావచ్చు. నిజానికి ఉన్నత మేధస్సున్న ఒక తత్వవేత్త కావాలి. . . .

- బార్టొలోమియో వాంజెట్టి

# కృతజ్ఞతలు

ఈరచన కవసరమైన కొన్ని గ్రంధాలను శ్రీ కె.జి. కన్నబిరాన్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి (సెంట్రల్ యూనివర్శిటీ), ప్రొఫెసర్ బి. సి. బారు (డ్యూక్ యూనివర్శిటీ - యు ఎస్ ఎ ), శ్రీ ఎ సుబ్రమణ్యం (నాగార్జున యూనివర్శిటీ), శ్రీ కృష్ణారెడ్డి (గుంటూరు) అందించారు. ఎ.ఎస్ ఆర్.సి. లైబ్రరీ (హైదరాబాదు)లో కొన్ని విలువైన గ్రంధాలు లభించాయి. గోపరాజు రవి (గుంటూరు) జి. శివనాగేశ్వరరావు (తెనాలి) వ్రాత ప్రతిని చదివి విలువైన సూచన లిచ్చారు. శ్రీమతి యం. చంద్రిక అనేక విధాలుగా ఈరచనా కాలమంతా సహకరించారు. కె. బాలగోపాల్ చివరిమాట ఎంతో ముందుగానే రాసిచ్చి సహకరించారు. కేవలం వ్యవధి లేనందువల్లే శ్రీ కన్నబిరాన్ ముందుమాట రాయలేకపోయారు.

మరో యిద్దరి కృషి లేకుంటే యీపుస్తకం వెలుగు చూసేదేకాదు. వేమన వసంతలక్ష్మి, ఆర్.కె లు గత ఐదేళ్ళుగా ఎప్పుడు కలిసినా శాక్కొ, వాంజెట్టిలను గుర్తు చేస్తూ, యీ పుస్తకం రాస్తానన్న ప్రామిస్‌ను పదేపదే ప్రస్తావిస్తూ, నాచేత వీళ్ళిద్దరూ యీ రచన పూర్తి చేయించారు ఏడేళ్ళ క్రితం శాక్కొ, వాంజెట్టిల గురించి రాసిన చిన్న వ్యాసాన్ని అయిదు వారాల పాటు 'ఉదయం' పత్రికలో అచ్చేయించింది కృష్ణుడు, వసంతలక్ష్మి. వ్రాత ప్రతిని శ్రద్ధగా చదివి తగు మార్పులు సూచించి, సరిదిద్దింది వసంతలక్ష్మి. మంచి పుస్తకాల ప్రచురణకు కొండంత అండగా నిలిచే స్మైల్ సహకారం మరువలేనిది.

ఎన్నిసార్లు ఎన్నిమార్పులు సూచించినా, చాలా ఓపికగా శ్రద్ధగా మనసుకి పట్టించుకొని కంపోజింగ్ పనులను పర్యవేక్షించారు ఫాంట్‌లైన్ నిర్మలగారు. అతిశ్రద్ధగా సకాలంలో కంపోజింగ్ చేసిచ్చారు సునీత, కోటేశ్వరరావు గార్లు. ఆల్బం డిజైనింగ్ చేసింది శంకర్ (ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్). ప్రెస్ పనుల హడావుడిలో కూడా, కవర్ డిజైనింగ్‌తోపాటు చాలా శ్రద్ధగా ప్రింటింగ్ పనులు పూర్తి చేశారు మిత్రులు నవ్య ప్రింటర్స్ రామకృష్ణారెడ్డి.

తామున్న ఆర్థిక దుస్థితిలో, యింత పెద్ద పుస్తకం వేయలేని స్థితిలోకూడా ప్రచురణకి సాహసించారు ఏటికి ఏదురీదే పర్‌స్పెక్టివ్స్ సాహితీ మిత్ర బృందం.

ఈ పుస్తక రచనకు, ప్రచురణకు యిన్ని విధాలుగా సహకరించిన వీరందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు.

గుంటూరు

29 నవంబరు 95

**బి. చంద్రశేఖర్**

## అగ్ని సరస్సున వికసించిన


| | | |
|---|---|---|
| | మా మాట | VI |
| 1. | నేపథ్యం | 1 |
| 2. | నాందీ ప్రస్తావన | 15 |
| 3. | రిహార్సల్ | 28 |
| 4. | కేసు విచారణ | 49 |
| 5. | మళ్ళీ విచారిస్తారా | 142 |
| 6. | మెడైరోస్ - మోరెల్లి | 157 |
| 7. | మరణ శిక్ష | 175 |
| 8. | ఫుల్లర్ - లోవెల్ | 185 |
| 9. | చావు బతుకుల్లో | 214 |
| 10. | విద్యుత్ సింహాసనంపై | 256 |
| 11. | వ్యక్తిత్వం | 266 |
| 12. | సాహిత్యం | 274 |
| 13. | ఉపసంహారం | 287 |
| ★ | రాజ్యహింస గురించి యింకొంచెం ఆలోచిద్దాం | 289 |
| ★ | ప్రజా చరిత్రలు | 302 |
| ★ | బిబ్లియోగ్రఫీ | 304 |


అదనంగా 12 పేజీల ఫొటో ఆల్బం

# మాహూట

ప్రజాస్వామ్యం, మానవ హక్కులు ఈ శతాబ్దంలో అత్యధికంగా దుర్వినియోగం అయిన మాటలు. అంతగా అవి దుర్వినియోగం కాగలిగాయంటేనే ఆభావాలలో బలమైన ఆకర్షణ ఉందనీ, వాటిపట్ల సమాజంలో ప్రబలమైన కాంక్ష ఉందనీ అర్థం.

ఈ ఆకర్షణనూ ఈ కాంక్షనూ తనకు అనుకూలంగా మలచుకున్న దేశం అమెరికా. ఆ దేశం ప్రజాస్వామ్యానికీ మానవహక్కులకూ అత్యున్నత ప్రతినిధి కాబట్టి ప్రపంచ రాజకీయాలను శాసించే అర్హత దానికి ఉందనేది 'అమెరికా భావజాలం' లోని ప్రధాన అంశం. దీనిని భావజాలం అంటున్నామంటే అమెరికాలోని ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఒక భావజాలం అని అర్థం కాదు. ఆ ప్రజాస్వామ్యంలో చాలా లోపాలున్నప్పటికీ అది వట్టి బూటకం మట్టుకు కాదు. దానిని వట్టిబూటకం అనుకోవడం పాత తప్పిదాలను మళ్లీ మళ్లీ చేయడం అవుతుంది.

అయితే ప్రజాస్వామ్యానికి అమెరికాను ప్రతినిధిగా భావించడం బూటకమే. అమెరికాలో ఉన్న రాజకీయ ప్రజాస్వామ్యంలో చాలా లోపాలు, పరిమితులు ఉన్నాయి. పైగా ప్రజాస్వామ్యం అంటే కేవలం రాజకీయ ప్రజాస్వామ్యం కాదు. సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం కూడ ప్రజాస్వామ్య భావనలో అంతర్భాగమే.

మరొకవైపు తమ దేశాలలో సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం (సమాన అవకాశాలు, సమాన ప్రతిపత్తి) ఉంది కాబట్టి తమ వ్యవస్థలే నిజమయిన ప్రజాస్వామ్య వ్యవస్థలని, తామే ప్రజా స్వామ్యానికి నిజమైన ప్రతినిధులమని కమ్యూనిస్టు పాలిత దేశాలు నిన్నటిదాకా అన్నాయి. ఇది కూడా ఒక 'భావజాలం' గానే పని చేసింది. ఆ దేశాలలో సాంఘిక ఆర్థిక ప్రజాస్వామ్యం అమెరికాలో కంటె ఎక్కువగానే ఉన్నా అది కూడ సంపూర్ణం కాదు. అంతేకాక రాజకీయ ప్రజాస్వామ్యం లేని చోట సాంఘిక ఆర్థిక ప్రజాస్వామ్యం (ఏదో ఒక మేరకు) ఉన్నంత మాత్రాన అది ప్రజాస్వామ్యం కాదు. 'అదే నిజమైన ప్రజాస్వామ్యం' అనేది భావజాలం మాత్రమే అవుతుంది.

రాజకీయ ప్రజాస్వామ్యం, సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం అని వర్గీకరించి మాట్లాడుతున్నామంటే అవి రెండూ పరస్పర సంబంధం లేని విడి విడి విషయాలని అర్థం కాదు. నిజానికి వీటిలో ఒకటి లేకపోతే రెండవది పరిపూర్ణం కాదు.

మన ఆకాంక్షలలో బలంగా ఉన్న ప్రజాస్వామ్య భావనను బూటకపు వ్యాఖ్యానాలనుండి, భావజాలాలనుండి కాపాడుకొని వాస్తవికంగా ఆలోచించడం అవసరం. దీనికి కావలసిన విశ్లేషణా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అవసరం. ముందు, ప్రజాస్వామ్యం పేరు మీద ఈ శతాబ్దపు చరిత్రలో ఏమేం జరిగిందో తెలుసుకోవడం అవసరం. తెలుసుకోవడం మొదలు పెడితే ఒళ్లు గగుర్పొడిచే అనేక ఉదంతాలు వినవలసి ఉంటుంది (తూర్పు పడమరల నుండి).

వాటిలో కేవలం ఒక కథ ఈ యిద్దరు ఇటాలియన్‌ల విషాదగాథ. అమెరికా గర్వంగా చెప్పుకునే రాజకీయ ప్రజాస్వామ్యం నిజానికి అక్కడ ఎంత ఉంది అన్న ప్రశ్నను అమెరికా ముందు, ప్రపంచం ముందు నిలబెట్టిన కథ యిది.

సమకాలీన అమెరికా సమాజంలో లక్షల మెదళ్ళను కదిలించి ఒక తరం మేధావులకు హీరోలయిన చెప్పులుకుట్టి బతికిన శాక్కో, చేపలమ్మి జీవించిన వాంజెట్టిల వ్యధార్త జీవిత యథార్థ దృశ్యమే ఈ గ్రంథం. గత శతాబ్దపు చివరి దశకంలో యూరప్‌ను డ్రేఫస్ కేసు కుదిపితే, శాక్కో-వాంజెట్టి కేసు రెండవ దశకంలో ప్రపంచాన్ని ఊపేసింది. తమ రాజకీయ అభిప్రాయాల కారణంగా తప్పుడు కేసులో ఇరికించబడిన ఈ సాదాసీదా తాత్విక అరాచక వాదుల కోసం ప్రపంచమంతా ఒకే గొంతుకై నినదించింది. అరాచకవాదుల, కమ్యూనిస్టుల నుంచి లిబరల్ మేధావుల దాకా వీరికోసం న్యాయస్థానాల్లోనూ, బయటా అవిశ్రాంతంగా యాభై ఏళ్ళపాటు పోరాడారు. టొరాంటో నుంచి టోక్యో దాకా, అలాస్కా నుండి ఆస్ట్రేలియా దాకా, సాధారణ కార్మికులనుంచి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తల దాకా ఎందరో వీరిద్దరి కోసం ఉద్యమించారు. 'ట్రూ డిటెక్టివ్ మిస్టరీస్' నుంచి 'హార్వర్డ్ లా రివ్యూ' వరకూ ప్రపంచంలోని పలు భాషల్లో పత్రికల్లో వీరి గురించి కోట్లాది పదాలు అచ్చయ్యాయి. టన్నుల కొద్ది సాహిత్యం అచ్చయింది. అచ్చవుతోంది. మానవ జాతి చరిత్రలో వీరి కేసు గురించి వెలువడినంత సాహిత్యం మరే కేసు గురించీ వెలువడలేదంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.

1976 ఎమర్జెన్సీ చీకటిరోజుల్లో ముషీరాబాద్ జైల్లో ఉరితీయబడిన రైతాంగ నక్సలైట్ యోధులు భూమయ్య, కిష్టాగౌడ్‌ల గురించి శ్రీశ్రీ రాసిన 'భూమ్యాకాశాలు' కవిత ద్వారా తెలుగు పాఠకులకు శాక్కో, వాంజెట్టిలు పరిచయమయ్యారు. కాగా, ఇది శాక్కో-వాంజెట్టిల గురించి రచించబడిన తొలి తెలుగు పుస్తకం. ఇరవయ్యొకటవ శతాబ్దాన్ని తనదిగా ప్రకటించుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో దాని నిజస్వరూపాన్ని సందర్శించేందుకూ, రాజకీయ, సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామ్య అవసరాన్ని, విలువలని గుర్తించేందుకూ ఈ గ్రంథం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

పర్‌స్పెక్టివ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం

హైద్రాబాద్
12 నవంబర్ '95

# ఉద్యమాలు
# సామాజిక సంక్షోభాలు
# ప్రజల జ్ఞానాన్ని
# వృద్ధిచేస్తాయి

> అమెరికన్ జీవితంలోని సర్వాంగ నిర్మాణాన్ని - వివిధ వర్గాలు, వృత్తులు, దృక్పథాలు, వాటి పరస్పర సంబంధాలతో సహా, శాక్కొ - వాంజెట్టి కేసు సర్వసమగ్రంగా ఆవిష్కరించింది. మన రాజకీయ సామాజిక సరళితో సంబంధమున్న ప్రతి ప్రాథమిక ప్రశ్ననూ అది.లేవనెత్తింది.
>
> – ఎడ్మండ్‌విల్సన్ (1928)

# నేపథ్యం

**అస్తిత్వంలో** ఉన్న సామాజిక వ్యవస్థను సమూలంగా మార్చాలనే సిద్ధాంతాన్ని నమ్మే వారిని అమెరికాలో రెడ్స్, రాడికల్స్ అని పిలుస్తారు. మార్క్సిస్టులు, సోషలిస్టులు, తాత్విక అరాచకవాదులు (Philosophical Anarchists) ఆ కోవలోకి వస్తారు. పంథొమ్మిదీ, ఇరవై శతాబ్దాల సంధికాలంలో విస్తృతంగా వ్యాప్తిచెందిన ఈ రాడికల్స్‌లో ఎక్కువమంది యూరప్ నుంచి పొట్ట చేతపట్టుకొని అమెరికాకు వలసవచ్చిన ప్రవాసులే. వీరు ఆనాడు అమెరికా ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలన్నిటినీ అతలాకుతలం చేశారు.

పంథొమ్మిదవ శతాబ్దపు రెండవఅర్ధభాగంలోఅమెరికాలోత్వరితగతిన పారిశ్రామికాభివృద్ధి జరిగింది. పెరిగిన పరిశ్రమల్లో పనిచేసేందుకు పెద్ద ఎత్తున శ్రామికులు అవసరమై శ్రామికుల కొరత ఏర్పడింది. యూరప్ నుండి దిగుమతైన పేద ప్రవాసులు ఆ కొరతను తీర్చారు.

యూరప్‌లో వచ్చిన ప్రతి రాజకీయ, ఆర్థిక సంక్షోభం తర్వాత పెద్ద సంఖ్యలో శ్రామికులు అమెరికాకు తరలివచ్చారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన కొన్నాళ్ళ వరకూ ఈ వలస పెద్ద పెట్టున కొనసాగింది. యూరప్ నుంచి 1890-1924 మధ్య కాలంలో రెండు కోట్ల మంది అమెరికాలో ప్రవేశించారని అంచనా. ఈ ప్రవాసుల శ్రమ అమెరికా పరిశ్రమల్లో కారు చౌకగా అమ్ముడు పోయింది. వీరు గొడ్డు చాకిరీ చేస్తూ అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవించారు. తమ రక్తంతో చెమటతో అమెరికా నాగరిక వ్యవస్థను నిర్మించారు. వీరిలో ఇటాలియన్ ప్రవాసులు సంఖ్యరీత్యా మొదటి స్థానంలో ఉండేవారు.

తమతోపాటుగా భౌతిక శ్రమశక్తినే గాక పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యతిరేక రాడికల్ భావాలనూ, స్వేచ్ఛావాద సిద్ధాంతాన్ని, ప్రత్యక్ష పోరాట అనుభవాలను కూడా ప్రవాస కార్మికులు అమెరికాకు మోసుకు వచ్చారు.

తమ కష్టాలకు కారణం పెట్టుబడిదారీ శ్రమ దోపిడీ అని స్పష్టంగా తెలిసినప్పటికీ దాన్ని వదిలించుకోవడం ఎలాగో ప్రవాసులకు అర్థం కాలేదు. సరైన సిద్ధాంత మార్గదర్శకత్వం లేని ఈ పరిస్థితి అనేక స్వేచ్ఛావాద భావాలకు తలుపులు తెరిచింది. ఆ భావాలు స్వల్ప కాలమే జీవించినప్పటికీ విస్తృతంగా ప్రచారమై ప్రజలను బాగా ఆకర్షించాయి.

అలా ఆకర్షించిన సిద్ధాంతాల్లో ప్రముఖ స్థానం తాత్విక అరాచకవాద సిద్ధాంతానిది. పంధొమ్మిదవ శతాబ్దంలో జీవించిన ముగ్గురు యూరోపియన్ మేధావులు-ప్రొధన్, బకునిన్ మాక్స్‌స్టిర్నర్ - ఈ అరాచకవాద సిద్ధాంతానికి ఆద్యులు. దోపిడీ వ్యవస్థ స్థానంలో మానవుల స్వేచ్ఛాయుత కార్యాచరణ ప్రాతిపదికన రాజ్యంలేని సమాజాన్ని నిర్మించాలని అరాచకవాద సిద్ధాంతం బోధిస్తుంది*. సమాజ నియంత్రణకు రాజ్యం, ప్రభుత్వ వ్యవస్థ అవసరంలేదనీ అవి ఏ రూపంలో ఉన్నప్పటికీ ప్రజలపై నిరంకుశ పెత్తనం చేస్తాయనీ అరాచకవాదుల నిశ్చితాభిప్రాయం. అందువల్ల కార్మికవర్గ నియంతృత్వ రాజ్యాధికార సిద్ధాంతాన్ని కూడా వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎర్ర అధికారవర్గం ఏర్పడి ప్రజలపై పెత్తనం చేస్తుందని హెచ్చరించారు.

ఏమైనప్పటికీ సామాజిక వ్యవస్థను సవాల్ చేసే క్రమాన్ని కొందరు అరాచకవాదు.. తమనైన హింసా విధానాలతో కొనసాగించారు. వీరు 189  1901 మధ్య కాలంలో కొందరు ప్రముఖులను హత్య చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు సాడి కార్నాట్ ను శాంటా సిరాశియో అనే అరాచక వాది చంపాడు. స్పెయిన్‌రాజు అల్‌ఫోన్సా పై అరాచకవాది మాటియో మోరెల్ హత్యా ప్రయత్నం చేశాడు ఫ్రెంచి శాసన సభ ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్ పై బాంబులు విసిరారు. ఆస్ట్రియా రాణి ఎలిజెబెత్‌ను, జర్మనీలో కైజర్‌ను, బిస్మార్క్‌ను, రష్యా జార్ అలెగ్జాండర్‌ను, పర్షియా చక్రవర్తి షాను చంపేందుకు వారు ప్రయత్నించారు అమెరికాలో అరాచకవాదానికి పెద్ద చరిత్రే వుంది. చికాగోలో 1886 లో హేమార్కెట్ స్క్వేర్ సంఘటన **లో పాల్గొని శిక్షించబడింది అరాచకవాదులే అమెరికా అధ్యక్షుడు మెక్‌కిన్లీని అరాచకవాది లియోన్ క్జోల్ గోస్జ్ 1901 లో న్యూయార్క్‌లో కాల్చి చంపాడు.

ప్రముఖ అరాచకవాద నాయకుడు ఫ్రాన్సెస్కో మెర్లినో 1892 లో ఇటలీ నుండి అమెరికా వచ్చి తన ఉపన్యాసాల ద్వారా ప్రవాసులను అరాచకవాద సిద్ధాంతం వేపు ఆకర్షించాడు. బకునిన్ సిద్ధాంతాన్ని నమ్మే జోహాన్ మోస్ట్ 1882 లో అమెరికాలో పర్యటించి పేలుడుపదార్థాల వాడకం గురించి పాఠాలు చెప్పాడు అన్ని రకాల హింసా పద్ధతులను ఉపయోగించి వర్గపాలననూ,

* గ్రీకు భాషలో 'అనార్కి' అనే పదానికి 'ప్రభుత్వం లేక పోవడం' అనే అర్థముంది. తెలుగులో అరాచకం' అనే పదానికీ అదే అర్థం. అయితే వాడుకలో ఆ రెండిటికీ నెగెటివ్ అర్థాలున్నాయి కానీ అరాచక వాదులు పాజిటివ్ అర్థంలో దాన్ని వాడారు.

** *1886 మే 4న చికాగోలో హేమార్కెట్ స్క్వేర్‌లో సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా జరిగిన బహిరంగ సభలో బాంబుపేలి ఒక పోలీసు మరణించాడు. ఆ తర్వాత జరిగిన తొక్కిసలాటలో, పోలీస్ కాల్పుల్లో ఆరుగురు పోలీసులు లెక్కలేనంత మంది సాధారణ ప్రజలు చనిపోయారు రెండు వందల మంది గాయపడ్డారు చికాగోకు చెందిన ప్రముఖ అరాచకవాద కార్మిక నాయకులపై కేసు పెట్టి నలుగురిని ఉరి తీశారు. మరో ముగ్గురికి జైలు శిక్ష విధించారు. పని గంటల తగ్గింపుకై జరిగిన కార్మిక పోరాటాల చరిత్రలో ఈ సంఘటన మైలురాయి.*

రాజ్యాన్ని ధ్వంసం చేయాలని ఆయన 1883లో పిలుపిచ్చాడు 'సైన్స్ ఆఫ్ రివల్యూషనరీ వార్‌ఫేర్' అనే పుస్తకాన్ని ప్రచురించి బాంబుల డైనమైట్‌ల విష పదార్థాల తయారీ గురించీ వాడకం గురించీ వివరించాడు లూగీ గల్లెయని అనే మరో ప్రముఖ ఇటాలియన్ అరాచకవాద నాయకుడు 1906 లో ఆ పుస్తకాన్ని ఇటాలియన్ భాషలోకి అనువదించి అమెరికాలో విస్తృత ప్రచారం చేశాడు. మసాచూసెట్స్ రాష్ట్రంలోని ఇటాలియన్ ప్రవాసుల్లో గల్లెయనీకి మంచి పునాది ఏర్పడింది.

అరాచకవాదులు అమెరికా పెట్టుబడిదారీ సంస్కృతిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక బాంబు వెయ్యి కరపత్రాలకన్నా గొప్ప ప్రచారాన్ని ఇవ్వగలదని చెప్పిన క్రోపాట్కిన్ మాటలను అనుసరించినప్పటికీ అరాచకవాదులు తమ సాహిత్య ప్రచురణను, మౌఖిక ప్రచారాన్ని ఆపలేదు. వాటిని కూడా ఉధృత స్థాయిలో కొనసాగించారు సాంస్కృతిక రంగంలో, భావజాల రంగంలో తమదైన ఓటకు పునాదులు వేసుకున్నారు పాటకచ్చేరీ బృందాలతో, నాటకసమాజాలతో, వినోద కాలక్షేపాలతో, ఉపన్యాసాలతో అరాచకవాదులు తమ తీరిక సమయాలను గడిపేవారు ప్రత్యామ్నాయ సంస్కృతిని సృష్టించే పని చేపట్టి వందలకొద్దీ నాటకాలు తయారు చేశారు. అరాచకవాద పాఠశాలలను నడిపారు. వాటిని మోడ్రన్ స్కూల్స్ అని పిలిచేవ రు. వాటిలో పబ్లిక్ స్కూల్స్ లో కన్నా భిన్నంగా పాఠ్యాంశాలుండేవి. క్రిస్మస్, ఈస్టర్ లాంటి క్రైస్తవ పండుగలను విస్మరించి, మేడే, పారిస్ కమ్యూన్ వార్షికోత్సవం, హేమార్కెట్‌డే లను ఇంటిల్లి పాదీ ఘనంగా జరుపుకొనేవారు. ఆ సందర్భంగా సభలు ఉత్సవాలూ నిర్వహించేవారు. తమ పిల్లలకు క్రైస్తవ పేర్లు పెట్టేవారుకారు. అమెరికాలో 1899 లో పర్యటించిన ప్రముఖ అరాచకవాది, స్త్రీవాది ఎమ్మాగోల్డ్‌మన్ అరాచకవాదుల పిల్లలకు నామకరణం చేసింది. అరాచకవాద యోధుల పేర్లు, ఎమిలీ జోలా నవల జర్మినల్ లో పాత్రల పేర్లు పెట్టింది. అరాచకవాదులు తమలో ఎవరినీ నాయకులుగా గుర్తించేవారు కారు. 'నాయకత్వం', 'నాయకుడు' అనేవి ప్రభుత్వ వ్యవహారాన్ని, ఆధిపత్యాన్ని సూచిస్తాయని వారు నమ్మేవారు. తమలో నాయకత్వలక్షణాలున్నవారిని కేవలం 'గైడ్స్' అనీ, 'ప్రతినిధులు' అనీ పిల్చేవారు. సంస్థలనూ పార్టీలనూ ఏర్పాటు చేయడాన్ని కూడా వారిలో కొందరు వ్యతిరేకించేవారు పెళ్ళి అనే తంతుకు కూడా వారు వ్యతిరేకమే. స్త్రీ పురుషులిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకొని కలిసి జీవిస్తే చాలని వారు భావించారు. అమెరికన్ ప్రొఫెసర్ పాల్ అరిచ్ మాటల్లో :

> *తాము వ్యతిరేకించిన నిశ్చల పెట్టుబడిదారీ సమాజానికి పూర్తి భిన్నమైన ప్రత్యామ్నాయ వ్యవస్థను ఇటాలియన్ అరాచకవాదులు సృష్టిస్తూ వచ్చారు వాళ్ళకు తమవైన సొంత క్లబ్బులున్నాయి. నమ్మకాలున్నాయి తమదైన సంస్కృతి ఉంది.*

అమెరికా కార్మిక వర్గంలో వారు సామాజిక చైతన్యాన్ని, వర్గ స్పృహను రేకెత్తించారు. ఎన్నో చారిత్రాత్మకమైన సమ్మె పోరాటాలు నడిపారు. అమెరికా ప్రభుత్వాన్ని గడగడలాడించి, అది ప్రయోగించిన పలు నిర్బంధ దమన కాండలకు రక్తసిక్త సాక్ష్యాలుగా మిగిలారు.

# 2

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం నాటికి అమెరికాలో కార్మికోద్యమం బాగా బలం పుంజుకుంది. అప్పటికింకా అక్కడ స్వేచ్ఛాయుత వ్యాపార పోటీ కొనసాగుతుండటం వలన ఇతర రంగాల్లో కూడా స్వేచ్ఛ కోసం ఆరాటం, పోరాటం బాగానే ఉండేవి. అమెరికా సోషలిస్ట్ పార్టీ (ఎస్.పి.ఎ.) 1901 లో ఏర్పడి అంతకు ముందున్న సోషలిస్ట్ లేబర్ పార్టీ (ఎస్.ఎల్.పి.) స్థానాన్ని ఆక్రమించింది. పలు అరాచకవాదుల, సోషలిస్టుల కృషి ఫలితంగా 1905 లో చికాగో నగరంలో ఇంటర్నేషనల్ వర్కర్స్ ఆఫ్ ద వరల్డ్ *(ఐ.డబ్ల్యు.డబ్ల్యు) ఏర్పడింది. కార్మికులను కూడగట్టి పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించింది. అనేక సమరశీల సమ్మె పోరాటాలు నడిపింది. అనేక మంది కార్మిక యోధులు ఐ.డబ్ల్యూ.డబ్ల్యూ. కోసం ప్రాణాలొడ్డి పోరాడారు. ప్రఖ్యాత కార్మిక నాయకుడు యూజిన్ డెబ్స్ ఐ.డబ్ల్యు.డబ్ల్యు సంస్థాపకుల్లో ఒకరు.

మొదటి ప్రపంచ యుద్ధం 1914 లో ప్రారంభం కాగానే అది లాభాల కోసం పెట్టుబడి దారుల మధ్య జరుగుతున్న యుద్ధమని ఐ.డబ్ల్యు.డబ్ల్యు. ప్రకటించి యుద్ధ వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టింది. అరాచకవాదులూ, సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ - ఒక్క మాటలో అమెరికన్ రాడికల్స్ అందరూ- ఈ విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారు. యుద్ధంలో అమెరికా పాల్గొనడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వాంజెట్టి 1914 డిసెంబర్ లో తన బంధువొకరికి రాసిన ఉత్తరం యుద్ధం గురించి అరాచకవాదుల అభిప్రాయాలకు అద్దం పడుతుంది -

> *.......యుద్ధం న్యాయమైనదని నువ్వంటావు. న్యాయం బలాన్నిస్తుంది కాబట్టి విజయం సాధించగలవని నువ్వు ఆశిస్తావు. నేను దాన్ని నమ్మను. తలకాయలో కళ్ళుండీ, వినడానికి చెవులుండీ, ఆలోచించేందుకు మెదడున్న వారెవరూ దాన్ని నమ్మరు. గొప్పవాటిని సాధించేందుకు లేదా వీరోచితంగా మరణించేందుకు తమది న్యాయమైన పోరాటం అనే నమ్మకం బలాన్నిస్తుంది. అంతకు మించి ఏమీ ఇవ్వదు........*
>
> *యుద్ధం చేయాల్సింది పేదలు. తమ రక్తంతో, కన్నీళ్ళతో తమ దౌర్భాగ్యంతో తమ ప్రాణాలతో మూల్యం చెల్లించాల్సింది పేదవాళ్ళు. యుద్ధంలో విజయం సాధించడం పేద ప్రజలకు ఏ లాభాన్నీ చేకూర్చిపెట్టదు....*

అమెరికా ప్రభుత్వం 1917 లో నిర్బంధ సైనిక విధానం ప్రవేశపెట్టింది. అందుకోసం సెలెక్టివ్ సర్వీసెస్ డ్రాఫ్ట్ - *1917* పేరిట చట్టాన్ని తెచ్చింది. విజాతీయులతో సహా ఆ ఏడాది జూన్ 5 నాటికి 21-30 ఏళ్ళ మధ్య వయస్కులంతా తమ పేర్లను సైన్యంలో చేరేందుకు నమోదు చేయించుకోవాలని

---

* *ఐ.డబ్ల్యు.డబ్ల్యు. సభ్యులను 'wobblies' అని కూడా పిల్చేవారు.*

ప్రభుత్వం నిర్దేశించింది. అయితే విజాతీయులు మాత్రం అమెరికా పౌరులయ్యేందుకు అప్పటికే ప్రయత్నాలు ప్రారంభించి ఉంటేనే వారిని సైన్యంలోకి చేర్చుకుంటారు. సెలెక్టివ్ సర్వీసెస్ డ్రాఫ్ట్‌ను ఉల్లంఘించడం ఒక సంవత్సరం జైలు శిక్షార్హమైన నేరం.

ప్రభుత్వం పలు వివరణలు జారీ చేసినప్పటికీ సెలెక్టివ్ డ్రాఫ్ట్ లోని నిబంధనలు దేశ వ్యాప్తంగా ప్రవాసుల్లో పలు గందరగోళాలకు దారి తీశాయి. మరో వేపు, సైన్యంలో చేరకపోవడం దేశ ద్రోహంగా చిత్రీకరించబడింది. సైన్యంలో చేరేందుకు నిరాకరించేవారిని విదేశీ ఏజెంట్లుగా, యుద్ధాన్ని వ్యతిరేకించిన వారిని శత్రు గూఢచారులుగా భావించడం మొదలైంది. సైన్యంలో చేర నిరాకరించిన అరాచకవాదులనూ, కమ్యూనిస్టులనూ, సోషలిస్టులనూ పెద్ద సంఖ్యలో ప్రభుత్వం అరెస్టు చేసి జైళ్ళ పాలు చేసింది.* వారి ఆస్తులను జప్తు చేసింది. యుద్ధ వ్యతిరేకులైన కొందరు *రాడికల్స్* ప్రభుత్వం కన్నుగప్పి అమెరికా నుంచి మెక్సికో తదితర పొరుగు దేశాలకు వలస వెళ్ళారు.

మొదటి ప్రపంచ యుద్ధం 1918 నవంబర్ 11న ముగిసింది. అమెరికాను విడిచి వెళ్ళిన రాడికల్స్ తిరిగి మెల్లగా దేశంలోకి ప్రవేశించి తమ కార్యకలాపాలు పునః ప్రారంభించారు. అమెరికన్ పెట్టుబడిదారులు తమ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుకొంటూ లాభాల వేటలో విజృంభించారు. కార్మికులను మరింతగా పీల్చి పిప్పి చేయడం మొదలు పెట్టారు. యుద్ధానంతరం ఆర్థిక రంగంలో మార్పుల వలన జీవన వ్యయం బాగా పెరిగింది. మరో వేపు వేతనాల్లో పెరుగుదల లేదు. కార్మికులు దరిద్రంలోకి మరింతగా నెట్టబడ్డారు. ఫలితంగా వారు రాడికల్ కార్యకలాపాల వేపు మరింతగా ఆకర్షితులయ్యారు. ఈ దశలో మహత్తర రష్యా విప్లవం అమెరికా కార్మిక వర్గాన్ని గాఢంగా ప్రభావితం చేసింది. అమెరికన్ రాక్షస రాజ్యాన్ని కూల్చగలమనే ఆత్మ విశ్వాసాన్ని వారికిచ్చింది. అమెరికాలో విప్లవం రేపోమాపో రాబోతోందనే ఆశను చిగురింప జేసింది.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన మరుసటి సంవత్సరం (1919) అమెరికా చరిత్రలో సమ్మెల, బాంబుల, అల్లర్ల సంవత్సరంగా పేరు గాంచింది. కల్లోలభరితమైన ఆ సంవత్సరం పొడవునా అమెరికా చరిత్రలో ప్రముఖమైనవిగా భావించబడే అనేక సమ్మె పోరాటాలు జరిగాయి.** ఇమిగ్రేషన్ చట్టాన్ని 1918 లో తెచ్చి ప్రవాస రాడికల్స్‌ను దేశం నుంచి

---

* *అందులో యూజిన్ డెబ్స్ (1855-1926) కూడా ఉన్నాడు. 1920 అమెరికా అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా జైలు నుంచే ఆయన పోటీ చేయగా పది లక్షల దాకా ఓట్లు పడ్డాయి.*

** *ఫిబ్రవరిలో సీటిల్ లో జరిగిన సాధారణ సమ్మె, సెప్టెంబర్‌లో జరిగిన దేశవ్యాప్త ఉక్కు ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె, బోస్టన్ పోలీసు సమ్మె వీటిల్లో ముఖ్యమైనవి. మూడున్నర లక్షల మందికి పైగా పాల్గొన్న ఉక్కు సమ్మె సందర్భంగా 22 మంది కార్మికులు మరణించారు. వేల మంది గాయపడ్డారు.*

బహిష్కరించేందుకు ప్రభుత్వం అధికారాలను సంతరించుకున్నప్పటికీ వారి కార్యకలాపాలు తగ్గు ముఖం పట్టలేదు. ఆ ఏడాది మొదట్లో మసాచూసెట్స్ రాష్ట్రంతో సహా అమెరికాలోని న్యూ ఇంగ్లాండ్ ప్రాంతమంతటా పారిశ్రామిక నగరాల్లో ఈ విధమైన పోస్టర్లు వెలిశాయి :

## పదండి ముందుకు

> **అమెరికాను పాలిస్తున్న చేవచచ్చిన శిలాజాల్లారా ఎరుపును చూడండి. త్వరలో తుపాన్ రానుంది. మీపైబడి రుధిరాస్త్రంలో మిమ్మల్ని నలిపి నాశనం చేస్తుంది. మీరు మాపై ఏ మాత్రం దయ చూపలేదు. మేమూ అలాగే చేస్తాం. మిమ్మల్ని డైనమైట్లతో పేలుస్తాం.**

మాసాచూసెట్స్‌లోని పామర్‌లో ఒక ప్రముఖ అమెరికన్ కంపెనీలో బాంబులు పేల్చబోయి ముగ్గురు ఇటాలియన్ అరాచక వాదులూ, ఒక ఐ.డబ్ల్యూ.డబ్ల్యూ కార్యకర్త చనిపోయారు. అదే ఏడాది ఏప్రిల్‌లో 'శాంపుల్-నావెల్టీ' అని రాసిన చీటీలు అంటించిన 36 బాంబు పాకెట్లు దేశంలోని పలువురు అధికార ప్రముఖులకు పోస్ట్ చేయబడ్డాయి. వారిలో అమెరికా అటార్నీ జనరల్ మిచెల్ పామర్‌తో పాటు ప్రఖ్యాత అమెరికన్ పారిశ్రామిక వేత్తలు జె.పి.మోర్గన్, జె.డి.రాక్‌ఫెల్లర్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆలివర్ వెండెల్ హోమ్స్, కార్మిక శాఖ కార్యదర్శి విలియం విల్సన్, కార్మిక వ్యతిరేక సెనేటర్ విలియం కింగ్, 1917 లో జారీ అయిన గూఢచర్య నిరోధక చట్టం కింద రాడికల్ హేవుడ్‌కు ఇరవైయ్యేళ్ళ కారాగార శిక్ష విధించిన న్యాయమూర్తి కె.యం.లాండిస్, రాడికల్ సాహిత్యాన్ని బట్వాడా చేయకుండా తగలబెట్టించిన పోస్ట్‌మాస్టర్ జనరల్ ఆల్బర్ట్ బర్లసన్‌లు ఉన్నారు. పలువురు రెడ్ వ్యతిరేక ఇమిగ్రేషన్ అధికార్లకూ, అమెరికా సెనేట్ నియమించిన బోల్షివిక్ ఇన్వెస్టిగేషన్ కమిటీ ఛైర్మన్‌కు కూడా బాంబులు పోస్ట్ చేయబడ్డాయి. ఆ బాంబు పాకెట్లు గమ్యాలకు చేరక ముందే ప్రభుత్వం వాటిని పసికట్టి, స్వాధీనం చేసుకుంది. కానీ ఆ ఘటనతో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ అరెస్టు చేయలేక పోయింది. అయితే అది జరిగిన రెండు నెలలకు అరాచకవాద నాయకుడు గల్లెయనిని పోలీసులు నిర్బంధించారు. బాంబు దాడులు ఉధృతం చేసి అరాచకవాదులు ప్రభుత్వ చర్యను నిరసించారు. ఇదే కాలంలో జార్జియా రాష్ట్రానికి చెందిన మాజీ సెనేటర్ థామస్ హార్డ్‌విక్‌కు పోస్ట్‌లో పంపబడిన బాంబుపేలి ఆయన భార్యకూ, పనిమనిషికరికీ తీవ్ర గాయాలయ్యాయి.

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం 1919 జూన్ 2వ తేదీ రాత్రి ఎనిమిది నగరాల్లో అధికార భవంతులను అరాచకవాదులు బాంబుదాడులతో దద్దరిల్లజేశారు. ఆ ఎనిమిది నగరాల్లోనూ అధికార ప్రముఖుల ఇళ్ళలో ఎవరికీ కంటి మీద కునుకు లేదు. అరాచకవాది బ్రెస్కాకు శిక్ష విధించిన పిట్స్‌బర్గ్ న్యాయమూర్తి ఇల్లు ధ్వంసమైంది. బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఇల్లు బాంబుదాడిలో నాశనమైంది. న్యూయార్క్ న్యాయమూర్తి నాట్ మేడ కూలిపోయి ఇద్దరు హతమయ్యారు. ఫెడరల్ న్యాయమూర్తి థామ్సన్ ఇంటి మెట్ల మీద బాంబు

పేలి వాచ్‌మన్ చనిపోయాడు. మేడే సందర్భంగా పోలీసు దౌర్జన్యాన్ని ఎదిరించిన పధ్నాలుగు మంది కార్మికులను శిక్షించిన న్యాయమూర్తి ఎ.హెచ్.హేడెన్ ఇల్లు బోస్టన్‌లో నేల మట్టమైంది. మసాచూసెట్స్ శాసనసభలో అరాచకవాద వ్యతిరేక బిల్లును ప్రవేశపెట్టిన శాసనసభ్యుడు లెలాండ్ పోవర్స్ ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. క్లీవ్‌లాండ్‌లో మేయర్ భవంతి కుప్పకూలింది. వీటన్నిటికి తలమానికంగానూ, ప్రభుత్వానికి అవమానకరంగానూ అమెరికా రాజధాని నగరం నడిబొడ్డున అటార్నీ జనరల్ మిచ్చెల్ పామర్ ఇంటి ముందు పేలిన డైనమైట్ అధికార యంత్రాంగాన్ని కలవరపర్చింది.

ఆ రోజుకు తన పనులు ముగించుకొని పామర్ నిద్ర కుపక్రమిస్తుండగా ఇంటి ముందు భయంకర శబ్దం చేస్తూ పేలుడు సంభవించింది. పామర్, అతని కుటుంబ సభ్యులూ ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు గానీ ఇల్లు మాత్రం పాక్షికంగా ధ్వంసమైంది. సూట్ కేసులో డైనమైట్ మోసుకొచ్చిన ఆగంతకుడు తునాతునక లయ్యాడు. ఆ చుట్టు పక్కలంతా మృతదేహపు శకలాలు చెల్లాచెదురుగా పడి పోయాయి. దగ్గరలోని ఒక ఇంటి కప్పుమీద రక్తసిక్తమైన హతుడి శిరస్సు పడి వుంది. పామర్ ఇంటి కిటికీ అద్దాలే కాక దానికెదురుగా ఉన్న నేవీ అసిస్టెంట్ సెక్రెటరీ రూజ్‌వెల్ట్ * ఇంటి కిటికీ అద్దాలు కూడా పగిలి ముక్కలయ్యాయి. రూజ్ వెల్ట్ ఇంటి మెట్ల మీద మాంసం ముద్దలు ఎగిరొచ్చి పడ్డాయి. శకలాల మధ్య ఇరుక్కున్న నాసిరకపు సూట్ కేస్ ముక్కల్నీ, రెండు పిస్టళ్ళనూ, ఒక టోపీ, ఒక బూటూ, తుంపులైన కోటూ, టై ముక్కల్నీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్లెయిన్ వర్డ్స్ శీర్షికతో ఉన్న రోజా రంగు కరపత్రాలు ఆ ప్రదేశమంతటా చెల్లాచెదురుగా పడిపోయాయి. వాటిలో హెచ్చరిక ప్రభుత్వ వర్గానికి ఆందోళన కలిగించింది:

*..... సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని ఇక ఎంత మాత్రం వాయిదా వేయలేని సమయం ఆసన్నమైంది. వర్గపోరాటం జరుగుతోంది. అంతర్జాతీయ కార్మిక వర్గానికి పూర్తి విజయం సాధించడంలో గానీ అది ముగియదు. మేం రహస్యంగా ఉన్నాం కాబట్టి పిరికివాళ్ళమని అనవద్దు. వర్గ పోరాటం భయంకరమైనదని చెప్పకు. అది వర్గ యుద్ధం. నువ్వు భద్రత అని పిలిచే శక్తివంతమైన నీ సంస్థల చాటునా, నీ చట్టాల చీకటి మాటునా, నీ ఎముక మొహం బానిసల తుపాకుల వెనకా దాక్కొని దాన్ని మొదట ప్రారంభించింది నువ్వే.*

*రక్తపాతం జరిగి తీరుతుంది; మేం వెనక్కి తగ్గం; హత్యలు జరిగి తీరతాయి; అవసరం కాబట్టి మేం చంపుతాం; విధ్వంసం జరిగి తీరాలి; ఈ ప్రపంచాన్ని నీ నిరంకుశ సంస్థల నుంచి రక్షించేందుకు మేం విధ్వంసాన్ని ప్రయోగిస్తాం. పెట్టుబడిదారీ వర్గాన్ని అణచివేసేందుకు ఏ పనైనా చేసేందుకు మేం సిద్ధం....*

*సామాజిక విప్లవం వర్ధిల్లాలి! నిరంకుశత్వం నశించాలి!!*

***-అరాచక వాద యోధులు.***

---

* *తర్వాత అమెరికా అధ్యక్షుడయ్యాడు.*

విప్లవోద్యమ ప్రకంపనలు రష్యా నుంచి అమెరికాకు ప్రయాణించాయా అని ప్రభుత్వం విస్తుపోయింది. అటార్నీ జనరల్ మిచ్చెల్ పామర్ ఆనాటి పరిస్థితి గురించి ఇలా వ్యాఖ్యానించాడు:

*విప్లవం శిరస్సులోని పదునైన నాలుకలు చర్చిల పీఠాలను తాకుతున్నాయి. బడి గంటల వైపు దూకుతున్నాయి. అమెరికా గృహాల్లోని రహస్య ప్రదేశాలకు పాకుతున్నాయి. వివాహ బంధాల స్థానంలో విశృంఖలత్వాన్ని నింపాలనుకొంటున్నాయి.*

పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసినప్పటికీ బాంబుదాడులకు కారణమైన వారినెవరినీ పట్టుకోలేక పోయారు. జైలు పాలైన అరాచకవాది గిల్లెయనిని మాత్రం 1919 జూన్ 24 న దేశం నుంచి బహిష్కరించారు. అరాచకవాదుల జాబితాను ప్రభుత్వం తయారు చేసి వారిపై చర్య తీసుకునేందుకు సన్నాహాలు ప్రారంభించింది.

అదే ఏడాది అన్ని సమ్మెలకూ తలమానికంగా సెప్టెంబర్‌లో మసాచూసెట్స్‌లోని బోస్టన్ నగరంలో చారిత్రాత్మక పోలీసు సమ్మె జరిగింది. సంఘటిత కార్మిక సమాఖ్య అయిన అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (AFL) లో పోలీసుల సంఘాన్ని చేరనివ్వక పోగా, పంథొమ్మిది మంది పోలీసు యూనియన్ నాయకులను ఉద్యోగాల నుంచి నిరంకుశంగా తొలగించారు. ఆ పని చేసిన పోలీసు కమీషనర్ చర్యకు నిరసనగా బోస్టన్‌లో పోలీసులు మెరుపు సమ్మెకు తలపడ్డారు. ప్రభుత్వం సమ్మెను నిషేధించింది. దానిపై ఉక్కు పాదం మోపింది. పోలీసుల సమ్మెను *'నాగరికతపై జరిగిన నేరం'* గా అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ అభివర్ణించాడు. నలభై ఎనిమిది గంటల పాటు నగరమంతా సమ్మె చేస్తున్న పోలీసుల వశమైంది. సైన్యం రంగ ప్రవేశం చేసి కాల్పులు జరిపింది. ఎనిమిది మంది హతమయ్యారు. యాభై మంది గాయపడ్డారు. మూడు లక్షల డాలర్లకు పైగా ఆస్తి నష్టమైంది. ఆ రోజు బోస్టన్ రష్యా విప్లవ కాలం నాటి పెట్రోగ్రాడ్‌ను తలపించిందని పలువురు భావించారు. లెనిన్, ట్రాట్స్కీలు అమెరికా వచ్చేస్తున్నారని ప్రముఖ పెట్టుబడిదారీ దినపత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసింది. లిబరల్ మేధావిగా బ్రిటీష్ లేబర్ పార్టీ నాయకుడిగా ప్రఖ్యాతి గాంచిన హెరాల్డ్ లాస్కీ, ఆ కాలంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసే వాడు. పోలీసు సమ్మెను సమర్థించగా ఆయనను పదవి నుంచి తొలగించాలని హార్వర్డ్ పోషకులు కొందరు విశ్వవిద్యాలయ అధ్యక్షుడిపై వత్తిడి తెచ్చారు.

రష్యాలో జరిగిన విప్లవం అమెరికాకు చేరకుండా చూడాలని రాడికల్స్‌ను తిరిగి తలెత్తకుండా చేయాలని ప్రభుత్వం నిశ్చయించి అన్ని శక్తులనూ, సాధన సంపత్తినీ రంగంలోకి దించింది. అప్పటి అటార్నీ జనరల్ పామర్ నాయకత్వంలో అందుకు రహస్య సన్నాహాలు జరిగాయి. బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధిపతి డిటెక్టివ్ విలియం ఫ్లిన్‌కు రాడికల్స్‌పై దాడులు చేసే పనిని పామర్ అప్పజెప్పాడు. అన్ని నేర పరిశోధక సంస్థలూ అతనికి లోబడి పనిచేసేటట్టుగా ఆదేశాలు జారీ చేశాడు. రాడికల్స్ పై పోలీసులూ, జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఏజెంట్లూ పెద్ద పెట్టున విరుచుకుపడ్డారు.

విచక్షణారహితంగా దాడులూ, సోదాలూ, అరెస్టులూ, దేశ బహిష్కరణలూ మొదలయ్యాయి. అవే అమెరికా చరిత్రలో **పామర్ దాడులుగా** ప్రసిద్ధికెక్కాయి.

రాడికల్ 'భూతాని' కి వ్యతిరేకంగా పామర్ ఒక పథకం ప్రకారం ప్రజల్లో ఉన్మాదాన్ని రెచ్చగొట్టాడు. దేశంలో అరవైవేల మంది విజాతీయ రాడికల్స్ ఉన్నారనీ, వారంతా బాంబులతో బుల్లెట్లతో రక్తపాత విప్లవం తెచ్చేందుకు కుట్ర చేస్తున్నారనే అభూత కల్పనలతో అతిశయోక్తులు ప్రచారం చేశాడు. ఒక పెనుభూతంగా *రాడికల్* కార్యకలాపాలను చిత్రించి ఆ 'ప్రమాదం' నివారించే నెపంతో పలు అత్యాచారాలు జరిపించాడు. ఆ 'ప్రమాదం' నివారించిన 'ఖ్యాతి' దక్కించుకొనేందుకు చేయగలిగిందంతా చేశాడు. ఆ తర్వాత ఏడాది జరగనున్న డెమొక్రటిక్ పార్టీ సదస్సులో అమెరికా అధ్యక్ష పదవికి పార్టీ అభ్యర్థిగా ఎన్నికవ్వాలనే కోరికతో పామర్ అనేక ఘోరకృత్యాలకు పాల్పడ్డాడు. ప్రజల భయాన్ని రాజకీయ లాభంగా మార్చుకొనే ధ్యేయంతో అధికారాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేశాడు. *రాడికల్స్*గా అనుమానించబడిన వేలాదిమంది ప్రవాసుల ఇళ్ళపై అర్ధరాత్రి దాడులు చేయించాడు. సోదాలూ, వేధింపులతో ప్రవాస కార్మికులను నిద్రపోనీయకుండా చేశాడు. చట్ట వ్యతిరేకంగా పలువురిని నిర్బంధించి చిత్రహింసలపాలు చేసి తప్పుడు కేసులు పెట్టించాడు. వేలాదిమందిని దేశం నుండి బయటికి తరిమేశాడు.

ఒకేసారి మెరుపుదాడి చేయాలని పామర్ నేతృత్వంలో జస్టిస్ డిపార్ట్‌మెంట్ కుట్ర చేసింది. తన ఏజెంట్లను అన్ని రకాల వామపక్ష సంఘాల లోకి, పార్టీలలోకి రహస్యంగా సభ్యులుగా ప్రవేశపెట్టింది. అనేక వామపక్ష సంస్థల సమావేశాలు 1920 జనవరి 2వతేదీ రాత్రి జరిగేటట్లు ఏర్పాటు చేయించడంలో రహస్య పోలీసు ఏజెంట్లు కృతకృత్యులయ్యారు. ఆరోజు రాత్రి అమెరికా లోని 33 నగరాల్లోనూ, వందలాది పట్టణాల్లోనూ వామ పక్ష సంఘాల సభలూ సమావేశాలూ జరుగుతున్న ఇళ్ళమీద, లాడ్జిలపైనా, కార్మిక సంఘాల కార్యాలయాల మీదా, ఇతర సమావేశ స్థలాల మీదా, చర్చిలపైనా పోలీసులు మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. మూడు వేలమందిని అరెస్టు చేసి జైళ్ళ పాలు చేశారు.

ప్రభుత్వాధికారులను 1920 మేడే రోజున చంపేందుకు రష్యా ప్రభుత్వ ఆదేశంతో అమెరికన్ *రాడికల్స్* కుట్ర చేశారనీ, హిట్‌లిస్టులు తయారు చేశారనీ పామర్ హెచ్చరించాడు. సోషలిస్టు రష్యాను అమెరికా ప్రభుత్వం గుర్తించాలనీ - లెనిన్, ట్రాట్స్కీలతో అమెరికా ప్రభుత్వం స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవాలనీ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకై మేడేను ఉపయోగించుకొనేందుకు రెడ్స్ పథకం పన్నారనీ దినపత్రికలద్వారా పామర్ తీవ్ర ప్రచారం చేశాడు. ఆ నెపంతో రెడ్ ఎలర్ట్ ప్రకటించి పెద్ద సంఖ్యలో ప్రవాసులను అరెస్టు చేయించాడు.

ఇలా నిరంతరాయంగా జరిగిన *పామర్ దాడుల* కాలంలో మొత్తం ఐదువేలమంది నిర్బంధించబడ్డారు. ఆరువేలమంది విజాతీయ *రాడికల్స్* పైనా, వారి సానుభూతిపరుల పైనా అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. వెయ్యి మందిని దేశం నుంచి బహిష్కరించారు. దుర్భరమైన

జస్టిస్ డిపార్ట్‌మెంట్ అధికార భవనాల్లోనూ, పోలీసు లాకప్‌ల లోనూ పలువురు హింసించి చంపబడ్డారు. జైళ్ళలో కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరికొందరు పిచ్చివాళ్ళయ్యారు. మరెందరో ద్వీపాంతరవాసానికి పంపబడ్డారు. సమరశీల సమ్మె పోరాటాల చరిత్ర గలిగిన బోస్టన్ నగరం ఈ రెడ్ వ్యతిరేక ఉన్మాదానికీ, ప్రభుత్వ టెర్రరిజానికీ తీవ్రంగా బలైంది. రష్యాలో రైతులుగా పొట్టగడవక జార్ ప్రభుత్వకాలంలో అమెరికా వలస వచ్చిన రష్యన్ కార్మికులనూ, ప్రవాస ఇటాలియన్‌లనూ బోస్టన్‌లో పోలీసులు నిర్బంధించి సంకెళ్ళతో వీధుల్లో ఊరేగించారు. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే ఇళ్ళను సోదాచేసి అందినవన్నీ పట్టుకుపోయారు. ఏ విధమైన *రాడికల్ సాహిత్యం* తమ వద్ద పోలీసులకు దొరికినా తమ పని ఖాళీ అన్న భయాన్ని ప్రవాసుల్లో కలిగించారు.

అనేక దినపత్రికలు ఆ కాలంలో ప్రవాసులకు, రాడికల్స్‌కూ వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టాయి. *రాడికల్స్* ద్వారా అమెరికాలో రక్తపాత విప్లవం రానున్నదని అవి ప్రజలను పదే పదే హెచ్చరించి భయపెట్టాయి. *'ద బాంబ్ కాన్స్పిరేటర్స్'* శీర్షికన న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయం రెడ్స్‌కు పౌరహక్కులు రద్దు చేయమని ప్రభుత్వాన్ని కోరింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ పారిశ్రామిక వేత్తలు *రాడికల్స్‌*కు వ్యతిరేకంగా దినపత్రికలలో పూర్తి పేజీ ఎడ్వర్‌టైజ్‌మెంట్లు (వ్యాపార ప్రకటనలు) అచ్చేయించేటంతగా ఈ రెడ్ వ్యతిరేక ఉన్మాదం ప్రబలిపోయింది.

**అమెరికా స్వేచ్ఛా ప్రతిమ చేతిలోని కాగడా మానవ హక్కులను మంటగలపడం ముమ్మరం చేసింది.**

# 3

ఈ ప్రభుత్వోన్మాద చర్యలు 1919 జూలై నుంచి 1920 జూన్ వరకూ నిరాటంకంగా, యధేచ్ఛగా, నిస్సిగ్గుగా కొనసాగాయి. పామర్‌దాడులు ప్రజల్లో కొంతవరకూ ఆమోదం పొందినప్పటికీ ఆ కాలంలో జరిగిన అత్యాచారాలు ప్రజాస్వామిక వాద, లిబరల్ మేధావి వర్గాల్లో మాత్రం ప్రభుత్వాన్ని బాగా అప్రతిష్ట పాలు చేశాయి.

అదే కాలంలో ఏర్పడిన *అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ (ఎ.సి.ఎల్.యు)* లాంటి సంస్థలూ, లిబరల్ మేధావులూ పామర్ దాడులను నిరసించారు. నిరసన సభలు నిర్వహించారు. బోస్టన్‌లోని హార్వర్డ్ లిబరల్ క్లబ్ లో జరిగిన ఒక సభలో ప్రముఖ మేధావులు ప్రొఫెసర్ జచేరియా చాఫీ జూనియర్, లాయర్ జోసెఫ్ లీ, న్యాయమూర్తి ఆండర్సన్ భావప్రకటనా స్వేచ్ఛపై జరుగుతున్న ఈ దాడులను ఖండించారు. రెడ్స్‌కు వ్యతిరేకంగా అభూత కల్పనలు ప్రచారం చేస్తున్నారనీ, రెడ్ వ్యతిరేక ఉన్మాదం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమనీ చెప్పారు. తప్పుడు దేశభక్తిని ప్రభుత్వం ప్రోత్సహించడాన్ని విమర్శించారు.

పామర్‌దాడులు ప్రారంభమైన ఆర్నెల్లకు అమెరికాలోని పన్నెండుమంది ప్రముఖ న్యాయవేత్తలు* దేశవ్యాప్తంగా పర్యటించి ప్రజాస్వామ్య హక్కులపై పామర్ దాడి గురించిన వివరమైన సమాచారాన్ని సేకరించారు. హార్వర్డ్ లా స్కూల్ డీన్ రస్కోపౌండ్ సంపాదకత్వంలో 'రిపోర్ట్ అపాన్ ద ఇల్లీగల్ ప్రాక్టీసెస్ ఆఫ్ ద యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్' పేరిట 1920 మే లో వారు ఒక నివేదికను ప్రచురించారు :

> అమెరికా రాజ్యాంగాన్నీ, చట్టాలనూ పరిరక్షిస్తామని ప్రమాణం చేసిన ఈ కింద సంతకం చేసిన లాయర్లమైన మేము ఆ రాజ్యాంగాన్నీ, చట్టాలనూ నిరాటంకంగా అమెరికా ప్రభుత్వ జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఉల్లంఘించడాన్ని రోజురోజుకూ పెరుగుతున్న భయ సందేహాలతో గత ఆర్నెల్లుగా గమనించాం.
>
> రాడికల్స్ కార్యకలాపాలను అణచివేసేందుకు చేపట్టిన చర్యల ముసుగులో అటార్నీ జనరల్ కార్యాలయం వాషింగ్టన్ నుంచి ఆదేశాలిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న స్థానిక ఏజెంట్ల ద్వారా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడింది. వారెంట్లు లేకుండా, చట్టాలతో పనిలేకుండా విజాతీయులనూ, పౌరులనూ మూకుమ్మడిగా అరెస్టులు చేశారు. స్త్రీలనూ, పురుషులనూ జైళ్ళకు తరలించారు. స్నేహితులనూ, న్యాయవాదులనూ కలుసుకొనే అవకాశం లేకుండా నిర్బంధించారు. సెర్చ్‌వారెంట్ లేకుండా ఇళ్ళలో జొరబడి ఆస్తులను స్వాధీనపర్చుకున్నారు. ధ్వంసం చేశారు. రాడికల్ భావాలున్నాయని అనుమానించబడిన స్త్రీ పురుష కార్మికులను నిస్సిగ్గుగా తిట్టారు. అవమాన పర్చారు. రాడికల్ సంస్థలలోకి జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఏజెంట్లు ప్రవేశించి (విప్లవ) కార్యక్రమాలు చేసేందుకు సభ్యులను రెచ్చగొట్టారు. మూకుమ్మడి దాడులు, అరెస్టులు చేసేందుకు వీలు కల్పించే ఉద్దేశంతో నిర్ణీత తేదీల్లో సమావేశాలు ఏర్పాటు చేయించమని ఆ ఏజెంట్లకు వాషింగ్టన్ నుంచి ఆదేశాలందాయి. ఈ చట్టవ్యతిరేక చర్యలను సమర్థించు కొనేందుకూ, తనకనుకూలంగా సెంటిమెంట్లను రెచ్చగొట్టేందుకూ జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రచార విభాగాన్ని సృష్టించింది. రాడికల్స్‌కు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు గాను ప్రభుత్వ ఖర్చుతో దేశంలోని వార్తాపత్రికలకు పెద్దఎత్తున సమాచారం పంపారు. అది అటార్నీ జనరల్ అధికార విధుల్లో భాగం కానిదని ......

అమెరికా ప్రభుత్వాన్నీ, ప్రభుత్వసంస్థలనూ, సమాజాన్నీ రాడికల్స్ నుండి కాపాడే లక్ష్యంతో

---

* జచేరియా చాఫీ జూనియర్ (కేంబ్రిడ్జ్), డీన్ రస్కో పౌండ్ (కేంబ్రిడ్జ్), ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ (కేంబ్రిడ్జ్), ఎర్నెస్ట్ ఫ్రాండ్ (చికాగో), స్వెన్‌బర్న్ హేల్ (న్యూయార్క్), ఆర్.జి.బ్రౌన్ (మెంఫిస్), ఫ్రాన్సిస్ ఫిషర్ కేన్ (ఫిలడెల్ఫియా), ఆల్ఫ్రెడ్‌నైల్స్ (బాల్టిమోర్), జాక్సన్ రాల్‌స్టన్ (వాషింగ్టన్), డేవిడ్ వాలర్ స్టెయిన్ (ఫిలడెల్ఫియా), ఫ్రాంక్ వాల్ష్ (న్యూయార్క్), టిరెల్ విలియమ్స్ (సెయింట్ లాయీ).

తాను పనిచేస్తున్నానని ప్రకటించుకున్న మిచ్చెల్ పామర్ చర్యలు ఏ విష ఫలితాల నిచ్చాయో వివరిస్తూ నివేదిక ఇలా పేర్కొంది :

*నిర్దాక్షిణ్యమైన అటార్నీ జనరల్ అణచివేత చర్యలు నిజానికి అమెరికన్ సంస్థలను కాపాడక పోగా అందుకు భిన్నంగా ఆ సంస్థలను అవి బలహీన పర్చాయి. విప్లవోద్యమం విస్తృతమైంది. గత ఆర్నెల్ల కాలంలో జస్టిస్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన చర్యలవల్ల అమెరికాలో సృష్టించబడిన విప్లవోద్వేగాన్ని తమ ప్రచారం ద్వారా సృష్టించడం ఏ రాడికల్ సంస్థకూ సాధ్యమయ్యేదికాదు.*

న్యాయవేత్తల నివేదిక పామర్‌దాడుల చట్టబద్ధతపై తీవ్రమైన చర్చను రేకెత్తించింది.*

పామర్‌దాడులు జరిగిన కాలంలో అక్రమంగా నిర్బంధించ బడిన పలువురు విజాతీయులను విడుదల చేయించేందుకు న్యాయవేత్తల కమిటీలోని కొందరు సభ్యులు కృషి జరిపారు. ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటీషన్ల** ను విచారించిన ఫెడరల్ జిల్లా జడ్జి ఆండర్సన్ తన తీర్పులో ప్రభుత్వ అత్యాచారాలను తీవ్రంగా విమర్శించాడు. ఆనాటి ప్రవాసుల స్థితిగతులకు అద్దం పట్టే ఆ తీర్పులో విజాతీయులకు అమెరికా రాజ్యాంగం హామీ యిచ్చిన హక్కులను ఆయన వివరించారు :

*కొలియర్ వర్సెస్ స్కెఫింగ్టన్ (జిల్లాకోర్టు.మసాచూసెట్స్. జూన్ 23,1920)*

**బోస్టన్‌లో ఉన్న ఇమిగ్రేషన్ కమీషనర్‌కు వ్యతిరేకంగా20 మంది విజాతీయుల తరఫున దాఖలు చేయబడిన హెబియస్ కార్పస్ పిటీషన్లు యివి.**

*అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లేదా హింసతో కూలదోయడాన్ని నమ్మే, బోధించే లేదా ప్రచారం చేసే ఏ సంస్థలోనైనా సభ్యులై ఉన్నారనీ లేదా దానితో సంబంధాలు కలిగి ఉన్నారనీ ఆరోపణలున్న కొన్ని వేల మంది విజాతీయులను దేశ బహిష్కృతులను చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం చట్టపరంగా చెల్లుబాటవుతుందా లేదా అనే విషయాన్ని తేల్చే ముఖ్యమైన కేసులుగా వీటి గురించి ఇరుపక్షాల లాయర్లూ విచారణ ప్రారంభంలోనే వివరించారు.....*

*విజాతీయులకు రాజ్యాంగ హక్కులున్నాయి. నాల్గవ, ఎనిమిదవ, పధ్నాలుగవ (రాజ్యాంగ)*

---

* తర్వాత కొన్నాళ్ళకు అమెరికా కాంగ్రెస్ సైతం ఆ నివేదికను పరిగణనలోకి తీసుకోక తప్పింది కాదు. అమెరికా కాంగ్రెస్ నియమించిన ఒక కమిటీ పామర్‌పై వాషింగ్టన్‌లో విచారణ జరిపింది.

** హెబియస్ కార్పస్ అంటే 'శరీరాన్ని ప్రవేశపెట్టండి' అని లాటిన్ అర్థం. అక్రమంగా నిర్బంధించబడిన వారిని కోర్టులో ప్రవేశపెట్టించేందుకు హెబియస్ కార్పస్ పిటీషన్లు ఉపయోగపడతాయి.

సవరణలు * పౌరులకు మాత్రమే వర్తించేందుకు ఉద్దేశించబడలేదు. సమంజసమైన, చట్టపరమైన పద్ధతిలో కాకుండా జరిగే సోదాల నుంచీ , జప్తుల నుంచీ స్వేచ్ఛ అనేది అమెరికాలో నివసిస్తున్న వారందరికీ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల్లో ఒకటి.

. . . . . . . . . . . . . .

చట్టాన్ని అమలుపర్చాల్సిన అధికారుల చట్టవ్యతిరేక చర్యల గురించి వివరంగా నేను చర్చించబోను. ఈ డాక్యుమెంట్లూ, వారి చర్యలే వాటిని వివరిస్తాయి.... జస్టిస్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆదేశాలు పొంది పని చేసే ప్రభుత్వాధికారులతో కూడిందైనప్పటికీ, నేరస్తులతో కూడిందైనప్పటికీ, లోఫర్లతో కూడిందైనప్పటికీ, అల్లరిమూక అల్లరి మూకేనని మొదటగా చెప్పాలి.

. . . . . . . . . . . . . .

దుర్భరమైన పరిస్థితుల్లో మహిళలను అరెస్టుచేసిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు, ముగ్గురు పసిపిల్లల తల్లి అయిన సాక్షి శ్రీమతి స్టానిస్లాస్ వాసిలియుస్కాను వెల్పాలో ఒక చోట అరెస్టు చేసి ఆమెను పెద్ద కూతురుతో పాటుగా... పోలీసు స్టేషన్‌కు తరలించారు. మరో మహిళతో కలిపి వారిద్దరినీ ఒక గదిలో ఉంచారు. అర్ధరాత్రి కావస్తుండగా ఆమె కూతురును నగరంలోని మారుమూల ప్రాంతంలోని వాళ్ళింటికి ఒంటరిగా పంపారు. శ్రీమతి వాసిలియుస్కాను తర్వాతి రోజు ఓడ ఎక్కించి కంపుగొట్టే మరుగుదొడ్లో ఆరు గంటల పాటు నిర్బంధించారు. ఆమెను డీర్ ద్వీపానికి తరలించి 33 రోజులుంచారు.

. . . . . . . . . . . . . .

ఈ రకమైన భయానక స్థితిలో విజాతీయులపై ప్రశ్నలు కురిపించారు. (వారు చెప్పిన సమాచారాన్ని) ఆ తర్వాత ఇమిగ్రేషన్ ఇన్‌స్పెక్టర్ల ముందు వారికి వ్యతిరేకంగా ముఖ్యమైన సాక్ష్యాధారాలుగా ప్రవేశపెట్టారు.

. . . . . . . . . . . .

దాడులకు విస్తృత ప్రచారాన్నిచ్చేందుకు శ్రమ పడ్డారు. ప్రజలకు పెను ప్రమాదం ముంచుకొస్తోందనీ, జస్టిస్ డిపార్ట్‌మెంట్ చర్యలు దాన్ని నివారించేందుకు ఎక్కు పెట్టబడ్డాయనీ చూపేందుకు కష్ట పడ్డారు. అనేక సందర్భాల్లో, అరెస్టయిన విజాతీయులు శాంత స్వభావులూ, అపాయకరం కాని శ్రమజీవులూ,వారిలో ఎక్కువ మంది రష్యాలో రైతులుగా పని చేసి ఎంతో కాలం కాలేదు. వాళ్ళను ఇద్దరిద్దరుగా విడదీసి బేడీలు వేశారు. బోస్టన్ వీధుల్లో నడిపించేందుకూ,

* అమెరికా రాజ్యాంగంలోని నాల్గవ సవరణ అసమంజసమైన సోదాల నుంచీ, ఎనిమిదవ రాజ్యాంగ సవరణ క్రూర, అసాధారణ శిక్షల నుంచీ రక్షణ కల్పిస్తాయి. పద్నాలుగవ రాజ్యాంగ సవరణ ప్రకారం తన అధికార పరిధిలో నివసించే ఏ వ్యక్తి ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ, ఆస్తినీ - చట్టబద్ధమైన, సమంజసమైన క్రమాన్ని అనుసరించకుండా రాజ్యం హరించరాదు. అందరికీ సమానంగా చట్టపరమైన రక్షణకల్పించేందుకు రాజ్యం నిరాకరించరాదు. ఈ మూడు సవరణల ద్వారా సంక్రమించిన ప్రాథమిక హక్కులు పౌరులకే కాక ప్రజలందరికీ ఉంటాయి.

రైళ్ళలో రవాణా చేసేందుకూ అందర్నీ కలిపి బంధించారు. . . . . నార్త్ స్టేషన్‌లో రైలు దిగింతర్వాత సంకెళ్ళతో ఉన్న విజాతీయులను పత్రికల ఫొటోగ్రాఫర్లతో ఫొటోలు తీయించారు.

. . . . . . . . . . .

ఇళ్ళను ఇష్టం వచ్చినట్టు సోదా చేశారు. బీరువాలనూ, సూట్‌కేస్‌లనూ, పెట్టెలనూ పగలగొట్టారు. పుస్తకాలూ, పేపర్లూ స్వాధీన పర్చుకున్నారు. ఒక్క వారెంట్‌నయినా తీసుకోవడం గానీ, లేదా తీసుకొనేందుకు దరఖాస్తు చేయడం గానీ జరిగిందా అన్నది నాకు అనుమానమే.

. . . . . . . . . . . .

డీర్ ద్వీపంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అంత పెద్ద సంఖ్యలో జనాన్ని ఉంచేందుకూ, వారి బాగోగులు చూసేందుకూ అక్కడ సరైన ఏర్పాట్లు జరగలేదు. కొన్ని నీటి ఆవిరిగొట్టాలు పగిలిపోయాయి.. . . . తీవ్రమైన చలి నెలకొని ఉంది. మురుగు పోయేందుకు తగిన ఏర్పాట్లు లేవు. . . . అరెస్టయిన విజాతీయులను అనేక రోజుల పాటు బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా నిర్బంధించారు. . . . . .

. . . . . మొదటి రోజుల్లో డీర్ ద్వీపంలో ఒక విజాతీయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదో అంతస్తు నుండి కింద ఉన్న పలువురు భయకంపిత విజాతీయుల మధ్యలోకి అతను దూకగా తలబద్దలైంది. మరొకరికి పిచ్చెక్కిందని ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారు పూర్తిగా కాకపోయినా దాదాపు మతిభ్రమణం అంచుకు నెట్టబడ్డారు.

పామర్‌దాడులను వ్యతిరేకించిన పౌర హక్కుల మేధావులను కూడా పామర్ బృందం వదల్లేదు. వారు కూడా కమ్యూనిస్టులనీ, అరాచకవాదులనీ, రెడ్స్ అనీ దుష్ప్రచారం చేయించింది. పాలక పక్షం వహించిన మేధావులు కొందరు అందుకు సహకరించారు. హార్వర్డ్ లా స్కూల్లో పని చేసే జచేరియా చాఫీ జూనియర్‌కు వ్యతిరేకంగా దుమారం లేవదీసి ఆయనను విశ్వవిద్యాలయం నుండి బయటికి గెంటించేందుకు కొందరు ప్రయత్నించారు. చాఫీ "వాస్తవాల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాడ"నీ ఆయన రాడికల్ అనీ ఆరోపించి ఆయనకు "పాఠాలు చెప్పే అర్హత" ఉందో లేదో తేల్చమని ఇరవై మంది విశ్వవిద్యాలయ పోషకులు డిమాండ్ చేశారు. చాఫీపై విచారణకు కమిటీని నియమించగా ఆ ఆరోపణల నుంచి బయటపడేసరికి ఆయనకు తల ప్రాణం తోకకొచ్చింది. ఒక్క ఓటు తేడాతో చాఫీని నిర్దోషిగా కమిటి ప్రకటించింది. తర్వాత కొన్నేళ్ళకు ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమించే సందర్భంలో ఆయనను రాడికల్ పక్షపాతిగా ముద్ర వేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. రాడికలిజం పెరుగుదలకు దోహదం చేసిన సామాజిక ఆర్థిక నేపథ్యాన్ని తొలగించేందుకు కాక, ప్రజల స్వేచ్ఛను హరించేందుకు, ప్రజాస్వామిక మేధావులను విమర్శించేందుకు ప్రభుత్వం పూనుకుంది.

అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవాన్ హ్యూగ్స్ మాటల్లో:

స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక అవసరాలు అమెరికా చరిత్రలో బహుశా ఎన్నడూ లేనంతగా ఈ కాలంలో అలక్ష్యం చేయబడ్డాయి.

**ఈ నేపథ్యంలో జరిగిన ఒక ఘటన చెప్పులు కుట్టి బతికే శాక్కొమా, చేపలమ్ముకొని జీవించే వాంజెట్టిని ప్రపంచ ప్రజా వేదికపై కథానాయకులుగా నిలిపి వారి భవితవ్యాన్నే మార్చేసింది.**

"All the News That's Fit to Print."

# The New York Times.

THE WEATHER

# MIDNIGHT BOMBS FOR OFFICIALS IN 8 CITIES; BOMBERS DIE AT ATTORNEY GENERAL'S HOUSE; TWO VICTIMS AT JUDGE NOTT'S HOUSE HERE; BOMBS IN BOSTON, CLEVELAND, PITTSBURGH

ATTACKS IN 8 OTHER CITIES

House of Boston Justice Who Sentenced Reds Is Shattered.

Senator King Demands Removal of F. C. Howe for Having Presided at Soviet Meeting

PALMER AND FAMILY SAFE

On Second Floor When Explosion Wrecked Lower Part of House.

RED LITERATURE FOUND



Attorney General A. Mitchell Palmer, Whose House in Washington Was Bombed Last Night

PITTSBURGH HOMES DAMAGED BY BOMBS


TWO BOMBS EXPLODED IN PHILADELPHIA

EXPLOSION AT HOME OF CLEVELAND MAYOR

LEGISLATOR'S HOME DAMAGED BY BOMB

న్యూయార్క్ టైమ్స్, జూన్, 3, 1919 p. 1

ఎనిమిది నగరాల్లో ఉన్నతాధికారుల ఇళ్ళమీద అరాచకవాదులు 1919 జూన్ 2 అర్ధరాత్రి బాంబుదాడులు చేసి అధికారవర్గాన్ని కలవరపర్చారు.




**సౌత్ బ్రెయిన్ ట్రీ నేరస్థల పరిసరాలు**

**కాల్పులకు ముందు**

1. నీల్
2. ఆండ్రూస్, కాంప్‌బెల్
3. హెరోన్

**కాల్పులు జరుగుతుండగా**

4. బోస్టాక్
5. వేడ్
6. మెక్‌గ్లోన్
7. పెల్సర్
8. లిస్‌కోంబ్

**కాల్పులు జరిగాక**

9. స్ప్లెయిన్, డెవ్లిన్
10. లెవాంజీ
11. గుడ్‌రిడ్జ్
12. బర్కే
13. పియర్స్
14. గాల్డ్

# నాందీ ప్రస్తావన

ఏప్రిల్ 15 ఉదయం తొమ్మిది గంటలు సౌత్ బ్రెయిన్‌ట్రీ రైల్వే స్టేషన్‌లో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ఉంది

మసాచూసెట్స్‌లోని నార్‌ఫోక్ కౌంటీలో బ్రెయిన్‌ట్రీ పట్టణముంది. అక్కడున్న ప్రముఖ షూ కంపెనీల కార్మికుల జీతాల బట్వాడా కోసం ఆ రైల్లో తరచూ డబ్బు రవాణా అవుతుంటుంది.

అమెరికన్ ఎక్స్‌ప్రెస్ ఏజెంట్ నీల్ ఎప్పటిలాగే మనీ బాక్స్ అందుకున్నాడు. రైల్వే స్టేషన్‌లో, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులున్నారేమోనని నిశితంగా పరికించడం అతనికి అలవాటే. మనీ బాక్స్ అందజేయాల్సిన స్లేటర్ మోరెల్ షూ కంపెనీ రైల్వే స్టేషన్ ఎదురు రోడ్డులో ఉంది. స్టేషన్‌కూ ఆ కంపెనీకీ మధ్య రోడ్డు మీద రెండు కార్లు ఆగి ఉన్నాయి. నల్లటి కారు ఇంజన్ రొదపెట్టడం నీల్‌కు వినిపిస్తూనే ఉంది. పాలిపోయిన గోధుమ రంగు ముఖంతో సన్నటి ఆగంతకుడొకడు టోపీ పెట్టుకొని ఆ కారు పక్కే నిల్చుండటం నీల్‌కు కనిపిస్తూనే ఉంది. మనీ బాక్స్ తీసుకొని కంపెనీ వేపు బయల్దేరాడు నీల్. కంపెనీలోకి వెళ్ళే వరకూ నీల్‌ను కారు పక్క నిల్చున్న వ్యక్తి గమనిస్తూనే ఉన్నాడు.

డబ్బు చేరగానే స్లేటర్ మోరెల్ కంపెనీ గుమాస్తాలు ఉత్సాహంగా పే స్లిప్పులు తయారు చేశారు. డబ్బునూ, పే స్లిప్పులనూ లెక్కపెట్టి కవర్లలో ఉంచి రెండు పెట్టెల్లోకి సర్దారు. డబ్బు మొత్తం 15 వేల 776 డాలర్లు. పక్క వీధిలో ఆ కంపెనీదే మరో షూ ఫ్యాక్టరీ ఉంది. డబ్బును అక్కడికి చేర్చాలి.

సాయంత్రం మూడు గంటలైంది. పే మాస్టర్ ఫ్రెడరిక్ పర్మెంటర్, సెక్యూరిటీ గార్డు అలసాండ్రో బెరార్డెల్లీ చెరో పెట్టె పట్టుకొని కంపెనీ నుంచి బయటికొచ్చారు. గార్డు బెరార్డెల్లీ ఒక చేత్తో పెట్టెనూ, మరో చేత్తో తుపాకీని మోస్తూ భారంగా అడుగులేస్తున్నాడు. వీధి మలుపు తిరిగి రైల్వే లెవెల్ క్రాసింగ్ దాటి కొంత దూరం నడిస్తే గానీ వారు గమ్యం చేరరు.

రైల్వే క్రాసింగ్ దాటుతుండగా పర్మెంటర్, బెరార్డెల్లీలకు ఒక పరిచయస్తుడు ఎదురై పలకరించాడు. రైల్వే క్రాసింగ్‌కు అవతలి వేపు రోడ్డు పక్క కంచె దగ్గర ఇద్దరు వ్యక్తులు నిల్చొని

ఉన్నారు. ముదురు బట్టలేసుకొని టోపీలు పెట్టుకున్నారు. వాళ్ళిద్దరూ విజాతీయులని చూడగానే చెప్పొచ్చు.

పరిచయస్తుడితో కొద్దిసేపు మాట్లాడాక పర్మెంటర్, బెరార్డెల్లీ ముందుకు సాగారు. ఆగంతకులు నిల్చున్న చోటుకు ఎదురుగా రోడ్డు మీద నడుస్తున్నారు.

సరిగ్గా ఆ సమయంలో కంచె వెనుక ఉన్న ఆగంతకులు ఒక్క ఉదుటున కంచె దూకి వాళ్ళిద్దరి వేపూ తుపాకులు గురి పెట్టి దూసుకువచ్చారు. ఈ హఠాత్పరిణామం నుంచి తేరుకునేలోగా బెరార్డెల్లీని వాళ్ళలో ఒకడు పట్టుకోగా మరొకడు అతనిపై నిప్పుల వర్షం కురిపించాడు. బెరార్డెల్లీ కుప్పగూలి పోయాడు. అయినా మరోరెండు బుల్లెట్లు అతని శరీరంలోకి దూసుకు పోయాయి.

భయుభ్రాంతుడైన పర్మెంటర్ మనీ బాక్సను కింద పడేసి రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు. ఆగంతకుల్లో ఒకడు అతన్ని వెంట తరిమాడు. రెండో వాడు అతనిపైకి కాల్పులు జరిపాడు. మరుక్షణంలో రక్తపు మడుగులో పర్మెంటర్ పడి పోయాడు.

ఇది జరుగుతుండగానే కాన్వాస్ టాప్ ఉన్న నల్లకారు అక్కడికి దూసుకొచ్చింది. దాన్లో ఉన్న దుండగుల్లో ఒకడు కిందకు దిగి మిగిలిన ఇద్దరితో కలిసి డబ్బు పెట్టెలను కార్లోకి చేర్చాడు. ఊహించని ఏ పరిణామాన్నైనా ఎదుర్కొనేందుకు కారు వెనుక సీట్లో మరొకడు తుపాకీ ఎక్కుపెట్టి అప్రమత్తంగా ఉన్నాడు.

రైల్వే క్రాసింగ్‌కు ఇవతలి వేపు చాలా దూరం వరకూ తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. చుట్టుపక్కల జనం భయభ్రాంతులయ్యారు. సంఘటన స్థలానికి ఎదురుగా ఉన్న రైస్ అండ్ హచిన్స్ కంపెనీ కార్మికులూ, రోడ్డు పక్క షాపుల వాళ్లూ, స్లేటర్ మోరిల్ కంపెనీ పనివాళ్ళూ ఏం జరుగుతుందోనని అటువేపు దృష్టి సారించారు.

కారు వెనక్కి తిరిగి రైల్వే క్రాసింగ్ వేపుగా పెరల్‌స్ట్రీట్‌లోకి దూసుకువచ్చింది. గాలికి కాన్వాస్ టాప్ రెపరెపలాడుతోంది. బయటికి పిస్టల్ గురి పెట్టి తూటాలయిపోయే వరకూ విచక్షణారహితంగా ఒకడు కాల్పులు జరుపు ~ ఉండగా కారు ముందు కురికింది. తమనెవరూ వెంటాడకుండగా ఇనప మేకులను వీధి నిండా వెదజల్లుతూ హంతకులు అక్కడి నుంచి పారిపోయారు. కొంత దూరం ప్రయాణించాక మాట్‌ఫీల్డ్ రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర గేటు వేసి ఉండగా వారి కారు ఆగిపోయింది. రైలు వెళ్ళే వరకూ అసహనంగా నిరీక్షించి గేట్ మాన్‌ను బెదిరించి వాళ్ళు కనుమరుగై పోయారు.

స్పృహ తప్పి పడి ఉన్న పర్మెంటర్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. స్పృహలోకి రాకుండానే మరుసటి రోజు ఉదయం పర్మెంటర్ చని పోయాడు.

ఈ సంఘటన జరిగిన రెండురోజులకు పట్టణ శివార్లలో చెట్ల తోపులో హంతకులు

వదిలేసిన నల్లకారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుండి మరో కార్లో హంతకులు పారిపోయారని టైర్ల గుర్తులు సూచించాయి.

హంతకుల ఆచూకీ కనుగొనేందుకు బ్రాక్‌టన్ పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టారు. స్లేటర్ మోరిల్ కంపెనీ రప్పించిన పింకర్‌టన్ డిటెక్టివ్ ఏజెంట్లు మరో వేపు పరిశోధన ప్రారంభించారు. అంతకు కొద్ది నెలల క్రితం 1919 డిసెంబర్ 24న అక్కడికి దగ్గర్లో బ్రిడ్జి వాటర్ పట్టణంలో అదే ఫక్కీలో ఒక షూ కంపెనీ డబ్బు దోచుకునేందుకు విఫలయత్నం చేసిన బందిపోట్లూ, సౌత్ బ్రెయిన్ ట్రీ హంతకులూ ఒకరే అయి ఉండవచ్చని పోలీసులు అనుమానించారు. వారు ఇటాలియన్లయి వుంటారని భావించారు.

ఎవరైనా విజాతీయులు అనుమానాస్పదంగా తిరుగుతూ ఆ పరిసరాల్లో కనిపిస్తే తమకు వెంటనే తెలియపర్చవలసిందిగా ఆ ప్రాంతంలోని ప్రజలను పోలీసులు హెచ్చరించారు. కారు రిపేరు కోసం అనుమానాస్పద విజాతీయులెవరొచ్చినా తమకు సమాచారం అందజేయ వలసిందిగా కారు గేరేజీ యజమానులను కూడా పోలీసులు కోరారు.

## 2

ఇదిలా వుండగా, అటార్నీ జనరల్ పామర్ ఇంటి మీద డైనమేట్ పేల్చిన అరాచకవాదుల కోసం బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తన వేటను ఉధృతం చేసింది. నేరస్థలంలో దొరికిన ఓవర్ కోటు తుంపు, చుక్కల టై ముక్క, బూట్లు, రోజారంగు కరపత్రాల క్లూ ఆధారంగా పరిశోధన కొనసాగింది.

చుక్కల టై న్యూయార్క్‌లో తయారైందని కొన్ని వారాలకు బయటపడింది. న్యూయార్క్ మహానగరంలో షాపు షాపుకూ తిరిగి శోధించిన పోలీసులు చివరికి ఆ టైల అమ్మకందారుడిని పట్టుకున్నారు. అలాంటి టైలు కేవలం ఒక డజను మాత్రమే తయారయ్యాయి. అందులో ఒకటి మాత్రమే అమ్ముడు పోయింది. కొన్న వ్యక్తి రూపురేఖలు అస్పష్టంగా తెలిశాయి. అలాగే బూటు మడమ బాగుచేసిన వ్యక్తినీ, ఓవర్ కోటు కుట్టిన టైలర్‌నూ పోలీసులు కనిపెట్టగలిగారు. ఆ ముగ్గురు చెప్పిన సమాచారంతో, పామర్ ఇంట్లో పేలుడులో చనిపోయింది కార్లొవాల్ డినోసి అనే ఇటాలియన్ అరాచకవాది అని బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధిపతి ఫ్లిన్ అంచనా వేశాడు.

రోజా రంగు కరపత్రాల్లో 'FIGHTERS' లో 'S' మిగిలిన ఏడక్షరాలకు భిన్నంగా ఉందని కనుగొన్నారు. మసాచూసెట్స్‌లోని బ్రూక్లిన్ లో రాబర్ట్ ఏలియా అనే ఇటాలియన్ అరాచకవాది 'కన్‌జాన్స్ ప్రింటింగ్ షాప్'లో ఆ కరపత్రాలు అచ్చేశాడని 1920 ఫిబ్రవరి నాటికే పోలీసులు తెలుసుకోగలిగారు. ఆ ప్రింటింగ్ ప్రెస్ మీద దాడి చేసిన పోలీసులు రాబర్ట్ ఏలియాను, ఆంద్రె సెల్సెడొను అరెస్టు చేశారు. కరపత్రాలకు ఉపయోగించగా మిగిలిన రోజా రంగు పేపర్‌నూ, 'S

అక్షరాలనూ స్వాధీనం చేసుకున్నారు. ఏలియా, సెల్సెడోలు మొదట నేరాన్ని అంగీకరించనప్పటికీ చిత్రహింసలకు భయపడి చివరికి సమాచారం ఇచ్చారు. కరపత్రానికి అక్షరాలను కూర్చింది సెల్సెడో. మొత్తం ఏడువందల కరపత్రాలు అచ్చేశారు. కార్లోరెక్కి అనే ఇటాలియన్ వాటిని అచ్చేయించాడు.

ఏలియా, సెల్సెడో అందించిన సమాచారం పోలీసులకు బాగా ఉపయోగపడింది. మసాచూసెట్స్‌లో నివాసం ఏర్పరచుకున్న ప్రముఖ అరాచక వాది గల్లెయని ఈ బాంబుదాడులకు, డైనమైట్ పేలుళ్ళకు బాధ్యుడని వారు గ్రహించారు. కానీ అప్పటికే గల్లెయనిని దేశం నుంచి బహిష్కరించినందువల్ల ఆయనను యింకేమీ చేయలేక పోయారు.

కొన్ని షరతుల మీద తాము పోలీసులకు పూర్తిగా సహకరించగలమని ఏలియా, సెల్సెడో ఒప్పుకున్నారు. తమపై కేసులు పెట్టకూడదు; తమ కామ్రేడ్ల నుంచి తమకు పూర్తి రక్షణ కల్పించాలి; ప్రభుత్వ ఖర్చులతో తమనిద్దరినీ ఇటలీకి పంపించాలి.

ఈ దశలో న్యూయార్క్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయమున్న పార్క్‌రో భవనం 14వ అంతస్తులో ఒక ఆఫీసు గదిలో ఏలియాను, సెల్సెడోనూ పోలీసులు బంధించారు.

ఏలియా, సెల్సెడో అరెస్టు వార్త అరాచకవాదుల్లో భయాన్ని కలిగించింది. బోస్టన్‌లో వారిద్దరూ సభ్యులుగా ఉన్న ఇటాలియన్ అరాచకవాద బృందాన్ని అది మరింతగా కలవరపర్చింది. బోస్టన్ అరాచకవాది ఆల్డినొ ఫెలికనిని మార్చిలో యింటరాగేట్ చేశారు. ఎవరెవరిని బాంబుదాడుల కేసుల్లో నిందితులుగా చూపుతారో, ఎవర్ని ఏ క్షణంలో అరెస్టు చేసి చిత్రహింసల పాలు చేస్తారో, ఎవర్ని ఏ క్షణంలో దేశబహిష్కరణ చేస్తారో తెలియని అనిశ్చిత పరిస్థితి వారికి ఏర్పడింది. పోలీసులు బోస్టన్ చుట్టూ తమ పరిశోధనను కొనసాగించారు.

ఈ పరిస్థితిని సమీక్షించేందుకూ, తగు జాగ్రత్తలు తీసుకునేందుకూ 1920 ఏప్రిల్ 18న బోస్టన్‌లో అరాచకవాద *లిబర్టేరియన్ క్లబ్* సభ్యులు ఇరవై మంది సమావేశమయ్యారు. శాక్కో, వాంజెట్టి, రికార్డొ, ఓర్సియాని, మిక్‌బోడ, ఆల్డినో ఫెలికని, గాంబురా ఆ సమావేశానికి హాజరైన వారిలో వున్నారు.

# 3

వాంజెట్టిని న్యూయార్క్ పంపి సెల్సెడొ, ఏలియాల నిర్బంధం గురించిన వివరాలు సేకరించి వారి విడుదల కోసం ప్రయత్నించాలని బోస్టన్ సమావేశం నిర్ణయించింది.

వాంజెట్టి హుటాహుటిన న్యూయార్క్ వెళ్ళి ప్రముఖ అరాచకవాద నాయకుడు కార్లొ ట్రెస్కాను కలిశాడు. ఆయన దగ్గర ఏ సమాచారం దొరకలేదు. గల్లెయని స్నేహితులైన ఇటాలియన్ వర్కర్స్ డిఫెన్స్ కమిటి నాయకులను కూడా కలుసుకున్నాడు. ఏలియా, సెల్సెడొల

అరెస్టు వివరాలు కొన్ని తెలిశాయి. కానీ వాళ్ళిద్దరూ పోలీసులకు ఏఏ రహస్యాలు చెప్పారో ఎవరికీ తెలియదు. వర్కర్స్ డిఫెన్స్ కమిటీకి లాయర్‌గా పని చేస్తున్న నెల్స్‌తో మాట్లాడాడు. ప్రవాస రాడికల్స్‌ను దేశం నుంచి వెళ్ళగొట్టేందుకు సాక్ష్యంగా ఉపయోగిస్తున్న రాడికల్ సాహిత్యాన్ని పోలీసుల కంట పడకుండా వెంటనే దాచడం మంచిదని నెల్స్ వర్కర్స్ డిఫెన్స్ కమిటీకి సలహా ఇచ్చాడని వాంజెట్టికి తెలిసింది.

మే 2న బోస్టన్‌లో *లిబర్టేరియన్ క్లబ్* తిరిగి సమావేశమైంది. వాంజెట్టి న్యూయార్క్‌లో తనకు తెలిసిన విషయాలు చెప్పాడు. సభ్యులంతా తమ దగ్గరా, తమ స్నేహితుల దగ్గరా ఉన్న సాహిత్యాన్ని సేకరించి రహస్య స్థలాలలో దాచాలని సమావేశం నిర్ణయించింది.

సెల్సెడో పోలీసు నిర్బంధంలో మరణించాడని మే 4న దినపత్రికలు ప్రకటించాయి. అతన్ని నిర్బంధించిన భవనం 14వ అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు ప్రకటించారు. అతను ఎలా చనిపోయాడో పూర్తి వివరాలు తెలియదు. సెల్సెడోతో పాటు ఉన్న ఏలియాను ప్రభుత్వం తర్వాత గుట్టు చప్పుడు కాకుండా ఇటలీకి పంపేసింది. ఇటలీ వెళ్ళే ముందుగా ఏలియా దగ్గర ప్రభుత్వం అఫిడవిట్ సేకరించింది. దాని ప్రకారం: ఏలియాను, సెల్సెడోను పోలీసులు బాగానే చూశారు; కానీ సెల్సెడో డిప్రెషన్‌కు లోనై రాత్రుళ్ళు నిద్రపోయేవాడు కాదు; ఆహారం ముట్టకుండా మతి భ్రమించినట్టుగా ప్రవర్తించాడు; మే 2 ఉదయం ఏలియా నిద్రపోతుండగా సెల్సెడో కిటికీ నుంచి కిందకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

తమ కామ్రేడ్ మరణవార్త బోస్టన్ అరాచక వాదులను భయాందోళనకు, తీవ్ర మనోవేదనకు గురిచేసింది. సెల్సెడో నిజంగా ఆత్మహత్యచేసుకున్నాడో, పోలీసులే కొట్టి చంపి పై అంతస్తు నుంచి కిందికి తోశారో అర్థం కాలేదు. ఏలియా ఏమయ్యాడో తెలియదు. సెల్సెడో ఎలా మరణించినప్పటికీ అమెరికాలో అరాచకవాదుల భవిష్యత్‌కు అది సూచికగా మిగిలింది. సాహిత్యాన్ని రహస్య స్థావరానికి తరలించాలన్న తమ నిర్ణయాన్ని ఎంత త్వరగా అమలు పరిస్తే అంత మంచిదనుకున్నారు. బ్రిడ్జ్ వాటర్‌లో జాన్సన్ గారేజిలో ఉన్న మిక్‌బోడా కారు తీసుకొని ప్లిమత్ వెళ్ళి సాహిత్యాన్ని దాచేందుకు ప్రయత్నించాలని శాక్కో, వాంజెట్టి నిర్ణయించుకున్నారు.

# 4

కొహాసెట్ పట్టణంలో ఒక మారుమూల నివసించే మిక్‌బోడా చెప్పులు కుట్టి జీవిస్తాడు. బోస్టన్‌లో 1916 లో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొని అరెస్టయిన అరాచక వాదుల్లో అతనొకడు. బ్రిడ్జ్‌వాటర్‌లో ఒక షూ కంపెనీలో పని చేశాడు. అంతకు ముందు మొదటి ప్రపంచ యుద్ధాన్ని నిరసించి అజ్ఞాతవాసానికెళ్ళి, తర్వాత మెక్సికోకు ప్రవాసం వెళ్ళిన ఒక ఇటాలియన్

అరాచకవాద బృందంలో శాక్కో, వాంజెట్టిలతో పాటు బోడా కూడా సభ్యుడు. బోడా ఇంట్లో 1920 జనవరి నుంచి మరో అరాచకవాది కొయాసి తన కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు.

బ్రెయిన్‌ట్రీ హత్యలు జరిగిన 1920 ఏప్రిల్ 15న తూర్పు బోస్టన్ ఇమిగ్రేషన్ సర్వీస్ కార్యాలయానికి వచ్చి అధికారుల ముందు హాజరు కావాలని కొయాసికి తాఖీదు అందింది. ఆ రోజు కొయాసి బోస్టన్ వెళ్ళలేదు. మరురోజు ఫోన్ చేసి తన భార్యకు ఒంట్లో బాగోలేనందున తను హాజరు కాలేకపోయాననీ, కొన్ని రోజుల గడువివ్వమనీ కొయాసి ఇమిగ్రేషన్ అధికార్లను కోరాడు. కొయాసి ప్రవర్తనను అనుమానించిన ఇన్‌స్పెక్టర్ రూట్ అతని కోసం బోడా ఇంటికి వచ్చాడు. కొయాసి భార్య ఆరోగ్యంగానే ఉందనీ, కొయాసి ఇమిగ్రేషన్ అధికార్లకు అబద్ధం చెప్పాడనీ అర్థమైంది. అయినప్పటికీ ఇమిగ్రేషన్ కార్యాలయానికి వెళ్ళేందుకు మరో వారం గడువిచ్చాడాయన. కానీ వెంటనే ఇటలీ వెళ్ళి పోయేందుకు అతను సామాన్లు సర్దుకుంటూండడం ఇన్‌స్పెక్టర్ చూశాడు. వెళ్ళే వాడిని అభ్యంతర పెట్టడమెందుకని ఇన్‌స్పెక్టర్ ఊరుకున్నాడు. కొయాసి 1920 ఏప్రిల్ 18న ఓడలో ఇటలీ బయల్దేరి వెళ్ళాడు.

కొయాసి ఇటలీ వెళ్ళిన కొద్ది రోజులకు పోలీసు అధికారి స్టెవార్ట్ అతనికి బ్రిడ్జ్‌వాటర్, బ్రెయిన్ ట్రీ నేరాలతో సంబంధం ఉందేమోనని అనుమానించాడు. కొయాసి ఉంటున్న బోడా ఇంటికి మైలు దూరంలోనే సౌత్ బ్రెయిన్ ట్రీ నేరంలో ఉపయోగించిన బూయిక్ కారు దొరికింది. కొయాసి ఇటాలియన్. హంతకులు ఇటాలియన్లేనని సాక్షులు కొందరు చెప్పి వున్నారు. సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం జరిగిన రోజు కొయాసి ఇమిగ్రేషన్ ఆఫీసుకు వెళ్ళకపోగా దానికి అబద్ధపు కారణాన్ని చెప్పాడు. తర్వాత అతను హడావిడిగా ఇటలీ వెళ్ళిపోయాడు. ఇలా ఆలోచించిన స్టెవార్ట్ అనుమానం పెరిగి పెద్దదయింది. దొంగిలించిన డబ్బు కొయాసి ద్వారా ఇటలీకి రవాణా అయిందని అతను భావించాడు. కొహాసెట్‌లో ఉన్న కొయాసి నివాసాన్ని (బోడా ఇంటిని) చూడాలనుకున్నాడు.

స్టెవార్ట్ వెళ్ళే సరికి ఇంట్లో బోడాతో పాటు కొయాసి భార్యాపిల్లలూ ఉన్నారు. కొయాసి మంచివాడు కాదనీ, అతనికీ తనకూ పడదనీ చెప్పాడు బోడా. కొయాసి ఫోటో కోసం అక్కడ వెతుకుతున్న స్టెవార్ట్‌కు శావేజ్ ఆటోమేటిక్ పిస్టల్ స్కెచ్ దొరికింది. అది పిస్టల్ కంపెనీ అచ్చేసిన స్కెచ్. బోడా దగ్గర పాయింట్ 32 కాలిబర్ ఆటోమేటిక్ పిస్టల్ కన్పించింది. దాన్లో ఉన్న తూటా నొకదాన్ని స్టెవార్ట్ జేబులో వేసుకున్నాడు. ఇంటి మొత్తాన్నీ పరిశీలనగా చూస్తున్న ఆ పోలీసు అధికారి దృష్టిని ఇంటి వెనకున్న కారుషెడ్ ఆకర్షించింది. బోడా దగ్గరున్న ఓవర్ లాండ్ కారు టైరు గుర్తులే కాక, బూయిక్ కారుకు సరిపడే పెద్ద టైరు గుర్తులు నేలపై కనిపించాయి. బోడాపై కూడా స్టెవార్ట్‌కు అనుమానాలు కలిగాయి. అయితే అతనిని వెంటనే అరెస్టు చేయదల్చుకోలేదు. కానీ, నేర పరిశోధనను అతని చుట్టూ కేంద్రీకరించాడు.

బ్రెయిన్ ట్రీ హంతకుల కారు కొహసెట్ వేపే వెళ్ళిందని పోలీసులకు సాక్ష్యాలు కూడా దొరికాయి. బోడా ఇంటికెళ్ళొచ్చిన రెండు రోజుల తర్వాత మరోసారి పోలీసులు అక్కడికెళ్ళారు. పోలీసుల రాకను కిటికీ నుంచి చూసిన బోడా ఇంటి నుంచి తప్పుకున్నాడు. కొయాసి కుటుంబం అప్పటికే ఎటో వెళ్ళిపోయింది. తర్వాతి రోజు అక్కడికెళ్ళిన స్టెవార్ట్‌కు ఖాళీ ఇల్లు కనిపించింది. ఎల్మ్‌స్ట్రీట్‌లో ఉన్న జాన్సన్ గారేజిలో బోడా తన కారును రిపేరుకిచ్చాడని స్టెవార్ట్‌కు తెలిసింది. బోడా కారు కోసం ఎవరొచ్చినా తనకు తక్షణం కబురు చేయమని ఆయన గారేజీ యజమాని జాన్సన్‌ను ఆదేశించాడు.

# 5

స్టాటన్‌లో ఉన్న శాక్కో ఇంట్లో 1920 మే 5 సాయంత్రం శాక్కో, వాంజెట్టి, మిక్‌బోడా, మరో అరాచకవాది ఓర్సియానిని కలుసుకున్నారు. సాహిత్యాన్ని తరలించేందుకు మొదటి ప్రయత్నాన్ని ఆ రోజు ప్రారంభించాలి. శాక్కో తల్లి అప్పటికి కొన్నాళ్ళ కిందట చనిపోవడంతో తండ్రికి సాయపడేందుకు కుటుంబంతో సహా శాక్కో ఇటలీకి కొద్ది రోజుల్లో వెళ్ళబోతున్నాడు. పాస్‌పోర్టు కూడా తీసుకున్నాడు. సామాన్లు సర్దే ఏర్పాట్లలో శాక్కో భార్య తలమునకలుగా ఉంది.

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలకు నలుగురు మిత్రులూ జాన్సన్ ఇంటికి వెళ్ళారు. బోడా, ఓర్సియాని మోటార్ సైకిల్ మీదా, శాక్కో, వాంజెట్టి బస్‌లో అక్కడికి చేరుకున్నారు. వాళ్ళను చూసి జాన్సన్ భార్యకు అనుమానం వచ్చింది. పోలీసు చీఫ్ మైకేల్ స్టెవార్ట్ ఆదేశం గుర్తుకొచ్చింది. ఏదో పనున్నట్టుగా మెల్లగా ఆమె పక్కింటికి జారుకొని బ్రాక్‌టన్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసింది.

కారు నంబర్‌ను రెన్యువల్ చేయించి ఆ తర్వాత కారును తీసుకెళ్ళడం మంచిదని జాన్సన్ బోడాకు చెప్పాడు. నంబర్ రెన్యువల్ చేయించని పక్షంలో కారు పట్టుబడితే తమ పనికి ఆటంకం అవుతుందని భావించి కారు తీసుకోకుండానే వాళ్ళు వెనుదిరిగారు.

బోడా, ఓర్సియాని తిరిగి మోటార్ సైకిల్‌పైనే వెళ్ళిపోయారు. మెల్లగా కబుర్లు చెప్పుకుంటూ శాక్కో, వాంజెట్టి నడక సాగించారు. దార్లో ఒక రెస్టారెంట్‌లో కూర్చొని కాఫీ తాగారు. కొద్ది రోజుల్లో వాళ్ళొక మీటింగ్ పెట్టబోతున్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో పోరాడిన కార్మికుల కోసం పెడుతున్న ఆ మీటింగ్ గురించి చర్చించారు. రెస్టారెంట్‌లో కాఫీ తాగుతూ పెన్సిల్‌తో ఒక చిన్న కరపత్రాన్ని రాశాడు వాంజెట్టి. దాన్ని అచ్చేయించడం శాక్కో బాధ్యత. శాక్కో దాన్ని జేబులో పెట్టుకున్నాడు. రెస్టారెంట్ నుంచి బయటికొచ్చి ఎలక్ట్రిక్ స్ట్రీట్ కార్లో వాళ్ళు బయల్దేరారు.

వేగంగా వెళ్తున్న స్ట్రీట్ కారు బ్రాక్‌టన్ దాటి కాంపెల్లో చేరే సరికి బ్రాక్‌టన్ పోలీసులు దాన్ని

A C Ho....

వెంబడించి ఆపారు. పోలీసు అధికారి మైకేల్ కొనొలి లోపలికొచ్చాడు. రివాల్వర్ చేతపుచ్చుకొని ప్రయాణీకుల వేపు పరిశీలనగా చూశాడు. స్ట్రీట్‌కారు చివరి సీట్లో శాక్కొ, వాంజెట్టి కూర్చొని ఉన్నారు. కిటికీకి దగ్గరగా శాక్కొ కూర్చున్నాడు. వారి ఆకారాలను బట్టి తమకవసరమైన ఇటాలియన్లు వాళ్ళేనని కొనొలి గ్రహించాడు. నేరుగా వెళ్ళి వాంజెట్టికి ఎదురుగా నిల్చున్నాడు.

-"ఎక్కడ్నించి వస్తున్నారు?"

"బ్రిడ్జివాటర్"

-"బ్రిడ్జివాటర్‌లో ఏం చేస్తున్నారు?

"స్నేహితుడిని కలిసేందుకు వెళ్ళాం

పామర్ దాడులలో భాగంగా తమను పోలీసులు చుట్టుముట్టారనీ, తమ రాజకీయాల గురించి పోలీసులకు తెలిస్తే ఏమైనా జరగవచ్చనీ శాక్కొ, వాంజెట్టి భయపడ్డారు. అబద్ధాలు చెప్పి పోలీసులను నమ్మించి బయటపడాలనుకున్నారు.

-"ఎవరతను?'

"అతను..... అతన్ని పప్పి అంటారు వాళ్ళు.'

-"కదలొద్దు. యూ డర్టీ థింగ్స్!"

రివాల్వర్ గురిపెట్టి వాళ్ళిద్దర్నీ పోలీసులు సోదా చేశారు. వాంజెట్టి దగ్గర పాయింట్ 38 హారింగ్టన్ అండ్ రిచర్డ్సన్ రివాల్వర్ ఉంది. పోలీస్ స్టేషన్ కెళ్ళాక శాక్కొ జేబులో పాయింట్ 32 కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ వాళ్ళకు దొరికింది. ఇరవై రెండు కాట్రిడ్జిలు దొరికాయి. వాంజెట్టి రాసిచ్చిన కరపత్రం శాక్కొ కోటు జేబులోంచి పోలీసులు బయటికి తీశారు.

పోలీసులు వాళ్ళిద్దర్నీ బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళే సరికి రాత్రి పది గంటలయింది. ఇద్దర్నీ విడివిడిగా లాకప్ గదుల్లో బంధించారు. ఎందుకు నిర్బంధించారని వాంజెట్టి అడిగితే పోలీసులు అపహాస్యం చేశారు.

"ఓ! నీకు తెలుసులే . . . నీకు తెలుసు కదా ఎందుకో!'

నిద్రపోయేందుకు ప్రయత్నించాడు వాంజెట్టి. పక్కబట్టల్లేవు. చెక్కబల్ల మీద పడుకున్నాడు. దుప్పటి ఇవ్వమని అడిగాడు. బాగా చలివేస్తోంది.

"మెల్లమెల్లగా వేడెక్కుతావులే. రేప్పొద్దున హాల్లో కుర్చీల మధ్య నిలబెట్టి కాల్చి చంపుతాం."

రాత్రి బాగా పొద్దు పోయాక ఒక పోలీసు వాంజెట్టి లాకప్ గది వేపు వచ్చాడు. తలుపు ఊచలకు బాగా దగ్గరగా మొహం పెట్టి మూడు నాలుగు సార్లు వాంజెట్టి మొహం మీద ఉమ్మేశాడు. వాడు ఉమ్మే కొద్దీ వాంజెట్టి వాడికి బాగా దగ్గరగా వచ్చి నిల్చున్నాడు. అలానన్నా

జాలి పడి వాడు వెళ్ళిపోతాడనుకున్నాడు. కానీ ఆ పోలీసు నిర్దాక్షిణ్యంగా వాంజెట్టి ముఖం నిండా అసహ్యంగా ఉమ్మేశాడు. అలా చేస్తూ చేస్తూ వెనక్కెళ్ళి ఒక్కసారిగా జేబులోంచి రివాల్వర్ బయటికి తీశాడు. ఒక బుల్లెట్‌ను వాంజెట్టికి చూపించాడు బుల్లెట్‌ను రివాల్వర్‌లో పెట్టి వాంజెట్టికి గురి పెట్టాడు. తలుపు దగ్గరగా నిల్చున్న వాంజెట్టి భయపడి వెనక్కు వెళ్ళిపోతాడేమోననుకున్నాడు. కానీ తొణుకు, బెణుకు లేకుండా నిశ్చలంగా గంభీరంగా నిల్చున్న వాంజెట్టిని కాసేపు చూసి అతను వెళ్ళిపోయాడు.

అరెస్టయిన రాత్రే పోలీస్ చీఫ్ మైకేల్ స్టెవార్ట్ శాక్కో, వాంజెట్టిలను ఇంటరాగేట్ చేశాడు.

*'వాంజెట్టి! నేను నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను నేరం చేశావని నిన్ను అరెస్టు చేశాం నా ప్రశ్నలకు నీ ఇష్టమైతేనే తప్ప జవాబు చెప్పనవసరం లేదు కానీ నువు చెప్పే సమాధానాలు తర్వాత నీకు వ్యతిరేకంగా ఉపయోగించబడవచ్చు*

చట్టప్రకారం చేయాల్సిన ఆ హెచ్చరికను స్టెవార్ట్ మొక్కుబడిగా ఉచ్చరించాడు. పోలీసు అధికార్ల ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ఉండే హక్కు నిందితులకు ఉంటుంది. మౌనంగా ఉండేందుకు అవకాశమిచ్చే ఈ హక్కును వాంజెట్టి ఉపయోగించుకోలేదు. అతనిపై నేరారోపణ ఏమిటో స్టెవార్ట్ చెప్పనూ లేదు. రాడికల్ భావాలున్నందున పోలీసులు అరెస్టు చేశారనుకొన్న వాంజెట్టి ఏదో ఒక జవాబు చెప్పి అక్కడి నుంచి బయటపడేందుకు నిర్ణయించుకున్నాడు తనకు వచ్చీరాని ఇంగ్లీషులో జవాబు చెప్పాడు·

*-"ఏం పని చేస్తావు?'*

*"చేపలమ్ముతాను"*

*-"రాత్రి బ్రిడ్జివాటర్‌లో ఉన్నావా?'*

*"అనుకుంటాను ఖచ్చితంగా చెప్పలేను నాకీ పరిసరాలు సరిగ్గా తెలియవు '*

*-"నీతో పాటు ఎవరున్నారు?"*

*"నా మిత్రుడు "*

*- 'ఎవరతను?'*

*"శాక్కో"*

*-బ్రిడ్జివాటర్‌లో ఏం చేస్తున్నారు?"*

*"నా సన్నిహిత మిత్రుడిని చూసేందుకు వెళ్ళాను."*

*-"బ్రిడ్జివాటర్‌లో నీ మిత్రుడెవరు?"*

*"పప్పీ'*

*-"అతని పూర్తి పేరు?"*

*"ఇదతని పేరు కాదు అతని పేరు తెలియదు అతన్ని 'పప్పీ' అనే నిక్‌నేమ్‌తో పిలుస్తారు."*

*-"అతను ఎన్నాళ్ళుగా నీకు తెలుసు?"*

"చాలా కాలం నుండి. నేనతనితో స్లిమత్ కార్డేజ్ కంపెనీలో పని చేశాను."

-ఎంత కాలం అతనితో పని చేశావు?"

"దాదాపు రెండేళ్ళు."

-"అయినా అతని పేరు నీకు తెలియదు?"

"అతన్ని వాళ్ళు 'పప్పీ' అనే పిలుస్తారు. అతను ఎత్తైన దృఢకాయుడు. నీలిరంగు చొక్కా వేసుకుంటాడు."

.......................

-"మిక్‌బోడా నీకు తెలుసా?"

"తెలియదు."

-"రాత్రి వెస్ట్ బ్రిడ్జివాటర్‌లో మోటార్ సైకిల్ చూడలేదని ఖచ్చితంగా చెప్పగలవా?"

"లేదు. నేను మోటార్ సైకిల్‌ను చూడలేదు."

-"నీకు మిక్‌బోడా తెలియదు?"

"లేదు."

-"నువ్వు అరాచకవాదివా?"

"సర్! మీరునన్ను ఏమంటారో తెలియదు కానీ నేను కాస్త భిన్నమైన వాడిని."

-"ఈ ప్రభుత్వం అంటే నీకిష్టమేనా?"

"కాస్త వేరుగా ఉన్నదాన్ని ఇష్టపడతాను."

-"ఈ ప్రభుత్వాన్ని బల ప్రయోగం ద్వారామార్చడంలో నీకు నమ్మకం ఉందా?"

"లేదు"

వాంజెట్టిని ఇంటరాగేట్ చేసి నోట్స్ రాసుకున్న తర్వాత శాక్కో దగ్గరికెళ్ళాడు స్టెవార్ట్.

-"నీ పేరేంటి?"

"నికొలా శాక్కో"

-"బార్టొలోమియో వాంజెట్టి నీకు తెలుసా?"

"అవును. అతను నా స్నేహితుడు."

-"ఇంటి నుండి ఎప్పుడు బయట పడ్డావు?"

"సాయంత్రం భోంచేశాక"

-"అప్పుడు టైమెంతైంది?"

"ఆరున్నరయి వుండొచ్చు."

-"బ్రిడ్జివాటర్ ఎందుకెళ్ళావు?"

"నా మిత్రుడు వాంజెట్టి తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ రమ్మని అడిగాడు."

-"అతని స్నేహితుడెవరు?"

"నాకు తెలియదు. నేనెప్పుడూ అతన్ని చూడలేదు."

-"ఈ రాత్రి చూశావా అతన్ని?'

"లేదు చాలా దూరం ప్రయాణించి ఎల్మ్‌స్క్వేర్‌లో దిగాం."

-"తర్వాతేం చేశారు?"

"చాలా దూరం నడిచాం స్క్వేర్‌కు చేరుకున్నాం. మేం చాలా ఆలస్యంగా అక్కడికి చేరామనీ తన స్నేహితుడు నిద్రపోయి ఉండొచ్చని వాంజెట్టి అన్నాడు. మేం వెనక్కి వచ్చేశాం."

-"వెస్ట్ బ్రిడ్జివాటర్‌లో రాత్రి మోటార్ సైకిల్ మీద ఉన్న వాళ్ళెవరు?"

"నేను మోటార్ సైకిల్ చూడలేదు.'

-"నీకు మిక్‌బోడా తెలుసా?'

"తెలియదు."

వాంజెట్టిని అడిగినట్టే రాజకీయ అభిప్రాయాల గురించి శాక్కోను కూడా తరచి తరచి ప్రశ్నించాడు స్టెవార్ట్:

-"నువ్వు కమ్యూనిస్టువా?'

"కాదు."

-"అరాచకవాదివా?"

"కాదు.'

-"మా ప్రభుత్వాన్ని నువ్వు నమ్ముతావా?'

"నమ్ముతాను. కానీ కొన్ని విషయాలు భిన్నంగా ఉండాలనుకుంటున్నాను.'

తెల్లవారి జిల్లా అటార్నీ కట్జ్‌మన్ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఇద్దర్నీ విడివిడిగా మళ్ళీ ప్రశ్నించాడు. కొందరు సాక్షులను తెచ్చి వారిని చూపించారు. బ్రెయిన్ ట్రీ హత్య కేసులో వాళ్ళు సాక్షులని శాక్కో, వాంజెట్టిలకు తెలియదు స్టెవార్ట్‌గానీ, కట్జ్‌మన్‌గానీ, వాళ్ళిద్దర్నీ బ్రెయిన్ ట్రీ హత్యల గురించి ఏమీ అడగలేదు. శాక్కోను మాత్రం ఆ జంట హత్యల గురించి తెలుసా అని అడిగారు. దినపత్రికల్లో చదివానని చెప్పాడు. తమను బ్రెయిన్‌ట్రీ హత్యకేసులో హంతకులుగా పోలీసులు అనుమానిస్తున్నారని వాళ్ళిద్దరికీ ఏ మాత్రం సందేహం రాలేదు. తమ రాజకీయ అభిప్రాయాల కోసమే పోలీసులు అరెస్టు చేశారని వాళ్ళింకా అమాయకంగా నమ్ముతున్నారు.

# 6

బ్రెయిన్‌ట్రీ హంతకులు ఇటాలియన్లని సాక్షులు చెప్పారు; కొహసెట్ వేపు హంతకులు కారులో పారిపోయారని ఆధారాలున్నాయి; కొహసెట్‌లో కొయాసి, బోడా ఉంటున్నారు; అక్కడ షెడ్‌లో కారు పెట్టే వసతి ఉంది; షెడ్‌కు తెరలు దించి రహస్యంగా ఉంచే ఏర్పాటుంది; అక్కడ బోడా కారు కాక మరో కారు టైర్ల గుర్తులున్నాయి; బ్రెయిన్ ట్రీ హంతకులు ఉపయోగించిన

బూయిక్ కారు పెద్ద టైర్లకు ఆ గుర్తులు సరిపోలాయి;కొయాసి బ్రెయిన్ ట్రీ హత్యలు జరిగిన రోజు ఇమిగ్రేషన్ ఆఫీసుకు వెళ్ళలేదు; పైగా అబద్ధం చెప్పాడు; మరురోజు సామాన్లు సర్దుకొని మూడో రోజుకి ఇటలీకి వెళ్ళిపోయాడు; బోడా ఇంట్లో పిస్టల్ స్కెచ్ దొరికింది;బోడా దగ్గర రివాల్వర్ ఉంది; తర్వాత బోడా పరారయ్యాడు; శాక్కో, వాంజెట్టి బోడాతో కలిసి కారు కోసం ప్రయత్నించారు; వాళ్ళిద్దరి దగ్గరా పిస్టళ్ళు దొరికాయి; వాళ్ళిద్దరూ పోలీసులకు అనేక అబద్ధాలు చెప్పారు; సాక్షులు కొందరు వాళ్ళిద్దర్నీ, ముఖ్యంగా శాక్కోను హంతకుల్లో ఒకడిగా గుర్తు పట్టారు- ఇలా ఆలోచించిన స్టెవార్ట్ శాక్కో, వాంజెట్టిలకు బ్రెయిన్‌ట్రీ, బ్రిడ్జివాటర్ నేరాలతో సంబంధం ఉందని గట్టిగా అనుమానించాడు. కొయాసి ట్రంకుపెట్టెలో దోపిడీ సొమ్ము పెట్టుకొని ఇటలీకి ఉడాయించాడని భావించాడు.

బోడా, కొయాసీల పరారీ స్టెవార్ట్ అనుకున్నట్టు వారు నేరస్తులైనందువల్ల జరిగింది కాదు. వాళ్ళు అరాచక వాదులైనందువల్ల మాత్రమే. ఇటలీ చేరగానే కొయాసీ ట్రంకుపెట్టెలను అధికార్లు సోదా చేయగా అందులో డబ్బేమీ కన్పించలేదు. శాక్కో, వాంజెట్టి అబద్ధాలు చెప్పింది కూడా హంతకులైనందువల్ల కాదు. తాము రాడికల్స్ అని పోలీసులకు తెలిస్తే ఇబ్బంది పడాల్సొస్తుందనే. రెండు నేరాలు జరిగిన సమయాల్లోనూ వాంజెట్టి చేపలమ్ముతూనే ఉన్నాడు. బ్రిడ్జివాటర్ నేరం జరిగిన రోజున శాక్కో స్టాటన్‌లోని 3-కె షూ కంపెనీలో పని చేసినట్టు దాఖలాలున్నాయి. బ్రెయిన్‌ట్రీ నేరం జరిగిన సమయంలో శాక్కో బోస్టన్‌లో ఉన్నాడు. బోడా ఇల్లు అంతకు ముందు ఫౌండ్రీగా ఉండేది. దాన్ని బాగు చేసి నివాస గృహంగా రూపురేఖలు మార్చిన ఫలితంగా కారుషెడ్‌కు తెరలు దించారు.

శాక్కో, వాంజెట్టిలను అరెస్టు చేసిన మరుసటి రోజు ఓర్సియానిని అరెస్టు చేశారు. రెండు నేరాలు జరిగిన రోజుల్లోనూ అతను నార్త్ ఉడ్‌లో ఒక ఫౌండ్రీలో పని చేసినట్టు స్పష్టమైన ఆధారాలుండటంతో కొద్ది రోజుల తర్వాత విడుదల చేశారు. (ఇతను తర్వాతి కాలంలో డిఫెన్స్ లాయర్ మూర్‌కు కారు డ్రైవర్‌గా పని చేశాడు.)

మిక్ బోడాను పోలీసులు ఎప్పటికీ అరెస్టు చేయలేక పోయారు. అతను సురక్షితంగా ఇటలీకి చేరుకున్నాడు. అక్కడ కొన్ని దొంగతనాలు చేశాడు. ఒక సైనికాధికారిని చంపే ప్రయత్నం చేయగా లిపారి దీవికి ప్రవాసం పంపారు. కొంత కాలానికి విడుదలై ముస్సోలినీ ప్రభుత్వ గూఢచారిగా స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాల్లో పని చేశాడు.

మసాచూసెట్స్ పోలీసు కెప్టెన్ విలియం ప్రొక్టార్ శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని నమ్మాడు. బ్రెయిన్ ట్రీ, బ్రిడ్జివాటర్ నేరాలు ఆరితేరిన బందిపోటు ముఠా పని అని ఆయన అంచనా. పైగా నేరానికి ఉపయోగించిన బూయిక్ కారుపై వేలిముద్రలు శాక్కో, వాంజెట్టిలవి కావని తేలింది.

వాళ్ళిద్దరూ నేరాలు చేసినా చేయక పోయినా వాళ్ళు అరాచకవాదులు కాబట్టి వారినేం చేసినా పర్వాలేదని నార్‌ఫోక్ కౌంటీ జిల్లా అటార్నీ కట్జ్‌మన్, జస్టిస్ డిపార్ట్‌మెంట్ అధికార్లు, స్టెవార్ట్

భావించారు. అటార్నీ జనరల్ పామర్ అభిప్రాయం ప్రకారం దొంగయ్యేందుకూ, హంతకుడూ, నేరస్తుడూ అయ్యేందుకూ ప్రతి రాడికల్ శక్తి గల వాడే. వాళ్ళ పట్ల దయాదాక్షిణ్యాలు ప్రదర్శించాల్సిన పని లేదు. అప్పటికే వాళ్ళిద్దర్నీ దేశం నుంచి వెళ్ళగొట్టేందుకు జస్టిస్ డిపార్ట్‌మెంట్ నిర్ణయించి ఉంది. అయితే మసాచూసెట్స్‌లో దేశ బహిష్కరణ అమలు పర్చడం చాలా కష్టం. జిల్లా జడ్జి ఆండర్సన్ అప్పటికే చాలా మంది దేశబహిష్కరణలను రద్దు చేసి వున్నాడు. కాబట్టి శాక్కో, వాంజెట్టిలపై కోర్టు ఆమోదించే బలమైన సాక్ష్యాధారాలుంటేనే వాళ్ళను దేశం నుంచి బహిష్కరించడం సాధ్యమౌతుంది. ఇవన్నీ ఆలోచించి వాళ్ళిద్దర్నీ క్రిమినల్ కేసుల్లో ఇరికించడం ద్వారా వారి పీడ వదిలించుకోవచ్చునని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించింది. ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ మాటల్లో చెప్పాలంటే:

> *సైవార్ట్ పొరపడి శాక్కో, వాంజెట్టిలను అరెస్టు చేయడం జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఏజెంట్లకు మంచి అవకాశం కల్పించింది. సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం వృత్తినేరస్తుల పని అనీ, శాక్కో, వాంజెట్టిలు అరాచకవాదులూ, ఉద్యమకారులూ అయినప్పటికీ దారి దోపిడీదార్లు కారనీ, వారికి సౌత్ బ్రెయిన్ ట్రీ నేరంతో ఎలాంటి సంబంధం లేదనీ ఈ కేసులో పని చేస్తున్న ఏజెంట్ల అభిప్రాయం. అయినప్పటికీ, శాక్కో, వాంజెట్టిలను ప్రాసిక్యూట్ చేయడంలో వారు జిల్లా అటార్నీతో కుమ్మక్కయ్యారు. ఎందుకంటే హత్యానేరంలో శాక్కో, వాంజెట్టి శిక్షించబడటం ఒక విధంగా వాళ్ళిద్దర్నీ వదిలించుకొనే సాధనమవుతుందని డిపార్ట్‌మెంట్ ఏజెంట్ల అభిప్రాయం.*

అందువల్ల శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని నమ్మిన సీనియర్ పోలీసు అధికారి కెప్టెన్ ప్రొక్టార్‌ను జిల్లా అటార్నీ నేర పరిశోధన నుంచి తప్పించాడు. అధికార్ల మధ్య అనేక సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాల అనంతరం వాళ్ళిద్దర్నీ సౌత్ బ్రెయిన్ ట్రీ హత్య కేసులోనూ, వాంజెట్టి ఒక్కడిని మాత్రం బ్రిడ్జివాటర్ దోపిడీ ప్రయత్నం కేసులోనూ ముద్దాయిలుగా చూపుతూ పోలీసు రికార్డు తయారైంది.

కామన్వెల్త్ * వర్సెస్ శాక్కో అండ్ వాంజెట్టిగా న్యాయశాస్త్ర చరిత్రలోనూ, ప్రపంచ చరిత్రలోనూ ఎనలేని ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ కేసుకు అలా నాందీ ప్రస్తావన జరిగింది.

---

* ప్రభుత్వం

# రిహార్సల్

ఇటలీలోని టోల్‌మాగ్గియోరె పట్టణంలో గంపెడు సంతానం గల రైతాంగ కుటుంబంలో 1891 లో నికొలా శాక్కొ జన్మించాడు. ఒక మోస్తరు ఆర్థిక స్థోమతున్న శాక్కొ తండ్రి ఆలివ్ నూనె వ్యాపారమే కాక వ్యవసాయం చేసి కుటుంబ పోషణ చేసేవాడు. తండ్రికి సహాయపడేందుకు పధ్నాలుగేళ్ళ వయసులో శాక్కొ చదువుమానేశాడు. రెండేళ్ళ తర్వాత మెకానిక్‌పని నేర్చుకున్నాడు. సైన్యం నుంచి తిరిగొచ్చిన తన సోదరుడు అమెరికాకు వలసపోతానని చెప్పినప్పుడు స్వేచ్ఛా ప్రపంచం అని ఆశపడి 1908 లో శాక్కొ అమెరికాలో అడుగుపెట్టాడు. పదిహేడేళ్ళ వయసులో పొట్ట చేత పట్టుకుని తనది కాని దేశంలో అనేక కష్టమైన పనులు చేస్తూ తిరిగాడు. నీళ్ళుమోసాడు. రాళ్ళు మోసాడు. ఓడ రేవు కూలీగా పని చేసాడు. షూ ఫ్యాక్టరీలో చేరి పని నేర్చుకున్నాడు. అద్భుత సౌందర్యరాశి రోజీనా జాంబెల్లిని ప్రేమించి 1912 లో పెళ్ళి చేసుకున్నాడు.

బూట్ల తయారీలో అనుభవం శాక్కొ సంపాదనను వారానికి 50 డాలర్లుగా చేసింది. ఆ రోజుల్లో అది సగటు కార్మికుడి సంపాదన కన్నా కొంచెం ఎక్కువే. అప్పటికే, కార్మికుడిగా శాక్కొ అరాచకవాద భావాల పట్ల ఆకర్షితుడయ్యాడు. ఐ.డబ్ల్యు.డబ్ల్యు. సభ్యుడయ్యాడు. హోప్‌డేల్‌లో కార్మికుల సమ్మెలో పాల్గొన్నాడు. ప్రముఖ అరాచకవాద కార్మిక నాయకుడు ట్రెస్కా నాయకత్వంలో జరిగిన మిల్‌ఫోర్డ్ సమ్మె (1910) లో పాలు పంచుకున్నాడు. అధికార అనుమతి లేకుండా సభ నిర్వహించి శాంతి భద్రతలకు భంగం కలిగించారనే ఆరోపణపై మరో ఇద్దరితో పాటు పోలీసులు శాక్కొను అరెస్టు చేశారు. క్రింది కోర్టు విధించిన మూడు నెలల కారాగార వాసాన్ని హైకోర్టు అప్పీల్లో రద్దు చేసింది. రాడికల్ కార్యకలాపాలకు అవసరమైన నిధుల సేకరణలో పాల్గొన్నాడు. భార్యతో పాటు ఔత్సాహిక విప్లవ నాటక రంగంపై నటుడిగా పలు పాత్రలు ధరించాడు.

మొదటి ప్రపంచ యుద్ధాన్నీ, నిర్బంధ సైనిక విధానాన్నీ వ్యతిరేకించి 1917 జూన్‌లో కుటుంబాన్ని అమెరికాలోనే ఉంచి మెక్సికోకి ప్రవాసం వెళ్ళాడు శాక్కొ. ఆ సందర్భంలోనే అతనికి వాంజెట్టి తో పరిచయం అయింది. రెండు నెలల తర్వాత తిరిగి అమెరికా వచ్చి 1918

నవంబర్‌లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే వరకూ మొస్మకోటెల్లి అనే మారుపేరుతో అజ్ఞాతవాసంలో ఉండిపోయాడు. మసాచూసెట్స్ రాష్ట్రంలోని స్టాటన్‌లో 3-కె షూ కంపెనీలో కార్మికుడిగా స్థిరపడ్డాడు. పగలు బూట్ల మడమలు నునుపు చేసేవాడు. రాత్రిపూట వాచ్‌మన్‌గా పని చేసేవాడు. నైపుణ్యం గల కార్మికుడైన శాక్కోది క్రమశిక్షణాయుత జీవితం. కొడుకు డాంటే అంటే ప్రాణం. అరెస్టయ్యే నాటికి భార్య కడుపులో కూతురు ఐనెజ్ పెరుగుతోంది. ముదురు గోధుమరంగులో ఉండే శాక్కో సన్నగా, కాస్త పొట్టిగా ఉంటాడు. జుట్టు వెనక్కి దువ్వుతాడు. మీసాలుండవు. టోపీ పెట్టుకోనడం అతనికిష్టం.

మసాచూసెట్స్‌లోని ప్లిమత్‌లో స్థిరపడిన వాంజెట్టి వీధుల్లో తిరుగుతూ చేపలమ్ముతాడు. ఇటలీలోని కునియో ప్రాంతంలోని విల్లాఫెల్లెట్టొ పట్టణంలో ఒక పేద కుటుంబంలో 1888 జూన్ 11న పుట్టాడు. తండ్రి వ్యవసాయంతో పాటు చిరువ్యాపారం కూడా చేసే వాడు. పదమూడేళ్ళ వయసులో స్కూలు చదువుకు స్వస్తి చెప్పి కునియో నగరానికి వెళ్ళి స్వీట్లు తయారు చేసే ఫ్యాక్టరీలో పని నేర్చుకున్నాడు. తర్వాత మరో పట్టణంలో వంట వాడిగా రోజుకు పదిహేను గంటలు శ్రమించాడు. సంప్రదాయ కాథలిక్‌గా క్రైస్తవ మతాన్ని ఆ కాలంలో వీరావేశంతో సమర్థించాడు. అదే కాలంలో అభ్యుదయ సాహిత్యంతో కూడా పరిచయమైంది.

తన ఇరవయ్యో ఏట 1908 జూన్‌లో వాంజెట్టి అమెరికా గడ్డ మీద కాలు పెట్టాడు. న్యూయార్క్ నగరంలో ఒక పెద్ద రెస్టారెంట్‌లో అంట్లు తోమే వాడిగా ఘోరమైన పరిసరాల్లో పని చేశాడు. వాంజెట్టి మాటల్లో చెప్పాలంటే -

> *పన్నెండు నుంచి పద్నాలుగు గంటలు పని చేశాం. వారం మార్చి వారం ఆదివారం ఐదు గంటల సెలవుండేది. కుక్కలకు వేసే తడిసిన భోజనం పెట్టే వారు. వారానికి ఐదు డాలర్ల జీతం. ఊపిరితిత్తులకు క్షయవ్యాధి సోకుతుందని భయపడి ఎనిమిది నెలల తర్వాత అక్కడి నుంచి వెళ్ళిపోయాను.*

ఒక మిత్రుడితో కలిసి హార్ట్‌ఫోర్డ్ వెళ్ళాడు. కొంత కాలానికి కనెక్టికట్ రాష్ట్రంలోని పల్లెసీమలకు చేరాడు. ఒక అపరిచిత పేద రైతు కుటుంబం వాంజెట్టిని ఆకలిబారి నుంచి రక్షించింది. రెండు వారాల పాటు తిండి పెట్టి చిల్లరమల్లర పనులు అప్పజెప్పారు. ఆ తర్వాత న్యూ ఇంగ్లాండ్ ప్రాంతంలో ఉన్న క్వారీల్లో, ఇటుక బట్టీల్లో, రోడ్లు వేసే పనిలో సంవత్సరంపైగా కూలివాడిగా శ్రమించాడు. రైలు పట్టాలు వేశాడు. రాళ్ళు మోసాడు. తిరిగి న్యూయార్క్ చేరుకున్నాడు. ఒక వంట మాస్టర్ దగ్గర సహాయకుడిగా పనికి కుదిరాడు. ఎక్కడా ఐదారు నెలల కంటే ఎక్కువ పని చేయనిచ్చే వాళ్ళు కారు. మసాచూసెట్స్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్ లో 1913 లో కూలీగా పని చేశాడు. తర్వాత ప్లిమత్‌లో ఐసు ఫ్యాక్టరీలో చేరి 1914 నుంచి అక్కడే స్థిరపడ్డాడు. 1916లో అక్కడ జరిగిన సమ్మెలో పాల్గొనడం వల్ల ఆ ప్రాంతంలోని పారిశ్రామికవేత్తలూ, ఫ్యాక్టరీ

యజమానులూ వాంజెట్టిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. వారెవరూ అతనిని పనిలో పెట్టుకోవడం మానేశారు చివరికి ప్లిమత్ కార్డేజి కంపెనీలో పని చేస్తూండగా అందులో జరిగిన సమ్మెలో పాల్గొన్నందుకు ఉద్యోగం ఊడి పోయింది

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో శాక్కోతో పాటు వాంజెట్టి కూడా మెక్సికో వెళ్ళాడు. మారు పేర్లతో తిరిగాడు. కొద్ది నెలల తర్వాత అమెరికా తిరిగి వచ్చాడు. తోపుడు బండి మీద చేపలమ్ముతూ 1918 నుంచి ప్లిమత్‌వాసులకు సుపరిచితుడయ్యాడు. పుస్తకాలు బాగా చదివేవాడు. ప్రజలతో అరాచకవాదం గురించి మాట్లాడుతూ చేపలమ్మే వాంజెట్టిని వీధుల్లో చేపలమ్మే తత్వవేత్త అని పిల్చేవారు. మృదు స్వభావిగా, మానవతావాదిగా ప్రజల్లో అతనికి ఎంతో మంచి పేరుంది. మెక్సికో వెళ్ళే ముందు ప్లిమత్‌లో వాంజెట్టికి బ్రినీ కుటుంబం ఆశ్రయం ఇచ్చింది వాంజెట్టి కోసం బ్రినీ ఇంటికి ప్రముఖ అరాచకవాద నాయకులు గెల్లియని, ట్రెస్కా, మాలటెస్టా తదితరులు వచ్చి పోతూ ఉండేవారు. ముదురు మొహంతో ముందుకు పొడుచుకొచ్చిన బుగ్గ ఎముకలతో ఉండే వాంజెట్టి గుబురు మీసాలు అతన్ని ఇట్టే గుర్తుంచుకునేట్టు చేస్తాయి.

## 2

శాక్కో, వాంజెట్టిల అరెస్టు బోస్టన్ *లిబర్టేరియన్* క్లబ్ సభ్యులను విషాదంలో ముంచింది. ఈస్ట్ బోస్టన్‌లోని మావరిక్ స్క్వేర్‌లో నాచురలైజేషన్ హాల్లో తరచూ క్లబ్ సమావేశమౌతుంటుంది. అరెస్టు వార్త తెలియగానే అత్యవసర సమావేశం జరిగింది దాని గురించి క్లబ్ నాయకుడు జియోవాన్ని గాంబురా తన జ్ఞాపకాల్లో ఇలా రాసుకున్నాడు:

> *శాక్కో, వాంజెట్టిల అరెస్టు వార్త తెలియగానే ఆ ఇద్దరు సభ్యుల అరెస్టును గురించి చర్చించేందుకూ, వారికి సహాయం చేయడం గురించీ - వారిని రక్షించడం గురించీ చర్చ జరిపేందుకూ ఈస్ట్ బోస్టన్‌లో లిబర్టేరియన్ క్లబ్ ప్రత్యేక సమావేశం జరిగింది అరెస్టు గురించీ, దాని వెనకున్న ఉద్దేశ్యం గురించీ చర్చించాక దాన్ని గురించి పరిశోధించేందుకు ఒక కమిటీని నియమించాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు.*

నలుగురు సభ్యులతో ఏర్పాటైన ఆ కమిటీలో గాంబురాతో పాటు గెజెట్టా డెల్‌మాస్ వార్తా పత్రిక సంపాదకుడు ప్రొఫెసర్ ఫెలిస్ గుడాగ్ని, శాక్కో బంధువు లూసియమాన్‌సిని, ఆల్డినో ఫెలికని ఉన్నారు. ఫెలికని కమిటి కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు.

వాంజెట్టికి మంచి మిత్రుడైన ఫెలికని జీవితం ఆ రోజు నుంచీ శాక్కో- వాంజెట్టి కేసుతో పెనవేసుకుపోయింది. అతడు సున్నితమైన మనసున్న మృదు స్వభావి. శాక్కో-వాంజెట్టి డిఫెన్స్ కమిటీని చివరి వరకూ నడిపించి, దాన్ని మహోన్నత ఉద్యమంగా తీర్చిదిద్దిన శక్తి సంపన్నుల్లో

ఆయన ముఖ్యుడు. ఇటలీలోని బొలాగ్న నగరంలో జన్మించిన ఫెలికని కొంతకాలం సోషలిస్టుగా ఉన్నాడు. తర్వాత అరాచకవాద తత్వశాస్త్రం వేపు ఆకర్షితుడయ్యాడు. సైనికాధికారిపై కాల్పులు జరిపిన ఒక యువ అరాచకవాద సైనికుడిని పిచ్చాసుపత్రికి తరలించిన ఇటలీ ప్రభుత్వ దుశ్చర్యకు నిరసనగా దేశవ్యాప్త ఉద్యమం నడిపిన చరిత్ర అతనికుంది. పలు సందర్భాల్లో ఇటలీలో 24 సార్లు అరెస్టయ్యాడు. జైలు శిక్ష కూడా అనుభవించాడు. కొన్ని రోజుల పాటు ముస్సోలినీ తో పాటు ఒకే గదిలో ఖైదీగా కూడా ఉన్నాడు. అరెస్టునూ, జైలు శిక్షనూ తప్పించుకునేందుకు అధికారుల కన్ను గప్పి పాస్‌పోర్టు లేకుండానే 1914 లో అమెరికా రాగలిగాడు. బోస్టన్‌లో 1918 నుంచీ స్థిరపడి లా నొటిజియ అనే ఇటాలియన్ దినపత్రికలో టైప్‌సెట్టర్‌గా పని చేస్తూ అరాచకవాద కార్యకర్తల్లో ప్రముఖుడయ్యాడు. వాంజెట్టితో కలిసి అరాచకవాద పత్రిక నొకదాన్ని ప్రారంభించాలనుకున్న ఫెలికని ప్రయత్నం ఎన్నటికీ ఫలించలేదు. అతని పట్టుదలా, ఓపికా, అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన ఇతర అంశాలూ డిఫెన్స్ కమిటీ కార్యశీలతకు ప్రధాన కారణాలయ్యాయంటే అతిశయోక్తి కాదు. నిజమైన న్యాయమూర్తులు ప్రజలేననీ, కోర్టులు కావనీ - అందువల్ల శాక్కొ, వాంజెట్టి విడుదల కోసం గొప్ప ప్రజా ఉద్యమం అవసరమని ఆయన భావించాడు.

లిబర్టేరియన్ క్లబ్ సమావేశంలో సభ్యులు అప్పటికప్పుడు ఇచ్చిన చందా 200 డాలర్లయింది. జైల్లో ఉన్న శాక్కొ, వాంజెట్టిలను కలిసి డిఫెన్స్ కమిటి ఏర్పాటు గురించి తెలియజేయాలని సమావేశం నిర్ణయించింది.

డిఫెన్స్ కమిటి కార్యాలయాన్ని బోస్టన్‌లో 32 బ్యాటరీ స్ట్రీట్‌లోని లా నోటిజియ పత్రిక కార్యాలయంలోని ఒక గదిలో తాత్కాలికంగా ప్రారంభించారు. శాక్కొ-వాంజెట్టి డిఫెన్స్ కమిటిగా చరిత్ర ప్రసిద్ధికెక్కి, దేశవ్యాప్తంగా శాఖోపశాఖలై విస్తరించిన సంస్థ అలా ప్రారంభమైంది. నిధులను స్వీకరించేందుకు తమ చిరునామా ఉపయోగించుకోనిచ్చేందుకు ఆ పత్రిక యాజమాన్యాన్ని ఫెలికని ఒప్పించాడు. తమ పేర్లు బయటపడినప్పటికీ పని చేసేందుకు సిద్ధమైన కొందరు రాడికల్స్ ను రంగంలోకి దించాడు.

నిధుల కోసం ఫెలికని పత్రికల ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. మొదట ఇటాలియన్ అరాచకవాదులూ వారి సానుభూతిపరులూ స్పందించారు. దాదాపు రెండు వందల మంది పది సెంట్ల నుంచి డాలర్ దాకా పంపగా ఆ డబ్బు నలభై యాభై డాలర్లయింది. మొదటి రోజుల్లో డబ్బిచ్చిన వాళ్ళంతా దాదాపు ఇటాలియన్లే. ఆ డబ్బు చాలక ఫెలికని తన పలుకుబడి ఉపయోగించి అప్పుచేసి పని ప్రారంభించాడు.

అప్పటికింకా సౌత్ బ్రెయిన్ ట్రీ కేసు పరిశోధనను పోలీసులు ముగించలేదు. వాంజెట్టిపై మాత్రం బ్రిడ్జివాటర్ దోపిడీయత్నం కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు. అది విచారణకు రాబోతోంది. వాంజెట్టి తరపున వాదించేందుకు డిఫెన్స్ లాయర్ కావాలి. ఫెలికని

స్నేహితుడొకరు జేమ్స్ గ్రాహమ్ అనే క్రిమినల్ లాయర్ పేరును సూచించాడు. ఐదొందల డాలర్ల ఫీజు ఇస్తే కేసు వాదిస్తానన్నాడు గ్రాహమ్. ప్లిమత్‌లో లాయర్లకు బ్రోకర్‌గా పనిచేసే ఒక ఇటాలియన్ ఈ కేసును మరో క్రిమినల్ లాయర్ జాన్‌వాహె కు అప్పజెప్పేందుకు అప్పటికే వాంజెట్టి స్నేహితులను ఒప్పించాడు. అంతకు ముందు వాళ్ళు వినియోగిద్దామనుకున్న లాయర్ కెలహాన్ నుంచి కేసు రికార్డు వాపస్ తీసుకున్నారు. ప్లిమత్‌లో వ్యవహారాలు తనకు కొట్టిన పిండిఅనీ, వాంజెట్టిని కేసు నుంచి బయటపడేస్తాననీ వాహె గొప్పలు చెప్పుకున్నాడు. చివరికి వాహె, గ్రాహమ్‌లు ఇద్దరూ బ్రిడ్జివాటర్ కేసులో డిఫెన్స్ లాయర్లుగా వ్యవహరించారు.

వాంజెట్టి బెయిల్ కోసం లాయర్లు మొదట్లో ప్రయత్నించారు. కానీ ప్రాసిక్యూటర్ ఆ ప్రయత్నానికి అడ్డుపడ్డాడు. వాంజెట్టి సౌత్ బ్రెయిన్‌ట్రీ కేసులో ఉన్నాడని గుర్తించిన ఐదుగురు ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యాలు తమ దగ్గరున్నందున అతనికి బెయిల్ ఇవ్వరాదని ప్రాసిక్యూటర్ వాదించాడు. కేసులో డిఫెన్స్ కోసం ఏర్పాట్లు చేసుకొనేందుకు వాంజెట్టిని బెయిల్ పై విడుదల చేయాలని డిఫెన్స్ లాయర్లు న్యాయమూర్తిని అభ్యర్థించారు. ప్లిమత్‌లో ఉన్న వాంజెట్టి స్నేహితులంతా కేసు విచారణ పూర్తయ్యే వరకూ తమ ఆస్తులన్నీ కోర్టు ఆధీనంలో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నా కూడా బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. వాంజెట్టిపై విచారించదగ్గ నేరం ఉందని ప్రాథమిక విచారణ అనంతరం 1920 జూన్ 11న బ్రాక్‌టన్ పోలీసు కోర్టు జడ్జి థార్న్‌డిక్ ప్రకటించాడు. ఆ తర్వాత పదకొండు రోజులకే ప్లిమత్‌లో న్యాయమూర్తి థేయర్ జూరీని* ఎంపిక చేసి కేసు విచారణ చేపట్టాడు.

అరవై మూడేళ్ళ జడ్జి వెబ్‌స్టర్ థేయర్ లాయర్‌గా బాగా సంపాదించి మధ్య తరగతి వర్గం నుంచి సంపన్న వర్గంలోకి ఎగబాకాడు. బోస్టన్‌కు నలభై మైళ్ళ దూరంలో ఉన్న వర్సెస్టర్‌లో స్థిరపడిన థేయర్ స్వతహాగా రాడికల్ వ్యతిరేకి. అప్పటికి కొద్దినెలల క్రితమే క్రిమినల్ ఎనార్కీ చట్టాన్ని ఉల్లంఘించిన సెర్గీ జాగ్రాఫ్ అనే అరాచకవాదిపై థేయర్ కోర్టులో విచారణ జరిగింది. జాగ్రాఫ్ కేవలం తన భావాలను ప్రకటించాడే తప్ప వాటిని ఆచరించేందుకు ఎలాంటి కార్యక్రమం చేపట్టలేదని సాక్షులు చెప్పారు. ఫలితంగా జాగ్రాఫ్‌ను జూరీ నిర్దోషిగా ప్రకటించింది. జూరీ నిర్ణయాన్ని తప్పుపట్టడం ద్వారా థేయర్ రాడికల్స్ పట్ల తన వ్యతిరేకతను చాటుకున్నాడు. వాంజెట్టి దృష్టిలో థేయర్ "వల్ల గౌను తొడుక్కున్న త్రాచు".

---

* అమెరికాలో ప్రతి క్రిమినల్ కేసు విచారణా న్యాయమూర్తితో పాటు జూరీ సమక్షంలో జరుగుతుంది. జూరీ సభ్యులుగా స్థానిక పౌరులను ఎంపిక చేస్తారు. కేసు కేసుకూ విడిగా ఈ ఎంపిక జరుగుతుంది. నిందితుడు దోషా నిర్దోషా అన్న విషయంపై తీర్పు చెప్పే అధికారం జూరీది. కాగా కేసులోని చట్టపరమైన అంశాలపై నిర్ణయం ప్రకటించే అధికారం న్యాయమూర్తిది. నేరం నిరూపితమైనట్టు జూరీ ప్రకటిస్తే శిక్ష విధించే అధికారం కూడా న్యాయమూర్తికే ఉంటుంది.

బ్రిడ్జివాటర్ కేసులో ప్రాసిక్యూటర్‌గా నార్‌ఫోక్ కౌంటీ జిల్లా అటార్నీ కట్జ్‌మన్ వ్యవహరించాడు. నలభై ఏళ్ళ ఫ్రెడరిక్ గున్ కట్జ్‌మన్ తండ్రి జర్మన్. తల్లి స్కాటిష్ వనిత. డెడ్‌హాం పట్టణం పక్కనే ఉన్న ఒక పల్లెటూళ్ళో పేదరికంలో కట్జ్‌మన్ బాల్యం గడిచింది. ఎలాగో హార్వర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించే మెట్రిక్యులేషన్ పూర్తి చేసి బి.ఎ. పాసయ్యాడు. బోస్టన్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి లాయర్‌గా డబ్బూ పలుకుబడీ సంపాదించి జిల్లా అటార్నీగా నియమితుడయ్యాడు. కరడు గట్టిన రాడికల్ వ్యతిరేకిగా మారాడు.

బ్రిడ్జివాటర్ కేసులో జూరీ సభ్యులుగా ఎంపికయిన వ్యక్తుల్లో ఒకరు ప్లిమత్ కార్డేజ్ కంపెనీలో ఫోర్‌మన్. సమ్మెలో పాల్గొన్నందుకు వాంజెట్టిని ఆ కంపెనీ పనిలోంచి తీసేసింది. పైగా ఆ ప్రాంతంలోని పారిశ్రామికవేత్తల బ్లాక్‌లిస్ట్‌లో వాంజెట్టి పేరుంది. అంతేకాక మొత్తంగా రాడికల్స్ పట్ల వ్యతిరేకత దేశవ్యాప్తంగా ఆవహించి ఉన్న రోజుల్లో జూరీలు అందుకు మినహాయింపుగా స్వచ్ఛమైన స్ఫటికాల్లా ఉంటాయని అనుకోవడం కష్టం.

బ్రిడ్జివాటర్ కేసు 1920 జూన్ 22న ప్రారంభమైంది. ఫెలికని ప్రతిరోజూ కోర్టుకు హాజరై అక్కడ జరిగింది గమనించి నోట్స్ రాసుకునేవాడు. ఉదయాన్నే రైల్లో బోస్టన్ నుంచి బయల్దేరి ప్లిమత్ చేరేవాడు. ఆరోజు కేసు విచారణ గురించిన సమాచారం సేకరించుకొని ఒంటిగంట తర్వాత రైల్లో తిరిగి బోస్టన్ కెళ్ళేవాడు. సాయంత్రం ఐదింటికల్లా బోస్టన్‌లోని దినపత్రిక లన్నిటికీ కేసు వార్త అందించేవాడు. అర్ధరాత్రి వరకూ లా నొటిజియ కార్యాలయంలో కంపోజిటర్‌గా పనిచేసేవాడు. ఆ దినపత్రికలో ప్రతిరోజూ శాక్కో, వాంజెట్టి గురించిన ఏదో ఒక వ్యాసాన్నో, వార్తనో అచ్చేయించేవాడు. మొదట్లో ఆ దినపత్రిక తప్ప మిగిలినవేవీ కేసుగురించి పెద్దగా పట్టించుకోలేదు. ఇటాలియన్లకు మాత్రమే బ్రిడ్జివాటర్ కేసు గురించి కొద్దో గొప్పో తెలుస్తుండేది.

# 3

**మ**సాచూసెట్స్‌లోని బ్రిడ్జివాటర్ పట్టణంలో 1919 డిసెంబర్ 24 ఉదయం ఏడింటికి నలుగురు బందిపోట్లు దోపిడీకి విఫలయత్నం చేశారు. కార్మికుల జీతాల డబ్బును రవాణా చేస్తున్న ఒక ఫ్యాక్టరీ ట్రక్కుపై దాడిచేసిన ఆ బందిపోట్లు కాల్పులు జరిపి పారిపోయారు. అందులో ఒక బందిపోటు దగ్గర షాట్‌గన్, మరో ఇద్దరి వద్ద హాండ్‌గన్స్ ఉన్నాయని సాక్షుల కథనం. షాట్‌గన్ బందిపోటు వాంజెట్టి అని ప్రాసిక్యూషన్ కథ అల్లింది.

నేరం జరిగిన కొద్దిసేపటికి రంగంలోకి దిగిన పింకర్‌టన్ ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెంట్లతో ఐదుగురు ప్రత్యక్ష సాక్షులు ఐదు వేర్వేరు కథనాలు చెప్పారు. వారు విడివిడిగా చెప్పిన బందిపోట్ల రూపురేఖలకు పొంతనలేదు. షాట్‌గన్ బందిపోటు రష్యన్ లేదా పోల్ లేదా

ఆస్ట్రియన్ అయివుంటాడని సాక్షి ఆల్ఫ్రెడ్ కాక్స్ చెప్పాడు. ముదురు రంగులో అంట కత్తిరించిన బూడిద రంగు మీసకట్టుతో ఉన్నాడని, నెత్తిమీద టోపీ లేదని చెప్పాడు. టౌన్ కానిస్టేబుల్ బెంజమిన్ బౌల్స్ కథనం ప్రకారం షాట్‌గన్ బందిపోటు ఇటలీ లేదా పోర్చుగీసు దేశస్థుడై ఉంటాడు. లేతమొహం, ఎర్రటి బుగ్గలు, నల్ల ఓవర్‌కోటు వేసుకున్నాడు. మరో సాక్షి హెర్డింగ్ ఆ బందిపోటును చూసినప్పుడు అతను నల్లటోపీ, నల్లకోటుతో ఉన్నాడు. మొహాన్ని మాత్రం హెర్డింగ్ చూడలేదు. అతను పోలాండ్ దేశస్థుడై ఉంటాడని చెప్పాడు.

వాంజెట్టి పోలికలకూ, ఆ సాక్షుల్లో ఏ ఒక్కరు చెప్పిన పోలికలకూ సంబంధమే లేదు. గుబురు మీసాలు, పొడుచుకొచ్చిన బుగ్గ ఎముకలూ వాంజెట్టి ప్రత్యేకతలు. ముదురు ముఖంతో బలిష్టంగా ఉంటాడు. అయితే పింకర్‌టన్ ఏజెంట్లకు సాక్షులు చెప్పిన ఈ వివరాలు నమోదైన రికార్డు కోర్టు దృష్టికి, డిఫెన్స్ లాయర్ల దృష్టికీ రాకుండాపోయింది. అందువల్ల ప్రాసిక్యూషన్ అదే సాక్షులతో అబద్ధాలు చెప్పించింది. వాంజెట్టి రూపురేఖలను వాళ్ళు చూసిన షాట్‌గన్ బందిపోటుగా చెప్పించేందుకు ప్రయత్నించింది.

కేసు విచారణలో బౌల్స్ సాక్ష్యం చెప్తూ తను చూసిన షాట్‌గన్ బందిపోటుకు మీసాలు గుబురుగా ఉన్నాయన్నాడు. వాంజెట్టినే ఆ బందిపోటని నిస్సిగ్గుగా ప్రకటించాడు. వాంజెట్టి పోలికలన్నీ సాక్షి హెర్డింగ్ ఏకరువుపెట్టాడు. షాట్‌గన్ బందిపోటు వాంజెట్టినే అని తాను చెప్పలేనప్పటికీ అతనికీ వాంజెట్టికి పోలికలున్నాయని కాక్స్ చెప్పాడు. బందిపోట్ల కారు డ్రైవర్‌గా వాంజెట్టిని మరో సాక్షి గుర్తు పట్టింది. (కారు నడపడం, తుపాకీ పేల్చడం ఒకేసారి చేయడం అసాధ్యం. నిజానికి వాంజెట్టికి కారునడపడం రానేరాదు.)

ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున చివరి ప్రత్యక్షసాక్షి పద్నాలుగేళ్ళ ఫ్రీమన్‌షా. వాంజెట్టికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన సాక్ష్యాలు ఎంత బలహీనమైనవో చెప్పేందుకు ఇతని సాక్ష్యం సరిపోతుంది. దినపత్రికలు అమ్మే ఈ సాక్షి ఒక చెట్టుచాటున దాక్కొని సంఘటనను చూసానని చెప్పాడు. షాట్‌గన్ బందిపోటు ముఖాన్ని ఒక్క క్షణం మాత్రమే చూశానన్నాడు. అతను పరుగెత్తిన పద్ధతిని బట్టి అతను విదేశీయుడని చెప్పగలనన్నాడు. ఫ్రీమన్ షాను లాయర్ వాహె క్రాసు పరీక్ష చేశాడు :

*వాహె : అతనే దేశస్థుడు?*

*షా : ........యురోపియన్.*

*వాహె : అంటే ?*

*షా : ఇటాలియన్ లేదా రష్యన్.*

*వాహె : రష్యనా ? ఇటాలియనా ?*

*షా : అది ఖచ్చితంగా చెప్పలేను.*

*వాహె : ఇటలీ, రష్యా దేశస్థులు స్వీడన్, నార్వే దేశస్థులకన్నా భిన్నంగా పరిగెత్తుతారా?*

షా : అవును.

వాహె : లేదా ఏమిటి ?

షా : కాస్త వంగి పరిగెడతారు.

వాహె : ఇటాలియన్లు, రష్యన్లు వంగి పరిగెడతారా ?

షా : ..... నాకు తెలియదు.

వాహె : స్వీడన్ వాళ్ళు ఎలా పరిగెడతారో నీకు తెలుసా ?

షా : తెలియదు.

వాహె :అతను రష్యా, ఇటలీ, గ్రీక్, బ్రెజిల్, మెక్సికో దేశాల్లో ఏదో ఒక దేశస్థుడై వుండవచ్చా?

షా : అవును.

వాహె : లేదా జపాన్ దేశస్తుడైవుండవచ్చా?

షా : కావచ్చు.

వాహె : అతను జపాన్ దేశస్తుడై ఉంటాడంటావా ?

షా : కాదు

వాహె : అతను జపాన్, చైనా, ఆఫ్రికా దేశస్తుడని నువ్వు చెప్పబోతు ............అవునా?

షా : అవును. అతను అమెరికన్ కూడా కాదు.

ఫ్రీమన్ షా ఒక్క క్షణం మాత్రమే షాట్‌గన్ బందిపోటు ముఖం చూసినప్పటికీ జుట్టు పొడవు నుంచి మీసకట్టు, రంగు, రూపు రేఖల వరకూ చెప్పగలిగాడు. మిగిలిన బందిపోట్లను కూడా చూశానని అతనన్నప్పటికీ వారి వివరాలు మాత్రం చెప్పలేకపోయాడు.

నేరస్థలంలో దొరికిన షాట్‌గన్ బుల్లెట్, వాంజెట్టి దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పబడ్డ బుల్లెట్లూ ఒకే కంపెనీవని ప్రాసిక్యూషన్ వాదించింది. అయితే వాంజెట్టి దగ్గర బుల్లెట్లు స్వాధీనపర్చుకున్నట్టు వ్రాతపూర్వక సాక్ష్యాధారాలు లేవు. వాంజెట్టి దగ్గర బుల్లెట్లు స్వాధీనపర్చుకున్నానని చెప్పిన పోలీసు అధికారి కొనొలి బుల్లెట్లను ఖచ్చితంగా గుర్తించలేకపోయినప్పటికీ వాటిని సాక్ష్యాధారాలుగా కోర్టు స్వీకరించింది.

బ్రిడ్జివాటర్‌లో నేరం జరిగింది క్రిస్మస్ ముందురోజు. క్రైస్తవులు ఆ రోజును కూడా పండుగ దినంగా జరుపుకోవడం సంప్రదాయం, ఆ రోజున చేపలు ఎక్కువగా అమ్ముడుపోతాయని ఊహించి ముందుగానే వాంజెట్టి బోస్టన్‌నుంచి ఒక బ్యారెల్ చేపలు తెప్పించాడు. కార్సొ అండ్ కన్నిజొ కంపెనీనుంచి అమెరికన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆ చేపలు ప్లిమత్‌లో వాంజెట్టికి అందాయి. డిసెంబర్ 23న రవాణా అయిన ఆ చేపలను డిసెంబర్ 24 ఉదయం నుండి ప్లిమత్ వీధుల్లో తిరుగుతూ వాంజెట్టి అమ్మాడు. వాంజెట్టికి సన్నిహితంగా ఉండే మేడమ్ బ్రిని కొడుకు బెల్ట్రాంకో బ్రిని అతనికి ఆ రోజు చేపల అమ్మకంలో సహాయపడ్డాడు. బ్రిని, ఆమె కొడుకు తోపాటుగా ప్లిమత్ వాసులైన పన్నెండుమంది ఇటాలియన్లు ఈ విషయం గురించి సాక్ష్యం

చెప్పారు. వాంజెట్టికి అంటకత్తిరించిన మీసాలు ఎప్పుడూ లేవనీ, గుబురు మీసాలే ఉన్నాయనీ ఒక పోలీసూ, ఒక క్షురకుడూ, మరొకరు కూడా సాక్ష్యం చెప్పారు.

తననూ, శాక్కోనూ, అతని భార్య రోజినానూ సాక్ష్యం చెప్పనివ్వమని వాంజెట్టి చేసిన సూచనను డిఫెన్స్ లాయర్లు త్రోసిపుచ్చారు. శాక్కో, వాంజెట్టి సాక్షులుగా మారితే క్రాసు పరీక్షలో వారి అరాచకవాద రాజకీయాల గురించి ప్రాసిక్యూటర్ అడుగుతాడనీ, దానివల్ల జూరీకి జడ్జికి దురభిప్రాయం కలిగే అవకాశం ఉందనీ ఆ లాయర్లు భయపడ్డారు. అప్పటివరకూ రాని రాజకీయాల ప్రస్తావనను తమకు తామే ప్రస్తావించి కేసును చెడగొట్టుకోవద్దని ముద్దాయికి సలహా ఇచ్చారు. కానీ ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ మాత్రం రాజకీయ ప్రస్తావన చెయ్యకుండా వదల్లేదు. బ్రినీనీ, ఆమె కొడుకునూ వాంజెట్టి రాజకీయ అభిప్రాయాల గురించీ, అతని కోసం ఇంటికి వచ్చిపోయే వారి గురించి తరచి తరచి ప్రశ్నించాడు. కనీసం ఆ తర్వాత నైనా డిఫెన్స్ లాయర్లు వాంజెట్టిని సాక్షిగా విచారించేందుకు ఇష్టపడలేదు. ముద్దాయి డిఫెన్స్ సాక్షిగా తన ఎలిబీ గురించి చెప్పుకోకపోతే అపరాధభావనతో అతనున్నాడని జూరీ, జడ్జి అపోహ పడేందుకు అవకాశం ఉంది. అయినప్పటికీ వాంజెట్టిని డిఫెన్స్ సాక్షిగా విచా చలేదు. చేపలు పంపిన కంపెనీ వాళ్ళనుగానీ, ఆ డాక్యుమెంట్లను గానీ, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ రైల్వే కంపెనీ రికార్డులను గానీ కోర్టుకు తెప్పించేందుకు డిఫెన్స్ లాయర్లు ఏ ప్రయత్నమూ చేయలేదు.

జూలై 1 న వాద ప్రతివాదాలు ముగిసాక జూరీ గదిలో ఐదుగంటల పాటు జూరీ సభ్యులు సుదీర్ఘ చర్చలు జరిపారు. సాక్ష్యాధారాలుగా కోర్టు స్వీకరించని బుల్లెట్ల పొట్లాన్ని వాళ్ళు చట్ట విరుద్ధంగా విప్పదీసి చూశారు. ఆ తర్వాత జూరీ తన తీర్పు ప్రకటించింది. దాని సారాంశం: బ్రిడ్జివాటర్‌లో 1919 డిసెంబర్ 24 న వాంజెట్టి డబ్బు దోపిడీ చేసేందుకు ప్రయత్నించాడు. హత్యా ప్రయత్నం చేశాడు. షాట్‌గన్‌తో బుల్లెట్ల వర్షం కురిపించాడు.

*"మొదటి ప్రపంచయుద్ధంలో పోరాడిన అమెరికన్ సైనికులను తలపించే విధంగా జూరీ సభ్యులు తమ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించారని"* జడ్జి థేయర్ పొగిడాడు.

జూరీ తీర్పుపై డిఫెన్స్ లాయర్లు అప్పీలు దాఖలు చేయకపోవడంతో 1920 ఆగస్టు 16న జడ్జి థేయర్ వాంజెట్టికి పన్నెండేళ్ళ నుంచి పదిహేనేళ్ళ వరకూ జైలు శిక్ష విధిస్తున్నట్టు ప్రకటించాడు.

# 4

**ఊ**హించని ఈ పరిణామంతో వాంజెట్టి బిత్తరపోయాడు. అరెస్టయిన రోజు నుంచి నాలుగు నెలల్లోగా గిర్రున తిరిగిన కాలచక్రం ఘోరంగా కాటేసింది. ఏ క్రూర వ్యవస్థను కూలదోయాలని అనుకున్నాడో అదే అతను చేయని నేరానికి శిక్ష విధించింది.

జైలు నుంచి 1920 అక్టోబర్ 1 న వాంజెట్టి తన తండ్రికి మొదటిసారిగా లేఖ రాశాడు:

మీకు శుభవార్త చెప్పాలనే ఆశవల్ల ఈ క్షణం వరకూ మీకు లేఖ రాయాలన్న కోరికను చంపుకున్నాను.

పరిస్థితులు దురదృష్టకరంగా పరిణమిస్తున్నాయి. అందువల్ల మీకు లేఖ రాయాలని నిర్ణయించుకున్నాను. నా జీవితంలో జరిగిన ఈ ఘటన మిమ్మల్ని ఎంతగా బాధిస్తుందో నాకు తెలుసు. ఈ ఆలోచనే నన్నెక్కువగా బాధపెడుతోంది. నేనెంత నిబ్బరంగా ఉన్నానో అంతే నిబ్బరంగా ఉండమని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. కానీ, నా మిత్రులు ఇటలీకి పంపిన అనేక ఉత్తరాలు, వార్తా పత్రికల కత్తిరింపులూ చేరకపోవడంవల్ల మీకు అన్ని వాస్తవాలూ తెలుసోలేదో నాకు తెలియదు. ఇటాలియన్ లేదా అమెరికన్ అధికార్లు నాకు సంబంధించిన ఉత్తరాలను సెన్సార్ చేస్తున్నారని నేననుకోవాల్సి వస్తోంది. ఏమైనప్పటికీ మీకు కొన్ని లేఖలు చేరాయి. కాబట్టి మీకు నా కేసు విచారణ స్వభావం గురించీ దాని ఫలితం గురించీ తెలుసని నాకు తెలుసు. నాపై మోపిన కేసు-చట్టబద్ధతకు వ్యతిరేకంగా జరిగిన అసలైన నేరం. మీరు పంపిన గ్రీటింగ్స్‌ను ఒక మిత్రుడు అందజేసాడు. నేను నిర్దోషినని మీరు నమ్ముతున్నారనీ, మీరు క్షేమంగా ఉన్నారనీ శుభవార్త కూడా పంపాడు. అది నాకు అమూల్యమైన ఊరట కలిగించింది. అవును నేను నిర్దోషిని.......నేను హత్య చేశానని ఇప్పుడు వాళ్ళు ఆరోపిస్తున్నారు. నేనెప్పుడూ ఎవర్నీ చంపలేదు. గాయపర్చలేదు. దోచుకోలేదు. ఈ కేసును విచారించిన పద్ధతిలో విచారించినట్లైతే క్రీస్తును కూడా వాళ్ళు నేరస్తుడిగా నిర్ధారిస్తారు. నా తరపున సాక్ష్యం చెప్పేందుకు సాక్షులున్నారు. నా శక్తులన్నీ ధార పోసి పోరాడతాను. (మా) ఆయుధాలు సమానమైనవికావు. ఇది తాడో పేడో తేల్చుకునే పోరాటం అవుతుంది. నాకు వ్యతిరేకంగా అనంతశక్తిలో చట్టం నిలబడుతుంది. నిర్దోషులను దండించే కళలో ఆరితేరిన రక్షకభటులు నాకు వ్యతిరేకంగా నిల్చుంటారు..........రాజకీయ ద్వేషం, జాతి వివక్షత కూడా నా కెదురుగా బారులు తీరాయి. మానవుల దిగజారుడుతనం అత్యంత ఘోరంగా ఉన్న ఈ కాలంలో ఈ దేశంలో బంగారానికున్న మహోన్నతశక్తి నాకెదురు నిల్చి ఉంది. నాపై అన్ని రకాల అసహ్యకరమైన అబద్ధాలు చెప్పేందుకు బంగారంమీది ఆశ కొందరు అల్పులను ప్రేరేపించింది. ప్రజలు గుర్తించిన నా నిర్దోషిత్వమూ, నన్ను ప్రేమించి నాకు సహాయ పడే కొందరు మంచి మనుషుల ప్రేమాభిమానాలూ తప్ప భయానకమైన నా శత్రుకూటమిని ఎదుర్కొనేందుకు నా దగ్గరేమీ లేదు. సామాన్య ప్రజానీకం నేను నిర్దోషినని ప్రకటిస్తోంది. నేను విడుదల కావాలని కోరుతోంది. నా కోసం వాళ్ళెంత చేశారో చేస్తున్నారో చేస్తారో తెలిస్తే మీరు గర్వపడతారు . . .

...........

..... అంతిమంగా న్యాయం ఎప్పుడూ గెలుస్తుంది. నా కేసులో కూడా అలానే జరుగుతుంది ..... నేనే పరిస్థితుల్లో చిక్కుకుంటానో నా అరెస్టుకు కొద్ది రోజుల ముందు ఎవరూహించారు? అందువల్ల నేనిప్పుడున్న భయానక స్థితిలో నుంచి రేపు నాకేం జరుగుతుందో ఎవరు చెప్పగలరు? కాబట్టి భవిష్యత్తు మీద నమ్మకముంచి పోరాటాన్ని కొనసాగిద్దాం...........

*.....నా అరెస్టు వార్తను రహస్యంగా ఉంచొద్దు. మౌనంగా ఉండొద్దు. నేను నిర్దోషిని. మీరు సిగ్గుపడాల్సిందేమీ లేదు. మౌనంగా ఉండకండి. నాపై జరిగిన నేరం గురించి బిగ్గరగా అరిచి అందరికీ చెప్పండి. వందకుంభకోణాల్లో, వంద వైఫల్యాల్లో పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు పోలీసులు నిజాయితీ పరుడైన మనిషిని జైలుకు పంపారని ప్రపంచానికి చాటి చెప్పండి.........మౌనంగా ఉండకండి. మౌనం అవమానకరమౌతుంది..................*

బ్రిడ్జివాటర్ కేసులో వాంజెట్టికి శిక్ష విధించిన తర్వాతనే బ్రెయిన్‌ట్రీ కేసులో శాక్కో, వాంజెట్టిలను నిందితులుగా చూపుతూ పోలీసులు కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. శిక్షపడిన ఖైదీగా ఈ కేసులో వాంజెట్టి కోర్టు ముందు నిల్చోవాలి. దాని ప్రభావం న్యాయమూర్తి మీదా, జూరీ మీదా తప్పని సరిగా ఉంటుంది. కాబట్టి బ్రిడ్జివాటర్ కేసును కట్జ్‌మన్ త్వరగా పూర్తి చేయించాడు.

ప్రముఖ న్యాయవాదులు విలియం థామ్సన్, హెర్బర్ట్ ఎహర్మన్ ఒక సందర్భంలో ఈ కేసు గురించి ప్రస్తావిస్తూ *"తర్వాత డెడ్‌హాం (కోర్టు)లో ప్రదర్శించబడ్డ విషాద నాటకానికి ఇది మొరటు డ్రెస్ రిహార్సల్"* అన్నారు.

రాబర్టా స్ట్రాస్ కూడా శాక్కో-వాంజెట్టి కేసు గురించి రాసిన గ్రంథంలో దాదాపు యిలాంటి మాటే అంది:

*ప్లిమత్‌లో వాంజెట్టిపై జరిగిన కేసు శాక్కో, వాంజెట్టిలపై డెడ్‌హాంలో జరుగనున్న కేసు విచారణకు ముందుమాట లాంటిది.*

బ్రిడ్జివాటర్ కేసులో వాంజెట్టికి శిక్ష విధించిన రెండురోజులకు కెప్టెన్ విలియం ప్రొక్టర్‌ను సౌత్ బ్రెయిన్ ట్రీ కేసులో నేర పరిశోధన నుంచి కట్జ్‌మన్ తప్పించాడు. మైకేల్ స్టెవార్ట్‌తో రికార్డు తయారు చేయించి శాక్కో, వాంజెట్టిలపై కేసు దాఖలు చేశాడు. వాంజెట్టికి శిక్ష విధించి నెల రోజులు కాక మునుపే ఖైదీలిద్దరి సమక్షంలో ప్రాథమిక విచారణ జరిపి సెప్టెంబర్ 11న సౌత్ బ్రెయిన్ ట్రీ కేసును డెడ్‌హాం సుపీరియర్ కోర్టు క్రిమినల్ సెషన్స్‌కు పంపుతూ క్విన్సీలోని పోలీసు కోర్టు గ్రాండ్ జూరీ* తీర్మానించింది.

# 5

బ్రిడ్జివాటర్ కేసులోని చేదు అనుభవం వల్ల సౌత్‌బ్రెయిన్‌ట్రీ కేసులో న్యాయస్థానాల్లోనూ, బయటా కూడా పకడ్బందీగా పోరాటం చేయాలని డిఫెన్స్ కమిటీ నిర్ణయించింది. సమర్థుడైన

* *కేసులో పోలీసులు దాఖలు చేసే సాక్ష్యాధారాల రికార్డును పరిశీలించి సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి పైకోర్టు విచారించదగ్గ నేరమని భావిస్తే కేసును అక్కడికి పంపే అధికారం పోలీసు కోర్టు గ్రాండ్ జూరీకి ఉంది.*

లాయర్ కోసం వెతుకుతున్న ఫెలికనికి ఐ.డబ్ల్యు.డబ్ల్యు స్థాపకులు, అరాచకవాదనాయకులు అయిన ట్రెస్కా, మేడమ్ ఎలిజబెత్ గుర్లీఫ్లిన్‌లు ప్రముఖ లాయర్ ఫ్రెడరిక్ మూర్‌ను పరిచయం చేశారు.

పొడవైన గోధుమరంగు జుట్టుతో పొట్టిగా బలిష్టంగా ఉండే కాలిఫోర్నియా లాయర్ మూర్‌కు అరాచకవాద భావాల్లో నమ్మకముంది. ఒక రైల్వే కంపెనీకి లాయర్‌గా పని చేస్తుండగా ఆయనకు కార్మిక సంఘాల పట్ల ఆసక్తి పెరిగింది. కార్మికులపై పెట్టిన క్రిమినల్ కేసులను వాదించేందుకు రైల్వే కంపెనీని వదులుకున్నాడు. దేశమంతటా తిరుగుతూ రాడికల్స్‌కు లాయర్‌గా పనిచేశాడు. లారెన్స్‌లో 1912లో జరిగిన ప్రముఖ పారిశ్రామిక సమ్మె సందర్భంగా అరెస్టయిన జియోవాన్నిట్టి లాంటి ప్రముఖ అరాచక వాదుల తరపున వాదించి విజయం సాధించడం వల్ల రాడికల్స్‌లో ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. ఒక ఆయిల్ కంపెనీ అధికారి ఇంటి మీద డైనమేట్ పేల్చిన ఐ.డబ్ల్యు.డబ్ల్యు కార్యకర్తను నిర్దోషిగా విడుదల చేయించడంతో పలు కార్మిక సంఘాలలో ఆయనకు పలుకుబడి పెరిగింది.

ప్రతిభా సంపన్నుడైన మూర్‌కు పట్టుదలతో, సాహసంతో కేసును ఢీకొనే శక్తి ఉంది. అయితే జీవితం పట్ల ఆయనకున్న నిర్లక్ష్యధోరణీ, కోర్టులో వ్యవహరించే తీరూ ఆయన పట్ల ఎవరికీ సదభిప్రాయం కలిగించవు. తన క్లయింట్ నిర్దోషి అని నిర్ణయించుకుంటే ఆరునూరైనా సమర్థించేవాడు. ఏ ఆటంకాలెదురైనా తనదైన ధోరణిలో ఢీకొనేవాడు. సాక్షులను భయపెట్టేందుకు వెనుకాడేవాడు కాదు. అప్టన్ సింక్లేర్ శాక్కో-వాంజెట్టి కేసు గురించి రాసిన నవల బోస్టన్‌లో లాయర్ మూర్‌ను ప్రశంసనీయమైన పాత్రగా చిత్రీకరించాడు. కేసు గెల్చేందుకు ఎలాంటి పద్ధతులకైనా వెనుకాడని అతని చర్యలవల్ల ఒక్కొక్కసారి క్లయింట్లు నష్టపోయే పరిస్థితి ఏర్పడేది. అతని పొడవైన జుట్టు, కోర్టులోనే చెప్పులు విడిచి కూర్చునే వైఖరి, న్యాయమూర్తితో ఘర్షించే ధోరణి శాక్కో, వాంజెట్టిలకు చెరుపు చేశాయని పలువురి అభిప్రాయం. డబ్బు విషయంలో మూర్ నిజంగా అరాచకవాదే. విచ్చలవిడిగా ఖర్చు పెట్టేవాడు. తనకు వారానికి 150 డాలర్ల ఫీజుతో పాటు పై ఖర్చులు కూడా డిఫెన్స్ కమిటి భరించాలని చెప్పాడు. ఆ పై ఖర్చులే కొన్ని వేల డాలర్లవుతుండేవి. అంతేగాక సాక్షుల కోసం, సమాచార సేకరణ కోసం కొందరు డిటెక్టివ్‌లను రంగంలోకి దించి డబ్బు వెదజల్లాడు. అతను పెట్టే ఖర్చులను డిఫెన్స్ కమిటి భరించలేని స్థితి కూడా ఒక్కోసారి ఏర్పడే ది. హఠాత్తుగా మాయమయ్యే దురలవాటు కూడా మూర్‌కు ఉంది. వెతగ్గావెతగ్గా ఏదో ఒక లైబ్రరీలో అదేపనిగా పుస్తకాలు చదువుతూ కన్పించేవాడు. కాన్సర్‌తో బాధపడే మూర్ మాదక ద్రవ్యాలు కూడా సేవించేవాడు. తరచుగా ఎవరో ఒక అపరిచిత స్త్రీని వెంటేసుకు తిరిగేవాడు.

ఎన్ని అవలక్షణాలున్నప్పటికీ మూర్‌ను కేసులో ఉంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒకసారి మూర్ కేసు చేపట్టాడంటే అతన్ని వదిలించుకోవడం మహా కష్టం. కోర్టులో మూర్ పనితీరు, అతని బయటి ప్రవర్తన వివాదాస్పదం అయినప్పటికీ మూర్ రాకతో డిఫెన్స్ కమిటీకి కొత్త జవసత్వాలొచ్చాయి. ఈ కేసును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళడంలో మూర్ పాత్ర

ప్రముఖ మైనది. 'శాక్కొ - వాంజెట్టి కేసు'గా ప్రపంచానికి తెలిసిన ఈ కేసు సృష్టికర్త మూర్ అని కొందరు సమకాలీన మేధావుల అభిప్రాయం.

రాడికల్స్ పట్ల రాజకీయ వ్యతిరేకతతో, కక్ష సాధించే దురుద్దేశంతో శాక్కొ, వాంజెట్టిలపై ప్రభుత్వం కేసు నడుపుతోందని లాయర్ మూర్ సరిగ్గా అంచనావేశాడు. అందువల్ల కేవలం న్యాయస్థానాల్లోనే కాక న్యాయస్థానాల బయట కూడా ఒక పెద్ద రాజకీయ ఉద్యమాన్ని నిర్మించడం ద్వారానే వారిద్దరికీ విముక్తి లభించగలదని భావించాడు. డిఫెన్స్‌కమిటీని సంఘటిత పర్చేందుకు కృషి చేశాడు.

మూర్ 1920 ఆగస్టులో బోస్టన్‌లో అడుగుపెట్టే నాటికి డిఫెన్స్ కమిటి కార్యాలయం లా నొటిజియ పత్రిక కార్యాలయంలో ఒక చిన్నగదిలో ఉండేది. కమిటీకి తనదైన ఒక కార్యాలయం ఉండాలని చెప్పి ఒక బిల్డింగ్‌ను అద్దెకు తీసుకొని మంచి ఆఫీసు నెలకొల్పాడు. కోర్టు వ్యవహారాలు చూసేందుకు తనకు మరొక ఆఫీసు తెరిపించాడు. మూర్, ఫెలికని తమ శక్తినంతా ధారపోసి తమకు తెలిసిన అరాచకవాదుల సహకారంతో రాడికల్స్‌లోనే కాక ఇతర సంస్థలలో, మేధావులలో కేసుగురించి విస్తృత ప్రచారం ప్రారంభించారు. *అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్ (ఎ.ఎఫ్.ఎల్), అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ (ఎ.సి.ఎల్.యు), కమిటీ ఫర్ ద ప్రొటెక్షన్ ఆఫ్ ఫారిన్ బార్న్, న్యూ ఇంగ్లాండ్ సివిల్ లిబర్టీస్ కమిటీ (ఎన్.ఇ.సి.ఎల్.సి)* లాంటి సంస్థలు అనేకం క్రమంగా ఉద్యమంలోకి ప్రవేశించి సహాయ సహకారాలందించేందుకు వారు కృషిచేశారు. "మేం ఎన్నటికీ చొచ్చుకు పోలేని వర్గాల్లోకి" కేసును మూర్ తీసుకెళ్ళాడని ఫెలికని ఒక సందర్భంలో చెప్పాడు. మొదట్లో ఇటాలియన్లకూ, ఇతర ప్రవాసులకూ మాత్రమే తెలిసిన కేసు మూర్ రాకతో అమెరికన్‌లందరికీ తెలిసే అవకాశాలేర్పడి విస్తృతమైన మద్దతు పొందింది. శాక్కొ, వాంజెట్టిలకు అన్యాయం జరుగుతోందని దేశ వ్యాప్తంగా తెలిసింది. ఫలితంగా కార్మికులు, పలువురు లిబరల్ మేధావులు, సంపన్న వర్గాల మహిళలు డిఫెన్స్ కమిటీలో చేరి చివరి వరకూ అంకిత భావంతో పని చేశారు. వారి డబ్బును, శ్రమను, కాలాన్ని, ప్రతిష్టను, పరిచయాలను శాక్కొ - వాంజెట్టి కేసు లో న్యాయం కోసం ఉపయోగించారు. అలా కృషి చేసిన మహిళల్లో ఎలిజబెత్‌గ్లెండొవర్‌ఎవాన్స్* గోర్కి నవలలోని **అమ్మ**కు ప్రతిరూపంగా భావించబడింది.

---

* *ఎన్.ఇ.సి.ఎల్.సి. స్థాపకురాలు. విమెన్స్ ట్రేడ్ యూనియన్ లీగ్ లో కూడా పనిచేసింది. ఆమె భర్త సంపన్న లాయర్. పెళ్ళయిన నాలుగేళ్ళకే భర్త చనిపోవడంతో అపార సంపదకు వారసురాలయింది. తనకు వాటా ఉన్న బట్టల మిల్లు కార్మికుల సమ్మెను కూడా సమర్థించింది. పలు సమ్మె పోరాటాల్లో పాలుపంచుకొంది. మహిళలకు ఓటు హక్కు ఉద్యమంలోనూ, కనీస వేతనాల కోసం జరిగిన పోరాటాల్లోనూ పాల్గొంది. అమెరికా అధ్యక్ష పదవికి యూజిన్ డెబ్స్ పోటీ చేసిన సందర్భంలో ఆయనకు మద్దతుగా కాంపెయిన్ నడిపింది. బోస్టన్‌లో పలు సామాజిక సంస్థలలో ఆమె సభ్యురాలు. హేగ్‌లో 1915 లో జరిగిన అంతర్జాతీయ మహిళా సమావేశంలో పాల్గొంది. అప్టన్ సింక్లేర్ తన నవల 'బోస్టన్' లో ఆమెను కథానాయికగా చిత్రించాడు.*

ఆమె తన ప్రేమానురాగాలతో శాక్కొ, వాంజెట్టిల కోసం తీవ్రంగా శ్రమించింది. తన స్నేహితురాలైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రాండిస్ భార్యను, పలు సంపన్న మహిళలను ఆమె ఉద్యమంలోకి సమీకరించగలిగింది.

తన సహాయం పొందిన పలువురు రాడికల్ క్లయింట్లను మూర్ రంగంలోకి దించాడు. తనకు ఎ.సి.ఎల్.యు తో ఉన్న పరిచయాన్ని ఉపయోగించుకున్నాడు. ఆ సంస్థ అధినేత రోగర్ బాల్డ్విన్ అరాచకవాది కావడం వల్ల డిఫెన్స్ కమిటీకి మంచి సహకారం అందింది. న్యూ ఇంగ్లాండ్ సివిల్ లిబర్టీస్ కమిటీ కూడా రంగంలోకి దిగడంతో ఆ సంస్థ ద్వారా బోస్టన్‌లోని సంపన్న కుటుంబాలకు చెందిన ప్రముఖులు ఉద్యమానికి మద్దతు తెలిపారు. అప్పట్లో హార్వర్డ్ లా స్కూల్లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్ కూడా ఉద్యమానికి కొంతమేరకు సహకారం అందించాడు. ఉద్యమం ఉధృతమైన కాలంలో చురుకైన పాత్ర నిర్వహించాడు. ఆయన అప్పటికే ఇద్దరు అమెరికా అధ్యక్షులకు న్యాయసలహాదారుగా పదవులు నిర్వహించి ఉన్నాడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని రస్కొపౌండ్ తదితర ప్రముఖుల మద్దతును కూడా ఫ్రాంక్ ఫర్టర్ సమీకరించ గలిగాడు. కమ్యూనిస్టు పార్టీ డిఫెన్స్ కమిటీ కి తోడ్పడేందుకు మొదట్లో నిరాకరించింది. శాక్కొ భార్య రోజినాను ఫెలికని వెంటబెట్టు కొని బోస్టన్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్ళగా, శాక్కొ, వాంజెట్టిలు అరాచక వాదులూ, బందిపోట్లూ కాబట్టి తాము ఉద్యమంలో పాల్గొన లేమని ఆ నాయకులు తెగేసి చెప్పారనే విమర్శలున్నాయి. కానీ ఉద్యమం ఉధృతమయ్యాక కమ్యూనిస్టులు కూడా తమ పద్ధతిలో అందులో పాల్గొన్నారు.

అప్పటికి వార్తా పత్రికలలో కేసు గురించి జరిగిన ప్రచారం సంతృప్తికరంగా లేదని శాక్కొ, వాంజెట్టిలు భావించడంతో మూర్ ఆ కొరతను తీర్చడానికి పలు పద్ధతుల్లో ప్రయత్నించాడు. ఫెలికని సంపాదకత్వాన *శాక్కొ - వాంజెట్టి డిఫెన్స్ కమిటి బులెటిన్* పేరిట ఒక పత్రికను స్థాపించారు. తన మిత్రుడైన ఇరవై రెండేళ్ళ యువ పాత్రికేయుడు యూజిన్ లయన్స్*ను మూర్ బోస్టన్‌కు రప్పించాడు. అంతర్జాతీయ ప్రచారానికి లయన్స్‌ను వినియోగించాడు. ఆ ఏడాది చివర్లో లయన్స్ ఇటలీ వెళ్ళి ప్రచారం చేసొచ్చాడు. ఇటాలియన్ సోషలిస్టు పత్రిక అవంతి లోకొన్ని వ్యాసాలు అచ్చేయించగలిగాడు. ఇటలీ శాసనసభలో శాక్కొ, వాంజెట్టిల గురించి ప్రస్తావింపజేసాడు. తర్వాత బోస్టన్‌కు తిరిగొచ్చి జర్నలిస్టుగా ఈ కేసు గురించి వ్యాసాలూ, వార్తలూ ప్రచురించాడు. సోషలిస్టు భావాలున్న జర్నలిస్టు జాన్ నికొలస్ బెఫెల్‌ను కూడా బోస్టన్‌కు పిలిపించారు. ప్రముఖ దినపత్రిక న్యూరిపబ్లిక్‌లో బెఫెల్ రాసిన వ్యాసం మొదటి సారిగా దేశవ్యాప్తంగా పాఠకుల దృష్టిని ఆకర్షించింది. ఆర్ట్‌షీల్డ్ అనే మరో జర్నలిస్టు దేశీయ పత్రికలలో కేసు వార్తల ప్రచారం బాధ్యతను స్వీకరించాడు.

---

* *ఆ తర్వాత అమెరికాలో ప్రముఖ పాత్రికేయుడిగా పేరు గాంచాడు. రీడర్స్ డైజెస్ట్ పత్రికకు సీనియర్ ఎడిటర్‌గా పని చేశాడు.*

పత్రికలలో చదివి శాక్కో, వాంజెట్టిలకు జరుగుతున్న అన్యాయానికి స్పందించి పలువురు మేధావులు ఈ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అలాంటి వాళ్ళలో మొదటగా గార్డెనర్ జాక్సన్ పేరు చెప్పాలి. జాక్సన్ బోస్టన్ గ్లోబ్ లో జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. జాక్సన్ భార్య దిన పత్రికల్లో శాక్కో, వాంజెట్టిల గురించి చదివి బాధపడింది. ఆమె ప్రోద్బలంతో 1921లో కేసుపట్ల జాక్సన్‌కు ఆసక్తి కలిగింది. అప్పటినుంచి ఉద్యమంలో చివరివరకూ అలుపెరగని యోధుడిలా పనిచేశాడాయన. ఉద్యమం ఉచ్చస్థాయిలో ఉన్న కాలంలో డిఫెన్స్ కమిటీ కి కార్యదర్శిగా కూడా సమర్థవంతంగా పనిచేశాడు. లిబరల్ భావాలూ, సున్నితమైన మృదువైన స్వభావం జాక్సన్ ప్రత్యేకతలు. ఆయన వ్యక్తిత్వాన్ని, ఉద్యమంలో ఆయన నిర్వహించిన అద్భుత పాత్రను చూసి బోస్టన్‌లోని సంపన్న మహిళ ఒకరు ఆయనతో లైంగిక సుఖాన్ని పంచుకునేందుకు ప్రయత్నించిందని ఫెలికని ఒక సందర్భంలో చెప్పాడు. గార్డెనర్ జాక్సన్, ఆల్డినా ఫెలికని ల అద్భుత వ్యక్తిత్వం డిఫెన్స్ కమిటీ నాయకత్వానికి సమగ్రత చేకూర్చింది. ఫెలికని కృషితో మరికొందరు ఉద్యమంలోకి ప్రవేశించారు. వాళ్ళలో ప్రముఖ పాత్రికేయుడు ఫ్రాంక్ సిబ్లి ముఖ్యుడు.

అప్పట్లో డిఫెన్స్ కమిటీకి కార్యదర్శిగా ఫ్రాంక్ లోపెజ్ పనిచేశాడు. స్పెయిన్ దేశస్తుడయిన ఈ అరాచకవాదిని దేశం నుండి బహిష్కరించేందుకు అమెరికా ప్రభుత్వం అప్పటికే చర్యలు చేపట్టి ఉంది. అయినప్పటికీ ఎలాంటి భయం లేకుండా ఉద్యమంలో ఆయన పనిచేశాడు. చివరకు 1924లో తనను దేశం నుంచి వెళ్ళగొట్టేవరకూ కూడా ఆయన కమిటీకి కార్యదర్శిగా ఉన్నాడు.

నిధుల కోసం డిఫెన్స్‌కమిటి పలు కార్యక్రమాలు చేపట్టింది. మూర్, ఫెలికని స్వయంగా పలువురికి లేఖలు రాసి నిధులు సేకరించారు. ప్రొఫెసర్ గుడాగ్ని, డెంటామోర్, కార్లో ట్రెస్కాలు దేశవ్యాప్త పర్యటన జరిపి ఉద్యమం ఆర్థిక హార్థిక సహాయ సహకారాలు పొందేట్టు చేశారు. కమిటి ఏర్పడిన మొదటి మూడు నెలల్లో ఐదువేల డాలర్లకు పైగా నిధులు సేకరించగలిగారు. నిధుల సేకరణకు 1921 మలో పిక్‌నిక్ పార్టీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మల్లయుద్ధ పోటీలు నిర్వహించారు. ఏడేళ్ళ ఉద్యమ కాలంలో డిఫెన్స్‌కమిటీ 3 లక్షల 60 వేల డాలర్ల నిధులు సేకరించి ఖర్చుపెట్టింది. దేశవ్యాప్తంగా వందలాది కార్మిక సంఘాలూ, ప్రపంచం నలుమూలల నుండి పలుసంస్థలూ నిధులు పంపాయి. ద స్టోరి ఆఫ్ ద శాక్కో - వాంజెట్టి కేస్ ఇన్ క్లూడింగ్ యాన్ ఎనాలిసిస్ ఆఫ్ ద ట్రయల్ పేరిట 1920 డిసెంబర్‌లో డిఫెన్స్ కమిటి అచ్చేసిన పుస్తకం రెండేళ్ళ కాలంలో 75 వేలకాపీలు అమ్ముడయి సంచలనం సృష్టించింది. లక్షల మంది ప్రజల సంతకాలు సేకరించి కమిటీ ప్రభుత్వానికి పిటీషన్లు పంపింది. బ్రిడ్జివాటర్ కేసులో శిక్షపడిన తర్వాత రెండు లక్షల మంది న్యూయార్క్ కార్మికులు సంతకాలు చేసి తనకు మద్దతు తెలియజేశారని వాంజెట్టి తన తండ్రికి రాసిన ఒక ఉత్తరంలో ప్రస్తావించాడు.

# 6

సౌత్ బ్రెయిన్ ట్రీ కేసులో కూడా తననే జడ్జిగా ఉంచమని న్యాయమూర్తి థేయర్ మసాచూసెట్స్ ప్రధాన న్యాయమూర్తి జాన్ ఐకెన్‌ను కోరాడు. ఆయన కోరికను ఐకెన్ మన్నించాడు. బ్రిడ్జివాటర్ కేసులో ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన జిల్లా అటార్నీ కట్జ్‌మన్ ఈ కేసులో కూడా ప్రాసిక్యూషన్ నడపబోతున్నాడు. ఈ అననుకూల పరిస్థితులతో పాటు రాడికల్స్ పట్ల ఉన్మాదం ఇంకా తగ్గని స్థితి దేశమంతటా నెలకొని ఉంది. దానికి తోడు 1920 సెప్టెంబర్ రెండవ వారంలో న్యూయార్క్‌లోని వ్యాపార కేంద్రమైన వాల్‌స్ట్రీట్‌లో ఒక వ్యాగన్ నిండా బాంబులు పేలాయి. దేశవ్యాప్తంగా రాడికల్స్‌పై మరోసారి ఉన్మాదాన్ని రెచ్చగొట్టిన ఈ ఘటనలో 33 మంది చనిపోయారు. మరో 200 మంది తీవ్రంగా గాయపడ్డారు. కోర్టును ఈ ఘటన ప్రభావితం చేయగలదని డిఫెన్స్ కమిటి భయపడింది. 1920 జనవరిలో జరిగిన మరో ఘటన కూడా శాక్కో, వాంజెట్టిలపై మసాచూసెట్స్ అధికార యంత్రాంగపు విద్వేషాన్ని రెచ్చగొట్టింది డిఫాల్కో ఘటన గా ప్రాచుర్యం పొందిన ఈ సంఘటన వల్ల దిన పత్రికలు కేసు పట్ల మరింతగా ఆసక్తి ప్రదర్శించినప్పటికీ, ఆ ఘటన వ్యతిరేక ప్రభావం కేసు విచారణను నీడలా వెంటాడింది.

ప్రావిడెన్స్ రాష్ట్రానికి చెందిన దళారీ సిచెట్టి డిఫెన్స్ కమిటి కోశాధికారి ఆల్డినొ ఫెలికనిని కలుసుకోవడంతో డి ఫాల్కో ఘటన ప్రారంభమైంది. లాయర్ మూర్‌ను కేసునుంచి తొలగించి స్థానిక లాయర్లను నిందితుల తరపున లాయర్లుగా వినియోగింప జేసేందుకు సిచెట్టి రంగంలోకి దిగాడు.* డెడ్ హాం కోర్టులో దుబాసీగా పనిచేసే మేడమ్ డి ఫాల్కోకి సిచెట్టి బంధువు. ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ సోదరుడైన లాయర్ పెర్సీ కట్జ్‌మన్ కూ, మరో లాయర్ ఫ్రాన్సిస్ స్క్వేర్స్ కూ కేసులు తెచ్చిపెట్టే దళారీగా డి ఫాల్కో పనిచేస్తుంటుంది.

ఫెలికని లా నొటిజియ పత్రిక కార్యాలయంలో పనిచేస్తుండగా 1921 జనవరి 2న బెనియమినొ సిచెట్టి, ఎంజెలిన డి ఫాల్కో ఆయన్ను కలిశారు. డెడ్‌హాం కోర్టులో దుబాసీగా పనిచేస్తుందని సిచెట్టి డి ఫాల్కోను పరిచయం చేశాడు. జిల్లా అటార్నీ కట్జ్‌మన్‌కు ఆమె స్నేహితురాలు కాబట్టి కేసులో ఆమె ఎంతైనా సహాయం చేయగలుగుతుందని సిచెట్టి చెప్పాడు. ఫెలికని నమ్మలేదు. డి ఫాల్కో ఎలా సహాయం చేయగలుగుతుందని అడిగాడు. మూర్‌ను,

---

* *తన వద్దకు కేసులు రప్పించుకొనేందుకు లాయర్లు ఏం చేసినా అది అమెరికా న్యాయ శాస్త్రాల ప్రకారం అనైతికం. అయినప్పటికీ అలాంటి పనులు చేయడం అమెరికాలో సర్వసాధారణం. అయితే లాయర్లు తెర వెనక ఉండి దళారుల ద్వారా పని పూర్తి చేయించి క్లయింట్లను రప్పించుకుంటారు.*

కాలహాన్‌ను తొలగించి కేసులో ఫ్రాన్సిస్‌ను, పెర్మి కట్జ్‌మన్‌ను లాయర్లుగా పెట్టుకుంటే ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ కేసునుంచి తప్పుకుంటాడనీ తన అసిస్టెంట్లతో కేసు చేయిస్తాడనీ, కేసును ముద్దాయిలకు అనుకూలంగా మల్చుకునేందుకు అవకాశం కల్పిస్తాడనీ చెప్పి డి ఫాల్కో ఫెలికని ని ఊరించింది కొంత డబ్బు ఖర్చుపెట్టుకో గలిగితే శాక్కో విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పింది. వాంజెట్టి సంగతేమిటని ఫెలికని అడిగాడు

వాంజెట్టి మీద గట్టి సాక్ష్యం ఉంది అతనికి శిక్షపడి ఉంది అతన్ని బయట పడేయడం బాగా కష్టం మీరు డబ్బివ్వడానికి సిద్ధపడితే అతన్ని కూడా విడిపించుకోవచ్చు ...

డిఫాల్కో ఇంకా ఇలా చెప్పుకు పోయింది.

*.. చాలా ఖర్చవుతుంది. జిల్లా అటార్నీకి, ఆయన అసిస్టెంట్లకు జూరీ అధిపతికి డబ్బివ్వాలి. కేసు విచారణ ఒక తతంగంలాగా జరుగుతుంది. వాళ్ళిద్దరిపై కేసు కొట్టేస్తారు...*

కొంతసేపు డి ఫాల్కో మాటలు విన్న తర్వాత తానొక్కడే ఆమెతో మాట్లాడటం మంచిది కాదని ఫెలికని నిర్ణయించుకున్నాడు. డిఫెన్స్ కమిటి సభ్యుడు ఫెలిస్ గుడాగ్నికి కూడా ఈ సంగతి తెలియపర్చాలనుకున్నాడు. మరుసటి రోజు వచ్చి మాట్లాడమని చెప్పి డిఫాల్కోను, సిచెట్టిని పంపేశాడు.

జనవరి 5న డి ఫాల్కో ఫెలికనికి ఫోన్ చేసింది. ఆమె జిల్లా అటార్నీ కట్జ్‌మన్ ఆఫీసు నుంచి మాట్లాడుతోందని ఫెలికని కి అర్థమైంది. అంతా సిద్ధమైందని చెప్పింది. జనవరి 7 రాత్రి తనింట్లో విందు ఏర్పాటు చేస్తున్నాననీ, అక్కడికి ఫ్రెడరిక్ కట్జ్‌మన్, పెర్మికట్జ్‌మన్, ఫ్రాన్సిస్‌లు వస్తారనీ వాళ్ళందరితో నేరుగా మాట్లాడి ఒప్పందం చేసుకోవచ్చనీ చెప్పింది.

మూర్‌కు ఈ సంగతులు తెలిస్తే గొడవ అవుతుందని ఫెలికని భయపడ్డాడు. మూర్‌కు ఈ సంగతి చెప్పనని గుడాగ్ని నుంచి హామీ తీసుకున్నాడు. కానీ ఎలాగో మూర్ ఈ వ్యవహారాన్ని పసిగట్టాడు. జనవరి 7న ఫెలికని దగ్గరకు ఉన్న పళాన ఊడిపడ్డాడు. విందుకెళ్ళడానికి తను ఒప్పుకోనన్నాడు.

ఫెలికని కాస్త ఇబ్బంది పడ్డాడు. విందుకు వస్తానని అప్పటికే మాట ఇచ్చి ఉన్నాడు. వెళ్ళేందుకు సిద్ధమై ఉన్నాడు. మూర్ అభ్యంతరాన్ని కాదని విందుకు వెళ్తానన్నాడు. మూర్ కాస్త మెత్తబడి ఒక షరతు పెట్టాడు.

"రీడ్‌ను కూడా తీసుకెళ్తానంటే నిన్ను వెళ్ళనిస్తాను" అన్నాడు మూర్. రీడ్ మూర్‌తో పనిచేస్తున్న ప్రైవేట్ డిటెక్టివ్.

"విందుకు వెళ్తూ డిటెక్టివ్‌ను వెంట పెట్టుకెళ్ళడాన్ని నేనెలా సమర్థించుకోవాలి? అసందర్భంగా ఉంది. నేనాపని చేయలేను" అన్నాడు ఫెలికని.

ఫెలికని ఒక్కడినే వెళ్ళనిచ్చేందుకు మూర్ సిద్ధంగా లేడు. సాయంత్రం 5.30 గంటలయింది. సరిగ్గా ఆరు గంటలకు డి ఫాల్కో ఇంటికి చేరాలి.

మూర్ వత్తిడికి ఫెలికని లొంగాడు. అసలు విందుకే వెళ్ళకూడదనుకున్నాడు. డి ఫాల్కొకి ఫోన్ చేసి రాలేక పోతున్నానని చెప్పడానికి నిర్ణయించుకున్నాడు. ఏదో ఒక సాకు వెతకాలి. ఫెలికని ఆమెకు ఫోన్ చేశాడు:

"న్యూయార్క్ నుంచి జియోవాన్నిట్టి వస్తాడని ఎదురు చూస్తున్నాను. ఆయన పెద్ద మొత్తంలో డబ్బిస్తానని మాటిచ్చాడు. ఆయన రాలేదు. కాబట్టి నేను అక్కడికొచ్చి వ్యవహారం ఖరారు చేసుకొనే స్థితిలో లేను."

డిఫాల్కొకు ఆశాభంగమయింది. మొత్తం కేసును చెడగొడుతున్నావని ఫెలికనిపై మండిపడింది.

"రేప్పొద్దున ఎనిమిదింటికి డిఫెన్స్ కమిటి ఆఫీసుకు మీరెందుకు రాకూడదు? మనం విషయాలు మాట్లాడుకుందాం."

ఫెలికని చేసిన ఆ ప్రతిపాదనను ఆమె అంగీకరించింది. వస్తానని మాటిచ్చింది.

డి ఫాల్కొ ఇంటికి విందుకెళ్ళకపోయినా ఆమె ఇంట్లో నిజంగా విందు ఏర్పాట్లు జరిగాయోలేదో తెలుసుకోవాలనే ఉత్సుకతను ఫెలికని, మూర్, గుడాగ్ని ప్రదర్శించారు. ఆమె ఇంట్లో ఎవరున్నారో తెలుసుకోవాలనుకున్నారు. మూర్ కారు డ్రైవర్ ఓర్సియాని ని, డిటెక్టివ్ రీడ్‌ను వెంటపెట్టుకొని ఫెలికని రాత్రి పొద్దుపోయాక రహస్యంగా డిఫాల్కొ ఇంటి దగ్గరికి చేరుకున్నాడు. ఆ ఇంటి ముందు చాలా కార్లు ఆగి ఉన్నాయి. వాటి నెంబర్లు నోట్ చేసుకున్నారు. డి ఫాల్కొ చెప్పిన ముగ్గురు లాయర్ల కార్లూ అందులో ఉన్నాయి.

డిఫాల్కొ మరుసటి రోజు డిఫెన్స్‌కమిటి ఆఫీసుకు తప్పక వస్తుంది. ఆమె మాట్లాడే మాటలను రికార్డు చేయాలనుకున్నారు. బోస్టన్ నగరంలో తిరిగి ఒక చోట స్టెనొగ్రాఫిక్ లిజనింగ్ డివైస్‌ను కొని కమిటి బిల్డింగ్ బేస్‌మెంట్‌లో అమర్చారు. ఒక గదిలో మాట్లాడే మాటలను మరో గదిలో ఆ పరికరం ద్వారా వినవచ్చు. గ్వెండొలిన్ బీమిష్ అనే స్టెనో గ్రాఫర్‌ను ఉదయాన్నే ఆఫీసుకు రమ్మని కబురు పెట్టారు. పరికరం ద్వారా తను వినే సంభాషణను ఆమె షార్టుహాండ్‌లో రాయాలి. డి ఫాల్కొతో మాట్లాడుతుండగా తమతో పాటు ఒక మహిళ ఉంటే మంచిదనుకొని కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మారియోన్ స్ప్రాల్ ను కలిసి ఉదయాన్నే రమ్మని చెప్పారు.

మరురోజు ఉదయం అనుకున్న సమయానికి డి ఫాల్కొ రానే వచ్చింది. ఫెలికని, గుడాగ్ని, ఓర్సియాని, మారియోన్ స్ప్రాల్, కమిటి కార్యదర్శి లోపెజ్ ఆఫీసులో ఉన్నారు.

శాక్కొ, వాంజెట్టిలపై కేసు కొట్టించేసేందుకు నలభై వేల డాలర్లు ఖర్చవుతుందని చెప్పింది. డిఫెన్స్ కమిటి నాయకులు అంత డబ్బివ్వ లేమని చెప్పారు.

"ఐదువేల డాలర్లు అడ్వాన్సుగా ఇవ్వండి. మిగిలిన డబ్బు పోగుచేసేందుకు ఎండాకాలమంతా ఉందిగా."

మేడమ్ స్ప్రోల్ జోక్యం చేసుకొని ఇలా అంది.

"డబ్బు పోగుచేయలేకపోతే వాళ్ళకు శిక్ష పడుతుందా?"

"ఖచ్చితంగా".

తర్వాత మాట్లాడుకుందామని చెప్పి డి ఫాల్కోను పంపేశారు.

ఆవిడను అరెస్టు చేయించాలని మూర్ పట్టుబట్టాడు. తద్వారా శాక్కో, వాంజెట్టిల పట్ల అధికారవర్గ వైఖరిని ప్రపంచానికి తెలియజెప్పాలన్నాడు. ఫెలికని ఒప్పుకోలేదు. తనను నమ్మి డి ఫాల్కో వచ్చి మాట్లాడి పోయినందువల్ల ఆమెను ఇబ్బంది పెట్టేందుకు ఫెలికనికి మనస్కరించలేదు. కానీ చివరికి మూర్ వత్తిడికి అతను లొంగక తప్పలేదు.

ఫెలికని ఫిర్యాదుపై డి ఫాల్కో, సిచెట్టిలపై కోర్టులో క్రిమినల్ కేసు నమోదైంది. లాయర్లకు దళారులుగా వ్యవహరించారన్నది నేరారోపణ. ఫెలికని వాంగ్మూలాన్ని నమోదు చేసిన వెంటనే కోర్టు డి ఫాల్కో పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. అదేరోజు ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. బోస్టన్ దిన పత్రికల్లో అది మొదటి పేజీ వార్తయింది.

డి ఫాల్కో మీద కేసులో ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించేందుకు లాయర్ మూర్‌ను కోర్టు అనుమతించింది. బోస్టన్ న్యాయమూర్తి ముర్రే కేసును విచారించాడు.

డి ఫాల్కోకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ పటిష్టమైన సాక్ష్యాధారాలు ప్రవేశ పెట్టింది. డిఫాల్కోతో సంభాషణ జరిపిన డిఫెన్స్ కమిటి నాయకులతో పాటు మేడమ్ స్ప్రోల్, స్టెనోగ్రాఫర్ బీమిష్, డిటెక్టివ్ రీడ్ సాక్ష్యం చెప్పారు. సాక్ష్యం చెప్పిన డిఫెన్స్ కమిటి నాయకులంతా అరాచక వాదులే. కమ్యూనిస్టు స్ప్రోల్‌ను హింసను రెచ్చగొడుతోందని అంతకుముందు శిక్షించారు. ఈ సాక్షుల్లో కొందరు కోర్టులు సాధారణంగా చేయించే ప్రమాణాన్ని చేయడానికి నిరాకరించారు. అమెరికా ప్రభుత్వంలో నమ్మకముందా అన్న ప్రశ్నకు ఫ్రాంక్ లోపెజ్ సమాధానం చెప్పేందుకు ఇష్టపడలేదు. అతనిని కోర్టు ధిక్కార నేరానికి ప్రాసిక్యూట్ చేశారు. ఈ సాక్షులంతా కామ్రేడ్స్ అనే వాస్తవం జడ్జి దృష్టిని ఆకర్షించింది.

జిల్లా అటార్నీ కట్జ్‌మన్, పెర్మీకట్జ్‌మన్, ఫ్రాన్సిస్‌లు కోర్టుకు రప్పించబడ్డారు. తనేపాపం ఎరగనని ఫ్రెడ్ కట్జ్‌మన్ చెప్పాడు. డి ఫాల్కో అరెస్టయ్యే వరకూ ఆమె పేరే తను వినలేదని చెప్పాడు. డిఫాల్కో ఇంటికి విందుకు వెళ్ళిన సంగతి నిజమేనని పెర్మీ, ఫ్రాన్సిస్‌లు అంగీకరించారు. డిఫెన్స్ లాయర్‌గా పనిచేయవలసిందిగా కోరుతూ లాయర్ మూర్ తనతో రెండుమార్లు ఫోన్‌చేసి మాట్లాడాడని ఫ్రాన్సిస్ అబద్దం చెప్పాడు. పెర్మీ, ఫ్రాన్సిస్‌లతో మాట్లాడవలసిందని డిఫెన్స్ కమిటీయే తనను కోరిందని డిఫాల్కో వాస్తవాన్ని తిరగదిప్పి చెప్పింది. ఆ ఇద్దరు లాయర్లు మాత్రం తనను వినియోగించలేదన్నది. డిఫెన్స్ కమిటీ కార్యాలయంలో రెండు పోస్టర్లు

చూసి తనకు భయం వేసిందని చెప్పింది. అందులో ఒకదాన్లో ఒక అస్థిపంజరం బొమ్మ కింద జిల్లా అటార్నీ కట్జ్‌మన్ పేరు రాసి ఉందనీ, మరో దాన్లో కట్జ్‌మన్‌ను ఇద్దరు మనుషులు పట్టుకొని నిల్చుంటే మరో ఇద్దరు అతని తలను పొడవైన కత్తులతో కోస్తున్న దృశ్యం చూశానని చెప్పింది. శాక్కొ, వాంజెట్టిలకు శిక్షపడితే కట్జ్‌మన్ తల ఎగిరుతుందని ప్రొఫెసర్ గుడాగ్ని అక్కడ తనను బెదిరించాడని చెప్పింది. ఆమె సాక్ష్యాలు అబద్ధమని చెప్పేందుకు ప్రాసిక్యూషన్ కష్టపడాల్సివచ్చింది. డిఫెన్స్ కమిటి ఆఫీసుకు తానెప్పుడూ వెళ్ళలేదని అరెస్టయిన రోజు డి ఫాల్కొ చెప్పినట్టు పోలీసు అధికారి స్టీఫెన్ సాక్ష్యమిచ్చాడు.

ప్రవాస అరాచకవాదుల, కమ్యూనిస్టుల సాక్ష్యంపై ఆధారపడి ఒక అమెరికన్ మహిళకు శిక్ష విధించేంతటి నిష్పక్షపాతాన్ని న్యాయమూర్తి ముర్రే నుంచి ఆశించడమే పొరపాటు. మసాచూసెట్స్ న్యాయ వ్యవస్థమీద ప్రజల నమ్మకాన్ని పోగొట్టేందుకు అరాచకవాదులు ఈ కేసు ద్వారా ప్రయత్నిస్తున్నారని ఆయన భావించాడు. అందుకే అరాచకవాదుల నుంచి మసాచూసెట్స్ న్యాయాన్ని రక్షించి, అమెరికాలో లాయర్లు, న్యాయమూర్తులు అవినీతిపరులు కారని చెప్పదలుచుకున్నాడు. డి ఫాల్కొను, సిచెట్టిని నిర్దోషులుగా విడుదల చేస్తూ తీర్పు చెప్పాడు. జిల్లా అటార్నీ గానీ, మరే లాయర్ గానీ ఏ పాపం ఎరగరని తేల్చి చెప్పాడు.

ఇదే కేసు కొన్నేళ్ళ తర్వాత జరిగినట్టైతే ముర్రే డి ఫాల్కొను శిక్షించి ఉండేవాడని లాయర్ హెర్బర్ట్ ఎహర్మన్ తను రాసిన గ్రంథం 'ద కేస్ దట్ విల్ నాట్ డై 'లో పేర్కొన్నాడు. కట్జ్‌మన్ సోదరులను, ఫ్రాన్సిస్‌ను కూడా న్యాయమూర్తి తప్పుబట్టి ఉండేవాడని ఎహర్మన్ అభిప్రాయపడ్డాడు. ఎందుకంటే ఆ తర్వాత కొన్నేళ్ళకు మసాచూసెట్స్ న్యాయవ్యవస్థలో పేరుకుపోయిన అవినీతి బట్టబయలయింది. రాష్ట్ర అటార్నీ జనరల్‌ను అభిశంసిస్తూ రాష్ట్ర శాసన సభ తీర్మానించింది. అధికార దుర్వినియోగం ఆరోపణపై ఇద్దరు జిల్లా అటార్నీలను పదవులనుంచి తొలగించారు. పలువురు ప్రముఖ లాయర్లను న్యాయమూర్తులకు లంచం ఆశచూపారన్న అభియోగంపై డీబార్ చేశారు. శాక్కొ - వాంజెట్టి కేసులో దుబాసీగా వ్యవహరించిన జోసెఫ్ రోసి * ఏదో కేసులో ఒక న్యాయమూర్తికి లంచం ఇవ్వజూపగా జైలు శిక్ష విధించారు.

డి ఫాల్కొ ఘటనతో మసాచుసెట్స్ అధికార యంత్రాంగం, న్యాయ వ్యవస్థలు శాక్కొ, వాంజెట్టిలపట్ల మరింత ద్వేషాన్ని పెంచుకున్నాయని ఎహర్మన్ అంచనా. ఫ్రెడరిక్ మూర్ డిఫాల్కొ కేసులో ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించి తప్పుచేశాడనీ, దాని ప్రభావం శాక్కొ - వాంజెట్టి కేసుపై పడిందనీ ఆయన అంటాడు. కట్జ్‌మన్ ముద్దాయిల పట్ల మరింత కక్షపెంచుకున్నాడు. తన నిజాయితీని నిరూపించుకొనేందుకు ఎలాగైనా వాళ్ళిద్దర్నీ శిక్షింపజేయాలని డి ఫాల్కొ ఘటన తర్వాత ఆయన నిర్ణయించుకున్నాడని ఎహర్మన్ అభిప్రాయపడ్డాడు.

---

* న్యాయమూర్తి థేయర్‌కు ఇతను కారు డ్రైవర్‌గా పని చేశాడు. తన కొడుకుకు థేయర్ పేరు పెట్టుకున్నాడు.

ఈ ఘటన జరిగిన ముప్పైఏళ్ళ తర్వాత 1954 జులై 8న కొలంబియా విశ్వవిద్యాలయం డీన్ ఆల్బర్ట్సన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫెలికని ఈ ఘటన ప్రభావాన్ని ఇలా అంచనావేశాడు:

> బోస్టన్ దిన పత్రికల్లో అది ప్రతిరోజా మొదటిపేజీ వార్తయింది. మేం మసాచూసెట్స్ కోర్టును మసాచూసెట్స్ కోర్టు బోన్లో నిలబెట్టి ప్రాసిక్యూట్ చేశాం. మమ్మల్ని జడ్జి థేయర్ ఎన్నటికీ క్షమించని పని అది శాక్కో వాంజెట్టిల భవితవ్యాన్ని అలా సీల్ చేశాం. ఇది ఇవాల్టి నా అభిప్రాయం

ఎహర్మన్ అంచనా ప్రకారం డి ఫాల్కో ఘటనరెండుకోణాల్లో ముఖ్యమైనది. న్యాయమూర్తికి, ప్రాసిక్యూటర్లకు మూర్‌పై అది ద్వేషాన్ని పెంచింది. మసాచూసెట్స్ అధికార వ్యవస్థ తనపై అరాచకవాదుల దాడిని ఎదుర్కొనేందుకు సిద్ధమైంది.

# కేసు విచారణ

## జూరీ ఎంపిక

**బోస్టన్** నగరానికి దగ్గర్లో ప్రశాంత వాతావరణం ఉండే డెడ్‌హాం పట్టణం నార్‌ఫోక్ కౌంటీ అధికార కేంద్రం. సంపన్నులైన కొందరు బోస్టన్ వాసులు, అంతరించిపోగా మిగిలున్న న్యూ ఇంగ్లాండ్ సన్నకారు వ్యవసాయదార్లు అక్కడ నివసిస్తారు. అక్కడి సుపీరియర్ కోర్టులో 1921 మే 31 నుంచి సౌత్ బ్రెయిన్‌ట్రీ హత్య కేసు విచారణకు జూరీ ఎంపిక ప్రారంభమైంది.

డెడ్‌హాం జైల్లో ఉంచబడ్డ శాక్కో, వాంజెట్టిలను గట్టి పోలీసు బందోబస్తుతో సంకెళ్ళలో బంధించి కోర్టుకు తెచ్చేవారు. సైనిక పటాలాన్ని తలపించే విధంగా తుపాకులు పట్టుకొని 28 మంది గార్డులు వాళ్ళను వీధుల్లో నడిపిస్తుంటే స్థానిక పౌరులు విస్తుపోయి చూసేవారు. ఆ దృశ్యాన్ని గురించి ఒక జర్నలిస్టు ఇలా రాశాడు:

> *జైలు నుంచి కోర్టుకూ, కోర్టు నుంచి జైలుకూ ముద్దాయిలను ఊరేగింపుగా తీసుకెళ్ళడం మినీ పోలీసు పెరేడ్‌ను తలపించేది. నీలిరంగు యూనిఫారం ధరించిన పోలీసులు ముగ్గురు ముందూ, ముగ్గురు వెనకా, రెండు వేపులా ఇద్దరేసి చొప్పున సంకెళ్ళలో బంధించబడిన ఖైదీలతో నడిచేవారు.*

రైఫిళ్ళు, షాట్‌గన్స్, పిస్టళ్ళు పట్టుకొని సాయుధ గార్డులు కోర్టు భవనం బయటా లోపలా కాపలా కాసేవారు. కోర్టుకు వచ్చే ప్రతి ఒక్కర్నీ పూర్తిగా తనిఖీ చేశాకే లోపలికి వెళ్ళనిచ్చే వాళ్ళు. డిఫెన్స్ లాయర్లను పత్రికా విలేఖరులను కూడా పోలీసులు వదిలి పెట్టలేదు. అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యగా పోలీసు కాపలా పెట్టినట్టు ప్రభుత్వం సమర్థించుకున్నప్పటికీ ఆ భయానక వాతావరణం వల్ల ముద్దాయిలు అతిభయంకరులని న్యాయమూర్తి మనసులో, జూరీ సభ్యుల మనసుల్లో దురభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంది. అప్పటికింకా రాడికల్స్ మీద పామర్ రెచ్చగొట్టిన ద్వేషభావం ఆవరించే ఉంది.

వరుసగా నాలుగు రోజుల పాటు జడ్జి థేయర్ పన్నెండు మంది జూరీ సభ్యులను ఎంపిక

చేశాడు. నార్‌ఫోక్ కౌంటీ నుంచి మొదటగా ఐదు వందల మంది పౌరులను జూరి ఎంపిక కోసం కోర్టుకు రప్పించారు. జూరీ సభ్యులకు ఉండాల్సిన అర్హతల గురించి వారికి న్యాయమూర్తి వివరించాలి. ఆ తర్వాత ఇరుపక్షాలూ (ప్రాసిక్యూషన్, డిఫెన్స్) ఒక్కొక్కరినీ విచారించి తమకు అభ్యంతరం లేదని చెప్పిన వారినే జూరీకి సభ్యులుగా ఎన్నికైనట్టు న్యాయమూర్తి ప్రకటించాలి.

ఆ కాలంలో జూరీ సభ్యులుగా ఉండేందుకు సాధారణంగా ఎక్కువ మంది ఇష్టపడే వారు కారు. ఒకసారి సభ్యులుగా జూరీకి ఎన్నికయిన వాళ్ళను కోర్టు ఆవరణ వదిలి బయటికి వెళ్ళనివ్వరు. కేసు తేలే వరకూ ఆ నిషేధం కొనసాగుతుంది. దినపత్రికలను మాత్రం చదవనిస్తారు. వాటిలో కూడా కేసు గురించిన వార్తలను కత్తిరించి మాత్రమే అందిస్తారు. జూరీలో ఉండటం వ్యక్తిగత పనులకు ఆటంకమే కాకుండా ఒక పెద్ద బాధ్యత నెత్తికెత్తుకోవడమేనని భావించి ప్రజలు ఏదో ఒక సాకు చూపి తప్పుకునేందుకు ప్రయత్నించేవారు.

జూరీ ఎంపిక కోసం రప్పించబడిన వారినుద్దేశించి థేయర్ ఇలా చెప్పాడు:

*జంటిల్మెన్! జూరర్లుగా ఉండేందుకు మిమ్మల్ని రప్పించాం. జూరర్ల అర్హతల గురించి నేను చెప్పే విషయాలను శ్రద్ధగా వింటారని ఆశిస్తాను.*

*విచారణ జరపాల్సిన కేసు మసాచూసెట్స్ రాష్ట్ర ప్రభుత్వానికీ - నికొలా శాక్కో, బార్టొలోమియో వాంజెట్టిలకూ మధ్య జరుగుతుందని మొదటగా చెప్పాలి. ఫ్రెడెరిక్ పర్మెంటర్, అలెశాండ్రో బెరార్డెల్లిలను బ్రెయిన్ ట్రీలో 1920 ఏప్రిల్‌లో రివాల్వర్‌తో కాల్చి చంపారని ఆరోపణ. ఈ నేరం రుజువైతే విధించే శిక్ష మరణశిక్ష.*

జూరీలో ఉండబోయే వారికి థేయర్ ఈ ప్రశ్నలు వేశాడు:

*1. ఇరుపక్షాల్లో ఎవరితోనైనా మీకు బంధుత్వం ఉందా? అంటే ఇద్దరు ముద్దాయిల్లో ఎవరితోనైనా గానీ లేదా మృతులిద్దర్లో ఎవరితోనైనా గానీ.*
*2. ఈ కేసు విచారణలో గానీ, కేసు ఫలితంలోగానీ మీకేమైనా ప్రయోజనం ఉందా?*
*3. ముద్దాయిలపై ఆరోపణలకు సంబంధించిన విషయాల మీద మీరిప్పటికే ఏదైనా అభిప్రాయం ఏర్పరచుకోవడం గానీ దాన్ని ప్రకటించడం గానీ జరిగిందా?*
*4. మీకు పక్షపాతం గానీ అపోహలు గానీ ఉన్నాయా?*
*5. మీరు మరణ శిక్షకు వ్యతిరేకులా?*

థేయర్ చివరగా వారికి ఇలా చెప్పాడు:

*జూరీలో ఉండటం బాధాకరమైనదీ, నిర్బంధంతో కూడినదీ, కష్టతరమైనదీ అనే సాకులు చాలవు. ఇంతకంటే లాభదాయకమైన వ్యాపార వ్యవహారాలున్నాయనీ, ఇతర పనులున్నాయనీ చెప్తే చాలదు. ఫ్రాన్స్ యుద్ధ భూమిలో ప్రాణం అర్పించే పని కంటే అమెరికన్ సైనికుడికి తాను చేయాల్సిన అనేక పనులున్నాయని గుర్తు పెట్టుకోండి. కానీ ఆ సైనికుడు మానవ జాతికీ,*

*ప్రపంచానికీ ఔన్నత్యం గౌరవం తెచ్చిపెట్టిన మొక్కవోని శౌర్యంతో పోరాడి మహోన్నత త్యాగం చేశాడు. ప్రభుత్వ పిలుపుకు అతను స్పందించాడు*
*కాబట్టి జంటిల్మెన్, మన సైనికులు సముద్రాల కావల ప్రదర్శించిన దేశభక్తి స్ఫూర్తితో, శౌర్యంతో పనిపట్ల అంకితభావంతో ఈ విధిని నిర్వహించమని పిలుపిస్తున్నాను. .*

యుద్ధాన్ని వ్యతిరేకించి మెక్సికోకి ప్రవాసం వెళ్ళిన అరాచక వాదులైన శాక్కొ, వాంజెట్టిలకు వ్యతిరేకంగా జూరీని మానసికంగా సిద్ధపర్చేందుకు ఈ చివరి వాక్యాలకంటే మరేం కావాలి? అయితే ఏమీ ఎరగనట్టు థేయర్ నిష్పక్షపాతంగా వ్యవహరించమని ఉద్బోధిస్తూ ఇలా చెప్పాడు:

*ఆలోచించేందుకూ, అభిప్రాయాలను ప్రకటించేందుకూ స్వేచ్ఛను గుర్తించిన ఈ కాలంలో వ్యక్తులకు సాంఘిక మతపర ఆర్థిక సమస్యలపై తమ సొంత అభిప్రాయాలు కలిగి ఉండే హక్కుంది కానీ వాటిని తమతో జూరీ గదిలోకి ఎప్పుడూ తేకూడదు – ప్రత్యేకించి ఇరుపక్షాల్లో ఎవరి పట్లా అపోహ లేకుండా పని చేయాల్సిన సమయంలో.*

న్యాయమూర్తి ఈ ఉపోద్ఘాతం చెప్పాక వరుసగా జూరీ సభ్యుల ఎంపిక జరిగింది. మే 31న రప్పించబడిన మొదటి విడత ఐదొందల మందిలో కేవలం ఏడుగురిని మాత్రమే జూరీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రాసిక్యూషన్ అభ్యంతర పెట్టగా కొందర్ని, డిఫెన్స్ అభ్యంతరం మేరకు మరి కొందర్నీ తిప్పి పంపేశారు మరో రెండొందల మంది పౌరులను పట్టుకు రమ్మని న్యాయమూర్తి ఆదేశించాడు. పోలీసులు ఊరి మీద పడి కనిపించిన వాళ్ళనల్లా ఉన్న పళాన కోర్టుకు తీసుకెళ్ళారు. అక్రమమైన ఈ పద్ధతికి డిఫెన్స్ లాయర్లు అభ్యంతర పెట్టినప్పటికీ ఫలితం లేక పోయింది అలా రప్పించబడ్డ 175 మంది పౌరుల్లో నిర్విరామంగా 153 మందిని విచారించి మిగిలిన ఐదుగురు జూరర్లను ఎన్నుకున్నారు. చివరి జూరర్ ఎంపికయ్యే సరికి జూన్ 3వ తేదీ అర్థరాత్రి దాటింది. అదే రాత్రి ఒంటిగంటా ముప్పై నిమిషాలకు పన్నెండు మంది జూరర్లు* ప్రమాణం చేశారు.

ఒక్కొక్క కేసులో డిఫెన్సు లాయర్లు ఒక్కో విధమైన వ్యక్తులను జూరర్లుగా ఎంపిక చేసేందుకు ఇష్టపడతారు. ఈ కేసులో ముద్దాయిలు అరాచకవాద కార్మిక నాయకులు కాబట్టి మధ్య తరగతి వర్గం, కార్మిక వర్గం నుంచి జూరర్లను మూర్ ఎంచుకున్నాడు. 'మందమతులైన మొరటు వాళ్ళను' మూర్‌జూరర్లుగా అంగీకరించాడనేది ప్రొఫెసర్ ఎడ్మండ్ మోర్గన్** అభిప్రాయం.

* *జూరర్ల పేర్లూ, వాళ్ళ వృత్తులూ ఇవి: జాన్‌డేవర్, (గుమాస్తా); వాల్టర్ రిప్లే (మాజీ పోలీసు అధికారి); ఆల్‌ఫ్రెడ్ అట్ ఉడ్, వాలెస్ హెర్సే (రియల్ ఎస్టేట్ డీలర్లు), జాన్ గన్లీ (దుకాణదారుడు); స్టెవార్ట్ పార్కర్, ఫ్రాంక్ వాగ్ (మెకానిక్కులు), ఫ్రాంక్ మార్డెన్ (తాపీమేస్త్రీ) లూయీ మెక్ హోర్డీ, హేరీ కింగ్ ( కార్మికులు), ఫ్రాంక్ మెక్ నమారా (రైతు), జార్జి గెరార్డ్ (ఫోటో గ్రాఫర్)*

** *ఆయన కేసు విచారణను ఆసాంతం చూసి పదేళ్ళ అధ్యయనం తర్వాత మరో ప్రొఫెసర్‌తో కలసి 'ద లెగసీ ఆఫ్ శాక్కొ, వాంజెట్టి' వ్రాశాడు.*

జూరీని ఎంపిక చేసే సమయంలోనే లాయర్ ఫ్రెడ్‌మూర్‌కు, న్యాయమూర్తి థేయర్‌కు మధ్య విభేదాలొచ్చి అవి చాలా దూరం వెళ్ళాయి. కేసులో మూర్ లాయర్‌గా కొనసాగితే ఓడి పోవటం ఖాయమని వాంజెట్టి తరఫున వాదిస్తున్న స్థానిక న్యాయవాద సోదరులు థామస్ మెక్ ఎనార్నీ, జెరేమీ మెక్ ఎనార్నీ* భయపడ్డారు. మూర్ కేసు నుంచి వైదొలగితే మరో సీనియర్ లాయర్ విలియం థామ్సన్** ను శాక్కొ తరఫున వినియోగించుకోవచ్చునని వారు మూర్‌కు సూచించారు. కానీ కేసు నుంచి తప్పుకునేందుకు మూర్ ససేమిరా అంగీకరించలేదు. ముద్దాయిలను రక్షించాలన్న తపన వల్ల మెక్ ఎనార్నీలు మరొక ప్రతిపాదన చేశారు. తమకొచ్చేఫీజును థామ్సన్‌కిచ్చి తాము ఉచితంగా కేసు వాదిస్తామనీ, తనకొచ్చే ఫీజు తీసుకొని మూర్ తప్పుకొంటే బాగుంటుందని కూడా మూర్‌ను బ్రతిమాలారు. కానీ మూర్ కాదన్నాడు. మసాచూసెట్స్ బార్ సభ్యుడు కాదు గనుక మూర్ కేసు వాదించవచ్చా అని కూడా సందేహం ఏర్పడింది. వాదించరాదని జడ్జి రూలింగ్ ఇస్తే మంచి జరిగేదేమో. కానీ లాయర్‌గా మూర్ తన కోర్టులో వాదించవచ్చని థేయర్ అంగీకరించడంతో మూర్‌ను వదిలించుకోలేనందుకు శాక్కొ బాధపడ్డాడు. రోజినా శాక్కొ కోర్టు ఆవరణలోనే కన్నీళ్ళు పెట్టుకుంది. అయితే ఉద్యమానికి మూర్ ఉపయోగపడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మూర్ లాయర్‌గా కేసులో కొనసాగినప్పటికీ ఫర్వాలేదని వాంజెట్టి, ఫెలికని సంతృప్తి పడ్డారు.

కేసులో లాయర్‌గా పని చేసేందుకు మూర్‌ను థేయర్ అనుమతించినప్పటికీ వారిద్దరి మధ్య విభేదాలు వైషమ్యాల స్థాయికి వెళ్ళి చివరి వరకూ కొనసాగాయి. మూర్ న్యాయమైన, సమంజసమైన అభ్యంతరాన్ని లేవనెత్తినా థేయర్ పడనిచ్చే వాడు కాదు. మూర్‌లో శత్రువును చూశాడు థేయర్. మూర్ ఏం మాట్లాడినా అది తోడేలు ముందు ఎర్రజెండా ఆడించినట్టుగా ఉండేదని థామస్ మెక్ ఎనార్నీ ఒక సందర్భంలో చెప్పాడు. అది ముద్దాయిల భవితవ్యాన్ని ప్రభావితం చేసేదిగా మారింది. రాడికల్స్ పట్ల జడ్జికి, ప్రాసిక్యూటర్‌కి సహజంగా ఉన్న వ్యతిరేకత, రాడికల్ వ్యతిరేక ఉన్మాదమున్న కాలంలో ఎంపికైన జూరర్లూ వెరసి కోర్టులో అధికార యంత్రాంగం ముద్దాయిలకు వ్యతిరేకంగా మారింది. గ్రేటర్ బోస్టన్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ తరఫున కేసు విచారణను పరిశీలించిన మేడమ్ లోయిస్ రాన్‌టౌల్ ఇలా పేర్కొంది:

> *ముద్దాయిలు నేరస్తులని కోర్టు అధికారులంతా పరిగణించడాన్ని కేసు విచారణ ప్రారంభ సమయానికే గమనించి ఆశ్చర్యపోయాను.*

---

* *కోర్టులో అవసరం దృష్ట్యా శాక్కొ తరఫున మూర్, కెలహాన్‌లు, వాంజెట్టి తరఫున మెక్ ఎనార్నీ సోదరులు లాయర్లుగా పని చేశారు. అయినా మొత్తం డిఫెన్స్‌కు నాయకుడు మూర్.*

** *బోస్టన్‌లో థామ్సన్ అత్యంత ప్రతిభావంతుడైన, నిజాయితీ పరుడైన ప్రముఖ లాయర్. మేడమ్ ఎలిజబెత్ ఎవాన్స్ కోరికపై కేసులో తగు సలహాలు ఇచ్చేందుకాయన అప్పటికే కోర్టుకు హాజరవుతున్నాడు.*

జూరర్ వాల్టర్‌రిప్లేని జూరీ అధిపతిగా న్యాయమూర్తి జూన్ 6న ఎంపిక చేశాడు. ముద్దాయిలపై ఆరోపణలు జూరీకి చదివి వినిపించారు. అదే రోజు న్యాయమూర్తిని జూరర్లను, డిఫెన్స్ లాయర్లను నేర స్థలానికి తీసుకెళ్ళి ప్రాసిక్యూటర్ చూపించాడు. హత్యా స్థలాన్ని బందిపోట్ల కారు ప్రయాణించిన రోడ్డును కారు దొరికిన చెట్ల తోపును, బోడా ఇంటిని, సైమన్ జాన్సన్ నివాసాన్ని, గేరేజిని, స్లేటర్ మోరెల్ కంపెనీ పరిసరాలను వారంతా సందర్శించారు.

## ప్రాసిక్యూషన్ కథనం

సాక్షుల విచారణ ప్రారంభించే ముందు ప్రాసిక్యూషన్ తమ కథనాన్ని, తమ దగ్గరున్న సాక్ష్యాధారాలను జూరీకి వివరిస్తూ చేసే ప్రసంగాన్ని ప్రారంభ ప్రకటన (Opening Statement) అంటారు. జూన్ 7న అసిస్టెంట్ జిల్లా అటార్నీ హెరాల్డ్ విలియమ్స్ ప్రారంభ ప్రకటన చేశాడు:

> ఈ కేసులో ప్రాథమిక వ్యవహారాలు పూర్తి చేశాం ఇప్పుడు నిజమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టబోతున్నాం వాటి మీద ఆధారపడి మీరు తీర్పు చెప్పాల్సి ఉంటుంది . . . కోర్టులో ప్రవేశపెట్టబడనున్న సాక్ష్యాధారాల దగ్గరికి ఇప్పుడు మనం వచ్చాం ఈ సాక్ష్యాలు మౌఖిక సాక్ష్యాలు. ఇక్కడ పరిస్థితుల సాక్ష్యం (Circumstantial Evidence) అనే దాన్ని గురించి కాసేపు చెప్తాను . . ప్రత్యక్ష సాక్ష్యం (Direct Evidence) అనే దానికీ పరిస్థితుల సాక్ష్యానికీ తేడా ఉంది. ప్రత్యక్ష సాక్ష్యంలో సాక్షి తను నేరుగా చూసిన విషయాలను వివరిస్తాడు. కత్తిపోటు ఘటన అయితే "నేనా మనిషి కత్తితో పొడవడం చూశాను" అంటాడు పరిస్థితుల సాక్ష్యానికి సాక్షిగా ఉన్న వ్యక్తి పరిస్థితులను గురించి చెప్తాడు. ఆ పరిస్థితుల నుండి తదనుగుణ్యమైన చర్యలు ఏం జరిగి ఉంటాయో జడ్జీలు జూరర్లు నిర్ధారిస్తారు
>
> ఇందాక నేను చెప్పిన కత్తిపోటు ఘటననే ఉదాహరణగా తీసుకుంటే ఒక ఇంటి కిటికీ అద్దం మీద పైకెత్తబడిన ఒక చేతి నీడను, పెనుగులాడుతున్న ఒక మనిషి నీడను ఒకరు చూడవచ్చు. ఆ తర్వాత అతను ఆ గదిలోకి వెళ్ళి నేల మీద ఒక కత్తిని చూడవచ్చు. ఒక మనిషి గాయాలతో గానీ చనిపోయి గానీ నేల మీద పడి ఉండటం చూడవచ్చు. వాటి గురించి అతను సాక్ష్యం చెప్పవచ్చు. అలా చెప్పిన తర్వాత ఆ పరిస్థితుల నుంచి రాబట్టగల సహజమైన సమంజసమైన నిర్ధారణ ఏది అనే దాన్ని జూరీ చేప్పాలి. . . .
>
> . . . జంటిల్మెన్, అత్యంత శ్రద్ధతో ఈ కేసులో నిజాన్ని నిర్ధారించాలనే ఒకే ఒక్క లక్ష్యంతో మనమంతా ఇక్కడున్నాం. నిజాన్ని కనుగొన్నట్లైతే దాన్ని నిర్భయంగా ప్రకటించేందుకే మనమిక్కడ వున్నాం

ఈ విషయాలు చెప్పాక, సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం ఎలా జరిగిందో పోలీసు కథనాన్ని విలియమ్స్ వివరంగా చెప్పాడు

పర్మెంటర్‌పైకి కాల్పులు జరపగానే అతను డబ్బు పెట్టె వదిలేసి అక్కడున్న గుంటల వేపు రోడ్డు కడ్డంగా పరిగెత్తాడు. ఒక బందిపోటు అతన్ని వెంట తరిమాడు. అతని వీపుపైకి పేల్చాడు. పర్మెంటర్‌పడిపోయాడు. కాల్పుల దెబ్బకు బెరార్డెల్లీ... పక్కనే వున్న మురుగుకాలువలో పడిపోయాడు. . . . బెరార్డెల్లీ పక్కన టోపీ పోగొట్టుకున్న బందిపోటు పిస్టల్ పట్టుకు నిల్చుని అతనిపైకి రెండు తూటాలు పేల్చాడు. ఆ బందిపోటు పొట్టిగా ముదురు రంగులో ఉన్నాడు. అతని జుట్టు వెనక్కిదువ్వి ఉంది. నుదుటిపై జుట్టు కాస్త తక్కువగా ఉంది. జంటిల్మెన్, బెరార్డెల్లీపై కాల్పులు జరిపిన వ్యక్తి ఇక్కడ ఎడమ వైపున్న ముద్దాయి నికొలా శాక్కో అని గుర్తించబడింది.

. . . . . బెరార్డెల్లీ కింద పడగానే. . . ఆ ఉదయం నీల్ చూసినట్టుగా చెప్పిన పెద్ద నల్లకారు అక్కడికొచ్చింది. . . . పల్చని జుట్టున్న పాలిపోయిన ముఖం గల మనిషొకడు దాన్ని నడుపుతున్నాడు. అది ఏడుగురు కూర్చొనగలిగే, టాప్ ఉన్న *1920* బూయిక్ కారు. కార్లో ఇద్దరు మనుషులున్నారు. డ్రైవరూ, మేము రూపురేఖలు చెప్పలేని మరో వ్యక్తీ. ఆ వ్యక్తి వెనక సీట్లో కూర్చున్నాడు. కాల్పులు జరిగిన ప్రదేశానికి ఆ కారు చేరుకుంది.
బెరార్డెల్లీ కిందపడి పోయిన తర్వాత అతనిపైకి కాల్పులు జరిపిన వ్యక్తీ, పర్మెంటర్‌ను రోడ్డుకు అడ్డంగా వెంట తరిమిన వ్యక్తీ మూడో బందిపోటులో కలిసి వచ్చి రెండు డబ్బు పెట్టెలనూ తీసుకొని కార్లోకి సర్దారు.

. . . . . అప్పుడు కార్లో ఐదుగురున్నారు. అది రైల్వే క్రాసింగ్ వేపు బయల్దేరింది.
అది వెళ్తుండగా రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీలోని ఒక మనిషి (పెల్సర్) దాని వెనకవేపు ఉన్న నెంబర్ *49,783* గా నోట్ చేసుకున్నాడు. . . . కారు వెనుక వైపు నుంచి బయటికి తుపాకీ గురి పెట్టి ఉంది.

క్రాసింగ్ దగ్గరికి వాళ్ళు చేరే సరికి గేట్‌మాన్ (లెవాంజీ) పట్టాలకు అవతలి వైపు తన షాంటీ (చిన్నగది)లో ఉన్నాడు. గేటు కమ్మీలు పైకెత్తబడి ఉన్నాయి. అతను కాల్పుల శబ్దం విన్న సమయంలోనే రైలు వస్తుండటం కూడా గమనించాడు... గేటు దించేందుకు చక్రం తిప్పడం మొదలు పెట్టాడు. అప్పుడే కారు అవతలి వేపు నుంచి పట్టాల మీదికి రావడం మొదలు పెట్టింది. కార్లో ఉన్న వాళ్ళు పెద్దగా అరుస్తూ బెదిరించడంతో అతను గేటు తెరిచే ఉంచాడు. కారు ముందుకు సాగింది. కారు ముందు సీట్లో మీసాలున్న ఒక ఇటాలియన్‌ను ముద్దాయి వాంజెట్టిగా గేట్‌మాన్ గుర్తించాడు.*

---

* నేరం జరిగిన తర్వాత ఆరురోజులకు కెప్టెన్ ప్రొక్టార్ అప్పటికి తెలిసిన నలుగురు బందిపోట్ల రూపురేఖలు పేర్కొంటూ పత్రికా ప్రకటన చేశాడు. బోస్టన్ హెరాల్డ్ దినపత్రికలో *1920* ఏప్రిల్ *22*న అచ్చయిన ఆ ప్రకటన ప్రకారం ఆ నలుగురూ గడ్డాలు, మీసాలు లేనివారే. నలుగురూ తుపాకులతో కాల్పులు జరిపారు.

తుపాకీ కాల్పులు . . . . ప్రజల దృష్టిని బాగా ఆకర్షించాయి. స్లేటర్ మోరిల్ ఫ్యాక్టరీ నెం 1 లో కిటికీ దగ్గరకు జనం చేరుకున్నారు. చెప్పుల షాపులో జనం బయటికి వచ్చి చూశారు. ఆ పరిసర ప్రాంతాల్లోని పలువురు ప్రజలు పోగయ్యారు. కారు దూసుకువెళ్తుండగా కుడివేపు ముందు సీట్లో కూర్చున్న మనిషి గాలికి రెపరెపలాడుతున్న కర్టెన్ కింద నుంచి. . . బయటికి తలపెట్టి తన పిస్టల్‌లో తూటాలు అయిపోయే వరకూ జనం మీదికి కాల్పులు జరిపాడు.

. . . . స్లేటర్ మోరిల్ ఫ్యాక్టరీ బిల్డింగ్‌లో మూల మీద ఉన్న కిటికీలోంచి. . . మిస్ స్ప్లెయిన్ కిందకి చూసింది. కారు పోతూ ఉండటం గమనించింది. కర్టెన్ కింద నుంచి రివాల్వర్ ఎత్తి దారి పొడుగునా జనం మీదికి కాల్పులు జరిపిన వ్యక్తి ముద్దాయి నికోలా శాక్కో అని ఆమె మీకు చెప్తుంది. . . .

కారు ముందుకు సాగి చివరికి హాంకాక్ వీధిలో మందుల షాపు దగ్గర ఎడమ వేపు మలుపు తిరిగింది. అలా వీధి మలుపు తిరుగుతుండగా కార్లో ఉన్న వాళ్ళు రోడ్డు పొడవునా మేకులు చల్లారు. వాటిలో చాలా భాగం సంపాదించాం.

. . . . . .

వాళ్ళను తిరిగి మాట్‌ఫీల్డ్ రైలు క్రాసింగ్ దగ్గర చూస్తాం. . . గేట్‌మాన్(రీడ్) తన వేపుగా వాళ్ళు వస్తుండటం చూసినప్పుడే ఒక రైలు రావడాన్ని కనిపెట్టాడు. రోడ్డుకు అడ్డంగా పరిగెత్తి పెద్ద "స్టాప్" సిగ్నల్ పట్టుకొని నిల్చున్నాడు. వాళ్ళు ఆగిపోయారు. రైలు వెళ్ళే వరకూ వాళ్ళను అతను కదలనివ్వలేదు. అప్పుడు ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి (అతన్ని బార్టొలోమియో వాంజెట్టిగా రీడ్ వర్ణించాడు) "ఏ నరకానికి పంపడానికి నువ్వు మమ్మల్నిక్కడ ఆపావు" అని (ఇంగ్లీషులో) అన్నాడు. . . . . (తర్వాత కారు క్రాసింగ్ దాటుతుండగా వాంజెట్టి అదే మాటలన్నాడు).

కాల్పులు మూడు గంటల పది నిమిషాలకు జరిగాయి.. . . . మాట్‌ఫీల్డ్ క్రాసింగ్ సంఘటన *4:10* ప్రాంతంలో జరిగింది. . . . .

కాల్పులు జరగడానికి ముందూ, షెల్లీ నీల్ ఉదయాన్నే చూసిన తర్వాతా ఆ కారును సౌత్ బ్రెయిన్‌ట్రీ పౌరులు చూశారు. సుమారు *9.30*కు నీల్ దాన్ని చూశాడు. పది గంటలు దాటిన కాసేపటికి బహుశా పదిన్నరకు అదే కారు హోల్‌బ్రూక్ ఎవెన్యూ నుంచి వస్తూ హాంకాక్ వీధిలోకి వెళ్ళడం చూశారు. . . . కారు ముందు సీట్లో లేదా కార్లో ఆ సమయంలో ముద్దాయి వాంజెట్టి ఉండటం తెలివైన, నమ్మదగ్గ సాక్షి డోల్‌బేర్ గమనించాడు.

. . . . కోహాసెట్ నుంచి ఆ రోజు ఉదయం *9.20* కి రైలెక్కిన ఒక సాక్షి ఉన్నాడు. ఆ రైలు ప్లిమత్ నుంచి వస్తోంది. ప్లిమత్ వాంజెట్టి నివాస స్థలం. అతను చేపలమ్మేది అక్కడే. కోహాసెట్‌కు చెందిన ఆ పెద్ద మనిషి ఫాక్‌నర్ పొగతాగేవాళ్ళ రైలు పెట్టెలో కూర్చున్నాడు..... ఈస్ట్ బ్రెయిన్ ట్రీ రాగానే ఒక ప్రయాణీకుడు దిగేందుకు లేచి నిల్చున్నాడు. అతను

ఇటాలియన్. ఇటాలియన్‌గా కనిపిస్తాడు. అతనికి మీసాలున్నాయి. ఇటాలియన్‌లాగా మాట్లాడాడు... అతను ముద్దాయి బార్టొలోమియో వాంజెట్టి అని కొహసెట్ నుంచి ఆ సాక్షి ఫాక్‌నర్ వచ్చి చెప్తాడు. . . .

*. . . . ఆ రోజు ఉదయం 11:30 ప్రాంతంలో అదే కారు స్లేటర్ మోరిల్ ఫ్యాక్టరీ నెం:2 కు రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీకి మధ్య నిలబెట్టబడి ఉంది. కారులో పాటు ఇద్దరు మనుషులున్నారు. ఒకరు డ్రైవర్. ఇంజన్ బాగు చేస్తూ ఉన్న వ్యక్తి మరొకరు. ఆ రెండో వ్యక్తి ముద్దాయి నికొలా శాక్కొ. . . . ఒక సాక్షి (ఆండ్రూస్) ఆ మనిషి శాక్కొనేనని మీకుచెప్తుంది. . .*

*. . . . . ఆ రోజు గురువారం. ఆ రోజు శాక్కొ "3-కె" ఫ్యాక్టరీలో పనికి హాజరు కాలేదు.*

ఏప్రిల్ 17న చెట్ల తోపులో నంబర్ ప్లేటులేని బూయిక్ కారు దొరికిందనీ, అది 1919 నవంబర్ 23న దొంగిలించబడిందనీ విలియమ్స్ వివరించాడు. బోడా గురించి చెప్తూ అతను 1920 మోడల్ బూయిక్ కారు నడుపుతుండటం పలువురు చూశారన్నాడు. బోడా ఇంటిని పోలీసులు తనిఖీ చేయడం, ఆ తర్వాత జాన్సన్ ఇంటికి బోడాతో పాటు శాక్కొ, వాంజెట్టి వెళ్ళడం, వారిద్దర్నీ అరెస్టు చేయడం గురించి చెప్పుకొచ్చాడు. శాక్కొ దగ్గర తూటాలు నింపి వున్న పాయింట్ 32 కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్, 22 తూటాలు, వాంజెట్టి దగ్గర తూటాలతో నింపి ఉన్న పాయింట్ 38 హారింగ్టన్ రిచర్డ్ సన్ రివాల్వర్ స్వాధీనపర్చుకున్నామని చెప్పాడు.తర్వాతి రోజు సౌత్ బ్రెయిన్ ట్రీ నుంచి పలువురు సాక్షులను బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌కు తీసుకురాగా అనేక మంది శాక్కొను కాల్పులు జరిపిన వాడిగానూ, కాల్పుల తర్వాత కార్లో కన్పించిన వ్యక్తిగానూ గుర్తు పట్టారు. వాంజెట్టిని కూడా గుర్తించారు.

*జంటిల్మెన్, ప్రభుత్వ వాదన ప్రకారం ఈ నేరాన్ని ఐదుగురు మనుషులు చేశారు. నేరం జరిగేందుకు కొంత కాలం కిందట దొంగిలించబడిన బూయిక్ కారును ఉపయోగించారు. హత్యలు జరిగిన రోజు లేదా అంతకు ముందు కొయాసి ఇంటి నుంచి దాన్ని సౌత్ బ్రెయిన్ ట్రీకి తీసుకెళ్ళారు. సౌత్‌బ్రెయిన్ ట్రీ స్టేషన్ కెళ్ళి కారులో వాంజెట్టిని ఎక్కించుకున్నారు. కారు నడిపిన వ్యక్తులకు ఆ పరిసర ప్రాంతాలు సుపరిచితం.....*

. . .

*కాల్పులు జరిపిన ప్రదేశంలో బెరార్డెల్లి శవం దగ్గర పడిపోయిన ఒక టోపీ గురించి నేను చెప్పాను. శాక్కొకు టోపీ పెట్టుకునే అలవాటుంది. సాక్షి కెల్లీకి శాక్కొ ఎలాంటి టోపీ పెట్టుకుంటాడో తెలుసు. నేరస్థలంలో దొరికిన టోపీ శాక్కొ టోపీ లాగా ఉందని ఆయన మీకు చెప్తాడు.*

*పర్మెంటర్ మృతదేహంలో రెండు బుల్లెట్లూ, బెరార్డెల్లి శవంలో నాలుగు బుల్లెట్లూ దొరికాయి.. . . . బుల్లెట్లు పేల్చినప్పుడు వాటిపై ఏర్పడే గుర్తులను బట్టి అవి ఏ రకం తుపాకీ నుంచి పేల్చబడ్డాయో తేలికగా చెప్పవచ్చు. పిస్టల్ గొట్టం లోపలి భాగం రాసుకుంటూ బుల్లెట్*

దూసుకెళ్ళినప్పుడు బుల్లెట్ పై కొన్ని గీతలు ఏర్పడతాయి. ఆ గీతల మధ్యదూరాన్ని బట్టి అది ఏ రకం పిస్టల్ నుంచి పేల్చబడిందో చెప్పవచ్చు. పర్మెంటర్ మృతదేహంలో బుల్లెట్లు. . . . పాయింట్ 32 కాలిబర్ శావేజ్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడ్డాయి.

బెరార్డెల్లీ మృత దేహంలోని మూడు బుల్లెట్లు పాయింట్32 కాలిబర్ శావేజ్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడగా, బెరార్డెల్లీ మరణానికి కారణమైన నాల్గవ బుల్లెట్ పాయింట్ 32 కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడింది. అతను కిందపడి పోయిన సమయంలో అది అతనిపైకి పేల్చబడింది. భుజం నుంచి శరీరంలోకి దూసుకుపోయి పేగుల్లో లేదా పొట్టలో ఆగిపోయింది. మూడు వారాల తర్వాత శాక్కోను అరెస్టు చేసినప్పుడు అతని పాంట్ జేబులో తూటాలు నింపబడిన పాయింట్ 32 కాలిబర్ కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ దొరికింది. అదనంగా ఇరవై రెండు అదే పిస్టల్ బుల్లెట్లు అతని పాంట్ జేబులో దొరికాయి.

. . . . . .

కొన్ని హత్య కేసుల్లో లాగా చట్టం ఈ కేసులో సంక్లిష్టమైనది కాదు. ఇది స్పష్టంగా ఫస్ట్ డిగ్రీ మర్డర్ అంటే ముందుగా కావాలని పథకం వేసుకొని ఉద్దేశపూర్వకంగా చంపడం.*

. . . . . . . . .

మీ ముందు ఇద్దరు ముద్దాయిలున్నారు. వాంజెట్టి తుపాకీ పేల్చినట్టు చూపే సాక్ష్యాలు ప్రభుత్వం దగ్గర లేవు. బెరార్డెల్లీని శాక్కో తుపాకీతో కాల్చాడని ప్రత్యక్ష సాక్ష్యం ఉంది. కానీ హత్యలో వాంజెట్టికి సంబంధం ఉందని నిరూపించే సాక్ష్యాలు హత్య జరిపిన ముఠాతో పాటు కారులో అతనున్నాడని చెప్తాయి.

చట్టంలో ఇలా ఉంది: ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది మనుషులు చంపాలని కుట్రపన్ని హత్య చేసే దిశగా వాళ్ళు సంయుక్తంగా ఏదైనా పని చేసి హత్య చేస్తే వారందరూ హంతకులౌతారు.

విలియమ్స్ ముగించగా జడ్జి థేయర్ జోక్యం చేసుకొని, 'నేరం చేశారని ఎలాంటి సందేహానికి తావు లేకుండా ప్రభుత్వం నిరూపించే వరకూ ముద్దాయిలు నిర్దోషులే' అని చెప్పే న్యాయశాస్త్ర సూత్రాన్ని జూరర్లకు వివరించమని కోరాడు.

ముద్దాయిలు నిర్దోషులని భావించాలనీ, జూరీ సభ్యులూ, తానూ ఎంత నిర్దోషులో ప్రస్తుతానికి ముద్దాయిలూ అంతే నిర్దోషులని విలియమ్స్ వివరించాడు.

నిర్దోషులన్న భావనను అధిగమించే సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టే వరకూ వాళ్ళు దోషులు కారు. ప్రభుత్వం భుజస్కంధాలపై ఉన్న నేర నిరూపణ బాధ్యత నెరవేరాలంటే సాక్ష్యాధారాలు

---

* ఇది హత్యల్లో అతి తీవ్రమైన హత్య.అమెరికాలో ఇందుకు శిక్ష మరణశిక్ష. అంతకు తక్కువ శిక్ష విధించేందుకు అవకాశం లేదు.

*బలంగా ఉండాలి. క్రిమినల్ కేసులో ప్రభుత్వం వేపు సాక్ష్యం కాస్త మొగ్గుగా ఉంటే మాత్రమే చాలదు. ఎలాంటి సందేహానికి తావు లేకుండా నేరం నిరూపించబడాలి. వీళ్ళు నేరస్తులనీ, నిర్దోషులు కారనీ మీరు చెప్పాలంటే వాళ్ళు దోషులని ఎలాంటి సందేహానికి తావు లేకుండా నిరూపించబడిందని మీరు నమ్మాలి .......*

సాక్షుల విచారణ జూన్ 9న ప్రారంభమై జులై 12 వరకు నిర్విరామంగా సాగింది. ప్రభుత్వ పక్షాన 70 మంది, డిఫెన్స్ తరపున సుమారు వంద మంది సాక్ష్యం చెప్పారు. కేసు విచారణ కోసం ప్రభుత్వానికి రోజుకు రెండు వేల డాలర్లు ఖర్చయింది.

## నేరం జరిగే ముందు

**సౌత్** బ్రెయిన్ ట్రీ హత్యలు జరిగిన రోజు ఉదయం శాక్కో, వాంజెట్టిలు నేరస్థలం పరిసరాల్లో కనిపించారని నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ పలువురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టింది.

ఈ అంశంపై శాక్కోకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన సాక్షుల్లో మేడమ్ లోలా ఆండ్రూస్ ముఖ్యురాలు. హత్యా స్థలానికి దగ్గర్లోని స్లేటర్ అండ్ మోరిల్ ఫ్యాక్టరీ నెం.2 లోకి వెళ్తూ రోడ్డు మీద 1920 ఏప్రిల్ 15 ఉదయం 11.30 కు శాక్కోను చూశానని చెప్పింది. శాక్కోతో సంభాషించానని చెప్పిన ఏకైన ప్రాసిక్యూషన్ సాక్షి ఈవిడే. అసిస్టెంట్ జిల్లా అటార్నీ విలియమ్స్ ఈమెను చీఫ్ ఎగ్జామినేషన్ చేశాడు:

*విలియమ్స్: మీతో ఎవరున్నారు?*
*ఆండ్రూస్: మిసెస్ జూలియా కాంప్‌బెల్ అనే ఆవిడ.*
*ప్ర: స్లేటర్ ఫ్యాక్టరీలో ఎంతసేపున్నారు?*
*జ: . . 15 నిమిషాలు. అంతకంటే తక్కువ.*
*ప్ర: ఏం చేస్తున్నారక్కడ?*
*జ: ఉద్యోగం గురించి అడుగుతున్నాం.*
*ప్ర: స్లేటర్ ఫ్యాక్టరీ నుంచి బయటికి వచ్చాక ఎక్కడికెళ్ళారు మీరు?*
*జ: రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీకి.*
*ప్ర: దాన్లో ఎంతసేపున్నారు?*
*జ: 15 నిమిషాలని చెప్పాలి.*
*ప్ర: మీరు ఎవరిని ఎక్కడ ఏ పరిస్థితుల్లో చూశారో జూరీకి చెప్తారా?*
*జ: స్లేటర్ అండ్ మోరిల్ ఫ్యాక్టరీలోకి పోతుండగా దాని ముందు రోడ్డు పక్క ఒక కారు ఆగి ఉండటం చూశాను. ఒక వ్యక్తి కారుముందు భాగంలో దాన్ని బాగు చేస్తూ*

ఉన్నాడు. అతనితో పాటు మరో వ్యక్తి కూడా ఉన్నాడు. వాళ్ళ పక్క నుంచి ఫ్యాక్టరీలోకి వెళ్ళాను. నేను తిరిగి వచ్చే సరికి కూడా నిల్చున్న వ్యక్తి అదే స్థానంలో ఉన్నాడు.

. . . . . . . .

ప్ర: మీరు ఫ్యాక్టరీలోకి వెళ్ళేటపుడు వాళ్ళెక్కడ ఉన్నారో చెప్పమని అడుగుతున్నాను?

జ: . . . . . ఒక వ్యక్తి కారు బానెట్‌పైకి వంగి ఉన్నాడు. రెండవ వ్యక్తి కారు వెనక కూర్చొని ఉన్నాడు.

ప్ర: మీరు ఫ్యాక్టరీ నుంచి బయటికి వచ్చే సరికి కారు ఎక్కడుంది?

జ: నేను వెళ్ళే ముందున్న స్థలంలోనే.

ప్ర: అప్పుడు ఆ వ్యక్తులు ఎక్కడున్నారు?

జ: నేను బయటికొచ్చేసరికి సన్నటి మనిషి కారు వెనక నిల్చుని ఉన్నాడు. రెండో వ్యక్తి కారు అడుగున ఏదో బిగిస్తున్నట్టుగా ఉన్నాడు.

. . . . . . . . .

ప్ర: ఆ సమయంలో వాళ్ళతో మీరు మాట్లాడారా?

జ: మాట్లాడానండీ.

ప్ర: ఏ మనిషితో?

జ: కారును బాగు చేస్తున్న మనిషితో.

. . . . . . . . .

ప్ర: అతను లేచినిల్చున్నాడా?

జ: అవునండీ.

ప్ర: మీరు మాట్లాడుతున్నప్పుడు లేచి నిలబడ్డాడంటారా?

జ: నేనతనితో మాట్లాడాను. మాట్లాడుతుండగా అతను నిలుచున్నాడు.

ప్ర: మీరు అతనితో ఏం మాట్లాడారో చెప్తారా?

జ: ఫ్యాక్టరీ ఆఫీసులోకి వెళ్ళడం ఎలాగో నాకు తెలియదనీ, అతను దారి చూపించగలడేమో చెప్పమనీ అడిగాను.

ప్ర: అతనేం చెప్పాడు?

జ: నేను ఏ ఫ్యాక్టరీ గురించి అడుగుతున్నానని అతను నన్నడిగాడు. "స్లేటర్ ఫ్యాక్టరీనా?" అని అడిగాడు. "కాదండీ! రైస్ అండ్ హచిన్స్" అన్నాను.

ప్ర: ఇంకేమైనా?

జ: అంతేనండీ సంభాషణ.

ప్ర: అతను అంతకంటే ఏమైనా చెప్పాడా?

జ: లేదు.

ప్ర: లోపలికి ఎలా వెళ్ళాలో చెప్పాడా?

జ: అవును.

. . . . . . . .

ప్ర: ఆ రోజు ఉదయం మీరు మాట్లాడిన మనిషిని ఆ తర్వాత చూశారా? మీరు మాట్లాడిన ముదురు రంగుమనిషి గురించే నేను ప్రస్తావిస్తున్నాను.

జ: అవుననుకుంటాను. అవునండీ.

ప్ర: ఎక్కడ చూశారతన్ని?

జ: మొదట డెడ్‌హాం జైల్లో చూశాను.

ప్ర: ఆ తర్వాత అతన్ని చూశారా?

జ: అవునండీ చూశాను.

. . . . . . . .

ప్ర: కోర్టులో అతన్నిప్పుడు చూశారా?

జ: చూశాననుకుంటాను. అవునండీ.

. . . . . . . . .

ప్ర: మీరు చెప్తున్న మనిషిని చూపండి?

జ: (శాక్కొ వేపు చూపుతూ) అదిగో అక్కడున్నాడతను.

ప్ర: అంటే మీ ఉద్దేశం-

(శాక్కొ బోనులో లేచి నిలబడ్డాడు. 'నేను ఆ మనిషినా? మీరు నన్నేనా అంటున్నది? సరిగ్గా చూడండి" అన్నాడు.)

కారు కింద పడుకుని రిపేరు చేస్తూ పనిలో నిమగ్నమై సగం కన్పిస్తున్న మనిషితో కంటే కారు వెనుక ఏ పనీ చేయకుండా ఊరికే నిల్చుని ఉన్న వ్యక్తితో మాట్లాడడం ఆంద్రూస్‌కు తేలిక. సహజంగా ఎవరైనా అలానే చేస్తారు. అసహజమైన ఆంద్రూస్ సాక్ష్యానికి విలువలేకుండా చేసేందుకు క్రాసు పరీక్షలో డిఫెన్స్ లాయర్ మూర్ ప్రయత్నించాడు:

మూర్: ఇప్పుడు నేను మీకున్నంత దూరంకంటే ఎక్కువ దూరంలో లేకుండా. . . ఏ పనీ చేయకుండా నిల్చున్న ఆ రెండో మనిషితో కాక. . . కారు కింద ఉన్న మనిషితో మీరెందుకు మాట్లాడారు మిసెస్ ఆంద్రూస్?

ఆంద్రూస్: నేనక్కడ (కాంప్‌బెల్‌తో) మాట్లాడుతూ నిల్చున్నాను కాబట్టి వెనక్కి వెళ్ళే బదులుగా నేనతన్నే అడిగాను.

. . . . . . .

ప్ర: మీరతని ముఖం కూడా చూసివుండనప్పటికీ మీరతన్ని ప్రశ్నించారు?

జ: ఎందుకండీ! అతను లేచి నిల్చున్నప్పుడు అతని ముఖం చూశాను.

ప్ర: అతని ముఖాన్ని అసలు చూడకముందే మీరతన్ని లేచి నిలబడమన్నారు. కాదా?

జ: నేను మాట్లాడుతుండగా అతను లేస్తున్నాడు. కారు కింద నుంచి లేచి నిలబడుతున్నాడు.

ప్ర: ఇప్పుడు నేను మీకు ఉన్నంత దూరంలో నిలబడి ఉన్న మనిషిని (అప్పుడే చూసి మీరు

*దాటుకొని వెళ్ళినతన్ని) అడగడానికి బదులుగా రెండో మనిషి లేచి నిల్చునే వరకూ మీరు వేచి ఉన్నారు. అవునా?*

*జ: నేనతను జవాబు చెప్పే వరకూ నిలబడ్డాను. అవునండీ.*

శాక్కో ఫోటోను మొదట్లో పోలీసులు చూపించగా ఆమె గుర్తు పట్టలేక పోయింది. ఆ విషయాన్ని ఆమె క్రాసు పరీక్షలో అయిష్టంగా అంగీకరించింది. శాక్కోకి ఇంగ్లీషు మాట్లాడడం స్పష్టంగా రాదు. తనతో తప్పుల్లేని ఇంగ్లీషులో అతను మాట్లాడాడని ఆమె చెప్పింది. కేసు విచారణకు ముందుగా ఈమెను డిఫెన్స్ లాయర్ మూర్ కలిసి ఇంటర్వ్యూ చేశాడు.* తనకే విషయాలూ తెలియవని చెప్పింది. ఆ విషయాన్ని గురించి కూడా మూర్ ఆమెను కోర్టులో ప్రశ్నలడిగాడు. ఒక దశలో మూర్ ప్రశ్నల ధాటికి తాళలేక ఆమె కళ్ళు తిరిగి కింద పడి పోయింది కూడా.

సౌత్ బ్రెయిన్ ట్రీ ఘటన రోజు ఆంద్రూస్ చూసిన సంగతులను తనకు చెప్పిందని మేరీ గెయిన్స్ అనే సాక్షి చేత కూడా ప్రాసిక్యూషన్ సాక్ష్యం చెప్పించింది.

ఆంద్రూస్ సాక్ష్యాన్ని అబద్ధంగా నిరూపించేందుకు ఐదుగురు సాక్షులను డిఫెన్స్ లాయర్లు ప్రవేశపెట్టారు.** ఆ సాక్షులు: లీనా ఎల్లెన్ (ఆంద్రూస్ అప్రతిష్ఠాకరమైన ప్రవర్తన గలదని ఈమె సాక్ష్యమిచ్చింది.), కాంప్‌బెల్ (రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీలోకి వెళ్ళిన సందర్భంలో కారు కింద పడుకొని వున్న మనిషి ముఖం చూడలేదని, తాను గానీ, ఆంద్రూస్ గానీ అతనితో ఏమీ మాట్లాడలేదని ఈమె సాక్ష్యం), జార్జి ఫే, ఆల్ఫ్రెడ్ లాబ్రాక్, హేరీ కుర్లాన్ స్కీ.

సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం జరిగిన కొన్నాళ్ళకు లోలా ఆంద్రూస్ మీద ఒక అపరిచితుడు దౌర్జన్యం చేశాడు. ఆ విషయం గురించి ఆమెను విచారించేందుకు వెళ్ళిన పోలీసు అధికారి జార్జి ఫే డిఫెన్స్ తరపున సాక్షిగా వచ్చాడు. రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీ దగ్గర కారుతో పాటు ఉన్న వాళ్ళను తను సరిగా చూడలేదని ఆమె ఆ రోజు ఫేతో చెప్పింది:

*జెరెమీ మెక్ ఎనార్నీ: మీరు క్విన్సీ పోలీసు శాఖలో పని చేస్తారా?*

*జార్జి ఫే: అవును.*

---

* *విచారణకు ముందుగా డిఫెన్స్ లాయర్లు ప్రాసిక్యూషన్ తరపు సాక్షులను ఇంటర్వ్యూ చేసి నోట్స్ రాసుకోవడాన్ని అమెరికాలో అనుమతిస్తారు. సాక్షులను వారు ఇంటర్వ్యూలో చెప్పిన విషయాల గురించి డిఫెన్స్ లాయర్లు ప్రశ్నించవచ్చు.*

** *ప్రాసిక్యూషన్ తరపు సాక్ష్యాలన్నీ పూర్తయిన తర్వాతే డిఫెన్స్ తరపు సాక్షులను విచారిస్తారు. కానీ సందర్భాన్నీ బట్టి సౌలభ్యం కోసం డిఫెన్స్ తరపు సాక్షుల గురించి అక్కడక్కడ ప్రస్తావించడం జరిగింది. అలాగే, సాక్షుల విచారణ అనంతరం చేసే వాద ప్రతివాదాల్లోని సంబంధిత అంశాలు కూడా సందర్భోచితంగా ప్రస్తావించబడ్డాయి.*

ప్ర: లోలా ఆంద్రూస్ తెలుసా?

జ: అవును.

ప్ర: గత ఫిబ్రవరిలో మిమ్మల్నామె పిలిపించిందా?

జ: అవును.

ప్ర: ఏం జరిగిందో చెప్పండి.

జ: ఫిబ్రవరి మధ్యలో ఒక రాత్రి. . . . . నేను వెళ్తుండగా. . . .

. . . . . . . . .

ప్ర: ఏం జరిగింది?

జ: నన్ను ఇంట్లోకి పిలిచింది.

. . . . . . . .

ప్ర: ఏం చెప్పింది?

జ: ఆమె. . . . . . తన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళి, లెట్రిన్‌లోకి వెళ్ళినప్పుడు. . . . లెట్రిన్‌లో కాలు పెడుతుండగా ఒక వ్యక్తి ఆమెను లాగి బలవంతంగా మోకాళ్ళ మీద కూలబడేశాడని చెప్పింది.

ప్ర: మీరామెను అడిగిన ప్రశ్నలూ, వాటికామె చెప్పిన సమాధానాలూ చెప్పండిప్పుడు.

జ: తనను కొట్టిన వ్యక్తి బ్రెయిన్ ట్రీ హత్యలు జరిగిన రోజు ఆమె చూసిన వ్యక్తేనని అనుకుంటుందేమో అడిగాను. బ్రెయిన్ ట్రీలో తను చూసిన మనుషుల ముఖాలను నిజానికి తానుచూడలేదు కాబట్టి చెప్పలేనన్నది. బ్రెయిన్ ట్రీలో ఆమె చూసిన మనుషులతో పోల్చి చూసి, తనను కొట్టిన వ్యక్తి ఎలా ఉంటాడో చెప్పమని అడిగాను. చెప్పలేనన్నది. బ్రెయిన్ ట్రీలో. (తను చూసిన) మనుషులిద్దర్లో ఎవరైనా వేసుకున్న బట్టలలాగా అతని బట్టలున్నాయేమో చెప్పమని అడిగాను. చెప్పలేనంది.

క్విన్సీకి చెందిన జర్నలిస్టు, క్విన్సీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి ఆల్ఫ్రెడ్ లాబ్రెక్ డిఫెన్స్ తరపున సాక్ష్యం చెప్తూ లోలా ఆంద్రూస్ బ్రెయిన్ ట్రీలో తనకు కన్పించిన మనుషుల ముఖాలు చూడలేదని తనకు చెప్పిందన్నాడు.

మరో డిఫెన్స్ సాక్షి హారీ కుర్లాన్‌స్కీ 1909 నుంచీ క్విన్సీలో టైలర్‌గా పని చేస్తున్నాడు. లోలా ఆంద్రూస్‌కు ఏడెనిమిదేళ్ళుగా బాగా పరిచయస్తుడు. తన ఇంటి ముందునుంచి వెళ్తున్నప్పుడల్లా ఆమెను పలుకరించేవాడు. ఆయన ఇంటి ముందుగా వెళ్తూ 1921 ఫిబ్రవరిలో ఒక రోజు ఆంద్రూస్ ఆయనకు తటస్థపడింది–

"హలో, లోలా?"

ఆమె ఆగి కుర్లాన్‌స్కీని పలకరించింది.

"నువ్వు అలిసి పోయినట్టున్నావే?" అన్నాడతను.

"అవును వాళ్ళు (పోలీసులు) నా ప్రాణాలు తోడేస్తున్నారు" లోలా బాధ పడుతూ చెప్పింది.

"ఏమిటి?"

"నేనిప్పుడే జైలు నుంచి వస్తున్నాను."

"జైల్లో ఏం చేశావు?"

"ప్రభుత్వం వాళ్ళు నన్నక్కడికి తీసుకెళ్ళి ఆ మనుమల్ని (శాక్కో, వాంజెట్టిలను) గుర్తు పట్టమని కోరారు. నాకు వాళ్ళ గురించేమీ తెలియదు. నేనెప్పుడూ వాళ్ళను చూడలేదు. వాళ్ళను గుర్తు పట్టలేను. నా ఖర్మకాలి ఆ రోజు నేనక్కడికి (సౌత్ బ్రెయిన్ ట్రీలోని ఫ్యాక్టరీలకు) పని కోసం వెళ్ళాను. అపరిచితులైన చాలా మందిని చూశాను. అయితే నేనెవర్నీ పరిశీలనగా చూడలేదు."

ఈ సంభాషణంతా పూసగుచ్చినట్టు కుర్లాన్ స్కీ కోర్టులో చెప్పాడు. ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ క్రాస్ పరీక్షకు ఈ సాక్షి ఏ మాత్రం చలించలేదు. జూరీ దృష్టిలో ఈ సాక్షికి ఉన్న విలువను ధ్వంసం చేయడానికన్నట్లుగా జడ్జి థేయరే ప్రాసిక్యూటర్ పాత్ర పోషిస్తూ ప్రశ్నలడిగి కుర్లాన్ స్కీని వేధించాడు. ఆండ్రూస్‌కు అతనికీ మధ్య ఆ సంభాషణ జరిగేందుకు అవకాశం లేదని నిరూపించేందుకు థేయర్ పూనుకున్నాడు. ఆండ్రూస్‌ను సహజంగా అడగాల్సిన అనేక వివరాలు కుర్లాన్ స్కీ అడగలేదనీ, కాబట్టి అతనికీ ఆండ్రూస్‌కు మధ్యసంభాషణ జరిగి ఉండదనే భావం జూరీ సభ్యుల్లో సృష్టించేందుకు న్యాయమూర్తి ప్రయత్నించాడు:

న్యాయమూర్తి: సాక్షిగారూ, నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ఆమెను తీసుకెళ్ళి అబద్ధం చెప్పించాలనుకొన్న ప్రభుత్వాధికారి ఎవరో తెలుసుకునేందుకు మీరు ప్రయత్నించారా?

కుర్లాన్ స్కీ: ఏమంటున్నారూ?

జెరేమీ మెక్ ఎనార్నీ: ప్రశ్నేంటండీ?

న్యాయమూర్తి: ఆ ప్రభుత్వ ప్రతినిధి ఎవరో మీరు కనుక్కునేందుకు ప్రయత్నించారా?

కుర్లాన్ స్కీ: లేదు.

న్యాయమూర్తి: ఎందుకని?

కుర్లాన్ స్కీ: నా మనసుకు తట్టలేదు. నేను ఖచ్చితమైన కారణం చెప్పలేను. అది. . . . .

న్యాయమూర్తి: ఎవరినో గుర్తింపజేసేందుకు ఒక స్త్రీని తీసుకెళ్ళేందుకు ప్రభుత్వం తరపున ఎవరైనా ప్రయత్నించడం ప్రజలకు మంచిదని మీరు అనుకుంటున్నారా?

కుర్లాన్ స్కీ: నేను దాన్ని గురించి అసలు ఆలోచించలేదు.

న్యాయమూర్తి: చేతనైతే ఆ ప్రభుత్వాధికారి ఎవరో తెలుసుకోవడం మంచిదని మీరు అనుకోరా?

కుర్లాన్ స్కీ: అనుకుంటాను.

న్యాయమూర్తి: మీరు ఆ పనెందుకు చేయలేదో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాను.

ఏ సాక్షినైనా ఎప్పుడైనా ప్రశ్నించే అధికారం న్యాయమూర్తికి ఉంటుందే కానీ ఇష్టమొచ్చినట్టుగా ప్రశ్నించే అధికారం ఉండదు. న్యాయమూర్తులు సాక్షులను ప్రశ్నించేందుకు తమకున్న అధికారాన్ని అరుదుగానే ఉపయోగిస్తారు. కానీ, సాక్షిని వేధించేందుకో, జూరీ దృష్టిలో పనికి మాలిన వాడిగా సాక్షిని నిరూపించేందుకో ఆ అధికారాన్ని వినియోగించడం న్యాయమూర్తి పక్షపాతానికి నిదర్శనం. పైగా, కుర్లాన్స్కీ లాంటి పెద్దగా చదువులేని టైలర్ ఒక పరిచయస్తురాలు దోవన పోతూ కన్పించి అలవోకగా సంభాషిస్తే ఆమె నుంచి పలు వివరాలు రాబట్టాలనుకోవడం అవివేకమౌతుంది. కుర్లాన్ స్కీని న్యాయమూర్తే 'క్రాస్ పరీక్ష' చేయడాన్ని ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ తీవ్రంగా విమర్శించాడు:

> *మసాచూసెట్స్ న్యాయమూర్తులు సాధారణంగా ఎలా ప్రవర్తిస్తారో తెలిసిన వాళ్ళకెవరికైనా ఈ క్రాసు పరీక్ష వింతగా కనిపించక తప్పదు. కొద్దిపాటి చదువుండి సరైన ఇంగ్లీషు కూడా మాట్లాడలేక బాధపడుతున్న చిరు వ్యాపారి కుర్లాన్ స్కీ. అలాంటి వాడు సాదాసీదా సంభాషణ ద్వారా తనకు తెలిసిన పోలీసుల తప్పిదాన్ని గురించిన సమాచారాన్ని తవ్వి తీయాలని న్యాయమూర్తి థేయర్ నొక్కి చెప్పడమంటే అసందర్భ విషయాలను ప్రస్తావించి అసలు విషయాన్నుంచి దృష్టిని మరల్చడమౌతుంది. జూరీ దృష్టిలో కుర్లాన్ స్కీకి విలువలేకుండా చేసేందుకూ, తద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వున్న ప్రధాన సాక్ష్యాధారాల ప్రభావాన్ని తగ్గించేందుకూ అది ఉపయోగపడింది.*

ఆంద్రూస్ సాక్ష్యాన్ని పలువురు నమ్మదగ్గ సాక్షుల ద్వారా అబద్ధంగా డిఫెన్స్ నిరూపించగలిగింది. అయినప్పటికీ ప్రాసిక్యూటర్ కట్జ్మన్ తన పదకొండేళ్ళ అనుభవంలో ఆమెలాంటి నమ్మదగిన సాక్షిని కనీవినీ ఎరగలేదని కితాబిస్తూ వాదించాడు. కానీ, ప్రొఫెసర్ మోర్గన్ మాటల్లో:

> *సహేతుకంగా ఆలోచించే వాళ్ళెవరూ అలాంటావిడ మాట నమ్మి*
> *ఒక వీధి కుక్కను కూడా శిక్షించరు.*

శాక్కోను ఆ రోజు ఉదయం బ్రెయిన్ ట్రీలో చూశామని చెప్పిన మరో ఇద్దరు సాక్షులను కూడా ప్రాసిక్యూషన్ విచారించింది. ఆ రోజు ఉదయం 11:35-11:40 మధ్య శాక్కోను ఒక మందుల షాపు దగ్గర చూశానని రియల్ ఎస్టేట్ వ్యాపారి విలియం ట్రేసీ చెప్పాడు. అదే రోజు మధ్యాహ్నం 12:27 కు రైల్వే స్టేషన్ రోడ్‌లో శాక్కోను చూశానని డిటెక్టివ్ విలియం హెరోన్ చెప్పాడు. వాళ్ళిద్దరికీ శాక్కోను చూసి గుర్తు పెట్టుకోదగిన కారణం ఏమీ లేదు. రోడ్డు మీద కన్పించే అపరిచిత వ్యక్తుల్లో ఏ ప్రత్యేకతా లేకపోతే ఎలా గుర్తుంచుకొనే ప్రయత్నం చేయమో అలానే ఇదీ. పైగా కోర్టులో శాక్కోను ట్రేసీ ఖచ్చితంగా గుర్తించలేకపోవడంతో అతని సాక్ష్యం మరింత బలహీన పడింది.

నేరం జరిగిన రోజు ఉదయం సౌత్ బ్రెయిన్ ట్రీలో వాంజెట్టి ఉనికిని నిరూపించే ప్రాసిక్యూషన్ సాక్షులు ఫాక్నర్, డోల్‌బేర్.

జాన్ ఫాక్నర్ కథనం ప్రకారం : కొహాసెట్ నుంచి బోస్టన్ వెళ్ళే రైల్లో కొహాసెట్ నుంచి అతను ఆ రోజు ప్రయాణించాడు. ఈస్ట్ వే మౌత్ స్టేషన్ వచ్చే సరికి తన కుడి పక్క కూర్చున్న ప్రయాణీకు డొకరు అది 'ఈస్ట్ బ్రెయిన్ ట్రీ స్టేషనా' అని అడిగాడు. కాదని చెప్పాడు ఫాక్నర్. తన వెనక కూర్చున్న వ్యక్తి అడుగుతున్నాడని ఆ ప్రయాణీకుడు అనగా ఫాక్నర్ వెనక్కి తిరిగి చూశాడు; వెనకవైపున్న ఆ మనిషి విదేశీయుడిలాగా కన్పిస్తూ నల్లటి మీసాలతో బుగ్గ ఎముకలు ముందు కొచ్చిన ముఖంతో ఉన్నాడు; ఈస్ట్ బ్రెయిన్ ట్రీలో అతను దిగిపోయాడు; అతనే వాంజెట్టి అని ఫాక్నర్ కోర్టులో చెప్పాడు. మూర్ చేసిన క్రాసు పరీక్షలో ఫాక్నర్ సాక్ష్యం నిలవలేక పోయింది:

*మూర్: ఫాక్నర్‌గారూ, రైల్లో జరిగిన ఈ ఘటనలో అసాధారణమైందేమీ లేదు కదూ? - ఒక మనిషి సమాచారమడగడం అంటే! మీరు చెప్పినదాన్ని బట్టి నాకర్థమైంది అదీ.*

*ఫాక్నర్: అవును*

*ప్ర : మీరు రోజూ ఆ రైల్లో ప్రయాణిస్తారు, అవునా?*

*జ : ఆ రోజుల్లో ప్రయాణించాను.*

*ప్ర : మీకు తెలిసిన వ్యక్తినెవరినైనా ఆ రైల్లో చూశారా?*

*జ : లేదండీ*

*ప్ర : .... మీ కుడిపక్క కూర్చున్న వ్యక్తి ఎవరు?*

*జ : నాకు తెలియదు. కొత్త వాడినని అతను చెప్పాడు.*

*ప్ర : అతనెలా ఉన్నాడు?*

*జ : నేను చూడలేదు.*

*ప్ర : ముసలివాడా?*

*జ : నాకు గుర్తు లేదు.*

*ప్ర : లేక యువకుడా?*

*జ : నాకు గుర్తు లేదు.*

*ప్ర : లావుగా ఉన్నాడా? సన్నగా ఉన్నాడా?*

*జ : నా కది గుర్తులేదు.*

నేరం జరిగిన రోజు ఉదయం 10-12 గంటల మధ్య సౌత్ బ్రెయిన్ ట్రీలో ఒక కారులో వాంజెట్టిని చూశానని హేరీ డోల్ బేర్ చెప్పాడు. జూరీకి ఎన్నుకొనే పౌరుల పట్టీలో ఇతని పేరుంది. వాంజెట్టిని కోర్టులో చూసి గుర్తుపట్టి తాను సాక్షిగా ఉంటానని చెప్పి జూరీ ప్యానెల్ నుంచి తొలగి పోయాడు:

విలియమ్స్ : పలువురు ప్రయాణీకులున్న కారును మీరు చూశారా?

డోల్‌బేర్ : అవును.

ప్ర : మీరు రూపురేఖలు చెప్పగలిగే వార్నెవరినైనా చూశారా?

జ : అవును.

ప్ర : మీరు చెప్తున్నతన్ని ఎక్కడ చూశారు?

జ : కారు వెనక సీట్లో.

ప్ర : జూరీకి అతని రూపురేఖలు చెప్పగలరా?

జ : విదేశీయుడిలాగా కన్పించాడు. బాగా నల్లటి గుబురు మీసాలున్నాయి.

వాంజెట్టిని చూపించి ఆరోజు తను కార్లో చూసిన మనిషి అతనేనన్న దాన్లో ఏ మాత్రం సందేహం లేదని సాక్షి చెప్పాడు. వాంజెట్టి తరపు న్యాయవాది జెరేమీ మెక్ ఎనార్నీ ఈ సాక్షి అసహజ, అసాధారణ జ్ఞాపక శక్తి గురించి క్రాసు పరీక్షలో ప్రశ్నించాడు.

జెరేమీ మెక్ ఎనార్నీ : కారు ఎంత వేగంతో పోతోంది?

డోల్‌బేర్ : గంటకు పది పన్నెండు మైళ్ళకు పైగా వేగంతో పోతోందని చెప్పాలి.

ప్ర : కారు మీకు సరిగ్గా ఎదురుగా వచ్చే సమయం వరకూ మీదృష్టి అతని మీద పడేందుకు కారణమేమీ లేదు. అవునా?

జ : ఉంది.

ప్ర : ఏమిటది?

జ : (కార్లో ఉన్న) ఐదుగురి రూపం నన్నాకర్షించింది.

ప్ర : వాళ్ళైదుగురూ ఎలా కన్పించారు?

జ : వాళ్ళు కొత్తగా అనిపించారు. పట్టణానికి కొత్త వాళ్ళలా. కారు నిండా విదేశీయుల్లా కనిపించారు.

. . . . .

ప్ర : మీకు అపరిచితులైన ఐదుగురు మనుషులు ఒక కార్లో ప్రయాణించడం మీ జీవిత కాలంలో మీరు చాలా సార్లు చూసున్నారు కదా?

జ : అవునండీ.

ప్ర : విదేశీ ప్రయాణీకుల కార్లను చాలా వాటిని మీరు చూశారు కదా?

జ : అవునండీ.

ప్ర : వాళ్ళు అపరిచితులనే విషయం. వాళ్ళు విదేశీయులనే విషయం మీ మనసులో గాఢమైన ముద్ర వేశాయంటారా?

జ : అవును.

ప్ర : ఫోర్ రివర్ జిల్లా నుంచి ఐదుగురు, ఏడుగురు ప్రయాణీకులు పట్టగల కార్లు రావడాన్ని, వాటిలో అనేక రకాల మనుషులెంతో మంది వుండడాన్ని మీరు చూశారు?

జ : అవునండీ.

ప్ర : వాళ్ళలో ఎక్కువ మంది విదేశీయుల్లాగా కన్పించారు. అవునా?

జ : కాదు. అలా కన్పించారని చెప్పలేను.

. . . . .

ప్ర : (ఫోర్ రివర్‌లో) పెద్ద సంఖ్యలో విదేశీయులు పనిచేస్తుంటారు.

జ : అవును.

ప్ర : ముగ్గురు. ఐదుగురు, ఏడుగురు విదేశీయులు ప్రయాణిస్తున్న కారును చూడడం అసాధారణమేమి కాదు.

జ : అవునండీ.

ప్ర : సరే. ముందు సీట్లో కూర్చున్న మనుషుల రూపురేఖలు చెప్పండి?

జ : చెప్పలేను.

హంతకులు ఉపయోగించిన బూయిక్ కారూ, తను చూసిన విదేశీయుల కారూ ఒకటా కాదా అనే విషయాన్ని కూడా డోల్‌బేర్ చెప్ప లేక పోయాడు.

## నేరం జరుగుతుండగా

బెరార్డెల్లీని చంపిన హంతకుడు శాక్కో అని ప్రాసిక్యూషన్ ఆరోపణ. పోలీసుస్టేషన్‌లో శాక్కో, వాంజెట్టిలను చూసిన ప్రత్యక్ష సాక్షులెవరూ వాళ్ళను హంతకులుగా గుర్తించలేక పోయారు. అయినప్పటికీ బెరార్డెల్లీ హంతకుడు శాక్కోనేనని నిరూపించబూనుకున్న ప్రాసిక్యూషన్ అందుకోసం అనేక వక్రమార్గాలు అవలంబించింది.

పోలీసులు సాక్షులను భయపెట్టి సాక్ష్యం చెప్పించేందుకు ప్రయత్నించారు. తప్పుడు సాక్ష్యం చెప్పేందుకు ఇష్టపడని కార్మికులు కొందరు ఉద్యోగాలు పోగొట్టుకోవాల్సి వచ్చింది. తమ వృత్తి ధర్మాన్ని విస్మరించిన జిల్లా అటార్నీ కట్జ్‌మన్, అసిస్టెంట్ విలియమ్స్‌లు ప్రాసిక్యూషన్‌కు ప్రతికూలంగా ఉన్న సాక్ష్యాలను తొక్కి పట్టారు. * డిఫెన్స్ తరపున సాక్ష్యం చెప్పేందుకు సాక్షులు భయపడే వాతావరణాన్ని సృష్టించారు.

జో బ్రైకోన్, మిసెస్ కాన్‌డిడో బోనా పోలీసు స్టేషన్లో ముద్దాయిలిద్దర్ని చూసి వారు తాముచూసిన హంతకుల బృందంలో సభ్యులు కారని తెగేసి చెప్పారు. జో బ్రైకోన్‌ను ఉద్యోగం ఊడదీస్తామని పోలీసులు బెదిరించినా అతను లొంగలేదు. వాళ్ళను కోర్టులో సాక్షులుగా ప్రవేశపెట్టలేదు. హంతకులలో శాక్కో, వాంజెట్టి లేరని తెలిసిన మరోసాక్షి జాన్ నింగ్‌మాన్.

---

* *'ముద్దాయికి సహాయపడే వాస్తవాలను తొక్కిపట్టడం, సాక్ష్యాధారాలను రహస్యంగా ఉంచడం తీవ్రంగా గర్హించదగినది' గా కానన్స్ ఆఫ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ ఆఫ్ అమెరికన్ బార్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రాసిక్యూటర్ విధి మొత్తం సాక్ష్యాలను కోర్టు ముందుంచడమే తప్ప కేసు గెలిచేందుకు ఉపయోగపడనివాటిని దాచి పెట్టడం కాదు.*

ఉద్యోగం ఊడుతుందని భయపడి డిఫెన్స్ తరఫున సాక్ష్యం చెప్పేందుకు ఇష్టపడలేదు. విన్ ఫ్రెడ్ పియర్స్ అనే సాక్షిని ఆరుసార్లు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్ళి ముద్దాయిలను చూపించినప్పటికీ వాళ్ళిద్దరూ హంతకులు కారనే వాస్తవానికే అతను కట్టుబడి ఉన్నాడు. పోలీసులు అతనిని కోర్టులో సాక్షిగా చూపలేదు. డిఫెన్స్ తరఫున అతని సాక్ష్యాన్ని నమోదు చేయాల్సి వచ్చింది. తర్వాత కొన్ని వారాలకు అతని ఉద్యోగం ఊడింది. స్లేటర్ మోరిల్ కంపెనీలో అతని స్థానంలో జూరర్లలో ఒకరిని నియమించారు. హంతకుల కారు నడిపిన వ్యక్తి శాక్కో అని మేబెల్ హెవిన్స్ పోలీసులకు చెప్పింది. ప్రాసిక్యూషన్ కథనానికి అది విరుద్ధం (వాంజెట్టి కారు డ్రైవర్ అని ప్రాసిక్యూషన్ ఆరోపణ) కాబట్టి ఆమెను సాక్షిగా ప్రవేశపెట్టలేదు.

హత్యాకాండకు ప్రత్యక్ష సాక్షులుగా మొత్తం ఎనిమిది మందిని ప్రభుత్వ పక్షాన విచారించారు. శాక్కోను హంతకుడిగా నిరూపించేందుకు సాక్షులుగా కోర్టుకు రప్పించబడిన వారిలో ఎక్కువ మంది ప్రాసిక్యూటర్లకు నిరాశే మిగిల్చారు.

ఏనీ నికొలస్, కోల్ బెర్ట్ అనే సాక్షులు హంతకులను గుర్తించేందుకు వీలుపడనంత దూరంనుంచి సంఘటనను చూశారు. కాల్పులు జరిపిన దుండగులు "పొట్టిగా", "ఒక మోస్తరు లావుగా" ఉన్నారని మాత్రమే చెప్పగలిగారు. మరోసాక్షి మెక్ గ్లోన్ చాలా దగ్గరనుంచే హంతకులను చూసినప్పటికీ వారిని సరిగా గమనించలేదు. శాక్కో, వాంజెట్టిలు హంతకుల్లో ఉన్నారో లేదో అతను కోర్టులో చెప్పలేక పోయాడు. హంతకులు 20-25 ఏళ్ళ వయసున్న ఇటాలియన్లు అనీ, ముదురు గోధుమ రంగు మేనిఛాయతో టోపీలు ధరించి ఉన్నారనీ మాత్రమే అతను చెప్పగలిగాడు. రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీ రెండవ అంతస్తు పై నుంచి హత్యలను చూసిన లాన్ గ్లోయిన్ పోలీసుస్టేషన్‌లో గానీ, కోర్టులో గానీ ముద్దాయిలను హంతకులుగా గుర్తించ లేక పోయింది.

మరోసాక్షి లెవిస్ వేడ్ స్లేటర్ మోరిల్ ఫ్యాక్టరీలో కార్మికుడు. రైస్ అండ్ హచిన్స్ ముందు అతను నిల్చుని ఉన్న సమయంలోనే హత్యలు జరిగాయి. తర్వాత నెలరోజులకు అతను పోలీసుస్టేషన్‌లో శాక్కోను చూశాడు. హంతకుల్లో శాక్కో ఒకడని చెప్పేందుకు కాస్త సందేహించాడు. కేసు ప్రాథమిక విచారణ జరిగే నాటికి అతని సందేహం మరింత బలపడింది. శాక్కోను హంతకుడిగా గుర్తించలేనన్నాడు. డెడ్‌హాం కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు కొన్ని రోజుల క్రితం బెరార్డెల్లి హంతకుడి పోలికలున్న మనిషొకతను అతనికి తారసపడ్డాడు. అందువల్ల శాక్కో గురించిన అతని సందేహం మరింత స్థిర పడింది. అనవసరంగా అమాయకుడైన శాక్కోను బలిచేయబోతున్నానా అని అతను మథన పడ్డాడు. కోర్టులో చెప్పిన సాక్ష్యంలో శాక్కోనే బెరార్డెల్లిని చంపిన వాడనేదాన్లో తనకింకా సందేహం మిగిలుందని నిర్మొహమాటంగా చెప్పాడు. అతని ఉద్యోగం ఊడింది. ఎందుకంటే పదహారేళ్ళుగా విశ్వాస పాత్రుడైన ఆ కార్మికుడు సరిగ్గా అప్పుడే తమకవసరం లేదని స్లేటర్ కంపెనీ నిర్ణయించింది!

సాక్షి జేమ్స్ బోస్టాక్ కూడా స్లేటర్ మోరిల్ కార్మికుడే. హత్యలు జరిగే కొద్ది క్షణాల ముందు అతనికి హతులిద్దరూ రోడ్డు మీద రైల్వే క్రాసింగ్ సమీపంలో ఎదురయ్యారు :

*విలియమ్స్ : నువ్వేం చూశావో జూరీకి చెప్పు.*

*బోస్టాక్ : పర్మెంటర్, బెరార్డెల్లి ఎదురుగా వస్తూ కన్పించారు. వారివేపు నేను నడుస్తుండగా పర్మెంటర్ "బోస్టాక్! రెండో ఫ్యాక్టరీకి వెళ్ళి మోటారుకు కప్పీ బిగించు" అన్నాడు. "మూడుంబావుకు బ్రాక్టన్ వెళ్ళే రైలు ఎక్కేందుకు వెళ్తున్నా"నని నేను చెప్పాను. వెళ్ళిపోయేందుకు మలుపు తిరగబోయాను. రెండు మూడు తూటాలు పేలిన శబ్దం విన్నాను. గిర్రున వెనక్కు తిరిగాను. ఇద్దరు వ్యక్తులు అతని మీదకు పేలుస్తున్నారు.*

*ప్ర : పర్మెంటర్ ఎక్కడున్నాడు? కాల్పులు జరుపుతున్న రెండో వ్యక్తి ఎక్కడున్నాడు?*

*జ : పర్మెంటర్ రోడ్డుకు అడ్డంగా పరిగెత్తాడు. రోడ్డు దిగి వెళ్ళాలనుకున్నాడు. గడ్డిలో అక్కడొక రాతిమెట్టు ఉంది. అతను పడిపోతుండగా ఎవరో రక్షించారు. కింద పడుకోబెట్టారు. ఎవరో నేను చెప్పలేను.*

బోస్టాక్ కథనం ప్రకారం : ఏడెనిమిది తూటాలు పేలాయి; బెరార్డెల్లీ పైకి హంతకులలో ఒకడు నాలుగైదు సార్లు పేల్చాడు; యాభై అరవై అడుగుల దూరంలో నిల్చుని ఉన్న బెరార్డెల్లీ వేపు బోస్టాక్ వెళ్ళబోగా హంతకులు అతని వైపు తిరిగి గురిచూసి రెండు సార్లు పేల్చారు; దగ్గర్లో ఉన్న రైల్ క్రాసింగ్ వైపు బోస్టాక్ పరుగెత్తాడు; ఆ సమయంలో ఆ స్థలానికి బూయిక్ కారొచ్చింది; డబ్బు పెట్టెల్ని ముగ్గురు దుండగులు కారులోకి సర్దారు; మూడో వ్యక్తి కారులోంచి కిందకు దిగాడా లేదా, అప్పటికే అక్కడ ఉన్నాడా అనే విషయం బోస్టాక్ చెప్పలేకపోయాడు. కారు రైల్ క్రాసింగ్ వైపు వస్తుండగా వెనక సీట్లో ఉన్న మూడోవాడు ముందుసీట్లోకి మారాడు -

*విలియమ్స్ : కాల్పులు జరిపినవాళ్ళు ఎలా ఉంటారో చెప్పగలవా?*

*బోస్టాక్ : ఎందుకు చెప్పలేనూ! కాల్పులు జరిపిన వాళ్ళిద్దరూ ముదురురంగు బట్టలేసుకున్నారు. టోపీలు పెట్టుకున్నారు - ముదురురంగు టోపీలు. ఒక మోస్తరు లావుగా ఉన్నారు. నాలాగా బాగా లావుగా లేరు.*

*ప్ర : వాళ్ళ రూపురేఖల గురించి ఇంకేమైనా చెప్పగలవా?*

*జ : వాళ్ళు విదేశీయులుగా కనిపించారు.*

*ప్ర : వాళ్ళే జాతీయులో చెప్పగలవా?*

*జ : బాగా చెప్పగలను. వాళ్ళు ఇటాలియన్లని చెప్పాలి.*

. . . . . . . . . . . . . .

*ప్ర : వాళ్ళను నువ్వు గుర్తు పట్టగలవా?*

*జ : గుర్తు పట్టలేనండీ.*

*ప్ర : బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌కు ఎన్నప్పుడైనా తీసుకెళ్ళారా?*

*జ : తీసికెళ్ళారండీ.*

ప్ర : ముద్దాయిలను అక్కడ చూశావా?

జ : చూశానండీ.

ప్ర : ఈ ముద్దాయిల్లో ఎవరైనా అప్పుడు నువ్వు చూసిన ఆ మనుషుల్లో ఉన్నారేమో చెప్పగలవా?

జ : చెప్పలేనండీ. వాళ్ళోకాదో చెప్పలేను.

శాక్కోను హంతకుడిగా కొద్దోగొప్పో గుర్తుపట్టిన ప్రాసిక్యూషన్ సాక్షి లూయీ పెల్సర్ ఒక్కడే. రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీ కార్మికుడు. పోలీసుస్టేషన్‌లో శాక్కో, వాంజెట్టిలను హంతకులుగా గుర్తించ లేదితను. హంతకులను గుర్తించ గలిగేంతగా వారిని చూడలేదని చెప్పాడు. దానివల్ల అతను ఉద్యోగం పోగొట్టు కోవాల్సి వచ్చింది. కోర్టులో ప్రాసిక్యూషన్‌కు అనుకూలంగా సాక్ష్యం చెప్తానని అంగీకరించిన తర్వాతే అతనిని తిరిగి పనిలో పెట్టుకున్నారు.

సంఘటన జరిగిన సమయంలో తను బేస్‌మెంట్ పై అంతస్తులో పనిచేస్తున్నాననీ, కాల్పుల శబ్దం విని కిటికీ తలుపు తీసి ఆ దృశ్యాన్ని చూశానని పెల్సర్ సాక్ష్యమిచ్చాడు. బెరార్డెల్లీపై ఒక హంతకుడు తూటా పేల్చడం చూశాననీ, తాను చూసేసరికి చివరి తూటా పేల్చాడనీ నాలుగు తూటాలు బెరార్డెల్లీ శరీరంలోకి దూరాయనీ చెప్పాడు*. యాభై అడుగుల దూరం నుంచి పెల్సర్ సంఘటనను చూశాడు. కోర్టులో శాక్కోను చూసి అతనే ఆ హంతకుడని స్పష్టంగా చెప్పలేక పోయాడు. అయితే ఆ హంతకుడికీ శాక్కోకు పోలికలున్నాయని చెప్పాడు.

*విలియమ్స్ : అతనేనని చెప్పబోను అన్నావు. కానీ అతనికీ ఇతనికీ బాగా దగ్గరి పోలికలున్నాయన్నావు. అంటే నీ ఉద్దేశం?*

పెల్సర్ : ఇతను అలాగే కనిపిస్తాడు.

ప్ర : అతనే ఇతననే దాన్లో నీకేమైనా సందేహం ఉందా?
(డిఫెన్స్ లాయర్లు ఈ ప్రశ్నకు అభ్యంతరం లేవనెత్తారు. కానీ థేయర్ ఆ అభ్యంతరాన్ని త్రోసి పుచ్చాడు.)

జ : అతనే ఇతనని చెప్పబోను. కానీ నేను చూసిన మనిషికీ ఇతనికీ బాగా దగ్గరి పోలికలున్నాయి.

కేసు విచారణకు కొన్ని నెలల ముందు డిఫెన్స్ లాయర్ మూర్ ఈ సాక్షి దగ్గరికి డిటెక్టివ్ రెయిడ్‌ను పంపాడు. ఎవరినైనా గుర్తించగలిగేంతగా తాను సంఘటనను చూడలేదని రెయిడ్‌తో

* బెరార్డెల్లీ శవంలో నాలుగు తూటాలు దొరికాయి. వాటిలో శాక్కో దగ్గర దొరికిన కోల్ట్ మోడల్ పిస్టల్‌తో పేల్చబడిన తూటా ఒక్కటే ఉంది. మిగిలిన మూడూ వేరే రకం తూటాలు. బెరార్డెల్లీని చంపిన బందిపోటు రెండు పిస్టళ్ళతో కాల్పులు జరపలేదు. బెరార్డెల్లీ పైకి ఇద్దరు బందిపోట్లు పేల్చారని సాక్ష్యం లేదు. ఇది ఈ కేసులో మరో మిస్టరీ అంటాడు లాయర్ ఎహర్మన్.

పెల్సర్ చెప్పాడు. హంతకుల కారు నెంబర్ తప్ప ఏ విషయమూ తనకు తెలియదని పోలీసులతో చెప్పానన్నాడు. కాల్పుల శబ్దం విని తాను బల్ల కింద దాక్కున్నానని చెప్పాడు. డిఫెన్స్ లాయర్లు క్రాసు పరీక్షలో అడిగిన ప్రశ్నలకు పెల్సర్ జవాబులు అతని సాక్ష్యానికున్న కొద్దిపాటి విలువనూ ధ్వంసం చేశాయి -

*మూర్ : ఈ ఏడాది మార్చి 26న మిస్టర్ రెయిడ్ నిన్ను కలిశాడా? ఈ కేసు గురించి నీతో మాట్లాడాడా?*

*పెల్సర్ : మాట్లాడాడండి.*

*ప్ర : ఆయనతో నువ్వు మాట్లాడావా?*

*జ : మాట్లాడానండి.*

*ప్ర : తనపేరు రెయిడ్ అని చెప్పాడు. ఆయనతోపాటు మిస్ బెమిష్ (స్టెనోగ్రాఫర్) ఉంది. నిజమేనా?*

*జ : అవునండీ.*

*ప్ర : ఆయనతో నువ్వు ఇష్టపూర్తిగా నిర్మొహమాటంగా అన్ని విషయాలూ చెప్పావు. కాదా?*

*జ : అవునండీ.*

*ప్ర : ఆరోజు అంటే మార్చి 26న ఈ కేసు గురించి నీకు తెలిసినదంతా చెప్పావు.*

*జ : మొత్తం చెప్పలేదు...*

*ప్ర : చెప్పలేదా?*

*జ : చెప్పలేదండీ.*

*ప్ర : ఎందుకని చెప్పలేదు?*

*జ : కథంతా చెప్పాలనిపించలేదు.*

*ప్ర : ఇష్టపూర్తిగా, నిర్మొహమాటంగా నువ్వు మాట్లాడలేదా?*

*జ : అవునండీ. కొంతే చెప్పాను. కానీ కథ మొత్తం ఆయనకు చెప్పలేదు.*

*ప్ర : ఇంకో విధంగా చెప్పాలంటే నువ్వు చెప్పిన వాటిలో కొంత భాగమే నిజం.*

*జ : అవునండీ.*

*ప్ర : ఆయనకు చెప్పిన మిగిలిన విషయాలు నిజాలు కాదు. అంతేనా నువ్వు జారీకి చెప్పదల్చుకున్నది?*

*జ : కాదు. కథలో ఒక భాగం మాత్రమే చెప్పాను.*

*ప్ర : నువ్వు చెప్పినదంతా నిజమే. అవునా?*

*జ : అవును.*

డిటెక్టివ్ రెయిడ్‌కు తను చెప్పినదంతా నిజమేనని అంగీకరించాక మూర్ వేసిన ప్రశ్నలు పెల్సర్‌ను తికమక పెట్టాయి. రెయిడ్ ప్రశ్నలకు పెల్సర్ చెప్పిన సమాధానాలు చదివి వినిపిస్తూ మూర్ క్రాసు పరీక్షను కొనసాగించాడు -

మూర్ : (మూర్ చదివాడు) "ప్రశ్న : కాల్పులు జరపడాన్నేమైనా చూశావా?" " సమాధానం: లేదు అతను (బెరార్డెల్లి) అక్కడ పడిపోవడం చూశాను. అంతే."

మూర్ : రెయిడ్‌కు అలా అని చెప్పావా?

పెల్సర్ : చెప్పాను.

ప్ర : అది నిజం చెప్పడమేనా?

జ : అవును.

ప్ర : ... రెయిడ్‌కు నువ్వు చెప్పింది సరిగ్గా ఇంతే కదూ?

జ : రెయిడ్‌కు అలానే చెప్పాను. అవును.

ప్ర : నువ్వు చూసిన విషయాన్ని గురించి సరిగానే చెప్పావు?

జ : కాదండీ.

ప్ర : రెయిడ్‌కు నిజాలు ఎందుకు చెప్పలేదు?

జ : నా కథను చెప్పదల్చుకోనందు వల్ల.

ప్ర : ఎందుకని?

జ : కోర్టుకు వెళ్ళడం ఇష్టం లేక.

ప్ర : ఈ కేసులో సాక్షిగా పిలవబడకుండా తప్పుకునేందుకు రెయిడ్‌కు అబద్ధం చెప్పావా?

జ : అవునండీ.

ప్ర : (మూర్ చదివాడు) "ప్రశ్న : నువ్వు కిటికీ తెరిచే సరికి కాల్పులు జరపడం అయిపోయింది కదా?" "సమాధానం : అవును" నువ్వు అలా అని రెయిడ్‌కు చెప్పావా?

జ : అవునండీ.

ప్ర : అది నిజమేనా?

జ : కాదు. అది నిజం కాదు.

ప్ర : (మూర్ చదివాడు) "ప్రశ్న : అక్కడ ఎవరినైనా నువ్వు చూశావా?" "సమాధానం : చెప్తాను. నేను కిటికీ దగ్గర ఉన్నప్పుడు వాళ్ళు కాల్పులు జరుపుతున్నారు. నేను బల్లకింద దూరాను. నేను వారిని చూసిందంతే" - అలా అని రెయిడ్‌కు చెప్పావా?

జ : అవునండీ.

ప్ర : నువ్వు బల్లకింద దాక్కోలేదా?

జ : లేదండీ.

ప్ర : బల్లకింద దాక్కున్నానని రెయిడ్‌కు ఎందుకు చెప్పావు పెల్సర్? నువ్వు బల్లకింద దాక్కోవడం నిజం కాదా?

జ : కాదండీ.

ప్ర : (ప్రాసిక్యూటర్ అడిగినప్పుడు) భయపడ్డానని నువ్వు చెప్పావు?

జ : అవును.

ప్ర : అప్పుడు నువ్వు బల్లకింద దాక్కున్నావు కాదా?

జ : అవునండీ దాక్కున్నాను.

పోలీసులు తనను ప్రశ్నించినప్పుడుకూడా రెయిడ్‌కు చెప్పినట్టుగానే చెప్పానని క్రాస పరీక్షలో పెల్సర్ చివరికి అంగీకరించాడు. ఇలా పరస్పర విరుద్ధమైన సాక్ష్యం చెప్పిన పెల్సర్ ప్రాసిక్యూషన్ ఆశలన్నీ వమ్ముచేశాడు. పెల్సర్ సాక్ష్యాన్ని కట్జ్‌మన్ వదులుకోవాల్సి వచ్చింది. తన వాదనలో కట్జ్‌మన్ జూరీకి ఇలా చెప్పాడు:

*అతను డిఫెన్సుకూ అబద్ధాలు చెప్పాడు. ప్రభుత్వానికీ అబద్ధాలు చెప్పాడు.*

పెల్సర్‌ను అబద్ధాలకోరుగా నిరూపించేందుకు ముగ్గురు సాక్షులను (పీటర్ మెక్ కుల్లమ్, విలియం బ్రెన్నర్, డొమినిక్ కాన్‌స్టాన్‌టినొ) డిఫెన్స్ విచారించింది. పెల్సర్‌తోపాటు రైస్ అండ్ హచిన్స్ కార్మికులైన ఈ సాక్షులు కాల్పుల శబ్దం వినగానే పెల్సర్ బల్లకింద దాక్కున్నాడని చెప్పారు. ఈ సాక్షుల్లో ఇద్దరికి సాక్ష్యం చెప్పిన కొన్నాళ్ళకు ఉద్యోగాలు ఊడాయి.

కాల్పుల ఘటనను ప్రత్యక్షంగా చూసిన మహిళా కార్మికురాలు బార్బరా లిస్ కోంబ్‌ను ప్రాసిక్యూషన్ సాక్షిగా విచారించక పోవడంతో ఆమెను డిఫెన్స్ సాక్షిగా ప్రవేశపెట్టారు. రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీ రెండో అంతస్తు నుంచి బెరార్డెల్లీ హంతకుడిని ఆమె చూసింది. అతను శాక్కొ కాదని సాక్ష్యమిచ్చింది. కట్జ్‌మన్ క్రాసు పరీక్ష ఆమె సాక్ష్యాన్ని బలహీన పర్చలేక పోయింది. నేర స్థలం సమీపంలో గుంటల తవ్వకం జరుపుతూ నేరాన్ని ప్రత్యక్షంగా చూసిన ఐదుగురు కార్మికులు డిఫెన్స్ తరఫున సాక్ష్యం చెప్తూ హంతకుల్లో శాక్కొ, వాంజెట్టి లేరని ఘంటాపథంగా చెప్పారు. వారంతా పిరికి పందలనీ, పారలు, పలుగులు చేతుల్లో ఉండికూడా హంతకులను ఎదిరించలేని భీరువులనీ కట్జ్‌మన్ తన వాదనలో దూషించాడు.

## నేరం జరిగాక

హత్యా స్థలం నుంచి పారిపోతున్న హంతకులలో శాక్కొ, వాంజెట్టిలు ఉన్నట్టుగా నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్షుల్లో మేరీ స్ప్లెయిన్, ఫ్రాన్సిస్ డెవ్లిన్, కార్లోస్ గుడ్ రిడ్జ్ ముఖ్యమైన వాళ్ళు.

హత్యలు జరిగిన పెరల్ స్ట్రీట్‌లోని స్లేటర్ మోరిల్ కంపెనీ (నెం. 1)బిల్డింగ్ రెండో అంతస్తులో మిస్ మేరీ స్ప్లెయిన్ పనిచేస్తోంది. ఆమె యిలా చెప్పింది :

*"కాల్పుల శబ్దాలను విన్నాను.... లేచి కిటికీగుండా బయటికి చూశాను. రైలు పట్టాల్లో రెండవ దానిపైకి వస్తున్న కారును చూశాను... అది పెరల్ స్ట్రీట్‌లోకి వస్తోంది. మలుపు దగ్గరికొచ్చే సరికి ఒకడు కారు (కుడి) పక్క కన్పించాడు. నావైపు..."*

*విలియమ్స్ : మీరు చూస్తున్నప్పుడు అతనేం చేస్తున్నాడు?*
*స్ప్లెయిన్ : కారు ముందువైపు ఒక చేతిని మొదట గమనించాను. తర్వాత అతని శరీరంలో నడుము పై భాగం కారు బయట కనిపించింది.*

ప్ర : అతనేం చేశాడు...?

జ : చెప్పుల షాపువైపు చూస్తున్నాడు.

ప్ర : జూరీ సభ్యులకు అతని రూపురేఖలు చెప్పగలవా?

జ : చెప్తానండీ. నా కంటే కొంచెం పొడుగైన వాడని చెప్పాలి. 140 నుంచి 145 పౌండ్ల బరువుంటాడు. చురుకైన వ్యక్తి. ఎడమచేయి బాగా పెద్దది. బలమైనది.. *

ప్ర : నువ్వు చెప్తున్న చేతిని ఎక్కడ చూశావు?

జ : వెనకసీటు వెనక ఎడమ చేయి వుంది. ఎడమ సీటు వెనక బూడిదరంగు - నేవీ రంగు చొక్కా అనుకుంటాను అతను వేసుకున్నాడు. మీసాల్లేని శుభ్రమైన ముఖం. ఇక్కడ (చూపిస్తూ) కొద్దిగా చొట్ట. కాస్త చొట్టబోయి వుంది. విశాలమైన నుదురు. జుట్టువెనక్కిదువ్వుకున్నాడు. రెండూ, రెండున్నర అంగుళాల పొడవుందను కొంటాను. గుబురు కనుబొమలు. కానీ రంగు తెలుపు - ప్రత్యేకంగా కనిపించే ఆకుపచ్చ తెలుపు.

రైల్వే లైను నుంచి చెప్పుల షాపు వరకూ అతనిని చూశానని స్ప్లెయిన్ చెప్పింది. శాక్కోను చూపించి అతనే ఆ హంతకుడని అన్నదామె.

లాయర్ మూర్ చేసిన క్రాసు పరీక్షలో స్ప్లెయిన్ సాక్ష్యం కొంత మేరకు దెబ్బతిన్నది. కారుకు ఆమె 60 అడుగుల దూరంలో ఉంది. 18 మైళ్ళ వేగంతో కారు పోతోంది. ఆమె చూస్తుండగా కారు దూసుకువెళ్ళిన దూరం చాలా తక్కువే. ఆమె నిల్చున్న భవనం ఎత్తయినది. ఈ వివరాలన్నిటిని బట్టి ఆమె ఎవరినైనా కారులో చూసి గుర్తించగలిగే అవకాశం లేదని మూర్ నిరూపించాడు. ప్రాథమిక విచారణ జరిగిన క్విన్సీ కోర్టులో స్ప్లెయిన్ సాక్ష్యం చెప్తూ తను చూసిన హంతకుడి చేతులు రెండూ చిన్నవేనని చెప్పింది. ఆ విషయం గురించి మూర్ అడిగిన ప్రశ్నకు ఆమె ఇబ్బంది పడింది. క్విన్సీ కోర్టులో తన సాక్ష్యం సరిగా రాసుకోలేదని అబద్ధమాడింది. తను చూసిన హంతకుడు శాక్కో అని చెప్పలేననీ, అలా చెప్పేందుకు తనకు అవకాశం లేదనీ, కొన్ని పోలికలు మాత్రం ఉన్నాయని చెప్పడం కూడా తప్పుకావచ్చనీ ఆమె కిందికోర్టులో చెప్పింది. అలా చెప్పడం గురించి అడిగితే తాను అక్కడ అలా చెప్పలేదని బొంకింది.

వాంజెట్టి తరపు లాయర్ మెక్ ఎనార్నీ కూడా స్ప్లెయిన్‌ను క్రాసు పరీక్ష చేశాడు. హంతకుడిని పరీక్షగా చూసే అవకాశం తనకు లేదని కింది కోర్టులో తను ఒప్పుకున్న వాస్తవాన్ని ఆమె అంగీకరించింది. కారును ఎంతసేపు, ఎంత దూరం వరకూ ఆమె చూసిందనే ప్రశ్నలకు ఆమె కింది కోర్టులో చెప్పిన సమాధానాలతో ప్రస్తుతం చెప్తున్నవి సరిపోవడం లేదని మెక్ ఎనార్నీ నిరూపించాడు. క్రింది కోర్టులో ఆమె సాక్ష్యాన్ని పరిగణిస్తే ఆమె ఒక సెకను పాటు కూడా కారును చూడలేదు.

---

* ఆ తర్వాత కొంతకాలానికి ప్రముఖ బోస్టన్ గ్లోవ్స్ వ్యాపారి హెర్బర్ట్ డా శాక్కో చేతులను కొలిచాడు. ఎడమ చేయి 7- 3/4" కుడిచేయి 8 అంగుళాల సైజున్నాయి. గ్లోవ్స్ వ్యాపారులు ఆ సైజులో ఉన్న చేతులను చిన్న చేతులుగా పరిగణిస్తారని డా పేర్కొన్నాడు.

హత్యలు జరిగిన వారం రోజులకు మసాచూసెట్స్ పోలీసు చీఫ్ కెప్టెన్ విలియం ప్రాక్టార్ ఆఫీసుకు స్ప్లెయిన్‌ను పిలిపించారు. ఆమెకు పాత నేరస్తుల ఫోటోలు కొన్ని చూపించారు. అందులో ఒకదాన్ని చూపించి కారులో తాను చూసిన హంతకుడు అతనేనని ఆమె చెప్పింది. ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి యాంటొని పలిసమా. నేరం జరిగేనాటికి అతను జైల్లో ఉన్నాడని తేలింది.

*మెక్ ఎనార్నీ : కారులోంచి తలబయటికి పెట్టిన మనిషి ఫోటోనే ఆ ఫోటో అని నువ్వు గుర్తుపట్టావు*

*స్ప్లెయిన్ : కాదండీ. ఖచ్చితంగా అదేనని చెప్పలేదు*

*ప్ర : "కార్లోంచి తల బయటికి పెట్టిన మనిషి అతనేనమకుంటాను" అని నువ్వు చెప్పలేదా?*

*జ : అతనికి కొన్ని పోలికలున్నాయి అన్నీకాదు*

*ప్ర : క్షమించాలి. నా ప్రశ్నకు అవును లేదా కాదు అని సమాధానం చెప్పలేవా?*

*జ చెప్పలేను.*

*ప్ర : మొత్తం మీద నీకు చూపించిన ఫోటోల్లో ఒకదాన్లో ఉన్న వ్యక్తి పోలికలు కార్లోంచి తలబయటికి పెట్టిన మనిషివని నువ్వు చెప్పలేదా మేడమ్?*

*జ . (ఫోటోలో చూపిన మనిషికీ) అతనికీ కొట్టొచ్చే పోలికలున్నాయి*

. . . . . . . . . . .

*ప్ర : ఈ నేరం జరిగేనాటికి అతను (ఫోటోలో ఉన్నవ్యక్తి) సింగ్ సింగ్ (జైలు)లో ఉన్నాడని తర్వాత నీకు తెలిసింది.*

*జ : అతను (జైలు) బయట లేడని నాకు తెలిసింది.*

పోలీసు స్టేషన్‌లో ఆమెకు శాక్కోను చూపించినప్పుడు అతన్ని ఒక్కడినే చూపించారు. చట్ట ప్రకారం జరిపే గుర్తింపు పెరేడ్ * జరపలేదు. ఆ విషయంపై మెక్ ఎనార్నీ వేసిన ప్రశ్నలకు స్ప్లెయిన్ నిజమే చెప్పింది. కారులో వెళ్తున్న వ్యక్తిని చూసేందుకు తనకు తగు అవకాశం లేదని ఒప్పుకుంది.

*మెక్ ఎనార్నీ : అతనిని గమనించేందుకు నీకు సరైనా అవకాశం లేదని కింది కోర్టులో సమాధానం చెప్పావు. గమనించేందుకు తగినంత అవకాశం నీకు లేదని చెప్పడంలో నీ ఉద్దేశం?*

*స్ప్లెయిన్ : అతను వీధిలో వెళ్తూ ఉన్నాడు.*

*ప్ర : అతను వీధిలో పోతూ ఉన్నాడు. అతన్ని గుర్తించేంతగా చూసే అవకాశం నీకు లేదు. అంతేనా?*

*జ : నేనన్నది అదే.*

---

* *'టెస్ట్ ఐడెంటిఫికేషన్ పెరేడ్' అని అంటారు. నేరంలో అనుమానితుడిని కొందరు అనుమానితులు కాని వాళ్ళలో కలిపి నిలబెట్టి సాక్షులను గుర్తించమని అడిగే ప్రక్రియ. ఈ కేసు మొత్తంలో పోలీసులు ఆపని చేయ లేదు.*

ప్ర : అదొక్కటే (అతన్ని చూసేందుకు) నీకున్న అవకాశం.

జ : అవునండీ.

ప్ర : ఒక్క క్షణం చూడటం తప్ప నీకు వేరే అవకాశం లేదు?

జ : దాన్ని గుర్తు పెట్టుకునే అవకాశం ఉంది.

హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ మోర్టన్ ప్రిన్స్, స్ప్లెయిన్ సాక్ష్యాన్ని విశ్లేషిస్తూ ఇలా చెప్పాడు -

ప్రభుత్వం తరఫు ప్రధాన సాక్షి, మనస్తత్వరీత్యా అసాధ్యమైన విషయాన్ని నిజాయితీగా చెప్పిందని చెప్పేందుకు నేను సంకోచించను. కాల్పులు జరుగుతున్న సమయంలో సుమారు 60 అడుగుల దూరంనుంచి, 15-18 మైళ్ళ వేగంతో వెళ్తున్న కారులో 1-1/2 సెకన్లపాటు మాత్రమే శాక్కోను చూసినప్పటికీ అతని శరీరాకృతికి సంబంధించిన 16 వివరాలను ఏదాది చివరివరకూ గుర్తుంచుకొని ఆమె వర్ణించింది. అతని చేయి పరిమాణాన్నీ, నుదుటినీ, జుట్టు పొడవునూ,..... అతని కనుబొమల ఆకృతినీ కూడా గుర్తు పెట్టుకొని వర్ణించింది! ఆ పరిస్థితుల్లో అలాంటి గ్రహణశక్తి, జ్ఞాపక శక్తి మనస్తత్వరీత్యా అసాధ్యమని రుజువు చేయడం తేలిక. ప్రతి సైకాలజిస్టుకూ ఇది తెలుసు... ఆమె సాక్ష్యాన్ని నమ్మేటంత అజ్ఞానంలో జారీ ఉందని తెలిసికూడా ముద్దాయిలను శిక్షింపజేసేందుకు ఈ విధమైన సాక్ష్యాన్ని ప్రవేశపెడ్తున్న ప్రభుత్వ శత్రు పూరిత వైఖరిని, నిజాయితీని గురించి మనం ఏమనుకోవాలి.

శాక్కో రూపు రేఖలతో స్ప్లెయిన్‌కు పరిచయం ఎలా కలిగింది?

సమాధానం తేలికే. అనేక సందర్భాల్లో శాక్కోను ఆమెకు చూపించారు. జాగ్రత్తగా అతన్ని పరిశీలించేందుకు ఆమెకు అవకాశం చిక్కింది. అంతకంటే మించి అతను కోర్టులో ఆమెకెదురుగా కూర్చున్నాడు. పోలీసుకోర్టులో జరిగిన ప్రాథమిక విచారణ సమయంలో శాక్కోను ఇతరులతో కలిపి నిలబెట్టి గుర్తించమని ఆమెను అడగలేదు. శాక్కో ఒక్కడినే ఆమెకు చూపించారు. ఆ పరిస్థితుల్లో పరిశీలనగా చూసేవారి మనసులో ఆ వ్యక్తి ప్రతిబింబం ఆ తర్వాత రూపుదిద్దుకుంటుంది లేదా రూపు దిద్దుకునే అవకాశముంది. తర్వాత అదొక తప్పుడు జ్ఞాపకంగా మారుతుంది. ఇది ప్రతి ఒక్కరికీ తెలిసిన సంగతే. ప్రేరేపణతో అలాంటి జ్ఞాపకం ఏర్పడుతుంది. తర్వాత సంపాయించిన జ్ఞానం వల్ల తెలియకుండానే జ్ఞాపకం తప్పుడుదై పోతుందని ప్రతి లాయర్‌కూ తెలుసు.

శాక్కోను పదిమందిలో నిలబెట్టి గుర్తించమని స్ప్లెయిన్‌ను అడిగినట్లైతే ఆమె మెదడులో తప్పుడు జ్ఞాపకం ఏర్పడి వుండేది కాదని డాక్టర్ ప్రిన్స్ అభిప్రాయం.

తప్పుడు తడకల సాక్ష్యమిచ్చిన ఈ అబద్ధపు సాక్షి గురించి కట్జ్‌మన్ వాదిస్తూ ఆమె

స్పష్టమైన నిజాన్ని చెప్పిందన్నాడు. 'సుకుమారమైన ఆమె కళ్ళనుంచి నిజం నక్షత్రాల లాగా మెరుస్తోంద'ని కొనియాడాడు.

స్ప్లెయిన్‌తోపాటుగా అదే ఫ్యాక్టరీ రెండవ అంతస్తునుంచే శాక్కోను చూసి గుర్తుపట్టగలిగానని మరో సాక్షి ఫ్రాన్సిస్ డెవ్లిన్ చెప్పింది కానీ పోలీసుస్టేషన్లోనూ క్విన్సీ కోర్టులోనూ ఆమె అందుకు భిన్నంగా చెప్పింది శాక్కోను తను చూసిన హంతకుడిగా గుర్తించలేనన్నది. కానీ ఏడాది తర్వాత డెడ్హాం కోర్టులో చెప్పిన సాక్ష్యంలో, హంతకుడు శాక్కో అనే విషయంలో తనకెప్పుడూ ఎలాంటి సందేహమూ లేదని తడబాటు లేకుండా పేర్కొంది

స్ప్లెయిన్ లాగానే డెవ్లిన్ కూడా క్రాసుపరీక్షకు తట్టుకోలేక పోయింది. నేరం జరిగాక నెలరోజులకు తను శాక్కోను చూసినప్పుడు 'శాక్కోనే నేరస్తుడ' నితన 'మనసులో ఉన్నప్పటికీ నేరం తీవ్రతను బట్టి ఖచ్చితంగా చెప్పలేద' నీ తను 'తెలిసీ అబద్ధం చెప్పాన' నీ చెప్పి క్రాసుపరీక్షలో ఆమె తప్పుకో జూసింది.

స్లేటర్ మోరిల్ (నెం.1) ఫ్యాక్టరీ భవనంలోనే మూడో అంతస్తులో ఉండి కారులో వెళ్తున్న హంతకులను చూసిన ఫెర్గూసన్ పియర్స్‌లు డిఫెన్స్ సాక్ష్యులయ్యారు. హంతకులలో ఎవరినైనా గుర్తించడం అసాధ్యమని వారు చెప్పారు.

పారిపోతున్న హంతకుల కారులో శాక్కోను చూశానని మరో ప్రాసిక్యూషన్ సాక్షి కార్లోస్ గుడ్‌రిడ్జ్ చెప్పాడు. పెరల్ స్ట్రీట్‌లో తను పనిచేసే జూదగృహం ముందు నిల్చుని వీధిలో వెళ్తున్న హంతకుల కారును చూశానన్నాడు ఒక హంతకుడు తనవేపు తుపాకీ గురిపెట్టగా భయపడి లోపలికెళ్ళిపోయానన్నాడు. ఆ హంతకుడు శాక్కో అని సాక్ష్యమిచ్చాడు.

గుడ్‌రిడ్జ్ మాజీ నేరస్తుడు. వేరే రాష్ట్రంలో దొంగతనం నేరం ఒప్పుకొని సత్ప్రవర్తన కలిగుంటానని చెప్పి జామీనుపై విడుదలయ్యాడు. అక్కడ్నుంచి మసాచుసెట్స్‌కు పారిపోయి వచ్చి మారుపేరుతో ఈ కేసులో సాక్ష్యం చెప్పాడు. తనకు తిరిగి శిక్ష విధిస్తారనే భయం వల్ల పోలీసుల వత్తిడికి లొంగి శాక్కోకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. గుడ్‌రిడ్జ్‌పై క్రిమినల్ కేసు ఉందని నిరూపించేందుకు డిఫెన్స్ లాయర్లకు జడ్జిథేయర్ అవకాశం ఇవ్వలేదు.

గుడ్‌రిడ్జ్ సాక్ష్యం అబద్ధమని నలుగురు వ్యక్తులు డిఫెన్స్ తరపున సాక్ష్యమిచ్చారు. బ్రెయిన్‌ట్రీ ఘటన జరిగిన గంట తర్వాత గుడ్‌రిడ్జ్ మాట్లాడుతూ హంతకుల రూపురేఖలేవీ చెప్పలేక పోయాడని జూదగృహం యజమాని మంగనారో చెప్పాడు. శాక్కో, వాంజెట్టిల అరెస్టు వార్త దినపత్రికలలో చదివిన మంగనారో పోలీసు స్టేషన్‌కెళ్ళి వాళ్ళను చూసిరమ్మని గుడ్‌రిడ్జ్‌కి సలహా ఇచ్చాడు. తుపాకి చూడగానే భయపడి తనున్న చోటునుంచి ఉన్నపళంగా పారిపోయినందువల్ల తనకు హంతకుల ముఖాలు జ్ఞాపకం లేవని గుడ్‌రిడ్జ్ మంగనారోతో చెప్పాడు. హంతకుల ముఖాలు చూస్తే గుర్తుపట్టగలననిపిస్తే వెళ్ళి చూడమని మంగనారో అతనికి సలహా యిచ్చాడు. ఆ రోజుకూలీ ఇస్తానని చెప్పినప్పటికీ గుడ్‌రిడ్జ్ పోలీసుస్టేషన్‌కు వెళ్ళలేదని మంగనారో చెప్పాడు.

నేరం జరిగిన తర్వాత పారిపోతున్న నేరస్తుల్లో వాంజెట్టిని చూశామని ప్రాసిక్యూషన్ తరఫున ఇద్దరు రైల్వే గేట్ మెన్‌లు సాక్ష్యం చెప్పారు. మైకేల్ లెవాంజీ నేరస్థలం దగ్గర్లోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్‌మన్ కాగా, ఆస్టిన్ రీడ్ నేరస్తులు పారిపోయిన దార్లోని మరొక రైల్వే క్రాసింగ్ గేట్‌మన్.

సంఘటన జరిగిన వెంటనే బందిపోట్లు హంతకులు పారిపోతూ రైల్వే క్రాసింగ్ వేపుగా కారులో వచ్చారు. ఆ సమయంలో గేటు దించుతున్నానని లెవాంజీ తన సాక్ష్యంలో చెప్పాడు:

*అది (కారు) గేటు దాకా వచ్చింది. నేను గేట్లు వేశాను. ఈ లోగా నా తలవేపు రివాల్వర్ ఎక్కుపెట్టబడి వుందని గమనించాను . వాళ్ళను వెళ్ళనిచ్చేందుకు అవకాశం ఉందేమోనని వెనక్కు తిరిగి రైలు వేపు చూసాను.... వాళ్ళను వెళ్ళనిచ్చి తిరిగి గేటు వేసాను.*

తర్వాత విలియమ్స్ ప్రశ్నలకు లెవాంజీ సమాధానాలిలా ఉన్నాయి :

*విలియమ్స్ : ఆ కారులో నువ్వెవరినైనా చూశావా?*
*లెవాంజీ : ఒకడ్ని చూశాను.*

*ప్ర : ఎక్కడ?*

*జ : కారు నడుపుతుండగా.*

*ప్ర : .... నువ్వు చూసిన మనిషి రూపురేఖలు చెప్తావా?*

*జ : ముదురురంగు. బుగ్గఎముకలు ముందుకు పొడుచుకొచ్చాయి. నల్లటి జుట్టు, గోధుమరంగు మీసాలు, టోపీ, ఆర్మీకోటు.*

*ప్ర : కారు బాగా దగ్గరికి వచ్చినప్పుడు అతనికి నువ్వెంత దూరంలో ఉన్నావు?*

*జ : నేను కొలవలేదు. కానీ పది పన్నెండడుగుల దూరంలో ఉన్నానని చెప్పాలి.*

*ప్ర : ఆ తర్వాత అతన్నెప్పుడైనా నువు చూశావా?*

*జ : చూశాను.*

*ప్ర : ఎక్కడ......?*

*జ : బ్రాక్‌టన్ పోలీసుస్టేషన్‌లో*

*ప్ర : ఆ తర్వాత మళ్ళీ చూశావా?*

*జ : చూశాను. (వాంజెట్టి వేపు చూపించాడు)*

డిఫెన్స్ లాయర్ థామస్ మెక్ ఎనార్నీకి లెవాంజీ పాత క్లయింటే. తమ పరిశోధనలో భాగంగా జెరెమీ మెక్ ఎనార్నీ కేసు విచారణకు ముందుగానే లెవాంజీని ఇంటర్వ్యూ చేసి నోట్ తయారు చేసుకున్నాడు. కారులో నుంచి తనవేపు గురిపెట్టబడిన తుపాకీ చూసి భయపడి పరిగెత్తి తన షాంటీలో దాక్కున్నానని చెప్పాడు. తుపాకీమినహా కారులో ఉన్నవారెవరినీ తాను చూడలేదని చెప్పాడు. మెక్ ఎనార్నీ క్రాసుపరీక్ష ఇలా సాగింది :

జెరెమీ మెక్ఎనార్నీ : .... నువు నాతో రెండు మూడు వారాల క్రితం మాట్లాడావు. అవునా?

లెవాంజీ : మాట్లాడానని నమ్ముతున్నాను.

ప్ర : ఏమంటున్నావు?

జ : మాట్లాడాననుకుంటున్నాను.

ప్ర : నువు మాట్లాడావని నీకు తెలుసుకదా? దాన్లో సందేహమేమైనా ఉందా? సందేహముంటే చెప్పు లెవాంజీ?

జ : నాకు తెలియదు.

ప్ర : దాని గురించి నీకు సందేహముందో లేదో నీకు తెలియదా? నా దగ్గర రివాల్వర్ లేదు. ఉందా? నా చేతుల్లో మెరిసేదేదీ లేదు కదా?

జ : లేదు.

.....

ప్ర : (కారు) ముందుసీట్లో కూర్చున్న మనిషి గురించి నువు నాతో మాట్లాడటం గుర్తుందా?

జ : లేదండీ.

ప్ర : నాతో ఏమైనా చెప్పావా?

జ : నాకు తెలియదు.

....

ప్ర : నా సోదరుడు నీ తరఫున ఒక కేసులో వాదించాడని నువు నాకు చెప్పలేదా?

జ : నాకది గుర్తులేదు.

దుండగులను తాను చూడలేదని చెప్పిన విషయం కూడా గుర్తులేదని లెవాంజీ చెప్పాడు.

లెవాంజీ తోటి ఉద్యోగి హెన్రీ మెకార్తీ డిఫెన్స్ తరఫున సాక్షిగా వచ్చి లెవాంజీ అబద్ధాలు చెప్తున్నాడని సాక్ష్యమిచ్చాడు. నేరం జరిగిన గంటలోపే రైల్వే ఫైర్‌మన్ మెకార్తీ అతనితో మాట్లాడాడు. మెకార్తీ కథనం ప్రకారం : లెవాంజీ గేటు దగ్గరున్నాడు. గేట్లు తీసివున్నాయి.

"ఏదో కాల్పుల ఘటన జరిగిందక్కడ... ఎవరో కాల్చారు" అన్నాడు లెవాంజీ.

"ఎవరో?" మెకార్తీ అడిగాడు.

"ఎవరో... ఒకాయన హత్య చేయబడ్డాడు"

"ఎవరు చేశారు?"

తనకు తెలియదన్నాడు లెవాంజీ. కారులో ఎవరో కొందరు ఆ దారిగుండా వెళ్ళారనీ, తర్వాత తనకు కాల్పుల శబ్దం వినిపించిందనీ, గేటు వేసేందుకు ప్రయత్నించగా కారులో వున్నవాడొకడు తుపాకీ గురిపెట్టగా తను షాంటీలో దాక్కున్నాననీ లెవాంజీ మెకార్తీకి చెప్పాడు.

వాళ్ళతనికి తెలుసేమో అడిగాను. లేదన్నాడు. వాళ్ళను చూస్తే గుర్తు పట్టగలడేమో అడిగాను. లేదు అన్నాడు. తను తుపాకీని మాత్రమే చూడగలిగాననీ, తర్వాత దాక్కున్నాననీ చెప్పాడు.

కాల్పులు జరిగిన ఇరవై నిమిషాలకు లెవాంజీని కలిసిన జర్నలిస్టు టిమోతీ కోలిన్స్ బోస్టన్ గ్లోబ్ దినపత్రికలో తర్వాతి రోజు ఇలా రాశాడు:

*. . . . . .నేను గేట్‌మన్‌తో మాట్లాడాను. అతని పేరు లెవాంజీ. గేటు కిందకు దించుతూ నిల్చున్నాననీ, ఒక కారు గేటు వైపు వచ్చిందనీ, కారులో నుంచి ఎవరో 'వాటిని పైకెత్తు! వాటిని పైకెత్తు! లేకపోతే నీకు బొక్క పెడతాం' అంటూ అరిచారని చెప్పాడు. తను (గేట్లు) పైకెత్తాననీ, గూడ్స్ ట్రైను వెళ్ళేందుకు కొద్ది క్షణాల ముందే కారు వెళ్ళిపోయిందనీ చెప్పాడు. తను చూసిన మనుషుల రూపురేఖలు చెప్పమని నేనతన్ని అడిగాను. తనెవర్నీ చూడలేదనీ, తాను ఎవరినీ చూడలేనంతగా భయపడ్డాననీ అతను చెప్పాడు. 'కారులో ఉన్న వీ ఒక్కరినైనా ఒక్క క్షణమైనా చూడలేదా' అని అడిగాను. 'నేను చూసిందల్లా పాడు తుపాకీ గొట్టాన్నే. వెనక్కు తిరిగాను. షాంటీ వైపు పారిపోయాను. షాంటీపైకి తూటా పేల్చారు' అన్నాడతను.*

హంతకులను గుర్తించడం కష్టమని నేరం జరిగిన వెంటనే లెవాంజీ చెప్తుండగా విన్న అలగ్జాండర్ విక్టర్ సన్ డిఫెన్స్ తరపున సాక్ష్యమిచ్చాడు. కారు డ్రైవర్ లేత రంగులో ఉన్నాడని లెవాంజీ చెప్పాడని స్లేటర్ మోరిల్ కంపెనీ కార్మికుడు ఎడ్వర్డ్ కార్వర్ డిఫెన్స్ తరపున కోర్టులో చెప్పాడు.

లెవాంజీ సాక్ష్యానికీ, మిగిలిన ప్రాసిక్యూషన్ సాక్షుల సాక్ష్యానికీ మధ్య బాగా వైరుధ్యం ఉంది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కారు డ్రైవర్ సన్నగా లేతరంగులో ఉన్న నవయువకుడు. పల్చటి జుట్టుంది. వాంజెట్టి నవ యువకుడు కాదు. అతనిది ముదురు ముఖం.

ఈ వైరుధ్యం ప్రాసిక్యూటర్‌ను బాగా ఇబ్బంది పెట్టింది. వాంజెట్టి కారు నడిపాడని లెవాంజీ చెప్పిన సాక్ష్యం తప్పని చెప్తూనే అతని సాక్ష్యాన్ని నమ్మవలసిందని జూరీని కట్జ్‌మన్ కోరాడు. డ్రైవర్ వెనక సీట్లో వాంజెట్టి కూర్చుని వుండగా లెవాంజీ హఠాత్తుగా చూసి వాంజెట్టినే డ్రైవర్ అని భ్రమ పడ్డాడని సమర్థించుకున్నాడు. లెవాంజీ సాక్ష్యం చెప్పే నాటికే కారులో హంతకులను చూసి వారి రూపురేఖలు చెప్పగలిగిన మిన్నీ కెనడీ, లూయీ హేయస్‌ల సాక్ష్యాలు కట్జ్‌మన్ దగ్గరున్నాయి. వాళ్ళు చెప్పే కారు డ్రైవర్ పోలికలకు, వాంజెట్టి పోలికలకు పొంతన లేదు. అందుకే ప్రాసిక్యూటర్ వాళ్ళిద్దర్నీ సాక్షులుగా కోర్టుకు పిలవకుండా లెవాంజీని మాత్రమే పిలిపించాడు.

మరో సాక్షి గేట్‌మన్ ఆస్టిన్ రీడ్ ఘటన జరిగిన రోజు మాట్ ఫీల్డ్ రైల్వే క్రాసింగ్ దగ్గర డ్యూటీలో ఉన్నాడు. రైలు రాకను సూచిస్తూ 'స్టాప్' సిగ్నల్ పట్టుకుని రోడ్డుకు అడ్డంగా నిల్చుని ఉండగా బందిపోట్ల కారు అక్కడికి రావడాన్ని గమనించానని సాక్ష్యంలో చెప్పాడు. రైలు వెళ్ళే

దాకా అక్కడ ఉండాల్సి వచ్చినందుకు ఒక ఆగంతకుడు మండిపడి తనను బెదిరించాడన్నాడు. వాంజెట్టిని చూపించి అతనే తనను బెదిరించిన వ్యక్తి అని చెప్పాడు. రీడ్ సాక్ష్యం ప్రకారం, అతన్ని బెదిరించిన వ్యక్తి స్వచ్ఛమైన ఇంగ్లీషు మాట్లాడాడు. వాంజెట్టికి ఇంగ్లీషు మాట్లాడటం అప్పటికి సరిగా రానేరాదు.

హంతకులు పారిపోయిన కారులో శాక్కొ, వాంజెట్టిలు లేనే లేరని డిఫెన్స్ తరపున మొత్తం 31 మంది సాక్ష్యం చెప్పారు. వారిలో ముఖ్యుడు బర్కే.

ఫ్రాంక్ బర్కే వీధుల వెంట తిరుగుతూ చిల్లర సామాన్లు అమ్ముతాడు. నేరం జరిగే సమయానికి ఆ సమీపంలోని రైల్వే క్రాసింగ్ దగ్గర్లో అతను రోడ్డు మీద నడుస్తున్నాడు. కారులోని హంతకులను పదడుగుల దూరం నుంచి చూశాడు. అప్పటికి హంతకులు పారిపోతున్న కారు క్రాసింగ్‌ను సమీపిస్తోంది. ఇద్దరు ఆగంతకులు పరిగెత్తి కారు వెనక సీట్లోకి ఎక్కారు. వారిలో ఒకడు మెల్లగా ముందు సీట్లోకి మారి డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. ఆ క్షణంలో కార్లోంచి ఎవరో తుపాకీ పేల్చారు. కారు వెనుక ఎవరో ఒక వ్యక్తి పరిగెత్తుతూ *"వాళ్ళను ఆపండి! వాళ్ళనాపండి!"* అంటూ అరుస్తున్నాడు. ముందు సీట్లోకి మారిన మనిషి ముందుకొంగి తలుపు పట్టుకొని రివాల్వర్ బర్కే వేపు గురి పెట్టాడు. *"దారి కడ్డం తప్పుకో లంజా కొడకా"* అన్నాడు. స్పష్టమైన ఇంగ్లీషులో మాట్లాడాడు. దుండగులు పేల్చిన తూటా బర్కే కోటులోంచి దూసుకు వెళ్ళింది. కొద్దిగా పక్కకు తిరిగితే అతన్ని ఆ తూటా గాయపర్చేదే. కారు వెనక సీట్లో వున్న మరో ఇద్దరిని చూశానని కూడా బర్కే తన సాక్ష్యంలో చెప్పాడు. ముద్దాయిల అరెస్టు గురించి తెలిసి బ్రాక్‌టన్ పోలీసు స్టేషన్‌కు వెళ్ళిన బర్కే వారు హంతకులు కారని ఘంటాపథంగా చెప్పాడు. బర్కేను కట్జ్‌మన్ సాక్షిగా విచారించలేదు. డిఫెన్స్ తరపున సాక్ష్యమివ్వగా కట్జ్‌మన్ తన తెలివంతా వుపయోగించి ఈ సాక్షిని పడగొట్టేందుకు ప్రయత్నించాడు.

*కట్జ్‌మన్: హత్య జరిగిందని ఏప్రిల్ 15న ఎప్పుడు నీకు మొదటిసారి తెలిసింది?*
*బర్కే:* కారు నేనున్న చోటును దాటి వెళ్ళాక.
ప్ర: *. . . . . కాబట్టి ఆ క్షణం దాకా ఈ గొడవకు కారణమేమిటో నీకు తెలియదు?*
జ: లేదు.
ప్ర: *అందువలన, కారు గురించిగానీ, దాన్లో ఉన్న వాళ్ళ గురించిగానీ నువ్వు పట్టించుకోలేదు. పట్టించుకున్నావా?*
జ: *వాళ్ళ గురించి నేను పట్టించుకున్నాను. ఎందుకంటే అవును. . .*
ప్ర: *ఎవరో ముందుకు వంగి నీపై రివాల్వర్ గురి పెట్టిందాకా వాళ్ళ గురించి ఆసక్తి కలగలేదు. కలిగిందా?*
జ: *అంతకు ముందు, సంఘటన తర్వాత ఆ వ్యక్తులు పరుగెత్తి కారు ఎక్కడంతో నాకు వారి పట్ల ఆసక్తి కలిగింది.*

ప్ర: అక్కడ కాల్పులు జరిగినట్టు నీకు తెలిసిందా?

జ: కాల్పులు జరగడం నేను విన్నాను.

ప్ర: కారు వేపు పరిగెత్తుతున్న వ్యక్తులకు, కాల్పుల సంఘటనకు సంబంధమేదైనా ఉందన్న సంగతి నీకు తెలిసిందా?

జ: అవును. . . . . ఉందనుకున్నాను.

ప్ర: ఎవరినైనా చంపారని నీకు తెలియదు కదూ?

జ: లేదు.

ప్ర: కాల్పులు విన్నావు. అంతే కదూ. ఏ వైపు నుంచి వీళ్ళిద్దరూ కారెక్కారు? ఎడమవేపా? కుడివేపా?

జ: దక్షిణం వేపు.

ప్ర: అంటే-

జ: కారుకు ఉత్తరదిశగా అది ఎడమ వేపు అవుతుంది.

ప్ర: ఏ దిశగా కారు ప్రయాణిస్తోంది?

జ: నా వేపుగా

ప్ర: దిక్సూచిని బట్టి చెప్పు.

జ: ఉత్తరదిశగా. అవును.

. . . . . . . .

ప్ర: నువ్వు మొదట కాల్పులు విన్న తర్వాత ఎంతసేపటికి వీళ్ళిద్దరు పరిగెత్తుతుండగా చూశావు?

జ: బహుశా ముప్పావు నిమిషం తర్వాతని చెప్పాలి.

ప్ర: ఆ నలభై ఐదు సెకండ్లలో ఏం జరిగింది?

జ: నేను రోడ్డు దిగువగా నడిచాను.

. . . . . . . . .

ప్ర: నీకు బూయిక్ కారు తెలుసా?

జ: లేదండీ.

ప్ర: ఎప్పుడైనా బూయిక్ కారు చూశావా?

జ: చూశానండీ.

ప్ర: అది బూయిక్ కారని ఎలా చెప్పగలవు?

జ: ఈ రోజు ఉదయం బూయిక్ కారును చూశాను. దాన్లో నేను ప్రయాణం చేశాను. దాన్లో ఎక్కే ముందు నేను దాని నేమ్ ప్లేటు చూశాను.

ప్ర: ఈ ఉదయం నువ్వు ప్రయాణించిన బూయిక్ కారు ఎవరిది?

జ: (అయిష్టంగా) లాయర్ కెలహాన్ గారిది.

. . . . . . . .

ప్ర: అది హడ్సన్ కారా? బూయిక్ కారా?

జ: . . . . . అది హడ్సన్ కారనుకుంటాను. నాకు కార్ల గురించి పరిజ్ఞానం లేదని అది తెలియజేస్తోంది.

తర్వాత, సాక్షి కంటి చూపు గురించి కట్జ్‌మన్ ప్రశ్నలు సంధించాడు. ఎంత దగ్గరి నుంచి కారు నేమ్ ప్లేటు చూశావని అడిగాడు. కళ్ళజోడు పెట్టుకోకుండా కాగితాలు చదవలేననీ, తనెప్పుడూ కళ్ళద్దాలు పెట్టుకుంటాననీ బర్కే ఒప్పుకున్నాడు.

ప్ర: నువు కారులో ఉన్న వాళ్ళను చూడటం మొదలు పెట్టే సరికి అదెక్కడుంది?

జ: క్రాసింగ్ మధ్యలోకి వచ్చేప్పుడు. . . . క్రాసింగ్ దగ్గరికి వచ్చే సరికి......
. . . . . . . . . .

ప్ర: మొదట నువ్వెవరిని గమనించావు?

జ: కారు ఎక్కుతున్న మనిషిని. . . . కారు డ్రైవర్‌ను. . . . కారు డ్రైవర్‌నే.

ప్ర: ఎంతసేపు నువ్వతన్ని చూశావు?

జ: నేనతన్ని ఎంతో సేపు చూడలేదు.

ప్ర: ఎంతసేపు చూశావతన్ని?

జ: నేను చెప్పలేను.

ప్ర: నీకు గుర్తున్నంత మేరకు చెప్పు.

జ: ఒక నిమిషం కంటే తక్కువ.

ప్ర: ఒక నిమిషం కన్నా ఎంత తక్కువ!

జ: నాకు తెలియదు. అలాంటి సంగతులను నేనంతగా గుర్తు పెట్టుకోలేదు. ఎందుకంటే నాకు తెలియదు. కట్జ్‌మన్‌గారూ! నాకు చేతనైన మేరకు ప్రయత్నిస్తున్నాను. కానీ నేను మీతో ఎంత నిష్కల్మషంగా వ్యవహరిస్తున్నానో మీరూ నాతో అలాగే ప్రవర్తించాలనుకుంటున్నాను. నేను చూసినదాన్ని చెప్పేందుకే ఇక్కడికొచ్చాను.

బర్కే అన్న ఆ చివరి వాక్యాలను రికార్డు నుంచి తొలగించమని కట్జ్‌మన్ న్యాయమూర్తిని కోరాడు. తొలగించమని థేయర్ ఆదేశించాడు.

## అపరాధ భావన

**కే**సులో సాక్షుల విచారణ మొదలైన రెండు వారాలకు ప్రాసిక్యూషన్ కొత్త ఎత్తుగడ వేసింది. అపరాధ భావన (Consciousness of Guilt) ను నిరూపించేందుకు పూనుకుంది.

నేరం జరిగాక అనుమానితులెవరైనా మారు పేర్లతో సంచరిస్తే, పారిపోతే లేదా అదే విధమైన నేరాలు చేసిన వాళ్ళతో కలిసి తిరిగితే లేదా మరే విధంగానైనా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వారు నేరంలో పాల్గొన్నారని అనుమానించేందుకు అవకాశముంది. అయితే అంత మాత్రం

చేతనే సదరు వ్యక్తులను నేరస్తులుగా నిర్ధారించే శక్తి ఈ తరహా సాక్ష్యాలకు ఉండదు. నేరంలో పాల్గొన్నారని నిరూపించే ఇతర సాక్ష్యాల తోడు లేకపోతే ఈ అపరాధ భావన సాక్ష్యాలు ఎందుకూ కొరగావు. అందువల్ల ఈ విధమైన సాక్ష్యాలను 'పరాన్నజీవి సాక్ష్యం' **(Parasitic Evidence)** అని అంటారు. వాటికవే సాక్ష్యాలు కావు. నేరాన్ని నిరూపించే వేరే సాక్ష్యాల ఆధారంతో ఇవి జీవం పోసుకుంటాయి. చాలా బలహీనమైన సాక్ష్యాలుగా వీటిని న్యాయశాస్త్రం పరిగణిస్తుంది. తమ అనుమానాస్పద ప్రవర్తనకు ముద్దాయిలు వేరే కారణం చూపగలిగితే ఈ సాక్ష్యాలు ఆ కాస్త విలువనూ కోల్పోతాయి.

అపరాధ భావన ను నిరూపించే సాక్ష్యాలు ప్రవేశ పెడుతున్నట్టుగా ముందుగా ప్రాసిక్యూషన్ ప్రకటించలేదు. సాక్షుల విచారణకు ముందు విలియమ్స్ చేసిన ప్రారంభ ప్రకటన లో కూడా ఈ విషయాన్ని కనీసం ప్రస్తావించలేదు. బోడా, ఓర్సియానిలతో కలిసి శాక్కో, వాంజెట్టిలు కారు కోసం జాన్సన్ ఇంటికి వెళ్ళినప్పుడు అనుమానాస్పదంగా వ్యవహరించారనీ, అరెస్టయినప్పుడు పిస్టళ్ళు తీసి పోలీసులను ప్రతిఘటించేందుకు ప్రయత్నించారనీ, ఇంటరాగేట్ చేసినప్పుడు పొంతన లేని పలు అబద్ధాలు చెప్పారనీ- ఆ విధంగా *అపరాధ భావనను* ప్రదర్శించారనీ ప్రభుత్వ వాదన. గేరేజీ యజమాని సైమన్ జాన్సన్, ఆయన భార్య రూత్ జాన్సన్, పోలీసు అధికార్లు మైకేల్ కొనొలి, మైకేల్ స్టెహర్ట్, పోలీసు కారు డ్రైవర్ మెర్ల్ స్ప్రియర్ సాక్ష్యాన్ని ఇందుకోసం ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టింది.

శాక్కో, వాంజెట్టిలనూ, ఓర్సియాని, బోడాలనూ చూసి తనకు అనుమానం వచ్చి పోలీసులకు ఫోన్ చేసేందుకు పొరుగింటికి వెళ్ళానని రూత్ జాన్సన్ చెప్పింది. తన వెనకే ముద్దాయిలిద్దరూ నడుస్తూ అనుసరించారనీ, పొరుగింటి నుంచి తిరిగి వచ్చేటప్పుడు కూడా వారు అలాగే చేశారనీ ఆమె సాక్ష్యమిచ్చింది.

ముద్దాయిలను స్ట్రీట్ కారులో అరెస్టు చేసిన పోలీసు అధికారి మైకేల్ కొనొలి సాక్ష్యం ఇలా సాగింది:

*విలియమ్స్: ఆ కార్లోకి ఎక్కాక మీరేం చేశారో జూరీకి చెప్పండి?*

*కొనొలి: డ్రైవరున్న చోటికి వెళ్ళాను. కారు తలుపులు మూసేశారు. బ్రిడ్జి వాటర్‌లో కారు దొంగిలించేందుకు లేదా తీసుకెళ్ళేందుకు ప్రయత్నించారని నాకు ఫోన్‌లో చెప్పబడిన ఇద్దరు విదేశీయులను చూడగలనేమోనని కారంతా పరికించాను.*

*జెరేమీ మెక్ ఎనార్నీ: దాన్ని (రికార్డు నుంచి) తొలగించమని అభ్యర్థిస్తున్నాను.*

*జడ్జి: తొలగించవచ్చు.*

*విలియమ్స్: మీకు ఏం చెప్పారన్నది అనవసరం. మీరు చూసిన దాన్ని గురించీ, మీరు చేసిన దాన్ని గురించీ అడుగుతున్నాను.*

*కొనొలి: నేనిప్పుడు చెప్తున్నదదే.*

ప్ర: సరే, కారంతా పరిశీలించారు. మీరేం చూశారు? ఏం చేశారు?

జ: ఎడమవేపు సీట్లో శాక్కో, వాంజెట్టిలు కూర్చొని ఉండటం చూశాను. . . . . కార్లోకి నడిచాను. వారి సీటు ఎదురుగా ఆగాను. ఎక్కడి నుంచి వస్తున్నారని అడిగాను. బ్రిడ్జివాటర్ అన్నారు వాళ్ళు. "ఏం చేస్తున్నారు బ్రిడ్జివాటర్‌లో" అని అడిగాను. "మా స్నేహితుడొకరిని చూడ్డానికి వెళ్ళాం" అన్నారు. "మీ స్నేహితుడెవరు" అని అడిగాను. "వాళ్ళతన్ని పప్పీ అంటారు" అన్నాడతను. "సరే. మీరు మాకు కావాలి. మిమ్మల్ని అరెస్టు చేశాను" అన్నాను. వాంజెట్టి సీటు లోతట్టు భాగంలో కూర్చుని ఉన్నాడు. . . . కిటికీ వేపు. . . . తన పాంట్ జేబులో చేయి పెట్టాడు. "నీ చేతులు ఒళ్ళోంచి తీసెయ్యి. లేకపోతే ఇబ్బందిలో పడతావు" అన్నాను.

వాంజెట్టి: నువ్వు అబద్ధాల కోరువు.

కొనొలి: (తాము) ఎందుకు అరెస్టు చేయబడ్డారో తెలుసుకోవాలనుకున్నారు వాళ్ళు. "అనుమానాస్పద వ్యక్తులు" అన్నాను. వెళ్తూ ఉన్నాం. మూడు నిమిషాలనుకుంటాను- ప్రయాణించగానే సెంట్రల్ స్టేషన్ నుంచి (పోలీసు) కారు ఎదురైంది. ఆఫీసర్ వాగన్ (మేమున్న) స్ట్రీట్ కారులోకి ఎక్కాడు. . . . వాంజెట్టిని సోదా చెయ్యమని వాగన్‌కు చెప్పాను. నేను శాక్కోను పైపైన తడిమి చూశాను. జేబులు వెతకలేదు. వారిని (దించి) కారు ముందు రోడ్డు మీదకు తీసుకెళ్ళాం. . . . .

ప్ర: ఒక నిమిషం ప్లీజ్! వారిద్దర్లో ఎవరి దగ్గరైనా ఏమైనా దొరికిందా?

జ: వాంజెట్టి దగ్గర రివాల్వర్ దొరికింది.

ప్ర: సరే, చెప్పండి.

జ: శాక్కో, వాంజెట్టిలను వెనక సీట్లో కూర్చోబెట్టాను. వాళ్ళతో పాటు వెనకసీట్లోనే పోలీసు అధికారి స్నో కూర్చున్నాడు. శాక్కో, వాంజెట్టిలకు ఎదురుగా ముఖం పెట్టి డ్రైవర్‌తో పాటు ముందు సీట్లో వెనక్కి తిరిగి కూర్చున్నాను.

ప్ర: సరే. బాగుంది.

జ: కదిల్తే కాల్చేస్తానని బయల్దేరేటప్పుడే వాళ్ళకు చెప్పాను. (పోలీసు) స్టేషన్‌కు వెళ్ళే దారిలో శాక్కో తన చేతిని ఓవర్ కోటులోకి పోనిచ్చాడు. . . . వాళ్ళే చేతులు తీసేయమని అతనికి చెప్పాను.

. . . . . . . .

"అక్కడ నీ తుపాకీ ఉందా?" అన్నాను. "లేదు" అన్నాడు. "నాకు తుపాకీయే లేదు" అన్నాడు. "సరే నీ చేతులు బట్టలకు ఎడంగా ఉంచు" అన్నాను. మరి కొంత దూరం వెళ్ళే సరికి అతను అదే పని చేశాడు. ముందు సీట్లో నేను మోకాళ్ళ మీద లేచాను. . . అతని కోటులో చేయి పెట్టాను. నాకు తుపాకీ ఏదీ కనిపించలేదు. "ఇప్పుడు నువ్వు నీ చెయ్యిని తిరిగి అక్కడ పెట్టావో ఇబ్బందుల్లో పడబోతున్నావు" అన్నాను. "నాకు ఏ ఇబ్బందులూ అక్కర్లేదు" అన్నాడు. స్టేషన్‌కు చేరాం. . . . సోదా చేశాం.

సెంట్రల్ స్టేషన్లో శాక్కోను సోదా చేయగా జేబులో ఇరవై మూడు తూటాలు, పాయింట్ 32

కాలిబర్ కోల్ట్ ఆటోమేటిక్ రివాల్వర్ దొరికాయని పోలీసు కారు డ్రైవర్ మెర్ల్ స్పియర్ సాక్ష్యం చెప్పాడు కారులో జరిగిందని చెప్పబడిన ఘటనలకు కూడా అతను సాక్షి.

బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌లో ముద్దాయిలను ఇంటరాగేట్ చేయగా వాళ్ళు అబద్ధాలు చెప్పారని పోలీసు అధికారి మైకేల్ స్టైవార్ట్ సాక్ష్యం చెప్పాడు. వారిద్దరి రాజకీయాల గురించి తను ప్రశ్నించలేదన్నాడు. ఇంటరాగేషన్ సందర్భంగా అడిగిన ప్రశ్నలు. సమాధానాల నోట్స్‌ను కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టారు

అపరాధ భావన గురించిన సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు డిఫెన్స్ లాయర్లు పలువురు సాక్షులను విచారించారు

జాన్సన్ ఇంటి దగ్గర తాము రూత్ జాన్సన్‌ను అనుసరిస్తూ వెళ్ళామని చెప్పడం, అరెస్టు చేసినప్పుడు పిస్టళ్ళు బయటికి తీసే ప్రయత్నం చేశామని చెప్పడం అబద్ధాలని శాక్కో వాంజెట్టి తమ సాక్ష్యాల్లో పేర్కొన్నారు. రివాల్వర్లు, ఇతర రకాల తుపాకులు ధరించి తిరగడం ఆ రోజుల్లో సర్వసాధారణం. నైట్ వాచ్‌మన్‌గా కూడా 3-కె ఫ్యాక్టరీలో పని చేస్తున్నందువల్ల తన దగ్గర తుపాకీ ఉందని శాక్కో చెప్పాడు. 3-కె షూ కంపెనీ యజమాని కెల్లీ కూడా ఈ విషయాన్ని కోర్టులో ధృవపర్చాడు తన దగ్గర చేపలమ్మిన డబ్బు కాస్త పెద్ద మొత్తంలోనే ఉంటుంది కాబట్టి పరిస్థితులు బాగాలేని ఆ రోజుల్లో ఆత్మరక్షణ కోసం తనకు తుపాకీ అవసరమైందని వాంజెట్టి చెప్పాడు. తాము రాడికల్స్ కాబట్టి పోలీసులు పట్టుకున్నారని భావించి పోలీసులకు అబద్ధాలు చెప్పామన్నారు. పామర్ దాడులు జరుగుతున్న కాలం కాబట్టి పోలీసులు తమపై ఏ అఘాయిత్యమైనా చేయగలరని భావించి శాక్కో, వాంజెట్టిలు పోలీసులకు అబద్ధాలు చెప్పారే తప్ప సౌత్ బ్రెయిన్ ట్రీ నేరంతో సంబంధం ఉండి కాదని డిఫెన్స్ లాయర్లు వాదించారు

రాడికల్ సాహిత్యాన్ని తరలించే ప్రయత్నంలో శాక్కో, వాంజెట్టి నిమగ్నమయ్యారని చెప్పేందుకు డిఫెన్స్ తరపున కొందరు సాక్షులు కోర్టుకు రప్పించబడ్డారు. న్యూయార్క్ లాయర్ వాల్టర్ నెల్స తన సాక్ష్యంలో ఇటాలియన్ వర్కర్స్ డిఫెన్స్ కమిటీ నాయకుడు లూగి క్వింటిలినొకురాడికల్, సోషలిస్టు సాహిత్యాన్ని వదిలించుకోవలసిందిగా సలహా ఇచ్చాననీ, తర్వాత వారం రోజులకు సెల్సెడా పోలీసు కస్టడీలో చనిపోయాడని చెప్పాడు.

అపరాధ భావన గురించిన ప్రాసిక్యూషన్ సాక్ష్యాల గురించి ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ ఇలా ప్రశ్నిస్తాడు·

*అరెస్టయినప్పుడు శాక్కో, వాంజెట్టి బ్రెయిన్ ట్రీ హంతకుల తరహాలో ప్రవర్తించారా? ఆ నేరాలను ప్రాణాలకు తెగించిన వాళ్ళు చేశారు ప్రాణం తీయడమే వృత్తిగా వున్న నేరస్తులు చేశారు. పారిపోయేందుకై ప్రేక్షకుల మీద కూడా విచ్చలవిడిగా కాల్పులు జరిపిన వాళ్ళు చేశారు. పోలీసులు అరెస్టు చేసినప్పుడు శాక్కో, వాంజెట్టిలు ప్రవర్తించిన తీరుకు, సౌత్ బ్రెయిన్ ట్రీ హంతకుల ప్రవర్తనకు కాస్తయినా పోలిక వుందా? నేరం చేశామని తెలిసిన కరడుగట్టిన*

*బ్రెయిన్ ట్రీ హంతకులు మరణశిక్షార్హమైన నేరారోపణపై పోలీసు కస్టడీకి అంత తేలికగా లొంగుతారా? శాక్కో, వాంజెట్టి బ్రెయిన్ ట్రీ బందిపోట్లయితే తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి తుపాకీ గుళ్ళు పేల్చి తప్పించుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదు?*

## ఆ టోపీ శాక్కోదా

నేరం జరిగిన స్థలంలో దొరికిందని చెప్పబడ్డ ఒక టోపీ శాక్కోదని నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ తీవ్ర ప్రయత్నం చేసింది.

బెరార్డెల్లీ శవం పక్కన పడి ఉన్న టోపీ తనకు సంఘటన జరిగిన మరుసటి రోజు దొరికిందనీ, దానిని తీసుకెళ్ళి స్లేటర్ మోరిల్ కంపెనీ అధికారి ఫ్రాహర్‌కు ఇచ్చాననీ ఆ కంపెనీకార్మికుడు ఫ్రెడెరిక్ లోరింగ్ చెప్పాడు. అతి బలహీనమైన ఆ సాక్ష్యానికి ఏ మాత్రం విలువ లేదని క్రాసు పరీక్షలో జెరేమీ మెక్ ఎనార్నీ నిరూపించాడు:

*జెరేమీ మెక్ ఎనార్నీ: ఎవర్నో చంపారని ఎవరో అంటుంటే నువు విన్నావు.*

*లోరింగ్: అవునండీ.*

*ప్ర: నువ్వు బయటికి చూశావా?*

*జ: నేను (స్లేటర్ ఫ్యాక్టరీ బిల్డింగ్) కిటికీ గుండా బయటికి చూశాను. ఒక గుంపును అక్కడ చూశాను.*

*ప్ర: ఎంత మంది ఉన్నారా గుంపులో?*

*జ: సుమారు నలభై మంది.*

*ప్ర: సుమారు నలభై మంది కలయ తిరుగుతూ?*

*జ: అవును.*

*ప్ర: తలపై టోపీలు లేకుండా అందులో ఎవరినైనా చూశావా?*

*జ: టోపీ లేకుండా అక్కడెవర్నీ చూడలేదు.*

*ప్ర: ప్రతి ఒక్కరూ టోపీ పెట్టుకొని ఉండటాన్ని నువ్వక్కడ గమనించావా?*

*జ: లేదు.*

*ప్ర: వాళ్ళు టోపీలు పెట్టుకున్నారో లేదో నీకు తెలియదు?*

*జ: లేదు. ఖచ్చితంగా చెప్పలేను.*

*ప్ర: వాళ్ళు టోపీలతో ఉన్నారో లేక టోపీలు లేకుండా ఉన్నారో నువ్వు చూడలేదు?*

*జ: లేదు.*

*జెరేమీ మెక్ ఎనార్నీ: దట్సాల్.*

ఆ టోపీని గుంపులో ఎవరైనా పోగొట్టుకొని వుండే అవకాశం ఉందనీ అది తప్పని సరిగా హంతకుడి టోపీనే కావాల్సిన పని లేదనీ డిఫెన్స్ లాయర్లు వాదించారు. నేరస్థలాన్ని పోలీసుల

కంటే ముందుగా ఎవరైనా సందర్శిస్తే అక్కడున్న వస్తువులను మార్చేందుకూ, కొత్త వస్తువులు అక్కడికి చేరేందుకూ అవకాశముంటుంది. శవ పంచనామా చేసినప్పుడు ఆ టోపీ ప్రస్తావనే రాలేదు. అయితే శవ పంచనామా రికార్డు డిఫెన్స్ లాయర్ల దగ్గర లేక పోవడంతో ఆ కోణం నుంచి వాళ్ళు వాదించలేక పోయారు.

శాక్కో పని చేసిన 3-కె షూ కంపెనీ యజమాని జార్జి కెల్లీని ఇతర విషయాలతో పాటు (అంటే సంఘటన జరిగిన రోజు అతను పని చేసేందుకు రాలేదన్న విషయం వగైరా) టోపీ గురించి ప్రాసిక్యూషన్ ప్రశ్నించింది:

*విలియమ్స్: మీరెక్కడుంటారు?*
*కెల్లీ: మసాచూసెట్స్ రాష్ట్రంలోని స్టౌటన్‌లో.*
*ప్ర: మీరేం పని చేస్తారు?*
*జ: మా ఫ్యాక్టరీలో సూపరింటెంట్‌గా.*
*ప్ర: ఏమంటారు దాన్ని?*
*జ: 3-కె షూ ఫ్యాక్టరీ.*
*ప్ర: నికోలా శాక్కో మీకు తెలుసా?*
*జ: తెలుసండి.*
*ప్ర: ఎంత కాలంగా అతను మీకు తెలుసు?*
*జ: పదిపన్నెండేళ్ళ నుంచి ఎరుగుదును.*
*ప్ర: 1920 వసంత కాలంలోగానీ, వేసవిలోగానీ స్టౌటన్‌లో 3-కెలో అతను పనిచేశాడా?*
*జ: చేశాడండి.*
*ప్ర: 1920 ఏప్రిల్ 15 నాటికన్నా ముందు ఎంత కాలంగా అతన్ని మీరు పనిలో పెట్టుకున్నారు?*
*జ: . . . . . ఆరేడు నెలలని చెప్పాలి.*
*ప్ర: ఏం పనిలో పెట్టుకున్నారు?*
*జ: అతను మా పనిలో చేరినప్పుడు మొదట మడమలు నునుపు చేసే పనిలో పెట్టుకున్నాం. తర్వాత అతను రాత్రిపూట కొంత మేరకు బాయిలర్‌ను చూసేవాడు. రాత్రంతా ఉండేవాడు. కొన్ని గంటలుండేవాడు.*

. . . . . . . . .

*ప్ర: అతను ఎలాంటి టోపీ పెట్టుకోవడం మీరు చూశారు?*
*జ: తెలుపు నలుపు డిజైన్ గల ముదురు రంగు టోపీ.*
*ప్ర: టోపీకి సంబంధించి మీరింకేమైనా గమనించారా?*
*జ: పని చేసేందుకు రావడం, దానిని చిలక్కొయ్యకు తగిలించడం తప్ప నేనేమీ చూడలేదు.*
*ప్ర: అదెలా ఉంటుందో చెప్పగలరా? అది పాతదా? కొత్తదా? శుభ్రంగా ఉంటుందా? మురికిదా?*
*జ: ఎందుకు చెప్పలేనూ! సహజంగా మురికిగా ఉంటుందని చెప్పాలి.*

టోపీని సాక్షికి చూపించి అతను వర్ణించిన శాక్కొ టోపీలాగా కనిపిస్తుందేమో చెప్పమని విలియమ్స్ అడిగాడు. సాక్షి టోపీని పరిశీలనగా చూసి *"మిస్టర్ విలియమ్స్! దూరంగా చీలకు తగిలించి ఉండగా నేను చూసిన దాన్ని బట్టి ఇది అదే రంగులో ఉన్నదన్న విషయాన్ని మాత్రమే చెప్పగలను. వివరంగా చెప్పాలంటే అది ఇదేనని చెప్పలేను"* అన్నాడు. ఈ సమాధానం తమకు ఉపయోగపడదని విలియమ్స్‌కు అర్థమైంది. అదే విషయాన్ని గురించి మరి కొన్ని ప్రశ్నలడిగాడు. అయినప్పటికీ ఆ టోపీ శాక్కొదేనని కెల్లీ చెప్పలేదు. దూరం నుంచి రంగు చూడటం తప్ప ఏ రోజూ శాక్కొ టోపీని పరీక్షగా చూడలేదన్నాడు. టోపీ లోపలి వైపు ఒక చిరుగు వుంది. దాన్ని గురించి విలియమ్స్ మరికొన్ని ప్రశ్నలడిగాడు:

విలియమ్స్: *చిలక్కొయ్యకు తగిలించడం వలన అతని టోపీకి ఏమైనా అయిందేమో మీకు తెలుసా?*

కెల్లీ: *తెలియదండి.*

ప్ర: *టోపీ లైనింగ్‌ను (కోర్టులో) మీరు పరీక్షించారా?*

జ: అవును.

ప్ర: *లైనింగ్ ఏ స్థితిలో ఉందో మీరు గమనించారా?*

జ: చిరిగి ఉంది.

టోపీని సాక్ష్యంగా ప్రవేశపెట్టేందుకు అంటే ఎగ్జిబిట్‌గా మార్క్ చేసేందుకు విలియమ్స్ జడ్జి అనుమతి కోరాడు. జెరేమీ మెక్ ఎనార్నీ అందుకు అభ్యంతర పెట్టాడు. ఆ టోపీ శాక్కొదేనని సాక్షి ౹ర్తించకుండా దానిని ఎగ్జిబిట్‌గా అనుమతించడం సరైనది కాదని వాదించాడు. ప్రాసిక్యూషన్‌కు ఈ విషయంలో సహకరించేందుకు జడ్జి థేయర్ రంగంలోకి స్వయంగా దిగాడు. ఆ టోపీ శాక్కొ పెట్టుకునే టోపీలాగా ఉందా అని సాక్షిని ప్రశ్నించాడు. డిఫెన్స్ లాయర్ మూర్ ఆ ప్రశ్నకు అభ్యంతరం లేవనెత్తాడు. జడ్జి తన తెలివిని ప్రదర్శించి అదే ప్రశ్నను అడగమని విలియమ్స్‌కు సూచించాడు. రంగు మాత్రమే ఒకటిగా ఉందని కెల్లీ తన పాత సమాధానాన్నే చెప్పాడు. జడ్జికది తృప్తినివ్వలేదు. తనే ప్రాసిక్యూటర్ అవతారం ఎత్తాడు:

జడ్జి: *ప్రశ్నకు సరైన సమాధానం కాదది. నువ్వు చెప్పగలిగే జవాబు చెప్తావనుకుంటాను.*

కెల్లీ: *నా మనసుకు తెలియనప్పుడు నేను ఆ టోపీయేనని సమాధానం చెప్పలేను.*

జడ్జి: *నేను అలా చెప్పమని కోరను. నీ మనసులో ఉన్నదాన్ని బట్టే సమాధానం చెప్పాలని కోరుతున్నాను.*

కెల్లీ: *పైపై చూపులకు ఏం కనిపిస్తుందో అంత మాత్రమే చెప్పగలను. ఇప్పుడు చూస్తున్నంత దగ్గరగా నా జీవితంలో ఎప్పుడూ (శాక్కొ టోపీని నేను) చూడలేదు.*

జడ్జి: *పైపైన చూస్తే ఇది అదేనా?*

కెల్లీ: *అవునండి.*

మూర్: ఈ చివరి ప్రశ్నకూ, సమాధానానికీ అభ్యంతరపెడ్తున్నాను.

జడ్జి: *(విలియమ్స్ వైపు తిరిగి)* మీరా ప్రశ్న వేయవచ్చు. అప్పుడు కోర్టు నుంచి గాక ప్రాసిక్యూటర్ నుంచి ఆ ప్రశ్న వస్తుంది.

విలియమ్స్: పైపైన చూస్తే అది ఇదేనా?

కెల్లీ: అవును.

విలియమ్స్: యువరానర్! అనుమతిస్తే ఇప్పుడు టోపీని సాక్ష్యంగా ప్రవేశపెడ్తున్నాను.

జడ్జి: అనుమతించబడింది.

డిఫెన్స్ లాయర్ల అభ్యంతరాన్ని జడ్జి తోసిపుచ్చి ఎగ్జిబిట్-29గా టోపీని సాక్ష్యంగా స్వీకరించాడు. టోపీని తీసుకు పరిశీలించమని జూరీ సభ్యులను కోరాడు విలియమ్స్.

ఎగ్జిబిట్-29 సైజు 6- 7/8''. కాగా శాక్కో ధరించే టోపీల సైజు 7- 1/8''. ఆ ఎగ్జిబిట్ తనది కాదని శాక్కో సాక్ష్యమిచ్చాడు. శాక్కో ఇంట్లో పోలీసులు స్వాధీనపర్చుకున్న మరో టోపీ *(ఎగ్జిబిట్-43)* మాత్రం తనది కావచ్చని చెప్పాడు. ఎగ్జిబిట్-29 తన టోపీ కంటే చిన్నది కాబట్టి తనకు పట్టదని చూపాడు. కట్జ్‌మన్ శాక్కోను ఈ విషయం గురించి ఇలా క్రాసు పరీక్ష చేశాడు.*

కట్జ్‌మన్: నువ్వేమైనా చెప్పాలనుకుంటున్నావా?. . . . నువ్వేదో చెప్పాలనుకొంటున్నావనుకొంటాను. . .

శాక్కో: నాకు తెలియదు. ఆ టోపీ *(ఎగ్జిబిట్-29)* మరీ మురికిగా కనిపిస్తోంది. నేను మురికిగా ఉన్న టోపీని ఎప్పుడూ పెట్టుకోను. టోపీ కొనుక్కునేందుకు నా దగ్గరెప్పుడూ 50 సెంట్లు ఉంటాయనుకుంటాను. పని చేసేటప్పుడు టోపీ పెట్టుకోను. శుభ్రమైన టోపీనే ఉపయోగిస్తాను. నేను ఫ్యాక్టరీకి వెళ్ళగానే నా బట్టలన్నీ తీసేసి పై దుస్తులు వేసుకొని పనిలోకి దిగుతాను. అది *(ఎగ్జిబిట్-29)* బాగా మురికిది. చాలా మురికిగా కనిపిస్తోందది. నా టోపీ కాస్త తేలిక పాటిది. మరింతగా బూడిద రంగులో ఉంటుందనుకొంటాను.

ప్ర: *(ఎగ్జిబిట్-43ను చూపిస్తూ)* ఇది నీ టోపీయేనా?

జ: అవుననుకొంటాను. అలా కనిపిస్తోంది. కానీ మురికి పట్టి వుంది- బహుశా తర్వాత మురికి పట్టి వుంటుంది.

ప్ర: ఎగ్జిబిట్ 29ని పెట్టుకొని చూపగలవా? పెట్టుకునేటప్పుడు బలాన్నుపయోగించు.

శాక్కో ఆ టోపీని పెట్టుకొనేందుకు ప్రయత్నించాడు. అది తలకు పట్టలేదు.

కట్జ్‌మన్: పట్టడం లేదా?

శాక్కో: లేదు.

కట్జ్‌మన్: ప్రయత్నించు. వెనకవైపు కిందికి లాగి చూడు పడుతుందేమో?

---

* కేసు విచారణ ప్రారంభమైన 30 వ రోజున శాక్కో సాక్ష్యం చెప్పాడు. సుదీర్ఘమైన శాక్కో సాక్ష్యంలో 'టోపీ' కి సంబంధించిన భాగాన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

ఆ టోపీని పెట్టుకునేందుకు మరోసారి ప్రయత్నించాడు శాక్కొ. కానీ బాగా బలం ఉపయోగిస్తేనేగానీ పట్టలేదు. బాగా బిర్రుగా ఉందని చెప్పాడు. అందువల్ల అది తన టోపీ కాదని నమ్ముతారని భావించి జూరీ వైపు తిరిగి జూరీ సభ్యులకు తన తల మీద ఇరుక్కుపోయిన టోపీని శాక్కొ చూపించాడు. ఈ దృశ్యాన్ని గురించి తర్వాతి రోజు దినపత్రికలు కార్టూన్లు ప్రచురించాయి.

జార్జి కెల్లీని డిఫెన్స్ లాయర్లు మరోసారి కోర్టుకు పిలిపించి రెండు టోపీలు చూపించి ఏది శాక్కొ టోపీ లాగా ఉందో చెప్పమని అడిగారు. ఎగ్జిబిట్-43 శాక్కొ టోపీలాగా ఉందని చెప్పాడతను. శాక్కొ భార్య రోజినా కూడా టోపీ గురించి సాక్ష్యమిచ్చింది. ఎగ్జిబిట్-29 లాంటి టోపీని తన భర్త ఎనాడూ పెట్టుకోలేదని స్పష్టం చేసింది.

## తుపాకులు-తూటాలు

శవపరీక్ష జరిపిన వైద్యులు హతుల మృతదేహాల్లో ఆరు బుల్లెట్లు వెలికి తీశారు. అందులో ఐదు బుల్లెట్లు కుడి వేపు తిరుగుతూ వెళ్ళే బుల్లెట్లు. ఆ ఐదు బుల్లెట్లకూ శాక్కొ, వాంజెట్టిల దగ్గర దొరికిన ఆయుధాలకూ సంబంధం లేదు. బెరార్డెల్లీ మృత దేహం నుంచి వెలికితీసిన బుల్లెట్లలో ఒకటి మాత్రమే పాయింట్ 32 కోల్ట్ ఆటోమేటిక్ నుంచి పేల్చబడింది. (ఇలాంటి పిస్టల్‌నే శాక్కొ దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.) అదే బెరార్డెల్లీ మరణానికి కారణమైందని శవపరీక్ష జరిపిన డాక్టర్ మెగ్రాత్ అభిప్రాయపడ్డాడు. ప్రాణాంతకమైన ఆ బుల్లెట్‌పై శవపరీక్ష చేసేటప్పుడే సర్జికల్ నీడిల్‌తో ' ' గుర్తు వేశాడు. అది బుల్లెట్-III గా ప్రసిద్ధికెక్కి వివాదాస్పదమై ఒక అర్థశతాబ్దం పైగా పలు పరిశోధనలకూ, వాద ప్రతివాదాలకూ కారణమైంది.

హతుల శవాల్లో దొరికిన బుల్లెట్లు శాక్కొ, వాంజెట్టిల దగ్గర దొరకిన ఆయుధాల నుంచి పేల్చబడ్డాయని తను వాదించబోనని కేసు విచారణకు ముందుగానే ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ డిఫెన్స్ లాయర్లతో ఒప్పందానికి వచ్చాడు. కేసు విచారణ ప్రారంభమైన మూడు వారాలకు జూన్ 18న ప్రాసిక్యూటర్ తన అభిప్రాయాన్ని మార్చుకొని ఒప్పందాన్ని తోసిపుచ్చి శాక్కొ దగ్గర దొరికిన పిస్టల్‌కూ, బుల్లెట్-III కి ముడిపెట్టే ప్రయత్నం చేశాడు.

అంతకు ముందు జూన్ 5న శాక్కొ తరపున లాయర్ మూర్ ఒక పిటీషన్ దాఖలు చేయడం ప్రాసిక్యూటర్‌ను ఇబ్బంది పెట్టింది. తన దగ్గర దొరికిన పిస్టల్‌ను, బుల్లెట్- ని పరీక్షించవలసిందనీ, దాని వలన తన నిర్దోషిత్వం బయటపడుతుందనీ శాక్కొ కోర్టును అభ్యర్థించాడు. ఫలితంగా బుల్లెట్ల పరీక్షలు జరిపారు.

ఒక తుపాకీ నుంచి బుల్లెట్ పేలినప్పుడు ఆ బుల్లెట్ మీద కొన్ని ప్రత్యేకమైన గీతలు ఏర్పడతాయి. మనుషుల వేలిముద్రల్లాగా ప్రతి తుపాకీ తనదైన ప్రత్యేకమైన గీతలను బుల్లెట్ మీద అచ్చేస్తుంది. ఒక కంపెనీలో ఒకే క్షణంలో తయారైన ఒకే కాలిబర్ తుపాకుల నుండి పేల్చబడే వేర్వేరు తూటాలపై కూడా వేరు వేరు గీతలేర్పడతాయి. తుపాకీ గొట్టం నుండి బుల్లెట్

దూసుకు పోయినప్పుడు గొట్టంలోని గరుకైన లోపలి ఉపరితలం వలన ఆ గీతలు బుల్లెట్ ఉపరితలంపై ఏర్పడతాయి. అవేకాక తుపాకీ సుత్తి బుల్లెట్‌ను పేల్చేందుకు దానిని కొట్టినప్పుడు కూడా సుత్తి దెబ్బ తగిలిన భాగంపై గుర్తు లేర్పడతాయి. ఇవి కూడా ప్రతి తుపాకీకి వేరు వేరుగా ఉంటాయి. ఒక తుపాకీ నుంచి కొన్ని టెస్ట్ బుల్లెట్లు పేల్చి వివాదాస్పదమైన బుల్లెట్ పై గల గీతలను, గుర్తులను ఆ టెస్ట్ బుల్లెట్ పై గుర్తులతో పోల్చి చూసి ఆ తుపాకీ నుంచే వివాదాస్పద బుల్లెట్ పేల్చబడిందో లేదో నిపుణులు చెప్పగలుగుతారు.*

శాక్కో అభ్యర్థనపై నిర్వహించబడిన తుపాకుల, తూటాల పరీక్షలకు ఇరుపక్షాల తరపునా ఇద్దరేసి ఆయుధ నిపుణులు పాల్గొన్నారు. మసాచూసెట్స్ పోలీసు అధిపతి, ప్రముఖ ఆయుధ నిపుణుడు కెప్టెన్ విలియం ప్రొక్టార్**, రెమింగ్టన్ తుపాకుల కంపెనీ ఇంజనీర్ కెప్టెన్ వాన్ ఆంబర్గ్ ప్రాసిక్యూషన్ తరపున హాజరయ్యారు. డిఫెన్స్ కూడా వారికి ఏ మాత్రం తీసిపోని పేరున్న ఆయుధ నిపుణులనే రప్పించింది. కోల్ట్ తుపాకుల ఫ్యాక్టరీలో పని చేసే ప్రముఖ ఆయుధ నిపుణుడు ఫిట్జ్ గెరాల్డ్, యు.ఎస్. కాట్రిడ్జ్ కంపెనీలో ముప్పై ఏళ్ళుగా పని చేస్తున్న బాలిస్టిక్ ఇంజనీరు జేమ్స్ బర్న్ డిఫెన్స్ తరపున ఆ పరీక్షల్లో పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహించాక ప్రొక్టార్, ఆంబర్గ్‌లు ప్రాసిక్యూటర్‌కు తమ పరీక్షల ఫలితాలను పంపారు. శాక్కో పిస్టల్‌కు బుల్లెట్-IIIకి సంబంధం లేదని ప్రొక్టార్ తెలియజేశాడు. బుల్లెట్-III శాక్కో పిస్టల్ నుంచే పేల్చబడిందని ఖచ్చితంగా చెప్పలేనని ఆంబర్గ్ పేర్కొన్నాడు. (కాని ఈ అభిప్రాయాలు డిఫెన్స్ లాయర్లకు తెలియవు.) అంతకు ముందు సంవత్సర కాలంగా ఈ కేసులోని పిస్టళ్ళు, బుల్లెట్లు ప్రాసిక్యూషన్ దగ్గరే ఉన్నాయి. అప్పటికే ప్రొక్టార్, ఆంబర్గ్‌లు తమ అభిప్రాయాలు చెప్పి వున్నందునే కట్జ్‌మన్ లాయర్ మూర్‌తో పైన పేర్కొన్న ఒప్పందానికి వచ్చాడు. ప్రారంభ ప్రకటనలో కూడా విలియమ్స్ అందుకే జాగ్రత్త వహించాడు. శవాల్లో దొరికిన ఒక బుల్లెట్ పాయింట్ 32 కోల్ట్ ఆటోమేటిక్ నుంచి పేల్చబడిందని మాత్రమే చెప్పి ఊరుకున్నాడు. అంతేగానీ శాక్కో పిస్టల్ నుంచే ఆ బుల్లెట్ పేలిందని చెప్పలేదు.

అయితే బుల్లెట్ పరీక్షలు చేయించాక ప్రాసిక్యూటర్ బాగా ఇబ్బంది పడ్డాడు. లాయర్ ఎహర్మన్ ఆ 'ఇబ్బంది' గురించి ఇలా అంటాడు:

> *శాక్కో తుపాకీని పరీక్షించమని మూర్ (కోర్టును) అభ్యర్థించడం జిల్లా అటార్నీ కార్యాలయాన్ని గందరగోళపర్చింది. . . . కట్జ్‌మన్ ఇచ్చిన హామీని అంగీకరించకుండా మూర్ తన తరపు నిపుణులతో పరీక్షలు నిర్వహించాలనుకోవడంతో కట్జ్‌మన్ ఈ పరిస్థితిని ఎదుర్కోవాల్సి*

---

* శాక్కో-వాంజెట్టి కేసు జరిగిన కాలంలో కంపారిజన్ మైక్రోస్కోప్ కనిపెట్టబడలేదు. అందువలన బుల్లెట్లను విడివిడిగా పరీక్షించి మాత్రమే నిపుణులు వాటిని పరిపోల్చి చూసేవారు.

** కేసు పరిశోధన నుంచి తప్పించింది ఈయన్నే. ఈయన సాక్ష్యం చెప్పిన సుమారు వందకేసుల్లో మరణ శిక్ష విధించారు.

*వచ్చింది. శాక్కొ బుల్లెట్లు పేల్చలేదని డిఫెన్స్ తరపు (ఆయుధ) నిపుణులు నిరూపించవచ్చు కేసు కోసం ప్రభుత్వం చాలా జాగ్రత్తగా తయారు చేసిన సాక్ష్యాలకు ఇది వ్యతిరేకం అప్పుడు బుల్లెట్ల పరీక్షలపై ఆధారపడి నిపుణులు చెప్పే అభిప్రాయాల ఫలితంగా ప్రాసిక్యూషన్ కేసు గల్లంతు కావచ్చు. బుల్లెట్ నెం-III శాక్కొ తుపాకీ నుంచే పేల్చబడిందని వెంటనే సాక్ష్యం సంపాయించేందుకు ఈ భయమే కట్జ్‌మన్‌ను ఖచ్చితంగా వత్తిడి చేసి వుంటుంది.*

శాక్కొ, వాంజెట్టిలు నిర్దోషులని నమ్మిన ఫలితంగా ఈ కేసులో నేర పరిశోధన బాధ్యతల నుంచి తప్పించబడిన విలియం ప్రాక్టార్ అబద్ధపు సాక్ష్యం చెప్పేందుకు సిద్ధ పడలేదు. శాక్కొ దగ్గర దొరికిన పిస్టల్ నుంచే బుల్లెట్-III పేల్చబడిందని చెప్పేందుకాయన ససేమిరా ఒప్పుకోలేదు. ఇది కట్జ్‌మన్‌కు మింగుడు పడని సమస్యయింది. ప్రాక్టర్‌ను ఎలాగోలా ఒప్పించేందుకు తన అసిస్టెంట్ విలియమ్స్‌ను వినియోగించాడు. అటు అబద్ధం చెప్పకుండా, ఇటు ప్రాసిక్యూషన్ కేసుకు ఇబ్బంది లేకుండా లౌక్యంగా సమాధానం చెప్పేందుకు ప్రాక్టార్‌ను విలియమ్స్ అంగీకరింపజేశాడు. కోర్టులో ఆచితూచి ప్రశ్నించాడు:

*విలియమ్స్ సాక్ష్యంగా స్వీకరించబడిన కోల్ట్ ఆటోమేటిక్ నుంచి బుల్లెట్-III పేల్చబడిందా లేదా అనే దాన్ని గురించి మీరేమైనా అభిప్రాయం ప్రకటించగలరా?*

*ప్రాక్టార్: అవును*

*ప్ర: మీ అభిప్రాయమేమిటి?*

*జ: అది ఆ పిస్టల్ నుంచి పేల్చబడిందనేందుకు అనుగుణంగా ఉందని నా అభిప్రాయం* *

నిశితంగా పరిశీలించి చూస్తే బుల్లెట్ -III శాక్కొ పిస్టల్ నుంచే పేల్చబడిందని ప్రాక్టార్ చెప్పాడనుకొనేందుకు ఆస్కారం లేదు. ప్రాక్టార్‌కు ప్రాసిక్యూటర్లకూ మధ్య జరిగిన సంగతులు గానీ, విలియమ్స్‌కూ ప్రాక్టార్‌కూ మధ్య జరిగిన సంభాషణ గానీ డిఫెన్స్ లాయర్లకు అప్పటికి తెలిసే అవకాశం లేదు. కాబట్టి ప్రాక్టార్ సాక్ష్యంలో సున్నితమైన ఈ విషయాన్ని వాళ్ళు గమనించలేక పోయారు.

ప్రాక్టార్ సాక్ష్యంలో బలహీనత ప్రాసిక్యూటర్‌కు తెలుసు కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా మరో ఆయుధ నిపుణుడు కెప్టెన్ వాన్ ఆంబర్గ్‌ను కూడా సాక్షిగా ప్రవేశపెట్టాడు. వాన్ ఆంబర్గ్ గతంలోని తన అభిప్రాయాన్ని పక్కన పెట్టి ప్రాసిక్యూటర్‌కు అవసరమైనదే సాక్ష్యంలో చెప్పాడు. బుల్లెట్-III శాక్కొ పిస్టల్ నుంచే పేల్చబడిందని కోర్టుకు విన్నవించాడు. తుపాకీ పేల్చినప్పుడు బుల్లెట్‌పై ఏర్పడే రైఫ్లింగ్ గుర్తులను సరిపోల్చి తాను ఈ విషయాన్ని ధృవీకరించగలుగుతున్నానని పేర్కొన్నాడు. జూరీ సభ్యులను ఒక్కొక్కర్నీ ఓపికగా కోర్టు హాలు కిటికీ దగ్గరకు తీసుకెళ్ళి పిస్టల్ బారెల్‌నూ, బుల్లెట్లనూ చూపిస్తూ తన అభిప్రాయం వివరించాడు.

---

* *"My opinion is that it is consistent with being fired by that pistol"*

డిఫెన్స్ తరపున ఆయుధ నిపుణులు జేమ్స్ బర్న్, ఫిట్జ్ గెరాల్డ్ సాక్ష్యమిచ్చారు. టెస్ట్ బుల్లెట్లపై ఏర్పడిన గుర్తులకు బుల్లెట్- *III* పై ఉన్న గుర్తులకూ పొంతనే లేదన్నారు. తమ పరిశోధనా ఫలితాలను కోర్టులో సోదాహరణంగా వివరించారు. శాక్కో దగ్గర దొరికిన కోల్ట్ ఆటోమేటిక్కూ, ప్రాణాంతక బుల్లెట్‌కూ ఎలాంటి సంబంధం లేదన్నారు.

వాంజెట్టి దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్న రివాల్వర్ హతుడు బెరార్డెల్లీ చేతిలోదని చూపడం ద్వారా వాంజెట్టిని నేరంతో మరింతగా ముడి పెట్టేందుకు ప్రాసిక్యూషన్ ప్రయత్నించింది. ఈ ఆరోపణను కూడా విలియమ్స్ తన ప్రారంభ ప్రకటనలో ప్రస్తావించలేదు. బెరార్డెల్లీ తుపాకీని హంతకులు దొంగిలించారని సాక్ష్యాలే లేవు. బెరార్డెల్లీ హతుడయ్యే సమయంలో అతని దగ్గర తుపాకీ ఉందని ఒకే ఒక్క సాక్షి (జేమ్స్ బోస్టాక్) మాత్రమే చెప్పాడు అది కోర్టులో సాక్ష్యంగా ప్రవేశపెట్టబడిన వాంజెట్టి రివాల్వర్ *(ఎగ్జిబిట్ నెం 27)* లాగా ఉంటుందనీ, సరిగ్గా అదేనోకాదో చెప్పలేననీ అతనన్నాడు.

*ఎగ్జిబిట్-27* లాంటి రివాల్వర్ తన భర్త దగ్గర చూశానని బెరార్డెల్లీ భార్య సాక్ష్యమిచ్చింది. చనిపోయేందుకు మూడు వారాల ముందు విరిగిపోయిన స్ప్రింగ్‌ను బాగు చేయించేందుకు బెరార్డెల్లీ దానిని ఐవర్ జాన్సన్ కంపెనీకి ఇచ్చాడని ఆమె చెప్పింది. బాగుచేయించాక దానిని తిరిగి వెనక్కు తీసుకున్నాడో లేదో తనకు తెలియదంది. రివాల్వర్‌ను రిపేరుకు స్వీకరించినట్టుగా కంపెనీ వాళ్ళిచ్చిన రసీదును మాత్రం పర్మెంటర్ (మరో హతుడు) కి ఇవ్వగా, ఆయన - తన భర్తకు అలాంటిదే మరొక తుపాకీని ఇచ్చాడని చెప్పింది. ఏ తేదీన రివాల్వర్‌ను రిపేరుకు ఇచ్చాడో క్రాసు పరీక్షలో ఆమె సరిగా చెప్పలేక పోయింది.

బెరార్డెల్లీ భార్య నివసించిన ఇంటి యజమానురాలు ఆల్డీ ఫ్లోరెన్స్‌ను డిఫెన్స్ లాయర్లు సాక్షిగా బోనెక్కించారు. బెరార్డెల్లీ తన రివాల్వర్‌ను తిరిగి తీసుకోలేదనీ, చనిపోయే రోజు తన భర్త దగ్గర రివాల్వర్ ఉన్నట్టయితే ఘోరం జరిగేది కాదని బెరార్డెల్లీ భార్య తనకు చెప్పిందని ఫ్లోరెన్స్ పేర్కొంది.

రిపేరు చేయమని చెప్పి 1920 మార్చి 20న పాయింట్ 38 కాలిబర్ హారింగ్టన్ రిచర్డ్‌సన్ రివాల్వర్ తమ కంపెనీలో ఇచ్చాడనీ, అది *ఎగ్జిబిట్-27* లాంటిదేనని ఐవర్ జాన్సన్ కంపెనీ గుమాస్తా లింకన్ వాడ్స్‌వర్త్ సాక్ష్యమిచ్చాడు. అదే కంపెనీలో తుపాకులు బాగు చేసే జార్జి ఫిట్జ్ మేయర్ సాక్ష్యం చెప్తూ బెరార్డెల్లీ రివాల్వర్‌ను తాను బాగు చేసి కొత్త సుత్తి వేశానన్నాడు. *ఎగ్జిబిట్-27* కు కూడా కొత్త సుత్తి ఉందని విలియమ్స్ ప్రశ్నకు జవాబుగా చెప్పాడు:

*విలియమ్స్: దానికి కొత్త సుత్తి వేయబడిందని మీరెలా చెప్పగలరు?*

*ఫిట్జ్ మేయర్: ఫైరింగ్ పిన్ ఉపయోగించిన దానిలా కనిపించడం లేదు కాలిన గుర్తు గానీ, మందు అంటిన దాఖలాగానీ, మరేదీ గానీ దాని మీద లేదు*

రిపేరయ్యాక బెరార్డెల్లీ తన రివాల్వర్‌ను తీసుకెళ్ళి పోయాడని ఐవర్ జాన్సన్ షాపు మేనేజర్ జేమ్స్ జోన్స్ కోర్టులో చెప్పాడు. అయితే అందుకు తమ షాపు రికార్డులలో దాఖలా ఏదీ లేదని క్రాసు పరీక్షలో అంగీకరించాడు.

ఎగ్జిబిట్-27 కు రిపేర్లు జరగలేదనీ, కొత్త సుత్తి వేసిలేదనీ డిఫెన్స్ తరపు ఆయుధ నిపుణులిద్దరూ (జేమ్స్ బర్న్స్, ఫిట్జ్ గెరాల్డ్) చెప్పారు. ఎగ్జిబిట్-27 లో ఉన్న సుత్తి పదహారేళ్ళ క్రితం వేసిందనీ, అది బాగా అరిగి నునుపుదేలి ఉన్నందున తాను ఆ విషయం చెప్పగలుగుతున్నాననీ జేమ్స్ బర్న్ జూరి సభ్యులకు ఓపికగా వివరించాడు.

వాంజెట్టి ఆ రివాల్వర్‌ను ఏనాడో కొనుక్కున్నాడని డిఫెన్స్ లాయర్లు వాదించారు. ఆ రివాల్వర్‌ను వాంజెట్టి కొన్నట్టుగా ఇద్దరు సాక్షులు డిఫెన్స్ తరపున సాక్ష్యమిచ్చారు. వాంజెట్టి స్నేహితుడు ఫెల్జినికి తాము ఆ రివాల్వర్ అమ్మగా దానిని నాలుగేళ్ళ తర్వాత వాంజెట్టి ఫెల్జిని నుంచి కొనుక్కున్నాడని చెప్పారు. ఆ మేరకు వాంజెట్టి కూడా సాక్ష్యమిచ్చాడు.

## బోనెక్కిన వాంజెట్టి

కేసు విచారణ ప్రారంభమైన 29వ రోజున డిఫెన్స్ సాక్షిగా వాంజెట్టి జులై 5న బోనెక్కాడు. అపరాధ భావన గురించి ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యం దృష్ట్యా తమ ఎలిబీలను నిరూపించుకొనేందుకు శాక్కో, వాంజెట్టిలకు సాక్షులుగా మారక తప్పలేదు.*

చీఫ్ ఎగ్జామినేషన్‌లో జెరేమీ మెక్ ఎనార్నీ వాంజెట్టిని ప్రశ్నలడిగాడు. తన బాల్యం, అమెరికాకు వలస వచ్చి రకరకాల పనులు చేయడం, యుద్ధాన్ని వ్యతిరేకించి మెక్సికోకు ప్రవాసం వెళ్ళడం, తర్వాత తిరిగొచ్చి ప్లిమత్‌లో చేపలమ్ముతూ జీవితం వెళ్ళమార్చడం గురించి వాంజెట్టి వివరించాడు.

మెక్సికో వెళ్ళిన విషయాన్నీ తనకు రాడికల్ భావాలున్న వాస్తవాన్నీ చెప్పాల్సిన అవసరం డిఫెన్స్‌కు ఏర్పడింది. వాటిని దాచిపెట్టి ప్రయోజనం లేదు. పైగా అపరాధ భావనలో భాగంగా శాక్కో, వాంజెట్టిలు అనుమానాస్పదంగా ప్రవర్తించారని ప్రాసిక్యూషన్ ఆరోపించినందువల్ల శాక్కో, వాంజెట్టి రాజకీయ అభిప్రాయాలను చెప్పి, అందువల్లనే వారు తగు జాగ్రత్తతో వ్యవహరించారని చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ ఈ స్థితి ప్రాసిక్యూషన్‌కు లాభించింది. న్యాయమూర్తి థేయర్ అండతో సుదీర్ఘమైన క్రాసు పరీక్షలో వాంజెట్టిని (ముఖ్యంగా. . . ఆ తర్వాత శాక్కోను) అనవసర విషయాలనేకం అడిగి వారి పట్ల జూరీకి, జడ్జికి లేనిపోని అపోహలు కలిగించే విధంగా కట్జ్‌మన్ ప్రవర్తించాడు.

---

* *క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలను సాక్ష్యం చెప్పమని బలవంతపెట్టరాదని చట్టం చెప్తుంది. తనే స్వచ్ఛందంగా సాక్షిగా మారితే తప్ప ఏ ముద్దాయి కూడా క్రిమినల్ కేసులో సాక్షికాడు. ఈ కేసులో శాక్కో, వాంజెట్టిలు స్వచ్ఛందంగా సాక్ష్యం చెప్పేందుకు సిద్ధమయ్యారు.*

తన గుబురు మీసాలతో ముదురు రంగు సూట్‌లో నల్ల బౌటై కట్టుకుని కోర్టులో నిల్చున్న వాంజెట్టి తనకు దుబాసీ అవసరం లేదన్నాడు. అప్పటికి తనకు తెలిసిన ఇంగ్లీషులో నెమ్మదిగా, ప్రశాంతంగా జవాబులు చెప్పాడు. కరుకైన కట్జ్‌మన్‌ను ధైర్యంగా ఢీకొన్నాడు. ఒక కత్తి యుద్ధం జరుగుతున్నట్టుగా కోర్టు వాతావరణం కనిపించింది. నాలుగు గంటల చీఫ్ ఎగ్జామినేషన్ తర్వాత ప్రారంభమైన క్రాసు పరీక్ష నాలుగుగంటల పాటు రెండు రోజులు కొనసాగింది

మొదటగా వాంజెట్టి సైన్యంలో చేరక పోవడం గురించి ప్రశ్నలు సంధించిన కట్జ్‌మన్ ఆతన్ని దేశద్రోహిగా చిత్రించే ప్రయత్నం చేశాడు:

*కట్జ్‌మన్: మిస్టర్ వాంజెట్టి! సైన్యంలో చేరకుండా తప్పించుకునేందుకు నువ్వు ప్లిమత్ నుంచి వెళ్ళిపోయావు , అవునా?*

*వాంజెట్టి అవునండి!*

*ప్ర . . . నీ వయసు వాళ్ళంతా సైన్యంలో చేరే వరకూ దూరంగా ఉండిపోయావు నిజమేనా?*

*జ: అది పూర్తిగా నిజం కాదు*

*ప్ర: దాన్లో ఏ భాగం నిజం కాదు?*

*జ: అది నిజం కాదు. ఎందుకంటే నాలాంటి స్థితిలో ఉన్నవారెవరినీ సైన్యంలో చేరమని ఎవరూ వత్తిడి పెట్టలేదు.*

*ప్ర: నీ స్థితిలో ఉన్న వారెవరినీ సైనికులవ్వమని వత్తిడి పెట్టలేదూ?*

*జ: అవునండి*

*ప్ర: నువ్వు ఆరోగ్యరీత్యా సైన్యంలో చేరలేదా?*

*జ: నేను ఆరోగ్య స్థితి గురించి మాట్లాడడం లేదు సామాజిక స్థితి గురించి మాట్లాడుతున్నాను.*

*ప్ర: అప్పట్లో నువ్వు శారీరకంగా ఆరోగ్యవంతుడివేనా?*

*జ: అనుకొంటాను.*

. . . . . . .

*ప్ర: నువ్వు ఆరోగ్యవంతుడివని నమ్మావా?*

*జ: అవునండీ.*

*ప్ర: 1908 నుంచీ ఈ దేశానికి నువ్వొచ్చినప్పటి నుంచీ శారీరకంగా ఆరోగ్యవంతుడివేనా?*

*జ: అవునండీ.*

*ప్ర: ఈ దేశం యుద్ధం చేస్తున్నప్పుడు సైనికుడిగా పోరాడకుండా ఉండేందుకు నువ్వు పారిపోయావు ?*

*జ: అవును.*

*ప్ర: అది నిజమేనా?*

*జ: అది నిజమే.*

యుద్ధ కాలంలో మెక్సికోకి వెళ్ళిన విషయం గురించి కట్జ్‌మన్ పదే పదే ప్రశ్నలడిగి సైన్యంలో చేరడం తనకిష్టం లేదని వాంజెట్టి చేత నాలుగుసార్లు చెప్పించాడు దేశద్రోహానికి తాను పాల్పడలేదని వాంజెట్టి వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి కల్పించాడు·

> *.... నేను యుద్ధానికి వెళ్ళేందుకు నిరాకరించినట్లయితే అది ఈ దేశాన్ని నేను ప్రేమించనందువల్లా, ఈ దేశ ప్రజలను నేను ప్రేమించనందువల్లా కాదు. నేను ఇటలీలో ఉన్నప్పటికీ (యుద్ధంలో పాల్గొనేందుకు) నిరాకరించే వాడిని.... ఈ దేశంలో చాలా కాలంగా ఉన్నాను. చాలా మంది మంచివాళ్ళనూ, కొందరు చెడ్డవాళ్ళనూ చూశాను. ఒక మనిషి చేయగలిగినంత పని ఎప్పుడూ చేసే వాడిని. నేనెప్పుడూ పేదవాడిగానే బతికాను- ....*

మెక్సికో గురించి ప్రశ్నలడుగుతూ మధ్యలో తెలివిగా వాంజెట్టికి కారు డ్రైవింగ్ వచ్చునని చెప్పించాలనుకున్నాడు కట్జ్‌మన్. (తనకు కారు డ్రైవింగ్ రాదని వాంజెట్టి చీఫ్ ఎగ్జామినేషన్‌లో చెప్పి ఉన్నాడు (ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం హంతకుల కారును నడిపింది వాంజెట్టీనే)

*కట్జ్‌మన్. అక్కడ మెక్సికోలో ఏం పని చేశావు?*
*వాంజెట్టి· కొత్త రైలు మార్గం వేశాం కొత్త రైలు మార్గం.*
*ప్ర ఆ పనిలో ట్రక్కునేమైనా ఉపయోగించారా?*
*జ· ట్రక్కా! లేదు.*

......

*ప్ర: ఆ ట్రక్కును నువ్వు నడపలేదని ఖచ్చితంగా చెప్పగలవా?*
*జ· అవును. ఖచ్చితంగా నడపలేదు*
*ప్ర: ఖచ్చితంగానా?*
*జ: నా జీవితంలో నేనెప్పుడైనా కారును నడిపానని ఎవ్వరూ నిరూపించలేరు.*
*కట్జ్‌మన్: యువరానర్! దానిని (రికార్డుల నుంచి) తొలగించమని అభ్యర్థిస్తున్నాను.*
*జడ్జి తొలగించవచ్చు. మిస్టర్ వాంజెట్టి! ప్రశ్నలకే సమాధానం చెప్పు దయ చేసి అంతకంటే మరేమీ చెప్పొద్దు*
*వాంజెట్టి· అలాగే ....*

బ్రెయిన్ ట్రీ హత్యలు జరిగిన రోజు ప్లిమత్‌లో చేపలమ్ముతున్నానని వాంజెట్టి చీఫ్ ఎగ్జామినేషన్‌లో చెప్పాడు. ఆ రోజు ఎన్ని గంటలకు ఎక్కడెక్కడ వాంజెట్టి ఉన్నాడో కట్జ్‌మన్ వివరంగా అడిగాడు:

*కట్జ్‌మన్: 1920 ఏప్రిల్ 15న పన్నెండు గంటల పదమూడూ పదిహేనూ నిమిషాల మధ్య నువ్వెక్కడున్నావో గుర్తుందా?*

వాంజెట్టి: నేనెక్కడున్నానో గుర్తుంది.

ప్ర: ఎక్కడున్నావు?

జ: ప్లిమత్‌లో

ప్ర: ప్లిమత్‌లో ఎక్కడ?

జ: బ్రినీగారింటి దగ్గర లేదా ఇంట్లో.

ప్ర: ఆ రోజు 12:13 కు బ్రినీ ఇంట్లో ఉన్నావా?

జ: ఖచ్చితంగా చెప్పలేను. పన్నెండు గంటల తర్వాత ఎన్ని నిమిషాలకో నేను చెప్పలేను.

ప్ర: పన్నెండు గంటల పదమూడు నిమిషాలకు?

జ: పన్నెండూ ఒంటి గంట మధ్య ఉన్నాను.

ప్ర: 12:13 కు బ్రినీ ఇంట్లో ఉన్నావా?

జ: ఖచ్చితంగా చెప్పలేను.

ప్ర: బ్రినీ ఇంట్లో పన్నెండూ ఒంటి గంట మధ్య ఉన్నానని ఇంతకు ముందు చెప్పలేదా?

జ: అవునండీ.

ప్ర: పన్నెండు గంటల కంటే ఒంటి గంటకు అది దగ్గరంగా ఉంది?

జ: బహుశా కావచ్చు. అవును . . . .

బ్రాక్‌టన్ పోలీస్ స్టేషన్లో వాంజెట్టిని ఇంటరాగేట్ చేసినప్పుడు అతడు అబద్ధాలాడిన విషయం వైపు కట్జ్‌మన్ తన దృష్టిని సారించాడు:

ప్ర: 1920 మే 5న ఒక అధికారి బ్రాక్‌టన్ పోలీస్ స్టేషన్‌లో నీ సెల్ దగ్గరికి వచ్చి రివాల్వర్‌లో బుల్లెట్లు తీసి నీకు చూపించి తిరిగి రివాల్వర్‌లో పెట్టాడనీ. . . నీ వైపు గురిపెట్టాడనీ చెప్పావా వాంజెట్టీ?

జ: అవునండీ.

ప్ర: అతని పేరేంటి?

జ: నాకు పేర్లు తెలియవు. బ్రాక్‌టన్ పోలీసుల పేర్లేవీ నాకు తెలియవు.

ప్ర: సాక్షుల విచారణలో సాక్ష్యం చెప్పిన పోలీసు అధికారుల్లో అతన్ని నువ్వు చూశావా?

జ: లేదు .

. . . . . . . .

ప్ర: నిన్ను నేను (పోలీసు స్టేషన్‌లో) అగౌరవ పర్చానా?

జ: మీరు నాతో పెద్ద మనిషి తరహాలో వ్యవహరించారు.

ప్ర: నేనడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పేందుకు నువ్వు ఇష్టపడ్డావు కదూ!

జ: నేనిష్టపడలేదు. పిడికిట్లో కాగితంలా నేనక్కడున్నాను. పోలీసులు తమిష్టం వచ్చినట్టు బయటికీ కిందికీ నన్ను తీసుకెళ్ళారు. జైలు నిబంధనలు నాకు తెలియవు. నాకు భాష (ఇంగ్లీషు) కూడా సరిగా రాదు. ఒక ఏడాదిగా జైల్లో ఉన్న తర్వాత ఇప్పుడు అప్పటికంటే

కొంచెం మెరుగ్గా మాట్లాడగలుగుతున్నాను. అంతకు ముందెప్పుడూ నేను అరెస్టు కాలేదు. నాకు కేసు విచారణ గురించీ, జైళ్ళ గురించీ ఏమీ తెలియదు. . . . పోలీసులు నన్ను ఫోటో తీయించేందుకు తీసుకెళ్తుంటే, అక్కడికొచ్చిన వాళ్ళ చేత గుర్తింపజేసేందుకు తీసుకు పోతుంటే నిరాకరించ కూడదనుకున్నాను. దాన్ని నేను అభ్యంతర పెట్టలేదు. ఎందుకంటే, దాన్ని తిరస్కరించే హక్కుందని నాకు (అప్పటికి) తెలియదు. నేను మీతో మాట్లాడక పోతే మీరు బలవంత పెట్టేవారో కారో చెప్పండి.

ప్ర: నేను నీతో మాట్లాడినప్పుడు నువ్వు మాట్లాడనవసరం లేదని నీకు తెలుసు. తెలియదా?

జ: అవును. నాకు తెలుసు.

. . . . . . .

ప్ర: నువ్వప్పుడు భయంతో లేవు. ఉన్నావా?

జ: మీరు పాడుస్తారని నేను భయపడలేదు. (కాని) నేను భీతిల్లి వున్నాను.

. . . . . . . . . . .

పోలీస్ స్టేషన్లో తన ప్రశ్నలకు వాంజెట్టి సమాధానాలుగా నమోదయిన రికార్డును కట్జ్‌మన్ చదివి వినిపించాడు. చాలా వాటిని వాంజెట్టి అంగీకరించాడు. ఎంత కాలంగా రివాల్వర్ వాంజెట్టి దగ్గరుందన్న ప్రశ్నకు పోలీస్ స్టేషన్‌లో వాంజెట్టి చెప్పిన సమాధానం గురించి కట్జ్‌మన్ యిలా అడిగాడు:

కట్జ్‌మన్: చాలా కాలం నుంచి నీ దగ్గర రివాల్వర్ వుందని సమాధానం చెప్పావు. నిజమేనా?

వాంజెట్టి: కాదండి.

ప్ర: బోస్టన్‌లో రివాల్వర్ కొన్నానని నువ్వు చెప్పావు. గుర్తుందా?

జ: ఈస్ట్ బోస్టన్‌లోని హానోవర్ వీధిలోనని చెప్పాను.

. . . . . . . .

ప్ర: మిస్టర్ వాంజెట్టి! నువ్విప్పుడు చెప్పినట్టుగా రివాల్వర్‌ను ఐదు డాలర్లకు కొన్నట్టయితే మే 6న నువ్వు నాకు దాన్ని 19 డాలర్లకు కొన్నానని చెప్పడానికీ, నువ్వు సాహిత్యం తరలించేందుకూ సంబంధమేదైనా ఉందా?

జ: లేదు. ఏ కారణమూ లేదు.

పోలీస్ స్టేషన్లో పలు ప్రశ్నలకు నిజాలు చెప్పలేదని వాంజెట్టి క్రాసు పరీక్షలో అంగీకరించాడు:

కట్జ్‌మన్: ప్రతిసారీ అబద్ధం చెప్పావు. కాదా?

వాంజెట్టి: అవును. వందసార్లు అడిగితే వందసార్లూ (ఓర్సియానిని మోటార్ సైకిల్ మీద) చూడలేదనే చెప్తాను. ఎందుకంటే అందుకు నాకు కారణం ఉంది.

ప్ర: నన్నూ, అక్కడున్న అధికార్లనూ మోసం చేయాలనుకున్నావు. కాదా?

జ: నా మిత్రుల పేర్లూ, అడ్రస్‌లూ చెప్పదల్చుకోలేదు.

. . . . . . . .

ప్ర: పప్పీ ఎక్కడుంటాడో మాకెందుకు చెప్పావు. చెప్పలేదా?
జ: అతనుండే పట్టణం మాత్రమే తెలుసన్నాను.
ప్ర: నువ్వు వీధి పేరూ, ఇంటి నెంబరూ చెప్పకపోతే మేం అతన్ని కనుక్కోలేమనుకున్నావా?
జ: లేదు. అలా అనుకోలేదు.

. . . . . . . .

ప్ర: పప్పీలాంటి మనిషొకడుంటే మేం కనిపెట్టగలమని నీకు తెలుసు. తెలియదా?
జ: తెలుసు.
ప్ర: అయినా పప్పీ పేరు చెప్పావు ?
జ: అవును.
ప్ర: ఎక్కడుంటాడో చెప్పావు ?
జ: అవును.
ప్ర: అతన్ని మేం ఎలా పట్టుకోగలమో చెప్పావు?
జ: అవును. అతనున్న ఊరి పేరు చెప్పాను. ఇంటి నెంబరు చెప్పలేదు.
ప్ర: అతన్ని మేం కనిపెట్టగలిగేంత చెప్పావు. కాదా ?
జ: అవును. మీరతన్ని కనిపెట్టగలరు.
ప్ర: అవునా?
జ: అవును. పప్పీని కనుక్కొనేందుకు మీరొక పోలీసును పంపితే తప్పకుండా కనిపెట్టగలరు.
ప్ర: ఈ సాహిత్యంతో సంబంధమున్న నీ స్నేహితులలో ఒకడిగా నువ్వతన్ని భావించావు. కాదా?
జ: ఎన్నటికీ కాదు. నా మిత్రుల్లో ఏ పేపరూ, ఏ సాహిత్యమూ తనింట్లో లేకుండా ఉన్న వాడు అతనొక్కడే.

మిగిలిన క్రాసు పరీక్ష మరురోజు (జూలై 6న) కొనసాగింది. వాంజెట్టిని అనవసర విషయాలడిగి రెచ్చగొట్టేందుకు కట్జ్‌మన్ ప్రయత్నించాడు. న్యాయమూర్తి డిఫెన్స్ లాయర్ అభ్యంతరాలను తోసి పుచ్చాడు.

కట్జ్‌మన్: మే 5న శాక్కో ఇంట్లోంచి (మీరంతా) బయటికి వచ్చే ముందుగా శాక్కోతో పుస్తకాలూ, పేపర్లూ దాచడం గురించి మాట్లాడావా?
వాంజెట్టి: శాక్కో ఇంట్లోనుంచి తీసుకెళ్దామనుకున్నాం.
ప్ర: తీసుకెళ్ళావా వాటిని?
జ: లేదు. అన్ని పుస్తకాలను బయటికి తరలించేందుకు మాకు సరంజామా లేదు.
ప్ర: "బయటికి తరలించేందుకు సరంజామా లేదూ?" నీ చేతులు నీ దగ్గర లేవా?
జ: ఎందుకు లేవూ. ఉన్నాయి.
ప్ర: శాక్కో ఇంటి దగ్గర్లో చెట్ల తోపులు లేవా?
జ: . . . . . ఉన్నాయి. శాక్కో ఇంటి దగ్గరలో చెట్ల తోపులున్నాయి. మేం పుస్తకాలు పాడు చేయదల్చుకోలేదు. మేం పుస్తకాలను భద్రపర్చదల్చుకున్నాం.

జెరేమీ మెక్ ఎనార్నీ: పెద్దగా మాట్లాడతావా, శాక్కో (కూడా) వింటాడు?
వాంజెట్టి: సరే
కట్జ్‌మన్: నీకు బాగా పెద్ద గొంతుంది. లేదా వాంజెట్టి?
వాంజెట్టి: నా గొంతిప్పుడు బలహీనంగా ఉంది. జైల్లో ఉండబట్టి ఏడాది దాటింది.
ప్ర: మైకేల్ కొనొలి సాక్ష్యం చెప్తూ నీ పాంట్ జేబులో చేయి పెట్టుకునేందుకు (అరెస్టు చేసినప్పుడు) నువ్వు ప్రయత్నించావని చెప్పినప్పుడు నువ్వతన్ని అబద్దాల కోరు అన్నావు. అప్పుడు నీ స్వరం బలహీనంగా ఉందా?
జెరేమీ మెక్ ఎనార్నీ: ఒక్క నిమిషం ఆగండి.
వాంజెట్టి: అతన్ని అబద్దాల కోరని అన్నప్పుడు నేను పెద్దగా అరవలేదు.
కట్జ్‌మన్: నువ్వు పెద్దగా మాట్లాడలేదా?
జెరేమీ మెక్ ఎనార్నీ: . . . . . నేనా ప్రశ్నకు అభ్యంతరపెడ్తున్నాను. అతనికున్న గొంతేదో అతనికుంది. సాక్షిని ఇబ్బంది పెట్టడం కోసం వాదనతో కూడిన ఈ ప్రశ్నను ప్రాసిక్యూటర్ గారడుగుతున్నారు. సమాచారం రాబట్టడం కోసం కాదు.
జడ్జి: . . . . అందుకోసం దాన్ని అడిగాడని నేను చెప్పలేను.
వాంజెట్టి: అతన్ని అబద్దాల కోరని అన్నప్పుడు నేనిప్పుడు మాట్లాడుతున్న దానికంటే బిగ్గరగా మాట్లాడలేదు.
కట్జ్‌మన్: ఆ రోజు నీ గొంతు గురించి నీకు గుర్తున్నదదేనా?
వాంజెట్టి: స్వరం భిన్నంగా ఉండవచ్చు. సెంటిమెంట్ భిన్నమైంది కాబట్టి.

ప్ర: ఈ నెలలో ఏ రోజు నువ్వు మైకేల్ కొనొలిని అబద్దాల కోరని అన్నావు?
జ: ఏ రోజో ఖచ్చితంగా గుర్తు లేదు.
ప్ర: ఇరవై రోజుల లోపు కదా?
జ: కాదు. . . అవును. ఇరవై రోజుల లోపే.
ప్ర: ఆ రోజు ఏదో నువ్వు చెప్పలేవు?
జ: లేదు. నేను దానిని రాసి పెట్టుకోలేదు.

. . . . . . . . . .

ప్ర: ఏప్రిల్ 15న (హత్యలు జరిగిన రోజు) నువ్వెక్కడున్నావో గుర్తురాసుకున్నావా?
జ: మిస్టర్ కట్జ్‌మన్. . . . . .
ప్ర: క్షమించాలి. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పు.

. . . . . . . . . .

జ: లేదు నేను గుర్తు రాసుకోలేదు. . . . . నేను అరెస్టయినప్పుడు నాపై ఒక నేరాన్ని, శాక్కోపై మరొకనేరాన్ని మోపినప్పుడు (ఆ తేదీ) గుర్తు చేసుకునేందుకు సాధ్యమైనంతగా ప్రయత్నించాను.
ప్ర: బ్రెయిన్ ట్రీ హత్యా నేరం నీపై మోపబడిందని మొదటిసారిగా నీకెప్పుడు తెలిసింది?
జ: ప్లిమత్ జైల్లో వాళ్ళు చెప్పారు. నాపై నేరం మోపవచ్చని అక్కడి అధికార్లు చెప్పారు.

. . . . . . . . .

ప్ర: ఈ హత్యానేరం నీపై మోపబడిందని మొదటగా నీకే రోజు తెలిసిందో గుర్తు తెచ్చుకోగలవా?

జెరేమీ మెక్ ఎనార్నీ: ఆగండి. నేనభ్యంతర పెడ్తున్నాను.

కట్జ్‌మన్: ఆ రోజును నువ్వు జ్ఞాపకం చేసుకోలేవా?

వాంజెట్టి: చేసుకోలేను. ఈ హత్య కేసు నాపై ఏ రోజు పెట్టారో నాకు గుర్తు లేదు.

. . . . . . . . .

ప్ర: ఈ హత్య కేసు నీ మీద పెట్టబడిందని నీకు ఎప్పుడు తెలిసిందో గుర్తు పెట్టుకోలేవు. అయినప్పటికీ, అప్పటికి ఇరవై రోజుల ముందు ఎక్కడున్నావో నువ్వు గుర్తు పెట్టుకోగలనని జూరీకి చెప్తావా?. . . . .

జ: అవును. అవునవును. ఖచ్చితంగా. నేను 15వ తేదీన ఎవర్నీ చంపలేదని గుర్తు పెట్టుకోగలనని ఖచ్చితంగా మీరు నమ్మవచ్చు. ఎందుకంటే నేను నా జీవితంలో ఎవర్నీ చంపలేదు కాబట్టి.

కట్జ్‌మన్: దానిని రికార్డుల నుంచి తొలగించమని అడుగుతున్నాను.

జడ్జి: మిస్టర్ వాంజెట్టి! నువ్వు జూరీకి మళ్ళీ అనవసర విషయాలు చెప్తున్నావు. దానిని రికార్డుల నుంచి తొలగించవచ్చు.

వాంజెట్టి: దయ చేసి దాన్ని నేను వివరించాలనుకుంటున్నాను.

జడ్జి: తర్వాత నీ లాయర్ ఆ సంగతి చూస్తాడు. నిన్ను క్రాసు పరీక్ష చేస్తున్నారు. వివరణలు ఇచ్చేందుకు ఇది సమయంకాదు. ఈ సాక్ష్యాన్ని రికార్డుల నుంచి తొలగించడం నాకిష్టం లేదు. కానీ అసందర్భమైన జవాబులు చెప్పినప్పుడు జిల్లా అటార్నీ అడిగితే నేనాపని చేయక తప్పదు. నీ నుంచి వివరణ ఏమైనా అవసరమనుకుంటే మెక్ ఎనార్నీ అడుగుతాడన్న విషయాన్ని నువు మర్చిపోకూడదు.

వాంజెట్టి ఎలిబీని ధ్వంసం చేసేందుకు కట్జ్‌మన్ మరికొంత సమయం వెచ్చించాడు. ఏప్రిల్ 14న ఎవరెవరికి చేపలమ్మాడు, ఎక్కడెక్కడున్నాడు, ఏ సమయంలో ఏం చేశాడు వగైరా రొడ్డ కొట్టుడు క్రాసు పరీక్షకు పూనుకున్నాడు.

కట్జ్‌మన్: 1920 ఏప్రిల్ 14 మధ్యాహ్నం 2 గంటలకు మీరు ఎక్కడున్నారండీ?

వాంజెట్టి: సముద్ర తీరానికి దగ్గర్లోనని చెప్పాలి.

ప్ర: ఏం చేస్తున్నావు?

జ: 14 మధ్యాహ్నం 2 గంటలకా?

ప్ర: 14న . .

జ: ఆ సమయంలో చేపలమ్ముతున్నానని ఖచ్చితంగా చెప్పగలను.

ప్ర: చేపలమ్ముతూ రెండింటికి ఎక్కడున్నావు?

జ: ఎక్కడో చెప్పలేను.

ప్ర: *1920 ఏప్రిల్ 14 ఉదయం 10 గంటలకు ఎక్కడున్నావు?*

జ: ఎక్కడో చెప్పలేను.

ప్ర: *1920 ఏప్రిల్ 14న చేపలమ్మితే నువు చేపలమ్మిన ఒక వ్యక్తి పేరు చెప్పు?*

జ: సరే నేను ఎంతో మందికి చేపలమ్మాను. నేను చేపలమ్మిన ప్రతిసారీ వాళ్ళను చూస్తాను.

ప్ర: *తర్వాతి రోజు కన్నా 1920 ఏప్రిల్ 14న ఎక్కువ మందికి చేపలమ్మావా?*

జ: *లేదు అలా అని అనను.*

జాన్సన్ ఇంటికి తామెళ్ళింది కారు కోసమనీ, ఆ కారును సాహిత్యాన్ని తరలించేందుకు ఉపయోగిద్దామనుకున్నామనీ, జాన్సన్ భార్య చెప్పినట్టుగా ఆమె పక్కింటికి వెళ్ళినప్పుడు తాము అనుసరించలేదనీ వాంజెట్టి చీఫ్ ఎగ్జామినేషన్‌లో చెప్పాడు. దాని గురించి కట్జ్‌మన్ ప్రశ్నలిలా సాగాయి:

*కట్జ్‌మన్: బార్లెట్ ఇంట్లో *1920 మే 5 రాత్రి సైమన్ జాన్సన్ భార్య ఎంత సేపుంది వాంజెట్టీ?*

*వాంజెట్టి నాకు తెలియదు*

. . . . . . .

ప్ర: *మోటార్ సైకిల్ లైటు బ్రాక్‌టన్ వేపుగా తిరిగుండగా పక్కనున్న ఇంటికి టెలిఫోన్ తీగలు వెళ్తుండడాన్ని చూడగలిగావా?*

జ: *నాకు ఆ ప్రదేశం గురించి ఏమీ తెలియదు. నాకు దాని గురించి తెలియదు. గమనించకుండానే వంతెన దాటాను. అక్కడి పరిసరాల గురించి నాకు ఏ మాత్రం తెలియదు. స్నేహితుడితో నడుస్తున్నప్పుడు అతనితో కబుర్లు చెప్పే అలవాటుంది నాకు. చుట్టూ చూస్తూ నడవను.*

*కట్జ్‌మన్: యువరానర్! దాన్ని రికార్డుల నుంచి తొలగించమని అడుగుతున్నాను.*

*జడ్జి: తొలగించవచ్చు.*

*కట్జ్‌మన్: ఇక నా ప్రశ్నకు సమాధానం చెప్తావా?*

*వాంజెట్టి: చెప్తానండి.*

ప్ర: *మీ మోటార్‌సైకిల్ లైటు బ్రాక్‌టన్ వేపు తిరిగుండగా ఆ పక్కింటికి, అంటే బార్లెట్ ఇంట్లోకి టెలిఫోన్ తీగలు వెళ్ళడం చూడలేదా?*

జ: *నేనెప్పుడూ చూడలేదు.*

ప్ర: *మిస్టర్ వాంజెట్టి నువ్వక్కడి నుంచి తిరిగి వచ్చేటప్పుడు హడావిడిగా ఉన్నావా?*

జ: *లేదు మేం హడావిడిగా లేం.*

. . . . . . . . .

---

* *రూత్ జాన్సన్ ఫోన్ చేసేందుకు వెళ్ళిన ఇల్లు*

ప్ర: ప్రశాంతంగా, హాయిగా ఉన్నావా?

జ: అవును.

తర్వాత వాంజెట్టి సైన్యంలో చేరక పోవడాన్ని గురించి కట్జ్‌మన్ మళ్ళీ మళ్ళీ ప్రశ్నలు కురిపించి, దేశభక్తి వాంజెట్టిలో లేదని నిరూపించే ప్రయత్నం చేశాడు:

కట్జ్‌మన్: ప్రజలను సైన్యంలో చేర్చే కాలంలో నువ్వెక్కడున్నావని బ్రాక్‌టన్‌లో నేను నిన్నడిగానా?

వాంజెట్టి: లేదు. మీరు నన్నది అడగలేదు.

. . . . . . . . . . .

ప్ర: సైన్యంలో చేరకుండా నువ్వు తప్పించుకున్న సంగతి గురించి ఒక్క ప్రశ్నయినా వేశానా?

జ: లేదు.

. . . . . . . . . .

ప్ర: మిస్టర్ వాంజెట్టి "మీరు యుద్ధాల్లో పోరాడారు. పెట్టుబడిదారుల కోసం పని చేశారు.*" అంటూ మే 9న బ్రాక్‌టన్ మీటింగులో తోటి పౌరులనుద్దేశించి మాట్లాడబోతున్నది నువ్వేనా? యుద్ధం చేసిన సైనికులనుద్దేశించి మాట్లాడ బోతున్నది నువ్వేనా?

జ: అవునండి.

ప్ర: యుద్ధానికి వెళ్ళొచ్చిన వాళ్ళనుద్దేశించి బహిరంగ సభలో సలహా ఇవ్వబోతున్నావా? ఆ మనిషివి నువ్వేనా?

జ: **అవును. నేనే ఆ మనిషిని. మీక్కావలసిన మనిషిని కాను. కానీ నేను ఆ మనిషినే.**

ఈ సమాధానం వాంజెట్టి ప్రతిభకు నిదర్శనంగా పేర్కొంటారు. తర్వాతి రోజు హెరాల్డ్ దిన పత్రిక వాంజెట్టి, కట్జ్‌మన్‌లపై కార్టూను ప్రచురించింది. అందులో గంభీరంగా నిశ్చలంగా నిల్చున్న వాంజెట్టి ముందు కట్జ్‌మన్ కూలబడి ఉన్నట్టుంది. దాని కింద 'వాంజెట్టీని ఢీకొనడం కష్టమని కట్జ్‌మన్ భావించాడు' అన్న వ్యాఖ్యను ప్రచురించారు.

కట్జ్‌మన్ క్రాసు పరీక్షలో మిగిలిన భాగం ఇలా కొనసాగింది:

కట్జ్‌మన్: మిస్టర్ వాంజెట్టి, బ్రాక్‌టన్ పోలీస్ స్టేషన్లో నేను నిన్నడిగిన ఈ ప్రశ్నను నువ్వు దానికిచ్చిన ఈ జవాబును జ్ఞాపకం చేసుకుంటావా?

"ప్రశ్న: సరే మనకు ఏప్రిల్‌లో వచ్చే సెలవు రోజు నీకు గుర్తుందా? ఏప్రిల్ 19 దేశభక్తుల దినం. ఏప్రిల్ నెల మధ్యలో వస్తుంది".

---

* అరెస్టయ్యే రోజు రెస్టారెంట్‌లో కూర్చుని శాక్కోకు వాంజెట్టి రాసిచ్చిన మీటింగు కరపత్రం లోని వాక్యాలివి. ఆ మీటింగులో ఉపన్యసించాల్సింది వాంజెట్టినే.

"జవాబు: అవును. ఇంతకు ముందు దాని గురించి నేను విన్నాను. కానీ ఏప్రిల్‌లో అదొస్తుందని గుర్తు లేదు."

బ్రాక్‌టన్‌లో అలా చెప్పడం జ్ఞాపకం ఉందా?

జ: ఏ సెలవు దినం?

ప్ర: ఏప్రిల్ 19.

జ: ఏ సెలవు రోజది?

ప్ర: దేశభక్తుల దినం?

జ: దేశభక్తుడు. . . . .

ప్ర: దేశభక్తుల దినం?

జ: ఓ! దేశభక్తుల దినం!

ప్ర: అవును. నేను ఆ ప్రశ్న అడగడం, నువ్వు సమాధానం చెప్పడం గుర్తుందా?

జ: లేదు. నాకు గుర్తు లేదు.

ప్ర: ఆ ప్రశ్నకు ఆ సమాధానం చెప్పలేదని చెప్పగలవా?

జ: చెప్పలేదని చెప్పలేను.

ప్ర: తర్వాతి ప్రశ్న నీకు గుర్తుందా?

"ప్రశ్న: ఈ ఏడాది అది సోమవారం వచ్చింది?"

నీ సమాధానం చూడు:

"జవాబు: నాకు గుర్తు లేదు."

అలా జవాబు చెప్పావా?

జ: లేదు. నాకు గుర్తు లేదు.

ప్ర: అలా చెప్పలేదని చెప్తావా?

జ: సరే! అలా చెప్పి ఉండవచ్చు. చెప్పి ఉండవచ్చు. అవును.

ప్ర: ఈ ప్రశ్న, ఈ సమాధానం గుర్తుందా?

"ప్రశ్న: ఆ సోమవారం ముందు గురువారం ఎక్కడున్నావో నీకు తెలియదు. తెలుసా?'

"జవాబు: లేదు."

ఆ ప్రశ్నకు ఆ సమాధానం నీకు గుర్తుందా?

జ: ఓ యస్. . . . గుర్తు లేదని అప్పుడు చెప్పాను. కానీ ఇప్పుడు నాకు గుర్తొచ్చింది.

ప్ర: 1920 మే 6న (ఇంటరాగేట్ చేసిన రోజున)?

జ: అవును.

ప్ర: ఏప్రిల్ 15న ఎక్కడున్నావో అప్పుడు నీకు గుర్తు లేదు. అవునా?

జ: . . . . . అవును.

ప్ర: నెలలు, నెలలు, నెలలు. . . వేచి వున్న తర్వాత ఇప్పుడు నీకు గుర్తొచ్చింది. అవునా?

జ: నెలలు. . . నెలలు... నెలలు కాదు. నా ప్రాణాన్ని రక్షించుకోవాలంటే నేను జాగ్రత్తగా

ఉండాలనీ, సరిగా జ్ఞాపకం ఉంచుకోవాలనీ తెలుసుకున్న తర్వాత. . . అంటే మూడు నాలుగు వారాలకు.

క్రాసు పరీక్ష ముగిసిన తర్వాత వాంజెట్టి తరపు లాయర్ జెరేమీ మెక్ ఎనార్నీ వాంజెట్టిని రీడైరెక్ట్ ఎగ్జామినేషన్‌లో కొన్ని వివరణలు అడగాల్సి వచ్చింది:

జెరేమీ మెక్ ఎనార్నీ: కట్జ్‌మన్ గారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ ఒక చోట నువ్వు భయంతో ఉన్నానని చెప్పావు. అంటే నీ ఉద్దేశం?

. . . . . . . .

జ: న్యూయార్క్‌లో నా మిత్రుడు జైలు పై నుంచి వీధిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని తెలుసు కాబట్టి మేం భయపడ్డామని నా ఉద్దేశం. అతను కిందికి దూకాడని పేపర్లు రాశాయి. కానీ మాకు తెలియదు.

ప్ర: . . . . అతనెవరు?

జ: సెల్సెడో.

ప్ర: సెల్సెడో మృతి గురించి నీకెప్పుడు తెలిసింది?

జ: మే 4న.

ప్ర: . . . . . న్యూయార్క్ వెళ్ళేందుకు ఒక కమిటీ నిన్ను నియమించిందని చెప్పావు?

జ: అవునండి.

ప్ర: అది సెల్సెడో గురించి కాదా అని అడుగుతున్నాను?

జ: అవును. ముఖ్యంగా అతని కోసమే నన్ను పంపారు.

కట్జ్‌మన్: ఒక్క క్షణం యువరానర్!

జడ్జి: నేను నిన్ననే చెప్పినట్టు ఆ సమయంలో అతని మనసును ప్రభావితం చేసినదేదైనా సందర్భోచితమే. అది ఇతరులతో సంభాషణ కావచ్చు లేదా మరే విధమైనదైనా కావచ్చు. అతను విన్నదాని వల్ల లేదా ఇతర మార్గాల ద్వారా తెలుసుకున్న దానివల్ల అతని మనసుపై ఎలాంటి ప్రభావం కలిగిందన్న దానికి ఆ విషయం పరిమితం కావాలి. నేను దాన్ని అనుమతిస్తున్నాను.

. . . . . .

జెరేమీ మెక్ ఎనార్నీ: న్యూయార్క్‌లో నువ్వేమైనా తెలుసుకుంటే అది నువ్వు చేసిన పనులను ఎలా ప్రభావితం చేసింది? నువ్వు న్యూయార్క్ నుంచి వచ్చిన తర్వాత అక్కడ తెలుసుకున్న విషయాలు నీ మనసుపై ఎలాంటి ప్రభావం వేశాయి?

జ: నా మనసును అది కల్లోలభరితం చేసింది. ముఖ్యంగా నా అరెస్టు తర్వాత. . .

జడ్జి: నాకు అర్థం కాలేదు.

వాంజెట్టి: నా అరెస్టుకు ముందే అతను చంపబడ్డాడు. నా అరెస్టుకు ముందు రోజు నాకది తెలిసింది.

జెరేమీ మెక్ ఎనార్నీ: న్యూయార్క్‌లో నువ్వేం విన్నావు? ఏం తెలుసుకున్నావు?

జ: మే 1 నాటికి చాలా మంది రాడికల్స్‌ను అరెస్టు చేయవచ్చనీ ఏదైనా సాహిత్యం ఉత్తర ప్రత్యుత్తరాలూ, పేపర్లూ ఇళ్ళలో ఉంటే బయటికి తరలించడం మంచిదనీ, పోలీసులు ఇళ్ళపై దాడి చేస్తే సాహిత్యం వారికంట పడకుండా చూసుకోవాలి కాబట్టి ఇళ్ళలో సాహిత్యం లేకుండా చేయాలనీ, ఆ సంగతి నా స్నేహితులకు చెప్పాలనీ తెలుసుకున్నాను

ప్ర: దాని పర్యవసానంగానే కదా మే 5న కారు కోసం ఆ రాత్రి అక్కడున్నా...'

జ: అవును అయితే, దాని కోసం మాత్రమే కాదు. తప్పని సరిగా దాని కోసం మాత్రమే కాదు మీటింగు గురించీ, ఉపన్యాసం గురించీ పప్పీతో మాట్లాడేందుకు కూడా బ్రిడ్జివాటర్ వెళ్దామనుకున్నాం

ప్ర: సరే రెండు పనులూ .

జ: ప్రధానమైన పని ప్లిమత్ వెళ్ళి సాహిత్యాన్ని దాచే స్థలం వెతికి ఆ తర్వాత సాహిత్యాన్ని అక్కడికి తరలించడం.

. . . . . . . .

ప్ర. నీకు తెలిసిన మేరకు, నీ లెక్క ప్రకారం ఎంత సాహిత్యాన్ని ప్లిమత్ తీసుకువెళ్ళాలి?

జ: ఐదొందల పౌండ్లుంటుంది. ఖచ్చితంగా నాలుగైదొందల పౌండ్లుంటుంది

ప్ర: నువ్వు దోపిడీల్లో హత్యల్లో పాల్గొన్నట్లు అనుమానించబడ్డావని బ్రాక్టన్ పోలీసు స్టేషన్లో చీఫ్ స్టెవార్ట్ గానీ, కట్జ్‌మన్‌గానీ చెప్పారా?

జ: లేదు

ప్ర: ఏప్రిల్ 15న జరిగిన ఈ నేరం నీపై మోపారని నిన్నడిగిన ఏ ప్రశ్నయినా, నీకు చెప్పిన ఏ మాట అయినా సూచించిందా?

జ లేదు

ప్ర. నిన్నడిగిన ప్రశ్నలను బట్టి నీకేం అర్థమైంది? బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌లో ఎందుకు మిమ్మల్ని నిర్బంధించారో అర్థమైందా?

జ: రాజకీయ సంబంధంగా అరెస్టు చేశారనుకున్నాం.

. . . . . . . . . .

ప్ర: నిన్నడిగిన ప్రశ్నలను బట్టి చెప్తున్నావా?

జ: ఎందుకంటే, నేను సోషలిస్టునా, నేను ఐ.డబ్ల్యు డబ్ల్యు నా, నేను కమ్యూనిస్టునా, రాడికల్‌నా, బ్లాక్ హాండ్‌నా అని అడిగారు.

## సాక్షిగా శాక్కో

వాంజెట్టి సాక్ష్యం చెప్పిన కొన్ని రోజులకు శాక్కో సాక్ష్యం చెప్పాడు. చీఫ్ ఎగ్జామినేషన్‌లో తన లాయర్ మూర్ అడిగిన ప్రశ్నలకు మొదట సమాధానం చెప్పాడు. తన జీవితంలో జరిగిన ఎలు ఘటనల గురించీ, కుటుంబం గురించీ, తన అరాచకవాద భావాల గురించీ, ఎలిబీల గురించీ

చెప్పాడు. వాంజెట్టికి వచ్చినంత ఇంగ్లీషు కూడా రానందు వలన పలు ప్రశ్నలకు శాక్కో దుబాసీ ద్వారా సమాధానం చెప్పాల్సి వచ్చింది. దుబాసీ అనువాదం కొన్ని సందర్భాల్లో అనుమానం రేకెత్తించడం వల్ల మరో దుబాసీని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. శాక్కో సాక్ష్యం ఇలా సాగింది

*మూర్ ఇక్కడికి రావడం ఎలా జరిగింది? ఇక్కడికి ఏ సంవత్సరంలో వచ్చావు? నీతో పాటు ఎవరొచ్చారు?*

*శాక్కో నా సోదరుడు సైన్యం నుంచి తిరిగొచ్చిన తర్వాత ఈ దేశానికి రావాలనుకున్నాను నేను స్వతంత్ర దేశాన్ని ప్రేమిస్తాను కాబట్టి నేనిక్కడికి రావాలని బాగా మోజుపడ్డాను అతనితో (సోదరుడితో) కలిసి రావాలనుకున్నాను.*

ప్ర మీ అమ్మా నాన్నలు బతికే ఉన్నారా?

జ మా నాన్న బతికి ఉన్నాడు మా అమ్మ చనిపోయింది

ప్ర మీ అమ్మ ఎప్పుడు చనిపోయిందో మీ వాళ్ళు తెలిపారా?

జ 1920 మార్చి 7న

. . . . . . .

ప్ర. ఏప్రిల్ 15న నువ్వెక్కడున్నావు?

జ: బోస్టన్‌లో

. . . . . . .

ప్ర: బోస్టన్‌కు ఎందుకెళ్ళావో మొదట అడుగుతాను.

జ: నా పాస్‌పోర్ట్ తెచ్చుకునేందుకు

ప్ర: స్టాటన్ నుంచి ఎప్పుడు బయల్దేరావు?

జ: 8:56 రైలులో. . . .

. . . . . . .

ప్ర. బోస్టన్‌కు వెళ్ళాక ఎక్కడికెళ్ళావు?

జ: సౌత్ స్టేషన్ నుంచి నార్త్ ఎండ్‌కు వెళ్ళాను. లా నోటిజియ పత్రిక కొనుక్కునేందుకు

. . . . . . .

ప్ర: తర్వాతేం చేశావు?

జ: అక్కడ పదిహేన్నిమిషాలున్నాననుకుంటాను కొంచెం సేపు (పత్రిక) చదివాను తర్వాత నడక సాగించాను. హానోవర్ స్ట్రీట్‌కు వెళ్ళాను.

ప్ర: ఎక్కడికెళ్ళావు?

జ: నడక సాగించాను. ఒక మిత్రుడు (ఏంజిలో మోనెల్లో) కలిశాడు

ప్ర: తర్వాత ఎక్కడి కెళ్ళావు?

జ: వాషింగ్టన్ స్ట్రీట్ వరకూ వెళ్ళాము మళ్ళీ వెనక్కు వెళ్ళాను ఒక కొట్టు దగ్గర ఆగి టోపీలను, సూట్లను, వాటి రేట్లను చూస్తున్నాను. మళ్ళీ వెనక్కెళ్ళాను మధ్యాహ్నం

తర్వాత పాస్ పోర్ట్ తెచ్చుకునేందుకు వెళ్ళాలనుకున్నాను . . భోజనం చేసేందుకు బోనీస్ రెస్టారెంట్‌కు వెళ్ళాను.

ప్ర: అక్కడెవర్ని చూశావు?

జ: మిస్టర్ ప్రొఫెసర్ గుడాగ్ని

. . . .

ప్ర: ఇంకా ఎవరినైనా?

జ: మిస్టర్ బోస్కో

ప్ర. ఇంకా ఎవరినన్నా? . . . సరే, రెస్టారెంట్‌లో ఎంత సేపున్నారు?

జ: గంటా పదిహేనూ ...... ఇరవై నిమిషాలు.

. . . . . .

ప్ర: తర్వాత ఎక్కడికెళ్ళావు?

జ నేరుగా ఇటాలియన్ దౌత్య కార్యాలయానికి వెళ్ళాను

ప్ర ఇటాలియన్ కార్యాలయానికి ఎన్ని గంటల కెళ్ళావు? తెలిస్తే చెప్పు?

జ: సుమారు రెండు గంటలౌతుంది

ప్ర. దౌత్య కార్యాలయంలో ఏం జరిగింది? నువ్వెవరితో మాట్లాడావు? ఏం జరిగింది?

జ: . . . . నేను లోపలికి వెళ్ళాను ఒక మనిషి వచ్చాడు . "నా కుటుంబానికంతటికీ పాస్‌పోర్ట్ తీసుకోవాలనుకుంటున్నాను" అన్నాను "ఫోటో తీసుకు వచ్చారా?" అనడిగాడతను. "తెచ్చాను" అన్నాను. అతనికి దాన్నిచ్చాను. అది పెద్ద ఫోటో. "క్షమించాలి ఈ ఫోటో బాగా పెద్ద ఫోటో ' అన్నాడతను. "కత్తిరించి చిన్నది చేయలేరా' ' అని అడిగాను. "లేదు, ఉపయోగపడదు. ఇది చాలా పెద్దదవుతుంది" అన్నాడతను. "పాస్‌పోర్ట్ కోసం చిన్నది, చాలా చిన్న ఫోటో తయారు చేయించుకోవాలి కాబట్టి ఉపయోగం లేదు ' అన్నాన్నేను ఆలా జరిగింది

. . . . . . . .

ప్ర: తర్వాతేం చేశావు?

జ: ఇంటికి కావల్సిన సరుకులు, మిఠాయిలు కొనేందుకు వెనక్కొళ్ళాను కొనే ముందు నార్త్ఎండ్‌లో బోనీస్ రెస్టారెంట్ దగ్గర్లో ఉన్న కాఫీ స్టోర్‌కు వెళ్ళాను. కాఫీ తాగుదామని

. . . . . . . . .

ప్ర: అక్కడుండగా ఎవరినైనా చూశావా?

జ: ఆ.

ప్ర: ఎవరిని?

జ: ప్రొఫెసర్ గుడాగ్ని.

ప్ర. ఇంకా ఎవరినైనా చూశావా?

జ: అవును ప్రొఫెసర్ డెంటామోర్‌ను

. . . . . . .

ప్ర స్టాటన్‌కు ఎన్ని గంటలకు బయల్దేరావు?

జ. 4 12 కు అని చెప్పాలి

ప్ర· వెంటనే వెనక్కి - స్టాటన్‌కు వెళ్ళి ఇంటికి చేరావు?

జ: అవును

. . . . . . .

ప్ర శాక్కో! మే 5న * రివాల్వర్ లేదా పిస్టల్‌ను వెంట తీసుకెళ్ళడం ఎందుకు జరిగింది?

జ: . శనివారం న్యూయార్క్ వెళ్ళి ఓడ ఎక్కబోతున్నాం. (ఇటలీ వెళ్ళేందుకు) కాబట్టి నా భార్య ఇంటిని శుభ్రం చేస్తోంది. ఆమె అన్నీ సిద్ధం చేస్తోంది అందుకని బీరువాను శుభ్రపరిచింది బుల్లెట్లు పిస్టల్ బయటికి లాగింది "వీటితో ఏం చేయబోతున్నావు నిక్" అని అడిగింది

కట్జ్‌మన్· ఒక్క క్షణం

మూర్· ఆమె ఏం చెప్పిందన్నది కాదు. నువ్వేం చేశావు?

దగ్గర్లో ఉన్న చెట్ల తోపులోకి వెళ్ళి ఆ బుల్లెట్లు పేల్చేద్దామనుకున్నాననీ, అందుకోసం రివాల్వర్‌ను బుల్లెట్లనూ జేబులో పెట్టుకున్నాననీ శాక్కో చెప్పాడు. వాంజెట్టితో శాక్కో మాట్లాడుతుండగా ఓర్సియాని, బోడా వచ్చారు. మిత్రులతో మాటల్లో మునిగి రివాల్వర్, బుల్లెట్ల సంగతి మర్చిపోయాడు శాక్కో. అవి అతని జేబులోనే ఉండి పోయాయి.

బ్రాక్‌టన్ పోలీసు స్టేషన్‌లో సంగతులడిగాడు మూర్. మే 6, 7 తేదీల్లో తనను పలువురికి చూపించి గుర్తు పట్టించేందుకు పోలీసులు ప్రయత్నించారనీ, రకరకాల పోజుల్లో నిలబెట్టి సుమారు వంద మందికి చూపించారనీ చెప్పాడు.

ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ శాక్కోను క్రూరంగా క్రాసు పరీక్ష చేశాడు. రాడికల్ భావాల గురించి వాంజెట్టిని అడిగిన దానికన్నా బాగా ఎక్కువగా ప్రశ్నలు కుమ్మరించాడు. శాక్కో, వాంజెట్టిలు దేశద్రోహులని నిరూపించేందుకు క్రాసు పరీక్షను ఆయుధంగా వాడుకున్నాడు. తెలివైన వాంజెట్టి కన్నా శాక్కోను అందుకు బాగా ఉపయోగించుకోవచ్చని కట్జ్‌మన్ అంచనా వేశాడు. న్యాయమూర్తి థేయర్ ప్రాసిక్యూటర్‌కు నిస్సిగ్గుగా సహకరించాడు. ప్రాసిక్యూటర్, జడ్జిల ఈ ప్రవర్తన తీవ్ర విమర్శలకు గురైంది. ఆధునిక కాలంలో కోర్టులో జరిగిన **'అసాధారణ క్రాసు పరీక్షలలో ఖచ్చితంగా ఇదొకటి'** అని లాయర్ హెర్బర్ట్ ఎహర్మన్ అభివర్ణించాడు.

వాంజెట్టిని అడిగిన మాదిరిగానే శాక్కో దేశభక్తి గురించి కట్జ్‌మన్ మొదటగా దాడి చేశాడు. శాక్కో సాక్ష్యం మూడు రోజుల పాటు సాగింది. క్రాసు పరీక్షలో ప్రాసిక్యూటర్ దాదాపు 1700 ప్రశ్నలు వేశాడు. అందులో దేశభక్తి గురించిన అనవసర, అసందర్భమైన ప్రశ్నలే ఎక్కువ:

---

* అరెస్టయిన రోజు.

కట్జ్‌మన్: స్వతంత్ర దేశాన్ని ప్రేమిస్తున్నానని నిన్న నువ్వు చెప్పావు కదా?

శాక్కో: అవునండి.

ప్ర: ఈ దేశాన్ని నువ్వు *1917* మేలో ప్రేమించావా?

జ: నేను చెప్పను. ఈ దేశాన్ని ప్రేమించలేదని నేను చెప్పదల్చుకోలేదు.

ప్ర: *1917* మేనెలలో నువ్వు ఈ దేశాన్ని ప్రేమించావా?

జ: మిస్టర్ కట్జ్‌మన్. మీరు అవకాశం ఇవ్వగలిగి ఇస్తే వివరించగలను.

ప్ర: నువ్వు ప్రశ్నను అర్థం చేసుకున్నావా?

జ: అవును.

ప్ర: మరిప్పుడు సమాధానం చెప్తావా?

జ: ఒక్క మాటలో సమాధానం చెప్పలేను.

ప్ర: సైన్యంలో చేరే వాళ్ళ మొదటి జాబితాలో నీ పేరు నమోదయ్యేందుకు ఓ వారం ముందు అమెరికాను ప్రేమించావో లేదో నువ్వు చెప్పలేవా?

జ: ఒక్క మాటలో చెప్పలేను మిస్టర్ కట్జ్‌మన్!

ప్ర: ఈ దేశాన్ని ప్రేమించావో లేదో నువ్వు జూరీకి చెప్పలేవు?

మూర్: ఈ ప్రశ్నకు నేను అభ్యంతరం పెడ్తున్నాను.

శాక్కో: నేను దానిని వివరించగలను. అవును-నేను ప్రేమించినట్లయితే. . . .

కట్జ్‌మన్: ఏమిటి?

జ: నేను ప్రేమించినట్లయితే, మీరు నాకు అవకాశం ఇచ్చినట్లయితే నేను చెప్పగలను.

ప్ర: మొదట ఆ ప్రశ్నకు సమాధానం చెప్పమని నిన్నడుగుతున్నాను. నువ్వు ఈ అమెరికాను *1917* మేలో ప్రేమించావా?

జ: ఒక్క మాటలో నేను సమాధానం చెప్పలేను.

ప్ర: నువ్వు ప్రేమించావో లేదో నీకు తెలియదా?

మూర్: నేను అభ్యంతరపెడ్తున్నాను యువరానర్!

జడ్జి: ఏమిటో చెప్పండి.

మూర్: శాక్కోకి తన అభిప్రాయం చెప్పేందుకు అవకాశం ఇవ్వకుండా ఆ ప్రశ్నను పదేపదే వేయడాన్ని నేను అభ్యంతరపెడ్తున్నాను.

జడ్జి: అది మామూలుగా అనుసరించే పద్ధతి కాదు. ప్రశ్నకు 'అవును', 'కాదు' అని స్పష్టంగా సమాధానం చెప్పగలిగినప్పుడు దానికి సమాధానం చెప్పాలి. వివరణ తర్వాత వస్తుంది. అతను ఆ సమయంలో అవసరం అని భావించిన ఏ వివరణైనా చెప్పేందుకు అవకాశం ఇచ్చే సంగతి గురించి, సమాధానం చెప్పాక మీరేమైనా అడగవచ్చు. 'అవును' లేదా 'కాదు' అని సమాధానం చెప్పగలిగే ప్రశ్న అయితే అలా చెప్పించుకునే హక్కు క్రాసు పరీక్ష చేస్తున్న లాయర్‌కు ఉంది. . . మీరు కానివ్వండి. ప్లీజ్.

కట్జ్‌మన్: *1917* మే నెల చివరి వారంలో నువ్వు ఈ దేశాన్ని ప్రేమించావా?

శాక్కో: మిస్టర్ కట్జ్‌మన్, ఒక్క మాటలో దాన్ని చెప్పడం నాకు మహాకష్టం.

ప్ర: మిస్టర్ శాక్కో! నువ్వుపయోగించేందుకు రెండు పదాలున్నాయి. అవును, కాదు. అదేది?

జ: అవును.

ఈ జవాబు చెప్పాక కట్జ్‌మన్ శాక్కో మీద ఘోరంగా ప్రశ్నల వర్షం కురిపించాడు.

కట్జ్‌మన్ : అమెరికా నిన్ను సైనికుడిగా మారమని పిలుపు ఇచ్చినప్పుడు అమెరికా పట్ల నీ ప్రేమను వ్యక్తం చేయడం కోసం నువ్వు మెక్సికో పారిపోయావు?

జెరేమీ మెక్ ఎనార్నీ: ఆగండి!

జడ్జి: (శాక్కోతో) అలా చేశావా?

కట్జ్‌మన్: మెక్సికోకు పారిపోయావా?

జడ్జి: మెక్సికోకు పారిపోయానని అతను చెప్పలేదు. . . (శాక్కోతో) నువ్వు వెళ్ళావా?

కట్జ్‌మన్: నువ్వు ప్రేమించిన ఈ దేశం కోసం సైనికుడిగా మారకుండా తప్పించుకునేందుకు నువ్వు మెక్సికో వెళ్ళావా?

శాక్కో: అవును.

ప్ర: నువ్వు పేరు మార్చుకొని వెళ్ళావు.

జ: లేదు.

ప్ర: మొస్మకోటెల్లి అనే పేరు పెట్టుకోలేదా నువ్వు?

జ: అవును.

ప్ర: అది నీ పేరు కాదు. అవునా?

జ: కాదు.

ప్ర: మొస్మకోటెల్లి పేరుతో ఎన్నాళ్ళున్నావు?

జ: కెల్లీ ఫ్యాక్టరీలో పని కుదిరిన దాకా.

ప్ర: అది ఎప్పుడు జరిగింది?

జ: యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినప్పుడు.

ప్ర: యుద్ధం ఖచ్చితంగా ముగిసినప్పుడా?

జ: అవునండి.

ప్ర: మొదట సారిగా *1917* మే తర్వాత మళ్ళీ శాక్కోగా వ్యవహరించబడ్డావు?

జ: అవునండి.

ప్ర: నాలుగు నెలల తర్వాత (మెక్సికో నుంచి) నువ్వు తిరిగి వచ్చినప్పుడు మిల్‌ఫోర్డ్‌కు వెళ్ళకుండా నువ్వు కేంబ్రిడ్జి * వెళ్ళింది సైన్యంలో చేరకుండా ఉండాలనుకున్నందువల్లేనా?

జ: సైన్యంలో చేరకుండా ఉండేందుకే.

* ఇంగ్లాండ్ దేశంలోది కాదు. మసాచూసెట్స్ రాష్ట్రంలో కూడా ఉంది. హార్వర్డ్‌విశ్వవిద్యాలయం ఇక్కడే వుంది.

ప్ర: సైన్యంలో చేరకుండా తప్పించుకునేందుకు?

జ: మరో కారణం ఉంది. అరెస్టయి ఒక ఏడాది జైల్లో గడపదల్చుకోలేదు.

. . . . . . .

ప్ర: మెక్సికో నుంచి తిరిగొచ్చినప్పుడు ఈ దేశాన్ని నువ్వు ప్రేమించావా?

జ: ఆ మూడు నెలల్లో నా అభిప్రాయాన్ని మార్చుకొనగలనని నేననుకోను.

ప్ర: నువ్వింకా అమెరికాను ప్రేమిస్తూనే ఉన్నావు. అవునా?

జ: అవునని చెప్పాలి.

ప్ర: ఈ దేశం పట్ల నీ ప్రేమను వ్యక్తం చేసేందుకు అది నీ పద్ధతా?

జ: (సమాధానం చెప్పేందుకు శాక్కో ఇష్టపడలేదు.)

ప్ర: అమెరికా పట్ల నీ ప్రేమ వ్యక్త పరిచేందుకు అది నీ పద్ధతా?

జ: అవును.

ప్ర: నీ భార్య నిన్ను కోరుకున్నప్పుడు నువ్వు పారిపోవడం ఆమె పట్ల నీ ప్రేమను వ్యక్తపర్చడం అవుతుందనుకుంటున్నావా?

జ: నేను ఆమె నుంచి పారిపోలేదు.

మూర్: నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: అతను సమాధానం చెప్పవచ్చు. . . . . .

శాక్కో: నేను ఆమెను కోరుకున్నప్పుడు తిరిగి వచ్చేందుకే వెళ్ళాను.

కట్జ్‌మన్: నీ భార్యకు నువ్వు అవసరమైనప్పుడు ఆమె దగ్గర నుంచి పారిపోవడం ఆమె పట్ల నీ ప్రేమకు నిదర్శనమని నువ్వు అనుకుంటున్నావా?

జెరేమీ మెక్ ఎనార్నీ: క్షమించండి. ఆ ప్రశ్నకు నా అభ్యంతరం నమోదు చేయండి.

జడ్జి: ఆ ప్రశ్నను తొలగించాం. ఎవరూ పారిపోక పోవచ్చు. పారిపోయానని అతను అంగీకరించలేదు.

కట్జ్‌మన్: . . . . . అమెరికా తరఫున సైనికుడిగా మారకుండా తప్పించుకునేందుకు నువ్వు మిల్‌ఫోర్డ్ నుంచి పారిపోలేదా?

శాక్కో: నేను పారిపోలేదు.

ప్ర: నడిచి పోయానంటావా?

జ: అవును.

ప్ర: "పారిపోయావు" అని నేను అన్నప్పుడు నీకు అర్థం కాలేదు. అయిందా?

జ: ఆ పదం రోతగా ఉంది.

ప్ర: అది రోతగా ఉందా?

జ: కొంచెం మర్యాదగా మాట్లాడవచ్చు మిస్టర్ కట్జ్‌మన్.

ప్ర: ఈ దేశానికి అవసరమైన సమయంలో దూరంగా వెళ్ళి పోవడం రోత పని అని నువ్వనుకోవా?

జ: నాకు యుద్ధంలో నమ్మకం లేదు.

ప్ర: యుద్ధంలో నమ్మకం లేదా?

జ: లేదండి.

ప్ర: నువ్వు చేసింది పిరికి చర్య అని అనుకోవా?

జ: లేదు.

ప్ర: నువ్వు చేసింది సాహసకృత్యమని భావిస్తున్నావా?

జ: అవునండి.

ప్ర: నీ భార్యను వదిలి నువ్వు వెళ్ళిపోవడం సాహస కార్యక్రమం అవుతుందను కుంటున్నావా?

జ: కాదు.

ప్ర: నువ్వు అవసరమని ఆమె అనుకుంటున్నప్పుడు?

జ: కాదు.

ప్ర: ఈ దేశంలో మొదట్లో నువ్వెంత కూలి సంపాయించావు?

జ: 1.15 డాలర్లు.

ప్ర: రోజుకా?

జ: అవును

ప్ర: 3-కె ఫ్యాక్టరీలో చేరిన తర్వాత ఎంత సంపాదిస్తున్నావు?

జ: కొన్నిసార్లు (వారానికి) అరవై, యాభై, డెభ్భై, ఎనభై, నలభై, ముప్పై, ఇరవైఐదు, ముప్పైఐదు. నేను చేసిన పనిని బట్టి.

ప్ర: అది నువ్వు దేశానికి వచ్చిన మొదటి ఎనిమిదేళ్ళలోగా?

జ: ఏడేళ్ళ తర్వాత-కాదు. పన్నెండేళ్ళ తర్వాత.

ప్ర: నీకొడుకు ఈ దేశంలోనే పుట్టాడు. కాదా?

జ: అవును.

ప్ర: నీ పెళ్ళి యిక్కడే అయింది?

జ: అవును.

ప్ర: ఇటలీ స్వతంత్ర దేశమేనా? గణతంత్రమేనా?

జ: గణతంత్రమే. అవును.

ప్ర: నువ్వు స్వతంత్ర దేశాలను ప్రేమిస్తావు?

జ: అవునని చెప్పాలి.

ప్ర: మెక్సికోలో ఎందుకు స్థిరపడలేదు?

జ: మొదటికారణం. నాకు చేతనైన పని అక్కడ సంపాదించలేకపోయాను. నేను వేరేపని చేయాల్సి వచ్చింది.

ప్ర: మెక్సికోలో పార, పలుగులతో పని చేయరా?

జ: చేస్తారు.

ప్ర: పార, పలుగులతో ఈ దేశంలో నువ్వు పనిచేయలేదా?

జ: చేశాను.

ప్ర: ఆ స్వతంత్ర దేశంలో స్థిరపడి పార, పలుగుతో పనిచేయలేదెందుకని?

జ: కష్టపడి పనిచేద్దామనుకున్నది మెక్సికో వెళ్ళి పార, పలుగుతో పని చేసేందుకని నేననుకోను.

ప్ర: అమెరికాపట్ల నీ ప్రేమ ఈ దేశంలో ఒక వారంలో నీ సంపాదనకు సరి సమానమైనంత. అవునా?

జ: మెరుగైన స్థితిగతులు. అవును.

ప్ర: సొమ్ము జేసుకొనేందుకు మెరుగైన దేశంకాదా?

జ: అవును.

ప్ర: మిస్టర్ శాక్కో! ఈ దేశంపట్ల నీ ప్రేమ అంత మేరకే. అది డాలర్లతో కొలవబడిన ప్రేమ. కాదా?

జెరెమీ మెక్ఎనార్నీ: యువరానర్. అనుమతించినట్లైతే ఈ ప్రశ్నకు నేను అభ్యంతరపెడ్తున్నాను.

జడ్జి: ఈ మొత్తం విషయాన్ని మీరే ప్రారంభించారు.

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్ అనుమతిస్తే, ఈ ప్రశ్నకు నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: దాని రూపానికా?

జెరెమీ మెక్ ఎనార్నీ: రూపానికీ, సారానికీ.

కట్జ్‌మన్: యువరానర్! అనుమతిస్తే నేను రూపాన్ని మారుస్తాను.

జడ్జి: దాన్ని మార్చడం మంచిది.

కట్జ్‌మన్: నువ్వు ఇక్కడ సంపాదించగలిగే డబ్బు ఈ దేశం పట్ల నీ ప్రేమకు కొలమానమైందా?

జడ్జి: నువ్విప్పుడు సమాధానం చెప్పవచ్చు.

శాక్కో: నేనెప్పుడూ డబ్బును ప్రేమించలేదు.

జెరెమీ మెక్ ఎనార్నీ: నా అభ్యంతరాన్ని నమోదు చెయ్యండి.

జడ్జి: తప్పని సరిగా.

కట్జ్‌మన్: సరే! కారణమేమిటి?

జడ్జి: ముద్దాయిలే దీన్ని ప్రారంభించినందువల్ల ( ఈ ప్రశ్నను) నేను అను మతిస్తున్నాను.

కట్జ్‌మన్: నువ్వు డబ్బును ప్రేమించనట్లైతే నువ్వు మెక్సికోనుంచి తిరిగిరావడానికి కారణం ఏమిటి?

శాక్కో: నా స్వభావానికి అక్కడి పరిస్థితి విరుద్ధంగా ఉంది. ఏమైనా అక్కడ తిండి వేరే, వాతావరణం వేరే.

ప్ర: దానిని నాలుగు నెలలు తట్టుకున్నావు కాదా?

జ: మూడు నెలలు.

ప్ర: మూడు నెలలా?

జ: అవును.

ప్ర: శారీరకంగా ఆరోగ్యవంతుడిగానే తిరిగొచ్చావు. రాలేదా?

జ: అవునని చెప్పాలి.

ప్ర: నీకు అక్కడ ఇటాలియన్ తిండి దొరికిందా?

జ: అవును. మేం తయారు చేసుకుంది.

ప్ర: అమెరికాకు ఎందుకు తిరిగొచ్చావంటే మొదట తింటానికైనా-నీ కిష్టమైనది-సంపాదించేందుకనుకుంటాను అవునా?

జ: లేదు. తినేందుకు మాత్రమే కాదు.

ప్ర: అది మొదటి కారణమని నువ్వు చెప్పలేదా?

జ: అవును.

ప్ర: సరే బాగుంది. అది హృదయానికి సంబంధించిన కారణం కాదు. అవునా?

జ: హృదయమా?

ప్ర: అవును?

జ: కాదు.

ప్ర: అది కడుపుకు సంబంధించిన కారణం కాదా?

జ: కడుపు కోసమే కాదు. కానీ వేరేదైనా కావచ్చు.

ప్ర: నేను మొదటి కారణం గురించి అడుగుతున్నాను నీ కడుపును తృప్తిపర్చడంపై అమెరికా పట్ల నీ ప్రేమ ఆధారపడి ఉన్నదన్నది మొదటి కారణం. సరేనా?

జ: అవునని చెప్పను.

ప్ర: అలా అని నువ్వు చెప్పలేదా?

జ: పొట్ట కోసం కాదు. ఆ తృప్తి కడుపు కోసం మాత్రమేనని నేననుకోను.

ప్ర: నీ రెండవ కారణం ఏమిటి?

జ: బాష కొత్తది కావడం రెండవకారణం.

ప్ర: తెలియని భాషా?

జ: అవును.

ప్ర: నువ్వక్కడ ఇటాలియన్ కాలనీలో ఉన్నావా?

జ: నాకు అర్థం కాలేదు మిస్టర్ కట్జ్‌మన్.

ప్ర: క్షమించాలి. నువ్వక్కడ ఇటాలియన్లతో కలిసి ఉన్నావా?

జ: అవును.

ప్ర: 1908లో అమెరికాకు వచ్చినప్పుడు నీకు ఇంగ్లీషు అర్థమైందా?

జ: లేదు.

ప్ర: ఇక్కడ కూడా తెలియని భాషే కాదా?

జ: అవును.

ప్ర: మూడో కారణం ఏమైనా ఉంటే ఏమిటది?

జ: నేను నా భార్యకూ నా కొడుకుకూ దూరంగా ఉన్నాను. అది మూడో కారణం.

ప్ర: నీ భార్యను, కొడుకును రమ్మని కబురు పెట్ట లేక పోయావా?

జ: ఇక్కడికి వచ్చేయాలనుకున్నాను. కాబట్టి (వారి కోసం) నేను కబురు పెట్ట లేదు

ప్ర: నాకది తెలుసు. మళ్ళీఇక్కడికే వచ్చావు. నా ప్రశ్నేంటంటే, మిసెస్ శాక్కొనూ నీ కొడుకునూ రావలసిందని కబురు పెట్ట లేక పోయావా?

జ: గడ్డు పరిస్థితి, (వాళ్ళను రప్పించడం) మంచిది కాదు. నేను తిరిగి అమెరికా రాగలిగినప్పుడు నా భార్యను కొడుకును నేనెందుకు అక్కడికి రప్పించాలి?

ప్ర: మిసెస్ శాక్కొను, నీ కొడుకును నీతో కలిసి ఉండేందుకు రప్పించగలిగే వాడివని నీ సమాధానం సూచిస్తుంది?

జ: అవును.

ప్ర: ఈ దేశానికి తిరిగి రావడాన్నే ఎంచుకున్నావు?

జ: అవును.

ప్ర: కానీ, యుద్ధ విరమణ ఒప్పందంపై సంతకాలయ్యే వరకూ మొస్మకోటెల్లి అనే పేరుతోనే ఉండదల్చుకున్నావు. కాదా?

జ: అవును.

ప్ర: నువ్వు అమెరికాను ఎందుకు ప్రేమించావన్న దానికి ఆ మూడిటితో పాటు ఇంకేదైనా కారణం ఉందా?

జ: నేను చెప్పలేను. మిగిలిన చోట్ల కంటే జీవించేందుకు కార్మిక వర్గానికి ఇక్కడ ఎక్కువ వీలుందనుకుంటాను. బాగా శ్రమించేందుకు అవకాశం ఉంది. ఎక్కువ పరిశ్రమలున్నాయి. తనకు కావలసిందేదైనా పొందేందుకు అవకాశం ఉంది.

ప్ర: డబ్బు సంపాదించేందుకని అంటావు. కాదా?

జ: కాదు. డబ్బు కాదు. డబ్బును నేనెన్నడూ ప్రేమించలేదు.

ప్ర: డబ్బునెప్పుడూ ప్రేమించలేదా?

జ: లేదు. నాకు డబ్బు ఏనాడూ తృప్తి నివ్వలేదు.

ప్ర: బాగా డబ్బు సంపాయించే అవకాశం కాకపోతే నిన్ను ఇక్కడ అమితంగా ఆకర్షించిన పారిశ్రామిక పరిస్థితి ఏది?

జ: మిస్టర్ కట్జ్‌మన్. మానవుడి పొట్టకు డబ్బులోనే తృప్తి కలగదు.

ప్ర: దేనికి?

జ: పొట్టకు అని అంటున్నాను.

ప్ర: మనం పొట్టను వదిలేశాం. ఇప్పుడు నేను డబ్బు గురించి మాట్లాడుతున్నాను.

జ: అనేక విషయాలున్నాయి.

ప్ర: సరే వాటన్నిటినీ తెలుసుకుందాం. అమెరికా యుద్ధం చేస్తున్నప్పుడు మెక్సికో స్వర్గానికి వెళ్ళిం తర్వాత నువ్వు తిరిగొచ్చావు. నువ్వు అమెరికాను ఎందుకు ప్రేమించావో తెలుసుకోవాలనుకుంటున్నాను?

జ: అవును.

ప్ర: నువ్వు అమెరికాకు తిరిగి వచ్చేందుకు గల కారణాలన్నీ కావాలి నాకు?

జ: నేను మీకు ఇప్పటికే చెప్పాననుకుంటున్నాను.

ప్ర: అన్నీ అవేనా?

జ: అవును. పరిశ్రమలు పలు విషయాలను మారుస్తాయి.

ప్ర: ఆహారం ఉంది. అదొక కారణం?

జ: అవును.

ప్ర: విదేశీ భాష అనేది రెండవది?

జ: అవును

ప్ర: నీ భార్య, కొడుకు మూడవ కారణం?

జ: అవును.

ప్ర: మెరుగైన పారిశ్రామిక పరిస్థితులు?

జ: అవును.

ప్ర: మొత్తం అవే?

జ: అవే.

ప్ర: ఈ నాలుగు కారణాల్లో దేశం పట్ల ప్రేమను చూశావా?

జ: అవునండీ.

ప్ర: దేశం పట్ల ప్రేమను సూచించేది ఏది?

జ: మొత్తం కలిపి.

ప్ర: అన్నీ కలిపా?

జ: అవునండీ.

ప్ర: ఆహారం, భార్య, భాష , పరిశ్రమలు?

జ: అవును.

ప్ర: అది దేశం పట్ల ప్రేమ. అవునా?

జ: అవును.

ప్ర: దేశానికి సైనికుడు కావాల్సి వచ్చినప్పుడు దేశం వైపు నిలబడటం దేశం పట్ల ప్రేమకు సాక్ష్యం కాదా ?

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్! అనుమతిస్తే నేను అభ్యంతరపెడ్తున్నాను. ఈ మొత్తం ఇంటరాగేషన్ సరళికే నా అభ్యంతరముందని నేనిప్పుడు చెప్పాల్సి ఉంటుంది.

ఈ అభ్యంతరానికి న్యాయమూర్తి రెచ్చిపోయాడు. కట్జ్‌మన్ బదులుగా దేశభక్తి గురించి ఆయనే మాట్లాడడం మొదలు పెట్టాడు. ప్రాసిక్యూటర్ అనే క్రూరమృగం వెంటపడగా ప్రాణభయంతో పరుగెత్తుతున్న లేడిగా శాక్కోను భావిస్తే, న్యాయమూర్తి మరో క్రూరమృగంగా మారి పక్కనే పరుగెడుతూ మరెవరూ ఆ లేడిని రక్షించకుండా కాపలా కాసినట్టుగా ఈ దృశ్యం ఉందని ప్రఖ్యాత నవలా రచయిత అప్టన్ సింక్లేర్ అభివర్ణించాడు. ఇది జంతు సామ్రాజ్యంలో కూడా సంభవించే అవకాశం లేని క్రూరదృశ్యమని ఆయన ఖండించాడు. 'అమెరికా

ప్రయోజనాల కోసమేనా సోషలిస్టు సాహిత్యాన్ని తరలించాలనుకున్నది' అంటూ జెరెమీ మెక్ ఎనార్నీని అరడజను సార్లు న్యాయమూర్తి ప్రశ్నించాడు. మెక్ ఎనార్నీ అభ్యంతరాన్ని అడ్డం పెట్టుకొని దేశభక్తిని రెచ్చగొట్టేందుకు థేయర్ ప్రయత్నించాడు:

జడ్జి: మీరే దాని ముడి విప్పారనుకుంటాను.

జెరెమీ మెక్ ఎనార్నీ: లేదు యువరానర్. నేనావని చేయలేదు.

జడ్జి: మీరే మొదట మొదలు పెట్టారనిపిస్తుందినాకు. సాహిత్యం, పుస్తకాలు సేకరించడం అమెరికా కోసమే కాక దాని ప్రజల కోసమని కూడా మీరు అనబోతున్నారా? అందువల్ల సాహిత్యాన్ని దాచే మొత్తం పని నిజంగా అమెరికా కోసమే చేశామని ముద్దాయి చెప్పినప్పుడు అతని విశ్వసనీయత బయట పడిందని అనబోతున్నారా?

జెరెమీ మెక్ ఎనార్నీ: కోర్టు ఉపయోగించిన భాషతో సమానార్థంలో అది చెప్పబడలేదు. ఇప్పటికి ఉన్న రికార్డురీత్యా ఈ విచారణా పద్ధతి మొత్తాన్నీ నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: సాహిత్యాన్ని దాచడం కోసం, జనాన్ని దేశం నుంచి బహిష్కరించకుండా ఆపడంకోసం ముద్దాయి కారు అవసరమనుకున్నాడనీ, జాన్సన్ ఇంటికి వెళ్ళేందుకు ముద్దాయి చెప్పిన ఆ కారణాన్ని బట్టి మీరు అనడం లేదా? ఈ సాహిత్యాన్ని పంచడం ద్వారా జరిగే చట్ట వ్యతిరేక చర్యను నిరోధించేందుకు ......అంటే అమెరికా ప్రయోజనాల కోసమే చేసినట్టుగా అతను అనడం లేదా? నేను ఏం అర్థం చేసుకున్నానంటే---

జెరేమీ మెక్ ఎనార్నీ : మీరు ఒక ప్రశ్నగా అది నన్నడుగుతున్నారా?

జడ్జి : అవును.

జెరెమీ మెక్ ఎనార్నీ: మేం అలా ఎంత మాత్రమూ అనడం లేదు. ఆ ప్రశ్నలో పేర్కొన్న సూత్రీకరణను ఇప్పుడున్న సాక్ష్యం ఇవ్వదు.

జడ్జి: అలాగైతే మీరు అలా అనబోవడం లేదు?

జెరెమీ మెక్ ఎనార్నీ: (శాక్కో) వాంజెట్టిలు సోషలిస్టులు అని పిలువబడే వర్గానికి చెందిన వారని చెప్పబోతున్నాను. ఒక ఏడాది క్రితం, అంటే గత ఏప్రిల్‌లో-అల్లర్లు జరుగుతున్నాయనీ, దేశం నుంచి జనాన్ని బహిష్కరిస్తున్నారనీ, మసాచూసెట్స్‌లో పన్నెండు నుంచి పదిహేను వందల మందిని పట్టుకున్నారనీ చెప్పబోతున్నాను.

జడ్జి: దాని గురించి మీరు సాక్ష్యాలను ప్రవేశపెట్టబోతున్నామంటారా?

జెరెమీ మెక్ ఎనార్నీ: నేను ఏం వాదించబోతున్నానంటే------

జడ్జి: మీరు అనబోతున్న విషయం అడుగుతున్నాను. మీరు వాదిస్తున్న విషయాన్ని గురించి నేను అడిగినప్పుడు నిజాల మీదా, ఈ కేసులో ప్రవేశపెట్టబడ్డ సాక్ష్యం మీద ఆధారపడి మీరు చెప్పబోతున్న విషయాన్ని........గురించే గానీ.....మరి దేనిపై నన్ ఆధారపడిన విషయం గురించి కాదని నా ఉద్దేశమని మీరు అర్థం చేసుకోవాలి.

జెరెమీ మెక్ ఎనార్నీ: మేం మా సాక్ష్యాలను ముగించలేదు యువరానర్.

జడ్జి: ఆ మేరకు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టబోతున్నారంటారా మీరు?

జెరెమీ మెక్ ఎనార్నీ: మాకు సాక్షులున్నారు. వారిని ఇక్కడ విచారించవచ్చు. మేం వాళ్ళను ప్రవేశపెడ్తామో లేదో నాకు తెలియదు.

జడ్జి: మీరు నాతో మాట్లాడేటప్పుడు ఇప్పటికే ప్రవేశపెట్టిన సాక్ష్యంగురించి గానీ లేదా మీరు ప్రవేశపెట్టదల్చుకున్న సాక్ష్యాన్ని గురించి గానీ ప్రస్తావించాలని ఆశిస్తాను-

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్ మీరు-

జడ్జి: - కాబట్టి దాని గురించి నేను నిర్ణయం ప్రకటించగలను. నా ముందు ప్రవేశపెట్టబడని, పరిశీలనకు ఎప్పుడూ రాని వాటి సామర్థ్యం గురించి నేను నిర్ణయం ప్రకటించలేను.

కోలియర్ వర్సెస్ స్కెఫింగ్టన్ కేసులో మసాచూసెట్స్ ఫెడరల్ జిల్లా కోర్టు తీర్పు థేయర్‌కు తెలియకుండాపోదు. అయినప్పటికీ ఆయన ముద్దాయిల హక్కులకు భంగకరమైన పలు వ్యాఖ్యలు చేస్తూ పోయాడు:

జెరెమీ మెక్ ఎనార్నీ: ప్రస్తుతమున్న సాక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని నేను ఆ ప్రశ్నకు అభ్యంతరం తెలియజేస్తూ చేసిన వ్యాఖ్యలు ఎందుకు చేశానో ఇప్పుడు చూస్తారు.

జడ్జి: ముద్దాయి చేసిన పని అమెరికా కోసమని మీరు వాదించబోతున్నారా?

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్. మీ మాటలు ముద్దాయిల హక్కులకు భంగకరం. ఈ మాటలను జూరీ దృష్టినుంచి తొలగించమని కోరుతున్నాను.

జడ్జి: నేనిప్పుడన్న మాటల్లో హక్కులకు భంగకరమైన వ్యాఖ్యలేవీ లేవు. ఏవీ ఉద్దేశపూర్వకంగా అన్న మాటలు కావు. మీరు నాతో చెప్తున్న విషయాల గురించి సాక్ష్యాలను మీరు ప్రవేశపెట్టాలనుకుంటున్నారాండీ అని మాత్రమే అడుగు తున్నాను.

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్. దేశం గురించీ, ముద్దాయి చేస్తున్న పనులు దేశం కోసమా కాదా అన్న దాని గురించీ మీరు వ్యాఖ్యలు చేశారు. ముద్దాయిల హక్కులకు భంగకరమైన అర్థంలో తప్ప మరోరకంగా వాటిని అర్థం చేసుకోగలమని నేననుకోను.

జడ్జి: మీరు అలా అనదలుచుకున్నారా?

జెరెమీ మెక్ ఎనార్నీ: ఎలా?

జడ్జి: నేను సూచించిన విధంగా.

జెరెమీ మెక్ ఎనార్నీ: సాక్ష్యాధారాలు స్వీకరించడం ముగిశాక యువరానర్ అనుమతిస్తే, ఈ కేసులో ఏది సంబద్ధమో దాన్ని వాదిస్తాను.

జడ్జి: నేనడిగేదల్లా ఈ ఒక్క ప్రశ్నే. అది విషయాన్ని చాలా తేలికగా వివరిస్తుంది. సాహిత్యాన్ని, పుస్తకాలను, పేపర్లను సేకరించడం అమెరికా ప్రయోజనాల కోసం చేయబడిందని మీ వాదనా?

జెరెమీమెక్ ఎనార్నీ: లేదు. నేను అంత మాట అనను.

జడ్జి: కట్జ్‌మన్ ఇక మీరు చెప్పండి. ఈ సాక్ష్యం ఎందుకు స్వీకరించాలో. వింటాను.

కట్జ్‌మన్: క్షమించండి మెక్ ఎనార్నీగారు చెప్పింది నాకు వినపడలేదు.

జడ్జి. నాకు అర్థమైనంత మేరకు, అది తన వాదన కాదని మెక్ ఎనార్నీగారు అంటున్నారు. సాహిత్యాన్ని పోగు చేసి వాటిని పంచడం అనేది అమెరికా ప్రయోజనాల కోసం ఏ ఒక్క ముద్దాయైనా చేశాడని తాను వాదిస్తానని ఆయన ప్రతిపాదించడం లేదు.

కట్జ్‌మన్. అలాగైతే యువరానర్ నేను ప్రారంభించిన క్రాసు పరీక్ష సరళిని సాక్షి విశ్వసనీయతను దెబ్బగొట్టేందుకు ఉద్దేశిస్తున్నాను

జడ్జి అతని సాక్ష్యంలో ఏ భాగానికి సంబంధించి?

కట్జ్‌మన్: ఒక సాక్షిగా మొత్తంగా అతని విశ్వసనీయతను దెబ్బ గొట్టడం కోసం అతని సాక్ష్యంలో ఏ భాగానికి సంబంధించైనా?

జడ్జి: సాక్షి సాక్ష్యం చెప్పిన విషయాల్లో కొంత భాగాన్ని తప్ప అతని విశ్వసనీయతను మొత్తాన్ని మీరు దెబ్బకొట్టలేరు.

కట్జ్‌మన్: నిన్న అతను . . . . స్వతంత్ర దేశాన్ని ప్రేమించానని చెప్పాడు తన లాయర్ అడిగినప్పుడు చెప్పిన ఆ విషయాన్ని దెబ్బ గొట్టేందుకు ప్రశ్నలడుగుతాను.

జడ్జి. నేనమకొన్నదదే. క్రాసు పరీక్షలో ప్రవేశపెట్టినప్పుడే ఈ వ్యాఖ్యకర్థం అదేనను కొన్నాను. కానీ డిఫెన్స్ లాయర్ తనలా అననని అంటున్నాడిప్పుడు.

క్రాసు పరీక్షను కట్జ్‌మన్ తిరిగి కొనసాగించే ముందుగా, తనకూ, డిఫెన్స్ లాయర్‌కూ, కట్జ్‌మన్‌కూ మధ్య జరిగిన ఈ వాదులాట గురించి థేయర్ జూరీకి సుదీర్ఘ వివరణ ఇచ్చాడు. కోర్టుకు వాస్తవాల గురించి అభిప్రాయం ఏదీ ఇంకా ఏర్పడలేదన్నాడు. డిఫెన్స్ లాయర్ ఏం వాదించాలనుకున్నాడో తెలుసుకునేందుకే తాను ప్రశ్నించానని చెప్పాడు. ముద్దాయిల హక్కులకు భంగకరంగా తను ప్రవర్తించలేదనీ, అలా అన్నానని ఎవరైనా అంటే జూరీ దాన్ని ఎంత మాత్రం పట్టించుకోరాదని కోరాడు. సాక్ష్యం సామర్థ్యాన్ని గురించి తప్ప మరిదేన్ని గురించీ ప్రశ్నించలేదన్నాడు. ప్రశ్నలు సాక్ష్యం కాదన్నాడు. బోనులో నిల్చుని సాక్షి చెప్పిందాన్లో కోర్టు అనుమతించిన భాగాన్ని మాత్రమే సాక్ష్యంగా పరిగణించాలి తప్ప మిగిలిన వాటి ప్రభావంలో పడరాదని జూరీని కోరాడు.

కట్జ్‌మన్ క్రాసుపరీక్ష కొనసాగింది:

కట్జ్‌మన్: స్వతంత్ర దేశాన్ని ప్రేమిస్తున్నానని నువ్వు చెప్పినప్పుడు నీ ఉద్దేశం ఏమిటి?

శాక్కొ: మొదటి విషయం నేను ఈ దేశానికి-

ప్ర: కాదు. క్షమించండి. స్వతంత్ర దేశాన్ని ప్రేమిస్తున్నానని నిన్న నువ్వు చెప్పినప్పుడు నీ ఉద్దేశం ఏమిటి?

జ: వివరించేందుకు ఒక అవకాశం ఇవ్వండి.

ప్ర: వివరించమని కోరుతున్నాను.

తన భావాలు కోర్టులో వివరించేందుకు శాక్కోకు అవకాశం వచ్చింది. అందుకోసమే ఎదురు చూస్తున్న శాక్కో అమెరికా గురించి తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పాడు. "శాక్కోను విమర్శించే వారికి అమెరికా గురించి అతనన్న దాదాపు ప్రతి మాటా సూటిగా తగిలింది. అమెరికా ఇచ్చిన సౌఖ్యాల పట్ల కృతఘ్నుడైన విదేశీ ఆందోళనకారుడు ఆ మాటలన్నాడన్న వాస్తవం వారి కోపాన్ని ఎక్కువ చేసింది" అంటాడు ఎహర్మన్. తన అభిప్రాయాలు చెప్పి జూరీని తనకు అనుకూలంగా ఆలోచింపచేసేందుకు శాక్కో చేసిన ఈ ప్రసంగం అతనికే మాత్రం ఉపయోగపడలేదు. శాక్కోను రెచ్చగొట్టి లబ్ధిపొందాలనుకున్న కట్జ్‌మన్ కోరిక తీరింది. కట్జ్‌మన్ వేసిన గాలానికి శాక్కో చిక్కుకున్నాడని ఎహర్మన్ రాశాడు.

శాక్కో జవాబు ఇలా సాగింది:

*చిన్నప్పుడు ఇటలీలో ఉండగా నేను రిపబ్లికన్‌ను. చదువుకునేందుకు, పైకి వచ్చేందుకు, ఏదో ఒక రోజు కుటుంబాన్ని రూపొందించుకొని పిల్లలను పైకి తెచ్చేందుకు, విద్యాబుద్ధులు నేర్పేందుకు కష్టపడగలిగితే రిపబ్లికన్‌కు ఎక్కువ అవకాశాలున్నాయని నేనెప్పుడు అనుకుంటుండే వాడిని. అప్పట్లో అది నా అభిప్రాయం. నేనీదేశానికి వచ్చినప్పుడు నేనంతకు ముందు ఊహించింది ఇక్కడ కనిపించలేదు. అంతా వేరేగా ఉంది. ఇక్కడ పని చేసినంతగా ఇటలీలో నేను చేయలేదు. అయినా బాగానే బతకగలిగాను. ఇదే విధమైన పరిస్థితుల్లో పని చేయాల్సి వున్నప్పటికీ ఇంత కష్టంగా ఉండేది కాదు. రోజుకు ఏడెనిమిది గంటల పని. మంచి భోజనం. పెద్ద దేశం కాబట్టి ఇక్కడ కూడా మంచి భోజనం దొరుకుతుంది. కాని అది డబ్బు ఖర్చు పెట్టగలిగిన వాళ్ళకే గానీ శ్రామిక వర్గానికి కాదు. శ్రామికులకు ఇటలీలో మరిన్ని మంచి కూరగాయలు అందుబాట్లో ఉంటాయి. ఇక్కడికి వచ్చాను. పదమూడేళ్ళు కష్టమైన పనులు చేశాను. అంతకు ముందు అనుకున్న విధంగా నేను కుటుంబాన్ని మేపు పెట్టలేక పోయాను. బ్యాంకులో డబ్బు దాచుకోలేక పోయాను. నా కొడుకును స్కూల్లో చదివించలేక పోయాను. స్వేచ్ఛా సిద్ధాంతం ఏ మనిషికైనా తన భావాలను వ్యక్తీకరించే అవకాశం ఇస్తుంది.... పుస్తకాలు అచ్చేయడానికీ, ప్రజలను చైతన్యపరిచేందుకూ ఉపకరిస్తుంది. సాహిత్యాన్నీ, వాక్ స్వాతంత్ర్యాన్నీ ఇస్తుంది. కాని అదంతా నిజం కాదని నేను గ్రహించాను. తెలివైన, విద్యావంతులైన గొప్ప వ్యక్తులు అరెస్టు చేయబడి జైలుకు పంపబడటం, ఏళ్ళ తరబడి బయటికి రాలేక చనిపోవడం నేను చూడగలిగాను. ఈ దేశంలోని మహామనుషుల్లో ఒకడైన యూజీన్ విక్టర్ డెబ్స్ జైల్లో ఉన్నాడు. ఇప్పటికీ జైల్లోనే ఉన్నాడు. ఎందుకంటే ఆయన సోషలిస్టు కాబట్టి. శ్రామిక వర్గానికి ఇంతకంటే మెరుగైన పని పరిస్థితులూ,మంచి జీవితం, మరింత చదువూ, తమ సంతానాన్ని పైకి తెచ్చే అవకాశాలు కావాలని కోరుకున్నాడు. కానీ వాళ్ళు ఆయనను జైల్లో పెట్టారు.*

ఎందుకని? పెట్టుబడిదారీ వర్గం వాటికి వ్యతిరేకం. మా పిల్లలు హైస్కూలుకు గానీ, కాలేజీకి గానీ, హార్వర్డ్ కాలేజీకి గాని వెళ్ళడం వాళ్ళకు ఇష్టం లేదు. కార్మిక వర్గం విద్యావంతులు కావడం వాళ్ళకు ఇష్టం లేదు కాబట్టి. ఎప్పుడూ కింది స్థాయిలోనే, వాళ్ళ కాళ్ళ కిందే కార్మిక వర్గం పడి ఉండాలనుకుంటారు. తలెత్తుకు తిరగరాదని కోరుకుంటారు. కాబట్టి రాక్‌ఫెల్లర్లూ, మోర్గాన్‌లూ అప్పుడప్పుడు హార్వర్డ్ కాలేజీకి యాభైవేల డాలర్లు, మరో విద్యా సంస్థకు పది లక్షల డాలర్లు ఇస్తారు. "భలే! రాక్ ఫెల్లర్‌గొప్ప మనిషి దేశంలోకెల్లా గొప్పవాడు" అంటారందరూ. హార్వర్డ్ కాలేజీకి వెళ్ళేదెవరు? అని నేనాయన్ని అడగాలనుకుంటున్నాను. రాక్ ఫెల్లర్లు ఇచ్చే పది లక్షల డాలర్లతో కార్మిక వర్గం ఏ లాభం పొందుతోంది? ఏమీపొందదు. హార్వర్డ్ కాలేజీకి వెళ్ళేందుకు వాళ్ళకు అవకాశం రాదు. ఎందుకంటే, వారానికి 21 లేదా 30 లేదా 80 డాలర్లు సంపాదించినా ఐదుగురు సంతానం ఉన్న కుటుంబమైతే ప్రకృతి తనకిచ్చిన దేన్నైనా తినాలనుకుంటే కొడుకును హార్వర్డ్ కాలేజీకి పంపలేదు.... అందువల్ల నా అభిప్రాయం మారింది. అందువల్ల నేను శ్రామికులను ప్రేమించాను. ప్రతి రోజూ పరిస్థితులు మంచివైపు మారాలనీ, ఇకయుద్ధం ఉండని మంచి రోజులు రావాలనీ అనుకున్నాను. మేం యుద్ధంలో పోరాడాలనుకోము. యువతరాన్ని నాశనం చేయాలనుకోము. యువకులను రూపొందించేందుకు తల్లులు చాలా కష్ట పడుతున్నారు. ఏదో ఒక రోజు తల్లులకు వారి పోషణ అవసరమౌతుంది. పిల్లలు తల్లులను పోషించాల్సిన పరిస్థితి వచ్చే వరికి రాక్ ఫెల్లర్లు, మోర్గాన్లు, ఇతర ఉన్నత వర్గానికి చెందిన వాళ్ళు యువకులను యుద్ధానికి పంపుతారు. ఎందుకు? యుద్ధమంటే ఏమిటి? అబ్రహాం లింకన్, జెఫర్సన్ చెప్పిన విధంగా స్వతంత్ర దేశం కోసం పోరాడే యుద్ధం కాదది. అది మంచి భవిష్యత్ కోసం పోరాడే యుద్ధం కాదు. ... డబ్బున్న వాళ్ళ కోసం జరిగే యుద్ధమది. మానవ నాగరికతకోసం చేసే యుద్ధం కాదది. వ్యాపారాభివృద్ధి కోసం లక్షల డాలర్లు వాళ్ళ వేసొస్తాయి. ఒకరినొకరం చంపుకునేందుకు మనకేం హక్కుంది? ఐరిష్ వాళ్ళతో, జర్మన్‌లతో, ఫ్రెంచి వాళ్ళతో అనేక ఇతర జాతుల ప్రజలతో నేను కలిసి పని చేస్తున్నాను. నా భార్యను ఎలా ప్రేమించగలనో అలాగే వారిని ప్రేమిస్తాను. అందుకే వాళ్ళు నన్ను ప్రేమిస్తారు. వాళ్ళను చంపేందుకు నేనెందుకెళ్ళాలి? అతను నాకేంచేశాడు? నాకెప్పుడూ అతను ఏ అపకారమూ చేయలేదు. కాబట్టి యుద్ధంలో నాకు నమ్మకం లేదు. నేను ఆ తుపాకులను నాశనం చేయాలనుకుంటున్నాను.. . . . అందువల్ల నేను సోషలిస్టులను ప్రేమించాను. అభివృద్ధిని ఆకాంక్షించే. . . .. ప్రజలను నేను ప్రేమిస్తాను. . .. అంతే.

శాక్కో ప్రస్తావించిన పలు అంశాల గురించి కట్జ్‌మన్ మళ్ళీ సుదీర్ఘమైన క్రాసు పరీక్ష చేశాడు:

కట్జ్‌మన్: అందువల్ల నువ్వు అమెరికాను ప్రేమిస్తావు?

శాక్కో: అవును.

ప్ర: స్పెయిన్‌లాగా అది ఇరవై శతాబ్దాలు వెనకబడి పోయింది. అవునా?

జ: యుద్ధకాలంలో. . . . .

ప్ర: ఇప్పుడు మనం యుద్ధ కాలంలో ఉన్నామా?

జ: లేదు.

ప్ర: నువ్వు మెక్సికో నుంచి తిరిగొచ్చినప్పుడు మనం యుద్ధకాలంలో ఉన్నామా?

జ: అవును.

ప్ర: అలాగైతే నువ్వెందుకు తిరిగొచ్చావు?

జ: ఎందుకొచ్చానో కారణం చెప్పాను.

. . . . . . . . .

ప్ర: చదువుకునేందుకు ఇటలీలో మరింత అవకాశం ఉందా? నువ్వు చెప్పిందాన్ని బట్టి నాకర్థమైంది.

జ: ఇక్కడికంటే మంచి చదువు ఇటలీలో ఉన్నదని నేను చెప్పను.

ప్ర: ఇటలీలో తక్కువ పని గంటలు ఉంటాయన్నావు?

జ: అవును.

ప్ర: తాజా కూరగాయలు పొందగలనన్నావు?

జ: అవును.

ప్ర: మంచి ఆహారం కూడా. అది గణతంత్రం?

జ: కార్మికుల కోసం.

ప్ర: నువ్వు అక్కడికి వెళ్ళి పోలేదెందుకు?

జ: ఒక చోట స్థిరపడిన తర్వాత మారడం చాలా కష్టం.

ప్ర: నువ్వు ఇటలీకి ఎందుకు వెళ్ళిపోవాలనుకున్నావు? కాదా?

జ: అవును.

ప్ర: తిరిగివెళ్ళినప్పుడు అక్కడే ఉండి పోవాలని నువ్వెందుకు అనుకోలేదు?

జ: ఇటలీకా?

ప్ర: అవును. నీ స్వదేశానికి?

జ: నేను అక్కడే ఉండగలనో లేదో- ఎందుకంటే-

ప్ర: నువ్వు అక్కడే ఉండిపోవాలనుకున్నానని చెప్పావా లేదా?

జ: అవును. నేను ఉండి పోవాలనుకున్నాను.

ప్ర: నువ్వు తిరిగి వచ్చేవాడివా?

జ: నాకు తెలియదు మిస్టర్ కట్జ్‌మన్.

ప్ర: నువ్వు వెనక్కొస్తున్నానని చెప్పావా నాకు?

జ: చెప్పలేదు.

ప్ర: నాకు బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌లో చెప్పిన విషయాలు గుర్తుకు తెచ్చుకోలేవా?

జ: అన్ని విషయాలూ గుర్తు తెచ్చుకోలేను. నాకు కెల్లీకి జరిగిన సంభాషణ గుర్తుంది.

ప్ర: కెల్లీ గురించి మర్చిపో. నా గురించి నేనిప్పుడు మాట్లాడుతున్నాను. రెండు మూడు నెలల్లో ఈ దేశానికి తిరిగొస్తున్నానని నువ్వు చెప్పలేదా?

జ: సరే చెప్తే-

ప్ర: చెప్పావా?

జ: నేను జ్ఞాపకం చేసుకోలేక పోతున్నాను మిస్టర్ కట్జ్‌మన్. నేను అలా చెప్పి వుంటే-

ప్ర: తిరిగి రావాలన్నది నీ అభిమతం కాదా?

జ: అవునని చెప్పలేను. ఎందుకంటే నేను ఇటలీలోనే ఉండగలిగే వాడిని. ఎందుకంటే మా నాన్న ముసలివాడు. నేనాయన వ్యాపారం చూడగలిగేవాడిని.

ప్ర: మీ నాన్న నుంచి సహాయం పొందబోతున్నావా?

జ: ఏమిటీ! మా నాన్న నన్నాదుకోవడమా?

ప్ర: అవును?

జ: లేదు.

ప్ర: నీ భార్యను కొడుకును తీసుకెళ్ళబోతున్నావా?

జ: అవును.

. . . . . . . . . . .

ప్ర: అక్కడున్న కాలంలో నువ్వు పని చేస్తావా?

జ: ఖచ్చితంగా. పని లేకుండా బతకలేను. శ్రమను ప్రేమిస్తాను.

. . . . . . . . . .

ప్ర: ఈ దేశాన్ని ప్రేమించినంతగా దాన్ని ప్రేమిస్తావా?

జ: మనుషులు ఎంత ఎక్కువ పని చేస్తే - ఈ దేశానికి అంత లాభం కూడా.

ప్ర: అమెరికాను ప్రేమించినంతగా పనిని ప్రేమిస్తావా?

జ: అమెరికా వైఖరి నాకు నచ్చదు.

. . . . . . . . . . .

ప్ర: . . . . నీకు నిరాశ ఎదురైనప్పుడు మళ్ళీ ఎందుకు వెనక్కి (ఇటలీకి) వెళ్ళలేదు?

జ: ఈ దేశంలో స్థిరపడిన వాళ్ళకు మనసు మార్చుకోవడం, తిరిగి వెనక్కి వెళ్ళడం మహాకష్టం.

. . . . . . . . . . .

ప్ర: . . . . చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాధికారానికి లోబడి ఉండటంలో నీకు నమ్మకం ఉందా?

జెరేమీ మెక్ ఎనార్నీ: యువరానర్. నేను అభ్యంతర పెడ్తున్నాను.

. . . . . . . .

ప్ర: నీ కొడుకును హార్వర్డ్‌కు పంపలేనని ప్రారంభంలో నువ్వు చెప్పావా?

జ: అవును.

ప్ర: నీ దగ్గర డబ్బుంటే తప్ప - అలా అని చెప్పావా?

జ: అఫ్‌కోర్స్.

ప్ర: అది నిజమేననుకుంటున్నావా?

జ: అవుననుకుంటాను.

ప్ర: అమెరికాలో ఏ ఇతర విశ్వవిద్యాలయం కన్నా హార్వర్డ్ విశ్వవిద్యాలయం పేదవారి పిల్లలను ఎక్కువ మందిని చదివిస్తుంది. తెలుసా నీకు?

జెరెమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడుతున్నాను.

జడ్జి: (శాక్కోతో) నువ్వు సమాధానం చెప్పొచ్చు.

. . . . . . . . .

కట్జ్‌మన్: అది వాస్తవమని నీకు తెలుసా?

శాక్కో: ఎంత మంది ఉన్నారక్కడ?

ప్ర: ఏమిటీ?

జ: ఎంత మంది?

ప్ర: ఎంత మందా? ప్రతి ఏటా హార్వర్డ్ ఎం[illegible] మందికి ఉచితంగా విద్యాబోధన చేస్తుందని నీకు తెలియదా?

జెరెమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడుతున్నాను.

జడ్జి: ఆయన ప్రశ్నను పూర్తి చేసే వరకూ ఆగండి!

జెరెమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడుతున్నాను.

కట్జ్‌మన్: ప్రశ్న పూర్తయింది.

జడ్జి: అతను అవును లేదా కాదు అని తనకు తెలుసో లేదో సమాధానం చెప్పొచ్చు.

జెరెమీ మెక్ ఎనార్నీ: నా అభ్యంతరం నమోదు చేయండి.

కట్జ్‌మన్: ప్రశ్న నీకు అర్థమైందా?

శాక్కో: నేను ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేను.

ప్ర: ఆ విషయం మీద అవగాహన లేకుండానే హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని డబ్బున్న వాళ్ళదిగా నువ్వు ఖండిస్తున్నావు?

. . . . . . . .

ప్ర: హార్వర్డ్ కాలేజీని ఖండించాలనుకున్నావా?

జ: లేదండీ.

ప్ర: స్కాలర్ షిప్‌లు ఇస్తారన్న సంగతి తెలియకుండానే అక్కడికి డబ్బున్నవాళ్ళు తప్ప మరెవరూ పోలేరని చెప్పేందుకు నువ్వు సిద్ధపడ్డావా?

జ: అవును.

ప్ర: నీ కొడుకు (ప్రభుత్వం నడిపే) పబ్లిక్ స్కూల్‌కు వెళ్తాడా?

జ: అవును.

ప్ర: నీకొడుకు చదివే స్కూలులో పోల్చదగినది ఇటలీలో మీ ఊళ్ళో ఉందా?

జెరేమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడ్తున్నాను.

. . . . . . . . .

కట్జ్‌మన్: నీ కొడుకు పబ్లిక్ స్కూలుకు వెళ్తాడా?

శాక్కో: అవును.

ప్ర: డబ్బు చెల్లించకుండానే?

జ: అవును.

ప్ర: స్టాటన్‌లో నీకు ఉచితంగా వైద్యం అందుతుందా?

జ: పిల్లలకా?

ప్ర: నీ కుటుంబంలో జబ్బు పడ్డ వారికెవరికైనా?

జ: అవునని చెప్పలేను. . . . మా యింటికెప్పుడూ ఆరోగ్య కార్యకర్త రాలేదు.

ప్ర: బోస్టన్ నగరంలో పబ్లిక్ స్కూళ్ళలో ఎంత మంది చదువుతున్నారో నీకు తెలుసా?

జెరేమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడ్తున్నాను.

. . . . . . .

జడ్జి: అతనికి తెలుసేమో అడగండి.

కట్జ్‌మన్:అడిగాను.

జడ్జి: అవునా కాదా జవాబివ్వు

కట్జ్‌మన్: నీకు **తెలుసా?**

శాక్కో: అవును కాదు అని సమాధానం చెప్పలేను.

కట్జ్‌మన్: దాదాపు లక్ష మంది పిల్లలని నీకు తెలుసా?

జెరేమీ మెక్ ఎనార్నీ: నేను అభ్యంతర పెడ్తున్నాను.

శాక్కో: లక్షలాది మంది అక్కడికి వెళ్ళరని నాకు తెలుసు.

జెరేమీ మెక్ ఎనార్నీ: ఆగు. అభ్యంతర పెట్టినప్పుడు సమాధానం చెప్పకు. ఆ ప్రశ్నకు నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: తనకు తెలియదని చెప్తున్నాడు.

జెరేమీ మెక్ ఎనార్నీ: ఆ సమాధానానికి కూడా నా అభ్యంతరం ఉంది. ప్రశ్నకూ సమాధానానికీ నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: ప్రశ్నా, సమాధానం రెండూ అనుమతించబడ్డాయి.

తర్వాత క్రాసు పరీక్షలో ఎక్కువ భాగం వాంజెట్టి క్రాసు పరీక్షలాగానే సాగింది. బ్రాక్టన్ పోలీసు స్టేషన్‌లో జరిగిన సంగతులూ, రివాల్వర్లూ,బుల్లెట్లూ వగైరాల గురించి సాగింది. బ్రిడ్జివాటర్‌కు చెందిన ఫ్రూజెట్టి అనే వ్యక్తి గురించి కట్జ్‌మన్ పలు ప్రశ్నలు అడిగాడు. కేవలం

జూరీ మనసును కలుషితం చేసి అరాచకవాదుల గురించి వాళ్ళలో ద్వేషాగ్ని రెచ్చగొట్టడమే అతని ధ్యేయం:

*కట్జ్‌మన్: దేశం నుంచి బహిష్కరించబడ్డాడని నువ్వు చెప్పిన బ్రిడ్జివాటర్ నివాసి ప్రూజెట్టి నీకు తెలుసా?*

*శాక్కో: తెలుసు.*

*ప్ర: వ్యక్తిగతంగా అతను నీకు పరిచయస్తుడేనా?*

*జ. అవునండీ*

*ప్ర: అతనింటికి వెళ్ళావా?*

*జ: అతన్ని చాలాసార్లు కలిశాను.*

*ప్ర బోస్టన్‌లో?*

*జ: సమావేశంలో.*

*ప్ర: అరాచకవాదం గురించి అతనితో మాట్లాడావు. కాదా?*

*జ: ఖచ్చితంగా*

*ప్ర. అరాచకంపై అతని భావాలు నీకు తెలుసా?*

*జెరెమీ మెక్ ఎనార్నీ: నేనభ్యంతర పెడ్తున్నాను.*

*శాక్కో: అతని మాటలు?*

*కట్జ్‌మన్: ఒక్క నిమిషం ఆగు. "మాటలు" కాదు.*

. . . . . . . .

*ప్ర: అరాచకంపై నీ భావాలు, ప్రూజెట్టి భావాలు సారాంశంలో ఒకటేనా?*

*జెరెమీ మెక్ ఎనార్నీ: నా అభ్యంతరం అదే.*

. . . . . .

*కట్జ్‌మన్: (శాక్కోతో) నీ సమాధానం ఏమిటి?*

*జడ్జి: సమాధానం చెప్పవచ్చు.*

*శాక్కో: అతను చూడగలిగినంత నేను చూడలేక పోయాను.*

*ప్ర: నువ్వు చూడగలిగినంత మేరకు అతనితో పాటు అదే మార్గంలో ప్రయాణించావా? నువ్వు చూడగలిగిన మేరకు నీకూ అదే అభిప్రాయాలున్నాయా?*

. . . . . .

*జెరెమీ మెక్ ఎనార్నీ: దానికి నేను అభ్యంతర పెడ్తున్నాను.*

*జడ్జి: (కట్జ్‌మన్‌తో) మీరు అడగవచ్చు.*

*జెరెమీ మెక్ ఎనార్నీ: నా అభ్యంతరాన్ని నమోదు చేయండి.*

*జడ్జి: తప్పక.*

*కట్జ్‌మన్: దయ చేసి జవాబు చెప్పు.*

*శాక్కో (దుబాసీ ద్వారా): ఔను లేదా కాదు అని చెప్పలేను.*

ప్ర: నువ్వు సమాధానం చెప్పలేనందువల్లనా లేక సమాధానం చెప్పదలుచు కోనందువల్లనా?
జ (దుబాసీ ద్వారా). అది సున్నితమైన ప్రశ్న కాబట్టి
జెరేమీ మెక్ ఎనార్నీ నేను అభ్యంతర పెడ్తున్నాను
కట్జ్‌మన్· నేను దాన్ని ఉపసంహరించుకుంటున్నాను.
ప్ర· తన భావాల వల్ల ప్రూజెట్టి దేశ బహిష్కృతుడయ్యాడా?
జెరేమీ మెక్ ఎనార్నీ దానికి కూడా నేను అభ్యంతర పెడ్తున్నాను
జడ్జి: ప్రూజెట్టిని దేశం నుంచి బహిష్కరించిన వాస్తవాన్ని మీరు బయటపెట్టలేదా?
జెరేమీ మెక్ ఎనార్నీ అవును యువరానర్

శాక్కో చీఫ్ ఎగ్జామినేషన్‌లోనే ప్రూజెట్టి గురించి చెప్పినందువల్ల అతని గురించి మరిన్ని ప్రశ్నలడిగే అవకాశం ప్రాసిక్యూటర్‌కు ఉంటుందని న్యాయమూర్తి రూలింగ్ ఇచ్చి తను ప్రాసిక్యూషన్‌వైపేనని మరోసారి నిరూపించుకున్నాడు. శాక్కో నిజం చెప్తున్నాడని ప్రాసిక్యూటర్‌కు తెలుసు. కానీ శాక్కో, ప్రూజెట్టి అరాచకవాదులని జూరీకి పదే పదే గుర్తు చేయడం కోసం కట్జ్‌మన్ ప్రశ్నలడుగుతుంటే థేయర్ అనుమతిస్తూ పోయాడు:

కట్జ్‌మన్ ప్రూజెట్టి ఎందువల్ల దేశబహిష్కృతుడయ్యాడో నీకు తెలుసా?
శాక్కో· (దుబాసీ ద్వారా) అవును
ప్ర అది అరాచకభావాలున్నందువల్లే కదా?

ప్ర ప్రూజెట్టికి అరాచకవాద భావాలున్నందువల్లేనా అది జరిగింది?
జ అతను అరాచకవాది కావడం ఒక కారణం రెండవ కారణం ప్రూజెట్టి ఆ కాలమంతా పత్రికల్లో వ్యాసాలు రాస్తూ ఉన్నాడు ఏ కారణం చేత బహిష్కరించబడ్డాడో నాకు తెలియదు
ప్ర· ఈ రెండింటిలో ఏ కారణం వల్లనో నీకు తెలుసా?
జ తెలియదు
ప్ర: మీ పత్రికలో దాన్ని నువ్వు చదవలేదా?
జ· బహుశా నేను మర్చిపోయాను. అది నాకంట పడి ఉండదు నాకు తెలియదు.
ప్ర· అది రికార్డులో ఉన్న వాస్తవం కాదా - అతనికి అరాచకవాద భావాలున్నందువల్ల . . . . అతను బహిష్కరించబడ్డాడన్నది నిజం కాదా?
జెరేమీ మెక్ ఎనార్నీ నేను దానికి అభ్యంతర పెడుతున్నాను
జడ్జి: (కట్జ్‌మన్‌తో) మీరిప్పుడు ఒక రికార్డును ప్రస్తావిస్తున్నారు. అఫ్‌కోర్స్. రికార్డులో ఏముందో అతను చెప్పలేదు.
కట్జ్‌మన్: ఆ రెండో మనిషెవరు? ఓ! క్షమించండి బహిష్కరించబడే ముందు ప్రూజెట్టి మే 5న మీ ఇంట్లోఉన్న కొన్ని పత్రికలకు చందాదారుడా?

శాక్కో: బహుశా అయి వుండొచ్చు.

జెరెమీ మెక్ ఎనార్నీ: యువరానర్! అనుమతిస్తే నేను అభ్యంతర పెడ్తున్నాను.

జడ్జి: అదంత ముఖ్యమైనదా? ఫ్రూజెట్టి ఎందుకు బహిష్కరించబడ్డాడో అతనిప్పటికే చెప్పి వున్నాడు.

కట్జ్‌మన్: బహుశా కాకపోవచ్చు. అవును. అది నిజమే.

ప్రాసిక్యూటర్ తన క్రాసు పరీక్షను కొనసాగించాడు. మరో అరాచకవాది బహిష్కరించ బడిన సంగతిని అడుగుతూ పోయాడు:

కట్జ్‌మన్: బ్రిడ్జివాటర్ నుంచి దేశ బహిష్కరణకు గురయ్యాడని నువ్వు చెప్పిన ఆ రెండో మనిషి ఎవరు?

శాక్కో: నేను చెప్పలేదు. మరొక మనిషి బహిష్కరించబడ్డాడని నాకు ఖచ్చితంగా తెలుసు. కానీ నాకు పేరు తెలియదు.

ప్ర: నేను నీకు జ్ఞాపకం చేయగలనేమో చూడు- అతను ఫెర్రూసియో కొయాసినా?

జ: అతనొకడు. మరొకతనున్నాడు.

ప్ర: ఆ మరొకతను ఎవరు?

జ: నాకు పేరు గుర్తు లేదు.

. . . . . . . . .

ప్ర: నీ దగ్గరున్న మాదిరి పుస్తకాలే (ఆ రాత్రి నువ్వు కలుద్దామను కొన్న) వాళ్ళ దగ్గరున్నాయని నమ్మావు కూడా. నమ్మలేదా?

జ: ఎందుకంటే కొంత-

ప్ర: క్షమించాలి. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పు. నీ ఇంట్లో ఉన్నటువంటి పుస్తకాల లాంటివే వాళ్ళ ఇళ్ళలో కూడా ఉన్నాయని నువ్వు నమ్మావా?

జ: అవును.

ప్ర: నువ్వు సేకరించాలనుకున్న పుస్తకాలు అరాచకానికి సంబంధించిన పుస్తకాలు కాదా?

జ: అన్నీ కాదు.

ప్ర: వాటిల్లో ఎన్ని?

జ: మొత్తం మీద సరే. మేం సోషలిస్టులం, ప్రజాస్వామికవాదులం. ఏ ఇతర సోషలిస్టు సమాచారమైనా, సోషలిస్టులు, సిండికలిస్టులు *, అరాచక వాదులు, ఏ పేపరైనా.

ప్ర: బోల్షివిక్కులు?

జ: బోల్షివిజం అంటే ఏంటో నాకు తెలియదు.

ప్ర: సోవియట్?

జ: సోవియట్ అంటే ఏంటో నాకు తెలియదు.

---

* రాజకీయ అధికారం కార్మిక సంఘాలకు ఉండాలనీ, కార్మిక సంఘాలే పరిశ్రమకు యాజమాన్యం వహించాలని చెప్పే వాదం.

ప్ర: కమ్యూనిజం?

జ: అవును. ఖగోళశాస్త్రం గురించి కూడా నా దగ్గర కొన్ని ఉన్నాయి.

ప్ర: నీ దగ్గర ఏవున్నాయో నేనడగలేదు. ఖగోళశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలను ఎవరైనా తీసుకోబోతున్నారని నువ్వు భయపడలేదు. భయపడ్డావా?

జ: లేదు.

ప్ర: గణిత శాస్త్రం గురించైనా, ఇంగ్లీషు భాష గురించైనా నీ దగ్గరున్న పుస్తకాలను గురించి కూడా (భయపడ) లేదు. నీ భార్య వంటల పుస్తకాన్ని ప్రభుత్వాధికార్లు లాక్కుంటారని నువ్వనుకున్నావా?

జ: లేదండీ.

తర్వాత కొంత కాలానికి జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఏజెంట్ల ద్వారా తెలుసుకున్న కొన్ని వివరాల వెలుగులో ఈ క్రాసు పరీక్షను ఎహర్మన్ వివరించాడు. కట్జ్‌మన్ క్రాసు పరీక్ష చేస్తున్నప్పుడు ముఖ్యంగా ఫ్రూజెట్టి గురించి ప్రశ్నలు అడుగుతున్నప్పుడు జిల్లా అటార్నీ లాగా వ్యవహరించలేదు. జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఏజెంట్‌గా మారాడు. దేశం నుంచి బహిష్కరించబడాల్సిన అరాచకవాదిగా శాక్కోను నిరూపించేందుకు జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు అతను వ్యవహరించాడు. అతని ఉద్దేశం శాక్కోను *రాడికల్* కాదని నిరూపించడం కాదు. *రాడికల్* అని నిరూపించడమే అని ఎహర్మన్ పేర్కొన్నాడు. వాంజెట్టిని ఇంత తీవ్రంగా ప్రశ్నించక పోవడానికి అతనికి అప్పటికే సుదీర్ఘజైలు శిక్ష విధించబడి ఉండటం ఒక కారణం కావచ్చు. ఒక వేళ శాక్కో ఈ కేసులో తప్పించుకుంటే అతన్ని దేశం నుంచి బహిష్కరించే ఏర్పాట్ల కోసం కట్జ్‌మన్ క్రాసు పరీక్షను ఉపయోగించుకోవాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్ భావించి వుండవచ్చు.

కానీ అందుకు విరుద్ధంగా ఈ కేసు కోసమే క్రాసు పరీక్ష జరుగుతోందన్నట్టుగా కట్జ్‌మన్‌ను థేయర్ ప్రశ్నలడగనిచ్చాడు. ముద్దాయిలే *రాడికల్స్* అని ఒప్పుకున్నందున వారికి అలాంటి భావాలు లేవని క్రాసు పరీక్ష ద్వారా నిరూపించేందుకు ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఇచ్చి అలా ప్రశ్నిస్తూ పోనిచ్చానని థేయర్ తన నిర్ణయాన్ని ఒక సందర్భంలో సమర్థించుకున్నాడు. కానీ కట్జ్‌మన్ ఉద్దేశం అది కాదని థేయర్ అంగీకరించలేదు. శాక్కోను జూరీ దృష్టిలో మరింత *రాడికల్‌*గా, మరింత అరాచకవాదిగా చూపడమే ప్రాసిక్యూటర్ ఉద్దేశంగా థేయర్ ఎంత మాత్రం అంగీకరించలేదు.

ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్ అన్నట్టుగా ఆంగ్లో - అమెరికన్ నేర విచారణా పద్ధతిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిష్పక్షపాతిగా ఉండాల్సి ఉండగా కట్జ్‌మన్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించాడు. ఏపనైనా చేసి ముద్దాయిలను శిక్షింపజేసేందుకు కాక, ముద్దాయిలకు అనుకూలమైనప్పటికీ తన దగ్గరున్న సాక్ష్యాన్ని మొత్తాన్ని ప్రవేశపెట్టి క్రాసుపరీక్ష సమయంలో కూడా నిష్పక్షపాతాన్ని ప్రదర్శించాల్సి ఉంది. కానీ జిల్లా అటార్నీ "రాజకీయ ఉద్వేగాన్ని, దేశభక్తి సెంటిమెంట్"ను

ముద్దాయిలపై ఉసిగొల్పాడు న్యాయమూర్తి కుమ్మక్కయ్యాడు సహకరించాడు! ఫలితంగా కట్జ్‌మన్ తన అసలు వాదనను నాశనం చేసుకున్నాడని ఫ్రాంక్ ఫర్టర్ వాదిస్తాడు. అదేమిటంటే ముద్దాయిల అపరాధ భావన హంతకులైనందువల్ల వచ్చిందనేది కట్జ్‌మన్ వాదన కాగా, కట్జ్‌మన్ శాక్కో, వాంజెట్టిలను ప్రశ్నలడిగిన తీరును బట్టి వారు అపరాధ భావనను హంతకులైనందువల్ల ప్రదర్శించలేదనీ రాడికల్స్ అయినందువల్లే ప్రదర్శించారనీ రుజువైంది అలా డిఫెన్స్ వాదనే నిజమని కట్జ్‌మన్ తనకు తెలియకుండానే నిరూపించాడు కానీ తద్వారా ముద్దాయిలకు వ్యతిరేకంగా జూరీని రెచ్చగొట్టి తన అసలు ప్రయోజనం సాధించేందుకు మాత్రం మార్గం సుగమం చేసుకున్నాడు.

## ప్లిమత్‌లో ... బోస్టన్‌లో

**సౌత్** బ్రెయిన్ ట్రీలో హత్యలు-దోపిడి జరిగిన రోజు (1920 ఏప్రిల్ 15న) వాంజెట్టి ప్లిమత్‌లో చేపలమ్మాడనీ, శాక్కో పాస్ పోర్ట్ కోసం బోస్టన్‌లో దౌత్యకార్యాలయానికి వెళ్ళాడనీ ఎలిబీలు ఉన్నాయి. ఆ ఎలిబీలను నిరూపించడం కోసం వాంజెట్టి తరపున పదమూడు మందిని, శాక్కో తరపున ఇరవై మందికి పైగా సాక్షులను డిఫెన్స్ విచారించింది

**ఆరోపిత నేరం జరిగిన సమయంలో నేర స్థలంలో కాక అందుకు సంబంధం లేని మరో చోట నిందితుడు ఉండడాన్ని ఎలిబీ అంటారు.** ఆ సాక్ష్యాన్ని నమ్మితే కోర్టు ఆ నిందితుడిని నిర్దోషిగా ప్రకటిస్తుంది. ఒకవేళ ఎలిబీ సాక్ష్యాన్ని కోర్టు నమ్మకపోయినా లేదా నిరూపించడంలో నిందితుడు విఫలమైనా ప్రత్యేకంగా అతనికి జరిగే నష్టమేమీ ఉండదు. ఎందుకంటే నేరాన్ని నిందితుడే చేశాడని ఎలాంటి సందేహానికైనా తావు లేకుండా నిరూపించాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్ పైనే ఉంటుంది.

ప్లిమత్‌లో వాంజెట్టికి ప్రతి రోజు పని ఉండేది కాదు. చేపలు దొరికినప్పుడు (వాంజెట్టి మరొకరి నుంచి కొనుగోలు చేసేవాడు) వాటిని అమ్మేవాడు. లేకపోతే వేరే పనేదైనా చేసేవాడు. ఏ పనీ లేకపోతే కబుర్లు చెప్తూ తిరిగే వాడు. పిల్లల్ని, పెద్దల్ని చనువుగా పలకరిస్తూ కలుపుగోలుగా ఉండేవాడు. తన అరాచకవాద భావాలను వారితో చర్చించేవాడు అయితే వాంజెట్టి పరిచయస్తుల్లో దాదాపు అందరూ ఇటాలియన్లే తన జీవితంలో ఏ రోజు ఏం జరిగిందో గుర్తు పెట్టుకోవడం వాంజెట్టికి అంత తేలికైన పని కాదు. అందువల్లనే ఏప్రిల్ 15న ఎక్కడున్నావని పోలీస్ స్టేషన్లో ఇంటరాగేషనప్పుడు అడిగితే వెంటనే సమాధానం చెప్పలేక పోయాడు. కానీ ఆ తర్వాత, తాను ఏప్రిల్ 15న ఎక్కడున్నానో గుర్తు చేసుకోకపోతే తన జీవితానికే ముప్పు వాటిల్లగలదని గ్రహించాడు. ఏప్రిల్ 15న తన దినచర్యను మననం చేసుకున్నాడు.

ఆ రోజు వాంజెట్టి ప్లిమత్‌లో తోపుడు బండి మీద ఏదుల్లో తిరుగుతూ చేపలమ్మాడు. ఏప్రిల్8న పెద్ద మొత్తంలో అతను చేపలను కొనుగోలు చేసినట్టు రసీదులున్నాయి. మూడు

రోజుల్లో అవి అమ్మేసి తిరిగి మరొక స్థానిక వ్యాపారి దగ్గర చేపలు కొన్నాడు. ఆ వ్యాపారి పేరు ఏంటోనియో కార్బోన్.

కార్బోన్ తన సాక్ష్యంలో వాంజెట్టికి ఏప్రిల్ 13, 14 తేదీల్లో ఏదో ఒక రోజున చేపలు అమ్మానని చెప్పాడు. కార్బోన్‌కు 425 పౌండ్ల చేపలను ఏప్రిల్ 12న అమ్మానని బోస్టన్ చేపల వ్యాపారి సాల్వటోర్ బోయ చెప్పాడు.

ఏప్రిల్ 15 మధ్యాహ్నం వరకూ వాంజెట్టి చేపలమ్మాడు. తనెవరెవరికి చేపలు అమ్మినదీ ఆయనకు జ్ఞాపకం లేదు. కానీ ఆ రోజు జరిగిన రెండు ఘటనలు మాత్రం ఆయన స్మృతి పథంలో నిలిచి పోయాయి. జోసెఫ్ రోజెన్ అనే బట్టల వ్యాపారి దగ్గర కొంత గుడ్డ కొన్నాడు. (ఆ గుడ్డను కూడా సాక్ష్యంగా కోర్టు స్వీకరించింది.) అదే రోజు మెల్‌విన్ కోర్ల్ అనే జాలరితో కాసేపు గడిపాడు.

ఈ సంగతులను వాంజెట్టి తన సాక్ష్యంలో ప్రస్తావించినప్పటికీ కట్జ్‌మన్ వాటి గురించి పెద్దగా ప్రశ్నించలేదు. ఏప్రిల్ 15కు ముందు రోజు తర్వాత రోజూ అతనేం చేశాడో అడిగి, వాటిని గుర్తుంచుకోలేక పోయిన వాంజెట్టి ఏప్రిల్ 15 గురించి ఎలా గుర్తుంచుకోగలడు అనే ప్రశ్నను రేకెత్తించేందుకు ప్రయత్నించాడు. అంతేగాని సీరియస్‌గా ఎలిబీల గురించి ప్రశ్నలు వేయలేదు.

ఏప్రిల్ 15న వాంజెట్టి దగ్గర చేపలు కొన్నామని ప్లిమత్ నివాసులు పలువురు సాక్ష్యం చెప్పారు. జోసెఫ్ రోజెన్ తను వాంజెట్టికి బట్టను అమ్మిన విషయం చెప్పాడు. ఆ బట్టను తనకు వాంజెట్టి చూపాడని మేడమ్ అల్ఫోన్సిని బ్రిని చెప్పింది. అప్పుడు తను కూడా ఉన్నానని బ్రిని కూతురు పదిహేనేళ్ళ లెఫావ్రె బ్రిని చెప్పింది. బ్రిని కుటుంబంతో వాంజెట్టికి సన్నిహిత సంబంధం ఉంది. అల్ఫోన్సిని బ్రిని బ్రిడ్జ్‌వాటర్ కేసులో సాక్ష్యం చెప్పిందని ప్రాసిక్యూటర్ ఈ కేసు రికార్డులో నమోదు చేయించాడు. వాంజెట్టి కోసం తప్పుడు సాక్ష్యం చెప్తోందని ఆరోపించాడు. ఏప్రిల్‌లో తను అనారోగ్యంతో ఆస్పత్రి పాలైనందువల్ల తనకు ఆ సంఘటన బాగా గుర్తుందని క్రాసు పరీక్షలో ఆమె చెప్పింది. దాన్ని కట్జ్‌మన్ సవాల్‌చేశాడు.

బ్రిని సాక్ష్యాన్ని బలపర్చేందుకు ప్లిమత్ కార్డేజి కంపెనీ నర్సు గెర్ట్రూడె మేరీ మాత్యూసను సాక్షిగా ప్రవేశపెట్టారు. బ్రిని ఇంటికి ఏప్రిల్ నెలలో పలుమార్లు వెళ్ళి ఆమెకు మేరీ వైద్యం చేసింది.

జాలరి మెల్‌విన్ కోర్ల్‌కు 1915 నుంచి వాంజెట్టి తెలుసు. 1920 ఏప్రిల్ 15న ప్లిమత్ సముద్ర తీరంలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు వరకూ కోర్ల్ ఉన్నాడు. తన పడవకు రంగులు వేస్తున్నాడు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వాంజెట్టి అక్కడికి వచ్చాడు. గంటా గంటన్నర సేపు గడిపాడు. కోర్ల్ భార్య కూడా అప్పుడు అక్కడే ఉంది. కొంతసేపటికి పడవలు తయారు చేసే ఫ్రాంక్ జెస్సీ అక్కడికొచ్చాడు. కోర్ల్ దంపతులూ అతనూ, మరో సాక్షి జోసెఫ్ మోరె డిఫెన్స్ సాక్షులు అయ్యారు.

వాంజెట్టి తరపున ఎలిబీ సాక్ష్యాన్ని కట్జ్‌మన్ క్రాసు పరీక్ష కాస్తన్నా ధ్వంసం చేయలేక పోయింది.

శాక్కో సోదరుడు సబినో శాక్కో ఇటలీ నుంచి రాసిన నల్లంచు ఉత్తరాన్ని* 1920 మార్చి చివరి వారంలో అందుకోవడంతో అప్పటికి శాక్కోకి తెలియకుండా అతని ఎలిబీకి నేపథ్యం ప్రారంభమైంది. మార్చి 7న తన తల్లి మరణించిందనే విషాద వార్త శాక్కోను తీవ్రంగా కలచివేసింది. ఆ రోజు శాక్కో పనిచేయలేదని ఫ్యాక్టరీ యజమాని జార్జికెల్లీ కోర్టులో చెప్పాడు

నల్లంచు ఉత్తరం చేరిన కొద్ది రోజుల తర్వాత శాక్కో తండ్రి నుంచి మరో ఉత్తరం అందుకున్నాడు. తండ్రి విషాదాన్ని గ్రహించి అప్పటికే కుటుంబంతో సహా ఇటలీ వెళ్ళి పోదామనుకున్న తన నిర్ణయాన్ని ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యాడు పాస్‌పోర్టు ఎలా సంపాయించాలని ఆరా తీసి అందుకు ఒక ఫోటో అవసరమని తెలుసుకున్నాడు. ఏప్రిల్ 12 13 తేదీల్లో ఒక రోజు జార్జి కెల్లీని కలిసి పాస్ పోర్టు తెచ్చుకునేందుకు సెలవు కావాలని అడిగాడు శాక్కో. ఏప్రిల్ 15న సెలవు పెట్టి బోస్టన్ వెళ్ళాడు.

> *జంట హత్యలు, బందిపోటు దొంగతనం చేసేందుకు శాక్కో సెలవు పెట్టాడనే ప్రాసిక్యూషన్ వాదన రీత్యా కెల్లీ సాక్ష్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది ఆదే నిజమైతే, వివరమైన పకడ్బందీ పథకం పన్ని రెండు కారులను ఒకదాని తర్వాత ఒకటి ఉపయోగించి, కనీసం ఆరుగురు నేరస్తుల సహకారంతో చేయబడిన సౌత్ బ్రెయిన్‌ట్రీ నేరం శాక్కోకు కెల్లీ సెలవు మంజూరుచేసే వరకూ జరుగుతుందో లేదో నన్న అనిశ్చిత పరిస్థితిలో ఉండి ఉండాలి.***

ఏప్రిల్ 15న శాక్కో ఏం చేశాడన్న దాన్ని నిరూపించేందుకు బలమైన సాక్ష్యాలున్నాయి పలువురు ప్రముఖ బోస్టన్ వాసులు శాక్కోను ఆ రోజు బోస్టన్‌లో కలిశామని సాక్ష్యమిచ్చారు ఎహర్మన్ రాసినట్టుగా శాక్కో ఎలిబీని అబద్ధమని చెప్పాలంటే "హత్యకేసులోని ఒక అనుమానితుడిపై కేసు కొట్టివేయించేందుకు అనేక మంది గౌరవనీయ వ్యక్తులు పలు తప్పుడు కథలు అల్లారని మనం అనుకోవాల్సి ఉంటుంది."

బోస్టన్‌లో శాక్కో మొదటగా ఏంజెలో మోనెల్లోను కలిశాడు. మోనెల్లో అప్పటికి పన్నెండేళ్ళకుపైగా కాంట్రాక్టరుగా పని చేస్తున్నాడు. ఔత్సాహిక నటుడు కూడా. ఈస్ట్ బోస్టన్‌లో ఒక హాలులో వారిద్దరికీ పరిచయమయింది. ఏప్రిల్ 15 ఉదయం 11 గంటలకు తనకు రోడ్డు మీద శాక్కో కనిపించాడని మోనెల్లో చెప్పాడు. ఏప్రిల్ 18న బోస్టన్‌లో మేడమ్ ఎక్స్ అనే గొప్ప నాటక ప్రదర్శన ఉంది కాబట్టి ఏప్రిల్ 15 మధ్యాహ్నం తాను శాక్కోను కలిసినవిషయం గుర్తుంచుకోగలిగానని మోనెల్లో చెప్పాడు.

ఏడేళ్ళుగా బోస్టన్ నివాసిగా ఉన్న ఫెలిస్ గుడాగ్ని *** జర్నలిస్టు, సాహితీవేత్త. ఇటాలియన్,

---

* ఎగ్జిబిట్ - ఎన్ ' గా కోర్టు దాన్ని సాక్ష్యంగా స్వీకరించింది.

** లాయర్ హెర్బర్ట్ ఎహర్మన్

*** 'గుడెనాగి' అని కూడా పిలుస్తారు. డిఫెన్స్ కమిటీలో చురుకుగా పని చేశాడు.

లాటిన్ భాషల్ని బోధించే ప్రొఫెసర్.. . బోనీస్ రెస్టారెంట్ ఎదురుగా పదకొండుంబావుకు శాక్కొ తనకు కనిపించాడని గుడాగ్ని సాక్ష్యం. భోజనం చేసేందుకు వాళ్ళు రెస్టారెంట్ లోపలికి వెళ్ళికూర్చున్నారు. గుడాగ్ని తన స్నేహితులిద్దరికి (ఆల్బర్ట్ బొస్కొ, జాన్ విలియమ్స్) శాక్కొను పరిచయం చేశాడు. ఒకటింబావు వరకూ అక్కడ వాళ్ళంతా ఉన్నారు. మూడుగంటల సమయంలో అక్కడికి దగ్గర్లోని కాఫీ హౌస్‌లో మళ్ళీ శాక్కొను ఏంటోనియో డెంటామోర్‌తో పాటు గుడాగ్ని కలిశాడు:

*జెరెమీ మెక్ ఎనార్నీ: మిస్టర్ గుడెనాగ్! ఏప్రిల్ 15న అతనిని (శాక్కొను) కలిసినట్టు మీరెలా చెప్పగలరు? మీకు ఎలా తెలుసు?*

*గుడాగ్ని: అది పదిహేనవ తేదీన అని మొదట జ్ఞాపకం చేసుకున్నాను ఆ రోజు బోస్టన్‌ట్రాన్‌స్క్రిప్ట్ సంపాదకుడు మిస్టర్ విలియమ్స్‌కు ఇచ్చిన విందు గురించి నేను చర్చించాను కాబట్టి. విందు గురించి ఆ తర్వాత ప్రొఫెసర్ డెంటామోర్‌తో ఆ కాఫీ హౌస్‌లో చర్చించాను. నన్ను విందుకు ఆహ్వానించారు.*

*ప్ర ఆ విందు ఎప్పుడు జరుగబోతోంది?*

*జ: 15 రాత్రి.*

*ప్ర: మీరంటున్న వ్యక్తి ట్రాన్‌స్క్రిప్ట్ సంపాదకుడా?*

*జ: అవును ఆ విందు గురించే నేను ప్రస్తావిస్తున్నాను*

బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్‌స్క్రిప్ట్‌కు 1912 నుంచి 1925 వరకూ జేమ్స్ విలియమ్స్ సంపాదకుడిగా పని చేశాడు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో తమ దేశానికి అనుకూలమైన వైఖరి వ్యక్తం చేసినందుకు మెచ్చి ఇటలీ రాజు 1920 మొదట్లో 'ఆర్డర్ ఆఫ్ ద క్రౌన్' బిరుదుతో విలియమ్స్‌ను సన్మానించాడు విలియమ్స్ గౌరవార్థం 1920 ఏప్రిల్ 15 మధ్యాహ్నం బోస్టన్‌లో ఉన్న ఇటాలియన్ జర్నలిస్టులు విందు ఏర్పాటు చేశారు.

లా నొటిజియ సంపాదకుల్లో ఒకడైన అల్బర్ట్ బొస్కొ కూడా రెస్టారెంట్‌లో శాక్కొ తనకు పరిచయమైన రోజు ఏప్రిల్ 15గా విందు జరిగిన దాని వల్లనే గుర్తుంచుకోగలిగానని సాక్ష్యంలో చెప్పాడు.

విదేశీ భాషా పత్రికలకు వ్యాపార ప్రకటనలు సేకరించి పెట్టే జాన్ విలియమ్స్ కూడా శాక్కొ తనకు ఏప్రిల్ 15న బోనీస్ రెస్టారెంట్‌లో పరిచయమైన సంగతి కోర్టులో చెప్పాడు. ఆ రోజు తాను ఉబ్బసం వ్యాధికి డాక్టర్ హోవర్డ్ గిబ్స్ దగ్గర చికిత్స పొందినందువలన ఆ తేదీ గుర్తుంచుకోగలిగానని అన్నాడు. డాక్టర్ గిబ్స్ ఆస్పత్రిలోని రికార్డులు కోర్టుకు తెప్పించగా విలియమ్స్ చెప్పినట్టే ఉంది.

ఏప్రిల్ 15న శాక్కొ బోస్టన్‌లో వున్న ఇటాలియన్ దౌత్య కార్యాలయాన్ని సందర్శించాడని అక్కడ గుమాస్తాగా పని చేసిన గిసెప్పె అంద్రోవర్ ధృవీకరించాడు. కేసు విచారణ ప్రారంభమయ్యే

నాటికి ఆంగ్రోవర్ ఇటలీ వెళ్ళి పోయాడు. అందువల్ల 1921 ఏప్రిల్ 13న రోమ్‌లో అమెరికా దౌత్య కార్యాలయాధికారుల సమక్షంలో ఆయన అఫిడవిట్ ఇచ్చాడు:

*ఇటలీకి పాస్‌పోర్టు ఎలా తీసుకోవాలనే సమాచారం కోసం ఏప్రిల్ నెల మొదట్లో రాయల్ ఇటాలియన్ కాన్సులేట్‌కు శాక్కొ వచ్చాడు నేను అతనికిసమాచారం ఇచ్చాను రెండు ఫోటోలు తీసుకు రావాలని చెప్పాను ఒకటి పాస్‌పోర్టుకు అంటించేందుకు మరొకటి ఆఫీసు రికార్డుల్లో ఉంచేందుకు తర్వాత అతను వెళ్ళి పోయాడు 1920 ఏప్రిల్ 15న . . ఒక ఫోటో తెచ్చాడు. . . ఇటాలియన్ పాస్‌పోర్ట్ మీద అంటించేందుకు అది పెద్దదౌతుందని చెప్పాను చిన్న ఫోటో తీసుకువస్తానని వెళ్ళాడు కానీ తర్వాత అతనిని నేను చూసి ఎరగను*

*1920 ఏప్రిల్ 15 రాయల్ ఇటాలియన్ కాన్సులేట్‌లో పెద్దగా పని లేని రోజు. పాస్‌పోర్టు మీద అంటించేందుకు అలాంటి పెద్ద ఫోటోను మాకు ఎవరూ ఏనాడూ ఇవ్వలేదు. కాబట్టి నేను లోపలికెళ్ళి కాన్సులేట్ కార్యదర్శికి చూపించాను. మేం నవ్వుకున్నాం. ఆ సంఘటన గురించి మాట్లాడుకున్నాం. ఫోటో గురించి మేం చర్చించుకుంటున్నప్పుడు కార్యదర్శి గదిలో పెద్ద కేలెండర్ మీద చూసి నేను తేదీ గుర్తుంచుకున్నాను. అప్పుడు రెండు, రెండుంబావు అయి వుంటుంది. . . . .*

ఆంగ్రోవర్ సలహా మేరకు శాక్కొ కుటుంబ సమేతంగా సరైన సైజు ఫోటో తీయించుకుని 1920 మే 4న ఇటాలియన్ పాస్‌పోర్టు తెచ్చుకున్నాడు. దానిని కోర్టు సాక్ష్యంగా స్వీకరించింది. బోస్టన్‌లో ఉన్న హే మార్కెట్ నేషనల్ బాంక్‌లో విదేశీ ద్రవ్య మారక విభాగంలో పని చేసే కేథలిక్ ప్రీస్ట్ ఏంటోనియో డెంటామోర్‌కు ఏప్రిల్ 15న మూడు గంటల సమయంలో తను ప్రొఫెసర్ గుడాగ్నిలో కలిసి కాఫీ హౌస్ దగ్గర శాక్కొను కలిసిన సంగతి బాగా గుర్తుంది. విలియమ్స్‌కు ఇచ్చిన విందులో ఆయన కూడా పాల్గొన్నాడు. శాక్కొకు బోస్టన్‌లో ఆ రోజు చిల్లర సరుకులు అమ్మిన కార్లోస్ ఆఫె, స్టాటన్ రైల్వే స్టేషన్‌లో ఆ రోజు శాక్కొకు తటస్థ పడ్డ వడ్రంగి డొమినిక్ రిస్పి కూడా ఎలిబీ సాక్షులు.

హైవే సర్వేయర్‌గా పని చేసిన జేమ్స్ మాథ్యూస్ హేయస్‌ను శాక్కొ కోర్టులోచూశాడు. అతను తనతో ఏప్రిల్ 15న బోస్టన్ నుంచి రైల్లో ప్రయాణించాడని డిఫెన్స్ లాయర్లకు చెప్పాడు. హేయస్ కూడా జ్ఞాపకం చేసుకుని తాను ఆ రోజు ప్రయాణించిన విషయం నిజమేనని సాక్ష్యమిచ్చాడు. అయితే తనతోటి ప్రయాణికుల్లో శాక్కొ ఉన్నాడో లేదో చెప్పలేనన్నాడు. శాక్కొ అతనికి అపరిచితుడు. హేయస్ సాక్ష్యం చెప్పాక శాక్కొ మరొకసారి బోనెక్కి తను హేయస్‌ను ఎలా గుర్తించగలిగినదీ వివరంగా చెప్పాడు.

తను ఇటలీ వెళ్ళిపోతే 3-కె ఫ్యాక్టరీలో తన స్థానాన్ని భర్తీ చేసేందుకు మిల్‌ఫోర్డ్‌కు చెందిన హేన్రీ ఐకొవెల్లి పేరు సూచించాడు శాక్కొ. ఏప్రిల్ 15న తన దగ్గరికి రావలసిందని ఐకొవెల్లికి ఫ్యాక్టరీ యజమాని లేఖ రాశాడు. ఏప్రిల్ 8న రాయబడిన ఆ లేఖను సాక్ష్యంగా నమోదు

చేయించారు. ఏప్రిల్ 15న శాక్కో బోస్టన్ వెళ్ళిన సమయంలో ఐకొవెల్లి తమ ఇంటికి వచ్చి వెళ్ళాడని శాక్కో భార్య రోజినా కోర్టులో చెప్పింది. ఐకొవెల్లిని కూడా విచారించి దానిని ధృవీకరించారు.

## తీర్పు

ఇరుపక్షాల సాక్ష్యాలు ముగిసే సరికి రెండు వేల పేజీలకుపైగా కోర్టు రికార్డు తయారైంది. కేసులో వాద ప్రతివాదాలు 1921 జులై 13న జరిగాయి. ఇరుపక్షాలూ చెరొక నాలుగు గంటల పాటు తమ వాదనలను వినిపించేందుకు అంగీకారం కుదిరింది.

శాక్కో తరపున ఫ్రెడరిక్ మూర్, వాంజెట్టి తరపున జెరేమీ మెక్ ఎనార్నీ చెరొక రెండు గంటల పాటు సాక్ష్యాధారాలను విశ్లేషిస్తూ వాదనలు వినిపించారు ప్రభుత్వం తరపు సాక్ష్యాలు ఎంత బలహీనమైనవో ముద్దాయిల ఎలిబీలు ఎంత ఖచ్చితంగా నిరూపించబడ్డాయో వివరించారు. కాని ముద్దాయిలపై ద్వేషాన్ని మరోసారి రెచ్చగొట్టడం మీదనే కట్జ్‌మన్ తన వాదనను కేంద్రీకరించాడు. కట్జ్‌మన్ తన వాదనను ముగిస్తూ చెప్పిన వాక్యాలు చూస్తే జూరీని ఎలా రెచ్చగొట్టాడో అర్థమౌతుంది.

*నేరం చేశారని మీరు నిర్ణయిస్తే (మీ నిర్ణయం) ఇద్దరి ప్రాణాలను తీస్తుందని మీకు (మెక్ ఎనార్నీ) చెప్పారు. సరే, జంటిల్మెన్, (కానీ) ఒక అర్థంలో అలా కాదు. . . హత్యా నేరంలో వాళ్ళను దోషులుగా మీరు నిర్ణయించడం ద్వారా వారి ప్రాణాలను మీరు హరించడం లేదు. చట్టం వారి ప్రాణాలను తీసుకుపోతుందే తప్ప మీరు కాదు. వాళ్ళు దోషులైతే చెప్పడం మీ వంతు. . . మరణ శిక్షను మీరు ప్రకటించరు . . . జూరీలో ఉన్న పెద్దలారా, మీ విధి నిర్వహించండి నార్‌ఫోక్ ప్రజలారా, మనుషులుగా దాన్ని నిర్వహించండి. కలిసి కట్టుగా నిలబడండి*

న్యాయమూర్తి జూరీకి చట్టపరంగా తాను వివరించాల్సిన కేసు సాక్ష్యాధారాల గురించి జులై 14న చెప్పాడు దానిని చట్టపరిభాషలో *చార్జ్ టు ద జూరీ* అంటారు. *ఈ సందర్భంగా 'న్యాయమూర్తి చెప్పేది ఎప్పుడూ ఇరుపక్షాల్లో ఏ పక్షం కోసమూ వాదన కాకూడదు. చట్టాన్ని వివరించడం, ఇరుపక్షాల వాదనలను క్లుప్తంగా చెప్పడం దాని ఉద్దేశం'**

న్యాయమూర్తి *చార్జ్ టు ద జూరీ* వివరించే రోజున ఆయనకు పుష్పగుచ్ఛాలు బహూకరించడం ఆ ప్రాంతంలో ఆనవాయితీ. ఛేయర్ టేబుల్ పుష్పగుచ్ఛాలతో నిండి పోయింది. కోర్టు షెరీఫ్ నుంచి అతి పెద్ద పుష్పగుచ్ఛం ఛేయర్‌కు అందింది ప్రాసిక్యూషన్ తరపున పని చేస్తున్న అధికారుల భార్యలూ, షెరీఫ్ భార్య పుష్పగుచ్ఛాలు పంపారు.

---

* మైకేల్ ముస్మానో

కిక్కిరిసిన కోర్టు హాలులోకి ఉదయం 10:38 కి థేయర్ వచ్చాడు. ఆ రోజు థేయర్ జూరీకి చెప్పబోయే విషయాలు అత్యంత ముఖ్యమైనవి. శాక్కొ భార్య రోజినా, కొడుకు డాంటే శాక్కొ, వాంజెట్టిలను నిర్బంధించిన బోను దగ్గరికి వచ్చారు. ముద్దాయిలు ముద్దొచ్చే ఎనిమిదేళ్ళ డాంటె జుట్టు పట్టుకుని లాగారు. 'వాంజెట్టి కళ్ళుమెరిశాయి. అతని చిరునవ్వు సంతోషాన్ని సూచించింది" అని ఒక విలేకరి నోట్ చేసుకున్నాడు.

థేయర్ దాదాపు రెండు గంటల పాటు మాట్లాడాడు. అప్పటికే కట్జ్‌మన్ రెచ్చగొట్టింది చాలదన్నట్టుగా థేయర్ ఇలా మొదలు పెట్టాడు:

> మసాచూసెట్స్ ప్రభుత్వం అతి ముఖ్యమైన సేవనందించేందుకు మీకు పిలుపునిచ్చింది. ఆ సేవ కష్టతరమైనదనీ, బాధాకరమైనదనీ, శ్రమతో కూడినదనీ మీకు తెలిసినప్పటికీ, మీరు నిఖార్సయిన సైనికుడిలాగా, అత్యున్నత అమెరికన్ ప్రభుత్వం పట్ల విధేయతతో ఆ పిలుపుకు స్పందించారు.

ఇలా జూరీ మనసును శాక్కొ, వాంజెట్టీలకు వ్యతిరేకంగా విషపూరితం చేశాడు. మళ్ళీ ఏమీఎరగనట్టుగా థేయర్ జూరీ సభ్యులకు నీతులు బోధించాడు. అపోహలను దరి చేరనీయకుండా, సానుభూతిని దగ్గరకు రానీయకుండా తీర్పు చెప్పవలసిందిగా చిలకపలుకులు పలికాడు. ప్రజాభిప్రాయానికి విలువ ఇవ్వరాదని చెప్పాడు. సాక్ష్యాధారాలను వివరిస్తున్నప్పుడు కూడా తన పక్షపాతాన్ని బహిరంగంగా ప్రదర్శించాడు.

> పరస్పర విరుద్ధమైన సాక్ష్యాల దొంతరలో జూరీ దారికనుగొనేలా చేయడం, అసందర్భ విషయాల నుంచి సందర్భోచిత విషయాలను వేరు పర్చగలిగేలా, వివేకంతో సాక్ష్యాధారాలు అంచనా వేసేలా, రాగద్వేషాలకు అతీతంగా న్యాయ నిర్ణయం చేసేలా చేయడం (ఈ సందర్భంలో) జడ్జి. . . . పని.*

కానీ న్యాయమూర్తి థేయర్ దానికి భిన్నంగా ప్రవర్తించాడు. ప్రాసిక్యూషన్ సాక్ష్యాలు నొక్కి చెప్పి, డిఫెన్స్ సాక్ష్యాల గురించి కొన్ని సందర్భాల్లో ఏమీ చెప్పకుండా వదిలేశాడు. మొత్తం ఇరవై నాలుగు పేజీల చార్జ్‌టు ద జూరీ లో ఎలిబీ సాక్ష్యానికి కేవలం రెండు పేరాలు కేటాయించి, అపరాధ భావన సాక్ష్యాన్ని నాలుగు పేజీల్లో వివరించాడు. పేరు పేరునా సాక్షులను ప్రస్తావించి కేసు మొత్తం అపరాధ భావన గురించిన సాక్ష్యంపై ఆధారపడి ఉన్నదని జూరీ భావించేలా చేశాడు. హంతకులు కాజేసిన డబ్బు ఏమైందో ప్రాసిక్యూషన్ వివరించలేక పోవడం తీవ్ర లోపం. కానీ థేయర్ ఆ సంగతినే ప్రస్తావించలేదు. బుల్లెట్ల గురించి ఆయుధ నిపుణుడు ప్రాక్టార్ సాక్ష్యం అస్పష్టంగా ఉన్నప్పటికీ, శాక్కొ పిస్టల్ నుంచే ప్రాణాంతక బుల్లెట్ వెలువడిందని ప్రాక్టార్

---

* ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్

సాక్ష్యమిచ్చాడని థేయర్ ప్రకటించాడు. ముద్దాయిలపై నేర నిరూపణకు రెండురెళ్ళు నాలుగన్నంత రుజువులు కావాలని చట్టం నిర్దేశించదని చెప్పాడు. కొన్ని సాక్ష్యాధారాలను వివరించే సందర్భంలో సాక్ష్యం ఒక విధంగా ఉండగా ఆయన మరో విధంగా ఉల్లేఖించాడు. డిఫెన్స్ లాయర్లు మధ్యలోజోక్యం చేసుకొని ఆయన దృష్టికి ఈ విషయాలను తేవాల్సి వచ్చింది తన తప్పును సవరించుకుంటున్నట్టుగా థేయర్ వివరణ ఇచ్చుకున్నాడు.

మధ్యాహ్నం అయ్యే సరికి చార్జ్‌టు ద జూరీ అయిపోవడంతో జూరీ సభ్యులు తమకు కేటాయించిన గదిలోకి వెళ్ళిపోయారు. తీర్పు చెప్పేందుకు రహస్య చర్చల్లో మునిగిపోయారు. బయట కిక్కిరిసిన కోర్టు హాలులో లాయర్లు ఆవరణలో వందలాది జనం, జర్నలిస్టులు డిఫెన్స్ కమిటీ నాయకులు తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. కొంత సేపటి తర్వాత జూరీ సభ్యులు భూతద్దం కావాలని కబురు పెట్టారు దాంతో మరింత ఉత్కంఠ చెలరేగింది.

మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 7.30 వరకూ జూరీ సభ్యులు చర్చించుకున్నారు. చర్చలు ముగిశాయని వారు చెప్పిన వెంటనే కోర్టు తిరిగి సమావేశమైంది. ఇక జూరీ తీర్పును ప్రకటించడమే తరువాయి.

జూరీని కోర్టు హాలులోకి ఆహ్వానించారు. జూరర్లు తమ తమ స్థానాల్లో ఆసీనులయ్యారు. ముద్దాయిలు కూడా హాజరయ్యారని కోర్టు గుమాస్తా ప్రకటించాడు:

*గుమాస్తా వర్తింగ్టన్: జంటిల్మెన్. . . . తీర్పుపై అంగీకారానికి వచ్చారా?*

*జూరీ అధిపతి. వచ్చాం.*

*గుమాస్తా వర్తింగ్టన్. నికొలా శాక్కొ*

*ముద్దాయి శాక్కొ: ఉన్నాను.*

*(శాక్కొ లేచి నిల్చున్నాడు)*

*గుమాస్తా వర్తింగ్టన్: నీ కుడి చెయ్యి పైకెత్తి ఉంచు. జూరీ అధిపతి గారూ ! ఖైదీ వైపు చూడండి. ఖైదీ ! జూరీ అధిపతి వైపు చూడు. జూరీ అధిపతిగారూ, కోర్టులో ఉన్న ఖైదీ దోషి కాదా? ఏం చెప్తారు?*

*జూరీ అధిపతి: దోషి.*

*గుమాస్తా వర్తింగ్టన్: హత్యా నేరంలో దోషి?*

*జూరీ అధిపతి. హత్యా నేరంలో.*

*గుమాస్తా వర్తింగ్టన్. ఫస్ట్ డిగ్రీలోనా?*

*జూరీ అధిపతి: ఫస్ట్ డిగ్రీలో.*

*గుమాస్తా వర్తింగ్టన్: ప్రతి ఆరోపణలోనూనా?* *

*జూరీ అధిపతి: అవునండి.*

---

* రెండు హత్యలను రెండు ఆరోపణలకింద నమోదు చేశారు.

ఒక గార్డు వాంజెట్టిని నిల్చోమని చెప్పాడు.

*గుమాస్తా వర్తింగ్టన్· బార్టొలోమియో వాంజెట్టి! నీ కుడి చేతిని పైకెత్తి పట్టు జూరీ అధిపతి వైపు చూడు జూరీ అధిపతి గారూ ఖైదీ వైపు చూడండి బార్టలోమియో హత్యా నేరంలో దోషా కాదా? ఏం చెప్తారు?*

*జూరీ అధిపతి* దోషి.

*గుమాస్తా వర్తింగ్టన్ ప్రతి ఆరోపణలోనూ, ఫస్ట్ డిగ్రీలోనేనా?*

*జూరీ అధిపతి* అవును ఫస్ట్ డిగ్రీలో.

*గుమాస్తా వర్తింగ్టన్ కోర్టు నమోదు చేసిన తీర్పులను వినండి జంటిల్మెన్! నికొలా శాక్కో, బార్టలోమియో వాంజెట్టిలు ప్రతి ఆరోపణలోనూ ఫస్ట్ డిగ్రీలో హత్యా నేరంలో దోషులని ప్రమాణ పూర్వకంగా చెప్తున్నారు మీరు అంతేనా జూరీ అధిపతి గారూ? జంటిల్మెన్ మీరూ అలానే చెప్తారా?*

*జూరీ·* మేం చెప్తాం, మేం చెప్తాం, మేం చెప్తాం.

జూరీ సభ్యుల్లో ఒక్కరైనా ముద్దాయిలు నిర్దోషులని భావించలేదు. ఏకగ్రీవంగా నిర్ణయించారు. శాక్కో, వాంజెట్టిలు తీర్పువిని హతాసులయ్యారు. థేయర్ జూరీకి కృతజ్ఞతలు చెప్పాడు:

ప్రభుత్వానికి మిరు చేసిన సేవకు మరోసారి కృతజ్ఞతలు ప్రకటించడం మినహా నేను మీకు ఈ రోజు ఉదయం చెప్పిన దానికి అదనంగా ఏమీచెప్పను. దాదాపు ఏడు వారాల పాటువిడిచిపెట్టి వున్న మీ ఇళ్ళకు మీరిప్పుడు వెళ్ళవచ్చు.

**"వాళ్ళు నిర్దోషిని చంపుతారు. వాళ్ళు ఇద్దరు నిర్దోషులను చంపుతారు. . . ." అని శాక్కో అరుస్తుండగా కోర్టు ముగిసింది.**

రోజినా శాక్కో పరిగెత్తుకొచ్చి భర్తను కౌగలించుకుంది. ఒక గార్డు వాళ్ళిద్దరినీ విడదీసేందుకు ప్రయత్నించాడు. ఆమె పిచ్చిపట్టినట్టుగా ఏడ్చింది డిఫెన్స్ లాయర్లు ఆమెను సముదాయిం చేందుకు ప్రయత్నించారు. అమెరికన్ చట్టాలు చాలా నాగరిక మైనవనీ, తీర్పుపై అప్పీళ్ళు చేసుకోవచ్చనీ, సాంకేతిక కారణాలపై కేసు యింకా చాలా కాలం కొనసాగించవచ్చనీ ఓదార్చారు. లాయర్ మూర్ భార్య కూడా ఆమెను ఓదార్చింది. ఆ దృశ్యాన్ని చూసిన కొందరు గార్డుల కళ్ళలో నీరు నిండడాన్ని బోస్టన్ హెరాల్డ్ విలేకరి గమనించాడు. డిఫెన్స్ కమిటీ నాయకులూ, సానుభూతిపరులూ విషాదవదనాలతో వెనుదిరిగారు.

కోర్టు ముందు గుమిగూడిన జనాన్ని పోలీసులు చెదరగొట్టారు. ఖైదీలిద్దరికీ సంకెళ్ళు వేసి డెడ్‌హాం వీధుల గుండా నడిపిస్తూ జైలుకు తీసుకెళ్ళారు. వాళ్ళిద్దరిప్పుడు కేవలం ముద్దాయిలు కారు చట్టం దృష్టిలో హంతకులు.

తీర్పు చెప్పిన పది నిమిషాల్లో కోర్టు హాలు నుంచి కొద్ది మంది తప్ప అంతా వెళ్ళిపోయారు. అసిస్టెంట్ జిల్లా అటార్నీ విలియమ్స్ తన రూం నుంచి బయటికి నడుస్తుండగా ఒక లాయర్ ఆయనకు తటస్థ పడ్డాడు. "గొప్ప విజయం సాధించినందుకు అభినందనలు" అంటూ ఆ లాయర్ కరచాలనం చేసేందుకు చేయి అందించాడు.

*చెక్కిళ్ళపై నుంచి కన్నీరు ధారగా కారుతుండగా విలియమ్స్ ఇలా అన్నాడు దాన్ని కెలకొద్దు నా జీవితంలో నాకు ఎదురైన అతి విషాదకర ఘటన ఇది*

ఈ కేసులో తీర్పు సాక్ష్యాల నుంచికాక అప్పటి సామాజిక వాతావరణం నుంచి వెలువడిందని ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ అంటాడు·

***ఆ కాలంలోని సామాజికోద్రేకాలూ, ఆరోపణల స్వభావమూ, ముద్దాయిల అభిప్రాయాలూ, ప్రాసిక్యూషన్ ఎత్తుగడలూ, న్యాయమూర్తి ప్రవర్తనా- వీటన్నిటి దృష్ట్యా శాక్కో, వాంజెట్టిలను దోషులుగా జూరీ నిర్ధారించడంలో ఆశ్చర్యం లేదు.***

జూరీ తీర్పు తర్వాత ముద్దాయిలు అదే కోర్టుకు, పై కోర్టుకు కూడా అప్పీలు చేసుకోవచ్చు. ఆ అప్పీళ్ళలో తీర్పు ఖరారైతే ఆ తర్వాత న్యాయమూర్తి శిక్ష విధిస్తాడు.

# మళ్ళీ విచారిస్తారా

*శాక్కో, వాంజెట్టి* లను హంతకులుగా నిర్ణయించిన జూరీ తీర్పు పట్ల తీవ్ర నిరసన వ్యక్తమయింది. వాళ్ళిద్దరూ ప్రవాసులూ, *రాడికల్స్* అయినందువల్లనే దోషులుగా ప్రకటించబడ్డారని అలజడి చెలరేగింది.

తీర్పుకు వ్యతిరేకంగానూ, అనుకూలంగానూ అమెరికా పత్రికలు రాశాయి. కేసు విచారణ ముగిసి జూరీ తీర్పు చెప్పినందువల్ల ఆ తీర్పును శిరసావహించడం మంచిదని కొన్ని పత్రికలూ, కొందరు మేధావులూ అభిప్రాయపడనారంభించారు. థేయర్ నిష్పక్షపాత న్యాయమూర్తి అని తాను నమ్మినప్పటికీ ముద్దాయిలను నేరస్తులుగా ప్రకటించడం గురించి తనకు సందేహాలున్నాయని నేషన్ పత్రిక సంపాదకుడు ఆర్థర్ వార్నర్ ప్రకటించాడు. కేసును తిరిగి విచారించాలని *అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్* డిమాండ్ చేసింది.

తీర్పుకు నిరసనగా అమెరికాలో, యూరప్‌లో, లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తులు నిర్వహించిన పలు ప్రదర్శనలు హింసకు దారి తీశాయి యూరప్ అంతటా బోల్షివిక్కులు తీర్పుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయం పేర్కొంది. పారిస్‌లో తీర్పుకు నిరసనగా ఎనిమిదివేలమంది ప్రదర్శన జరిపారు ఆ సందర్భంగా జరిగిన బాంబు పేలుళ్ళలో పోలీసు కాల్పులలో ఇరవైమంది చనిపోయారు. శాక్కో, వాంజెట్టిలను చంపితే అమెరికాలో అలజడి సృష్టించేందుకై వందమంది కమ్యూనిస్టులు ఫ్రాన్స్ నుంచి అమెరికా చేరుకున్నారని 1921 అక్టోబర్‌లో ఫ్రెంచి పోలీసు శాఖ ప్రకటించింది. శాక్కో, వాంజెట్టిలను చంపిన నేరం అమెరికా చరిత్రపుటల్లో ఎక్కకుండా చూడవలసిందని రోమ్‌లో ఉన్న ఛాంబర్ ఆఫ్ లేబర్ యూనియన్ కార్యవర్గం 1921 ఆగస్టులో అమెరికా ప్రభుత్వానికి పంపిన టెలిగ్రాంలో కోరింది. రోమ్‌లోనే ఉన్న నేషనల్ ప్రోలెటేరియన్ లీగ్ ఆఫ్ వార్ క్రిపుల్స్, నైస్ నగరంలోని యువ కమ్యూనిస్టు లీగ్, యూరప్‌లోని మూడు వేల సోషలిస్టు కుటుంబాలు, బ్రస్సెల్స్, జూరిచ్‌లకు చెందిన పలు కార్మిక సంస్థలూ తీర్పును తీవ్రంగా విమర్శించాయి. ఇటలీలో ఉన్న 200 వార్తా పత్రికలు తమ కేసు గురించి పట్టించుకున్నాయని వాంజెట్టి ఈ కాలంలో రాసిన ఒక లేఖలో ప్రస్తావించాడు.

నిరసన తీవ్రత వల్ల వివిధ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. పారిస్‌లోని అమెరికా రాయబారికి ఎవరో ఒక బాంబును పోస్ట్ చేశారు బ్రెజిల్‌లో అమెరికా రాయబారి తనకు పగలూ రాత్రీ గట్టి బందోబస్తు అవసరమని భావించాడు. బోల్షివిక్కులు ఏ క్షణంలోనైనా ఏదైనా చేయవచ్చని పుకార్లు వ్యాపించినట్లు అమెరికా ప్రభుత్వానికి ఆయన వర్తమానం పంపాడు స్విట్జర్లాండ్ ఫ్రాన్స్‌ల లోని అమెరికా రాయబార కార్యాలయాలు కూడా అక్కడి నిరసనోద్యమాల గురించి స్వదేశానికి తెలియ పర్చాయి. ఈ కాలంలోనే అమెరికా అంతర్గత మంత్రిత్వశాఖ శాక్కో-వాంజెట్టి కేసు గురించిన వివరాలను తెలిపే సర్క్యులర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలన్నిటికీ పంపింది.

ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత అనటోల్ ఫ్రాన్స్ 1921 అక్టోబర్‌లో శాక్కో, వాంజెట్టిలను రక్షించమని కోరుతూ అమెరికా ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశాడు:

*అమెరికా ప్రజలారా!*
*పాత ప్రపంచానికి చెందిన ఈ వృద్ధుడు చేస్తున్న విజ్ఞప్తిని ఆలకించండి ఇతను పరాయివాడు కాదు మానవాళికంతటికీ సాటి పౌరుడు*

*మీ రాష్ట్రాల్లో ఒక దాన్లో శాక్కో వాంజెట్టి అనే ఇద్దరు మనుషులను 'అభిప్రాయాలు కలిగివున్నారన్న' నేరంపై దోషులుగా ప్రకటించారు*
*అతి పవిత్రమైన ఆ హక్కుకోసం వాళ్లు తమ జీవితాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తోందనే ఆలోచనే భయానకంగా ఉంది. మనం ఏ పార్టీకి చెందినా మనకున్న ఆ పవిత్ర హక్కును సమర్థించాలి.*

*అతి క్రూరమైన ఈ శిక్షను అమలు జరపనీయకండి శాక్కో, వాంజెట్టిల మృతి వారిని అమరవీరులను చేస్తుంది కాని మిమ్మల్ని అవమానంలో ముంచుతుంది*
*మీరు గొప్ప మనుషులు. మీరు న్యాయమైన వాళ్ళు కూడా అయ్యుండాలి మీలో ఆలోచనాపరులైన, తెలివైన మనుషులు చాలామంది ఉన్నారు వారికి విజ్ఞప్తి చేయడం ముఖ్యమని భావిస్తాను అమరవీరులను రూపొందించడం గురించి జాగ్రత్త పడమని వారికి చెప్తాను అది భవిష్యత్ తరాలను ప్రభావితంచేసే క్షమించరాని, మాసిపోని నేరం*

*శాక్కో, వాంజెట్టిలను రక్షించండి!*
*మీ గౌరవంకోసం, మీ పిల్లల గౌరవం కోసం ఇంకా*
*పుట్టని తరాల గౌరవం కోసం వారిని రక్షించండి!!*

జూరీ తీర్పును ప్రకటించినప్పటి నుంచి డిఫెన్స్ కమిటీ కార్యక్రమాలు ముమ్మరమయ్యాయి. తీర్పు వెలువడిన తర్వాత కొంతకాలంపాటు పత్రికలు కేసు వార్తలకు ప్రాముఖ్యం ఇవ్వనప్పటికీ కొత్త కొత్త వర్గాలు ఈ కేసుపట్ల స్పందించనారంభించాయి. అప్పటివరకూ అంటీ ముట్టనట్టున్న

అమెరికన్ కమ్యూనిస్టులు కూడా ఆసక్తి కనపర్చడం ప్రారంభించారు. పౌరహక్కుల సంఘాలు అప్రమత్తమయ్యాయి. న్యూ ఇంగ్లాండ్ సివిల్ లిబర్టీస్ కమిటీ, అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్‌లు మేడమ్ ఎలిజబెత్ ఎవాన్స్ రాసిన "అవుట్‌స్టాండింగ్ ఫీచర్స్ ఆఫ్ ద శాక్కో వాంజెట్టి కేస్ " గ్రంధాన్ని ఈ కాలంలో అచ్చేశాయి. అమెరికన్ ఇటాలియన్లు డిఫెన్స్ కమిటీకి బాగా ఆర్థిక సహాయం చేశారు డిఫెన్స్ కమిటి మాసపత్రిక ఇంగ్లీషు లోనే కాక ఇటాలియన్ భాషలో కూడా ప్రచురించడం మొదలు పెట్టారు. పలు కరపత్రాలను పుస్తకాలను ఈకమిటి ప్రచురించింది. విభిన్న భావాలున్న వారిని సంఘటిత ఉద్యమంలోకి సమీకరించే కృషిని ఇది సమర్ధవంతంగా నిర్వహించగలిగింది. గార్డెనర్ జాక్సన్‌లాంటి ఉదారవాదులు కేసుపట్ల ఆసక్తి ప్రదర్శించడం మొదలు పెట్టారు.

## 2

కేసు విచారణ జరిగిన రోజుల్లో డెడ్‌హాం జైల్లో ఉంచబడిన శాక్కో, వాంజె ట్టి లను తీర్పు తర్వాత వేర్వేరు జైళ్ళలో నిర్బంధించారు. శాక్కోను అక్కడే ఉంచి వాంజెట్టిని (శిక్షపడిన ఖైదీ అయినందువల్ల) చార్లెస్‌టౌన్ జైలుకు మార్చారు. వాంజెట్టి కంటే శాక్కోకు జైలు జీవితం దుర్భరంగా మారింది. శాక్కోను పనిచేయనిచ్చేవారు కారు. శ్రమ చేసేందుకు అలవాటుపడివ శాక్కోకు అలా జీవించడం అసాధ్యమనిపించేది. పైగా వాంజెట్టి లాగా అతడు అవివాహితుడు కాదు. తను అమితంగా ప్రేమించే భార్యా పిల్లలు గుర్తుకొచ్చి చాలా మధన పడేవాడు.

జూరీ తీర్పు తర్వాత ఐదారు నెలలకు శాక్కో మనోవేదన మానసిక రుగ్మతకు దారితీసింది. తన భోజనంలో ఎవరో విషం కలుపుతున్నారన్న భ్రమకు లోనై భయాందోళనలకు గురయ్యాడు. ఆ జబ్బుకు చికిత్సగా జైలులోవున్న షూ ఫ్యాక్టరీలో శాక్కోను పని చేయనిచ్చారు. కానీ అలవాటు తప్పిన పని కావడం వ్ల్ల పలు మార్లు ప్రమాదాల పాలు కావడంతోపని నుంచి తప్పించారు.

మానసిక వత్తిడి వల్ల 1922 ఆఖరు నాటికి శాక్కోకు మతిభ్రమించే సూచనలు తిరిగి కనిపించాయి. 1923 ఫిబ్రవరిలో నిరాహారదీక్ష మొదలు పెట్టాడు. విడుదలవడమో, చావడమో తేల్చుకోదలుచుకున్నాడు. నెలరోజులకు పైగా మంచి నీళ్ళు తప్ప ఆహారం ముట్టలేదు. నిరాహారదీక్ష చేస్తే తనను విడుదల చేస్తారని ఆశించాడు.

శాక్కో కఠోర నిర్ణయం ప్రజల మెదళ్ళను కుదిపింది. వారు ఉద్యమించారు. బోస్టన్‌లో కార్మికులు బ్రహ్మాండమైన ఊరేగింపు జరిపి శాక్కో, వాంజెట్టిలను విడుదల చేయాలని మరోసారి గొంతెత్తారు.

మానసిక రోగగ్రస్తుడైన ముద్దాయిపై కేసును విచారించేందుకు అమెరికాలో చట్టాలు అనుమతించవు. కాబట్టి శాక్కోకు సంబంధించిన న్యాయపరమైన చర్యలన్నీ ఆగిపోయాయి.

శాక్కొ ప్రాణాలు కాపాడేందుకు అతన్ని ఆస్పత్రిలో చేర్చమని లాయర్లు కోర్టును అభ్యర్థించారు. నాలుగు వారాల దీక్ష తర్వాత మార్చి 16న న్యాయమూర్తి థేయర్ ఆదేశాల మేరకు ముగ్గురు సైకియాట్రిస్టులు అతన్ని పరీక్షించారు. తనను నెమ్మదిగా చంపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనీ, భోజనంలో విషం కలుపుతున్నారనీ, తన గదిలోకి విషవాయువులను పంపుతున్నారనీ, తన పక్క కింద విద్యుత్తు ప్రవహింప జేస్తున్నారనీ డాక్టర్లకు శాక్కొ చెప్పాడు

శాక్కొను పదిరోజులపాటు బోస్టన్ పిచ్చాసుపత్రిలో ఉంచమని డాక్టర్ల నివేదిక ఆధారంగా థేయర్ ఆదేశించాడు. అక్కడ బలవంతంగా ఆహారమిచ్చి శాక్కొ దీక్షను విరమింపజేశారు. కానీ కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్ళీ మతి స్థిమితం కోల్పోయాడు. "నేను నిర్దోషిని, ఇక్కడ న్యాయం లేదు" అంటూ కేకలేస్తూ కుర్చీ కేసి తల బాదుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు మరో సందర్భంలో భార్య సమక్షంలోనే అలాంటి ప్రయత్నం చేశాడు. శాక్కొ ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన ప్రముఖ అమెరికన్ సైకియాట్రిస్ట్ రాల్ఫ్ కోల్ప్ ప్రకారం 'సెన్సరీ డిప్రవేషన్' అనే జబ్బుతో శాక్కొ బాధపడ్డాడు. కుటుంబంనుంచీ శ్రమ నుంచీ ప్రకృతి నుంచీ వేరు చేయడం వల్ల ఆ జబ్బుకు లోనయ్యాడు. 1923 సెప్టెంబర్ 29న పూర్తిగా కోలుకున్న తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి డెడ్‌హాం జైలుకు తరలించారు.

బ్రెయిన్‌ట్రీ కేసులో జూరీ తీర్పుకు వాంజెట్టి చలించలేదు. అతను స్వాప్నికుడు. ఆలోచనా శీలి. భావాలను వ్యక్తీకరించగల శక్తి సంపన్నుడు. కాలాన్ని నడిపించగల సమర్థుడు. శిక్ష పడిన ఖైదీగా శ్రమ చేయాల్సి ఉన్నందున వాంజెట్టికి దిగులు లేదు. కార్ల లైసెన్స్ ప్లేట్లను తయారు చేసే పని ఆయన కప్పజెప్పారు. మసాచూసెట్స్ రాష్ట్రంలో ప్రైవేటు పెట్టుబడి కబళించని ఒకే ఒక పరిశ్రమ లైసెన్స్ ప్లేట్ల తయారీ మిగతా కాలాన్ని పుస్తకాలు చదువుతూ, ఉత్తరాలు రాస్తూ, అనువాదాలు చేస్తూ బాగా ఉపయోగించుకున్నాడు. 'ఇవెంట్స్ అండ్ విక్టిమ్స్' పేరిట ప్రవాస కార్మికుల జీవితాల గురించిన నవల ఒకటి కొంత మేరకు రాశాడు. తనకు జీవితంలో ఎదురైన పలు భీకర పరిస్థితులను తప్పించుకోగలిగాననీ, అలాగే ఈ కేసు నుంచీ బయటపడగలననీ విశ్వాసం ప్రకటిస్తూ వచ్చాడు. 1921 సెప్టెంబర్‌లో తన చెల్లెలు లూగియాకు రాసిన లేఖలో ఇలా చెప్పాడు:

*ఆరువారాలపాటు కొనసాగిన ఒక కేసు విచారణ గురించీ - ముఖ్యంగా పలు రకాల సామాజిక శక్తులూ, వైరుధ్యాలూ, వైషమ్యాలూ, అపోహలూ సంఘర్షించిన కేసు విచారణ గురించి ఒక్క ఉత్తరంలో వివరించడం అసాధ్యం.*

*దురదృష్టవశాత్తూ నీకు ఫలితమేమిటో తెలుసు చేయని నేరానికి నన్ను రెండవసారి దోషిగా ప్రకటించారు. ఆ నేరం జరిగిన చోటుకు కూడా నేనెప్పుడూ వెళ్ళలేదు. కానీ అంతిమ నిర్ణయం ఇంకా జరగలేదు. కేసు అప్పీలుకు వెళ్ళింది. న్యాయమూర్తి ఏం చెప్తాడో మనకు కొన్ని నెలల్లో తెలుస్తుంది అది మాకు వ్యతిరేకమైతే మేం సుప్రీం కోర్టుకు అప్పీలుకు వెళ్తాం.*

*అదే జరిగితే సమాధానం కోసం ఒక ఏడాదిపాటు వేచి చూడాలి నువ్వు చూస్తున్నావుకదా!*
*పనులు నెమ్మదిగా జరుగుతాయి ఓర్పు అవసరం ఏమైనప్పటికీ, లాయర్లు ఆశావాదులుగా*
*ఉన్నారు న్యాయమూర్తి (థేయర్) కేసు పునర్విచారణకు ఆదేశిస్తాడనే ఆశలో ఉన్నారు*

# 3

**జూ**రీ తీర్పు కేసులోని సాక్ష్యాధారాలకు అనుగుణంగా లేదని గానీ జూరీ తీర్పుకు నిరుద్ధమైన సాక్ష్యాధారాలు లభ్యమయ్యాయని గానీ చూపగలిగితే తిరిగి విచారణ జరిపే అధికారం మసాచూసెట్స్ చట్టాల ప్రకారం అంతకు ముందు కేసు విచారించిన న్యాయమూర్తికే ఉంటుంది అందువల్ల శాక్కో-వాంజెట్టి కేసు లో జూరీ తీర్పును సవాల్ చేస్తూ థేయర్ ఎదుటే డిఫెన్స్ లాయర్లు పలుపిటీషన్లు దాఖలు చేశారు.

జూరీ తీర్పు సాక్ష్యాలపై ఆధారపడలేదనీ, ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాలు ముద్దాయిలు దోషులని నిరూపించలేకపోయాయని మొదటగా డిఫెన్స్ పిటీషన్ దాఖలు చేసింది జూరీ తీర్పు వెలువడిన నాలుగవ రోజుకే దాఖలయిన ఈ పిటీషన్ పై 1921 నవంబర్ 5న వాద ప్రతివాదాలు జరిగాయి. డిసెంబర్ 24 అంటే క్రిస్మస్ ముందురోజు న్యాయమూర్తి థేయర్ ఆ పిటీషన్‌ను తోసి పుచ్చాడు. గౌరవనీయులైన పన్నెండుమంది నిష్పక్షపాత జూరర్లు తాము చేసిన ప్రమాణాన్ని ధిక్కరించారని గానీ, హేతువిరుద్ధంగా లేదా పక్షపాతంతో వ్యవహరించారనిగానీ పిటీషనర్లు నిరూపించలేక పోయినందువల్ల ఆ పిటీషన్‌ను తోసిపుచ్చుతున్నానన్నాడు దీనిపై ఎందు వల్లనో డిఫెన్సు లాయర్లు పై కోర్టుకు అప్పీలుకు వెళ్ళలేదు.

ఆ పిటీషన్ పెండింగ్‌లో ఉండగానే కొన్ని వాస్తవాలు వెలుగుచూశాయి. ఆ కొత్త సాక్ష్యాల ఆధారంగా కేసును తిరిగి విచారించాలని 1921 నవంబర్ 8న మరో పిటీషన్ దాఖలయింది జూరీ అధిపతి వాల్టర్ రిప్లే ప్రవర్తన ఆ పిటీషన్‌కు ఆధారం.

శాక్కో, వాంజెట్టిల పట్ల తన మిత్రుల దగ్గర తీవ్ర ద్వేషాన్ని వెళ్ళగక్కిన వాల్టర్ రిప్లేకి ఇటాలియన్ లంటే తగని మంట. ఇటాలియన్‌ను అతనెప్పుడూ ఇటాలియన్ అని సంబోధించడు. అసహ్యకరమైన పేర్లతో పిలుస్తాడు. తనకే గనుక అధికారం ఉంటే వారిని అమెరికా గడ్డ నుంచి తరిమేస్తానని చెప్పేవాడు. జూరీ సభ్యులు తమతో పాటు ఏ విధమైన వస్తువులనూ జూరీగదిలోకి తీసుకెళ్ళరాదనే నిబంధనను రిప్లే ఉల్లంఘించాడని డిఫెన్స్ లాయర్లకు తెలిసింది. కొన్ని బుల్లెట్లను అతను కోర్టుకు తెచ్చి జూరర్లలో కొందరికి చూపించాడని ఆధారాలు లభించాయి. జెరేమియా మెక్ ఎనార్నీతో రిప్లే మాట్లాడుతూ ఆ విషయాన్ని అంగీకరించాడు కూడా. సాక్ష్యంగా కోర్టులో ప్రవేశపెట్టబడిన బుల్లెట్లలో రిప్లే తెచ్చిన బుల్లెట్లు కలిసిపోయి సాక్ష్యం తారుమారయ్యే

అవకాశం కూడా ఉంది. జెరేమియా మెక్ ఎనార్నీ అఫిడవిట్‌తో పాటు ఈ పిటీషన్‌ను కోర్టులో వేశాక రిప్లే ప్రవర్తన గురించి మరొక సంగతికూడా బయట పడింది

విలియం డాలీ క్విన్సీలో కాంట్రాక్టర్‌గా పని చేస్తుంటాడు. అతను 38 ఏళ్ళుగా రిప్లేకి సన్నిహిత స్నేహితుడు. కేసు విచారణ ప్రారంభమయ్యే ముందు 1921 మేలో ఒక రోజు కోర్టుకు వెళ్ళే దారిలో రిప్లే తన మిత్రుడికి తటస్థ పడ్డాడు. హత్య చేశారని ఆరోపణలున్న "రెండు పందుల కేసు ' లో తను జూరీకి ఎంపికయ్యానని రిప్లే తన మిత్రుడికి చెప్పాడు. శాక్కో, వాంజెట్టిలు నేరస్థులని తను నమ్మడం లేదని డాలీ అనగా "***చావనివ్వు, ఏదేమైనా వాళ్ళను ఉరితీయాలి'*** * అంటూ రిప్లే విషం గక్కాడు

శాక్కో వాంజెట్టిలు హంతకులనీ, వాళ్ళను శిక్షించాలనీ ముందుగానే నిర్ణయించుకున్న రిప్లే జూరీలో ఉండేందుకు అనర్హుడయ్యాడని, కాబట్టి తీర్పు చెల్లదని డిఫెన్స్ లాయర్లు మరో పిటీషన్ దాఖలు చేశారు. డాలీ సంతకం చేసిన అఫిడవిట్‌ను సాక్ష్యంగా ప్రవేశపెట్టారు.

ఈ పిటీషన్ దాఖలయిన పది రోజులకు రిప్లే హఠాత్తుగా చనిపోయాడు.

రిప్లే-డాలీ మోషన్‌గా పిలువబడే ఈ పిటీషన్‌ను 1924 అక్టోబర్ 1న థేయర్ తోసి పుచ్చాడు. రిప్లే కోర్టుకు తెచ్చాడని చెప్పబడ్డ రివాల్వర్ బుల్లెట్ల వల్ల ముద్దాయిలకు నష్టం జరిగినట్టుగా డిఫెన్స్ లాయర్లు నిరూపించలేక పోయారని ఆయన తీర్పులో పేర్కొన్నాడు. తనకూ రిప్లేకు మధ్య జరిగిన సంభాషణను డాలీ పొరపాటుగా అర్థం చేసుకొని ఉండవచ్చునని ఒక ఊహాజనిత సాకును చూపి డాలీ అఫిడవిట్‌ను కూడా కోర్టు నమ్మడం లేదన్నాడు.

జూరీ తీర్పుకు వ్యతిరేకంగా చేసే ఏ వాదనైనా అది మొత్తం మసాచుసెట్స్ న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిందనీ అలాంటి దాడి నుంచి న్యాయవ్యవస్థను కాపాడటం తన వీరోచిత కర్తవ్యమనీ థేయర్ భావించాడు. ముద్దాయిల పట్లా, మొత్తంగా రాడికల్స్ పట్లా తన తీవ్ర వ్యతిరేకతను థేయర్ పదే పదే రుజువు చేసుకున్నాడు. న్యూయార్క్ టైమ్స్ ప్రత్యేక విలేఖరిగా బోస్టన్‌లో 1922 ఫిబ్రవరిలో పర్యటించిన లూయీ స్టార్క్ థేయర్ ద్వేషాన్ని గురించి విలువైన సమాచారం ఇచ్చాడు-**

> *కేసును ఆవరించిన వాతావరణాన్ని బట్టి . . . . . అనవసర పోలీసు బందోబస్తును . . అవసరం లేని సోదాలను బట్టి. . . పత్రికా విలేఖరులంతా, ఒక్కరు మినహా, కేసు విచారణ*

---

* *ఈ వాక్యం బాగా ప్రాచుర్యం పొందింది. నిరసనోద్యమంలో ఈ మాటలు రాసిన బానర్లు తరచుగా ప్రదర్శించబడ్డాయి శాక్కో, వాంజెట్టిల పట్ల న్యాయవ్యవస్థ దృక్పథానికి ఇవి అద్దం పట్టాయని ఉద్యమకారులు భావించారు.*

** *ఈ సమాచారాన్ని లూయీస్టార్క్ 1938 లో బయటపెట్టడం వల్ల కేసులో ఉపయోగించుకోలేక పోయారు.*

నిష్పక్షపాతంగా జరగలేదని భావించడం నేను గమనించాను (1922 ఫిబ్రవరి 22న థేయర్ ఒక ఇంటర్వ్యూలో నాతో ఇలా చెప్పాడు ) 'న్యూయార్క్ టైమ్స్ ఈ అరాచకవాదుల పక్షాన నిలబడబోవడం లేదని నేను ఆశిస్తున్నాను . . . ఆర్థిక రాజకీయ అసమ్మతివాదుల పట్ల ముఖ్యంగా విదేశీయుల పట్ల తనకున్న వ్యతిరేకతను దాచుకొనేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు ఆయన దృష్టిలో ప్రతి తాత్విక అరాచక వాది హంతకుడేనన్నది స్పష్టం

రిప్లే-డాలీ మోషన్‌ను థేయర్ తోసి పుచ్చడాన్ని సవాలుచేస్తూ డిఫెన్స్ లాయర్లు సుప్రీం జుడీషియల్ కోర్టుకు అప్పీలుకు వెళ్ళగా అక్కడా వారికి చుక్కెదురైంది. జూరీకి ఎంపికయ్యే ముందు న్యాయమూర్తి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ రిప్లే తనకు ఎలాంటి పక్షపాతం లేదని చెప్పాడనీ యిప్పుడు అతను చనిపోయినందువల్ల అతనిపై ఆరోపణలను ఎలాంటి ఇతర కారణం చూపకుండానే కొట్టి వేయవచ్చని సుప్రీం జుడీషియల్ కోర్టు అభిప్రాయపడింది.

రిప్లే-డాలీ మోషన్ థేయర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కాలంలోనే మరికొన్ని సాక్ష్యాలను డిఫెన్స్ కమిటి సేకరించింది. శాక్కో, వాంజెట్టిలను హంతకులుగా నిరూపించే దుర్బుద్ధితో ప్రాసిక్యూషన్ కొన్ని సాక్ష్యాలను తొక్కి పెట్టిందనీ, మరికొన్ని తప్పుడు సాక్ష్యాలను సృష్టించిందనీ మూర్ కనుగొన్నాడు.

రాయ్‌గాల్డ్ చిరు వ్యాపారి. సౌత్ బ్రెయిన్ ట్రీలో ఫ్యాక్టరీ కార్మికులకు రేజర్ పేస్ట్ అమ్ముతాడు హత్యలు జరిగిన సమయంలో అతను హతుల వెనకే నడుస్తూ ఉన్నాడు. అతనికి ఐదడుగుల దూరం నుంచే బందిపోట్ల కారు దూసుకుపోయింది డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న బందిపోటు (శాక్కోగా ప్రాసిక్యూషన్ సాక్షులు వర్ణించిన వ్యక్తి) గాల్డ్ పైకి కాల్పులు జరుపగా ఒక తూటా అతని ఓవర్ కోటు నుంచి దూసుకు పోయింది. తన పేరూ, అడ్రసూ పోలీసులకిచ్చి తన సాక్ష్యం తీసుకోవలసిందని అతను అభ్యర్థించాడు. కానీ గాల్డ్‌ను ప్రాసిక్యూషన్ సాక్షిగా ప్రవేశపెట్టలేదు. కేసు విచారణ ముగిసిన తర్వాత ఒక రోజు శాక్కో, వాంజెట్టిలనులతను చూశాడు. హంతకుల కారులో వాళ్ళిద్దర్లో ఎవరూ లేరని డిఫెన్స్ లాయర్లకు గాల్డ్ అఫిడవిట్ రాసిచ్చాడు. అంతేగాక, కొందరు ప్రాసిక్యూషన్ సాక్షులు కూడా తమ చేత అబద్ధపు సాక్ష్యాలు చెప్పించారని [illegible] ...న్నారు.

హతుడు బెరార్డెల్లిని కాల్చి చంపిన బందిపోటు శాక్కో అని కోర్టులో గుర్తించిన ఒకే ఒక్క సాక్షి పెల్సర్. రైస్ అండ్ హచిన్స్ ఫ్యాక్టరీ కార్మికుడైన పెల్సర్ కాల్పుల శబ్దం విని బల్ల కింద దాక్కున్నాడనీ, అతనెవరినీ చూడలేదని తోటి కార్మికులు డిఫెన్స్ తరపున కోర్టులో సాక్ష్యం చెప్పి ఉన్నారు. 1922 ఫిబ్రవరి 4న మూర్ ఎదుట ప్రమాణం చేసి ఇచ్చిన అఫిడవిట్‌లో తను అబద్ధపు సాక్ష్యం చెప్పినట్లుగా పెల్సర్ అంగీకరించాడు. కాల్పులు జరగడాన్ని అసలు తాను చూడనేలేదని తేల్చాడు. అసిస్టెంట్ జిల్లా అటార్నీ విలియమ్స్ తనను బెదిరించి దొంగ సాక్ష్యం చెప్పించాడన్నాడు.

ఈ అఫిడవిట్‌ను కోర్టులో మూర్ దాఖలు చేసి రెండు రోజులు కాకముందే పెల్సర్ మళ్ళీ ప్రాసిక్యూషన్ వైపు వెళ్ళాడు. జిల్లా అటార్నీ కట్జ్‌మన్‌కు రాసిన ఒక లేఖలో డిఫెన్స్ లాయర్ మూర్ బృందం తనను వత్తిడి చేసి అబద్ధపు అఫిడవిట్‌పై సంతకం చేయించారని చెప్పాడు:

> శాక్కో-వాంజెట్టి కేసు నిమిత్తమై శనివారం సాయంత్రం ఒకతను నన్ను పిల్చాడు. . . .నేను బాగా మద్యం సేవించి ఉన్నాను. మేమంతా పెంబర్టన్ స్క్వేర్‌లో ఉన్న ఒక ఆఫీసుకు వెళ్ళాం. మూర్‌కు నన్నతను పరిచయం చేశాడు. తలుపేశాడు. . . . ముగ్గురు నలుగురు మనుషులు, ఒక మహిళా స్టెనోగ్రాఫర్ ఆయన ఆఫీసులో ఉన్నారు. ఒకదాని తర్వాత మరొక ప్రశ్న వేస్తూ డెడ్‌హాం కోర్టులోనేను చెప్పిన సాక్ష్యానికి విరుద్ధంగా చెప్పేటట్టు చేశాడు. నన్ను ఇరికించి ఇబ్బంది పెట్టిన పద్ధతికి నేను భయపడుతున్నాను.

ఫిబ్రవరి 12న అసిస్టెంట్ జిల్లా అటార్నీ విలియమ్స్‌కి యిచ్చిన అఫిడవిట్‌లో పెల్సర్ మళ్ళీ యిలాంటి కథనాన్నే చెప్పాడు. ఫిబ్రవరి 4న తాగిన మత్తులో తాను మూర్‌కు ఏం చెప్పానో తెలియదనీ, తనను మూర్ బెదిరించాడనీ, డబ్బు ఆశ చూపాడనీ అందులో పేర్కొన్నాడు.

శాక్కోను గుర్తు పట్టిన ప్రాసిక్యూషన్ సాక్షుల్లో ఒకడైన కార్లోస్ గుడ్‌రిడ్జ్ డెడ్‌హాం కోర్టులోనే దాఖలైన ఒక క్రిమినల్ కేసులో గతంలో ముద్దాయి. ఆ సంగతిని క్రాసు పరీక్షలో డిఫెన్స్ లాయర్లు అడగ్గా ప్రాసిక్యూషన్ అభ్యంతరపెట్టింది. న్యాయమూర్తి ఆ అభ్యంతరాన్ని సమర్థించాడు. మరో దొంగతనం కేసులో కూడా గుడ్‌రిడ్జ్ ఇరుక్కొని నేరం ఒప్పుకుని శిక్ష విధించబడి సత్ప్రవర్తన కలిగి వుండే షరతుపై విడుదలయ్యాడు. కాబట్టి అతను ప్రాసిక్యూషన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతుకుతున్నాడు. అందువల్ల ప్రాసిక్యూటర్ ఏం చెప్పమంటే అది చెప్పే అవకాశం ఉంటుంది. ఈ విషయాల గురించిన రికార్డు కూడా డిఫెన్స్ లాయర్లు సంపాయించినప్పటికీ న్యాయమూర్తి వాటి గురించి అప్పట్లో ప్రశ్నలడగనివ్వలేదు.

జూరీ తీర్పు చెప్పిన కొన్ని రోజులకు గుడ్‌రిడ్జ్ గురించి మరికొన్ని నిజాలు తెలిశాయి. న్యూయార్క్‌లో 1893 లో రెండు బంగారు రిస్ట్ వాచీలను దొంగిలించిన నేరంలో అతను శిక్షించబడ్డాడు. మరో దొంగతనం కేసులో 1908 లో జైలు కెళ్ళాడు. వివాహేతర సంబంధం కలిగి వున్నాడన్న కారణంపై 1909లో భార్య అతని నుంచి విడిపోయింది. అతను 1911 లో న్యూయార్క్‌లో మరొక దొంగతనం చేసినట్టు కేసు నమోదై వుంది. అక్కడి నుంచి పారిపోయి మరొక చోట ప్రత్యక్షమై, కావాలని అగ్ని ప్రమాదం సృష్టించి ఫైర్ ఇన్సూరెన్స్ డబ్బులు కాజేసేందుకు ప్రయత్నించి పట్టుబడ్డాడు. వెర్మాంట్‌లో మారుపేర్లతో సంచరిస్తూ ఒక మహిళతో పాటు పోలీసులకు పట్టుబడ్డాడు. రెండో పెళ్ళి చేసుకొనేందుకై అబద్ధపు సాక్ష్యం చెప్పి కేసులో ఇరుక్కున్నాడు. రెండవ భార్యను తీవ్రంగా హింసించిన కారణంగా 1919 లో ఆమె కూడా విడాకులిచ్చింది.

జిల్లా అటార్నీ కట్జ్‌మన్ బ్లాక్ మెయిల్ చేయగా భయపడి శాక్కో-వాంజెట్టి కేసులో అబద్ధపు సాక్ష్యం చెప్పానని గుడ్‌రిడ్జ్ డిఫెన్స్ లాయర్ మూర్‌కు అఫిడవిట్ ఇచ్చాడు.

గుడ్‌రిడ్జ్‌ని బెదిరించి మూర్ ఆ అఫిడవిట్ సంపాదించాడని ప్రాసిక్యూషన్ ఆరోపించింది పాత కేసుల్లో అరెస్టు చేయిస్తానని మూర్ తనను బెదిరించాడనీ తను లొంగక పోయే సరికి అరెస్టు వారెంట్ జారీ చేయించి రెండు రోజుల పాటు జైల్లో బంధింపజేసి అఫిడవిట్ రాయించుకున్నాడనీ గుడ్‌రిడ్జ్ ఆరోపించాడు. నిజం కూడా అందుకు దగ్గరగానే ఉంది. వేరే రాష్ట్రంలో ఒక గ్రామంలో నివశిస్తున్న గుడ్‌రిడ్జ్‌ను మూర్ వెతికి పట్టుకున్నాడు. అతనిని జైలుకు కూడా పంపించాడు. న్యూయార్క్ పోలీసులు ఒక కేసులో గుడ్‌రిడ్జ్ కోసం వెతుకుతున్నారని మూర్ తనను నమ్మించగా, అతనిపై అరెస్టు వారెంట్ జారీ చేసి జైలులో పెట్టించానని అక్కడి మునిసిపల్ కోర్టు న్యాయమూర్తి రాబర్ట్ కోనీ ప్రాసిక్యూషన్‌కు అఫిడవిట్ ఇచ్చాడు న్యూయార్క్ పోలీసులు రాకపోయే సరికి రెండు రోజుల తర్వాత అతనిని విడుదల చేశానన్నాడు.

ఇలాంటి పనులు మూర్‌ను మరింతగా అపఖ్యాతి పాలు చేయడమేగాక, డిఫెన్స్ తరపు సాక్ష్యాల విలువను తగ్గించి డిఫెన్స్ కమిటీ మొత్తాన్నీ అప్రదిష్ట పాలు చేశాయి అయినప్పటికీ మూర్ తన పని తాను చేసుకుపోయాడు.

నేరస్థలానికి దగ్గర్లో నేరం జరిగిన రోజు ఉదయం శాక్కో కనిపించాడని లోలా ఆండ్రూస్ ప్రాసిక్యూషన్ తరపున సాక్ష్యం చెప్పి వుంది. తనను కట్జ్‌మన్, విలియమ్స్, పోలీసు అధికారి స్టెవార్ట్ బెదిరించి తప్పుడు సాక్ష్యం చెప్పించారని 1922 సెప్టెంబర్ 9న మూర్‌కు ఆమె అఫిడవిట్ ఇచ్చింది. తన గత జీవితాన్ని బహిరంగ పరచగలమని వారు తనను బెదిరించారని ఆరోపించింది.

పూర్వాశ్రమంలో ఆండ్రూస్ ఒక తాగుబోతుతో కొన్నాళ్ళు సంసారం చేసింది. చివరికి అతన్ని వదిలించుకుని మసాచూసెట్స్ రాష్ట్రానికి వచ్చి సరికొత్త జీవితం ప్రారంభించింది. ఆమె గత జీవితం గురించి మసాచూసెట్స్‌లో ఎవరికీ తెలియదు. తాగుబోతు మొగుడికి పుట్టిన ఆమె కొడుకు ఆమె ప్రవర్తన దృష్ట్యా ఆమె దగ్గరుండటం మంచిది కాదని ఒక కోర్టు తీర్పు చెప్పి అతని సంరక్షణ బాధ్యతను మరొక వ్యక్తికి అప్పజెప్పింది.

మూర్‌కు తానిచ్చిన అఫిడవిట్‌లోని సంగతులు నిజం కావని ఆండ్రూస్ మళ్ళీ ప్రకటించింది. కట్జ్‌మన్, విలియమ్స్‌ల సమక్షంలో సంతకం చేసిన మరొక అఫిడవిట్లో మూర్‌పై ఆమె పలు ఆరోపణలు చేసింది. తన గత జీవితంలో జరిగిన కొన్ని దురదృష్టకర ఘటనలను అడ్డు పెట్టుకొని మూర్, మరో ఇద్దరు వామపక్ష కార్మిక నాయకులతో కలిసి తనను లొంగదీసుకుని ఆ అఫిడవిట్ పై సంతకం పెట్టించుకున్నారని చెప్పింది. కోర్టులో తను చెప్పిన సాక్ష్యమే నిజమనీ, తనను ప్రాసిక్యూటర్లు గానీ పోలీసు అధికారులు గానీ బెదిరించలేదనీ పేర్కొంది. ఆమె కథనం ప్రకారం:

మూర్, అతని మనుషులు కలిసి ఆమెను బోస్టన్‌కు పిలిపించారు ఆమె కొడుకును కూడా వాళ్ళు అప్పటికే అక్కడికి తెచ్చి వుంచారు. ఆమె గత జీవితం గురించి చెప్పిన దజనుకు పైగా సాక్షుల అఫిడవిట్లు తమ దగ్గరున్నాయని కార్మిక నాయకులిద్దరూ బెదిరించారు ఆమె భవిష్యత్తును అంధకారం చేయగలమనీ, కొడుకు కు పుట్టగతులు లేకుండా చేయగలమనీ వాళ్ళు భయపెట్టారు. బోస్టన్‌లో ఎసెక్స్ హోటల్లో ఆమెను సాయంత్రం ఏడింటి నుంచి అర్ధరాత్రి వరకూ వేధించారు ఆ తర్వాత మూర్ ఇంటికి తీసుకెళ్ళి ఉదయం ఎనిమిది గంటల దాకా విసిగించి అఫిడవిట్‌పై సంతకం పెట్టించుకున్నారు

"ముద్దాయిలను శిక్షింపజేసిన సాక్ష్యం పరిస్థితుల సాక్ష్యం. 'అపరాధ భావన'గా పిలువబడే సాక్ష్యం. దానిని బలపర్చిన ప్రత్యక్ష సాక్షుల సాక్ష్యం- జూరీ తీర్పుకు అవి కారణం" కాబట్టి గాల్డ్ సాక్ష్యానికి విలువ లేదని థేయర్ ప్రకటించాడు. అలాగే పెల్సర్, ఆంద్రూస్‌ల అఫిడవిట్లకు కూడా విలువలేదని తోసిపుచ్చాడు. డిఫెన్స్ లాయర్ మూర్ ప్రవర్తనను థేయర్ తీవ్రంగా విమర్శించాడు. **కాలీ, ఆంద్రూస్, పెల్సర్, గుడ్‌రిడ్జ్ లాంటి నిలకడలేని వ్యక్తుల సాక్ష్యాన్ని ఆధారం చేసుకుని ఇద్దరు మనుషుల ప్రాణాలు తీయడం అన్యాయమని మాత్రం థేయర్ ప్రకటించలేక పోయాడు.**

ఈ పిటీషనన్లు థేయర్ పరిశీలిస్తుండగానే మరో సంచలనాత్మక ఘటన జరిగింది. ప్రభుత్వం తరపున సాక్ష్యం చెప్పిన పోలీసు అధికారి, ప్రముఖ ఆయుధ నిపుణుడు విలియం ప్రాక్టార్ ప్రాసిక్యూటర్లు చేసిన కుట్రను బయట పెట్టాడు శాక్కో రివాల్వర్ నుంచి ప్రాణాంతక తూటా వెలువడిందని తాను నమ్మడం లేదని ప్రకటించి దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించాడు ప్రముఖ బోస్టన్ న్యాయివాది విలియం థామ్సన్* ఎదుట 1923 అక్టోబర్ 20న ప్రాక్టార్ ప్రమాణ పూర్వకంగా ఇలా రాసిచ్చాడు:

> *ఈ కేసులో. . . ప్రాసిక్యూషన్‌తో నాకు సంబంధం ఉంది. అరెస్టయిన సందర్భంలో శాక్కో దగ్గర స్వాధీనం చేసుకొన్న కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నా దగ్గర చాలా కాలం ఉంది. . . . బెరార్డెల్లి శవం నుంచి వెలికి తీయబడినట్లు చెప్పబడిన బుల్లెట్లు నా స్వాధీనంలో ఉన్నాయి. వాటిని నేను చాలా సార్లు బాగా జాగ్రత్తగా పరిశీలించాను వాటిలో ఒకటి తప్ప మిగిలినవన్నీ నేను కోర్టులో సాక్ష్యంలో చెప్పినట్టుగా కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ కాని దాని నుండి పేల్చబడినవే. వాటిలో ఒక్కటి మాత్రం - నేనప్పుడు సాక్ష్యంలో చెప్పినట్టుగా పాయింట్ 32 కాలిబర్ కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడింది. నేనిప్పటికీ దాన్నే నమ్ముతున్నాను*
>
> *కేసు విచారణకు సిద్ధమౌతున్న కాలంలో జిల్లా అటార్నీ, అతని అసిస్టెంట్లూ పదే పదే నన్నిలా ప్రశ్నించారు కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడి బెరార్డెల్లి మృత దేహంలో దొరికిన బుల్లెట్ - శాక్కో నుంచి స్వాధీనం చేసుకున్న కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడిందనే అభిప్రాయాన్ని సమర్ధించే సాక్ష్యాధారాలు నేనేమైనా కనిపెట్టగలిగానా? ఈ విషయంపై ఒక*

---

* అప్పటికి కేసు నుంచి మూర్‌ను పాక్షికంగా తప్పించగా విలియం థామ్సన్ కేసు చేపట్టాడు.

అభిప్రాయానికి వచ్చేందుకు నాకున్న శక్తినంతా ఉపయోగించాను కెప్టెన్ వాన్ ఆంబర్గ్‌తో కలిసి శాక్కొ పిస్టల్‌నుంచి కొన్ని తూటాలు పేల్చి కొన్ని పరీక్షలు నిర్వహించాను. వాటి గురించి నా సాక్ష్యంలో చెప్పి వున్నాను. కానీ బెరార్డెల్లీ శవంలో కనుగొనబడిన - కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడిన నిర్దిష్టమైన బుల్లెట్ (బుల్లెట్ నెం- అనుకుంటాను) శాక్కొ పిస్టల్ నుంచి పేల్చబడిందని నన్ను సంతృప్తి పర్చగల ఎలాంటి సాక్ష్యాన్నీ నేనెప్పుడూ కనుగొనలేక పోయాను. ఆ విషయాన్ని జిల్లా అటార్నీకీ, అతని అసిస్టెంట్లకూ కేసు విచారణకు ముందుగానే చెప్పాను. ఈ బుల్లెట్‌ను ఫుట్ మెటల్ పాచ్ బుల్లెట్ అని పిలుస్తారు. ఈ బుల్లెట్ పై గల గీతలు అది శాక్కొ పిస్టల్ నుంచి పేల్చబడిన బుల్లెట్ అని తనకు నమ్మకం కలిగించాయని కెప్టెన్ వాన్ ఆంబర్గ్ ప్రకటించాడు ఆ గీత లేదా గీతల గురించి ఆయనతో మళ్ళీ మళ్ళీ చర్చించాను బుల్లెట్ పై వున్న గుర్తింపు చిహ్నాల గురించి ఆయన చెప్పిన విషయాలు నన్ను ఏ మాత్రం సమాధానపర్చలేక పోయాయి

ప్రాణాంతక బుల్లెట్‌గా చెప్పబడిన బుల్లెట్ నెం - I శాక్కొ పిస్టల్ నుంచి పేల్చబడిందని నాకేదైనా సాక్ష్యాధారం దొరికిందా అని నన్ను జిల్లా అటార్నీ కేసు విచారణలో అడగలేదు క్రాసు పరీక్షలో కూడా నన్నా ప్రశ్న అడగలేదు. ఆ ప్రశ్న అడగాలని జిల్లా అటార్నీ కోరిక. కానీ అలా అడిగితే నేను 'కాదు' అని సమాధానం చెప్పాల్సి వుంటుందని ఆయనకు పదే పదే చెప్పాను ఫలితంగా ఆయన నాకీ ప్రశ్న వేశాడు:

ప్రశ్న సాక్ష్యంగా ప్రవేశపెట్టబడిన కోల్ట్ ఆటోమేటిక్ మంచి బుల్లెట్ నెం I పేల్చబడిందా అనే దాని గురించి మీకేమైనా అభిప్రాయం ఉందా?

దానికి నేను "ఉంది' అని సమాధానం చెప్పాను. తర్వాత ఆయన ఇలా అడిగాడు.

ప్రశ్న: మీ అభిప్రాయం ఏమిటి?

జవాబు: అది ఆ పిస్టల్‌తో పేల్చబడడానికి అనుగుణంగా ఉందన్నది నా అభిప్రాయం.

ఇప్పటికీ నా అభిప్రాయం అదే. ఎందుకంటే నా అంచనాను బట్టి బుల్లెట్ నెం III ఏదో ఒక కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడిందే. కానీ ప్రాణాంతక బుల్లెట్‌గా చెప్పబడిన ఆ బుల్లెట్ ఆ నిర్దిష్టమైన కోల్ట్ ఆటోమేటిక్ పిస్టల్ నుంచి పేల్చబడిందనేందుకు ఏదైనా సాక్ష్యాన్ని నేను కనుగొన్నానని సూచించేందుకు ఆ సమాధానాన్ని నేను ఉద్దేశించలేదు. నా ఉద్దేశం అది కాదని జిల్లా అటార్నీకి బాగా తెలుసు అందుకే తన ప్రశ్నను అందుకు తగిన విధంగా మలిచాడు. శాక్కొ పిస్టల్ నుంచే ప్రాణాంతక బుల్లెట్ వెలువడిందనేందుకు అనుకూల సాక్ష్యాన్నేదైనా నేను కనుగొన్నానా అని నన్ను నేరుగా అడిగినట్లయితే 'లేదు' అని. . . . చెప్పేవాడిని.

**విలియం. హెచ్. ప్రాక్టార్**

ప్రాక్టార్ బయటపెట్టిన ఈ విషయాలకు పత్రికలు విశేష ప్రాముఖ్యాన్నిచ్చి ప్రచురించాయి. అప్పట్లో అమెరికాలో రెండు లక్షల కోల్ట్ ఆటోమేటిక్ పిస్టళ్ళు ఉన్నాయి. అందులో దేన్నుండయినా బుల్లెట్-III పేల్చబడి వుండవచ్చు. ప్రాక్టార్ ఇలా అభిప్రాయపడగా జిల్లా అటార్నీ కుచ్చితబుద్ధితో కోర్టును, డిఫెన్సు లాయర్లను తప్పుదారి పట్టించగలిగాడు.

ప్రాక్టార్ అఫిడవిట్ ఆధారంగా 1923 నవంబర్ 5న లాయర్ థామ్సన్ పిటీషన్ దాఖలు చేశాడు. శాక్కోను శిక్షింపజేసిన ఆయుధాల సాక్ష్యానికి పసలేదని, అది జిల్లా అటార్నీ సృష్టి మాత్రమేననీ డిఫెన్స్ లాయర్లు పేర్కొన్నారు. శాక్కో, వాంజెట్టి నిర్దోషులని రుజువౌతోందని వాదించారు.

ప్రాక్టార్ అఫిడవిట్‌ను ఖండిస్తూ జిల్లా అటార్నీ కట్జ్‌మన్, అసిస్టెంట్ విలియమ్స్ అఫిడవిట్లు దాఖలు చేశారు. కట్జ్‌మన్ క్లుప్తంగా రాసిన ఆ అఫిడవిట్ ఇలా సాగింది.

*. . . . . . ప్రాణాంతక బుల్లెట్ శాక్కో పిస్టల్ నుంచి పేల్చబడిందనేందుకు అనుగుణంగా ఉందని సాక్ష్యం చెప్పేందుకు తాను సిద్ధమేనని కెప్టెన్ ప్రాక్టార్. . ముందుగా నాకు చెప్పాడు శాక్కో పిస్టల్ నుండి ప్రాణాంతక బుల్లెట్ ప్రయాణించిందని అతనేమైనా సాక్ష్యం కనుగొన్నాడా అని నేను పదే పదే అడగలేదు నేను ఆ ప్రశ్నను అడిగి వున్నట్టయితే లేదు అని సమాధానం చెప్పాల్సి వస్తుందని అతను నాకు పదే పదే చెప్పలేదు*

*ఫ్రెడరిక్ జి కట్జ్‌మన్*

*డెడ్‌హాం, మాస్, 31 అక్టోబర్, 1923*

తన అఫిడవిట్‌లో విలియమ్స్ ఈ సంఘటనను కాస్త వివరంగా ప్రస్తావించాడు. బుల్లెట్-III పై వున్న గుర్తులు అది శాక్కో పిస్టల్ నుంచి పేలింది అని చెప్పేందుకు అనుగుణంగా ఉన్నప్పటికీ, అది ఏ పిస్టల్ నుంచి పేల్చబడిందో చెప్పజాలనని ప్రాక్టార్ తనతో అన్నాడనీ ప్రాక్టార్ అఫిడవిట్‌లో పేర్కొన్న ప్రశ్న ఆయన సూచించిందేననీ విలియమ్స్ పేర్కొన్నాడు.

విలియమ్స్ అఫిడవిట్ ప్రకారం చూసినా ప్రాక్టార్ బయట పెట్టిన కొన్ని సంగతులు నిజమే. విలియమ్స్‌కు ప్రాక్టార్‌కు మధ్య ప్రశ్న సమాధానాలపై ఒప్పందం కుదిరిందని విలియమ్స్ పరోక్షంగా ఒప్పుకున్నాడు. శాక్కో పిస్టల్ నుంచే బుల్లెట్-III పేలిందని ప్రాక్టార్ ఖచ్చితంగా చెప్పలేక పోయాడనీ ఆయనకు ఆ విషయమై కోర్టులో సాక్ష్యం చెప్పే నాటికి కూడా సందేహాలున్నాయని విలియమ్స్ అఫిడవిట్‌లోని సంగతులు విశదం చేస్తున్నాయి.

ఈ పిటీషన్ గురించి వాద ప్రతివాదాలు జరగక ముందే ప్రాక్టార్ హఠాత్తుగా అనారోగ్యంతో చనిపోయాడు. న్యాయమూర్తి థేయర్ ప్రాక్టార్ మోషన్‌ను తోసి పుచ్చాడు. కోర్టులో ప్రాక్టార్ స్పష్టంగానే సాక్ష్యం చెప్పాడనీ, తన సమాధానంలో శాక్కో పిస్టల్ నే సూచించాడనీ, *'అనుగుణంగా'* **(Consistent)** అనే పదం ప్రాక్టార్ స్వయంగా ఎంచుకున్న పదమేననీ థేయర్ తన తీర్పులో తేల్చాడు. ప్రాక్టార్ సమాధానానికి డిఫెన్స్ లాయర్లు చెప్పిన వ్యాఖ్యానాన్ని తాను అంగీకరించడం లేదన్నాడు.

ప్రాక్టార్ పిటీషన్‌కు ముందుగానే, ఆయుధాలు, బుల్లెట్ల గురించిన ప్రాసిక్యూషన్ సాక్ష్యం తప్పని పేర్కొంటూ డిఫెన్స్ లాయర్లు ఒక పిటీషన్ దాఖలు చేసి వున్నారు. హామిల్టన్ అనే ఆయుధ నిపుణుడు చేసిన పరిశోధనల ఆధారంగా ఆ పిటీషన్ వేశారు. అమెరికా అంతటా 165

హత్య కేసుల్లో సాక్ష్యం చెప్పిన హామిల్టన్‌కు పదిహేనేళ్ళ అనుభవముంది. కాంపౌండ్ మైక్రోస్కోప్‌ను శక్తివంతమైన భూతద్దాలను ఉపయోగించి **బుల్లెట్ -III** ని శాక్కొ పిస్టల్ నుంచి పేల్చబడిన మరో బుల్లెట్‌ను హామిల్టన్ ఫోటోలు తీయించాడు. ఆ రెండింటిని పోల్చి చూసి శాక్కొ పిస్టల్ నుంచి **బుల్లెట్-III** పేల్చబడలేదనే నిర్ధారణకు వచ్చాడు **బుల్లెట్-III** పైనున్న గీతలూ, శాక్కొ పిస్టల్ గొట్టం లోపలి చారలూ పొంతన లేకుండా ఉన్నాయని ఆయన నిర్ధారించాడు హామిల్టన్‌కు తోడుగా ఆగస్టస్ గిల్ అనే సాంకేతిక రసాయనిక విశ్లేషకుడిని కూడా డిఫెన్స్ రంగంలోకి దించింది. నేర పరిశోధనా శాస్త్రంతో గిల్‌కు సంబంధం లేనప్పటికీ సూక్ష్మదూరాలను కొలవడంలో అతనికి ప్రావీణ్యం ఉంది

హామిల్టన్, గిల్‌ల పరిశోధనలు తప్పని నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ వాన్ ఆంబర్గ్‌నూ మోర్టన్ రాబిన్సన్ అనే మరో ఆయుధ నిపుణుడినీ వినియోగించింది.

శక్తివంతమైన సూక్ష్మదర్శిని ద్వారా **బుల్లెట్-III** ని శాక్కొ పిస్టల్ నుం॰ పేల్చిన మరో బుల్లెట్‌నూ ఫోటోలు తీశారు ఇరుపక్షాల నిపుణులూ తమ తమ పరిశోధనలను కోర్టుకు సమర్పించారు. హామిల్టన్ గిల్‌ల కొలతలు సరైనవని కోర్టు నమ్మితే శాక్కొ హంతకుడు కాదని నిర్ధారించాలి వాన్ ఆంబర్గ్, రాబిన్‌సన్‌ల కొలతలు సరైనవని అనుకుంటే ఖైదీల పరిస్థితిలో మార్పుండదు.

ఈ పిటీషన్‌ను కూడా థేయర్ తోసిపుచ్చాడు. ముద్దాయిలు లేవనెత్తిన అంశాలను సాక్ష్యాధారాలు నిరూపించలేదన్నాడు అయితే ప్రాసిక్యూషన్ తరపు నిపుణులు చెప్పింది నిజమని కూడా ఆయన పేర్కొనలేదు. దాన్ని అలా వదిలేయడమంటే ముద్దాయిలు సహేతుకమైన సందేహాన్ని లేవనెత్తారని పరోక్షంగా అంగీకరించినట్టవుతుంది. అలాంటిది జరిగితే న్యాయశాస్త్రరీత్యా తిరిగి కేసును విచారించమని న్యాయమూర్తి ఆదేశించాల్సి ఉంటుంది.

హామిల్టన్ మోషన్‌పై విచారణ జరుగుతున్న కాలంలో (1923లో) హామిల్టన్ చేసిన ఒక పని వల్ల శాక్కొ, వాంజెట్టిలు విడుదల కావల్సింది. కానీ న్యాయమూర్తి థేయర్ సమయస్ఫూర్తి వల్ల అది కొద్దిలో తప్పి పోయింది. కేసు చరిత్రలో మరుగున పడి పోయిన ఆ ఘటన ఇలా జరిగింది.

శాక్కొ పిస్టల్ పై పరిశోధన కొనసాగిస్తున్న రోజుల్లో ఒక రోజు హామిల్టన్ కోర్టుకు మరో రెండు పిస్టళ్ళను తెచ్చాడు అవి అచ్చు శాక్కొ పిస్టళ్ళను పోలి వున్నాయి. శాక్కొ పిస్టల్‌ను కోర్టు నుంచి హామిల్టన్ తీసుకుని పిస్టల్ భాగాలు ఒకదానితో ఒకటి ఎలా మార్పిడి చేయవచ్చో చూపించాడు శాక్కొ పిస్టల్ భాగాలను తాను తెచ్చిన పిస్టల్‌లోకి, తన పిస్టల్ భాగాలను శాక్కొ పిస్టల్‌లోకి ఎవరికీ తెలియకుండా మార్చాడు అలా శాక్కొ బారెల్ తన పిస్టల్‌లో పెట్టుకొని కోర్టు నుంచి నిష్క్రమించేందుకు ప్రయత్నించాడు. న్యాయమూర్తికి ఎందుకో అనుమానం వచ్చి హామిల్టన్ దగ్గరున్న రెండు పిస్టళ్ళనూ కోర్టులో ఉంచి వెళ్ళమని చెప్పాడు. కొన్నాళ్ళకు ప్రాసిక్యూషన్ తరపు ఆయుధ నిపుణులు శాక్కొ పిస్టల్‌లో కొత్త బారెల్ ఉందని కనుగొన్నారు. హామిల్టన్ కోర్టుకు అప్పగించిన పిస్టల్‌లో పాత బారెల్ ఉందని చూపించారు.

ఆ రోజున హామిల్టన్ తన పాటికి తాను వెళ్ళగలిగినట్లయితే శాక్కొ రివాల్వర్ నుంచి బారెల్ గల్లంతయి వుండేది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల్లో శాక్కొ రివాల్వర్ నుంచి ప్రాణాంతక బుల్లెట్ *(బుల్లెట్ -III)* పేల్చబడలేదని ప్రకటించబడి ఉండేది కేసును కొట్టి వేయాల్సి వచ్చేది

ఈ విషయమై థేయర్ విచారణ జరిపాడు. శాక్కొ పాత బారెల్ కొత్త హామిల్టన్ రివాల్వర్‌లోకి మారిందని అధికారికంగా నిర్ధారించి ఫైల్ మూసేయడంతో ఆ కథ అలా ముగిసింది డిఫెన్స్ లాయర్ మూర్ 'పని తనానికి ' ఈ ఘటనను ఒక ఉదాహరణగా ప్రస్తావిస్తారు.

డాలీ-రిప్లే పిటీషన్‌తో సహా ఆ తర్వాత వేసిన అన్ని పిటీషన్లపైనా 1924 అక్టోబర్ 1నే థేయర్ విడివిడిగా తీర్పు చెప్పాడు. (థేయర్ అనారోగ్య కారణంగా అప్పటి వరకూ తీర్పు వాయిదా పడుతూ వచ్చింది ) ఏ పిటీషన్‌కు ఆ పిటీషన్‌ను విడివిడిగా పరిశీలించి థేయర్ వాటినన్నిటినీ తోసి పుచ్చాడు. అలాకాక, వాటన్నిటినీ ఉమ్మడిగా పరిశీలించి వాటి ఉమ్మడి ప్రభావాన్ని అంచనా వేసి తీర్పు చెప్పడం సబబైన చర్య అని ప్రొఫెసర్ ఎడ్మండ్ మోర్గన్ విమర్శించాడు. అలా అంచనా వేస్తే మరోసారి విచారణ జరిపేందుకు ఆ సాక్ష్యాధారాలు దోహదం చేసి ఉండేవని మోర్గన్ అభిప్రాయం.

# 4

**కొ**త్తగా విచారణ జరపమని థేయర్‌ను అభ్యర్థిస్తూ పిటీషన్లు దాఖలైన కాలంలోనే శాక్కొకు లాయర్ మూర్‌కు మధ్య అప్పటికే ఉన్న మనస్పర్ధలు బాగా ఎక్కువయ్యాయి. మూర్‌ను తన లాయర్‌గా నియమించడం శాక్కొకు మొదటి నుంచీ ఇష్టంలేదు. అయినప్పటికీ, ఐ డబ్ల్యు.డబ్ల్యు స్థాపకురాలైన మేడమ్ ఎలిజబెత్ గుర్లీ ఫ్లిన్ సిఫార్సు వల్ల మూర్ శాక్కొకు లాయర్‌గా నియమించబడ్డాడు. సాక్ష్యులను బెదిరించి అఫిడవిట్లు సంపాయించడం, హామిల్టన్‌ను ప్రోత్సహించి పిస్టల్ లోని బారెల్ మార్చడం లాంటి పనులు అప్పటికే మూర్‌కున్న ప్రతిష్ఠనుమరింత దిగజార్చగా ఇక అతన్ని లాయర్‌గా కొనసాగించడం మంచిది కాదని శాక్కొ నిర్ణయించుకున్నాడు.

1923 మార్చి 10న లాయర్లు విలియం థామ్సన్, ఆర్థర్‌హిల్ ఒక పిటీషన్‌పై శాక్కొ వాంజెట్టిల తరపున సంతకం పెట్టడంతో ఈ కేసులో మూర్ గుత్తాధిపత్యానికి గండిపడింది అదే కాలంలో శాక్కొ- వాంజెట్టి డిఫెన్స్ కమిటీతో మూర్‌కున్న విబేధాలు కూడా ముదిరి పాకాన పడ్డాయి. మేడమ్ ఎలిజబెత్ ఎవాన్స్, జాన్ కోడ్‌మన్‌లను కలుపుకుని మూర్ డిఫెన్స్ కమిటి నుంచి వైదొలగాడు. 1924 ఏప్రిల్‌లో *న్యూట్రయల్ లీగ్* పేరిట వారు మరో సంస్థను ఏర్పాటు చేశారు ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్ కూడా ఈ లీగ్‌లో చేరాడు. ఒక కరపత్రం, ఒక న్యూస్ బులెటిన్ ప్రచురించి అనతికాలంలోనే ఈ *లీగ్* కాలగర్భంలో కలిసిపోయింది. మూర్ మినహా మిగిలిన సభ్యులంతా తిరిగి డిఫెన్స్ కమిటిలో చేరి చివరివరకూ పని చేశారు.

1924 ఆగస్టు 18న శాక్కొ మూర్‌కు రాసిన ఒక లేఖలో తన కేసు నుండి తప్పుకోవలసిందని కరాఖండిగా చెప్పాడు. తన ఇష్టానికి వ్యతిరేకంగా తన లాయర్‌గా మూర్ కొనసాగడాన్ని శాక్కొ ఖండించాడు. మూర్ తనకు శత్రువని, మిత్రుడు కాదని శాక్కొ ప్రకటించాడు.

శాక్కొ లేఖ తర్వాత కేసు నుండి వైదొలగడం మంచిదని డిఫెన్స్ కమిటి మూర్‌కు విజ్ఞప్తి చేసింది. అప్పటికే కమిటీ డబ్బును మూర్ విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ పెను భారంగా కూడా తయారయ్యాడు. శాక్కొ మాటలనేకాక, డిఫెన్స్ కమిటి విజ్ఞప్తిని కూడా మూర్ పెడచెవిన పెట్టాడు. ఇక లాభం లేదని కమిటి నాయకులు మేడమ్ గుర్లీ ఫ్లిన్‌ను ఆశ్రయించారు. థేయర్ ముందు దాఖలయిన పిటీషన్లలో ఏది విజయవంతమైనా తిరిగి కేసు విచారిస్తారని మూర్ ఎదురు చూశాడు. ఆ పిటీషన్లలో కొన్నిటిని మూర్ దాఖలు చేసినప్పటికీ చివరికి వాదన మాత్రం లాయర్లు థామ్సన్, హిల్ చేశారు. పిటీషన్లు తోసి పుచ్చిన నెల తర్వాత మేడమ్ గుర్లీ ఫ్లిన్ జోక్యంతో 1924 నవంబర్ 8న మూర్ కేసునుంచి పూర్తిగా వైదొలిగాడు. మరోనెలకు మెక్ ఎనార్నీ సోదరులు కూడా కేసు నుంచి తప్పుకోగా లాయర్ థామ్సన్ పూర్తిగా కేసును చేపట్టాడు.

శాక్కొ - వాంజెట్టి కేసు నుంచి వైదొలగడం మూర్‌ను మానసికంగా బాగా కుంగదీసింది. తన సారాన్ని తన నుంచి తీసేసినట్టుగా బాధపడ్డాడు. ఒకవిధంగా తను సృష్టించిన ఈ కేసును చివరిదాకా వాదించకుండానే అతను కనుమరుగు కావాల్సి వచ్చింది. శాక్కొ, వాంజెట్టికి సంబంధించినంతవరకూ మూర్ నిష్క్రమణ చాలా ఆలస్యమైనట్టు లెక్క.

జీవితం చరమదశలో పేదరికంతో బాధపడ, స్టిక్కర్లు అమ్మి జీవిస్తూ పదేళ్ళ తర్వాత మూర్ కాన్సర్‌తో చనిపోయాడు.

# మెడైరోస్ - మోరెల్లి

**డెడ్‌హాం జైల్లో** శాక్కోను నిర్బంధించిన సెల్ పక్క సెల్‌లో సెలెస్టినో మెడైరోస్ అనే ఇరవైనాలుగేళ్ళ యువ పోర్చుగీసు ఖైదీ ఉండేవాడు రెంథమ్ పట్టణంలో నేషనల్ బాంక్ పై దాడిచేసి డబ్బు దోచుకునేందుకు ప్రయత్నించి బాంక్ కాషియర్‌ను హతమార్చిన కేసులో అతను నిందితుడు ఆ నేరంలో పాల్గొన్న అతని మిత్రులు - జేమ్స్ వీక్ ఫ్రెడ్ బెరార్డ్ నేరం ఒప్పుకోగా వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు మెడైరోస్ పై మాత్రం కేసు విచారణ జరగాల్సి ఉంది అందుకోసం అతనిని 1925 నవంబర్‌లో డెడ్‌హాం జైలుకు తరలించారు.

శాక్కోతో మాట్లాడేందుకు మెడైరోస్ అనేకసార్లు ప్రయత్నించినా శాక్కో పట్టించుకోలేదు కొందరు గూఢచారులను ఖైదీల వేషంలో నియమించి ప్రభుత్వం తనపై కన్ను వేసి వుంచిందని శాక్కో అనుమానించాడు.* అందువల్ల మెడైరోస్‌తో మాట్లాడేందుకు అతను ఇష్టపడలేదు తనకు తెలిసిన ఒక కుర్రవాడు సౌత్ బ్రెయిన్‌ట్రీ హత్యలు చేసిందెవరో అమాకీ చెప్పగలడని మెడైరోస్ ఒక సందర్భంలో శాక్కోకు చెప్పాడు. అయినా శాక్కో విని ఊరుకున్నాడే తప్ప దాని గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు రాండాల్ఫ్ పట్టణంలో ఆ కుర్రవాడున్న ఇంటిని దాని పరిసరాలను రేఖా చిత్రంగా గీసి మెడైరోస్ శాక్కోకు అందజేశాడు. శాక్కో దాన్ని చెత్తబుట్టలో పడేశాడు

కొన్నాళ్ళ తర్వాత మెడైరోస్‌ను శాక్కో గది కింది అంతస్తులోకి మార్చారు. స్నానాల గదుల దగ్గరా, కారిడార్‌లో, వ్యాయామం చేసేటప్పుడు శాక్కోతో మాట్లాడాలని మెడైరోస్ విఫలయత్నం చేశాడు. "నిక్, సౌత్ బ్రెయిన్ ట్రీ హంతకులెవరో నాకు తెలుసు" అని కింద నుంచి కేకలేసి మరీ శాక్కోతో చెప్పేవాడు. కానీ శాక్కో అతనిని ఆకతాయిగా పరిగణించి ఆ మాటలను విశ్వసించలేదు.

* *ఈ అనుమానానికి ఆధారాలు లేకపోలేదు డెడ్‌హాం జైల్లో శాక్కో పక్క గదిలో ప్రభుత్వం ఒక గూఢచారిని నియమించింది 1920 సెప్టెంబర్‌లో జరిగిన వాల్‌స్ట్రీట్ బాంబింగ్స్ గురించిన సమాచారం శాక్కో నుంచి రాబట్టేందుకు ఆ గూఢచారి నియమించబడ్డాడు వాల్‌స్ట్రీట్ బాంబింగ్స్‌కు పాల్పడింది మిక్ బోడా అని పాల్ ఆరిచ్ రాశారు*

కొంతకాలానికి 'రెంధమ్ బాంక్ కాషియర్ హత్య కేసు' లో మెడైరోస్‌కు కోర్టు మరణ శిక్ష విధించింది ఆ తీర్పుపై సుప్రీం జుడీషియల్ కోర్టులో అతను అప్పీలు దాఖలు చేశాడు.

బ్రెయిన్‌ట్రీ హత్యల గురించి తనకు తెలిసిన వివరాలను శాక్కోకు చెప్పేందుకు పలు విధాల ప్రయత్నించి విఫలమైన మెడైరోస్ చివరికి రాత పూర్వకంగా తెలియజేసేందుకు నిర్ణయించుకున్నాడు 1925 నవంబర్ 16న ఒక కాగితం మీద ఇలా రాశాడు.

***సౌత్ బ్రెయిన్‌ట్రీ షూ కంపెనీ నేరంలో నేను పాల్గొన్నానని, శాక్కో, వాంజెట్టి అందులో లేరనీ ఇందుమూలంగా నేను ఒప్పుకుంటున్నాను.***

తను రాసిన ఆ ఒప్పుకోలు ప్రకటనను బోస్టన్ అమెరికన్ దినపత్రికకు పంపవలసిందిగా అతను జైలు అధికారులను కోరాడు. కానీ, జైలు అధికారులు అందుకు సహకరించలేదు. తర్వాత రెండు రోజులకు ఒక దినపత్రిక అంచుపై అదే విధంగా రాసి శాక్కోకు పంపాడు. ఈసారి శాక్కో దాన్ని కాస్త సీరియస్‌గా తీసుకున్నాడు. డిఫెన్స్ కమిటీకి ఆ దినపత్రికను అందజేశాడు

దాన్ని చూసిన వెంటనే డిఫెన్స్ లాయర్లు అప్రమత్తులయ్యారు. హుటాహుటిన రంగంలోకి దూకారు లాయర్ థామ్సన్ తక్షణమే జైలును సందర్శించి మెడైరోస్‌ను కలిశాడు. మెడైరోస్ ఆశ్చర్యకరమైన సంగతులనేకం బయట పెట్టాడు. థామ్సన్ ఆనందానికి అవధుల్లేకపోయింది. శాక్కో సమక్షంలో మెడైరోస్ చెప్పిన సంగతులు వెంటనే అఫిడవిట్‌గా రూపు దాల్చాయి·

*1920 ఏప్రిల్ 15 తెల్లవారుజామున సుమారు నాలుగు గంటలకు ప్రావిడెన్స్‌లోని నార్త్ మెయిన్ స్ట్రీట్‌లో . ఉండగా హడ్సన్ కారులో వచ్చిన నలుగురు ఇటాలియన్లు నన్ను పిల్చుకెళ్ళారు ...*

*ప్రావిడెన్స్ నుంచి రాండాల్ఫ్ వెళ్ళాం. అక్కడ ఒక ఇటాలియన్ తెచ్చిన బూయిక్ కారులోకి మారాం హడ్సన్ కారును చెట్లతోపులో వదిలేసి నేరం చేశాక దాన్ని తిరిగి తీసుకున్నాం. బూయిక్ కారును ఆ చెట్ల తోపులోనే వదిలేసి ఒకరికి అప్పజెప్పాం.........*
*మొదట మేం ప్రావిడెన్స్ నుంచి బోస్టన్‌కు వెళ్ళాం మళ్ళీ ప్రావిడెన్స్‌కు వచ్చాం .... సౌత్ బ్రెయిన్‌ట్రీకి మధ్యాహ్నానికి తిరిగొచ్చాం ...... ఒక బార్‌లో కొంతసేపు గడిపాం. నేరస్థలం అక్కడికి రెండు మూడు మైళ్ళ దూరంలో ఉంటుంది మేం బోస్టన్‌కు వెళ్ళినప్పుడు సౌత్ బోస్టన్‌లోని ఆండ్రూస్ స్క్వేర్‌లో ఆగాం. నేను కారులో ఉండిపోయాను... .. మిగిలినవాళ్ళు సౌత్ బ్రెయిన్‌ట్రీకి వెళ్ళే డబ్బు గురించిన సమాచారం కోసం ఒక క్లబ్బులోకి వెళ్ళారు. (అలా అని వాళ్ళే నాకు చెప్పారు)*

*అంతకుముందు సౌత్ బ్రెయిన్‌ట్రీకి నేనెప్పుడూ వెళ్ళలేదు. ఈ నలుగురూ అంతకు మునుపు ప్రావిడెన్స్‌లో ఒక క్లబ్బులో కలిసినప్పుడు.. బ్రెయిన్‌ట్రీ వెళ్దామని నన్నడుగుతూ*

వచ్చారు     వాళ్ళు ఆరితేరిన నేరస్తుల్లా కనిపించారు  ఇలాంటి పనులెన్నో చేశామని వాళ్ళు చెప్పారు  ప్రావిడెన్స్‌లో సరుకు రవాణా చేసే వాహనాలను దోచుకోవడం వాళ్ళపని  ఇద్దరికి 20 నుంచి 25 ఏళ్ళుంటాయి  సుమారు 40 ఏళ్ళ వాడొకడు  మిగిలిన వాడికి సుమారు 35 సంవత్సరాలుంటాయి  . వాళ్ళంతా టోపీలు పెట్టుకున్నారు  వాళ్ళలో అందరికంటే పెద్దవాడూ మరొకడూ కాల్పులు జరిపారు - డబ్బు పంచుకొనేందుకోసం  తర్వాత  రాత్రి మేము ప్రావిడెన్స్ క్లబ్బులో కలవాలని అనుకున్నాం  నేనక్కడికి వెళ్ళాను  కానీ వాళ్ళు రాలేదు కారులో నేను వెనక సీట్లో కూర్చున్నాను. నా దగ్గర పాయింట్ 38 కాలిబర్ కోల్ట్ ఆటోమేటిక్ ఉంది  కానీ నేను దాన్ని ఉపయోగించలేదు  జనం మా మీద దాడి చేస్తే తరిమికొట్టేందుకై నన్నక్కడ ఉంచినట్టు చెప్పారు     షాట్‌గన్ కానీ  రైఫిల్ కానీ కారులో ఉందో లేదో గుర్తు లేదు

వాళ్ళు న్యూయార్క్ గురించి చాలా  మాట్లాడారు కాబట్టి నా దగ్గర డబ్బు మెసలగానే నేను న్యూయార్క్‌కు, చికాగోకు వెళ్ళాను  వాళ్ళు జల్సా చేస్తూ క్లబ్బుల్లో కన్పిస్తారేమోనని ఆశించాను కానీ వాళ్ళసలు కన్పించలేదు

పట్టు  షూస్, బట్టలు వగైరా సరుకులను రవాణా చేసే వాహనాలను దోచుకునే పని చేస్తూ దొంగ సొత్తును వాళ్ళు న్యూయార్క్ పంపేవారు  సౌత్ మెయిన్ స్ట్రీట్‌లో ఇద్దరు, నార్త్ మెయిన్ స్ట్రీట్‌లో ఇద్దరు లాడ్జిలలో ఉండేవారు  నాకు వాళ్ళు మూడు నాలుగు నెలలుగా తెలుసు పెద్దవాడిపేరు మైక్  ఒకడి  పేరు విలియమ్స్ లేదా బిల్  మిగిలిన వాళ్ళ పేర్లేంటో నాకు తెలియదు

సౌత్ బ్రెయిన్‌ట్రీలో దోచుకున్న డబ్బు నల్లటి సంచిలో ఉందనుకుంటాను
కాల్పులు ప్రారంభం కాగానే నాకు చచ్చేంత భయమేసింది
రెండు కార్లకూ మసాచూసెట్స్ నంబర్లే ఉన్నాయి
వీళ్ళ  పేర్లు  అణాకాణీ  చెయ్యవు.  పేర్లను  వాళ్ళిష్టమొచ్చినట్టు  మార్చుకుంటారు  . వాళ్ళిప్పుడెక్కడున్నారో నాకు ఏ మాత్రం తెలియదు  ఇంతవరకూ వాళ్ళలో ఎవర్నీ నేను మళ్ళీ చూడలేదు

ఈ పనికి శాక్కొ, వాంజెట్టిలకి ఏ సంబంధం లేదు ...

- సెలెస్టినో మెడైరోస్.

ఈ అఫిడవిట్‌కు మెడైరోస్ తర్వాత కొన్ని సవరణలు చేశాడు. నేరస్తుల పేర్లు, అడ్రస్‌లు కావాలనే తప్పు చెప్పానన్నాడు.

మెడైరోస్ ప్రకటించిన వివరాలు సంచలనం సృష్టించాయి. శాక్కొ, వాంజెట్టిలను బయట పడేసేందుకు గొప్ప ఆధారాలు దొరికాయని డిఫెన్స్ కమిటీ ఆనందించింది. మెడైరోస్ చెప్పిన వివరాల ఆధారంగా పరిశోధిస్తే అసలు హంతకులను కనిపెట్టడం కష్టం కాకపోవచ్చునని డిఫెన్స్ లాయర్లు భావించారు.

మెడైరోస్ కేసులో అప్పీలు సుప్రీం జుడీషియల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నందువల్ల అతను చెప్పిన విషయాలపై ఎలాంటి తదుపరి చర్యలూ చేపట్టరాదని డిఫెన్స్ లాయర్ థామ్సన్ ప్రాసిక్యూటర్ ఒక అంగీకారానికి వచ్చారు. బాంక్ కాషియర్ హత్య కేసులో అతనిపై తుది తీర్పు వెలువడకముందే సౌత్‌బ్రెయిన్ ట్రీ హత్యలో అతనున్నాడని నిర్ధారించబడితే, దాని ప్రభావం అతని అప్పీలు విచారిస్తున్న జడ్జిపై పడి అతనికి హాని జరగవచ్చని వాళ్ళు అలా అంగీకారానికి రావాల్సి వచ్చింది.

'రెంధమ్ బాంక్ కాషియర్ హత్యకేసు లో మెడైరోస్‌పై కింది కోర్టు తీర్పును 1926 మార్చి 31న సుప్రీం జుడీషియల్ కోర్టు కొట్టివేసింది. కేసును తిరిగి విచారించాలని ఆదేశించింది ఫలితంగా శాక్కో - వాంజెట్టి కేసులో మెడైరోస్ చెప్పిన విషయాలను మరికొంత కాలం మరుగున ఉంచాల్సి వచ్చింది

రెంధమ్ కేసులో మెడైరోస్‌పై మొదటి సారి విచారణ జరిపిన జడ్జి చేసిన ఒక సాంకేతికలోపం* వల్ల అతని కేసును తిరిగి విచారించాల్సిందిగా సుప్రీం జుడీషియల్ కోర్టు ఆదేశించింది. రెండవ సారి కేసు విచారణ 1926 మే 15న ప్రారంభమైంది శాక్కో వాంజెట్టిల లాయర్లు థామ్సన్ హెర్బర్ట్ ఎహర్మన్ ఆ కేసు విచారణకు హాజరై ఆసాంతం గమనించారు ఎహర్మన్ మెడైరోస్‌ను కోర్టులో చూసినప్పటి తన జ్ఞాపకాలను ఇలా పేర్కొన్నాడు:

> *బోనులో బల్ల మీద వంగిపోయి కూర్చుండటం వల్ల అప్పుడు నాకతను దాదాపు నరవానరంలా కనిపించాడు అతను మనిషిగా నాకు తెలిసే సరికి ఈ అభిప్రాయం పూర్తిగా మారిపోయింది విచారణ జరిగే సమయంలో అతను నిశ్చలంగా ఉండేవాడు. చివరికి, అతని తల్లికి మూర్ఛవచ్చి సాక్షి బోనునుంచి పడిపోగా ఆమెను బయటికి మోసుకుపోతున్నప్పుడు కూడా అతను అలాగే ఉన్నాడు.*

అప్పుడు మెడైరోస్ చట్ట ప్రకారం నిర్దోషిగా కోర్టులో నిల్చున్నట్టు లెక్క. ఆ కాలంలో కూడా అతను సౌత్ బ్రెయిన్‌ట్రీ నేరంలో తను పాల్గొన్న విషయం నుంచి వైదొలగక పోవడం విశేషం.

రెంధమ్ హత్యకేసులో మెడైరోస్‌కు మరణశిక్ష విధిస్తూ 1926 మే 20న కోర్టు రెండవ సారి తీర్పు చెప్పింది. అది జరిగిన రెండురోజులకు, మెడైరోస్ సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం గురించి ప్రకటించిన కథనంపై పరిశోధనకు శాక్కో - వాంజెట్టి డిఫెన్స్ కమిటి తన లాయర్లను రంగంలోకి దించింది.

ఈ పరిశోధనలో తమతో పాటు పాల్గొనవలసిందిగా లాయర్ థామ్సన్ ప్రభుత్వానికి సూచించాడు. ఈ సూచనను మసాచూసెట్స్ రాష్ట్ర అటార్నీ జనరల్ సమర్థించినప్పటికీ

---

* *ఎలాంటి సందేహానికి తావు లేకుండా నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించేంత వరకూ మెడైరోస్ నిర్దోషిగా పరిగణించాలి న్యాయమూర్తి జూరీకి చెప్పడం మర్చిపోవడం ఈ కేసులో లోపం.*

కట్జ్‌మన్ స్థానంలో నార్‌ఫోక్ కౌంటీ జిల్లా అటార్నీగా పదవీ బాధ్యతలు చేపట్టిన విన్ ఫీల్డ్ విల్బర్ మాత్రం అందుకు ఒప్పుకోలేదు డిఫెన్స్ లాయర్లతో కలిసి కాకపోయినా, విడిగానైనా జిల్లా అటార్నీ తన పరిశోధన కొనసాగిస్తాడని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. మెదైరోస్ కథనంపై జిల్లా అటార్నీ కార్యాలయం ఎలాంటి నేరపరిశోధనా చేపట్ట లేదు కాని మెదైరోస్ కథనాన్ని ఖండించడం కోసం మాత్రం తన శక్తి యుక్తుల్ని కేంద్రీకరించింది

జిల్లా అటార్నీకి లాయర్ థామ్సన్ మరో ప్రతిపాదన చేశాడు. తమతో కలిసి జైల్లో మెదైరోస్ సాక్ష్యాన్ని నమోదు చేసేందుకు రమ్మని ఆహ్వానించాడు అందుకు జిల్లా అటార్నీ అంగీకరించాడు ప్రాసిక్యూషన్ తరపున డడ్లీరానీ మెదైరోస్‌ను క్రాసు పరీక్ష చేశాడు. ఇది 1926 జూన్ 28న జరిగేనాటికి మెదైరోస్ తనపై వచ్చిన రెండవ తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన అప్పీలు పెండింగ్‌లో ఉంది అయినప్పటికీ అతను నిర్భయంగా సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం గురించిన వివరాలు చెప్పాడు.

మెదైరోస్ చెప్పిన వివరాలను బట్టి ప్రభుత్వం పరిశోధన చేసి వుంటే సమాచారం సంపూర్ణంగా దొరికే అవకాశం ఉండేది. కాని వాళ్ళు ఆ పని చేయకపోవడంతో ఏ హంగులూ లేని, నేరపరిశోధనలో నైపుణ్యం కూడా లేని డిఫెన్స్ లాయర్లు థామ్సన్ ఎహర్మన్‌లు తమదికాని ఆ పనిని చేపట్టక తప్పలేదు

## 2

హెర్బర్ట్ ఎహర్మన్ యువకుడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టాపుచ్చుకొని అప్పటికి కొద్ది సంవత్సరాల క్రితమే లాయర్‌గా ప్రాక్టీస్ పెట్టివున్నాడు శాక్కో-వాంజెట్టి కేసులో నేరపరిశోధనకు ఎహర్మన్ బాగా పనికొస్తాడని హార్వర్డ్ లాస్కూల్ డీన్ రస్కో పౌండ్ చెప్పిన మేరకు థామ్సన్ ఆయనను వినియోగించాడు. తన భార్య మేడమ్ సారాతో కలిసి ఎహర్మన్ అమెరికా అంతటా పర్యటించి అనేక నెలల శ్రమ కోర్చి సమాచార సేకరణ చేశాడు.*

ఈ నేరపరిశోధనా .బాధ్యతలు చేపట్టే నాటికి అతనికి తెలిసింది మెదైరోస్ చెప్పిన అర్ధసత్యాలే. మెదైరోస్ అఫిడవిట్‌ను బట్టి అతని సాక్ష్యంలోని సంగతులను బట్టి సౌత్ బ్రెయిన్ ట్రీ బందిపోట్ల నివాసం ప్రావిడెన్స్ వాళ్ళు బట్టలు చెప్పులు దొంగిలిస్తారు అదే నిజమైతే కొంత ప్రయత్నిస్తే ఆ ముఠా ఆచూకీని కనిపెట్టడం కష్టం కాకపోవచ్చు ఈ ఊహే ఎహర్మన్‌కు కొండంత ఉత్సాహాన్నిచ్చింది హుటాహుటిన ప్రావిడెన్స్‌కి బయల్దేరి వెళ్ళాడు.

ప్రావిడెన్స్ పోలీసు చీఫ్ ఇన్స్‌పెక్టర్ కొనార్స్‌ను కలిశాడు. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను దోచుకునే

---

* *ఈ పరిశోధన గురించిన తన అనుభవాలను ఎహర్మన్ గ్రంధస్తం చేశాడు ద అన్‌ట్రైడ్ కేస్ పేరిట 1933 లో అది అచ్చయింది.*

ముఠా ఒకటి 1919-20 ప్రాంతంలో అక్కడున్న మాట నిజమేనని కొనొర్స్ చెప్పాడు. దానిని మోరెల్ ముఠా అంటారు. మోరెల్ లేదా మోరెల్లి అనే వ్యక్తి, అతని సోదరులూ అందులో సభ్యులు.

*"వాళ్ళు ఇటాలియన్లా?"*

*"అమెరికాలో పుట్టిన ఇటాలియన్లు"*

మెడైరోస్ కథనంలోని రెండు విషయాలు నిర్ధారించబడ్డాయి. బట్టలు, చెప్పులు దొంగతనం చేసే దోపిడి ముఠా ప్రావిడెన్స్‌లో ఉంది. ఆ ముఠా సభ్యులు ఇటాలియన్లు.

కొనొర్స్ సమాచారం ప్రకారం వాళ్ళు అమెరికాలో పుట్టారు. కాబట్టి ఇంగ్లీషు బాగా వచ్చి వుంటుంది. సౌత్ బ్రెయిన్ ట్రీ కేసులో సాక్షులు కూడా హంతకులు స్వచ్ఛమైన ఇంగ్లీషు మాట్లాడారని చెప్పివున్నారు.

ఆ ముఠా సభ్యులు సౌత్‌బ్రెయిన్‌ట్రీ హత్యలు జరిగినప్పుడు జైల్లో ఉన్నారా? బయటున్నారా?

ఒక అర గంటసేపు ఇన్‌స్పెక్టర్ కొనొర్స్ పోలీసు రికార్డులు తిరగేశాడు. ముఠా సభ్యుల్లో ఎక్కువ మంది 1920 ఏప్రిల్ నెలలో బెయిల్ మీద ఉన్నారని చెప్పాడు. సౌత్ బ్రెయిన్‌ట్రీ నేరం జరిగిన కొన్నాళ్ళకు మోరెల్ ముఠా సభ్యులపై ప్రావిడెన్స్ కోర్టులో ఒక క్రిమినల్ కేసులో విచారణ జరిగింది కూడా. ఇది ఎహర్మన్ సమాచారానికి మరికొంత బలాన్నిచ్చింది. ఎందుకంటే, కేసులో లాయర్లకు డబ్బిచ్చుకునేందుకు వృత్తి నేరస్తులు తిరిగి కొత్త నేరాలు చేస్తుంటారు.

ఎహర్మన్‌కు ఉపయోగపడే రెండు ఫోన్ నెంబర్లు కూడా ఇన్‌స్పెక్టర్ ఇచ్చాడు. ఒకటి మాజీ మార్షల్ జనరల్ జాన్ రిచర్డ్స్‌ది. మరొకటి మోరెల్లిల నివాస ప్రాంతమైన న్యూబెడ్‌ఫోర్డ్ పోలీసు అధికారి కెప్టెన్ రాల్ఫ్ పియెరాసినిది.

ఎహర్మన్ తన పరిశోధనలో భాగంగా న్యూయార్క్, న్యూ బెడ్ ఫోర్డ్, లీవెన్ వర్త్, కాన్సాస్, ఆబర్న్ తదితర ప్రాంతాలను సందర్శించాడు. జైళ్ళను, కోర్టులను, నేరస్తులకు నిలయాలైన క్లబ్బులను, బార్లను సందర్శించి సమాచారం సేకరించాడు. మరోవైపు థామ్సన్ కూడా బోస్టన్‌లో, రాండాల్ఫ్‌లో తిరుగుతూ మరికొంత సమాచారం సంపాదించాడు.

రెంథమ్ కేసులో శిక్ష అనుభవిస్తున్న మెడైరోస్ సహచరుడు జేమ్స్‌వీక్స్ నుంచి థామ్సన్ కొంత విలువైన సమాచారం రాబట్టాడు:

*మెడైరోస్ తరచుగా నాతో సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యల గురించి చెప్పాడు. జోమోరెల్లి ముఠా దానికి పథకం వేసిందని చెప్పాడు. మెడైరోస్ చెప్పిన దాన్ని బట్టి, నాకు స్వయంగా తెలిసిన దాన్ని బట్టి ఆ ముఠా సభ్యులు వీళ్ళు: మోరెల్ లేదా మోరెల్లి సోదరులు - వాళ్ళ పేర్లు మైకేల్ (మైక్ అంటారు), జోసెఫ్(జో అని పిలుస్తారు), పాస్టీ (అసలు పేరు పాస్కేల్), ఫ్రెడ్ (బస్టీ అంటారు), ఫ్రాంక్‌బిల్ అని పిలువబడే ఒక మనిషి కూడా ఉన్నాడు.... బిబ్బర్ బరోన్ కూడా ముఠా సభ్యుడే.... వాళ్ళ కేంద్ర స్థానం ప్రావిడెన్స్.... ముఠా అధిపతి 'జో' అని మెడైరోస్ చెప్పాడు....*

శాక్కొ-వాంజెట్టి కేసు గురించి కూడా మెడైరోస్ తరచుగా వీక్స్‌కు చెప్పేవాడు. వాళ్ళకు శిక్షంటూ పడితే వాళ్ళను కరెంటు కుర్చీ దగ్గరికి తీసుకెళ్ళక ముందే తాను వెళ్ళి నేరం ఒప్పుకుంటానని కూడా చెప్పేవాడు. "శాక్కొ భార్యా పిల్లలను చూసి అతను జాలి పడ్డాడు."

మెడైరోస్ జీవితం నేరాలతో, హింసతో పూర్తిగా పెనవేసుకుపోయింది. తన తోటి నేరస్తుల పేర్లను ఎలాంటి పరిస్థితిలోనూ బయటపెట్టకూడదనే అధోజగత్ నియమాన్ని అతను ఉల్లంఘించ దలుచుకోలేదు. శాక్కొ, వాంజెట్టిలను రక్షించేందుకు అవసరమైనంత మోతాదులోనే సమాచారం చెప్పి ఊరుకున్నాడు. అందువల్లే థామ్సన్, ఎహర్మన్‌లు చాలా కష్టపడాల్సి వచ్చింది.

న్యూ బెడ్ ఫోర్డ్‌లో పోలీసు అధికారి కెప్టెన్ పియరాసినిని ఎహర్మన్ కలిశాడు. తనకు తెలిసిన సమాచారాన్ని ఎహర్మన్ ఆయన ముందుంచాడు. అది విని పియరాసిని ఎగిరి గంతేశాడు. వెంటనే రమ్మని సార్జంట్ జాకబ్‌కు కబురు పెట్టాడు. జాకబ్ వస్తూ తనతోపాటు ఒకనోట్ బుక్ తెచ్చాడు. అందులో జాకబ్ రాసిన సంగతులు ఎహర్మన్‌ను ఆశ్చర్యపర్చాయి.

మోరెల్లి సోదరులలో ఒకడైన మైక్ మోరెల్లి సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యలు జరిగిన ముందు రోజు, హత్యలు జరిగిన రోజు రాత్రి కూడా జాకబ్ కంట పడ్డాడు. కొత్త బూయిక్ కారు నడుపుతూ కనిపించాడు. తర్వాత కొన్నాళ్ళకు జోమోరెల్లి కూడా మరో రకం కారుతో కనిపించాడు. కానీ రెండు కార్ల నెంబర్ ప్లేట్లూ ఒకటేనని సార్జెంట్ జాకబ్ గమనించాడు. రెస్టారెంట్‌లో కూర్చున్న జోమోరెల్లిని జాకబ్ పలుకరించగా అతను తత్తరపడ్డాడు. ఈ సంగతులన్నీ ఎప్పటికప్పుడు జాకబ్ తన నోట్‌బుక్‌లో రాసి పెట్టుకున్నాడు.

అప్పటికి తన పరిశోధన ఆపి ఎహర్మన్ థామ్సన్‌ను కలిశాడు. వారిద్దరూ అప్పటికి బయటపడిన వివరాలన్నిటినీ అసిస్టెంట్ జిల్లా అటార్నీ డడ్లీరానీ దృష్టికి తెచ్చారు. శాక్కొ, వాంజెట్టిలపై కేసు ఎత్తి వేసి జోమోరెల్లి ముఠా గురించి ఇకనైనా పరిశోధించవలసిందని వారు అభ్యర్థించారు. కానీ రానీ ససేమిరా కుదరదన్నాడు. తన బొందిలో ప్రాణమున్నంత వరకూ శాక్కొ, వాంజెట్టిలపై కేసు ఎత్తివేసే ప్రసక్తే లేదన్నాడు.

పట్టువదలని ఎహర్మన్ మరింత సమాచారం సేకరించేందుకు నడుం బిగించి తిరిగి ప్రావిడెన్స్ చేరుకున్నాడు. ఈసారి ఆయన భార్య సారా ఎహర్మన్ కూడా రంగంలోకి దిగింది. ఆమె కోర్టు రికార్డులు వెతికి మోరెల్లి ముఠాపై ఉన్న క్రిమినల్ కేసుల వివరాలు సంపాదించింది.మోరెల్లి ముఠా లాయర్‌ను కలిసి ఎహర్మన్ మరి కొంత సమాచారం సేకరించాడు. ఆ ముఠాపై తొమ్మిది దొంగతనం కేసులున్నాయి. వాటిలో ఐదింటిలో దొంగిలించిన సొత్తు చెప్పులే. అవి సౌత్ బ్రెయిన్ ట్రీ నుంచి రవాణా అయినవే. స్లేటర్ మోరిల్ షూ కంపెనీకి, రైస్ అండ్ హచిన్స్ కంపెనీకి చెందినవే. ఈ వివరాలు ఎహర్మన్‌కు మరొక క్లూ అందించాయి. జోమోరెల్లి ముఠాకు సౌత్ బ్రెయిన్ ట్రీ గురించీ, స్లేటర్ మోరిల్ కంపెనీ గురించీ బాగా తెలిసి ఉండాలి.

సౌత్ బ్రెయిన్ ట్రీ నేరంలో రెండు కార్లు ఉపయోగించారని మెడైరోస్ చెప్పిన సంగతి కూడా వాస్తవమని బోస్టన్ ఈవెనింగ్ పోస్ట్ దినపత్రిక పరిశోధనలో తేలింది.

మెడైరోస్ ఒప్పుకోలు ప్రకటన తర్వాత ఆ దినపత్రిక సంపాదకుడు జేమ్స్ కింగ్ ప్రత్యేక పరిశోధన చేస్తూ ఆ సంగతిని కనిపెట్టాడు 1920 ఏప్రిల్ 15న సౌత్ బ్రెయిన్ ట్రీకి వచ్చి పోయిన రైళ్ళ వివరాలను ఆయన సేకరించాడు కేసులో సాక్ష్యాన్ని బట్టి నేరస్తులు పారిపోయిన కారు మాట్‌ఫీల్డ్ క్రాసింగ్ దగ్గర ఆగి పోయింది. రైలు అదే సమయంలో రావడం వల్ల అలా జరిగింది. ఇతర సాక్షులు చెప్పిన విధంగా అయితే వేగంగా వెళుతున్న హంతకుల కారు రైలు గేటు దగ్గర ఆగాల్సిన అవసరం లేదు. ఎందుకంటే సాక్షులు చెప్పినంత వేగంతో కారు గనుక ప్రయాణిస్తుంటే అది రైలు గేటును చేరుకునే సమయానికి రైలు వస్తుండటం జరగదు అలాకాక మెడైరోస్ చెప్పినట్టుగా చెట్ల తోపుకు వెళ్ళి మరొక కారులోకి హంతకులు మారి బయల్దేరితే మాత్రం సరిగ్గా రైలు వచ్చే సమయానికి మాట్‌ఫీల్డ్ రైల్ రోడ్ క్రాసింగ్ దగ్గరికొచ్చి ఆగిపోవాల్సి వస్తుంది. రైళ్ళ రాకపోకల వివరాలు రికార్డులలో నిర్దిష్టంగా నమోదయి వుండటం వల్ల జేమ్స్‌కింగ్ ప్రతిపాదనకు బలం చేకూరింది.

నేరం జరిగిన సమయంలో అక్కడికొచ్చిన కారు గురించి సాక్షులు చెప్పిన వివరాలు, ఆ తర్వాత దారిలో హంతకుల కారును చూసిన సాక్షులు చెప్పిన వివరాలు ఒకటిగా లేవని డిఫెన్స్ లాయర్లు మరోసారి కేసు రికార్డును పరిశీలించి నిర్ధారించారు.

ప్రావిడెన్స్‌లో ఎహర్మన్ ఇన్‌స్పెక్టర్ కొనార్స్ చెప్పిన పోలీసు అధికారి జనరల్ రిచర్డ్స్‌ను కలిశాడు. మాన్‌సిని అనే వ్యక్తి కూడా మోరెల్లి ముఠా సభ్యుడని ఆయన సమాచారమిచ్చాడు. తీవ్రమైన నేరాలకు పాల్పడేటప్పుడు మాత్రమే ముఠా మాన్‌సిని సహాయం తీసుకుంటుంది. ఎంతటి ఘోర హత్యనైనా ఇట్టే చేయగల క్రూరత్వం కరడుగట్టిన హంతకుడతను. మాన్‌సిని లాంటి సమర్థుడైన భాగస్వామి ఆసరా లేకుండా జోమోరెల్లి సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యలు చేసి వుంటాడని తాము నమ్మలేమని కొందరు వృత్తినేరస్తులు ప్రావిడెన్స్‌లో ఎహర్మన్‌కు చెప్పారు.

జోమోరెల్లి లీవెన్‌వర్త్ జైల్లో ఉన్నాడని తెలిసి ఎహర్మన్ అక్కడికెళ్ళాడు. జోమోరెల్లిని చూసిన ఎహర్మన్ ఆశ్చర్యం అంతా ఇంతా కాదు. **అతనికీ శాక్కొకూ బాగా దగ్గర పోలికలువ్నాయి. ఇద్దరూ ఒకే తల్లి పిల్లలేమో అని అనుకునేంత దగ్గరగా పోలికలుండటం చూసి ఎహర్మన్ చిత్తరపోయాడు.**

మాన్‌సిని తనకు తెలుసునని జోమోరెల్లి మొదట అంగీకరించలేదు. శాక్కొ-వాంజెట్టి కేసు గురించి పరిశోధిస్తున్నాని ఎహర్మన్ బయట పెట్టడంతో జోమోరెల్లి ఆశ్చర్యపోయాడు. "*శాక్కొ!? శాక్కొ!? దాని గురించి మాన్‌సినిని కలవండి*" అన్నాడు. మరే వివరాలూ చెప్పేందుకు అతను అంగీకరించలేదు.

ఆబర్న్ జైల్లో ఏంటొనీ మాన్‌సిని ఖైదీగా ఉన్నాడు. అతనిని కలుసుకోవడం ఒక అద్భుత

అనుభవమని ఎహర్మన్ పేర్కొన్నాడు మాన్సినికి శాక్కొ-వాంజెట్టి కేసు విచారణ గురించిన వివరాలు బాగా తెలుసు. ఎప్పటికప్పుడు దినపత్రికల్లో ఆసక్తిగా చదివి తెలుసుకుంటున్నాడు. వాళ్ళిద్దరూ బందిపోట్లు కారని వెంటనే చెప్పాడు మెడైరోస్ కథనాన్ని ఎహర్మన్ చెప్పగా ఆ సాంతం విని మౌనంగా ఉండిపోయాడు తన పేరు దగ్గరకి వచ్చే సరికి ఇబ్బంది పడుతున్నట్లు కనిపించాడు జోమోరెల్లి సోదరులలో ఒకడైన ఫ్రెడ్ ఆ నేరంలో పాల్గొనక పోయి వుండవచ్చని మాత్రమే మాన్సిని చెప్పాడు.*

మాన్సిని గురించి ఎహర్మన్ మరి కొంత పరిశోధన చేశాడు.మాన్సిని న్యూయార్క్‌లో ఒక హత్య చేశాడని కనిపెట్టగలిగాడు ఎహర్మన్ స్నేహితుడు హెన్రీ అక్కడ అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా పని చేస్తున్నాడు మాన్సిని న్యూయార్క్‌లో మనిషిని చంపింది ఏ ఆయుధంతోనో తెలుసుకోవలసిందని ఎహర్మన్ హెన్రీని అడిగాడు సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం జరిగిన పది నెలలకు జరిగిన ఈ హత్యకు మాన్సిని 7 65 మి మీ కాలిబర్ స్టార్ (STAR) ఆటోమేటిక్ పిస్టల్‌ను ఉపయోగించాడనీ, అది జర్మనీలో తయారైందనీ పోలీసు రికార్డుల ఆధారంగా హెన్రీ చెప్పగలిగాడు. మాన్సిని ప్రావిడెన్స్‌లో ఉన్నప్పుడు కూడా అతని దగ్గర ఈ పిస్టల్ ఉండేదని పోలీసు శాఖ ఫైళ్ళలో నమోదై ఉంది

శాక్కొ-వాంజెట్టి కేసు లో ప్రాసిక్యూషన్ తరపున సాక్ష్యమిచ్చిన ఆయుధ నిపుణుడు జేమ్స్ బర్న్ సాక్ష్యం ప్రకారం, హతుల శరీరాల్లో దొరికిన బుల్లెట్లలో ఐదు విదేశీ ఆటోమేటిక్ *'7.65 మి.మీ ఆటోమేటిక్ స్టాయర్ (STAYR) పిస్టల్'* నుంచి పేల్చబడ్డాయి. ఆ పిస్టల్ జర్మనీలో తయారైందని కూడా జేమ్స్ బర్న్ తన సాక్ష్యంలో చెప్పివున్నాడు. మాన్సిని పిస్టల్ గురించి సేకరించిన సమాచారం దీనికి సరిగ్గా సరిపోతుంది కాకపోతే, STAR కు STAYR కు మధ్య తేడా అచ్చు తప్పు కావచ్చు

ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత ఎహర్మన్ తన పరిశోధనను రివాల్వర్‌ల మీదికి మళ్ళించాడు. మోరెల్లి ముఠా దగ్గర కోల్ట్ ఆటోమేటిక్ రివాల్వర్‌లు ఉన్నట్టు పోలీసు రికార్డులు తెలియజేశాయి. కాబట్టి ప్రాణాంతక బుల్లెట్ *(బుల్లెట్ -III)* ను పేల్చగలిగిన రివాల్వర్‌లు మోరెల్లి ముఠా దగ్గర ఉన్నట్టే.

సౌత్ బ్రెయిన్ ట్రీ కేసులో సాక్షులు చెప్పిన హంతకుల రూపురేఖలకు జోమోరెల్లి ముఠా సభ్యుల రూపురేఖలు సరిగ్గా సరిపోతాయని ఎహర్మన్‌కు రూఢీ అయింది. జోమోరెల్లి, మాన్సినిల రూపురేఖలు నేరస్థలంలో కంచెకు ఆనుకుని నిల్చుని ఒక్కసారిగా హతులపై దాడి చేసిన ఇద్దరు ఆగంతకులను సరిగ్గా పోలి వున్నాయి. వాళ్ళిద్దరి ఫోటోలను ఎహర్మన్ కొందరు సాక్షులకు చూపించగా వాళ్ళు గుర్తు పట్టారు. జో మోరెల్లిని చూసిన అనేక మంది సాక్షులు అతను శాక్కొలాగా ఉన్నాడని అడగకుండానే చెప్పగలిగారు.

---

* *అది నిజమేనని తర్వాతి పరిశోధనలో ఎహర్మన్ కనుగొన్నాడు*

హంతకుల కారు నడిపిన మురా సభ్యుడి ఆరా కూడా తెలుసుకునేందుకు ఎహర్మన్ ప్రయత్నించాడు అతను స్టీవ్ బెన్‌కోవ్ స్కీ అని తేలింది. అతను మెడైరోస్‌కు స్నేహితుడే. బెన్‌కోవ్ స్కీ ఫోటోలు చూసిన సాక్షులు అతనే హంతకుల కారు డ్రైవర్ అని ఘంటాపథంగా చెప్పారు.

కార్ల మార్పిడిలో ఉపయోగపడిన వ్యక్తిని మైకేల్ మోరెల్లిగా ఎహర్మన్ నిర్ధారించాడు. అందుకు సార్జంట్ జాకబ్ నోట్‌బుక్‌లో రాసిన విషయాలు ఉపయోగపడ్డాయి.

# 3

**జో** మోరెల్లి మురానే బ్రెయిన్ ట్రీ హత్యలు చేసిందని డిఫెన్స్ లాయర్లు స్పష్టమైన సాక్ష్యాధారాలతో ముందుకొచ్చినప్పటికీ అధికార వర్గం మాత్రం వాటిని పరిశీలించేందుకు ఏ మాత్రం సుముఖత వ్యక్తం చేయలేదు ఆ సాక్ష్యాలన్నీ డిఫెన్స్ కమిటి సృష్టించినవని, మెడైరోస్ అబద్ధమాడుతున్నాడని నిరూపించేందుకు ప్రాసిక్యూటర్లు తంటాలు పడ్డారు. మోరెల్లి మురా సభ్యులకు పలు ఆశలు చూపి ఆకట్టుకున్నారు. మెడైరోస్ తమకసలు తెలియనే తెలియదనీ, బ్రెయిన్ ట్రీ హత్యలకూ తమకూ ఏమీ సంబంధం లేదనీ మోరెల్లి మురా సభ్యులతో చెప్పించారు

జైళ్ళలో ఖైదీలుగా వున్న ఫ్రాంక్, పాస్కేల్, ఫ్రెడ్‌లను జిల్లా అటార్నీ విన్ ఫీల్డ్ విల్బర్, అసిస్టెంట్ డడ్లీరానీ* 1926 జూన్ 4న కలిసి ఇంటర్వ్యూ చేశారు. వాళ్ళు తమకూ సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యలకూ సంబంధం ఏమాత్రం లేదని చెప్పారు.** తాను 1920 ఏప్రిల్ నెల మొత్తం ప్రావిడెన్స్‌లో ఉన్నానని ఫ్రాంక్ చెప్పాడు. (ఇది అబద్ధమని డిఫెన్స్ లాయర్ల సమాచారం తెలుపుతోంది. న్యూ బెడ్ ఫోర్డ్‌లో అతనున్నట్టుగా సార్జంట్ జాకబ్ సాక్షి. ఫ్రాంక్ తరపు లాయర్ కూడా అదే చెప్పాడు. న్యూ బెడ్ ఫోర్డ్‌లో ఆ కాలంలో తానున్నట్టు ఒక దొంగతనం కేసులో ఫ్రాంక్ కోర్టు ముందు స్వయంగా చెప్పి వున్నాడు.) జో మోరెల్లికి నేరంతో సంబంధం లేదని కూడా ఫ్రాంక్, పాస్కేల్, ఫ్రెడ్‌లు అఫిడవిట్లు రాసిచ్చారు. 1920 ఏప్రిల్‌లో జో మోరెల్లి జైలులో ఉన్నాడని వాళ్ళు ముగ్గురూ పేర్కొన్నారు. నేరం జరిగిన రోజున అతను రోడ్ ఐలెండ్ ప్రభుత్వ కారాగారంలో ఖైదీగా ఉన్నాడని ఆ జైలు వార్డెన్ అఫిడవిట్‌ను కూడా ప్రాసిక్యూషన్ సంపాయించింది. (1920 మార్చి 15న జో మోరెల్లి బెయిల్‌పై విడుదలయ్యాడని జైలు రికార్డుల్లో నమోదయి వుంది. ఈ సంగతిని డిఫెన్స్ లాయర్లు బయటపెట్టారు.)

* కట్జ్‌మన్, విలియమ్స్ పదవీ విరమణ అనంతరం వీరిద్దరూ నియమితులయ్యారు

** పాస్కేల్‌కు నేరంతో సంబంధం లేదనీ, నేరం జరిగే నాటికి ఫ్రెడ్, మరో మురా సభ్యుడు బిబ్బర్ బరోన్‌లు జైల్లో ఉన్నారని అప్పటికే డిఫెన్స్ లాయర్లకు తెలుసు.

నేరంలో తాను గానీ, తన సోదరులుగానీ పాల్గొనలేదని జోమోరెల్లి దగ్గర కూడా ప్రభుత్వం అఫిడవిట్ తీసుకుంది. 1920 ఏప్రిల్ నెలలో ప్రతి రాత్రీ 12 గంటలలోపే జోమోరెల్లి ఇంటికి వచ్చే వాడని ఉదయం పది గంటల తర్వాతే బయటికి వెళ్ళే వాడని అతనితో సంబంధం ఉన్న ఒక మహిళ దగ్గర కూడా ప్రభుత్వం అఫిడవిట్ సేకరించింది. (ఈ సమాచారం తప్పు అని డిఫెన్స్ లాయర్లు కనుగొన్నారు అందుకు సమర్ధనగా వారు ఒక కేసులో జోమోరెల్లి చెప్పిన సాక్ష్యాన్ని ఉదహరించారు అప్పట్లో కొన్నాళ్ళు రాత్రిళ్ళు ఇంటికి చేరే వాడిని కాదని జో ఆ సాక్ష్యంలో చెప్పాడు )

ఇలా అఫిడవిట్లు సేకరిస్తూనే ప్రాసిక్యూషన్ మరొక ఎత్తుగడ వేసింది. మెడైరోస్ పైకి సైకియాట్రిస్టులను ఉసిగొల్పి అతన్ని గందరగోళ పరిచేందుకు పయత్నించింది డిఫెన్స్ లాయర్లకు ఏ మాత్రం తెలియపర్చకుండానే ఇద్దరు సైకియాట్రిస్టులతో మెడైరోస్‌ను పరీక్ష చేయించింది అతను సరైన మానసిక స్థితిలో ఉన్నాడా లేడా అని నిర్ధారించేందుకు పరీక్షలు ఉద్దేశించబడ్డాయని సైకియాట్రిస్టులు ప్రకటించారు. కానీ వారు మెడైరోస్‌ను ప్రశ్నించిన తీరు మాత్రం వేరే విధంగా ఉంది తమ ప్రశ్నలతో అతన్ని వేధించి నేరం ఒప్పుకొనకుండా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారు కానీ మెడైరోస్ ఏ మాత్రం భయపడకుండా మరోసారి నిజాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు కొన్ని చిన్న చిన్న వివరాలు మాత్రం అతను గుర్తు పెట్టుకోలేకపోయాడు.

ఇవన్నీ ఒక పక్క జరుగుతుంటే మరో వేపు ఈ విషయాల పట్ల బయట ఆసక్తి ఎక్కువైంది. అనేక మంది మేధావులు, పాత్రికేయులు స్వచ్ఛందంగా రంగ ప్రవేశం చేసి జోమోరెల్లి మురాను కలిసి నేరం గురించిన పూర్తి వివరాలు రాబట్టేందుకు కృషి చేశారు. న్యూయార్క్ నగరంలోని ప్రముఖ న్యాయవాది మారిస్ ఎర్నెస్ట్ ఒక రోజు రాత్రికి రాత్రి జోమోరెల్లిని తన ఇంటికి తీసుకెళ్ళి నిజం చెప్పమని బ్రతిమాలాడు. కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు. నేరంలో తాను పాల్గొన్నట్టు జో అంగీకరించలేదు. కానీ తన మురాకు దానితో ప్రమేయం ఉందని మాత్రం ఒప్పుకున్నాడు. తనకు భారీగా డబ్బిస్తే పూర్తి వివరాలు చెప్పగలనని బేరం పెట్టాడు.

కొత్తగా కనుగొన్న ఈ సాక్ష్యాధారాలను పరిశీలించి మరోమారు కేసు విచారణ జరపాలని పలువురు న్యాయవేత్తలు అభ్యర్థించారు. ఎంత హీనంగా చూసినా శాక్కో, వాంజెట్టిలపై కేసుకు ఎంత బలముందో జోమోరెల్లి మురాపై కేసుకు అంతకంటే ఎక్కువ బలమున్నదని వారు ప్రకటించారు. *న్యూయార్క్ వరల్డ్ దినపత్రిక రెండు వారాల పాటు ఈ సాక్ష్యాధారాల గురించి వార్తా వ్యాసాలు ప్రచురించి శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని స్పష్టం చేసింది.*

మెడైరోస్-మోరెల్లి గురించి తాము పరిశోధించి సేకరించిన సాక్ష్యాల ఆధారంగా కేసును తిరిగి విచారించవలసిందిగా కోరుతూ 1926 మే 26న థేయర్ కోర్టులో డిఫెన్స్ లాయర్లు పిటీషన్ దాఖలు చేశారు. కిక్కిరిసిన కోర్టు హాలులో థామ్సన్ సెప్టెంబర్ 13 నుంచి నాలుగు

రోజుల పాటు నిర్విరామంగా వాదించాడు. ప్రాసిక్యూషన్ తరపున డడ్లీ రానీ తన వాదన వినిపించాడు. మోరెల్లి ముఠా గురించి డిఫెన్స్ సేకరించిన సాక్ష్యాలు తప్పుడువనీ, మెడైరోస్ అబద్ధాల కోరనీ, పిచ్చివాడనీ ఆరోపించాడు.

అక్టోబర్ 10న వాంజెట్టి తన చెల్లెలు లూగియాకు రాసిన లేఖలో:

*బహుశా, నా తర్వాతి ఉత్తరాన్ని నువ్వందుకునే సరికి జడ్జి మా పిటీషన్‌ను తోసిపుచ్చాడనే వార్త నీకు చేరుతుంది.*

సరిగ్గా అలాగే జరిగింది. ఇకనైనా తమకు అనుకూల నిర్ణయాన్ని థేయర్ ప్రకటిస్తాడని అనుకున్న థామ్సన్, ఎహర్మన్‌ల ఆశలు అడియాసలయ్యాయి.

థేయర్ తన సుదీర్ఘ నిర్ణయాన్ని అక్టోబర్ 23న ప్రకటించాడు:

*మెడైరోస్ ఒక దగాకోరు, దొంగ, దోపిడీదారుడు, అబద్ధాల కోరు, దొంగసారా మోసేవాడు, అప్రతిష్ఠాకరమైన హోటల్లో నివసించే బడాయికోరు. ఈ విషయంలో సందేహం లేదు. 'రెంధమ్ బాంక్ కాషియర్ కార్పెంటర్ హత్య కేసు'లో అతన్ని నేరస్తుడిగా నిర్ణయించారు. మరణశిక్ష విధించబడిన ఖైదీ అతను. కామన్‌వెల్త్ సుప్రీం జుడీషియల్ కోర్టు అంగీకరించిన జూరీ తీర్పును తోసిపుచ్చే ముందు ఇలాంటి వాడు దాఖలు చేసిన అఫిడవిట్‌ను సాధ్యమైనంత ఎక్కువ జాగ్రత్తతో, హెచ్చరికతో పరిశీలించాలి. పరీక్షించాలి. నిర్ణయించాలి.*

మెడైరోస్ లాంటి భయకంపిత ప్రాణిని ఆరితేరిన జోమోరెల్లి ముఠా తమ నేరంలో వినియోగించిందంటే నమ్మలేనని థేయర్ అన్నాడు. సరిపోయినంత మంది అప్పటికే ముఠాలో వుండగా మెడైరోస్ అవసరం ఆ ముఠాకు లేదన్నాడు. జో ముఠా చెప్పిన సంగతులే నమ్మదగినవని సెలవిచ్చాడు. ఆ ముఠాతో మెడైరోస్‌ను చూసామని డిఫెన్స్ తరపున ఏ ఒక్క పోలీసు అధికారి కూడా సాక్ష్యం చెప్పక పోవడాన్ని తన వాదనకు సమర్ధనగా థేయర్ చూపెట్టాడు. మెడైరోస్‌కు ఆ ముఠాతో పరిచయమే లేదన్నాడు.

తన తీర్పులో మెడైరోస్‌ను నీచుడిగా పేర్కొంటూ, అతని మాటలను నమ్మలేనని ఒక వైపు చెప్తూ, మరో వైపు పరమ నీచులైన జోమోరెల్లి ముఠా సభ్యుల మాటలను ఎలా నమ్మగలిగాడో థేయర్ చెప్పలేదు. మెడైరోస్ సౌత్ బ్రెయిన్ ట్రీ నేరం ఒప్పుకునే నాటికి అతనిపై కేసులో మొదటి అప్పీలు పెండింగ్‌లో ఉన్నదన్న వాస్తవాన్ని థేయర్ వక్రీకరించాడు. మరణశిక్ష విధించబడిన మెడైరోస్‌కు బ్రెయిన్ ట్రీ నేరం ఒప్పుకున్నందువల్ల పోయేదేమీ లేదు కాబట్టి అతని ఒప్పుకోలు ప్రకటనకు విలువలేదని ప్రకటించాడు.

తన తీర్పులో థేయర్ డిఫెన్స్ లాయర్ థామ్సన్‌పై వ్యక్తిగత నిందారోపణకు కూడా

పూనుకున్నాడు. థామ్సన్‌కు కొత్త రకమైన పిచ్చి పట్టిందన్నాడు లీగో-సైకో న్యూరోసిస్' అని దానికి పేరు పెట్టాడు. లేని దానిని ఉన్నదని నమ్మే జబ్బుగా దానిని థేయర్ అభివర్ణించాడు.*

థేయర్ తీర్పు పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. అట్లాంటిక్ మంత్లీలో ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ థేయర్‌ను విమర్శిస్తూ ఇలా రాశాడు:

> థేయర్ తీర్పులో ఉన్నన్ని అసంగత విషయాలు, దోషాలు ఆధునిక యుగంలో మరే తీర్పులోనూ లేవు ఇరవై ఐదు వేల పదాలున్న ఈ తీర్పులో పలు పెడర్థాలు అబద్ధాలు వక్రీకరణలు, గందరగోళాలు ఉన్నాయి రికార్డులో ఉన్న విషయాలకు తీర్పుకు పొంతనే లేదు

**తీర్పు వెలువడిన మూడవ రోజున 'విఁయ్ సబ్‌మిట్' శీర్షికన బోస్టన్ హెరాల్డ్ దిన పత్రికలో లారిస్టన్ బుల్లర్డ్ రాసిన సంపాదకీయం 1926 లో వెలువడిన ఉత్తమ పత్రికా సంపాదకీయంగా ప్రతిష్ఠాత్మక పులిట్జర్ బహుమతి ని అందుకుంది:**

> *జూరీ 1921 జులై 14న ప్రకటించిన తీర్పునను సరించి నికొలా శాక్కొ, బార్టొలోమియో వాంజెట్టిలపై మరణశిక్ష అమలు జరపరాదని మా అభిప్రాయం వాళ్ళు నేరస్తులో కాదో మాకు తెలియదు వాళ్ళ కున్న అపరిపక్వ భావాల పట్ల మాకు సానుభూతి లేదు కానీ, నెలలు ఏళ్ళుగా మారుతున్న కొద్దీ, ఈ కేసుపై అనంతమైన చర్చ సాగుతున్న కొద్దీ మా సందేహాలు మెల్లగా అభిప్రాయాలుగా ఘనీభవించాయి మా మొదటి అభిప్రాయాన్ని అయిష్టంగా తిరగదోడు కోవాల్సిన స్థితికి మేం చేరాం. బహిరంగ న్యాయస్థానంలో పరీక్షించబడని కొత్త సాక్ష్యాల ఆధారంగా సుప్రీం జుడీషియల్ కోర్టు మళ్ళీ విచారణకు ఆదేశిస్తుందని భావిస్తున్నాం. సెలెస్టినో మెడైరోస్‌పై మరణశిక్ష అమలును గవర్నర్ మరోసారి వాయిదా వేస్తారని, బహిరంగ*

---

* ఇదే పిటీషన్‌లో డిఫెన్స్ లాయర్లు చూపించిన మరికొన్ని సాక్ష్యాధారాలను కూడా థేయర్ తన తీర్పులో తోసిపుచ్చాడు జస్టిస్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు శాక్కొ, వాంజెట్టిలకు శిక్ష వేయించేందుకు కట్జ్‌మన్ ప్రయత్నించాడని డిఫెన్స్ లాయర్లు వాదించారు శాక్కొ, వాంజెట్టిలకు ఈ కేసులో శిక్ష పడని పక్షంలో వారిని దేశం నుంచి బహిష్కరింపజేసేందుకు అవసరమైన సమాచారాన్ని రాబట్టే విధంగా క్రాసు పరీక్ష చేయవలసిందిగా జస్టిస్ డిపార్ట్‌మెంట్ కట్జ్‌మన్‌ను కోరిందని వారు నిరూపించారు తమ వాదనకు సమర్థనగా, జస్టిస్ డిపార్ట్‌మెంట్‌లో చాలా కాలం పని చేసి పదవీ విరమణ చేసిన ఇద్దరు ఏజెంట్ల (వైయాంగ్, లారెన్స్ లెథర్‌మన్) అఫిడవిట్లు దాఖలు చేశారు వాటి ప్రకారం కేసులో సహకరించాలని జస్టిస్ డిపార్ట్‌మెంట్‌కు కట్జ్‌మన్‌కు మధ్య అంగీకారం కుదిరింది. శాక్కొ, వాంజెట్టిలు అరాచకవాదులని కేసులో నిరూపణ అయితే వారు శిక్ష నుంచి తప్పించుకున్నప్పటికీ వారిని దేశం నుంచి పంపేయవచ్చుని కుట్ర జరిగింది. బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి వెస్ట్ ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్‌కు శాక్కొ, వాంజెట్టిల గురించిన సమాచారం అందజేశాడు వారిద్దరూ హంతకులు కారని తెలిసీ ఈ పని చేశారు వెస్ట్, వైయాంగ్‌లు కేసు విచారణకు కూడా ప్రత్యక్షంగా హాజరయ్యారు.

న్యాయస్థానంలో అతన్ని నేరం ఒప్పుకోనిస్తారనీ.ఆశిస్తాం. సరికొత్త విచారణకు సుప్రీం బెంచ్ చట్టపరంగా ఆదేశించలేని పక్షంలో మన గవర్నర్ అత్యున్నత మేధావులతో, ఉన్నత సంస్కారవంతులతో ఒక కమీషన్‌ను నియమించి తన బదులుగా స్వతంత్ర పరిశోధన చేయిస్తారని ఆశిస్తాం. చివరి ప్రయత్నంగా గవర్నర్ స్వయంగా ఆ పరిశోధనలో పాల్గొంటారని ఆశిస్తాం.

. . . . . థేయర్ తీర్పు పూర్తి పాఠాన్ని మేం చదివాం. 'కామన్‌వెల్త్ సుప్రీం కోర్టు ఖాయపర్చిన జూరీ తీర్పు'గా ప్రారంభంలో ఆయన పేర్కొన్నారు. ఆ తీర్పును సుప్రీం కోర్టు ఏనాడూ అంగీకరించలేదని మేం సవినయంగా మనవి చేస్తున్నాం. కోర్టు ఇలా చెప్పింది: "ఇప్పటి వరకూ వాదించబడిన అన్ని అభ్యంతరాలను జాగ్రత్తగా పరిశీలించాం. వాటిలో ఏదీ తీర్పు ముందు నిలువ జాలవని పేర్కొంటున్నాం". తీర్పును సుప్రీం కోర్టు సరైనదని చెప్పలేదు. తీర్పు సరైనదైనా కాకపోయినా కేసును విచారించిన న్యాయమూర్తి చట్ట ప్రకారం తన విధి నిర్వర్తించాడని కోర్టు ధృవీకరించింది. డిఫెన్స్ లాయర్ల అభ్యంతరాలను సుప్రీం కోర్టు తోసి పుచ్చిందే తప్ప తీర్పు సరైనదా కాదా, ముద్దాయిలు దోషులా కారా అన్న విషయాలపై ఎలాంటి తీర్పూ చెప్పలేదు. అయినప్పటికీ సుప్రీం కోర్టు ఖాయపర్చిన తీర్పు'గా (థేయర్) పేర్కొన్నారు.

ఇక మెడైరోస్ గురించి: చెడు ప్రవర్తన కలిగిన నేరస్తుడన్నది నిజమే. అతనిపై మరణశిక్ష కూడా విధించబడి ఉంది. కానీ ఒక హత్య కేసులో అతన్ని శిక్షించేందుకు అతను స్వయంగా నేరాన్ని ఒప్పుకుంటూ చేసిన ప్రకటనపై ప్రభుత్వం పాక్షికంగా ఆధారపడింది.* అతని జీవితానికే ముప్పు వాటిల్లినప్పుడు అతని సాక్ష్యాన్నే అతనికి వ్యతిరేకంగా అంగీకరించారు. జీవితాలకు ముప్పు వాటిల్లిన మరో ఇద్దరి కోసం ఇప్పుడతని సాక్ష్యం ప్రవేశపెట్టబడింది. బహిరంగ న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట, జూరీ ఎదుట అతన్ని సాక్షిగా నిలబెట్టాలనీ, అతన్ని క్రాసు పరీక్ష ద్వారా విచారించాలనీ మా మనవి. అతను అబద్ధమాడుతూ ఉండవచ్చు. కానీ దాని గురించి న్యాయమూర్తి ఏం అనుకుంటారని కాదు, జూరీ ఏం ఆలోచిస్తుంది అనేదే ఇక్కడ గీటురాయి. జూరీ ఒక నిర్ణయానికి వచ్చేందుకు కొత్త సాక్ష్యాధారాలు ఉపయోగపడగలవా అనేదే ప్రశ్న.

కేసును మళ్ళీ విచారిస్తే అందులో కూడా శాక్కొ, వాంజెట్టిలు దోషులని తేలితే ఇప్పటికంటే పరిస్థితి మెరుగ్గా వుంటుందనీ, పలువురి సందేహాలు నివృత్తి అవుతాయనీ తన సంపాదకీయంలో లారిస్టన్ బుల్లర్డ్ అభిప్రాయపడ్డాడు. అలాకాక, వారిద్దరూ నిర్దోషులని తేలితే అందరూ సంతోషిస్తారనీ, అన్యాయం జరగనందుకు ఆనందిస్తారనీ ఆయన రాశాడు.

---

* రెంథమ్ కేసులో తన సహచరులలాగా తాను కూడా నేరం ఒప్పుకుంటాననీ, తనకు కూడా యావజ్జీవ శిక్ష విధించేటట్టు చూడమని మెడైరోస్ ఆ కేసులో ప్రాసిక్యూటర్లను అడిగాడు. కానీ అలా వీలుపడదని వారు ప్రకటించి కేసు విచారణ జరిపించి మరణశిక్ష విధింపజేసారు.

బోస్టన్ హెరాల్డ్ సంపాదకీయంతో ఏకీభవించిన పలువురు ప్రముఖ మేధావులు మరోసారి విచారణ జరపమని అభ్యర్థించారు. ఇండిపెండెంట్ * దినపత్రిక కూడా వారితో గొంతు కలిపింది. కానీ రెండు నెలలు తిరక్కుండానే అదే దినపత్రిక *గవర్నమెంట్ బై బాంబ్* ' శీర్షికన డిసెంబర్ 11న ప్రచురించిన సంపాదకీయంలో పూర్తి విరుద్ధమైన వాదన చేసింది:

> *హత్య కేసులో దోషులుగా ప్రకటించబడిన నికొలా శాక్కొ, బార్టొలోమియో వాంజెట్టిల పక్షపాతులు సంప్రదాయబాంబు వాదనతో వారికి క్షమాభిక్ష పెట్టించేందుకు గవర్నర్ ఫుల్లర్‌పై వత్తిడి తెస్తున్నారు. వారిద్దరిపై నిష్పక్షపాత విచారణ జరిగినట్టుగా మసాచుసెట్స్‌లోని ఉన్నత న్యాయస్థానాలు నిర్ణయించాయి. . . విచారణ జరిపిన న్యాయమూర్తి వారి కేసును తిరిగి విచారించేందుకు తిరస్కరించాడు. సమర్థులైన న్యాయవాదులు తీర్పులో లోపాన్ని కనుగొనగలమనే ఆశతో ప్రతి సాంకేతిక కారణంపై వాదిస్తుండగా ముద్దాయిలు ఐదేళ్ళ పాటు మరణశిక్షను వాయిదా వేయించుకోగలిగారు. చట్టం ముందు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనేందుకు ముద్దాయిలకు అన్ని అవకాశాలూ ఇచ్చారు. చట్టం వారిని దోషులుగా నిర్ణయించింది.*
>
> *కానీ, శాక్కొ, వాంజెట్టిలు ఒక విప్లవ పార్టీ సభ్యులయినందువల్ల వారి తరఫున పెద్ద పెట్టున ఆందోళన చెలరేగింది. వారు 'వేధించబడ్డార ' నే ఆరోపణలు బాగా వినిపించాయి. దేశమంతటా వామపక్ష సంస్థలూ, వార్తా పత్రికలూ వారిని విడుదల చేయమని డిమాండ్ చేశాయి. అంతే కాక, ప్రపంచమంతటా అమెరికా రాయబార కార్యాలయాల ముందు బాంబులు పేలాయి. శాక్కొ, వాంజెట్టిలకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిన సాక్షుల ఇళ్ళు తునాతునకలయ్యాయి. ఈ ప్రతీకార చర్యలకు వారిని విచారించిన న్యాయమూర్తి, జూరీ కూడా బాధితులయ్యారు. తమ డిమాండ్లు అంగీకరించని పక్షంలో హత్య చేయగలమని వారి సానుభూతిపరులు పారిస్‌లో పర్యటిస్తున్న గవర్నర్ ఫుల్లర్‌ను బెదిరించారు. నాగరిక చట్టం స్థానంలో బాంబును ప్రతిష్టించడం ప్రమాదకర ప్రయోగం.*

ఈ వాదన ఎలా ఉన్నా, నిరసనోద్యమ తీవ్రత ఎంతగా ఉందో ఈ సంపాదకీయం ద్వారా అర్థమౌతుంది. మెడైరోస్ వివాదం చెలరేగిన కాలంలో కేసు ఉచ్ఛస్థాయి నందుకుంది. ఉద్యమం ఊపందుకుంది. సామాజిక ఘర్షణ తీవ్రతరమైంది. శాక్కొ, వాంజెట్టి కేసు అప్పటి అమెరికా సమస్యల్లో అత్యంత వివాదాస్పద విషయంగా మారిపోయింది.

థేయర్ తీర్పును సవాలు చేస్తూ సుప్రీం జుడీషియల్ కోర్టులో 1927 జనవరి 27-28 తేదీల్లో డిఫెన్సు లాయర్లు అప్పీలు (Bill of Exceptions) దాఖలు చేశారు. శాక్కొ, వాంజెట్టిలపై ఒక వైపు, జో మోరెల్లి ముఠాపై మరో వేపు కేసులో సాక్ష్యాల బలాబలాల అంచనాను పొందుపరుస్తూ లాయర్ థామ్సన్ ఒక పట్టిక తయారు చేసి అప్పీలు పిటీషన్‌తో పాటు కోర్టులో దాఖలు చేశాడు:

---

* హెన్రీ ఫోర్డ్ దీని అధిపతి. ఆయన మరణశిక్షలకు వ్యతిరేకిగా పేరు పొందాడు.

| | మెడైరోస్-మోరెల్లి | శాక్కో-వాంజెట్టి |
|---|---|---|
| ముద్దాయిల నడవడిక | పక్కా బందిపోట్లు, తుపాకు లున్న దారుణమైన మనుషులు. | వీరిలో ఒకరికి కుటుంబం ఉంది. బాంక్ ఖాతాలో డబ్బుంది. కష్టపడి పని చేసే శ్రామికుడు. గత నేర చరిత్రలేదు; రెండవ వ్యక్తికి కూడా తన అరెస్టుకు ముందు ఎలాంటి క్రిమినల్ కేసు లేదు. చేపలమ్మే వాడు. ఇద్దరూ యుద్ధ వ్యతిరేకులు. తీవ్ర రాడికల్స్ |
| ఉద్దేశం | తీవ్రమైన నేరంలో కేసు నాదించే లాయర్‌కు ఇచ్చేందుకు, బెయిల్ సంపాదించేందుకు డబ్బుల అవసరం బాగా వుంది. రవాణా వాహనాల దోపిడీని పోలీసులు అరికట్టడంతో సంపాదనా మార్గం మూసుకుపోయింది. | స్వలాభం కోసం దోపిడీ చేశారని ఆరోపణ. దొంగిలించబడిన డబ్బు ఏనాడైనా ఈ ఇద్దరు ముద్దాయిల్లో ఎవరి దగ్గరైనా ఉందనేందుకు సాక్ష్యాధారాలు లేవు. డబ్బేమైందో తెలియదు. |
| నేర పథక రచనకున్న అవకాశాలు | సౌత్ బ్రెయిన్ ట్రీలోని స్లేటర్ అండ్ మోరిల్, రైస్ అండ్ హచిన్స్ కంపెనీల సరకులను దోచు కుంటూ వున్నారు. దోచుకోవా ల్సిన సరకుల రవాణా గురించి ముఠా సభ్యుల్లో ఒకరు ముందు గా సమాచారం ఇస్తారు. | అలాంటి అవకాశాలున్నట్లు ఎక్కడా చెప్పబడలేదు. |
| సహ నేరస్తుల ఆరోపణ | నేరంలో పాల్గొన్న వ్యక్తి ప్రత్యక్ష సాక్ష్యముంది. | లేదు. |
| ఇతరులు గుర్తించడం | అలాంటి అవకాశం నియంత్రిం చబడింది. కానీ, జో, మాన్సిని, బెన్‌కోవ్స్కీల ఫోటోలను ఇరు పక్షాల సాక్షులూ గుర్తించారు. | శాక్కోను కొంత మేరకు గుర్తిం చారు. హత్యా స్థలంలో వాంజెట్టి ఉన్నట్టు అతి తక్కువ సాక్ష్యం ఉంది. సాక్షులకు ముందుగానే |

| | | |
|---|---|---|
| | మైక్, ఫ్రాంక్‌ల ఫోటోలు దొరక లేదు. శాక్కోకు, జో మోరెల్లికి నిస్సందేహమైన పోలికలెన్నో వున్నాయి | వీరిద్దర్నీ చూపించినందువల్లనూ, ఇతర నేరస్తులను అదే సాక్షులు హంతకులుగా గుర్తించినందు వల్లనూ, వాంజెట్టి స్పష్టమైన ఇంగ్లీషు మాట్లాడాడనీ, శాక్కోకు అసాధారణమైన పెద్ద చెయ్యి ఉందని చెప్పినందువల్లనూ కోర్టులో వీరిద్దరిని సాక్షులు గుర్తించడమనేది సందేహాస్పదం. |
| ఎలిబీ | మోరెల్లికి సంబంధించి పలు వైరుధ్యాలున్నాయి. మెడైరోస్ చెప్పిన దాన్లో వైరుధ్యాలు లేవు. | పేరు ప్రఖ్యాతులున్న పలువురు సాక్షులు సాక్ష్యం చెప్పారు. |
| అపరాధ భావన | ఆరోపించబడిన నేరం చేశారని చెప్పేందుకు తప్ప మరెందుకూ పనికి రాని అబద్ధాలాడారు. | అరెస్టయిన సమయంలో పోలీసు అధికారిపైకి తుపాకీ గురిపెట్టా రని ఆరోపణ. ముద్దాయిలు దానిని ఖండించారు. రెడ్స్‌ను వేటాడుతున్న కాలంలో తమ మిత్రుడు జస్టిస్ డిపార్ట్‌మెంట్ అధికారుల నిర్బంధంలో హత్య చేయబడి లేదా ఆత్మహత్య చేసుకున్న రెండు రోజులకు రాడికల్స్‌కు, యుద్ధ వ్యతిరే కులకు ఉన్న భయం వల్ల అబద్ధాలాడినట్టుగా వివరణ ఇచ్చారు. |
| బుల్లెట్లు | జోమోరెల్లి దగ్గరున్న (కోల్ట్ పాయింట్ 32) తరహా పిస్టల్ నుంచి ఒకటి, మాన్‌సిని దగ్గరున్న స్టార్ లేదా స్టాయర్ 7.65 మి.మీ మాదిరి పిస్టల్ నుంచి ఐదు బుల్లెట్లు పేల్చబడ్డాయి. | ఒకే ఒక బుల్లెట్ శాక్కో దగ్గరున్న ఆయుధం నుంచి పేల్చబడి నట్టుగా చెప్పబడింది. ఆయుధ నిపుణులు పరస్పర విరుద్ధ అభిప్రాయాలు ప్రకటించారు. ప్రభుత్వ నిపుణుడొకరి సాక్ష్యం గురించి ముందుగా తెలిస్తే అతను డిఫెన్స్ సాక్షి |

| | | |
|---|---|---|
| సమర్థించే ఇతర విషయాలు | మోరెల్లి సోదరులు అమెరికాలో పుట్టిన వారు కాబట్టి స్పష్టంగా తప్పుల్లేకుండా ఇంగ్లీషు మాట్లాడ గలరు హంతక ముఠాలో ప్రతి ఒక్క సభ్యుడినీ గుర్తించారు. తన క్లయింట్లను సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యకేసులో నిందితులుగా మార్చే ఎ సంగతినైనా చెప్పేందుకు మోరెల్లి ముఠా లాయర్ నిరాకరించాడు | అయ్యేవాడు. శాక్కొదిగా గుర్తించబడిన టోపీని అతని యజమాని గుర్తించలేదు. వాంజెట్టి దగ్గర దొరికిన రివాల్వర్ బెరార్డెల్లీది అని నిరూపించేం దుకు బలహీనమైన సాక్ష్యాధారా లు మాత్రమే ఉన్నాయి ఈ విషయంలో గన్‌షాపు రికార్డులు గందరగోళంగా ఉన్నాయి. ముఠాలో మిగిలిన సభ్యుల ఆచూకీ గురించి చెప్పబడలేదు. |
| దొంగ సొత్తు | నేరం జరిగిన వెంటనే మెడైరోస్ దగ్గర 2800 డాలర్లున్నాయి. (అతని "వాటా '? ధనం) | దొరకలేదు అంతేగాక 15 వేల డాలర్లు దొంగిలించినట్టు పేర్కొ న బడిన శాక్కొ వాంజెట్టిలు అరె స్టయ్యే సమయానికి తమ స్నేహి తుడి పాత డొక్కు కారు అరువు తెచ్చుకునే ప్రయత్నంలో విఫలమై స్ట్రీట్‌కార్‌లో ప్రయా ణిస్తూ వున్నారు. |
| అధికారుల వైఖరి | మోరెల్లి ముఠా సభ్యులు నేరంలో పాల్గొనలేదని పేర్కొంటూ వారి వద్ద నుంచి అఫిడవిట్లు దాఖలు చేశారు. కొత్త కోణం నుంచి నేరపరిశోధన జరిపేందుకు నిరాకరించారు. డిఫెన్స్ లాయర్ల తో కలిసి సాక్షులను విచారిం చేందుకు తిరస్కరించారు. | రెడ్ వ్యతిరేకోన్మాదాన్ని సొమ్ము చేసుకున్నారు. సైన్యంలో చేరేం దుకు నిరాకరించడం గురించీ, అరాచక వాద భావాల గురించీ, సంస్థల గురించీ బాగా అపోహ పర్చే క్రాసు పరీక్ష చేశారు. చార్జి గురించి వివరించేప్పుడు న్యాయ మూర్తి జూరీకి దేశభక్తి గురించి ఉపన్యాసం చెప్పాడు. డిఫెన్స్‌కు అనుకూల సాక్ష్యాన్ని తొక్కి పట్టారు. నిపుణుడి సాక్ష్యాన్ని కావాలని తప్పుదోవ పట్టించారు. |

వాదనలు ముగిసిన రెండు నెలలకు 1927 ఏప్రిల్ 5న సుప్రీం జుడీషియల్ కోర్టు అప్పీలును తోసి పుచ్చింది. సరిగ్గా ఆ తర్వాత నాలుగు రోజులకు శాక్కొ, వాంజెట్టిలపై మరణశిక్ష విధించేందుకు వాళ్ళిద్దర్నీ థేయర్ కోర్టుకు రప్పించాడు.

# మరణశిక్ష

**డెడ్‌హాం సుపీరియర్ కోర్టులో** 1927 ఏప్రిల్ 9న ఉదయం 10 గంటలకు న్యాయమూర్తి థేయర్ తన స్థానంలో ఆశీనుడయ్యాడు. అరవైతొమ్మిదేళ్ళ వయసున్న థేయర్ అక్కడికి పదిహేను మైళ్ళ దూరంలోవున్న వర్సెస్టర్ నుంచి అంతకుముందే కారులో వచ్చాడు. ఏడేళ్ళుగా జైల్లో మగ్గుతున్న ముప్పై ఆరేళ్ళ శాక్కో, ముప్పైతొమ్మిదేళ్ళ వాంజెట్టిలు ముద్దాయిల బోనులో నిలుచున్నారు. డిఫెన్సు లాయర్లు థామ్సన్, ఎహర్మన్, ప్రాసిక్యూషన్ తరపున జిల్లా అటార్నీ విన్ ఫీల్డ్ విల్బర్, ఆయన అసిస్టెంట్లు విలియం కెల్లీ డడ్లీరానీ కోర్టు హాలుకు అప్పటికే వచ్చి వున్నారు ఐదు వందల మంది జనంతో కోర్టుహాలూ ఆవరణ కిక్కిరిసి పోయాయి. పత్రికా విలేఖరులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

*విన్‌ఫీల్డ్. యువరానర్! కామన్ వెల్త్ వర్సెస్ నికొలా శాక్కో, బార్తొలోమియో వాంజెట్టి కేసులో ముద్దాయిలు ఫస్ట్ డిగ్రీహత్య చేశారని నిర్ధారించబడిందని కోర్టు రికార్డులు తెలియజేస్తున్నాయి . కాబట్టి వీరికి శిక్ష విధించమని కోర్టును అభ్యర్థిస్తున్నాను*

*గుమాస్తా వర్తింగ్టన్. నికొలా శాక్కో! నీకు మరణ శిక్ష ఎందుకు విధించరాదో చెప్పుకునేందుకు ఏమైనా ఉందా?*

వచ్చీరాని ఇంగ్లీషులో శాక్కో మాట్లాడటం మొదలు పెట్టాడు:

**ఎస్‌పర్! నేను వక్తను కాను. ఇంగ్లీషు భాషతో నాకంతగా పరిచయం లేదు. నా కామ్రేడ్ వాంజెట్టి... ఎక్కువ సేపు మాట్లాడలాడని నాకు తెలుసు కాబట్టి ఆయనకు అవకాశం ఇవ్వాలనుకుంటున్నాను.**

**దీనికంటే క్రూరమైన కోర్టు గురించి నేనెక్కడా వినలేదు. కనలేదు. చరిత్రలో చదవలేదు. ఏడేళ్ళ విచారణ తర్వాత కూడా వాళ్ళు మమ్మల్ని దోషులుగా భావిస్తున్నారు. ఇవాళ ఈ పెద్ద మనుషులు ఇక్కడ ఈ కోర్టులో మాతో యుద్ధానికి సన్నద్ధమయ్యారు.**

**పీడితవర్గం, ధనికవర్గం అనే రెండు వర్గాల మధ్య ఈ కేసు నడిచిందని నాకు తెలుసు. ఆ రెండిటి మధ్య ఘర్షణ ఎప్పుడూ ఉంటూనే వుంది. పుస్తకాల ద్వారా, సాహిత్యం**

ద్వారా మేం ప్రజలలో స్నేహం చేస్తాం. మీరు వారిని వేధిస్తారు. వారిపై దౌర్జన్యం చేస్తారు. వాళ్ళను చంపుతారు. ప్రజల్ని విజ్ఞాన వంతులను చేసేందుకు మేము అహర్నిశలూ ప్రయత్నిస్తాం. మాకూ, మరొక జాతికీ మధ్య విభేదాలను సృష్టించేందుకు మీరు ప్రయత్నిస్తారు. సరే మీరు పీడకులు.

న్యాయమూర్తీ! మీకు తెలుసు - నా జీవితం మొత్తం మీకు తెలుసు. నేనిక్కడ ఎందుకున్నానో మీకు తెలుసు. ఏడేళ్ళ తర్వాత కూడా నన్నూ, నా పేద భార్యనూ వేధిస్తున్నారు. ఇంత జరిగాక కూడా మాకు ఇవాళ మరణశిక్ష విధిస్తారు. నా మొత్తం జీవితాన్ని విప్పి చెప్పాలని ఉంది. కానీ ఏం ప్రయోజనం? నేనింతకు ముందు చెప్పిన విషయాలు మీకు తెలుసు. నా స్నేహితుడు - అంటే నా కామ్రేడ్ - చెప్తాడు - అతనికి ఇంగ్లీషులో ఎక్కువ పరిచయం ఉంది. నేనతనికి అవకాశం ఇస్తాను. నా కామ్రేడ్.... పిల్లలందరినీ ప్రేమించే మనిషి. మీరతన్ని రెండు సార్లు శిక్షిస్తున్నారు - బ్రిడ్జివాటర్ కేసులో, నాతోపాటు మళ్ళీ డెడ్‌హాం కేసులో. అతను నిర్దోషని మీకు తెలుసు. మాపై సానుభూతి వ్యక్తం చేసేందుకు తన మొత్తం శక్తిని ప్రేమను మా కోసం ధారపోసి ఏడేళ్ళపాటు మాకు తోడున్న ప్రజానీకాన్ని మీరు మర్చిపోతున్నారు. వాళ్ళను మీరు లక్ష్యపెట్టరు. ఆ ప్రజల్లో, కామ్రేడ్స్‌లో, కార్మికవర్గంలో పెద్ద మేధావుల బృందం కూడా ఏడేళ్ళుగా మా వైపే వుంది. ఈ పాపిష్టి శిక్షను వేయించడం కోసం కాదు వారు ప్రయత్నించింది! అయినా కోర్టు తనపని తాను చేసుకుపోతూనేవుంది. మాలో, శాక్కో-వాంజెట్టి కేసులో, ఏడేళ్ళ పాటున్న మీకందరికీ, ప్రజలందరికీ నా కామ్రేడ్స్‌కూ కృతజ్ఞతలు చెప్తున్నాను. ఇక నా మిత్రుడికి అవకాశం ఇస్తాను.

శాక్కో కూర్చున్నాడు వాంజెట్టి ఏదో గుర్తుచేస్తే మళ్ళీ ఈ మాటలు చెప్పాడు:

నేనొక విషయం మర్చిపోయాను. నా కామ్రేడ్ గుర్తు చేశాడు. నేనింతకుముందు చెప్పినట్టుగా జడ్జి థేయర్‌కు నా జీవితమంతా తెలుసు. నేను ఏనాడూ దోషిని కానని- నిన్న, ఈ రోజు, మరెప్పటికీ దోషిని కానని - ఆయనకు తెలుసు.

*గుమాస్తా వర్తింగ్టన్ : బార్తలోమియో వాంజెట్టి, నీపై మరణశిక్ష ఎందుకు విధించరాదో చెప్పుకునేందుకేమైనా ఉందా?*

వాంజెట్టి లేచి నిల్చున్నాడు. వాంజెట్టి చెప్పేమాటలు వినేందుకు కోర్టుహాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

వాంజెట్టి తనదైన శైలిలో ప్రసంగం ప్రారంభించాడు. జైల్లో ఏడేళ్ళుగా నేర్చుకున్న శత్రుభాషపై తనకున్న పట్టుతో అనర్గళంగా ప్రసంగించాడు:

ఎస్. నేను చెప్పేదేమంటే నేను నిర్దోషిని. బ్రెయిన్‌ట్రీ నేరంలోనేకాదు - బ్రిడ్జివాటర్ నేరంలో కూడా. ఈ రెండిటిలో మాత్రమే కాదు. నామొత్తం జీవితంలో నేనెప్పుడూ దొంగతనం చేయలేదు. నేనెవర్నీ చంపలేదు. నేనెప్పుడూ రక్తం చిందించలేదు. అదీ నేను చెప్పదల్చుకుంది. అంతేకాదు. ఈ రెండు నేరాల్లో నేను నిర్దోషిని కావడమే కాకుండా, నా జీవితంలో నేనెప్పుడూ దొంగతనం హత్యలు చేయకపోవడమే కాకుండా, రక్తం చిందించకపోవడమే కాకుండా ప్రపంచం మంచి నేరాన్ని పారదోలడం కోసం నాకు ఊహ తెలిసిన నాటి నుంచీ నా జీవితమంతా పోరాడాను.

నడిరోడ్డు మీదికెళ్ళి మనిషిని చంపి డబ్బు కాజేయాల్సిన అవసరం నాకు లేదని నా ఈ రెండు చేతుల గురించి తెలిసిన ప్రతి ఒక్కరికీ తెలుసు. నా రెక్కలతో నేను బతగ్గలను. బాగానే బతగ్గలను. అంతేకాకుండా ఇంకొకరికింద పని చేయకుండానే బతగ్గలను. మన నుదుటి చెమటతో మన తిండి సంపాదించుకోవడం కంటే ప్రపంచం దేనినైతే ఉన్నత జీవితంగా భావిస్తుందో అలా స్వతంత్రంగా జీవించేందుకు నాకు బోలెడు అవకాశాలున్నాయి.

ఇటలీలో మా నాన్న మంచి స్థితిలో ఉన్నాడు. నేను ఇటలీకి వెళ్ళగలిగితే ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించి ఉండేవాడు. నా జేబులో చిల్లిగవ్వలేకుండా వెళ్ళినా నాకు కొంత ఆస్తి ఇవ్వగలిగేవాడు. శ్రమ చేసేందుకు కాదు.. వ్యాపారం చేసేందుకు... ఆయన వ్యవసాయాన్ని పర్యవేక్షించేందుకు. అలా అని ఆయన నాకు చాలా ఉత్తరాలు రాశాడు. అదే అర్థం వచ్చే విధంగా స్థితిపరులైన కొందరు బంధువులు నాకు చాలా లేఖలు రాశారు. నేను వాటిని చూపించగలను.

.............................

సరే! నేను ఇంకాస్త ముందుకెళ్తాను. అదేమిటంటే - బ్రిడ్జివాటర్‌లో దొంగతనం చేసేందుకు ప్రయత్నించక పోవడమే కాక, దొంగతనం, హత్యలు చేసేందుకు బ్రెయిన్‌ట్రీ వెళ్ళకపోవడమేకాక, నా జీవితమొత్తంలో నేనెప్పుడూ దొంగతనం చేయడం, చంపడం, రక్తం చిందించడం చేయకపోవడమేకాక నేరాలకు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేయడమేకాక - విలాసాలను, జీవితవైభవాల్ని, సంపద వల్ల వచ్చే గర్వాతిశయాన్ని నాకు నేనే తిరస్కరించాను. ఎందుకంటే, నా దృష్టిలో మనిషిని మనిషి దోచుకోవడం మంచిదికాదు. నేను వ్యాపారం చేసేందుకు నిరాకరించాను. ఎందుకంటే వ్యాపారం - వ్యాపారి మీద ఆధారపడాల్సిన ప్రజల మీద లాభం సంపాదించే వ్యవహారం అని నేనర్థం చేసుకున్నాను. వ్యాపారం చేయడం సరైనదని నేననుకోను. అందువల్ల అది చేపట్టేందుకు నిరాకరించాను.

వీటన్నిటిలో నేను నిర్దోషినే కాక, నిజమైన నేరాన్నెప్పుడూ నా జీవితంలో చేయకపోవడమే కాక (కొన్ని పాపాలు చేసినప్పటికీ అవి నేరాలు కావు) అధికార చట్టం, అధికార నీతి ఖండించే నేరాలను రూపుమాపేందుకే కాక - అధికారనీతి, అధికార చట్టం అనుమతించి పవిత్రతను ఆపాదించే నేరాలను కూడా - అంటే మనిషిని మనిషి దోచుకోవడాన్ని అంతమొందించేందుకు నేను జీవితమంతా పోరాడాను. నేనిక్కడ దోషిగా నిలబడేందుకు కారణమేదైనా వుంటే, కొద్ది నిమిషాల్లో మీరు నాకు మరణశిక్ష విధించేందుకు కారణమేదైనా వుంటే అది ఇది తప్ప మరొకటి కాదు.

క్షమించాలి. *(చేతిలో ఉన్న కాగితాన్ని చూస్తూ)* నేనెప్పుడు చూడని మనిషి ఒకాయన ఉన్నాడు. మంచి తనానికి, త్యాగానికి విలువ వున్నంత కాలం ప్రజలకు అతి సన్నిహితుడిగా, అత్యంత ఆప్తుడిగా వాళ్ళ హృదయాల్లో సదా మనగలిగే మనిషాయన. నేను యూజిన్‌డెబ్స్ గురించి మాట్లాడుతున్నాను. ప్రభుత్వం మాకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాల ఆధారంతో మమ్మల్ని శిక్షించే అమెరికన్ జూరీని కోడిపిల్లలను చంపిన ఒక కుక్క కూడా చూసివుండదంటాను. నాతో పాటు ప్లిమత్‌లోగానీ, నేరం జరిగిన రోజు శాక్కో ఉన్న చోటగానీ ఆయన లేడు. మీరు దాన్ని ఏకపక్ష అభిప్రాయంగా భావించవచ్చు. మేం చెప్పేదేమిటంటే ఆయన మంచివాడు. ఆయన తన మంచి తనాన్ని ఇతరులకు కూడా ఆపాదించాడు. ఆయన నేరానికి పాల్పడలేదు. ప్రతివారూ నేరాలు చేయలేని వారేనని ఆయన నమ్మాడు.

సరే! ఉండొచ్చు. కానీ (ప్రపంచం) అలా లేదు. అది అలా ఉండగలదు. కానీ అది అలాలేదు. ఆయనకు కోర్టు గురించీ, జైలు, జూరీల గురించీ ప్రత్యక్ష అనుభవం ఉంది. ఈ ప్రపంచం ఇంకాస్త బాగా ఉండాలని కోరుకున్నంత మాత్రాన ఆయనను వేధించారు. బాల్యం మంచి వృద్ధాప్యం దాకా ఆయనను వేధింపులకు గురిచేశారు. ఆయనపై అభాండాలు వేశారు. నిజానికి ఆయన్ని జైలే హత్య చేసింది.... ప్రపంచంలో అర్థం చేసుకున్న ప్రతి ఒక్కరూ.... ఇంకా మమ్మల్ని అంటిపెట్టుకునే ఉన్నారు. యూరప్‌కు చెందిన మహా మేధావులు మా తరపున వాదించారు. సైంటిస్టులు, గొప్ప సైంటిస్టులు, యూరప్‌లోని గొప్ప రాజనీతిజ్ఞులు మా తరపున వాదించారు.

... చూడండి! మేం జైల్లో ఉండబట్టి ఏడేళ్ళయింది. ఈ ఏడేళ్ళలో మేం ఏ బాధలనుభవించామో చెప్పడానికి మాటలు చాలవు. అయినప్పటికీ, మీ ముందు తొణక్కుండా నిలబడి, తెల్లమొహం వేయకుండా, సిగ్గుపడకుండా, నిర్భయంగా మీ కళ్ళలోకి సూటిగా చూస్తున్న నన్ను మీరు చూస్తున్నారు.

మాకు వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాక్ష్యాల ఆధారంగా కోడిపిల్లలను చంపిన కుక్కను కూడా అమెరికన్ జూరీ నేరస్తురాలిగా నిర్ధారించి ఉండబోదని యుజిన్ డెబ్స్ అన్నాడు. ఒక కుష్టు కుక్కకు కూడా - ఒక కుష్టుకుక్కకు కూడా - మసాచూసెట్స్ సుప్రీంకోర్టు రెండుసార్లు అప్పీలు తిరస్కరించదని నేనంటాను.

నేరస్తుడని కోర్టులో నిర్ధారించబడేదాకా ముద్దాయిని నిర్దోషిగా భావించాలని న్యాయమూర్తి జూరీకి చెప్పడం మర్చిపోయాడు. కాబట్టి లేదా అలాంటిదే మరేదో జరిగింది కాబట్టి మెదైరోస్ కేసును తిరిగి విచారించారు. అతను నేరం చేశానని ఒప్పుకున్నాడు. అతనిపై విచారణ జరిగింది. అతను నేరం చేశానన్నాడు - అతనిపై కేసులో మరోసారి విచారణ జరిపారు. మాకు వ్యతిరేకంగా మీరున్నంత ఆపోహతో క్రూరత్వంతో మరో న్యాయమూర్తి ఈ భూమ్మీద ఉండడని మేం నిరూపించాం. అయినా మరోసారి కేసు విచారణ జరిపించేందుకు తిరస్కరించారు. మొదట్నుంచీ, మమ్మల్ని చూడకముందు నుంచీ మీరు మాకు వ్యతిరేకంగా ఉన్నారని మాకు తెలుసు. మీ హృదయాంతరాళానికి తెలుసు - మేం రాడికల్స్ మనీ మేం అథోజగత్ జనులమనీ, మీరు మంచిదని నమ్మిన వ్యవస్థకు (మీ నమ్మకాన్ని నేను ఖండించాలనుకోను) మేం శత్రువులమనీ, మమ్మల్ని నేరస్థులుగా నిర్ధారించే తీర్పు సంపాదించడం తేలికనీ - మమ్మల్ని చూడకముందే మీకు తెలుసు.

మా పట్ల మీకున్న శత్రుత్వాన్ని గురించి మాపట్ల మీకున్న చులకన భావం గురించీ మీరు రైల్లో, బోస్టన్ యూనివర్శిటీ క్లబ్బులో, వర్సెస్టర్ గోల్ఫ్ క్లబ్బులో స్వయంగా మీ స్నేహితులతో చెప్పారని మాకు తెలుసు. వాళ్ళు బోనెక్కి సాక్ష్యం చెప్పేందుకు సాహసిస్తే మీరు ఇప్పుడు ఖచ్చితంగా మా పక్కన నిల్చుని వుండే వారు. ఇది చెప్తున్నందుకు క్షమించాలి యువరానర్. ఎందుకంటే మీరు వృద్ధులు. నా తండ్రి కూడా వృద్ధుడే.

నా సిద్ధాంతానికి అనుగుణంగా నా నేరాలున్నాయని ప్లిమత్ కేసులో నాకు శిక్ష విధించినప్పుడు మీరు చెప్పినట్టు గుర్తు... జూరీ ఎంతగా కోపం ప్రదర్శించిందంటే - ఉన్న రెండు ఆరోపణల్లోనూ నన్ను దోషిగా ప్రకటించింది. ఎందుకంటే ఉన్నవి రెండే ఆరోపణలు... మీరు (ఒక) ఆరోపణను తోసి పుచ్చారు.* ఆయుధాలతో దోపిడీకి

---

* *ప్లిమత్ కోర్టులో విచారించబడ్డ బ్రిడ్జివాటర్ కేసులో వాంజెట్టి మీద రెండు ఆరోపణలు చేశారు. ఒకటి దోపిడీ యత్నం. రెండవది హత్యా ప్రయత్నం. రెండిటిలో వాంజెట్టిని జూరీ దోషిగా నిర్ధారించగా న్యాయమూర్తి ఒకదాన్ని (హత్యా ప్రయత్నం) తోసి పుచ్చాడు. రెండో ఆరోపణలో మాత్రం వాంజెట్టికి భారీగా శిక్ష విధించాడు.*

ప్రయత్నించావన్న నేరంలో శిక్ష విధించారు. కానీ న్యాయమూర్తి థేయర్ గారూ! దోపిడీ యత్నం కేసుల్లో పట్టుబడి చార్లెస్‌టౌన్ జైల్లో ఉన్న 448 మందికన్నా నాకు మీరు ఎక్కువ శిక్షవేశారు. దోపిడీ యత్నానికి మీరు నాకు విధించినంత శిక్ష మరెవరికీ వేయలేదు.

ఎవరైనా సరే జైలుకు వెళ్ళి నేను చెప్పేది నిజమో కాదో విచారించవచ్చు. దోపిడీనే వృత్తిగా చేపట్టిన వాళ్ళు చార్లెస్‌టౌన్ జైల్లో ఉన్నారు. అమెరికా జైళ్ళలో సగం మంది వాళ్ళే. వాళ్ళు దొంగతనాలు చేశారు. మనుషులను గాయపర్చారు. కాల్పులు జరిపారు. అదృష్టవశాత్తూ అవతలి వాళ్ళు చనిపోలేదు. ఆ దొంగల్లో ఎక్కువ మంది నేరం చేశామని స్వయంగా అంగీకరించారు. .... కేసు విచారణ జరగక ముందే నేరస్థులుగా నిర్ధారించబడ్డారు. అయినా వాళ్ళకు 8-10, 8-12, 10-15 సంవత్సరాల జైలు శిక్ష విధించారు. కానీ, మీరు దోపిడీయత్నం కేసులో నాకు వేసినట్టుగా 12 నుంచి 15 ఏళ్ళ శిక్ష వారెవరికీ పడలేదు. నేనెక్కడుంటే అక్కడ నా వ్యక్తిగత జీవితం బహిరంగ జీవితం ఇతరులకు మార్గ దర్శకమని మీకు తెలుసు. అందువల్లే, మా జీవితం గురించీ మా నడవడిక గురించీ సాక్ష్యాలను ప్రవేశ పెట్టాలంటే ప్రాసిక్యూటర్ బాగా భయపడ్డాడు. తన బలాన్నంతా ఉపయోగించి వాటిని లాగేశాడు. గెల్చాడు.

ప్లిమత్‌లో మొదటి కేసులో నా తరఫున థామ్సన్‌గానీ, మెక్ ఎనార్నీ గానీ ఉన్నట్టయితే ఏ జూరీ కూడా నన్ను దోషిగా నిర్ధారించి ఉండబోదని మీకు తెలుసు. నా మొదటి లాయర్ కట్జ్‌మన్ గారి భాగస్వామి.* ఇప్పటికీ అతను భాగస్వామే. నా మొదటి డిఫెన్స్ లాయర్ వాహే గారు నా కోసం వాదించలేదు. జీసస్ క్రీస్తును జుడాస్ అమ్ముకున్నట్టు ముప్పై బంగారు నాణేలకు నన్ను అమ్మాడు. నేను నేరం చేశానని మీకు గానీ, కట్జ్‌మన్‌కు గానీ (నేరుగా) ఆయన చెప్పలేదంటే అందుకు కారణం నేను నిర్దోషినని అతనికి తెలుసు కాబట్టి. మమ్మల్ని భయపెట్టేందుకు ఆయన చేయగలిగిందంతా చేశాడు. అనవసర విషయాల గురించి జూరీముందు సుదీర్ఘంగా ఉపన్యసించాడు. కేసు విచారణలో కీలకమైన విషయాల గురించి రెండు మాటల్లో ముగించడమో, పూర్తిగా మౌనం వహించడమో చేశాడు....

ఇప్పుడు కాలగర్భంలో కలిసి పోయిన ఓ కాలంలో మాపై కేసు విచారణ జరిగింది..... అంటే, మా సిద్ధాంతాలను నమ్మినవారికీ, విదేశీయులకూ, అణగారిన ప్రజలకూ

* బ్రిడ్జివాటర్ కేసులో వాంజెట్టి తరఫున వాదించిన లాయర్ వాహే జిల్లా అటార్నీ కట్జ్‌మన్‌తో కలిసి కొంత కాలం ప్రాక్టీసు చేశాడు.

వ్యతిరేకంగా ఆగ్రహద్వేషాల ఉన్మాదం చెలరేగిన కాలం అది. జూరర్ల ఉద్రేకాన్నీ, వారి అపోహలనూ మాపై రెచ్చగొట్టేందుకు మీరు, కట్జ్‌మన్ కలిసి చేతనైనదంతా చేశారని నాకనిపిస్తుంది.

. . . . . . . . . .

.... మేం యుద్ధ వ్యతిరేకులం కాబట్టి జూరీ మమ్మల్ని ద్వేషించింది. యుద్ధం అన్యాయమైందని నమ్మినందువల్ల... ప్రపంచమంతా ఒకటేనని నమ్మినందువల్ల మేం యుద్ధాన్ని వ్యతిరేకించాం. గూఢచారులుగా మారి శత్రుదేశం పక్షాన ఏ నేరానికైనా ఒడిగట్టేవారికీ మాకూ మధ్య తేడా ఉన్నదని జూరీకి తెలియదు. మేం అలాంటి మనుషులం కాదు. ఏ ప్రయోజనాన్ని ఆశించి యుద్ధం చేస్తున్నామని వాళ్ళు చెప్పారో దానిపై మాకు నమ్మకంలేదు కాబట్టి మేం యుద్ధాన్ని వ్యతిరేకించామని కట్జ్‌మన్‌కు తెలుసు. యుద్ధం చేయడం తప్పు అని మేం నమ్ముతాం. ఇదివరకటికంటే ఎక్కువగా మేం యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాం. "చూడండి! మీరు భూస్థాపితమయ్యారు. ఎందుకోసం? వాళ్ళు మీకు చెప్పిందంతా, వాళ్ళు మీకు వాగ్దానం చేసిందంతా ఒక అబద్ధం. ఒక భ్రమ. ఒక మోసం. దగా, నేరం. మీకు స్వేచ్ఛ లభిస్తుందని వాళ్ళు హామీ ఇచ్చారు. స్వేచ్ఛ ఎక్కడుంది? మీకు ఐశ్వర్యం వచ్చిపడుతుందని వాళ్ళు హామీ ఇచ్చారు. ఎక్కడుంది ఆ ఐశ్వర్యం? మీరు ఉన్నత స్థితికి చేరుకుంటారని వాళ్ళు హామీ ఇచ్చారు. ఎక్కడుంది ఆ ఉన్నత స్థితి?" అని మానవాళికి చెప్పగలిగినట్లైతే చావు దాపురించిన ఉరికంబం మీద నిలబడేందుకు సంతోషిస్తాను.

నేను ఛార్లెస్‌టౌన్ జైలు కెళ్ళిన రోజు నుంచీ చూస్తున్నాను - దరిద్రం, జైలు జనాభా రెట్టింపయ్యాయి. యుద్ధం ప్రపంచానికి అందించిన మంచి ఏది? యుద్ధం మంచి మనం సాధించిన మానసిక ఔన్నత్యం ఏది? జీవితానికి, జీవితావసర వస్తువులకు భద్రత ఎక్కడుంది? మానవ జీవితానికి గౌరవం ఎక్కడుంది? మానవ స్వభావంలో మంచికీ, మంచిలక్షణాలకూ గౌరవం, అభినందనా ఎక్కడున్నాయి? ఇప్పుడున్నన్ని నేరాలు, ఇంత అవినీతి, ఇంత దిగజారుడుతనం యుద్ధానికి ముందు ఏనాడూ లేవు.

. . . . . .

కేసును ఆలస్యం చేసేందుకై కేసు విచారణకు డిఫెన్స్ ఎన్నో అడ్డంకులు కల్పించిందని చెప్పారు. అది నిజం కాదు. అలా చెప్పడం హానికరమైందనుకుంటున్నాను. మమ్మల్ని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వం ఒక సంవత్సరకాలం మొత్తాన్నీ వినియోగించిందనే విషయం గమనిస్తే, మా కేసు నడిచిన ఐదేళ్ళలో ఒక ఏడాదిని మా కేసు విచారణ ప్రారంభించేందుకే ప్రాసిక్యూషన్ ఖర్చుచేసిందన్నమాట. ఆ తర్వాత డిఫెన్స్ మీకు అప్పీలు చేసింది. ..... మా అప్పీలును తిరస్కరిద్దామని విచారణ పూర్తయ్యే వరకే మీరు

నిశ్చయించుకున్నారని అనుకుంటున్నాను. మీరు నెల, నెలా పదిహేను రోజులు ఆగి క్రిస్మస్ ముందు రోజు.... సరిగ్గా క్రిస్మస్ ముందురోజు సాయంత్రం మీ నిర్ణయాన్ని ప్రకటించారు. క్రిస్మస్-సాయంత్రపు పురాణ గాథలో మతపరంగా గానీ, చరిత్ర దృష్ట్యాగానీ మాకు నమ్మకంలేదు మన ప్రజల్లో కొందరు ఇప్పటికీ దానిని నమ్ముతారని మీకు తెలుసు. మేం దాన్ని నమ్మం. కాబట్టి దానర్థం మేం మానవులం కాదని కాదు. మేం మనుషులమే. ప్రతి మనిషికీ క్రిస్మస్ తీయనిదే. మా కుటుంబ సభ్యుల మనసునూ, మేం ప్రేమించినవారి మనసులనూ విషపూరితం చేసేందుకు మీరు క్రిస్మస్ ముందురోజు సాయంత్రం మీ నిర్ణయాన్ని ప్రకటించారని నేననుకుంటున్నాను

. . . . . . . . . .

సరే! నేను ఈ రెండు నేరాల్లో నిర్దోషినే కాక నా జీవితంలో నేనెప్పుడూ నేరం చేయలేదని ఇప్పటికే చెప్పాను. నేనెప్పుడూ దొంగతనం చేయలేదు. నేనెవరినీ చంపలేదు. నేనెప్పుడూ రక్తం చిందించలేదు. నేరాలకు వ్యతిరేకంగా పోరాడాను. చట్టం, చర్చి ఆమోదించి పవిత్రమైనవిగా ప్రకటించిన నేరాలను కూడా రూపు మాపేందుకు నేను పోరాడాను. నన్ను నేను ధారపోశాను.

నేను చెప్పదల్చుకున్నది ఇది: చేయని నేరానికి నేను పడుతున్న పాట్లు ఒక కుక్కగానీ, పాముగానీ, భూమ్మీదున్న ఏ అత్యల్ప దురదృష్టకర ప్రాణిగానీ.... అనుభవించాలని నేను కోరుకోను. నేను చేసిన పనుల గురించే నేను బాధలు పడ్డానని నా నిశ్చితాభిప్రాయం. నేను రాడికల్ ను కాబట్టే నేను బాధలనుభవించాను. అవును నేను రాడికల్నే. నేను ఇటాలియన్ను కాబట్టే నేను కష్టాలనుభవించాను. అవును నేను ఇటాలియన్నే. నా కోసం కంటే నాకుటుంబం కోసం, నేను ప్రేమించిన వారి కోసం నేనెక్కువ బాధలనుభవించాను. కానీ, మీరు నన్ను రెండు సార్లు చంపగలిగిత, నేను రెండుసార్లు తిరిగి జన్మించగలిగితే నేనిప్పటికే చేసిందానిని మళ్ళీ చేసేందుకే జీవిస్తాను. అదే సరైనదని భావిస్తున్నాను.

నా గురించే నేను ఎక్కువగా మాట్లాడాను. శాక్కో పేరు ప్రస్తావించడం కూడా మర్చిపోయాను. శాక్కోకూడా చిన్నతనం నుంచీ కార్మికుడే. శ్రమను ప్రేమించే నిపుణుడైన కార్మికుడు. మంచి ఉద్యోగం, జీతం, బాంక్ ఖాతా, మంచి అందమైన భార్య, ముద్దులొలికే ఇద్దరు పిల్లలూ, సెలయేటి పక్కన చెట్ల తోపు చివరన ముచ్చటైన చక్కని ఇల్లు అతనికున్నాయి. శాక్కో ఒక హృదయం. ఒక విశ్వాసం. ఒక మనిషి. ప్రకృతిని ఆరాధించే మానవజాతిని ప్రేమించే మానవుడు. స్వేచ్ఛకోసం, మానవాళి పట్ల తన ప్రేమకోసం తన సర్వస్వాన్ని ధారపోసిన మనిషి. డబ్బును, విశ్రాంతిని,

కోరికలను, తన భార్యా పిల్లలను, తననూ, తన సొంత జీవితాన్ని ఒదులుకున్న మనిషి. దొంగతనం చేయాలనిగానీ, హత్యకు పాల్పడాలనిగానీ శాక్కో ఏనాడూ కలలో కూడా ఊహించలేదు. చిన్నతనం నుంచి ఇప్పటిదాకా నేనూ, శాక్కో మా నుదుటి చెమటతో సంపాదించని చిన్న రొట్టె ముక్కను కూడా నోట్లో పెట్టుకోలేదు.

అవును!.... నేనతనికంటే కాస్త బాగా మాట్లాడవచ్చు. కానీ మహోన్నత విశ్వాసాన్ని రేకెత్తించే అతని హృదయపూర్వక స్వరాన్ని విని, అతని మహత్తర త్యాగాన్ని చూసి, అతని వీరత్వాన్ని మననం చేసుకొని - అతని మహోన్నతత్వం ముందు అల్పుడినని నేను అనుకున్నాను. కన్నీళ్ళను కష్టపడి ఆపుకున్నాను. అతని ముందు రోదించవద్దని గొంతుకలో కొట్లాడుతున్న గుండెను సమాధానపర్చాను. - ఈ మనిషిని దొంగనీ, హంతకుడనీ అన్నారు. దురవస్థపాలు చేశారు. కట్జ్‌మన్ ఎముకలనూ, మీ ఎముకలనూ కాలం ఏరి పారేసినప్పుడు, మీ పేరూ ఆయన పేరూ, మీ చట్టాలూ సంస్థలూ, మీ తప్పుడు దేవుడూ - మనిషికి మనిషే శత్రువైన శాపగ్రస్త గతకాలపు అస్పష్టజ్ఞాపకాలుగా మాత్రమే మిగిలిన రోజున ప్రజల హృదయాల్లో, వారి కృతజ్ఞతా భావనలో శాక్కో పేరు జీవిస్తుంది.*

*థాంక్యూ! ముగించాను.*

వాంజెట్టి ఉపన్యాసం ముగిసేసరికి కోర్టులో వున్న ప్రేక్షకుల కళ్ళు చెమర్చాయి. వాంజెట్టి అద్భుత ప్రసంగానికి వాళ్ళు ఆశ్చర్య చకితులయ్యారు. తర్వాత న్యాయమూర్తి తనను తాను సమర్థించుకుంటూ క్లుప్తంగా మాట్లాడాడు:

*ఒక ముద్దాయి దోషి, నిర్దోషి మసాచూసెట్స్ చట్టాల ప్రకారం, జూరీ చెప్తుంది ఆ ప్రశ్నతో కోర్టుకు ఏ మాత్రం సంబంధం లేదు. వాస్తవాల విషయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకోరాదని మసాచూసెట్స్ న్యాయశాస్త్రం చెప్తుంది. సాక్ష్యాన్ని వివరించడం వరకు మాత్రమే, మన చట్టాల ప్రకారం, న్యాయమూర్తి చేయవచ్చు.*

*విచారణ జరిగే సందర్భంలో అనేక అభ్యంతరాలు లేవనెత్తబడ్డాయి. ఆ అభ్యంతరాలను సుప్రీం జుడీషియల్ కోర్టుకు తీసుకెళ్ళారు. రికార్డు మొత్తాన్ని పరిశీలించాక, అన్ని అభ్యంతరాలనూ పరీక్షించిన తర్వాత అంతిమంగా కోర్టు ఇలా చెప్పింది: 'జూరీ తీర్పు సమంజసమే. అభ్యంతరాలు తోసిపుచ్చబడ్డాయి.' అది నిజం కాబట్టి ఈ కోర్టు ఒకే ఒక పని చేయగలదు. అది ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేనిది. అది చట్టబద్ధంగా చేయాల్సిన పని.... కోర్టు మీదుండేది ఒకే ఒక బాధ్యత. శిక్షలు ప్రకటించడం.*

* చివరి రెండు పేరాల్లో ఉన్నదాన్ని వాంజెట్టి కోర్టులో చెప్పడం మర్చిపోయాడు. మరుసటి రోజు రాసి తన కోర్టు ప్రసంగానికి చేర్చమని పంపాడు.

తర్వాత శాక్కో వాంజెట్టిలకు న్యాయమూర్తి శిక్ష విధించాడు.

థేయర్: నికొలా శాక్కో అనే మన్వ్య క్రీస్తు శకం పందొమ్మిది వందల ఇరవై ఏడో సంవత్సరం జులై నెల పదవరోజున ఆదివారంతో మొదలయ్యే వారంలో నీ శరీరంలోకి విద్యుత్ తరంగాలు పంపబడి మరణశిక్ష అనుభవించమని కోర్టు ఆజ్ఞాపిస్తోంది.— బార్టొలోమియో వాంజెట్టి అనే మన్వ్య...

వాంజెట్టి: యువరానర్! దయచేసి ఒక్క నిమిషం ఆగండి. నేను ఒక్క క్షణం నా లాయర్ థామ్సన్‌తో మాట్లాడ వచ్చా?

థేయర్: నేను శిక్ష ప్రకటించాలనుకుంటున్నాను - బార్టొలోమియో వాంజెట్టి, క్రీస్తుశకం పందొమ్మిది వందల .....

శాక్కో : (పెద్దగా) నేను నిర్దోషినని మీకు తెలును. ఇవినేను ఏడేళ్ళ క్రితం చెప్పిన మాటలే. ఇద్దరు నిర్దోషులను మీరు చంపుతున్నారు.—

థేయర్: ఇరవైఏడో సంవత్సరం జులై నెల పదవ రోజున ఆదివారంతో మొదలయ్యే వారంలో నీ శరీరంలోకి విద్యుత్ తరంగాలు పంపబడి మరణశిక్ష అనుభవించు. ఇది చట్టం విధిస్తున్న శిక్ష.

ఈ సందర్భంలో న్యాయమూర్తి 'దేవుడు మీ ఆత్మలపై దయప్రసరించుగాక!' అని కూడా చెప్పి శిక్షా ప్రకటనను ముగించడం ఆనవాయితీ. కానీ థేయర్ ఆ మాటలనేందుకు సాహసించలేదు.

# ఫుల్లర్ - లోవెల్

శాక్కో, వాంజెట్టి లకు మరణశిక్ష విధించిన వార్త అమెరికా దినపత్రికలకు పతాక శీర్షికైంది. కోర్టులో ముద్దాయిల ప్రసంగాల పూర్తి పాఠాన్ని కొన్ని దినపత్రికలు ప్రచురించాయి. మరణశిక్ష విధించే సమయంలో ముద్దాయిలు అలా ప్రసంగించడం అమెరికా చరిత్రలోనే మొదటి సారి అని రాశాయి. వాంజెట్టి ఉపన్యాసం ఒక తరం అమెరికా మేధావులను ఉత్తేజ పర్చింది. అబ్రహాం లింకన్ ఉపన్యాసాల తర్వాత అంత గొప్ప ఉపన్యాసం ఇదేనని అప్టన్ సింక్లేర్ ప్రస్తుతించాడు. వాంజెట్టి చెప్పిన *"నేనెప్పుడూ రక్తం చిందించలేదు"* అనే వాక్యం రాసిన బేనర్లు న్యూయార్క్ యూనియన్ స్క్వేర్‌లో వేలాదిమంది ప్రదర్శకుల మధ్య రెపరెపలాడాయి.

*జడ్జి థేయర్ మరణ శిక్ష విధించినప్పుడు, వాంజెట్టి తన 45 నిమిషాల ఉపన్యాసంతో కోర్టులో ఉన్నవాళ్ళందర్నీ ఆకట్టుకున్నాడు. విషం తాగేందుకు తయారౌతూ సోక్రటీస్ చెప్పిన అమరవాక్యాలతో కొందరు శ్రోతలు దాన్ని పోల్చారు వాంజెట్టి జీవించాలను కున్నాడు. కానీ మృత్యువుకు భయపడలేదు.**

శిక్ష ప్రకటించిన రెండవరోజున వాంజెట్టి లూగియాకు రాసిన ఒక లేఖలో ఇలా చెప్పాడు:

*నేననుకున్నది నిజమైంది. ఈ నెల 5న కోర్టు మా అప్పీలును తిరస్కరించింది. అలా జరగడం అసంభవమని... అనుకున్న చాలా మంది బాధపడ్డారు. రగిలిపోయారు.*

*మమ్మల్ని 9న కోర్టుకు తీసుకెళ్ళారు. శిక్ష విధించారు. మేం కోర్టులోకి ప్రవేశించగానే కొందరు ప్రేక్షకులు లేచి నిల్చున్నారు. కోర్టు సిబ్బంది కూర్చోమని చెప్పకపోయినట్లైతే మిగిలిన వాళ్ళు కూడా అదేపని చేసేవారు. చెప్పుకోడానికేమైనా ఉందా అని మమ్మల్ని అడిగినప్పుడు శాక్కో కొంచెంసేపు మాట్లాడాడు. నేను మాత్రం చాలాసేపు మాట్లాడాను. నేను ముగించినప్పుడు చుట్టూ చూశాను. స్త్రీలు ఏడుస్తుండటం చూశాను. పురుషులు మూతులు బిగబట్టి మొహాలు ముడుచుకుని ఉండటం గమనించాను.*

---

* మైకేల్ ముస్మానో: వెర్డిక్ట్

ఈ రాష్ట్ర చరిత్రలో లేదా దేశచరిత్రలో మరణశిక్ష విధించ బడిన మనుషులు మాలాగా ఎన్నడూ ప్రవర్తించలేదనీ, ప్రసంగించలేగనీ (వార్తా పత్రికలు) రాశాయి నేను నిజమైన వక్తనని ప్రకటించారు

నా ఉపన్యాసంలాగా తనను కదిలించినది మరొకటి లేదని ప్రొఫెసర్ ఫ్రాంక్‌ఫర్టర్ అన్నారని న్యూయార్క్ వరల్డ్ పేర్కొంది .

.ఏమైనప్పటికీ, నా మాటలు చరిత్రపై తీవ్ర ప్రభావాన్ని ప్రసరించవచ్చు కానీ ఈ కేసు మీద మాత్రం వాటి ప్రభావమేమీ ఉండదు.

కేసులో వరసగా జరిగిన రెండు ముఖ్య ఘటనలు (అప్పీలును తోసి పుచ్చడం, మరణశిక్ష విధించడం) అమెరికాలోనే కాక ప్రపంచమంతటా ఈ కేసు మరోసారి ప్రాముఖ్యతను సంతరించుకునేట్టు చేశాయి. అంతకు కొన్ని రోజుల ముందు ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ అట్లాంటిక్ మంత్లీలో ప్రచురించిన సుదీర్ఘ వ్యాసం శాక్కో- వాంజెట్టి కేసులో అన్యాయం జరుగుతోందని ఇంటా బయటా మేధావులు గ్రహించేట్టు చేసింది. ఫలితంగా కేసు గురించి మరింత విస్తృత స్థాయిలో ఉద్యమం చెలరేగింది. తీవ్ర చర్చలు మొదలయ్యాయి.

మరణశిక్ష విధింపుకు నిరసనగా అక్కడక్కడా ప్రదర్శనలూ, సభలూ జరిగాయి. మసాచూసెట్స్‌లో మాత్రం పెద్దగా నిరసన వ్యక్తం కాలేదు. నార్త్ యామ్టన్‌లో ఒక ప్రొఫెసర్ ప్రసంగిస్తున్న నిరసన సభను రాడికల్స్ వ్యతిరేకులు భగ్నం చేశారు. మసాచూసెట్స్‌లో ప్రముఖ మేధావి ఎడ్వర్డ్ హోల్టన్ జేమ్స్ ఏప్రిల్ 15న కొత్త తరహాలో నిరసన వ్యక్తం చేశాడు. సౌత్ బ్రెయిన్ ట్రీకి వెళ్ళి అక్కడ నేరం జరిగిన చోటనే కొందరు విద్యార్థులతో నేరాన్ని ప్రదర్శింపజేశాడు. హంతకులు ఎలా పారిపోయారో, సాక్షులకు వాళ్ళను చూసేందుకు, గుర్తించేందుకు ఎలాంటి ఇబ్బందులున్నాయో కళ్ళకు కట్టినట్టు చూపించి రక్తికట్టించాడు. పెద్ద సంఖ్యలో ప్రజలు, పత్రికా విలేఖరులు పోగయ్యారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి జేమ్స్ బృందాన్ని బలవంతంగా అక్కడి నుండి పంపేశారు.

ఉద్యమంలో చురుకుగా పాలు పంచుకోవాలని అమెరికా కమ్యూనిస్టు పార్టీ ఈ కాలంలోనే స్పష్టంగా నిర్ణయించుకుంది. శాక్కో-వాంజెట్టి డిఫెన్స్ కమిటి లో చేరకుండా కమ్యూనిస్టులు మరొక సంస్థను ఏర్పాటు చేశారు. దాని పేరు శాక్కో-వాంజెట్టి ఎమర్జెన్సీ కమిటి. ఈ కమిటీలో తమ శక్తినంతా కూడగట్టి పోరాడారు. పౌర హక్కుల సంస్థలు కూడా అంతకు ముందు కంటే ఎక్కువగా స్పందించ నారంభించాయి. ప్రముఖ లాయర్ కార్ల్ లీవెల్లిన్ నాయకత్వంలో అమెరికన్ లాయర్ల బృందం పలు కార్యక్రమాలు చేపట్టింది.

అమెరికా దిన పత్రికలు రెండుగా విడి పోయి అనుకూల, వ్యతిరేక దృక్పథాలకు అద్దం పట్టాయి. ఏప్రిల్ 22న హెరాల్డ్ * ఇలా రాసింది:

* బోస్టన్ హెరాల్డ్ కాదు.

(మొరెల్లి ముఠా) నేరస్థులో కాదో ఈ వార్తా పత్రిక చెప్పజాలదు. (శాక్కొ, వాంజెట్టి) నిర్దోషులని ఇది నమ్ముతోంది. వాళ్ళు డెమొక్రాట్లో, రిపబ్లికన్లో అయితే, వాళ్ళు యుద్ధాన్ని సమర్థించి వుంటే వాళ్ళకు వ్యతిరేకంగా వున్న సాక్ష్యాన్ని బట్టి వాళ్ళను నిర్దోషులుగా ప్రకటించేందుకు జూరీ రెండు నిమిషాలు కూడా తీసుకొని వుండేది కాదు. విదేశీయులైనందువల్ల, రాడికల్స్ అయినందువల్ల యుద్ధ వ్యతిరేకులైనందువల్ల హత్యానేరం మోపి చంపడం కంటే అన్యాయమేదీ ఈ దేశంలో లేదని మాకు తెలుసు.

టెలిగ్రాఫ్ దిన పత్రిక ధేయర్‌ను తీవ్రంగా విమర్శించింది. ధేయర్ పట్ల సౌమ్యంగా ఎందుకు వ్యవహరించాలని ప్రశ్నించింది. ధేయర్ చెవులు చిల్లులు పడేలా నిరసన గొంతుక వినిపించాలని పిలుపునిచ్చింది. నేషన్ పత్రిక సంపాదకీయం కేసు పునర్విచారణ జరిపించవలసిందని గవర్నర్‌ను అడిగింది. అసాధారణ పద్ధతిలో ఆ సంపాదకీయం లేఖ రూపంలో ఉంది. సందేహాస్పదమైన నేర నిరూపణను పట్టుకు వేలాడటం, శాక్కొ-వాంజెట్టిలను చంపాలనడం రోగిష్టి మారి వర్గ స్పృహకు పాపిష్టి చిహ్నమని న్యూరిపబ్లిక్ అభిప్రాయపడింది.

ఈ కాలంలో బోస్టన్ నగరం రెండు వర్గాలుగా చీలి పోయిందా అనిపించేట్టు తయారైంది. కార్మికులు, లిబరల్ మేధావులు, రాడికల్స్ ముద్దాయిల పక్షానుండగా, వ్యాపార వర్గాలు, మితవాద మేధావుల్లో కొందరూ ముద్దాయిలకు వ్యతిరేకంగా చురుగ్గా పని చేయడం మొదలైంది. సంపన్న వర్గాల క్లబ్బుల్లో, వివాహ వేడుకలలో, విందుల్లో ఈ కేసు గురించి తీవ్ర వాగ్వివాదాలు జరిగేవి. ఆవేశ కావేషాలు ఉప్పొంగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడేది. కేసు గురించిన చర్చలను కొన్ని క్లబ్బులు నిషేధించాయి. ఈ కాలంలో మసాచూసెట్స్‌ను సందర్శించిన విలియం ఎల్లెన్ వైట్ * సాధారణ అమెరికా పౌరులకు శాక్కొ, వాంజెట్టి పట్ల గల ద్వేషాన్ని చూసి ఖిన్నుడయ్యాడు.

ఏప్రిల్ నెల చివరి వారం నాటికి బోస్టన్ ట్రాన్స్క్రిప్ట్ దినపత్రిక ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ రాసిన వ్యాసంపై యుద్ధం ప్రకటించింది. ఆ వ్యాసం సృష్టించిన సానుభూతిని ధ్వంసం చేసేందుకు డీన్ విగ్మోర్** రంగంలోకి దిగాడు. విగ్మోర్ విమర్శను సంపన్న వర్గాల పత్రికగా భావించబడే ట్రాన్స్క్రిప్ట్ ప్రచురించింది. ఫ్రాంక్ ఫర్టర్ మీదా, రాడికలిజం మీదా తనకున్న ఆగ్రహం వల్ల విగ్మోర్ సద్విమర్శ చేయలేక పోయాడు. కొన్ని సంగతులను కల్పించి రాశాడు. దాంతో పాటు ఫ్రాంక్ ఫర్టర్ పట్ల ఆయన వైఖరి ఆ విమర్శకున్న విలువను బాగా తగ్గించింది. బోస్టన్ హెరాల్డ్ దినపత్రికలో ఫ్రాంక్ ఫర్టర్ సమాధానం రాసి విగ్మోర్ అజ్ఞానాన్ని బయట పెట్టాడు. రెండు వారాల పాటు ఈ చర్చను ట్రాన్స్క్రిప్ట్, హెరాల్డ్‌లు కొనసాగించాయి.

---

* అమెరికా జర్నలిజానికి అనధికార అధిపతి. ప్రజాస్వామిక వాది.

** నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ లా స్కూల్ ప్రొఫెసర్. సాక్ష్యాధారాల చట్టాన్ని విశ్లేషిస్తూ ప్రపంచ ప్రఖ్యాత గ్రంథాలు రచించిన ప్రముఖ న్యాయవేత్త. అమెరికన్ ప్రొఫెసర్ల సంఘానికి అధ్యక్షుడిగా కూడా పనిచేశాడు.

# 2

శాక్కో-వాంజెట్టి కేసు లో ఇక ఏదైనా చేయగలిగే అధికారం మసాచూసెట్స్‌లో ఒక్క గవర్నర్‌కు మాత్రమే ఉంది. రాష్ట్రం మొత్తంలో ఎ కోర్టు ఏ శిక్ష విధించినా దాన్ని తగ్గించే లేదా రద్దు చేసే అధికారం గవర్నర్‌కు మాత్రమే ఉంది. ఆ అధికారానికి పరిమితుల్లేవు. కేసు విచారణ చట్టబద్ధంగా జరగకపోయినా, విషయపరమైన చట్టపరమైన అంశాలకు సంబంధించిన ఏ కారణం వల్లనైనా, కొత్తగా సాక్ష్యాలేమైనా లభ్యమైనా లేదా మరే ఇతర కారణం రీత్యానైనా గవర్నర్ తన అధికారాలను స్వేచ్ఛగా ఉపయోగించి కేసులో జోక్యం చేసుకునే వీలుంది అందుకు గతంలో కూడా కొన్ని దృష్టాంతాలున్నాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలో 1918 లో మూనీ-బిల్లింగ్స్ కేసు * లో అమెరికా అధ్యక్షుడు, కాలిఫోర్నియా గవర్నర్‌లు జోక్యం చేసుకొని మరణశిక్షను యావజ్జీవ కారాగారవాసంగా మార్చారు.

శాక్కో-వాంజెట్టిలకు న్యాయం నిరాకరిస్తూ మసాచూసెట్స్ కోర్టులన్నీ తలుపులు మూసుకోవడంతో ఉద్యమ కార్యరంగం మసాచూసెట్స్ గవర్నర్ ఫుల్లర్ కార్యస్థానమైన స్టేట్ హౌస్‌కు మారక తప్పలేదు.

మరణశిక్ష ప్రకటించిన రెండు నెలల్లో గవర్నర్‌కు పదిహేను వేల ఉత్తరాలు అందాయి. కేసును సమీక్షించమనీ, ముద్దాయిలకు క్షమాభిక్ష పెట్టమనీ మెజారిటీ ఉత్తరాలు కోరాయి శాక్కో-వాంజెట్టి కేసులో కఠినంగా వ్యవహరించమని కూడా కొందరు గవర్నర్‌కు లేఖలు రాశారు. అయితే యివి చాలా తక్కువ. బోస్టన్ పోలీసు సమ్మె పట్ల కటువుగా వ్యవహరించడం వల్ల అప్పటి గవర్నర్ అమెరికా అధ్యక్షుడయ్యాడనీ, అందువల్ల శాక్కో-వాంజెట్టి కేసులో కూడా అలాగే వ్యవహరించి వైట్‌హౌస్‌కు చేరుకోవాలని గవర్నర్‌కు టెలిగ్రాంలు అందాయి. ముద్దాయిలు హంతకులు కానప్పటికీ అలాంటి భావాలున్న వాళ్ళే హత్యలు చేశారనీ, చట్టం పట్ల గౌరవం లేని వీరిద్దరినీ శిక్షించడం సబబేననీ దిన పత్రికలలో పాఠక లేఖలు అచ్చయ్యాయి.

ఈ కేసును అధ్యయనం చేసేందుకు గవర్నర్ ఒక కమిటీని నియమించాలన్న ప్రతిపాదనకు తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. మసాచూసెట్స్ శాసనసభలో ఈ విషయం గురించి వేడి వేడి చర్చలు జరిగాయి. ఏప్రిల్ 14న 146-6 ఓట్ల తేడాతో ఆ ప్రతిపాదన ఘోరంగా ఓడి పోయింది.

---

* *ఐ.డబ్ల్యు.డబ్ల్యు నాయకులైన టామ్‌మూనీ, వారెన్ బిల్లింగ్స్‌లకు శాన్‌ఫ్రాన్సిస్కోలో 1915 లో జరిగిన బాంబుదాడి కేసులో మరణశిక్ష విధించారు. ఆ బాంబు దాడిలో పది మంది చనిపోగా నలభై మంది గాయపడ్డారు. మూనీ-బిల్లింగ్‌కు శిక్ష రద్దు చేయించేందుకు రష్యాలోని కెరెన్స్కీ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ కలుగజేసుకొని ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ కమిటీ ని నియమించాడు. ఆ కమిటి సిఫార్సు మేరకు మరణశిక్ష రద్దు చేశారు.*

గవర్నర్ సలహా సంఘం నియమిస్తాడనే ఆశ కనుమరుగౌతున్న దశలో కొందరు ప్రముఖ మితవాద మేధావులు కూడా జోక్యం చేసుకొని క్షమాభిక్ష పెట్టవలసిందని గవర్నర్‌ను కోరారు. ప్రశ్నలు-సమాధానాల రూపంలో గవర్నర్‌కు ఇరవై ఆరుగురు ప్రముఖులు ఒక లేఖ రాశారు. తమ ప్రశ్నలకు సమాధానాలుగా ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ వ్యాసంలోని భాగాలను వారు ఉటంకించారు. బోస్టన్‌లోని కోటీశ్వరులు కొందరు, మసాచూసెట్స్ శాసనసభ మాజీ స్పీకర్ ఒకరు, హార్వర్డ్ అధ్యాపకులు కొందరు ఆ లేఖపై సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. కేసును సమీక్షించవలసిందని కోరుతూ బాగా పలుకుబడి గలిగిన ముగ్గురు ప్రముఖులు -బిషప్ విలియం లారెన్స్, పారిశ్రామిక వేత్త జాన్ మూర్స్, ఆర్థిక వేత్త హేమన్ బుర్ - గవర్నర్‌కు లేఖ రాశారు. అమెరికాలోని ప్రముఖ ఇటాలియన్ సంస్థ సన్స్ ఆఫ్ ఇటలీ తరఫున యువ న్యాయవాది మైకేల్ ముస్మానో అలాంటి అభ్యర్థననే గవర్నర్ ముందుంచాడు. ప్రముఖ రచయితలు అప్టన్ సింక్లెర్, గాల్స్ వర్తీ కూడా సమీక్షా సంఘాన్ని నియమించమని విజ్ఞప్తి చేశారు. పౌర హక్కుల నాయకుడైన క్రైస్తవ మతాధికారి జేమ్స్ హేయస్ హోమ్స్ కూడా దాన్ని సమర్థించాడు న్యూయార్క్ నగరానికి చెందిన లాయర్లు, యేల్, కొలంబియా, కాన్సాస్, కార్నెల్, ఇండియానా, ఓహియో, మిన్నెసోట మిస్సోరి, ఓక్లహోమా, టెక్సాస్ యూనివర్శిటీలకు చెందిన 61 మంది ప్రొఫెసర్లు కేసులో పునర్విచారణను డిమాండ్ చేశారు. యాభై వేల సంతకాలతో డిఫెన్స్ కమిటీ గవర్నర్‌కు పిటీషన్ పంపింది.

బ్రిటన్ నుంచి ప్రముఖ సాహితీవేత్త జార్జి బెర్నార్డ్ షా గొంతెత్తాడు. శాక్కో, వాంజెట్టిలపై నేరారోపణల్లో నిజం ఏ మాత్రం వున్నా ఇంత కాలం పాటు కేసు నడిచేదే కాదనీ, కాబట్టి శిక్ష రద్దు చేయాలనీ అన్నాడు. బ్రిటిష్ ప్రజల తరఫున తాను ఈ డిమాండ్ చేస్తున్నానన్నాడు. లండన్ సండే ఎక్స్‌ప్రెస్‌లో జూన్ 5న రాసిన లేఖలో ప్రముఖ బ్రిటీష్ సాహితీవేత్త హెచ్.జి వెల్స్ శాక్కోను క్రాసు పరీక్ష చేసిన తీరును విశ్లేషించాడు. థేయర్, కట్జ్‌మన్‌లను తీవ్రంగా విమర్శిస్తూ వారిద్దరిదీ మొరటు తెలివనీ, మొరటు నిజాయితీ అని దుయ్యబట్టాడు. మరణించబోతున్న తమ తోటి కార్మికులకు మద్దతుగా అనేక కార్మిక సంఘాలు ప్రపంచ వ్యాప్తంగా సేకరించిన సుమారు ఐదు లక్షల సంతకాలతో ఒక పిటీషన్‌ను పుల్లర్‌కు పంపారు. స్విట్జర్లాండ్‌లోని స్విస్ యూనియన్ ఆఫ్ వర్కర్స్ లక్షా 53 వేల సంతకాలతో మరో పిటీషన్ పంపింది.

మే నెలలో గవర్నర్ కార్యాలయానికి ఎవరో బాంబు పోస్ట్ చేశారు. అది పేలక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాంబుతో పాటు 'ప్రపంచ పౌరుడు' పేరిట రాసిన ఒక లేఖ దొరికింది. గవర్నర్ మెత్తబడని పక్షంలో పేలే బాంబు పంపుతామని అందులో హెచ్చరించారు. ఈ సంఘటన తర్వాత గవర్నర్ పుల్లర్ ఇంటి దగ్గరా, స్టేట్‌హౌస్ దగ్గరా కట్టుదిట్టమైన సాయుధ కాపలా ఏర్పాటు చేశారు. అది ఆ తర్వాత రెండేళ్ళ పాటు కొనసాగింది.

# 3

శిక్ష రద్దు చేయమని అభ్యర్థిస్తూ తయారు చేసిన పిటీషన్ మీద సంతకం పెట్టేందుకు శాక్కో తిరస్కరించాడు. వాంజెట్టి ఒక్కడే సంతకం చేశాడు.

తనను చంపేందుకు అధికార గణం నిర్ణయించుకున్న తర్వాత తనను కాపాడమని పనికి మాలిన అభ్యర్థనలు చేయలేనన్నాడు శాక్కో. డిఫెన్సు లాయర్లు, డిఫెన్సు కమిటి నాయకులు, స్నేహితులు ఎంత వత్తిడి చేసినప్పటికీ శాక్కో తన పట్టు వీడలేదు. శిక్ష రద్దు చేయమని గవర్నర్‌ను అడగడం తన విశ్వాసాలకు విరుద్ధమని వాదించాడు. తక్షణం మరణించడం తనకు అవసరమని చెప్పాడు. ఏడేళ్ళుగా తన భార్య పడుతున్న మనోవేదన అంతటితో అంత మౌతుందన్నాడు. లాయర్ ఎహర్మన్, ఆయన భార్య సారా ఎహర్మన్ ప్రత్యేకంగా జైలును సందర్శించి శాక్కోను బ్రతిమాలినప్పటికీ ఫలితం లేకపోయింది. మే 3న డిఫెన్సు కమిటి కోశాధికారి ఆర్డినో ఫెలికని, లాయర్ థామ్సన్, ఎహర్మన్, రోజినా శాక్కో మరోసారి ప్రయత్నించారు. ఎంత సేపు చెప్పినా శాక్కో ఒప్పుకోలేదు.

అప్పటికి రెండు వారాలుగా శాక్కోతో వాంజెట్టి ఈ విషయమై వాదిస్తూనే ఉన్నాడు. వాంజెట్టికి జీవించాలనే ఆకాంక్ష బలంగా ఉంది. అయితే మృత్యువంటే భయం లేదు. ***"మేమింకా జీవించే ఉన్నాం. బతికి ఉండటమే ఒక విజయం" అంటాడు వాంజెట్టి***. తన జైలు జీవితాన్ని పుస్తక పఠనం, రచనా వ్యాసంగాల ద్వారా పూర్తిగా సద్వినియోగం చేసుకోగలిగాడు. కానీ శాక్కో కుటుంబాన్నించీ, శ్రమ నుంచీ, ప్రకృతి నుంచీ వేరు చేయబడి నీటి బయట చేపయ్యాడు.

ఈ దశలో డిఫెన్స్ లాయర్ల కోరిక మేరకు ప్రముఖ అమెరికన్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అబ్రహాం మేయర్‌సన్ శాక్కో మానసిక ఆరోగ్య స్థితిని పరీక్షించాడు. రాజకీయ తాత్విక విషయాల గురించీ, మరణశిక్ష గురించీ శాక్కో సైకియాట్రిస్ట్‌తో సంభాషించాడు:

> *నేనెప్పుడూ ఈయుద్ధానికి వ్యతిరేకమే కమిటీతో పాటు స్నేహితులూ, నా భార్యా చెప్పిన మీదటా వాంజెట్టి పోరాడాలనుకున్నాడు కాబట్టే నేను ఒప్పుకున్నాను. వాంజెట్టి ఈ పేపర్ మీద సంతకం చేశాడు. కానీ నేను చేయబోను. నాకు కావలసింది స్వేచ్ఛ లేదా చావు - అని నేను వాళ్ళకు చెప్పాను.*

ఈ చివరి వాక్యాన్ని శాక్కో పలుమార్లు నొక్కి చెప్పాడు. నేరం చేయకుండానే యావజ్జీవ శిక్షగా మిగిలిన జీవితాన్ని జైల్లో గడపడం శాక్కోకు ఇష్టం లేదు. అప్పటికి ఏడేళ్ళు జైల్లోనే గడిచాయి. ఎలా గడిచాయో అంతు పట్ట కుండా ఉంది. ***"నా విశ్వాసాల కోసం చనిపోవడానికి గర్వపడుతున్నాను" అన్నాడు శాక్కో.***

చనిపోవాల్సి వుంటే అందుకు శాక్కో భయపడటం లేదని సైకియాట్రిస్ట్ గమనించాడు. మనుగడ కోసం పోరాటం జరపవలసిందిగా శాక్కోకు నచ్చజెప్పేందుకు ఆయన ప్రయత్నించాడు. మనుగడ కోసం పోరాటం ప్రకృతి నియమాల్లో ఒకటని చెప్పాడు. ప్రకృతి జైలు గదిలోకి ప్రవేశించలేదన్నాడు శాక్కో. మరణశిక్ష విధించబడ్డ ఖైదీగా రోజులో 23 గంటలు కటకటాల వెనకే వుంచుతున్నారు.

*సూర్యకాంతి మాత్రమే కాస్త వస్తుంది. గాలి ప్రత్యేకంగా ఉంటుంది. అది సువాసన వెదజల్లదు...... నేను ప్రకృతిలో భాగంగాలేను. నేను ప్రకృతి ప్రపంచంలో జీవించడం లేదు. మనిషి సృష్టించిన ప్రపంచంలో బతుకుతున్నాను. కాబట్టి మీరంటున్నట్టు పోరాడలేను.*

వాంజెట్టి పిటీషన్‌పై సంతకం పెట్టిన విషయం డాక్టరు గుర్తు చేశాడు. దానికి సమాధానంగా శాక్కో ఇలా అన్నాడు:

*(అరాచక వాద) సిద్ధాంతాన్ని వాంజెట్టి కూడా ప్రేమిస్తాడు. వాంజెట్టి మంచివాడు. అసలైన మిత్రుడు. కామ్రేడ్. కానీ నాలాకాక ఆయనవి వేరే తాత్విక భావాలు.*

గవర్నర్‌కు పంపే పిటీషన్‌ను స్వయంగా వాంజెట్టినే తయారు చేశాడు. తమ జీవితాల గురించీ, ప్రాపంచిక దృక్పథాన్ని గురించీ, స్వేచ్ఛావాద సిద్ధాంత పుట్టు పూర్వోత్తరాల గురించీ పిటీషన్‌లో అద్భుతంగా వివరించాడు:

*మా భావాలు కొత్తవి కావు. కనీసం రెండు వేల సంవత్సరాలుగా పాశ్చాత్య ప్రపంచంలోని మానవ ఆలోచనా సరళిని, చరిత్రను ఏదో ఒక రూపంలో అవి ప్రభావితం చేస్తూనే వున్నాయి. ఆ భావాల ఆధునాతన నాయకుల్లో విలియం గాడ్విన్, షెల్లీ, కార్లో పిసకానె, ప్రౌడన్, రెక్లూస్, క్రోపోట్కిన్, బకునిన్, టాల్‌స్టాయ్ (ఒక అర్థంలో) ఫ్లామ్మరియోన్, మాలటెస్టా, గల్లెయని, మీ దేశానికి చెందిన టక్కర్ తదితర మేధావులున్నారు. క్రీస్తు 'రాజకీయ అరాచకవాది' అని మహాతత్త్వవేత్త ఎర్నెస్ట్ రెనన్ చెప్పాడు.*

భాషను సరళం చేయడం మినహా లాయర్లు ఆ పిటీషన్‌ను సవరించలేదు. లాయర్లు సవరించిన వాక్యాలను వాంజెట్టి తిరిగి రాశాడు. తన అభిప్రాయాలను తన గొంతుకతోనే గవర్నర్‌కు వినిపించాలని తపన పడ్డాడు. "మేం........ కమ్యూనిస్టులకూ, సోషలిస్టులకూ వ్యతిరేకం" అనే వాక్యానికి బదులుగా ఇలా రాశాడు:

***పీడన మీద ఆధారపడిన ప్రస్తుత వ్యవస్థకు మేం వ్యతిరేకమైనట్టే ప్రవలి పెత్తందారీ కమ్యూనిస్టు సిద్ధాంతానికీ, సోషలిస్టు సిద్ధాంతానికీ మేం వ్యతిరేకం. ఎందుకంటే, అవి మానవశక్తిని సంకెళ్ళలో బంధిస్తాయి కనుక.***

క్షమాభిక్ష పెట్టవలసిందని వాంజెట్టి గవర్నర్‌ను కోరలేదు. మరణశిక్షను యావజ్జీవ కారాగార

శిక్షగా మార్చమనీ అడగలేదు. నిర్దోషులైన తమకు అన్యాయంగా విధించిన శిక్ష మొత్తాన్నీ రద్దు చేయమని మాత్రమే వాంజెట్టి కోరాడు.

గవర్నర్ ఫుల్లర్ తమకు అనుకూలమైన నిర్ణయం చేస్తాడని వాంజెట్టి కూడా నమ్మలేదు. కానీ తన అభిప్రాయాలతో రాజీ లేనంతవరకు, చివరి క్షణం దాకా పోరాడటమే సరైందనుకున్నాడు:

*క్షమాభిక్ష పెట్టమని మేం గవర్నర్‌ను అడగాలనుకోవడం లేదు. గవర్నర్ నిజంగా ద్వేషించాల్సిన వ్యక్తి బంగారాన్నీ, అహంకారాన్నీ మోతబరువుగా మోస్తున్న గాడిద. ఆయన మనసు సంకుచితమైనది. ఏకపక్షమైనది ఆయన తీవ్రమైన పిడివాది. అంతరాత్మ లేని మొండి అభివృద్ధి నిరోధకుడు. మా విశ్వాసాలను అర్థం చేసుకోలేడు మా విశ్వాసాల వల్ల మమ్మల్ని ఆయన అంతులేకుండా ద్వేషిస్తాడు. మా శిక్షను తగ్గించేందుకు ఆయన తప్పకుండా నిరాకరిస్తాడు. ఆ పని చేయమని మేం కూడా ఆయన్నడగడం లేదు **

శిక్షను గవర్నర్ తప్పకుండా రద్దు చేస్తాడని తనకు నమ్మకముందని లాయర్ ముస్మానో చెప్పినప్పుడు వాంజెట్టి ఇలా అన్నాడు:

*నా అభిప్రాయం పొరపాటు కావచ్చు. కానీ ఫుల్లర్ మాకు వ్యతిరేకంగా ఇప్పటికే ఒక అభిప్రాయానికి వచ్చాడని నా భయం. మరణశిక్షలకు తాను వ్యతిరేకిని కానని ఇప్పటికే ఆయన అసందర్భంగా ప్రకటించాడు.** ఆయన్నుంచి మేం క్షమాభిక్ష ఆశించరాదని ఆయన హెచ్చరించినట్టు నాకు అనిపిస్తుంది.*

వాంజెట్టితో ముస్మానో ఏకీభవించలేదు:

*ఈ నిరాశాజనిత వ్యాఖ్యానాన్ని నేను ఆమోదించబోను. మరణశిక్షలో నమ్మకముంటే నేరస్తుల కోసం ఆయన దానిని ఖచ్చితంగా సమర్థించవచ్చు. అమాయకులైన వారికి ఆ శిక్ష విధించడాన్ని రక్తపిపాసులైన మరణశిక్ష సమర్థకులు కూడా వ్యతిరేకించాలి. కేసును సమీక్షించడం ప్రారంభించగానే మువ్వూ, శాక్కో అమాయకులని ఆయన గ్రహిస్తాడు.*

ముస్మానో వాంజెట్టిని అలా సమాధాన పరుస్తుంటే మధ్యలో శాక్కో జోక్యం చేసుకున్నాడు:

***మీ వాదన సరైనదేనని నేను భావిస్తాను. కానీ గవర్నర్ ఫుల్లర్ పేద ప్రజలకు న్యాయం చేయలేనంత గొప్ప ధనవంతుడు.***

నిజమే. ఇద్దరు పేదల ప్రాణాల గురించి నిర్ణయం తీసుకోగల రాజదండం ధరించిన గవర్నర్ ఫుల్లర్ బాగా డబ్బున్నవాడేకాక, రాజకీయాల్లో తీవ్ర అభివృద్ధి నిరోధకుడు. అందువల్లనే

* లూగియాకు వాంజెట్టి రాసిన ఒక లేఖ నుంచి.

** *ఒక శిక్షగా మరణశిక్షలను సమర్థిస్తూ 1926 డిసెంబర్‌లో ఫుల్లర్ చేసిన ప్రసంగం గురించి ఈ ప్రస్తావన.*

వాంజెట్టి రాసిన పిటీషన్ ఆయనకు అర్థమౌతుందన్న నమ్మకం కూడా లాయర్ ఎహర్మన్‌కు లేదు.

అప్టన్ సింక్లేర్ వ్యాఖ్యానించినట్టు ఖరీదైన పాకార్డ్ కార్ల సేల్స్‌మన్ అయిన ఫుల్లర్ దృష్టిలో మానవసమాజం రెండు వర్గాలుగా చీలి వుంది. ఒకటి పాకార్డ్ కార్లు కొనగలిగిన వర్గం, అది కొనలేనివర్గం. శాక్కో, వాంజెట్టిలు రెండో వర్గానికి చెందినవారు.

# 4

అల్వాన్ ఫుల్లర్ చదువు పబ్లిక్ స్కూల్ దాటాక ఒక అనామక కళాశాలలో కొంత కాలం నడిచింది. తమాషాగా ఉండే సైకిల్ తొక్కుతూ బోస్టన్ పౌరులకు సుపరిచితుడైన యువ ఫుల్లర్ సైకిల్ పందాల్లో పాల్గొని పేరు తెచ్చుకున్నాడు. ఆ తర్వాత సైకిళ్ళ వ్యాపారానికి తప్ప మరి దేనికీ తను పనికి రాననుకుని సైకిళ్ళు అమ్మడం మొదలు పెట్టాడు. కొంత కాలానికి కార్లు తయారు చేసే ప్రముఖ పాకార్డ్ మోటార్ కంపెనీ ఏజెంటుగా మారాడు. బాగా లాభం సంపాదించి కోటీశ్వరుడయ్యాడు. ఒక పక్క ఐశ్వర్యం ఇంటి తలుపు తడుతుండగా మరో వేపు రిపబ్లికన్ పార్టీ రాజకీయాల్లో తలదూర్చాడు. మసాచూసెట్స్ శాసనసభకు 1915 లో ఎన్నికయ్యాడు. తర్వాత అమెరికా కాంగ్రెస్ ఎన్నికల్లో గెల్చాడు. కాంగ్రెస్ సభ్యుడిగా 1917 నుంచి 1921 వరకూ పని చేసి తిరిగి స్వరాష్ట్రానికి చేరాడు. లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికై 1925 వరకూ ఆ పదవిలో కొనసాగాడు. మళ్ళీ ఎన్నికలలో గెలిచి 1925 నుంచి రాష్ట్ర గవర్నర్ పదవిని చేపట్టాడు.

ఐశ్వర్యానికీ, సౌఖ్యాలకూ, భద్రమైన జీవితానికీ ప్రతినిధి ఫుల్లర్. డబ్బుకు మారు పేరు ఫుల్లర్. 'ఒక కన్ను స్టేట్ హౌస్ మీదా, మరో కన్ను వైట్ హౌస్' మీదా ఉంచిన ఫుల్లర్ అరాచకవాదులైన శాక్కో, వాంజెట్టిలు తన శత్రువులని అనుకోకుండా ఉండగలడా?

పలు సందర్భాల్లో ఫుల్లర్ తన రాడికల్ వ్యతిరేక వైఖరిని చాటుకున్నాడు. అమెరికా కాంగ్రెస్ సభ్యుడిగా వున్న కాలంలో ప్రజలచే ఎన్నుకోబడిన సోషలిస్టు పార్టీ నాయకుడు విక్టర్ బెర్జర్‌ను కాంగ్రెస్‌లోకి అనుమతించరాదని చేసిన నిర్ణయాన్ని సమర్థించాడు. తర్వాత ఎన్నికల్లో అంతకుముందుకంటే ఎక్కువ ఓట్లతో బెర్జర్ ఎన్నికైనప్పటికీ ఆయనకు సీటివ్వడానికి మరోసారి కాంగ్రెస్ తిరస్కరించింది. ఈ నిర్ణయాన్ని కూడా ఫుల్లర్ సమర్థించాడు. అరాచక వాదుల, బోల్షివిక్కుల, ఐ.డబ్ల్యు.డబ్ల్యు. కార్యకర్తల రక్తాన్ని కళ్ళ చూడాలనీ, ఆ రాజద్రోహులను శిలువ వేయాలని వుద్రేకంగా మాట్లాడాడు.

శాక్కో, వాంజెట్టిల రక్తం అరాచకవాదరక్తం. ఐ.డబ్ల్యు.డబ్ల్యు రక్తం. కాబట్టి ఫుల్లర్ హెచ్చరికను వాళ్ళూ చదువుకోవాలేమో! వాళ్ళు శిలువనెక్కి రక్తం చిందిస్తే ఫుల్లర్ కళ్ళారా చూస్తాడేమో!

మరణశిక్షను ఒక శిక్షా పద్ధతిగా సమర్థిస్తూ 1926 డిసెంబర్‌లో ఫుల్లర్ అసందర్భంగా చేసిన ప్రసంగాన్ని నక్సెస్ పత్రిక అచ్చేసింది:

*నేనొక విషయాన్ని ప్రత్యేకంగా నొక్కి చెప్తాను. మానవ జీవితాన్ని అంతం చేసిన వారిపై మరణశిక్షను ఖచ్చితంగా అమలుచేయాలి. చట్టాలను అమలు జరిపే అత్యున్నతాధికారమున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి సానుభూతి పొందేందుకు స్నేహితులు, బంధువులు, చివరికి పత్రికలూ ప్రచార కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. కొన్నిసార్లు రెండు మూడు వారాల పాటు న్యాయం మీద ఈ దాడి కొనసాగవచ్చు.*

గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించింది వేరే కేసు గురించి. అయినా శాక్కో, వాంజెట్టిలకు, డిఫెన్స్ కమిటీకి ఈ మాటలు హెచ్చరికలాంటివి.

# 5

**వాం**జెట్టి సంతకంతో పిటీషన్‌ను మే 4న డిఫెన్స్ లాయర్లు గవర్నర్‌కు అందజేశారు. మానసిక ఆరోగ్యం సరిగా లేనందువల్ల పిటీషన్‌పై శాక్కో సంతకం చేయలేదని లాయర్ థామ్సన్ గవర్నర్‌కు చెప్పాడు. తానే స్వయంగా కేసును పరిశీలించబోతున్నానని గవర్నర్ ప్రకటించాడు. ఇది డిఫెన్స్ కమిటీలోనూ, బయటా ఉన్న కొందరు మేధావులకు ఊరట కలిగించింది. ఫుల్లర్‌తో వ్యక్తిగత పరిచయం, స్నేహసంబంధాలు ఉన్న ఆ మేధావులు ఆయన కేసును సమీక్షించి క్షమాభిక్ష పెట్టగలడని ఆశపడ్డారు.

కానీ, ఈ దశలో గవర్నర్‌ను కలిసిన మైకేల్ ముస్మానో అనుభవం అందుకు విరుద్ధంగా ఉంది. ఆయన మనస్సు కీడును శంకించింది. సన్స్ ఆఫ్ ఇటలీ ప్రతినిధిగా స్వచ్ఛందంగా ఈ కేసులో పని చేసేందుకు ఫిలడెల్ఫియా నుంచి బోస్టన్ చేరిన ముస్మానో స్వయంగా పలువురు సాక్షులను, ముద్దాయిలను ఇంటర్వ్యూ చేసి ముద్దాయిలు నిర్దోషులని భావించాడు. తన పరిశోధనా ఫలితాలను గవర్నర్‌కు వివరించేందుకు థామ్సన్ సలహాపై ముస్మానో ఫుల్లర్‌ను కలిశాడు. గవర్నర్ గురించి ముస్మానో తన వెర్డిక్ట్ గ్రంథంలో ఇలా రాశాడు:

. . . . శాక్కో, వాంజెట్టి వ్యక్త పరిచిన భయాందోళనలు ఫుల్లర్ కుర్చీ వెనక భూతాలుగా రూపుదాల్చడం నేను చూడగలిగాను. మరణశిక్ష విధించబడిన ఈ ఇద్దరు మనుషుల పట్ల గవర్నర్ అపోహతో ఉన్నాడని మాత్రమే చెప్తే అది తక్కువ చేసి చూపడమౌతుంది.. . . . ఫుల్లర్ శత్రుత్వం తీవ్రమైన అహంకారంతో, విషయాల గురించిన అంతులేని అజ్ఞానాంధకారంతో, కేసులో ఇమిడి వున్న సాక్ష్యాధార సంబంధ సమస్యలను ఆకళింపు చేసుకోలేని బాధాకరమైన అశక్తతతో,. . . . మేధో సోమరితనంతో పెనవేసుకుపోయి వుంది.

గవర్నర్ ముందున్న సమస్య ముద్దాయిలు దోషులా కాదా అని నిర్ధారించడమే తప్ప తాత్విక

సంబంధమైన రాజకీయ సంబంధమైన ముద్దాయిల మనోగతాన్ని విశ్లేషించడం కాదని ముస్మానో గవర్నర్‌కు చెప్పాల్సి వచ్చింది సాక్ష్యాధారాల గురించి ముస్మానో ప్రస్తావించినప్పుడు ఫుల్లర్ జోక్యం చేసుకొని "కానీ సుప్రీం కోర్టు వాటన్నిటి గురించీ నిర్ధారించింది' అన్నాడు ముస్మానో మళ్ళీవివరణ ఇవ్వాల్సి వచ్చింది:

*సరే సుప్రీం కోర్టు పొరపాటు చేయదని మీరు నమ్మితే ఒక పరిశోధనంటూ చేయడమెందుకు? క్షమాభిక్ష పెట్టేందుకు గవర్నర్‌కు అధికారం ఇచ్చారంటేనే కోర్టులు పొరపాటు పడేందుకు అవకాశాలున్నాయని ముందుగా ఊహించే కదా!*

సాక్ష్యాలను సమీక్షించే అధికారం సుప్రీం జుడీషియల్ కోర్టుకు లేదనీ, ఈ కేసులో విచారణ పద్ధతి మీదే తప్ప సాక్ష్యాలు సరైనవా కాదా వాటిని నమ్మొచ్చా లేదా అనే సంగతుల గురించి ఆ కోర్టు ఏనాడూ తీర్పు చెప్పలేదని గవర్నర్‌కు ముస్మానో విప్పి చెప్పాల్సి వచ్చింది.

గవర్నరే కాక స్టేట్‌హౌస్‌లో ఉన్న సిబ్బందిలో ఎక్కువ మంది శాక్కో-వాంజెట్టి కేసులో థేయర్ తీర్పును విమర్శిస్తూ ఎవరేమాట అన్నా సహించే స్థితిలో లేరని కూడా ముస్మానో గ్రహించాడు

గవర్నర్ కార్యదర్శి హెర్మన్ మెక్‌డొనాల్డ్ డిఫెన్స్ కమిటీకి బద్ధశత్రువు స్ప్రింగ్ ఫీల్డ్ రిపబ్లికన్ సంపాదకుడు వాల్డొకుక్ ఇరవై వేల డాలర్లు పుచ్చుకుని ముద్దాయిలకు అనుకూలంగా ప్రచారం చేస్తున్నాడని ఈ ప్రబుద్ధుడు అభాండం వేశాడు బ్రిటీష్ పార్లమెంట్ సభ్యులు శాక్కో, వాంజెట్టిల శిక్షను రద్దు చేయవలసిందిగా కోరుతూ 1925 లో గవర్నర్‌కు లేఖ పంపగా శాక్కో వాంజెట్టి తరపున అందే పిటీషన్లకు స్టేట్ హౌస్‌లో సరైన గౌరవం లభించదని మెక్‌డొనాల్డ్ విషం వెళ్ళగక్కాడు.

గవర్నర్ పర్సనల్‌లాయర్ జోసెఫ్ విగ్గిన్స్‌కు కూడా డిఫెన్స్ కమిటి పొడ అంటే గిట్టదు చాలా కాలంగా డిఫెన్స్ కమిటి ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్‌కు జీతమిచ్చి పోషిస్తోందని నిరాధారమైన ఆరోపణలు చేసి వున్నాడాయన. ఫ్రాంక్ ఫర్టర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తే తప్ప హార్వర్డ్ లా స్కూల్ నిధికి చిల్లి గవ్వ ఇవ్వనని ఆయన నిర్మొహమాటంగా విషం వెళ్ళగక్కాడు. అయితే విగ్గిన్స్ లాయర్ థామ్సన్‌కు స్నేహితుడు.

గవర్నరూ, ఆయన సిబ్బంది వైఖరే కాక ఆయన ఎంచుకున్న విచారణా పద్ధతి కూడా నిజాన్ని నిర్ధారించేందుకు ఏ మాత్రం పనికి రానిదే అది న్యాయం ఆశించిన వారిని భయపెట్టేదిగా ఉంది. ముద్దాయిలకూ వారి లాయర్లకూ విచారణకు హాజరయ్యే అవకాశాన్నివ్వకుండా మే నెల మొత్తం గవర్నర్ రహస్య విచారణ కొనసాగించాడు అది పలు అనుమానాలకు, అపోహలకు పుకార్లకు తావిచ్చింది ముద్దాయిలు నేరస్తులో కారో నిర్ధారించే పని ఫుల్లర్ శక్తికి మించినది. దాన్ని పక్కన పెట్టి, ముద్దాయిలపై న్యాయవిచారణ నిష్పక్షపాతంగా జరిగిందో లేదో విచారించడం మీద దృష్టి కేంద్రీకరిస్తే బాగుంటుందని లాయర్ థామ్సన్ మరీ

మరీ అడిగాడు. అక్రమ మార్గాల ద్వారా సంపాదించిన 'వాస్తవాల'కు విలువ నివ్వవలసిన అవసరం లేదని చెప్పాడు. కానీ, గవర్నర్ ఆ సలహాను పట్టించుకోలేదు. శాక్కో, వాంజెట్టిలు దోషులా కాదా అన్నది తేలితే, వారిపై విచారణ ఎలా జరిగి వున్నప్పటికీ అది న్యాయమేననే అజ్ఞానాంధకారంలో గవర్నర్ ఉన్నాడు. తన పరిశోధనలో డిఫెన్స్ లాయర్లను పూర్తిగా పాల్గొననివ్వలేదు. డిఫెన్స్ లాయర్లు తమ సాక్షులను ప్రవేశపెట్టేందుకు మాత్రమే అనుమతించాడు తాను సాక్షులలో ఎవరెవరిని విచారిస్తోందీ ఎందుకు విచారిస్తోందీ, వారు ఏఏ సంగతులు చెప్పారు అనే విషయాన్ని కూడా గవర్నర్ బయటికి పొక్కనివ్వలేదు

గవర్నర్ రహస్యంగా విచారణ జరపడాన్ని థామ్సన్ మరోసారి నిరశించాడు. క్రాసు పరీక్షకు లోనౌతామనే భయం లేకుండా సాక్ష్యం చెప్పే సాక్షుల నుండి నిజాన్ని ఖచ్చితంగా తెలుసుకోగలగడం అసాధ్యమని గవర్నర్ ముందు ఆయన వాదించాడు అన్యాయమైన స్టార్-ఛాంబర్ సెషన్స్ * రెండు దశాబ్దాల క్రితమే ముగిసిపోయిందనీ నాగరిక సమాజంలో అలాంటి విచారణా పద్ధతికి స్థానం లేదనీ చెప్పాడు. కేసు రికార్డు గురించిన ప్రతి విషయమూ క్షుణ్ణంగా ఎరిగున్న లాయర్ల సహాయం లేకుండా సాక్షులను ఇంటర్వ్యూ చేస్తే వారు చెప్పే విషయాలు కేసులో ఏ సాక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయో, దేనికి విరుద్ధంగా ఉన్నాయో తెలియడం అసాధ్యమని కూడా థామ్సన్ గవర్నర్‌కు నచ్చజెప్పాడు. థామ్సన్ వాదనా పటిమను గవర్నర్ బాగా మెచ్చుకున్నాడు. ఎందుకంటే-

> *న్యాయవాద వృత్తి అంటే నలుపును తెలుపుగా, తెలుపును నలుపుగా మార్చడం అని నమ్మిన వ్యాపారుల్లో గవర్నర్ ఒకడు. బాగా సమర్థులైన లాయర్లలో థామ్సన్ ఒకడని ఆయన భావించాడని గమనించడం తేలిక ఇది అతి దురదృష్టకరమైన భావన*

ఎహర్మన్ చెప్పిన ఆ మాటల కర్థం థామ్సన్ పట్ల జాగ్రత్తగా ఉండాలని గవర్నర్ నిర్ణయించుకున్నాడని సూచిస్తుందే తప్ప థామ్సన్ చెప్పిన విషయాల పట్ల గవర్నర్‌కు నమ్మకం ఏర్పడగలదని కాదు. అందుకే థామ్సన్ వైపు న్యాయముందని గవర్నర్ భావించలేదు. న్యాయబద్ధంగా, సహేతుకంగా థామ్సన్ వాదించగలడని కూడా ఆయన అనుకోలేదు. కేవలం వాదనా పటిమను మాత్రమే చూశాడు. దాని వల్ల తాను బోల్తా పడే ప్రమాదాన్ని గుర్తెరిగి మసలుకోవాలని గవర్నర్ భావించాడు. థామ్సన్‌తో గవర్నర్ ఇలా అన్నాడు:

> *మిస్టర్ థామ్సన్. ఇక్కడికొచ్చే వాళ్ళలో మీరు అత్యంత ప్రమాదకరమైన వారు*

---

* *బ్రిటన్‌లో పదిహేడవ శతాబ్దం ప్రథమార్థ కాలం వరకూ కొనసాగిన దుర్మార్గమైన న్యాయస్థానం స్టార్ ఛాంబర్. ప్రభుత్వాధికారులతో, మతాధికారులతో, న్యాయమూర్తులతో కూడిన బెంచి లండన్ వెస్ట్ మినిస్టర్‌లో కేసులను క్లుప్తంగా విచారించి అత్యంత నిరంకుశంగా వ్యవహరించి క్రూరమైన శిక్షలు విధించేది. అందువల్ల రహస్యంగా జరిగే ఏ విచారణనైనా స్టార్ ఛాంబర్ సెషన్స్ అని పిలవడం పరిపాటి అయింది.*

సాత్ బ్రెయిన్ ట్రీ హత్య కేసులోనే వంద మందికిపైగా సాక్ష్యులను గవర్నర్ తన రహస్య పద్ధతిలో ఇంటర్వ్యూ చేశాడు.

*అమెరికన్ నిష్పాక్షికత గురించి వున్న అభిప్రాయాలన్నిటినీ తాను చేస్తున్న పని ఉల్లంఘిస్తోందని గ్రహించే సామర్ధ్యం లేని మనిషి చేతుల్లో శాక్కో, వాంజెట్టి భవితవ్యం ఉంది నిష్పక్షపాత దర్యాప్తు జరుపుతున్నానని గవర్నర్ చెప్పుకున్నాడు కాని ముద్దాయిలు లేకుండా, వారి తరపు లాయర్లు లేకుండా సాక్షులను విచారించాడు. పుకార్లను విన్నాడు. అనుమానాలకు చెవొగ్గాడు విచిత్రమైన నిర్ధారణలను ఆలకించాడు బోస్టన్ నగరమంతా తిరిగి లేదా మసాచూసెట్స్ రాష్ట్రమంతటా పర్యటించి ఈ కథలు, నిర్ధారణలు ఊహాలు విన్నట్టయితే న్యాయానికి పెద్దగా హాని జరిగి వుండేది కాదు. ఎందుకంటే అలా జరిగితే, పరస్పర విరుద్ధమైన పుకార్లు వాటికవే తటస్థమయ్యేవి అవి గందరగోళానికి దారి తీసి ఆయన ప్రతి రోజు తన దర్యాప్తును మొదలెత్తుకోవాల్సి వచ్చేది. చివరికి ఆయన మనోఫలకం శుభ్రపడినప్పుడు నిజాలకు అవకాశం ఏర్పడి వుండేది కానీ ఫుల్లర్ ధన సామ్రాజ్యంలో, అధికార సామ్రాజ్యంలో జీవించాడు సంచరించాడు అక్కడ శాక్కో, వాంజెట్టిలను బందిపోట్లనీ, ఉద్యమకారులనీ ఏడేళ్ళ పాటు ప్రపంచాన్ని కలతలతో నింపిన హంతకులనీ తప్ప వేరే విధంగా ఎవరూ మాట్లాడరు ఈ హాస్య నాటకం అంతమయ్యే కాలం ఆసన్నమైందని అక్కడందరూ భావిస్తారు* *

గవర్నర్ పరిశోధన జరుగుతున్న రోజుల్లోనే బ్రెయిన్ ట్రీ పోలీసు అధికారి జెరేమీ గలివన్‌ను ముస్మానో కలిశాడు. ఒక ఆశ్చర్యకర విషయం తెలిసింది. సౌత్ బ్రెయిన్ ట్రీ నేరస్థలంలో దొరికిందని చెప్పబడ్డ టోపీ శాక్కోదేననీ అందులో చిరుగు చిలక్కొయ్యకు తగిలించడం వల్ల ఏర్పడిందనీ ప్రాసిక్యూషన్ అంతకు ముందు కోర్టులో సాక్ష్యాలను చూపించింది. ఆ టోపీ శాక్కోదని నమ్మితే అతను హత్యనేరం చేశాడని నిర్ధారించ వచ్చని చెప్పేదాకా ప్రాసిక్యూటర్ కట్జ్‌మన్ సాహసించాడు. కానీ టోపీ లోపల చించింది తానేనని ముస్మానోతో గలివన్ చెప్పాడు. టోపీ లోపలి లైనింగ్‌లో ఏదైనా పేరు కనిపిస్తుందేమోనని వెతికినట్టు గలివన్ చెప్పాడు.

ఈ సంగతి తెలుసుకున్న ముస్మానో వెంటనే గవర్నర్ దగ్గరికి పరిగెత్తాడు. కానీ సంగతి విని గవర్నర్ ఏ మాత్రం ఉత్సాహపడలేదు అదేమంత పెద్ద విషయం కాదన్నట్టు వ్యవహరించాడు. కొన్నాళ్ళకు, గవర్నర్ ఎదుట గలివన్ హాజరయ్యాడు. గలివన్ చెప్పిన విషయాలను అబద్ధాలుగా నిరూపించేందుకన్నట్టుగా గవర్నర్ ఆయనను ప్రశ్నలడిగి వేధించాడు.

మెడైరోస్‌ను కలిసినప్పుడు గవర్నర్ మరింత ఘోరంగా వ్యవహరించాడు. ప్రలోభపెట్టి ఆశ చూపి ప్రాసిక్యూషన్‌కు అనుకూలమైన సాక్ష్యాన్ని అతని నుండి సంపాయించేందుకు ప్రయత్నించాడు.

---

* *మైకేల్ ముస్మానో: వెర్డిక్ట్!*

రెంధమ్ బాంక్ హత్య కేసులో నేరం చేశానని ఒప్పుకుంటే సెకండ్ డిగ్రీ హత్య కింద యావజ్జీవ కారాగార శిక్ష మాత్రమే వేయిస్తామనీ మరణ శిక్షనుంచి తప్పించగలమనీ పోలీసులు మెడైరోస్‌కు లోగడ హామీ ఇచ్చారు. కానీ తర్వాత మోసం చేసారు అతని సహచరులకు మాత్రం యావజ్జీవ కారాగార శిక్ష వేయించి అతనిపై మాత్రం కేసు విచారణ జరిపించారు. అందువల్ల మెడైరోస్‌కు మరణశిక్ష పడింది రెండవ సారి అప్పీలు కోర్టులో పెండింగ్‌లో వున్నప్పుడు గవర్నర్ మెడైరోస్‌ను జైలులో కలిశాడు పోలీసులిచ్చిన హామీ నెరవేరేటట్టు ప్రయత్నిస్తానని గవర్నర్ ఆశ చూపాడు. ఈ ప్రలోభానికి లొంగి, బ్రెయిన్ ట్రీ కేసు గురించిన తన అఫిడవిట్‌ను మెడైరోస్ వాపస్ తీసుకుంటాడని గవర్నర్ ఆశించాడు అందుకు అనుగుణంగా ప్రశ్నలు వేశాడు:

*ఆఫ్ కోర్స్! సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యల గురించి స్వయంగా నీకేమీ తెలియదు తెలుసా?*

గవర్నర్ వైఖరికి మెడైరోస్ ఆశ్చర్యపోయాడు అతనిలా చెప్పాడు:

*'కానీ, దాని గురించి నాకు తెలుసు నేనక్కడున్నాను కాబట్టి '*
*కారులో నువ్వున్నావా?*
*'అవును నేను కారులో ఉన్నాను*
*ఓ! ఐసీ! కాబట్టి నువ్వురెండు హత్యలు చేసిన హంతకుడివి అలాగైతే నీ కోసం నేనేమీ చేయను*

తన హామీని వెనక్కు తీసుకున్నాడు గవర్నర్. కానీ ఈ మాటల్నే గవర్నర్ నిజంగా నమ్మితే శాక్కో వాంజెట్టిలు దోషులు కాదని భావించాలి.

బ్రిడ్జివాటర్ కేసులో తీర్పు గురించి ఒక దశలో గవర్నర్ ఆసక్తి ప్రదర్శించాడు. ఆ కేసులో వాంజెట్టి సాక్ష్యం ఎందుకు చెప్పలేదో తెలుసుకోవాలనుకున్నాడు. వాంజెట్టి నేరం చేశాడు కాబట్టి అతను సాక్షిగా బోనెక్కలేదని గవర్నర్ భావిస్తున్నాడేమోనని డిఫెన్స్ లాయర్లు అనుమానించారు. అమెరికా న్యాయశాస్త్ర సంప్రదాయాల గురించి ఏ మాత్రం తెలియని వాంజెట్టి బోనెక్కితే పలు కష్ట నష్టాలకు లోనుకావాల్సి వచ్చేదని లాయర్ ఎహర్మన్ గవర్నర్‌కు ఓపికగా వివరించాడు బోనెక్కితే రాడికల్ భావాల గురించి అడిగి పాతరేస్తారు. బోనెక్కకపోతే నేరస్థుడైనందువల్లే బోనెక్కలేదని జూరీ మనసులో విషబీజాలు నాటుతారు. ఈ క్షోభ అర్థమైనట్టే కన్పించాడు గవర్నర్.

బ్రిడ్జి వాటర్ కేసులో ప్రాసిక్యూషన్ తరపు సాక్షి కాక్స్ గవర్నర్‌కు స్నేహితుడు. ఆ నేరంలో షాట్‌గన్‌తో కాల్పులు జరిపిన బందిపోటు వాంజెట్టి అని అతను తనకు చెప్పాడని ఒక సందర్భంలో గవర్నర్ మాట జారాడు. ఈ విషయం కొన్నాళ్ళకు డిఫెన్స్ లాయర్ల చెవిన పడింది. కాక్స్‌కు పోలీసులు వాంజెట్టిని చూపించినప్పుడు అతన్ని గుర్తించలేక పోయాడు. తాను చూసిన బందిపోటు గురించి కాక్స్ పరస్పర విరుద్ధమైన పోలికలు చెప్పాడు. ఈ వాస్తవాలను లాయర్

ఎహర్మన్ గవర్నర్‌కు వివరించాడు. కాక్స్‌కు ఒక బెదిరింపు ఉత్తరం అందిందనీ అందువల్ల మొదటిసారి వాంజెట్టిని గుర్తించేందుకు అతను భయపడి వుండవచ్చనీ గవర్నర్ చెప్పాడు కానీ ఆ బెదిరింపు లేఖ అందక ముందే కాక్స్ వాంజెట్టిని గుర్తు పట్టడంలో విఫలమయ్యాడని ఎహర్మన్ గవర్నర్‌కు గుర్తు చేశాడు. గవర్నర్ అది విని మౌనం వహించాడు.

డిఫెన్స్ లాయర్లను సాక్షుల విచారణ సమయంలో గవర్నర్ అనుమతించక పోవడం వల్ల వారు తమ వాదన వినిపించేందుకు మరో పద్ధతి అవలంబించారు. గవర్నర్ ఏ సాక్షిని విచారించాడో తెలియగానే వారు ఆ సాక్షి చెప్పిన సంగతులను విశ్లేషిస్తూ గవర్నర్‌కు లేఖలు రాసేవారు. అలాగైనా గవర్నర్‌కు సాక్ష్యాధారాల గురించిన విషయ పరిజ్ఞానం అందిద్దామని డిఫెన్స్ లాయర్లు తపన పడ్డారు బ్రిడ్జి వాటర్ కేసులో పింకర్‌టన్ డిటెక్టివ్ ఏజెన్సీ రిపోర్టులు ఈ కాలంలోనే డిఫెన్సు లాయర్లకు లభ్యమయ్యాయి. వెంటనే వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి వివరమైన 33 పేజీల విశ్లేషణాత్మక నివేదికను వారు పుల్లర్‌కు పంపారు. ఆ తర్వాత కొద్ది రోజులకు సంపన్న బోస్టన్ ప్రముఖుడు, ఉద్యమ సానుభూతిపరుడు జాన్‌మూర్స్ పుల్లర్‌ను కలిసినప్పుడు వారి సంభాషణలో బ్రిడ్జివాటర్ కేసు ప్రస్తావనకు వచ్చింది పింకర్‌టన్ రిపోర్టుల గురించి ఏమనుకుంటున్నారని గవర్నర్‌ను జాన్‌మూర్స్ అడిగాడు.

*"పింకర్‌టన్ రిపోర్టులేమిటి?"*

గవర్నర్ వేసిన ఈ ఎదురు ప్రశ్నతో జాన్‌మూర్స్ ఖంగుతిన్నాడు. అసలు వాటి పేరే గవర్నర్ వినలేదని ఆయనకు అర్థమైంది. డిఫెన్స్ లాయర్లు పంపిన నివేదిక సంగతి గుర్తు చేశాడు. అది కూడా గవర్నర్ దృష్టికి రాలేదు. తన కార్యదర్శి మెక్‌డొనాల్డ్‌ను గవర్నర్ అడిగాడు:

*"పింకర్‌టన్ రిపోర్టుల గురించి నీకేం తెలుసు?*

*"ఓ! అది గుబురు మీసాల గురించినది".*

గవర్నర్ కార్యదర్శికి కూడా ఆ నివేదికల గురించి సరిగా తెలియదని తేలిపోయింది. పింకర్‌టన్ రిపోర్టులలో బందిపోట్ల వర్ణనకు, వాంజెట్టి పోలికలకు అసలు ఏ మాత్రం సంబంధం లేదు. ఈ ముఖ్యమైన సాక్ష్యం గురించి తెలుసుకునేందుకు గవర్నర్ ఏ మాత్రం ప్రయత్నించలేదని చెప్పేందుకు ఈ సంఘటన మచ్చు తునక. అవును. **ఆయన 'పేదలకు న్యాయం చేయలేనంత గొప్పవాడు.'**

న్యాయమూర్తి థేయర్ ముద్దాయిల పట్ల మొదటి నుంచీ ద్వేషంతో రగిలిపోయాడని చెప్పేందుకు మరిన్ని సాక్ష్యాధారాలు బయటపడగా, వాటిని డిఫెన్సు లాయర్లు గవర్నర్ ముందుంచారు. కేసు విచారణ కోసం జూరీని ఎంపిక చేస్తున్న రోజుల్లోనే ముద్దాయిలపై థేయర్ విషం గక్కాడనీ, లాయర్ మూర్ పేరెత్తితేనే మండి పడ్డాడనీ ఫెడరేటెడ్ ప్రెస్ విలేఖరి జాన్ నికొలస్ బెఫెల్ సాక్ష్యమిచ్చాడు. శాక్కో-వాంజెట్టికేసు విచారణకు హాజరైన ఇటాలియన్

దౌత్యవేత్త మార్క్విస్ అగొస్టినొ ఫెరాంటి కూడా థేయర్ పోకడ పట్ల కలత చెందాడనీ, ముద్దాయిల రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేని నిష్పక్షపాత విచారణ జరగాలని ఆశిస్తూ ఒక ప్రకటన జారీ చేశాడని కూడా బొఫెల్ చెప్పాడు.

తన పరిశోధనలో భాగంగా గవర్నర్ ఫుల్లర్ ఛార్లెస్ టౌన్ జైలును సందర్శించాడు. మాట్లాడేందుకు గవర్నర్ ప్రయత్నించినప్పటికీ శాక్కో నిరాకరించాడు. అధికార యంత్రాంగం తమను చంపాలని నిర్ణయించుకున్న తర్వాత మాట్లాడేందుకు ఏం మిగిలుంటుందని భావించాడు:

**'చూడండి గవర్నర్ గారూ, మీరు కోటీశ్వరులు. ఎన్నోరెట్లు కోటీశ్వరులని వాళ్ళు నాతో చెప్పారు. ఒక పేద వాడికి హక్కులేవైనా ఉంటాయని మీరసలు నమ్మలేరు. నా కథ వినడం మీకు సమయం వృథా కావడమే అవుతుంది. నేను అమర్యాదగా ప్రవర్తించదల్చుకోలేదు. . . . నేను మిమ్మల్ని నమ్ముతున్నానని చెప్పి మిమ్మల్ని నేనెందుకు ఫూల్‌ని చేయాలి? మీరెందుకు నన్ను ఫూల్‌ని చేయాలి?"**

తన మాటలు విన్న ప్రతి ఒక్కర్నీ తన వేపు మళ్ళించుకోగలననే ఆత్మ విశ్వాసమున్న వాంజెట్టి మాత్రం గవర్నర్‌తో మాట్లాడేందుకు ఇష్ట పడ్డాడు. గవర్నర్ రెండుసార్లు వాంజెట్టిని కలిశాడు. వాంజెట్టితో మాట్లాడాక గవర్నర్ అతన్ని మెచ్చుకున్నాడు. మొదటిసారి మాట్లాడి వెళ్తూ ఆయన జైలు వార్డెన్‌తో వాంజెట్టి గురించి "ఎంత ఆకర్షణీయమైన వ్యక్తి!" అని పొగిడాడు.

వాంజెట్టిని గవర్నర్ అనేక ప్రశ్నలడిగాడు. ప్లిమత్ కేసు (బ్రిడ్జి వాటర్ కేసు)లో డిఫెన్స్ సాక్షిగా బోనెక్కలేదెందుకని ప్రశ్నించాడు. గవర్నర్‌తో తాను చెప్పదల్చుకున్నదంతా చెప్పేందుకు వ్యవధి చిక్కనందువల్ల వాంజెట్టి వివరమైన లేఖ రాసి ఆయనకు పంపాడు. అమెరికాలో ఇటాలియన్ల పట్ల రగులుతున్న ద్వేషాగ్నికి కారణాలను, జారీ కున్న అపోహలను గురించి ఆ లేఖలో వాంజెట్టి ఏకరువు పెట్టాడు:

*నేను ఇటాలియన్‌ను. విదేశంలో కొత్త వ్యక్తిని. నా సాక్షులు కూడా అలాంటివారే. దాదాపు అమెరికన్ సాక్షుల సాక్ష్యంపై ఆధారపడి నన్ను ముద్దాయిగా నిలిపి దోషిగా తేల్చారు. నాకూ, నా జాతికీ, నా భావాలకూ, నా వృత్తికీ ప్రతిదీ వ్యతిరేకమే.*

గవర్నర్‌తో మాట్లాడిన తర్వాత వాంజెట్టి ఆయన గురించి తన అభిప్రాయాలను కుటుంబానికి ఒక లేఖలో రాశాడు:

*నేను గవర్నర్‌తో రెండుసార్లు మాట్లాడాను. ప్రతిసారీ గంటన్నర సేపు. నేనూహించినదానికంటే ఆయన కాస్త మెరుగ్గా అనిపించాడు. సదాశయమున్న నిజాయితీపరుడిలాగా కనిపించాడు. మేం నేరస్తులమని ఆయన అనుకున్నట్లయితే మాకు మరణశిక్షను ఖరారు చేస్తాడని నేను నమ్ముతున్నాను. సాక్ష్యం మొత్తం మాకు అనుకూలంగా ఉండగా ఆయన మమ్మల్ని దోషులని ఎలా నమ్మగలడో నేను అర్థం చేసుకోలేను. మా సాక్షులంతా దాదాపు ఇటాలియన్లే కాబట్టి వారిని ఆయన నమ్మడని నా భయం.. . .*

మోరెల్లి మురా గురించి వివరమైన సమాచారాన్ని తెలుసుకునేందుకు గాను ప్రావిడెన్స్ పోలీసు అధికారి జనరల్ రిచర్డ్స్‌ను పిలిపించి మాట్లాడవలసిందని డిఫెన్సు లాయర్లు గవర్నర్‌ను అడిగారు. మోరెల్లి మురా చేసిన అనేక దొంగతనాల కేసుల్లో నేర పరిశోధన చేసి వారిని ప్రాసిక్యూట్ చేసిన అధికారుల్లోరిచర్డ్స్ ఒకడు.

జనరల్ రిచర్డ్స్‌ను గవర్నర్ ఇంటర్వ్యూ చేశాడు. కానీ మోరెల్లి మురా స్వభావం గురించి రిచర్డ్స్ మాట్లాడుతుంటే మధ్యలో ఆపి సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యల గురించి అడిగాడు. వాటి గురించి తనకు వివరాలు తెలియవని రిచర్డ్స్ చెప్పాడు. ఆయనతో మాట్లాడ్డానికేమీ లేదని భావించి వెంటనే ఆయనను గవర్నర్ పంపేశాడు.

# 6

గవర్నర్ పరిశోధన ప్రారంభమైన కొన్నాళ్ళకు ఆయన చేయబోయే నిర్ణయాన్ని తనకనుకూలంగా మార్చుకునేందుకు ప్రాసిక్యూషన్ కొత్త ఎత్తుగడ వేసింది. తుపాకుల నిపుణుడైన రిటైర్డ్ మిలటరీ అధికారి మేజర్ కాల్విన్ గొడార్డ్‌ను రంగంలోకి దించింది. శాక్కొ-వాంజెట్టి కేసులో బుల్లెట్లను, తుపాకులను మరోసారి పరీక్ష చేయించబూనుకుంది. ఆ పరిశోధనలో పాలు పంచుకోమని అంతకు ముందే ప్రాసిక్యూటర్ డడ్లీరానీ డిఫెన్స్ లాయర్లను ఆహ్వానించాడు. కొత్తగా అప్పుడే కనుగొన్న కంపారిజన్ మైక్రోస్కోప్ ఉపయోగాన్ని ప్రదర్శించడం కోసం అనధికారికంగా ఆ పరీక్షలు స్వయంగా గొడార్డే నిర్వహించబూనుకుని తమకు తెలియజేశాడని డడ్లీరానీ చెప్పాడు.

అప్పటికే కేసులో బుల్లెట్-III (ప్రాణాంతక బుల్లెట్) గురించి గొడార్డ్ ఒక అభిప్రాయాన్ని ప్రకటించి వున్నందున* తిరిగి పరిశోధన జరిపేందుకు ఆయన అనర్హుడని డిఫెన్స్ లాయర్లు భావించారు. ఆ అనధికార పరిశోధనల్లో పాలు పంచుకోరాదనీ, అలా పాలు పంచుకుంటే దానికి సాధికారికత ఏర్పడుతుందని డిఫెన్స్ లాయర్లు అనుకున్నారు. శాక్కొ, వాంజెట్టిల జీవితంలో అతి కీలకమైన నిర్ణయాన్ని గవర్నర్ తీసుకోవాల్సి వున్న తరుణంలో కోర్టు వెలుపల ఇలాంటి పని ఏదైనా చేస్తే దుష్ఫలితాలుండవచ్చని వారు భయపడ్డారు.

డిఫెన్స్ లాయర్లతో సంబంధం లేకుండానే గొడార్డ్‌తో పరీక్షలు జరిపించాలని ప్రాసిక్యూషన్ నిర్ణయించింది. కనీసం ప్రేక్షకులుగా నైనా హాజరు కావలసిందిగా డిఫెన్స్ లాయర్లను ఆహ్వానించింది. చివరికి లాయర్ ఎహర్మన్ వ్యక్తిగత హోదాలో పరిశీలకుడిగా హాజరయ్యాడు. బోస్టన్ హెరాల్డ్ మేనేజింగ్ ఎడిటర్ ఫ్రాంక్ బక్స్టన్, సూక్ష్మదూరాలను కొలిచే నిపుణుడు డాక్టర్ అగస్టస్ గిల్** తదితరుల సమక్షంలో జూన్ 3న గొడార్డ్ బుల్లెట్లను పరీక్షించి అంతకు ముందు

* *బుల్లెట్ - III శాక్కొ పిస్టల్ నుంచే పేల్చబడిందని అప్పటికి కొన్నాళ్ళ క్రితమే మేజర్ గొడార్డ్ ప్రకటించి వున్నాడు*

** *ఈయన డిఫెన్స్ తరపున ఆయుధ నిపుణుడిగా సాక్ష్యమిచ్చివున్నాడు. ఆ తర్వాత ఆయనకు డిఫెన్స్‌తో సంబంధాలు లేవు. పరీక్షలు నిర్వహించేటప్పుడు గొడార్డ్‌కు సహాయం చేసే ధోరణిలో గిల్ వ్యవహరించాడు.*

తాను చెప్పిన అభిప్రాయాన్నే పునరుద్ఘాటించాడు. డిఫెన్స్ తరఫున డాక్టర్ గిల్ హాజరయ్యాడని ప్రాసిక్యూషన్ అబద్ధం చెప్పింది గిల్ కూడా ప్రాసిక్యూషన్ చేతిలో కీలు బొమ్మగా వ్యవహరించాడు తనకు డిఫెన్స్‌తో ఏనాడో సంబంధాలు తెగి పోయి వున్నప్పటికీ గొడార్డ్ పరిశోధనలు చూసి తాను డిఫెన్స్‌తో తెగతెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించాడు. 1923 లో డిఫెన్స్ తరఫున తను చెప్పిన సాక్ష్యం సరైనది కాదని అనిపిస్తోందని గొడార్డ్ పరిశోధనల అనంతరం డాక్టర్ గిల్ ప్రకటించాడు. బుల్లెట్-III గురించి ప్రాసిక్యూషన్ చెప్తున్న కథనాన్ని సమర్థించాడు.

గొడార్డ్ పరిశోధనల అనంతరం లాయర్ ఎహర్మన్ బుల్లెట్లను నిశితంగా పరిశీలించాడు. నాలుగు బుల్లెట్లపై వరసగా I I, నెంబర్లు వేసి వున్నాయి. , , II నంబర్లు మాత్రం ఒకే సర్జికల్ నీడిల్‌తో వేసినట్టుగా ఉండగా 'I I' మాత్రం వేరుగా ఉంది. లైన్లు కాస్త వంకరటింకరగా ఉండటాన్ని ఎహర్మన్ కనిపెట్టాడు. ఈ విషయాన్ని వెంటనే ఆయన గొడార్డ్ దృష్టికి తెచ్చాడు. అదేమంత పెద్ద విషయం కాదన్నట్టుగా గొడార్డ్ వ్యవహరించాడు.

ఈ సరికొత్త నిజాన్ని గురించి గొడార్డ్‌తో చర్చించేందుకు జూన్ 6న లాయర్ థామ్సన్ ఆఫీసులో డిఫెన్సు లాయర్లు సమావేశమయ్యారు. ' ' అనే నంబర్ మాత్రమే మిగిలిన వాటికన్నా భిన్నంగా ఎందుకుందో గొడార్డ్ చెప్పలేక పోయాడు. శవపరీక్ష జరిపిన డాక్టర్ నెంబర్ వేసిన ప్రాణాంతక బుల్లెట్-IIIని తొలగించి దాని స్థానంలో శాక్కో రివాల్వర్ నుంచి పేల్చిన బుల్లెట్‌పై 'I' నంబర్ వేసి పెట్టి ఉండవచ్చునని ఆ సమావేశానికి హాజరైన మరో ఆయుధ నిపుణుడు క్రాఫోర్డ్ అభిప్రాయపడ్డాడు. అదే జరిగి వుంటే శవంలో దొరికిందని చెప్పబడిన బుల్లెట్-III ని శాక్కో రివాల్వర్ నుంచే పేల్చినట్టుగా నిరూపించడం ఖాయంగా జరుగుతుంది. బుల్లెట్-III మీదా, శాక్కో రివాల్వర్ నుంచి పేల్చిన టెస్ట్ బుల్లెట్ మీదా గుర్తులు ఒకే రకంగా ఉండేందుకు అవకాశముంది. ప్రాసిక్యూషన్ కుట్ర చేసి బుల్లెట్-III ని మార్చి వుంటుందని డిఫెన్స్ లాయర్లు భావించారు.*

# 7

ఒక వైపు స్వయంగా కేసులో సాక్ష్యాలను పరిశీలిస్తూనే మరో వేపు కేసును సమీక్షించి తనకు సలహాయిచ్చేందుకు 1927 జూన్ 1న గవర్నర్ ఫుల్లర్ ఒక సలహా సంఘాన్ని నియమించాడు.

---

* *శాక్కో-వాంజెట్టి కేసు గురించి రాసిన ద కేస్ రిసాల్వ్‌డ్ గ్రంథంలో రచయిత ఫ్రాన్సిస్ రస్సెల్ ఒక సందేహం వెలిబుచ్చాడు. అది బుల్లెట్-III ని ప్రాసిక్యూషన్ మార్చి వుంటే టెస్ట్ బుల్లెట్ మీదా ఆ బుల్లెట్ మీదా గుర్తులు ఒకే రకంగా ఉండి వుండాలి. కాబట్టి కేసు విచారణలో అలా ఒకే రకంగా లేవని డిఫెన్స్ తరఫున ఆయుధ నిపుణులు చెప్పిన సాక్ష్యం తప్పయి వుండాలి- రస్సెల్ సందేహానికి ఒక సమాధానం చెప్పవచ్చు. బుల్లెట్-III ని మార్చే పని కేసులో సాక్షుల విచారణ జరిగింతర్వాత ప్రాసిక్యూషన్ చేసి వుండేందుకు అవకాశం వుంది. కాబట్టి అప్పటి డిఫెన్స్ సాక్ష్యమూ, ఇప్పటి డిఫెన్స్ నిర్ధారణా సరైనవే కావచ్చు.*

హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు అబ్బాట్ లారెన్స్ లోవెల్ అధ్యక్షతన ఏర్పడిన ఈ సలహా సంఘంలో యింకో ఇద్దరు సభ్యులున్నారు- మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యక్షుడు శామ్యూల్ స్ట్రాటన్, రిటైర్డ్ న్యాయమూర్తి రాబర్ట్ గ్రాంట్. లోవెల్ కమిటీగా ఇది ప్రసిద్ధమైంది.

సలహా సంఘ నియామకానికి ఒక వేపు హర్షం, మరో వేపు వ్యతిరేకత వ్యక్తమయ్యాయి.

న్యూయార్క్ వరల్డ్, సెయింట్ లూయీ పోస్టు డిస్పాచ్ దినపత్రికలు గవర్నర్ చర్యను హర్షించాయి. ఆ పత్రికలు రెండూ కేసు మొత్తాన్నీ తిరిగి విచారించాలని ముందు నుంచీ పట్టుపడుతున్నాయి. బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్స్క్రిప్ట్ మాత్రం కేసులో గవర్నర్ జోక్యాన్ని మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. లోవెల్ కమిటి నియామకం వల్ల మసాచూసెట్స్ రాష్ట్ర ప్రభుత్వమే అగ్ని పరీక్ష పాలైందని ఆ దిన పత్రిక ఘాటుగా విమర్శలు గుప్పించింది చిలీలోని అమెరికా రాయబారికి చేరిన ఒక ఆకాశరామన్న బెదిరింపు లేఖను మొదటి పేజీలో ప్రముఖంగా అచ్చేసింది. అలా ఒక అప్రాముఖ్యమైన వార్తను ప్రముఖంగా ప్రచురించి గవర్నర్ మనసులో విషబీజాలు నాటాలని ఆ పత్రిక ప్రయత్నించింది

గవర్నర్ నిర్ణయం న్యాయవ్యవస్థ మీద దాడి అని మసాచూసెట్స్‌కు చెందిన ప్రముఖ మాజీ ఉన్నతాధికారి గుడ్‌విన్ విమర్శించాడు. ప్రముఖ న్యాయవేత్త డీన్ రస్కో పౌండ్ ఆయనకు సమాధానం చెప్పాల్సి వచ్చింది. అధికారిక జోక్యాన్ని అభ్యర్థిస్తూ ప్రజాభిప్రాయాన్ని కూడగట్టరాదనడం తప్పు అని పౌండ్ పేర్కొన్నాడు. న్యాయవ్యవస్థ విమర్శకు అతీతమైనదనే వాదనా, వేరే కారణం వల్ల మనకు ఇష్టం లేని వాళ్ళను వాళ్ళు చేయని నేరాలకు శిక్షించడం మంచిదనే సిద్ధాంతమూ అమెరికా సంప్రదాయాలకు విరుద్ధమైనవని ఆయన వాదించాడు.

ఆనాటి బోస్టన్ పరిస్థితి గురించి న్యూ రిపబ్లిక్‌లో అచ్చయిన ఒక వ్యాసంలో బోస్టన్‌లో అంతర్యుద్ధం జరుగుతోందని వ్యాసకర్త బ్రూస్‌బ్లివెన్ పేర్కొన్నాడు. కేసును సమీక్షించాలనే వాళ్ళూ, అక్కర్లేదనే వాళ్ళూ బోస్టన్ బార్‌లో సమాన సంఖ్యలో ఉన్నారు. ఫ్రాంక్ ఫర్టర్ ఈ కేసు గురించి రాసిన పుస్తక ప్రతులను పుస్తకాల షాపుల్లో బహిరంగంగా ప్రదర్శించేందుకు పుస్తక విక్రేతలు భయపడుతున్నారనీ, ఆ పుస్తకం కావాలని అడిగితే రహస్యంగా తీసి యిస్తున్నారని బ్లివెన్ రాశాడు. కొన్ని పాఠశాలల్లో కేసు గురించి చర్చించడాన్ని నిషేధించారు. శాక్కో, వాంజెట్టి అభిమానులు పలు రకాల సాంఘిక, ఆర్థిక ఆంక్షలకు గురయ్యారు.

కేసును సమీక్షించడం మంచిది కాదనే వాళ్ళు చెప్తున్న ప్రధాన కారణాలు మూడు- మొదటిది· కేసును సమీక్షిస్తే మసాచూసెట్స్ న్యాయవ్యవస్థనే ప్రశ్నించినట్లవుతుంది. ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పరీక్షించినట్లవుతుంది. కాబట్టి ప్రభుత్వ సంస్థలలో ప్రజల విశ్వాసం సడలి పోవచ్చు. అది జరగనీయడం కంటే శాక్కో, వాంజెట్టిలను చంపడం మేలు వాంజెట్టి ఒక లేఖలో రాసినట్లు *"రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠనూ, గౌరవాన్నీ రక్షించడం కోసం వాళ్ళు మమ్మల్ని చంపి తీరాలి"* రెండవ కారణం: శాక్కో, వాంజెట్టిలు

హంతకులు కాకపోయినా అరాచకవాదులు, ఇటాలియన్లు కాబట్టి వాళ్ళను వదిలించుకోవాలి. అమెరికా అమెరికన్లది తప్ప విదేశీయులది కాదని గుణపాఠం నేర్పితీరాలి. మూడవది ముద్దాయిలిద్దరినీ విడుదల చేయాలని ఇంటా బయటా రాడికల్స్ ఉద్యమించారు. కాబట్టి మరణ శిక్ష రద్దు చేయడం అంటే ఉద్యమకారులకూ బోల్షివిక్కులకూ ప్రభుత్వం లొంగి పోయినట్టవుతుంది అది అమెరికనత్వం కాదు

'శాక్కో, వాంజెట్టిలను ఉరి తీయాలని బోస్టన్ ఎందుకు కోరుతోంది' శీర్షికతో న్యూ రిపబ్లిక్ మే 25న అచ్చేసిన సంపాదకీయం ముద్దాయిలు దేశీయ రాడికల్స్ అయి వుంటే వారు శిక్షించబడక పోయివుండేవారనీ, వారి పట్ల నిరసనకు కారణాల్లో ఒకటి వారు విదేశీయ రాడికల్స్ కావడమని పేర్కొంది

జూన్ 30న గుడ్‌విన్ మరోసారి ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ మీదా, పౌర హక్కుల సంస్థల మీదా దాడి చేసి హద్దుల్లేని ద్వేషాన్ని ప్రదర్శించాడు:

*నార్‌ఫోక్ కౌంటీ ప్రజలకు వీళ్ళు నేరస్తులని తెలుసు- కానీ అమెరికాకు సరిపడని విదేశీ భావ ప్రాచుర్యం ఉన్న రష్యాలో, హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో, అర్జెంటీనాలో, చైనాలో, స్మిత్ కళాశాలలో, వెల్లస్లీలో వున్న వాళ్ళకు వీళ్ళు ఖచ్చితంగా నిర్దోషులే.*

*ఈ ఇద్దరు హంతకుల విడుదల కోసం జరుగుతున్న ఉద్యమానికి ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ నాయకుడు (ఆయన) కృషి వలన నేర తీవ్రతతో సంబంధం లేకుండానే మూనీ, బిల్లింగ్స్ క్షమాభిక్ష పొందారు. మూనీ, బిల్లింగ్స్ విడుదల కోసం జరిగిన ఉద్యమం నుంచి ఎ సి ఎల్.యు (అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్) అనబడే సంస్థ పుట్టుకొచ్చింది దాని చుట్టూ దాని ద్వారా దేశంలోని దేశద్రోహ, కమ్యూనిస్టు శక్తులన్నీ పని చేస్తున్నాయి. అమెరికా ప్రభుత్వాన్నీ, సైన్యాన్నీ హింసా ప్రయోగం ద్వారా ధ్వంసం చేయాలనే ఆలోచనతో సైన్యాన్ని బలహీన పరచి అమెరికాకు ప్రియమైన సంస్థలనూ, దేశాన్నీ నాశనం చేయాలనే ఆలోచనతో ఈ సంస్థలోని 500 మంది పని చేస్తున్నారు*

ఈ కాలంలో దేశ విదేశీ నిరసనోద్యమం బలం పుంజుకుంది. కేసును అధ్యయనం చేసేందుకు స్వీడన్ మాజీ ప్రధాని కొడుకు జార్జి బ్రాంటింగ్ స్వీడిష్ సోషలిస్టు కార్మిక సంస్థల ప్రతినిధిగా జూన్‌లో అమెరికాలో పర్యటించాడు. శాక్కో, వాంజెట్టి నిర్దోషులని ప్రకటించాడు. జూన్ 11న వాంజెట్టికి 39వ జన్మదిన శుభాకాంక్షలందజేస్తూ యూరోపియన్ కార్మికులు పంపిన పుష్పగుచ్ఛాన్ని అందజేశాడు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ చొరవతో పలు కార్మిక సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ప్రపంచ వ్యాప్తంగా నిరసనోద్యమాన్ని ఉధృతం చేశాయి. న్యూయార్క్ నగరంలో జూలై 7న యూనియన్ స్క్వేర్‌లో పది వేల మందితో జరిగిన బట్టల మిల్లు కార్మికు సభ మీద పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసి సభను భగ్నం చేశారు.

లోవెల్ కమిటి నియామకం గవర్నర్ ఫుల్లర్‌పై తిరిగి ఆశలను రేకెత్తించింది. గవర్నర్ మనసు

మార్చుకున్నాడా? ముద్దాయిలకు క్షమాభిక్ష పెట్టేందుకే కమిటీని నియమించాడా? - అనే మీమాంసలో కొందరుండిపోయారు.

"మనం ఇప్పుడు రాత్రుళ్ళు నిద్రపోవచ్చు" అన్నాడు జాన్ మూర్స్. కమిటి అధ్యక్షుడు లోవెల్ ఆయనకు సన్నిహిత స్నేహితుడు. కాబట్టి మరణశిక్ష రద్దుకు సిఫార్సు చేయడం ఖాయమని మూర్స్ నమ్మాడు. న్యాయం జరగబోతోందని ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ కూడా ఆశించాడు. శాక్కో-వాంజెట్టి మరణశిక్షల రద్దును కోరుతున్న ఉద్యమంలో పని చేస్తున్న లూయీ రాంటౌల్‌కు లోవెల్ బంధువు కూడా. లోవెల్ సోదరి కమ్యూనిస్టు పార్టీ పత్రిక న్యూమాసెస్‌కు వ్యాసాలు రాసేది. ప్రొఫెసర్ జచేరియా చాఫీ జూనియర్ తన 'ఫ్రీ స్పీచ్ ఇన్ యునైటెడ్ స్టేట్స్' గ్రంధాన్ని లోవెల్‌కు అంకితమిచ్చాడు. అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నొకదాన్ని జచేరియా చాఫీ విమర్శించగా సంప్రదాయవాదులు ఆయనపై విరుచుకుపడిన సందర్భంలో హార్వర్డ్ అధ్యక్షుడైన లోవెల్ చాఫీ పక్షం వహించి ఆయనకున్న అభిప్రాయ స్వేచ్ఛను సమర్థించి ఆయన ఉద్యోగం ఊడకుండా సహాయపడ్డాడు. బోస్టన్ పోలీసు సమ్మె (1919) ను సమర్థించిన నేరానికి హెరాల్డ్ లాస్కీని హార్వర్డ్ నుంచి తరిమేయాలని వత్తిడి రాగా లోవెల్ లొంగలేదు. తనైనా రాజీనామా చేస్తానే గానీ లాస్కీ రాజీనామాను మాత్రం కోరనని ఖండితంగా చెప్పాడు. ఈ కారణాల రీత్యా లిబరల్ మేధో వర్గాల్లో లోవెల్‌కు ప్రజాస్వామ్య వాదిగా చాలా పేరుంది.

డిఫెన్స్ లాయర్లు మాత్రం లోవెల్‌పై పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. నేర విచారణ గురించి అనుభవం లేని, నేర పరిశోధనతో పరిచయం లేని, నేరస్తుల స్వభావం పట్ల అవగాహన లేని కమిటి అని లోవెల్ కమిటీని వారు అర్థం చేసుకున్నారు. కమిటి నిష్పక్షపాతంగా, శాస్త్రబద్ధంగా విచారణ జరపగలదని థామ్సన్, ఎహర్మన్‌లు నమ్మలేకపోయారు. వారి భయాలకువేరే కారణాలు కూడా ఉన్నాయి. 'లిబరల్ మేధావి' అయినా లోవెల్ కొన్ని సందర్భాల్లో అభివృద్ధి నిరోధక భావాలు కలవాడిగా బాహాటంగా ప్రవర్తించి ఉన్నాడు. అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా లూయీ బ్రాండిస్ లాంటి లిబరల్ న్యాయవేత్త నియామకాన్ని లోవెల్ వ్యతిరేకించాడు. విజాతీయులకు వ్యతిరేకంగా విద్యార్థులను రెచ్చగొట్టాడు. బోస్టన్ పోలీసు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు విద్యార్థులను ప్రోత్సహించి స్వయంసేవక దళాలుగా పని చేయించాడు. న్యూ ఇంగ్లాండ్ ప్రాంత ధనిక వర్గానికి ఆయన ప్రతినిధి. బట్టల మిల్లులకు యజమాని, రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఏడాదికి పది లక్షల డాలర్ల సంపాదనాపరుడు. కొన్నాళ్ళు లాయర్‌గా కూడా ప్రాక్టీస్ చేశాడు.

కమిటీలో మరో సభ్యుడైన రాబర్ట్ గ్రాంట్ జడ్జిగా పని చేసి పదవీ విరమణ చేసి ఉన్నాడు. ఒక మోస్తరు స్థితిపరుడు. కొన్ని నవలలు రాశాడు. న్యాయశాస్త్రంలో మాత్రం పెద్దగా ప్రావీణ్యత లేదు. ఆర్థిక, రాజకీయ సంబంధ విషయ పరిజ్ఞానం కానీ, వాటి పట్ల ఆసక్తిగానీ ఆయనకు లేవు. ఆయనకు ఇటాలియన్ల పట్ల ప్రత్యేకమైన ద్వేషముందని డిఫెన్స్ కమిటీకి సమాచారమందింది.

సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా కేసు గురించి ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ వ్యాసం రాయడం ఈ సంప్రదాయవాద న్యాయమూర్తికి కంటగింపయింది. శాక్కొ, వాంజెట్టిలను శిక్షించడం సరైనదేనని అప్పటికే అనేక మంది మిత్రులకు చెప్పి వున్నాడు.

సలహా సంఘంలోని మరొక సభ్యుడు శామ్యూల్ స్ట్రాటన్‌కు అరవై ఎనిమిదేళ్ళు. మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యక్షుడిగా పని చేస్తున్నప్పటికీ ప్రజా సంబంధ వ్యవహార జ్ఞానం బొత్తిగా లేని వాడు. న్యాయశాస్త్రంతో ఏ మాత్రం పరిచయం లేదు. లోవెల్ కమిటి సాక్షులను విచారించే సమయంలోనూ, వాదనలు వింటున్నప్పుడు ఆయన మౌనంగా చూస్తుండే వాడు తప్ప అందులో జోక్యం చేసుకొనే వాడు కాడు. ఒక్క మాట కూడా మాట్లాడేవాడు కాడు. ఈయన కమిటీ సభ్యుడనే స్పృహ కూడా లేకుండా లోవెల్, గ్రాంట్‌లు వ్యవహరించేవారు.

కమిటీ విచారణ ప్రారంభించే నాటికల్లా దేశవ్యాప్తంగా కేసు గురించి వేడి వేడి చర్చలు సాగుతున్నాయి. ప్రదర్శనలు, సభలు, సమావేశాలు, పత్రికా వ్యాసాలు, క్లబ్బుల్లో వాగ్యుద్ధాలు, వాడిగా వేడిగా సాగుతున్నాయి. కేసు మొత్తాన్ని సమీక్షిస్తూ న్యూయార్క్ టైమ్స్‌లో లారిస్టన్ బుల్లర్డ్ జూన్ 27న పెద్ద వ్యాసం రాశాడు.

# 8

యూనివర్సిటీ పనుల వత్తిడిలో లోవెల్‌కు తీరుబడి లేక పోవడంతో కమిటీ విచారణ జులై 11న కానీ మొదలు కాలేదు. అందువల్ల మరణశిక్ష అమలు జరిపే తేదీని జులై 10 నుంచి ఆగస్టు 10కి మారుస్తూ గవర్నర్ ఆదేశాలు జారీ చేశాడు.*

లోవెల్ కమిటి ఇరుపక్షాల లాయర్ల సమక్షంలో సాక్షులను విచారించింది. ప్రధానంగా డిఫెన్సు లాయర్లు సూచించిన సాక్షుల వాంగ్మూలాలను కమిటీ నమోదు చేసింది. న్యాయమూర్తి థేయర్‌ను మరో న్యాయమూర్తిని జూరర్లను విచారించినప్పుడు మాత్రం డిఫెన్స్ లాయర్లు హాజరయేందుకు అనుమతించలేదు. మాజీ జిల్లా అటార్నీ కట్జ్‌మన్‌ను కొంత మేరకు క్రాసు పరీక్షచేసే అవకాశాన్ని మాత్రం వారికిచ్చారు. ఈ సందర్భంగా పాత్రికేయులను అనుమతించలేదు. పత్రికా ప్రచారాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్న డిఫెన్స్ కమిటీకి ఇది అశనిపాతమైంది.

ముద్దాయిల పట్లా, వారి లాయర్ మూర్ పట్లా న్యాయమూర్తి థేయర్ వ్యతిరేకతను నిరూపించేందుకు కమిటీ ముందు జర్నలిస్టు జాన్ బెఫెల్ సాక్ష్యం చెప్పాడు. అదే విషయాన్ని ఇటాలియన్ దౌత్యవేత్త అగొస్టినొ ఫెర్రాంటె కూడా కమిటీకి చెప్పాడు. శాక్కొ, వాంజెట్టిలను

---

* అప్పటికే వారిని డెడ్‌హాం జైలు నుండి చార్లెస్ టౌన్ జైలుకు తరలించారు. అక్కడ మరణశిక్ష అమలు జరిపే విద్యుత్ కుర్చీ ఉంది.

శిక్షించాలని థేయర్ ముందుగానే నిర్ణయించుకున్నాడని బోస్టన్ గ్లోబ్ విలేఖరి ఫ్రాంక్ సిబ్లీ* కూడా సాక్ష్యమిచ్చాడు.

*(థేయర్) ప్రవర్తన నన్ను ప్రభావితం చేసింది. మీరు దాన్ని రికార్డులో చదవ లేరు. నా ముప్పై ఐదేళ్ళ అనుభవంలో అలాంటి దాన్ని నేను చూడలేదు. . . . ఆయన మొత్తం ప్రవర్తన చూస్తే అక్కడ జూరర్లు ఉన్నది వీళ్ళను దోషులుగా ప్రకటించడానికే ననిపించేట్టుగా ఉంది.*

థేయర్ ప్రవర్తనకు విస్మయం చెందిన సిబ్లీ అటార్నీ జనరల్‌కు అప్పట్లోనే లేఖ రాసి థేయర్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని అభ్యర్థించాడు.

థేయర్ గురించి సాక్ష్యం చెప్పిన వారిలో జార్జి క్రోకర్ ముఖ్యుడు. ఆయన బోస్టన్‌లో ప్రముఖ లాయర్. లోవెల్ కమిటీ ముందు ఆయనిలా చెప్పాడు:

*. . . ఒక సాయంకాలం (థేయర్) నన్ను (యూనివర్సిటీ క్లబ్బులో) కలిశాడు. పేరు పెట్టి పిల్చాడు. అంతకు ముందెప్పుడూ నేను ఆయనను కలిసినట్టు గుర్తు లేదు. కానీ, నాతో మాట్లాడటం మొదలు పెట్టాడు. రెడ్స్ నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో చెప్పాడు. తర్వాత ఈ శాక్కొ-వాంజెట్టి కేసు గురించి చెప్పడం మొదలు పెట్టాడు. కేసును విచారిస్తున్న న్యాయమూర్తి ఆయనేనని చివరికి నేను గ్రహించాను.*

*(తర్వాత) అనేక సార్లు నాతో అదే పద్ధతిలో మాట్లాడాడు.. . . (జూరీకి చార్జి గురించి చెప్పిన రోజు ఉదయం). . . .''మూర్ తన వాదనలో జూరీకి ఫలానా ఫలానా సంగతులు చెప్పాడు. నేను జూరీకి చెప్పబోతున్న చార్జిలో కొంత భాగం మీకు చదివి వినిపిస్తాను. అది అతనికి కళ్ళుమేస్తుంది'' అని నాతో చెప్పాడాయన.*

ప్రఖ్యాత హాస్యరచయిత రాబర్ట్ బెంచ్లీ థేయర్ గురించిన మరికొన్ని నిజాలను బయటపెడుతూ అఫిడవిట్ రాసిచ్చాడు. న్యూయార్క్ నగరానికి చెందిన బెంచ్లీ స్వస్థలం వర్సెస్టర్. థేయర్ ఉండేదీ అక్కడే. వర్సెస్టర్ గోల్ఫ్ క్లబ్‌లో థేయర్‌కూ, ఆయన స్నేహితుడైన కోస్‌కూ మధ్య ఈ కేసు గురించి జరిగిన సంభాషణ బెంచ్లీకి తెలుసు. కోస్ బెంచ్లీకి కూడా స్నేహితుడే కావడం వల్ల బెంచ్లీకి కోస్ ఆ సంభాషణ వివరాలు చెప్పాడు. శాక్కొ, వాంజెట్టిలు లంజా కొడుకులనీ, వాళ్ళు తనను బెదిరించజూస్తున్నారనీ, వాళ్ళకు సరైన గుణపాఠం చెప్తాననీ, వారిద్దరి విడుదల కోసం రాడికల్స్ తన మీద వత్తిడి తెస్తున్నారనీ, ఇంకా కొన్ని డజన్ల మంది రాడికల్స్‌ను ఉరి తీయనున్నాననీ థేయర్ కోస్‌కు చెప్పాడు.అప్పటికింకా కేసు విచారణ జరుగుతోంది.

బెంచ్లీ ఈ సంగతులు బయటపెట్టాక, లాయర్ థాంప్సన్ కోస్‌ను కలిసి అఫిడవిట్ ఇవ్వమని అడిగాడు. థేయర్‌తో తనకున్న స్నేహాన్ని కోస్ వదులుకోలేదు. తనకు అప్పటి సంగతులు గుర్తు

---

* *సీనియర్ జర్నలిస్టు. బోస్టన్ నగరంలోని పాత్రికేయులకు గురుతుల్యుడు.*

లేవని తప్పుకున్నాడు. అయితే బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్స్క్రిప్ట్‌లో ప్రచురించబడ్డ బెంప్లీ అఫిడవిట్‌ను ఖండిస్తూ కోస్ ఒక పత్రికా ప్రకటన మాత్రం చేశాడు.

న్యూ హాంప్‌షైర్‌లో ఉన్న డార్ మౌత్ కాలేజీలో జేమ్స్ రిచర్డ్‌సన్ లా ప్రొఫెసర్. ఆ కాలేజీ పోషకుల్లో థేయర్ ఒకడు. అక్కడ 1924 నవంబర్‌లో జరిగిన ఫుట్‌బాల్ గేమ్ చూసేందుకొచ్చిన థేయర్ ప్రొఫెసర్ రిచర్డ్‌సన్‌కు తటస్థ పడ్డాడు. శాక్కో-వాంజెట్టి కేసు గురించి థేయర్ తన సహజ ధోరణిలో మాట్లాడాడు. ముద్దాయిల పట్ల థేయర్ వైఖరి చూసి రిచర్డ్‌సన్ ఖిన్నుడయ్యాడు. ముద్దాయిలకు మరణశిక్ష విధించిన పది రోజుల తర్వాత రిచర్డ్‌సన్ గవర్నర్‌కు రాసిన లేఖలో థేయర్ వైఖరిని వివరించాడు. ఈ లేఖ పత్రికలలో ప్రచురించబడే వరకూ డిఫెన్స్ లాయర్లకు దాని గురించి ఏమీ తెలియదు. అఫిడవిట్ ఇచ్చేందుకు రిచర్డ్‌సన్ ఇష్ట పడలేదు. అయితే గవర్నర్ సలహా సంఘం ముందు జులై 12న ఆయన స్వచ్ఛందంగా హాజరయ్యాడు. థేయర్ తనతో శాక్కో, వాంజెట్టిల గురించి మాట్లాడుతూ వాళ్ళను "లంజాకొడుకుల"ని తిట్టాడనీ, "సుప్రీం కోర్టుకు వెళ్ళనివ్వండిప్పుడు. దాన్నుంచి ఏం సాధిస్తారో చూద్దాం" అన్నాడనీ, చాలా ఉద్రేకపూరితంగా మాట్లాడాడనీ రిచర్డ్‌సన్ వాంగ్మూలమిచ్చాడు.

ఇది జరిగాక, రిచర్డ్‌సన్‌ను డార్‌మౌత్ కాలేజీ నుంచి తరిమేస్తే, కాలేజీకి తాము పది వేల డాలర్ల విరాళం ఇవ్వగలమని కొందరు పోషకులు యాజమాన్యానికి టెలిగ్రాంలు పంపారు.

కొన్ని పిటీషన్లపై వాదనలు వినకముందే వాటిని తోసి పుచ్చేందుకు థేయర్ నిర్ణయించుకున్నాడని కూడా కమిటీ ముందు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టారు. రాడికల్స్ నుంచి న్యాయస్థానాలను రక్షించే వీరుడిగా థేయర్ తనను తాను భావించుకునే వాడని కూడా సాక్ష్యాలు లభించాయి.

న్యాయమూర్తి థేయర్‌ను కూడా కమిటీ విచారించింది. "ఏ న్యాయమూర్తి అయినా అంత వదరుబోతుగా ఉండగలడా" అని ఆశ్చర్యపోయానని కమిటీ సభ్యుడు గ్రాంట్ తర్వాత తన స్వీయ చరిత్ర ఫోర్‌స్కోర్ లో రాసుకున్నాడు. థేయర్ విచక్షణా జ్ఞానం లేని వాడనీ, అధికార హుందాతనాన్ని ఉల్లంఘించాడని కమిటీ నివేదికలో రాశారు. కానీ ఆయన ప్రవర్తన వల్ల జ్యూరీ గానీ, కేసు విచారణ గానీ ప్రభావితం కాలేదని నిర్ధారించారు. లోవెల్ కమిటీ కూడా థేయర్‌లాగా వ్యవహరించిన సందర్భాలు అనేక మున్నాయి.

పోలీసు అధికారి గలివన్ తనే టోపీలో చిరుగు చేశానని గవర్నర్‌కు చెప్పిన విషయాన్నే కమిటీ ముందు కూడా చెప్పాడు. ప్రాసిక్యూషన్ తరపు సాక్ష్యాలు నాశనమైపోతున్నాయన్న దుగ్ధ కమిటీ సభ్యుల్లో బయల్దేరింది. వారు నిష్పక్షపాత న్యాయమూర్తులుగా వ్యవహరించాలన్న ఇంగిత జ్ఞానాన్ని మర్చిపోయి ప్రవర్తించారు. గలివన్ చిరుగు పెట్టే సరికే టోపీ లోపల చిరుగు ఉన్నదని గలివన్‌తో అంగీకరింపజేసేందుకు పలు ప్రశ్నలడిగారు. గలివన్ ఒప్పుకోక పోయేసరికి టోపీలో చిరుగు చాలా స్వల్పమైనదన్నట్టుగా మాట మార్చారు. గలివన్ సాక్ష్యం శాక్కో దోషిత్వాన్ని సందేహించడానికైనా వుపయోగపడదా అని డిఫెన్స్ లాయర్లు ఆశ పడ్డారు.

కమిటీ వద్ద పనిచేసే బంట్రోతు ఒకరు కమిటీ సభ్యుల సంభాషణలు విని డిఫెన్స్ లాయర్ల చెవిన వేసేవాడు. శాక్కో, వాంజెట్టీలకు శిక్ష ఖాయ పరుస్తూ కమిటీ నిర్ధారించ బోతున్నదని రూఢీ అయింది. ఒక విషాద నాటకంలో తాము అద్భుత నటులుగా మారిపోతున్నామని థామ్సన్, ఎహర్మన్ బాధపడ్డారు. కమిటీ ఎం నిర్ధారించబోతున్నదో తెలిసికూడా వాదించాల్సిన నికృష్ట స్థితిలో వారున్నారు ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ వారికి ధైర్యం చెప్పాడు.

బోస్కో-గుడాగ్ని ఘటన ఈ కమిటీ పక్షపాత వైఖరికి తిరుగులేని ఉదాహరణగా చెప్పవచ్చు ప్రొఫెసర్ ఫెలిస్ గుడాగ్ని అల్బర్ట్ బోస్కో శాక్కో ఎలిబీని నిరూపించిన సాక్షులు. బ్రెయిన్ ట్రీ నేరం జరిగిన 1920 ఏప్రిల్ 15న శాక్కో బోస్టన్‌లో వారిని కలిశాడు ఆ రోజు మేజర్ విలియమ్స్ గౌరవార్థం విందు జరిగింది. కాబట్టి తమకు శాక్కో కలిసిన విషయం గుర్తుందని వారిద్దరూ కోర్టులో సాక్ష్యమిచ్చి ఉన్నారు.

డిఫెన్స్ లాయర్లకు తెలియకుండా విలియమ్స్‌కు లోవెల్, గ్రాంట్‌లు ఫోన్ చేశారు. తనకు 1920 ఏప్రిల్‌లో ఒకే ఒక విందు యిచ్చారని ఆయన వారికి పొరపాటున చెప్పాడు. ఏప్రిల్ 13న ఆ విందు జరిగినట్టుగా పత్రికలలో వార్త అచ్చయింది. బోస్కో, గుడాగ్నిలను పిలిపించి దబాయించి శాక్కో ఎలిబీని నాశనం చేయవచ్చని లోవెల్, గ్రాంట్ ఎత్తు వేశారు. డిఫెన్స్ లాయర్లకు చెప్పకుండానే ఆ సాక్షులిద్దర్నీ పిలిపించారు. తమ తెలివంతా ఉపయోగించి పాత దినపత్రికలు చూపించి వారిని గందరగోళ పర్చారు. ఏప్రిల్ 15నే విందు జరిగిందనీ, అదే రోజు శాక్కోను కలిశామనీ సాక్షులిద్దరూ ఘంటాపథంగా చెప్పారు.

రెండు విందులు జరిగివుండవచ్చనీ- ఒకటి ఏప్రిల్ 13న, మరొకటి ఏప్రిల్ 15న జరిగి వుంటాయనీ డిఫెన్స్ లాయర్లు వాదించారు. గుడాగ్నిని ప్రశ్నిస్తున్న థామ్సన్ నిజాయితీని కూడా లోవెల్ శంకించి అమర్యాదగా మాట్లాడాడు తాను లాయర్‌గా అక్కడి కొచ్చింది కమిటీని మోసం చేయడానికి కాదని కమిటీ భావిస్తేనే తాను వాదిస్తానని థామ్సన్ ప్రకటించాడు. తన క్లయింట్లు నిర్దోషులని నమ్మబట్టే లాయర్‌గా పని చేస్తున్నాననీ, వారి విడుదల కోసం తప్పుడు పద్ధతులు అవలంభించడం తన పని కాదనీ ఆయన లోవెల్‌కు చెప్పాడు. ఏప్రిల్ 15నే విందు జరిగిందని బోస్కో చెప్తుండగా అలా కావడానికి వీల్లేదు అంటూ లోవెల్ ఖండితంగా ప్రకటించాడు. సాక్షితో వాదన పెట్టుకున్నాడు. తాను సాక్ష్యాధారాల కోసం ప్రయత్నిస్తానని బోస్కో చెప్పగా మరుసటి రోజుకు వాయిదా వేశాడు.

బోస్కో, గుడాగ్నిలు లా నోటిజయ దినపత్రిక పాత సంచికలను పట్టుకెళ్ళి లోవెల్‌కు చూపించారు. అందులో వారు చెప్పినట్టే ఏప్రిల్ 15న విలియమ్స్‌కు విందు జరిగిన వార్త వుంది. ఏప్రిల్ 13న మరో విందు జరిగిందని కూడా ఉంది. రెండు విందులు జరిగాయని లోవెల్ అంగీకరించక తప్పలేదు. సాక్షులు అబద్ధాలు చెప్పలేదనీ, తామే పొరపాటు పడ్డామనీ లోవెల్, గ్రాంట్‌లు గ్రహించారు.

లేవని తప్పుకున్నాడు అయితే బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్స్క్రిప్ట్‌లో ప్రచురించబడ్డ బెంప్లీ అఫిడవిట్‌ను ఖండిస్తూ కోస్ ఒక పత్రికా ప్రకటన మాత్రం చేశాడు

న్యూ హాంప్‌షైర్‌లో ఉన్న డార్ మౌత్ కాలేజీలో జేమ్స్ రిచర్డ్‌సన్ లా ప్రొఫెసర్ ఆ కాలేజీ పోషకుల్లో థేయర్ ఒకడు అక్కడ 1924 నవంబర్‌లో జరిగిన ఫుట్‌బాల్ గేమ్ చూసేందుకొచ్చిన థేయర్ ప్రొఫెసర్ రిచర్డ్‌సన్‌కు తటస్థ పడ్డాడు శాక్కో-వాంజెట్టి కేసు గురించి థేయర్ తన సహజ ధోరణిలో మాట్లాడాడు ముద్దాయిల పట్ల థేయర్ వైఖరి చూసి రిచర్డ్‌సన్ ఖిన్నుడయ్యాడు ముద్దాయిలకు మరణశిక్ష విధించిన పది రోజుల తర్వాత రిచర్డ్‌సన్ గవర్నర్‌కు రాసిన లేఖలో థేయర్ వైఖరిని వివరించాడు. ఈ లేఖ పత్రికలలో ప్రచురించబడే వరకూ డిఫెన్స్ లాయర్లకు దాని గురించి ఏమీ తెలియదు అఫిడవిట్ ఇచ్చేందుకు రిచర్డ్‌సన్ ఇష్టపడలేదు అయితే లోవెల్ సలహా సంఘం ముందు జులై 12న ఆయన స్వచ్ఛందంగా హాజరయ్యాడు థేయర్ తనతో శాక్కో వాంజెట్టిల గురించి మాట్లాడుతూ వాళ్ళను 'లంజాకొడుకుల'ని తిట్టాడనీ సుప్రీం కోర్టుకు వెళ్ళనివ్వండిప్పుడు దాన్నుంచి ఏం సాధిస్తారో చూద్దాం అన్నాడనీ చాలా ఉద్రేకపూరితంగా మాట్లాడాడనీ రిచర్డ్‌సన్ వాంగ్మూలమిచ్చాడు

ఇది జరిగాక, రిచర్డ్‌సన్‌ను డార్‌మౌత్ కాలేజీ నుంచి తరిమేస్తే కాలేజీకి తాము పది వేల డాలర్ల విరాళం ఇవ్వగలమని కొందరు పోషకులు యాజమాన్యానికి టెలిగ్రాంలు పంపారు

కొన్ని పిటీషన్లపై వాదనలు వినకముందే వాటిని తోసి పుచ్చేందుకు థేయర్ నిర్ణయించుకున్నాడని కూడా కమిటీ ముందు సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టారు రాడికల్స్ నుంచి న్యాయస్థానాలను రక్షించే వీరుడిగా థేయర్ తనను తాను భావించుకునే వాడని కూడా సాక్ష్యాలు లభించాయి.

న్యాయమూర్తి థేయర్‌ను కూడా కమిటీ విచారించింది 'ఏ న్యాయమూర్తి అయినా ఇంత వదరుబోతుగా ఉండగలడా" అని ఆశ్చర్యపోయానని కమిటీ సభ్యుడు గ్రాంట్ తర్వాత తన స్వీయ చరిత్ర ఫోర్‌స్కోర్ లో రాసుకున్నాడు. థేయర్ విచక్షణా జ్ఞానం లేని వాడనీ అధికార హుందాతనాన్ని ఉల్లంఘించాడని కమిటీ నివేదికలో రాశారు కానీ ఆయన ప్రవర్తన వల్ల జూరీ గానీ, కేసు విచారణ గానీ ప్రభావితం కాలేదని నిర్ధారించారు. లోవెల్ కమిటీ కూడా థేయర్‌లాగా వ్యవహరించిన సందర్భాలు అనేక మున్నాయి.

పోలీసు అధికారి గలివన్ తనే టోపీలో చిరుగు చేశానని గవర్నర్‌కు చెప్పిన విషయాన్నే కమిటీ ముందు కూడా చెప్పాడు. ప్రాసిక్యూషన్ తరపు సాక్ష్యాలు నాశనమైపోతున్నాయన్న దుగ్ధ కమిటీ సభ్యుల్లో బయల్దేరింది. వారు నిష్పక్షపాత న్యాయమూర్తులుగా వ్యవహరించాలన్న ఇంగిత జ్ఞానాన్ని మర్చిపోయి ప్రవర్తించారు. గలివన్ చిరుగు పెట్టే సరికే టోపీ లోపల చిరుగు ఉన్నదని గలివన్‌తో అంగీకరింపజేసేందుకు పలు ప్రశ్నలడిగారు. గలివన్ ఒప్పుకోక పోయేసరికి టోపీలో చిరుగు చాలా స్వల్పమైనదన్నట్టుగా మాట మార్చారు. గలివన్ సాక్ష్యం శాక్కో దోషిత్వాన్ని సందేహించడానికైనా వుపయోగపడదా అని డిఫెన్స్ లాయర్లు ఆశ పడ్డారు

పిచ్చాసుపత్రిలో చేర్చబడిందని పోలీసు అధికారి గలివన్ కమిటీ ముందు చెప్పాడు. కోర్టులో ఆమెను అదుపు చేయడం కష్టం కాబట్టి ఆమెను కట్జ్‌మన్ సాక్షిగా విచారించలేదని రానీ కూడా కమిటీకి చెప్పాడు సాక్షిగా ప్రాసిక్యూషన్‌కు అందకుండా వెళ్ళిపోయేందుకు ఆమె వచ్చి తనను డబ్బడిగిందని మూర్ రాసుకున్న నోట్సులో ఉంది.

కానీ, లొట్టి పాకార్డ్ బాగా నమ్మదగ్గ సాక్షి అనీ నిజమే చెప్పిందనీ లోవెల్ నిర్ధారించాడు ఆమె మూర్ మీద చేసిన ఆరోపణలు వాస్తవాలనీ, డిఫెన్స్ లాయర్లు ఇలాంటి అవినీతికరమైన పనులు చేసి సాక్ష్యాధారాలను తమకనుకూలంగా మలుచుకున్నారనీ లోవెల్ ఆరోపించాడు.

జులై 25 నాటికి సాక్షుల విచారణ వాద ప్రతివాదాలు కూడా ముగిశాయి. అయితే వాదోపవాదాలు పూర్తి కాక ముందే లోవెల్ తన నివేదికను తయారు చేసి ఉంచాడు. వాదాలు ముగిసిన రోజునే టైపు చేయబడిన నివేదిక కాపీలను సభ్యులకు చూపించాడని గ్రాంట్ తన ఆత్మకథలో రాసుకున్నాడు.

# 9

జులై 27న లోవెల్ కమిటి తన నివేదికను గవర్నర్‌కు అందజేసింది. రెండు రోజుల తర్వాత డిఫెన్స్ లాయర్లు ప్రాసిక్యూటర్లు గవర్నర్‌ను కలిశారు. లాయర్ థామ్సన్ గవర్నర్ ముందు ఎనిమిది గంటల పాటు అద్భుతంగా వాదించాడు. ప్రతి క్షణాన్నీ విలువైనదిగా భావించి పోరాడాడు

శాక్కో-వాంజెట్టి కేసులో తన నిర్ణయాన్ని ఆగస్టు 3న ప్రకటిస్తానని ఆగస్టు 1న గవర్నర్ ఫుల్లర్ పత్రికలకు చెప్పాడు. అదే రోజు డిఫెన్స్ లాయర్లకు ఒక విషయం తెలిసింది. బ్రిడ్జ్ వాటర్ నేరం జరిగిన రోజు (1919 డిసెంబర్ 24న) వాంజెట్టి ప్లిమత్‌లో చేపలమ్ముతున్నాడని డిఫెన్స్ వాదించినప్పటికీ దానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించలేక పోయిందని గవర్నర్ తనతో అన్నాడని గవర్నర్ పర్సనల్ లాయర్ విగ్గిన్స్ లాయర్ థామ్సన్ చెవినేశాడు.

లాయర్ ఎహర్మన్ హుటాహుటిన బోస్టన్ వెళ్ళి ఆల్డినో ఫెలికనీని కలిశాడు. వాళ్ళిద్దరూ ఆగస్టు 2న బోస్టన్‌లోని ప్రతి ఇటాలియన్ హోల్ సేల్ చేపల కొట్టుకి వెళ్ళి వెతికారు. అక్కడెవరికీ వాంజెట్టి గుర్తు లేదు. చేపల మార్కెట్ ఉండే అట్లాంటిక్ ఎవెన్యూకి వెళ్ళి అక్కడా వెతికారు. అలా వెతగ్గా వెతగ్గా వాంజెట్టి పేరు గుర్తున్న ఒక చేపల వ్యాపారి కనిపించాడు అయితే పాత బిల్లు పుస్తకాలన్నింటినీ పారేశానని చెప్పాడు. ఎహర్మన్, ఫెలికనీ మొండికేసి అతని కొట్టంతా గాలించారు. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ రైలు కంపెనీ రసీదు పుస్తకాలున్న పాత సూట్‌కేసు వారి కంటపడింది అందులో ఉన్న రసీదు పుస్తకాల దుమ్ము దులిపి చాలా సేపు వెతికాక 1919 నాటి పుస్తకం దొరికింది అందులో వారికవసరమైన అద్భుతం కనిపించింది.

ప్లిమత్‌కు చెందిన బి.వాంజెట్టికి 1919 డిసెంబర్ 20వ తేదీ చేపలు పంపినట్టు తెలిపే రసీదు దొరికింది. అవి రెండు మూడు రోజులకు గానీ ప్లిమత్ చేరవు. వాంజెట్టి ఎలిబీని నిరూపించేందుకు గవర్నర్ అడిగిన సాక్ష్యం సరిగ్గా అదే.

గవర్నర్ పర్సనల్ లాయర్ జోసెఫ్ విగ్గిన్స్ ద్వారా జాగ్రత్తగా ఆ రసీదును డిఫెన్సు లాయర్లు గవర్నర్‌కు పంపారు. దాన్ని చూసి గవర్నర్ ఇలా అన్నాడు:

*ప్లిమత్ నుంచి బ్రిడ్జ్ వాటర్ ఇరవై మైళ్ళేగా*

ప్లిమత్ నుంచి బ్రిడ్జ్ వాటర్‌కు వెళ్ళి నేరం చేసి తిరిగొచ్చి ప్లిమత్‌లో అదే రోజు చేపలు అమ్మడం సాధ్యమేననీ, వాంజెట్టి ఎలిబీలో బలం లేదని గవర్నర్ పెదవి విరిచాడు

ఆగస్టు 3న గవర్నర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశాడు. ముద్దాయిలకు శిక్ష రద్దు చేయాలన్నా శిక్ష తగ్గించాలనుకొన్నా గవర్నర్‌కు కౌన్సిల్ 'సలహా' అవసరం. అంటే కౌన్సిల్ ఆమోదం మేరకే గవర్నర్ వ్యవహరించాలి. కాబట్టి గవర్నర్ సంతోషకరమైన నిర్ణయం ప్రకటించనున్నాడని డిఫెన్స్ కమిటీ నాయకులు ఆనందపడ్డారు.

ఆగస్టు 2 ఉదయాన్నే శాక్కొ, వాంజెట్టిలను, మెడైరోస్‌ను జైలు అధికారులు నిద్రలేపారు. ముగ్గుర్నీ మరణశిక్ష విధించబడ్డ ఖైదీలను ఉంచే మృత్యుకుహరాలైన డెత్ సెల్స్‌కు మార్చారు. విద్యుత్ కుర్చీకి దగ్గరగా ఉన్న మొదటి గదిలో మెడైరోస్‌ను, తర్వాత రెండు గదుల్లో వరసగా శాక్కొ, వాంజెట్టిలను నిర్బంధించారు. అప్పటి ఆదేశాల ప్రకారం ఆగస్టు 10న మరణశిక్ష అమలు జరగాల్సి వుంది.

తమ మరణశిక్ష రద్దు చేస్తారన్న నమ్మకం వాంజెట్టికి లేదు. అంతకు కొద్ది రోజుల క్రితమే అతను తన కుటుంబ సభ్యులకు రాసిన లేఖలో:

*.... గవర్నరూ, కమిటీ కూడా వాస్తవాన్ని చూడగలిగిన శక్తి లేనివారు లేదా వాస్తవాన్ని చూసేందుకు ఇష్టపడని వారు ... డిఫెన్స్ సాక్షులను వారు నమ్మలేరు లేదా నమ్మేందుకు ఇష్టపడరు.*

తన ఇద్దరు చెల్లెళ్ళలో కనీసం ఒకరినైనా తను చంపబడేలోగా చూడాలనుందని వాంజెట్టి కోరిన మీదట డిఫెన్స్ కమిటీ వాంజెట్టి బంధువొకరికి జులై 22న టెలిగ్రాం పంపింది:

*వాంజెట్టి క్షేమం. ఆగస్టు 10 లోగా తన చెల్లెళ్ళలో ఒకరినైనా చూడాలనుకుంటున్నాడు వాంజెట్టికి వ్యతిరేకంగా గవర్నర్ నిర్ణయం ప్రకటిస్తే ఆగస్టు 10న ఆయన చనిపోవాల్సి ఉంటుంది. విషాద పరిణామాలకు కుటుంబాన్ని సమాయత్తం చేయండి.*

ఆగస్టు 3వ తేదీ వచ్చింది. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు తన నిర్ణయం గవర్నర్ ప్రకటించాల్సి వుంది. అదే రోజు జేమ్స్ మెడె అనే బందిపోటు ఇద్దరు లాయర్లను వెంటపెట్టుకొని

రాష్ట్ర పోలీసు అధిపతిని కలిశాడు. బ్రిడ్జి వాటర్ నేరం చేసింది వాంజెట్టి కాదనీ, అది తన ప్లాన్ అనీ, అయితే తాను జైల్లో ఉండటం వల్ల తన అనుచరులు ఆ నేరానికి పాల్పడ్డారని మెడె చెప్పాడు. జులై నెలాఖరులో మెడె గవర్నర్‌ను కలిసి ఈ సంగతులు చెప్పగా రాష్ట్ర పోలీసు అధిపతిని కలవమని ఆయన తాపీగా సలహా ఇచ్చాడు.

మెడె చెప్పిన సంగతులు రికార్డు చేసేందుకు పోలీసు అధిపతి తిరస్కరించాడు. "నేను వాటిని రికార్డు చేయలేను. చేయబోను" అన్నాడు

అనుకున్న సమయానికి కాక గవర్నర్ స్టేట్ హౌస్‌కు ఆ రోజు లేటుగా రాత్రి 8.26కు వచ్చాడు.

బోస్టన్‌లోని దిన పత్రికల కార్యాలయాల ముందు అప్పటికే పెద్ద ఎత్తున జనం పోగయ్యారు. డిఫెన్స్ కమిటీ కార్యాలయంలో ఉత్కంఠ. స్టేట్ హౌస్ దగ్గర పత్రికా విలేఖరుల పడిగాపులు.

రాత్రి 11 గంటలకు గవర్నర్ కార్యదర్శి సీల్డ్ కవర్లతో బయటికొచ్చాడు. ఆత్రుతగా ఎదురు చూస్తున్న పాత్రికేయులను పేరు పేరునా పిల్చి కవర్లందజేశాడు. సలహా సంఘం సిఫార్సును పరిగణించి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం మేరకు గవర్నర్ చేసిన నిర్ణయం ఈ వాక్యాలతో ముగిసింది:

*శాక్కో, వాంజెట్టిలు దోషులనీ, వారిని నిష్పక్షపాతంగానే కోర్టులో విచారించారనీ నేను నమ్ముతున్నాను. వారిపై కేసును మళ్ళీ విచారించేందుకు సరైన కారణం లేదని కూడా నేను నమ్ముతున్నాను.*

**అంటే శాక్కో, వాంజెట్టి జీవితాలు మరో వారంలో ముగియనున్నాయన్న మాట.**

# చావు బతుకుల్లో

**గవర్నర్ కార్యాలయం** నుంచి ఫోను చేసి లాయర్ థామ్సన్‌కు నివేదిక సారాంశాన్ని వినిపించారు. థామ్సన్, ఎహర్మన్‌లు తీవ్ర మనోవేదనకు గురయ్యారు కష్టపడి చేసిన ప్రయత్నాలన్నీ వృధా ప్రయాసయ్యాయి. మరుసటి రోజు ఉదయం రోజినా శాక్కోను వెంటపెట్టుకుని ఖైదీల్ని కలిశారు. వార్త చెప్పగానే మతిభ్రమిస్తున్నట్టూ, ఏదో లోకంలో తేలిపోతున్నట్టు అర్థం లేని చూపు చూస్తూ వాంజెట్టి ఖిన్నుడయ్యాడని ఫెలికనీ తన జ్ఞాపకాల్లో రాసుకున్నాడు సున్నిత మనస్కుడైన వాంజెట్టికి మరోసారి మతి భ్రమించగలదని మిత్రులు భయపడ్డారు. "దీన్ని నేను నమ్మను" అంటూ పదే పదే అనడం మొదలు పెట్టాడు వాంజెట్టి. "నీకు నేను ముందే చెప్పానుగా" అంటూ శాక్కో అతన్ని ఓదార్చాడు. కాసేపటికి వారిద్దరూ తేరుకున్నారు. ప్రజలకిచ్చిన సందేశంలో పెట్టుబడిదారీ విధానంపై ఖైదీలిద్దరూ విరుచుకుపడ్డారు. అరాచక వాదం కోసం చనిపోయేందుకు తాము గర్వపడుతున్నామని చెప్పారు.

గవర్నర్ నిర్ణయాన్ని వాంజెట్టి తీవ్రంగా నిరశించాడు. ఇక చావు ఖాయమని భావించాడు. మేడమ్ ఎలిజబెత్ ఎవాన్స్‌కు, మేరీ డొనొవాన్‌కు లేఖలు రాశాడు. తన తండ్రికి రాసిన చివరి ఉత్తరాన్ని ఆ రోజే ముగించాడు·

ఈ నేరంలోనూ, మరో నేరంలోనూ నేను పూర్తిగా నిర్దోషినని మీకు ప్రమాణపూర్వకంగా చెప్తున్నాను. నా గురించి సిగ్గు పడకండి. నా జీవితం ఎందుకోసమో తెలిపే రోజొకటి వస్తుంది. వాంజెట్టి పేరు పెట్టుకున్న వాళ్ళు గర్వంగా తలెత్తుకు తిరుగుతారు. నన్ను ఎరిగిన వాళ్ళంతా ఇప్పటికీ నన్ను ప్రేమిస్తారు. గౌరవిస్తారు. ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ కావాలని ఇరవై ఏళ్ళు అంకితం చేసి నా శిలా ఫలకం రాసుకున్నాను. మనుషులూ, పరిస్థితులూ నాకు అన్యాయం చేసి నేను చనిపోతే నా కోసం ఏడ్చినంతగా నా శత్రువుల్లో ఏ ఒక్కరి కోసం ఏడవరన్నది ఖాయం.

మీరు నాకోసం ఏడవాలని నేను కోరుకోవడం లేదు. మీరు ప్రశాంత చిత్తులై ధృఢంగా

వుండాలనుకొంటున్నాను. నా కోసం రోదించక, నా గురించి గీతాలాపన చేయమని మిమ్మల్ని కోరుతున్నాను. మీ హృదయాల్లో జీవించాలనుకుంటున్నాను. ఆ జీవితం తప్పకుండా పరిపూర్ణమైనది, పటిష్టమైనది, ఆనందదాయకమైనది.
చివరి దాకా గెలుపు కోసం పోరాడతాను.

గవర్నర్ నిర్ణయం మీద కొందరు మేధావులు భీకర దాడి జరిపారు. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ అత్యవసర కార్యవర్గ సమావేశం జరిపి గవర్నర్ చర్యను విమర్శిస్తూ సుదీర్ఘ లేఖ రాసింది. లోవెల్ కమిటీ నివేదికను, గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇంటా బయటా వార్తా పత్రికలు సంపాదకీయాలు రాశాయి. శాక్కో, వాంజెట్టిలను చంపడం ద్వారా కాకుండా ఈ కేసులో మరో విధంగా న్యాయం జరగదా అనే ప్రశ్న ప్రజల్ని పట్టి పీడిస్తోందని న్యూయార్క్ వరల్డ్ పేర్కొంది. *"శాక్కో, వాంజెట్టీల భవితవ్యాన్ని వారి రాజకీయ భావాలు ప్రభావితం చేశాయన్న భావనను (గవర్నర్) నిర్ణయం పూర్తిగా తొలగించలేదన్నది స్పష్టం"* అని న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ అభిప్రాయపడింది మరణశిక్షను కారాగార శిక్షగా మార్చాలని ఉద్యమించిన దినపత్రికలు కొన్ని గవర్నర్ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించాయి. గవర్నర్ నిర్ణయం అర్థరహితమైందని సెయింట్ లూయీ పోస్ట్ డిస్పాచ్ దుయ్యబట్టింది. లోవెల్ కమిటి నివేదికలోని లోపాలను న్యూరిపబ్లిక్ ఎత్తి చూపింది. శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని స్ప్రింగ్ ఫీల్డ్ రిపబ్లికన్ ఏకధాటిగా ప్రచార యుద్ధం సాగించింది. వివరమైన వ్యాసాలు ప్రచురించింది. డిఫెన్స్ కమిటీ నుండి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని సంపాదకుడు అవాకులూ చెవాకులూ రాస్తున్నాడని ఉద్యమ వ్యతిరేకులు చేసిన అబద్ధపు ఆరోపణలను ఈ దినపత్రిక లెక్క చేయలేదు.

రాల్ఫ్ పులిట్జర్ యాజమాన్యంలో నడిచే న్యూయార్క్ వరల్డ్ పుల్లర్ నిర్ణయాన్ని విమర్శిస్తూ ఆగస్టు 5న 'డౌట్ ఎగ్జిస్ట్స్' శీర్షికన సంపాదకీయం రాసింది. ఆగస్టు 6న 'ద ఎగ్జిస్టెన్స్ ఆఫ్ డౌట్ సజెస్ట్స్ ద డిజైరబిలిటీ ఆఫ్ మెర్సీ' శీర్షికన అదే దిన పత్రిక సంపాదకుడు వాల్టర్ లిప్‌మన్ మరో సంపాదకీయం ప్రచురించాడు. శాక్కో, వాంజెట్టిలకు క్షమాభిక్ష పెట్టమని అభ్యర్థించాడు. అయితే లోవెల్ కమిటి నివేదిక పూర్తి పాఠం ఆగస్టు 7న చదివి తన వైఖరి పూర్తిగా మార్చుకున్నాడు మర్నాడు మరో సంపాదకీయం రాసి నివేదిక నిష్పక్షపాతమైనదని తాను నమ్ముతున్నానన్నాడు. కేసు ప్రారంభమైనప్పటి నుండి కేసు గురించి ఇంత సమగ్రంగా నిజాలను నిష్పక్షపాతంగా ఎవరూ చెప్పలేదని కమిటీకి కితాబిచ్చాడు. ఈ సంపాదకీయం చూసి బాధపడిన ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ హుటాహుటిన న్యూయార్క్ వెళ్ళి లిప్‌మన్‌ను కలిసి నివేదిక ఎంత ఘోరమైనదో వివరించడంతో నాలుగు రోజుల తర్వాత మరో సంపాదకీయంలో నివేదికను లిప్‌మన్ తీవ్రంగా విమర్శించాడు. పదిహేడు రోజుల వ్యవధిలో కేసు గురించి పదకొండు సంపాదకీయాలు రాసి రికార్డు సృష్టించాడు.

న్యూయార్క్ వరల్డ్ దినపత్రికలో కాలమిస్ట్ హేవుడ్ బ్రౌన్ లోవెల్ కమిటీ నివేదికను తీవ్రంగా విమర్శించాడు. ఆగస్ట్ 5న ఆయన రాసిన వ్యాసంలో, ముద్దాయిలను శిక్షించడం కిరాతకమని కుట్రపూరితమని వాదించాడు. 'మనం ఒకప్పుడు హార్వర్డ్ అని పిలిచిన కేంబ్రిడ్జిలోని విజ్ఞాన సంస్థ యిప్పటి నుంచి 'హంతక నిలయం అనిపిలవబడుతుందేమో..' అని బ్రౌన్ విమర్శించాడు. బ్రౌన్ రాతలకు ఆ పత్రిక యజమాని పులిట్జర్‌కు కోపమొచ్చింది. ఫలితంగా బ్రౌన్‌కు వుద్యోగం వూడింది.

విదేశీ పత్రికలు సైతం ఈ కేసు వార్తకు విశేష ప్రాముఖ్యాన్నిచ్చి ప్రచురించాయి. జెనీవాలో విఫలమైన అంతర్జాతీయ నావికా సమావేశం వార్తలకంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఈ వార్తను ఫ్రాన్స్‌లో దినపత్రికలు ప్రచురించాయి ఆగస్టు 4న పారిస్‌లో ఒక నిరసన సభ జరిగింది. దానిపై పోలీసులు చేసిన దాడిలో పది మంది గాయపడ్డారు. సెన్సార్ షిప్ ఉన్నందువల్ల స్పెయిన్ వార్తా పత్రికలు ఈ కేసు గురించి వార్తలేవీ ప్రచురించలేక పోయాయి. సోషలిస్టా దినపత్రిక ఈ కేసు ప్రస్తావన వున్న చిన్న టెలిగ్రాంను ప్రచురిస్తే అందుకు శిక్షగా ఆ దినపత్రిక ప్రచురణను ఎనిమిది రోజుల పాటు స్పెయిన్ ప్రభుత్వం నిషేధించింది. ముస్సోలినీ ఆధిపత్యం కింద ఇటలీలోనూ అదే పరిస్థితి నెలకొని ఉంది. అయితే ముద్దాయిలు ఇటాలియన్లు కావడం వల్ల పరిస్థితి కొంత మెరుగ్గా వుంది.

కొందరు మేధావులు మాత్రం గవర్నర్ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించారు. డిఫెన్స్ కమిటీ అనుకూల మేధావులు ఒకరిద్దరు తమ మనసు మార్చుకున్నారు. ఇద్దరు ప్రముఖ బిషప్‌లతో సహా పలువురు క్రైస్తవ మతాధిపతులు గవర్నర్‌ను కొనియాడారు. గవర్నర్‌ను సమర్థిస్తూ అమెరికా పౌరులు కొందరు టెలిగ్రాంలు పంపారు. వాటిలో మచ్చుకు కొన్ని:

*"మన చరిత్రలో ఈ శతాబ్దిలో అత్యంత గొప్ప పని చేయడం ద్వారా మన సంస్థలలో ప్రజలు కోల్పోతున్న నమ్మకాన్ని మీరు పునరుద్ధరించారు."*

*"మీ నిర్ణయానికి మా హృదయపూర్వక అభినందనలు. దేశాధ్యక్ష పదవికి జరిగే ఎన్నికల్లో మీకు నా ఓటు వేయాలని ఆశిస్తున్నాను "*

*"అభిప్రాయాలను ఆచరణలో పెట్టగలిగే సాహసికుడైన నూటికి నూరుపాళ్ళ అమెరికన్‌కు, మా కాబోయే దేశాధ్యక్షుడికి అభినందనలు."* *

---

* *గవర్నర్ ఫుల్లర్‌ను కాబోయే దేశాధ్యక్షుడిగా అభివర్ణించడానికి ఆధారాలు లేకపోలేదు గవర్నర్ నిర్ణయ ప్రకటన చేయబోయే ముందు రోజున అప్పటి అమెరికా అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ మరుసటి ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని ప్రకటించాడు. బోస్టన్‌లో 1919 లో జరిగిన పోలీసు సమ్మెను ఘోరంగా అణచివేసి మసాచూసెట్స్ గవర్నర్ పదవి నుంచి దేశ రాజకీయాల్లో ప్రవేశించి అధ్యక్ష ఎన్నికల్లో కూలిడ్జ్ గెల్చాడు శాక్కొ-వాంజెట్టి కేసులో దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరిస్తే కూలిడ్జ్ స్థానాన్ని తాను ఆక్రమించ వచ్చని గవర్నర్ ఫుల్లర్ అనుకొని వుండవచ్చని కొందరి అభిప్రాయం. "కాబోయే అధ్యక్షుడు మమ్మల్ని కాలుస్తాడు" అని వాంజెట్టి కూడా ఒక లేఖలో ప్రస్తావించాడు.*

శాక్కో-వాంజెట్టి కేసుపై సంపాదకీయం రాసి పులిట్జర్ బహుమతి పొందిన బోస్టన్ హెరాల్డ్ దినపత్రిక మరోసారి మనసు మార్చుకుంది. సలహా సంఘ నివేదిక ఏకగ్రీవమైనందుకు సంతోషం వ్యక్త పర్చింది అది శిరోధార్యమనీ, ప్రజల మెదళ్ళలో పేరుకున్న సందేహ మేఘాలు చెల్లాచెదరయ్యాయనీ ఆ దినపత్రిక భావించింది. ఈ కేసు వార్తలు ఇక నుంచి లోపలి పేజీల్లో మాత్రమే ప్రచురించాలని ఆ దిన పత్రిక సంపాదక మండలి నిర్ణయించింది.

గవర్నర్ నిర్ణయానంతరం దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరమైంది. నిరసన ప్రదర్శనల హోరుతో నగరాలు, పట్టణాలు దద్దరిల్లాయి. డిఫెన్స్ కమిటీ శాఖలు పలు చోట్ల ఏర్పడి స్వచ్ఛందంగా పని చేయనారంభించాయి. దేశం నలుమూలల నుంచి పలువుర్ను మేధావులు స్పందించనారంభించారు. అమెరికా కమ్యూనిస్టు పార్టీ అధికారిక పత్రిక *డైలీ వర్కర్* ఆగస్టు నెలంతా శాక్కో-వాంజెట్టి కేసుకే కేటాయించింది తమ పత్రిక లేకపోతే శాక్కో, వాంజెట్టిలు పెట్టుబడిదారీ పత్రికల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే నిస్సహాయ స్థితిలో ఉండాల్సి వచ్చేదని అమెరికా కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

లోవెల్ కమిటి నివేదిక విడుదల కాగానే ప్రఖ్యాత రచయిత జాన్ డాస్ పాస్సోస్ లోవెల్‌కు బహిరంగ లేఖ రాశాడు తాను విద్యనభ్యసించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధినేతను తీవ్రంగా విమర్శించాడు :

> **మా భయానక ఊహలను నివేదిక ధృవపర్చింది. వాళ్ళిద్దర్నీ విద్యుత్ కుర్చీలకు ఆహుతి చేయమని మీరు చాలా తేలికగా చెప్పేశారు. ఎందుకంటే, ఏడేళ్ళ కఠిన శ్రమకోర్చి డిఫెన్స్ సమకూర్చిన బ్రహ్మాండమైన సాక్ష్యాధారాలన్నీ కొట్టి పారేయాలని మీకు 'అనిపిస్తుంది' కాబట్టి. . . .**
> **సామాజిక పునర్నిర్మాణం కోసం జరగనున్న పోరాటం రక్తపాత రహితంగా పరిణతి చెందినదై ఉంటుందా లేక ఊహించలేనంత రక్తపాతంతో విధ్వంసకరంగా ఉంటుందా అనే నిర్ణయం మీ వర్గానికీ మీ స్థితికీ చెందిన వారి మీద ఆధారపడి వుంటుంది.**

పాస్సోస్ చెప్పింది అక్షరాలా నిజం. గవర్నర్ నిర్ణయానికి హింసాత్మక స్పందనలు ఆగస్టు ఆరునే దేశవ్యాప్తంగా వినిపించాయి. పలు నగరాల్లో, పట్టణాల్లో ఆ రోజు జరిగిన బాంబు పేలుళ్ళు అధికారవర్గాన్ని కలవరపర్చాయి. న్యూయార్క్‌లో రెండు చోట్ల బాంబులు పేలాయి. ఇద్దరు మరణించారు. ఫిలడెల్ఫియాలో ఒక చర్చి భవనం, బాల్టిమోర్‌లో నగర మేయర్ భవంతి బాంబు దాడులకు ధ్వంసమయ్యాయి. అమెరికా అంతటా అసాధారణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పన్నెండు వందల మంది డిటెక్టివ్‌లతో సహా న్యూయార్క్‌లో వున్న మొత్తం పద్నాలుగు వేల పోలీసు బలగాన్ని బాంబు దాడుల నిరోధానికి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చికాగోలోని

ఫెడరల్ ప్రభుత్వ భవనాల పరిసరాల్లో 'కనిపిస్తే కాల్చివేత' ఉత్తర్వులు జారీ చేసి కట్టుదిట్టమైన సాయుధ కాపలా ఏర్పాటు చేశారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌ను రక్షించేందుకు పోలీసు యంత్రాంగం నావికా సైన్యం సమాయత్తమైంది. ఏడేళ్ళ తర్వాత మొదటిసారిగా స్వేఛ్ఛా ప్రతిమ మెట్ల దారిని మూసి వేశారు. బోస్టన్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు వేల మంది నగర పోలీసులు రాత్రింబవళ్ళు కాపలా కాస్తున్నారు. ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా ఎదుర్కొనేందుకు బోస్టన్ పోలీసు ప్రధాన కార్యాలయంలో షాట్ గన్స్, షబ్ మెషిన్ గన్స్, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లతో పోలీసులు యుద్ధానికి సమాయత్తమయ్యారు. పదిహేను వేల రౌండ్ల మందు గుండును సిద్ధంగా ఉంచుకున్నారు. బల ప్రయోగంతో పరిస్థితిని అదుపులోకి తేవడంలో నిపుణులైన 464 మందిని నగరంలోని ఇరవై ఒక్క పోలీసు స్టేషన్లలో నియమించారు. బోస్టన్ నౌకాశ్రయంలోని నౌకలపై కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటయింది.

ఇంటా బయటా ప్రజలు అవిశ్రాంతంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. బోస్టన్‌లో ఐదు వేల మంది ప్రజలు హాజరైన సభను పోలీసులు భగ్నం చేశారు. వాంజెట్టి అమితంగా అభిమానించే అరాచక వాద మేధావి జియొవాన్నిట్టిని, కమ్యూనిస్టు పార్టీ నేత హేరీ కాంటర్ ను పోలీసులు ఆ సభలో మాట్లాడనివ్వలేదు.

లండన్‌లోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వేలాది మంది ప్రజలతో మూడు గంటల పాటు నిరసన ప్రదర్శన జరిగింది. శాక్కొ వాంజెట్టిలను కరెంటు కుర్చీలకు బలి చేసే దృశ్యాన్ని ఒక బ్రిటీష్ యుద్ధయోధుడు ప్రదర్శించి కంట తడి పెట్టించాడు ప్రదర్శకులు అమెరికా రాయబార కార్యాలయం ఎదుట కూడా నిరసన వ్యక్తం చేశారు. ఐదు వేల మంది ప్రదర్శకులు పారిస్ వీధులను నినాదాలతో హోరెత్తించారు. జీవిత చరమాంకంలో వున్న వాంజెట్టిని కడసారి చూసేందుకు ఇటలీ నుంచి అమెరికాకు బయల్దేరిన అతని చెల్లెలు లూగియా వాంజెట్టి ఆ ప్రదర్శన అగ్రభాగాన నడిచింది. యూరప్‌లో, ఉత్తర దక్షిణ అమెరికా ఖండాల్లో నిరసన ప్రదర్శన జరగని దేశం లేదంటే అతిశయోక్తి కాదు.

బోస్టన్ నగరానికి చేరుకుని ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొనవలసిందిగా సాహితీవేత్తలకు, శాస్త్రవేత్తలకు, సామాజిక కార్యకర్తలకు, కళాకారులకు డిఫెన్స్ కమిటీ ఆగస్టు 7న పిలుపునిచ్చింది. ఈ పిలుపుకు దేశంలో ఉన్న పలువురు ప్రముఖ మేధావులు స్పందించారు. బానర్లతో, ప్లేకార్డులతో స్టేట్ హౌస్ ముందు బారులు తీరి పికెటింగ్‌లు నిర్వహించారు. ఆగస్టు నెలలో బోస్టన్‌లో పోరాటం నిర్వహించిన మేధావుల్లో కొందరి పేర్లు ఇవి: ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్,

ఆయన భార్య మేరియోన్ డెన్‌మన్ ఫ్రాంక్ ఫర్టర్, ఆల్డినా ఫెలికని, గార్డెనర్ జాక్సన్, హేవుడ్ బ్రౌన్, ఆయన భార్య రూత్ హేల్, ఖగోళ గణిత శాస్త్రాల ప్రొఫెసర్ ఎలెన్ హేయస్, సాహిత్య శాస్త్ర అధ్యాపకురాలు ప్రొఫెసర్ జీనెట్ మార్క్స్, ప్రముఖ కవయిత్రి ఎడ్నా సెయింట్ విన్సెంట్ మిల్లె, కవయిత్రి లోలారిడ్జ్, రెస్టారెంట్ యజమాని పాలా హాలిడే, చైనాలో తత్వ శాస్త్రం అభ్యసించిన యుద్ధ విమాన చోదకుడు లూయీ బెర్న్ హైమర్, కార్మిక నాయకుడైన హార్వర్డ్ గ్రాడ్యుయేట్ పోవర్స్ హోప్‌గుడ్, తర్వాత హోప్‌గుడ్‌తో జీవితాన్ని పంచుకున్న మేరీ డొనొవాన్ *. నాటక రచయిత జాన్ హోవర్డ్ లాసన్ (తర్వాతి కాలంలో హాలివుడ్ సినిమా స్క్రీన్‌ప్లే రచయితయ్యాడు), కమ్యూనిస్టు మేధావులు మైకేల్ గోల్డ్, బెర్ట్రామ్ వోల్ఫ్, రాడికల్ జర్నలిస్టు ఇసాక్ డొన్ లెవినె, కార్టూనిస్టు, శిల్పి బెన్‌షాన్, 'అమ్మ'గా ఆప్యాయంగా పిలువబడిన ఎల్లా రీవ్ బ్లూర్, చికాగోలో సాహిత్య శాస్త్ర ప్రొఫెసర్, న్యూ రిపబ్లిక్ దినపత్రిక సంపాదకుడు రాబర్ట్ మోర్స్ లోవెట్, డొరొతి పార్కర్, ప్రఖ్యాత నవలా రచయిత జాన్ డాస్ పాస్సోస్, హార్వర్డ్ లాస్కూల్ డీన్ ప్రొఫెసర్ రాస్కో పౌండ్. వీరే కాక శాక్కో, వాంజెట్టిల కోసం నిరంతరం శ్రమించి, హెర్బర్ట్ ఎహర్మన్ పుస్తకం 'ద కేస్ దట్ విల్ నాట్ డై' అంకితం పొందిన మహిళా యోధులు ఎలిస్ స్టోన్ బ్లాక్‌వెల్, కాథరిన్ కాడ్‌మన్, జూరా డూ పోంట్, ఎలిజబెత్ గ్లెండోవర్ ఎవాన్స్, ఎలిస్ హామిల్టన్, జస్సికా హెండర్సన్, కాథరినె హంటిగ్టన్, సెసైల్ కార్మెన్ జాక్, వర్జీనియా మెక్‌మెకన్, లూయీ రాంటౌల్, మార్గరెట్ షుర్ట్‌లెఫ్, గెర్ట్రూడె విన్స్లోలు కూడా బోస్టన్‌లో ఉన్నారు. ఆల్బర్ట్ ఐన్ స్టీన్, రోమారోలా లాంటి మేధావులు కూడా విజ్ఞప్తులు చేశారు.

## 2

గవర్నర్ నిర్ణయానంతర పరిస్థితిని సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ పథకాన్ని రచించేందుకు ఆగస్టు 5వ తేదీ ఉదయం న్యాయవాది హిల్ నేతృత్వంలో డిఫెన్స్ కమిటీ సమావేశమైంది. హెర్బర్ట్ ఎహర్మన్, ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్, ఫ్రాన్సిస్ సాయెరె**, ప్రముఖ న్యాయవాది రిచర్డ్ ఎవార్ట్స్, మైకేల్ ముస్మానో తదితరులు ఆ సమావేశానికి వచ్చారు.

---

* మసాచూసెట్స్ రాష్ట్ర ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఈమె సోషలిస్టు పార్టీ సభ్యురాలు. శాక్కో, వాంజెట్టి ఉద్యమంలో పాల్గొన్నందుకు గాను ఉద్యోగం పోగొట్టుకుంది.

** అమెరికా అధ్యక్షుడిగా పని చేసిన ఉడ్రో విల్సన్ అల్లుడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు.

శాక్కొ, వాంజెట్టిల తరఫున న్యాయవాదులుగా తాము విరమించుకుంటున్నామని థామ్సన్, ఎహర్మన్‌లు అప్పటికే ప్రకటించారు. గవర్నర్ నిర్ణయం తర్వాత, "కొత్త ముఖాలు లేదా కొత్త మెదళ్ళు కోర్టుల్లోను, గవర్నర్ ద్వారాను, అనుకూల ఫలితాన్ని పొందే అవకాశాలను మెరుగు పర్చగలవ"ని వారిద్దరూ భావించారు. థామ్సన్ స్థానంలో సీనియర్ లాయర్‌గా ఆర్థర్ హిల్ బాధ్యత స్వీకరించాడు. నిరాశాజనకమైన భయానక స్థితిలో ఓటమి ముంచుకొస్తుండగా పోరాటానికి సిద్ధమైన యోధుడి స్థితి ఆయనది. ఆయన 1923 నుంచి కేసులో పరోక్షంగా పాలు పంచుకుంటూనే ఉన్నాడు. ఫ్రాన్స్‌లో విద్య నభ్యసించిన హిల్ అమెరికాకు కాబోయే అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ కు సన్నిహిత మిత్రుడు.

సమావేశంలో నిర్ణయించుకున్న విధంగా ఆగస్టు 5 సాయంత్రానికి లాయర్ హిల్ యుద్ధ ప్రాతిపదికపై సుప్రీం జుడీషియల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. ముద్దాయిల పట్ల శత్రుపూరిత వైఖరి అవలంబించడం ద్వారా వారిపై కేసులో తీర్పు చెప్పే అర్హతను న్యాయమూర్తి థేయర్ కోల్పోయాడని ఆ పిటీషన్ పేర్కొంది. మళ్ళీ విచారణ జరపాలని తాము దాఖలు చేయబోతున్న మరో పిటీషన్‌పై తీర్పు చెప్పేందుకు థేయర్ స్థానంలో మరొక న్యాయమూర్తిని నియమించవలసిందిగా ఆ పిటీషన్‌లో డిఫెన్సు లాయర్లు కోరారు. కానీ ఎంత వేగంగా ఆ పిటీషన్ దాఖలైందో అంత వేగంగా దాన్ని న్యాయమూర్తి బ్రాడ్ హర్స్ట్ తోసిపుచ్చాడు. అదే రోజు రాత్రి లాయర్ హిల్ గవర్నర్‌ను కలిసి కోర్టులో పోరాటం అయ్యే వరకూ మరణశిక్ష నిలిపేయమని అభ్యర్థించాడు. కానీ ఫుల్లర్ ఒప్పుకోలేదు.

మరుసటి రోజు (ఆగ [illegible] నే పిటీషన్‌ను దాఖలు చేయక తప్పింది కాదు. అమెరికా రాజ్యాంగాన్ని, చట్టా [illegible] ల్లంఘించి, థేయర్ పక్షపాతంతో కేసు విచారించి నందువల్ల మరో న్యాయమూర్తితో పునర్విచారణ జరపించాలని కోరుతూ దాఖలైన పిటీషన్ అది. థేయర్ పక్షపాత వైఖరిని నిరూపించే సాక్షుల అఫిడవిట్లు కూడా పిటీషన్‌తో పాటు దాఖలు చేశారు.

ఈ పిటీషన్ మీద తీర్పు చెప్పడమంటే థేయర్ తన మీద తాను తీర్పు చెప్పుకోవడమే. స్వవిషయంలో ఎవరూ న్యాయ నిర్ణేతగా వ్యవహరించరాదు. చరిత్ర క్రమంలో మానవుడు రూపొందించుకున్న ప్రాకృతిక న్యాయ సూత్రమిది. కాబట్టి న్యాయాన్ని, చట్టాలను, ప్రజాభిప్రాయాన్ని మన్నించి ఈ పిటీషన్‌పై తీర్పు చెప్పేందుకు మరొకరిని నియమించమని డిఫెన్స్ లాయర్లు సుపీరియర్ కోర్టులో మరో పిటీషన్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి హాల్ దాన్ని తోసిపుచ్చాడు. ఫలితంగా థేయర్‌పై ఆరోపణల గురించి ఆయన ముందే డిఫెన్స్ లాయర్లు వాదించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆగస్టు 8వ తేదీ ఉదయం కోర్టులో వాదనలు జరగాల్సి ఉంది. ఆ రోజు భారీ బందోబస్తుతో సాయుధ గార్డుల రక్షణతో జడ్జి థేయర్ కోర్టుకు వచ్చాడు. ఆనాటి కోర్టు దృశ్యాన్ని లాయర్ ముస్మానో ఇలా వర్ణించాడు:

*పాలిపోయిన ముఖంతో జడ్జి థేయర్ బాగా కుంగి పోయి కనిపించాడు కోర్టు హాల్లో కూర్చుని కిక్కిరిసిన ప్రేక్షకుల వంక ఒకసారి చూశాడు డిఫెన్స్ లాయర్ల నుద్దేశించి ఏం చెప్తారని అడిగాడు హిల్ లేచి, ఏ మాత్రం నీతి నిజాయితీ వున్నా పిటీషన్‌ను విచారించే బాధ్యత నుండి తప్పుకోమని తెగేసి చెప్పాడు జడ్జి తన కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు. పాలిపోయిన ముఖం పసుపు పచ్చ ముడతల్లోకి జారుతుంటే చిన్నవైన ఆయన కళ్ళు దొంగ చూపులు చూస్తున్నాయి*

లెనిన్ అనుచరులు మసాచూసెట్స్‌లో అధికారంలోకి వచ్చి థేయర్‌ను నిర్బంధించి అతను చేసిన పద్ధతిలోనే విచారణ చేసి శిక్షిస్తే ఎలా వుంటుందో ఊహించుకోవలసిందని లాయర్ హిల్ థేయర్‌ను కోరాడు ఆటార్నీ జనరల్ ఆర్థర్ రీడింగ్* ప్రభుత్వ పక్షాన వాదించాడు థేయర్ తనే పిటీషన్‌ను విచారించేందుకు సిద్ధ పడ్డాడు. కొత్తగా కనుగొన్న సాక్ష్యాధారాలను కనీసం పరిశీలించేందుకు కూడా తిరస్కరించాడు వాదోపవాదాలు ముగిశాక ఛాంబర్‌లోకి నిష్క్రమిస్తూ, ముద్దాయిలను డిఫెన్స్ లాయర్లను తిట్టి నేల మీద కోపంగా ఉమ్మేశాడు. తర్వాత పిటీషన్‌ను సాంకేతిక కారణాల మీద తిరస్కరిస్తునట్టు ప్రకటించాడు

న్యూ రిపబ్లిక్ దిన పత్రిక థేయర్ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించింది:

> *తన పక్షపాతం గురించి తానే తీర్పు చెప్పుకోవడానికి ఏ వ్యక్తీ అర్హుడు కాదని ఏ మాత్రం ఆలోచనా శక్తి వున్నా ఆయనకు తెలిసి వుండాలి*

థేయర్ ఈ పిటీషన్‌ను తోసి పుచ్చడం డిఫెన్స్ లాయర్లను ఆశ్చర్యపర్చలేదు. అయితే దాని మీద అప్పీలు చేసి మరి కొన్ని రోజుల పాటు [illegible]క్లయింట్లను సజీవంగా ఉంచగలమని వారు భావించారు. థేయర్ నిర్ణయాన్ని సవాలుచేస[illegible] అదే రోజు సాయంత్రానికి మసాచూసెట్స్ సుప్రీం జుడీషియల్ కోర్టులో పిటీషన్ దాఖలై[illegible]ాండర్సన్ దాన్ని వెంటనే తోసి పుచ్చాడు. మరణశిక్ష నిలిపేసే ప్రసక్తి లేదన్నాడు. అయితే, [illegible]ర్ణయాన్ని ఫుల్ బెంచి ముందు సవాల్ చేసేందుకు మాత్రం ఆయన అనుమతించాడు.

ఆ రోజు గవర్నర్‌కు చేరిన ఉత్తరాలలో, టెలిగ్రాంలలో 64 శాక్కో, వాంజెట్టిలను శిక్షించాలని కోరగా, 89 క్షమాభిక్ష పెట్టమని అభ్యర్థించాయని బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్స్క్రిప్ట్ దిన పత్రిక రాసింది. బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు పంపిన క్షమాభిక్ష పిటీషన్ ఏమైందని గవర్నర్ కార్యదర్శిని విలేఖర్లు అడిగితే, దాన్ని తగల బెట్టామని ఆయన నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు జడ్జి థేయర్ నిర్ణయాన్ని, దానిపై అప్పీలును జస్టిస్ శాండర్సన్ తోసి పుచ్చడాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర సుప్రీం జుడీషియల్ కోర్టు ఫుల్ బెంచి ముందు లాయర్ హిల్ ఆగస్టు 9న పిటీషన్ దాఖలు చేశాడు.

---

* *తర్వాతి కాలంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలపై పదవి నుంచి తొలగించబడ్డాడు తొంభై వేల డాలర్లు లంచం పుచ్చుకొని కొన్ని వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించినందుకు శాసనసభ ఆయనను అభిశంసించింది*

మరణశిక్షను తాత్కాలికంగా నిలిపేయమని కోరుతూ ఫేయర్ ముందు మరో పిటీషన్ కూడా దాఖలు చేశాడు కానీ దాన్ని కూడా ఫేయర్ తోసి పుచ్చాడు

మరో వైపు శాక్కో వాంజెట్టిల ప్రాణాలు కాపాడేందుకై దేశవ్యాప్తంగా సమ్మెలు ఉధృతమయ్యాయి కొలరాడోలో కార్మికులు పని మానేశారు. రోచెస్టర్‌లో 16 వేల మంది కార్మికులు సమ్మె చేశారు న్యూయార్క్‌లో పాక్షికంగా సమ్మెలు జరిగాయి. ఒక అంచనా ప్రకారం, 75 వేల నుంచి 4 లక్షల మంది వరకు కార్మికులు ఆగస్టు 9న సమ్మెలో పాల్గొన్నారు. సిటీ హాల్ వేపు ప్రదర్శనగా వెళ్తున్న రెండు వేల మందిని పోలీసులు తరిమి కొట్టారు. పోలీసు కాల్పుల్లో మఫ్టీలో వున్న ఒక డిటెక్టివ్ తలకు గాయమైంది. చికాగోలో పదహారేళ్ళ బాలిక నాయకత్వంలో నాలుగు వేల మంది జరిపిన ప్రదర్శనపై పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు. లాఠీ చార్జి చేసి కొందరిని అరెస్టుచేశారు. బోస్టన్‌లో ఆసాయంత్రం నిషేధాజ్ఞలను ఉల్లంఘించి మేధావులు ఊరేగింపు జరిపారు. అమెరికా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు బెట్రామ్ వోల్ఫ్ దానికి నాయకత్వం వహించాడు గవర్నర్ కార్యాలయమున్న బేకన్ వీధికి ప్రదర్శకులు చేరగా ఏడు నిమిషాల్లో అక్కడి నుండి వెళ్ళి పొమ్మని వారిని పోలీసులు ఆదేశించారు. తొమ్మిది మంది ప్రముఖ మేధావులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించి తర్వాత విడుదల చేశారు. గవర్నర్ ఫుల్లర్ ఈ దృశ్యాన్ని తన కార్యాలయ భవనం పై నుండి గమనిస్తూనే వున్నాడు. ఆ రోజు బహిరంగ సభ జరిపేందుకు డిఫెన్స్ కమిటీ చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. శాక్కో, వాంజెట్టిల మరణశిక్షను రద్దు చేయమని ఆగస్టు 9న బడా పారిశ్రామికవేత్త హెన్రీ ఫోర్డ్ కూడా పత్రికా ముఖంగా కోరాడు.

శాక్కో, వాంజెట్టిల వ్యతిరేక పక్షం వహించిన బోస్టన్ ఈవెనింగ్ ట్రాన్స్క్రిప్ట్ ప్రజాభిప్రాయాన్ని మరణశిక్షకు అనుకూలంగా మళ్ళించే పనొకటి అదే రోజు చేసింది. అంతకు ముందు గొడార్డ్ జరిపిన అనధికార ఆయుధ పరీక్షల ఫలితాలను ప్రచురించింది. శాక్కో దగ్గర దొరికిన రివాల్వర్ నుంచే ప్రాణాంతక బుల్లెట్ వెలువడిందని ఆ పరీక్షల్లో గొడార్డ్ నిర్ధారించిన సంగతి తెలిసిందే. (అయితే ఈ దినపత్రిక ప్రచురించే వరకూ ఆ సంగతి రహస్యంగా ఉంచబడింది.) గొడార్డ్‌ను ఖండిస్తూ లాయర్ థామ్సన్ అదే రోజు వివరణాత్మక వ్యాసం రాసి పంపగా మరుసటి రోజు దాన్ని అచ్చేశారు.

## 3

ఆగస్టు 10 రానే వచ్చింది. ఆ రోజు సరిగ్గా అర్ధరాత్రి శాక్కో, వాంజెట్టిలను విద్యుద్ఘాతమిచ్చి చంపాలనేదే నిర్ణయం.

ముద్దాయిలు దాఖలు చేసిన పిటీషన్ సుప్రీం జుడీషియల్ కోర్టులో పెండింగ్‌లో వుండగా,

అది తేలే వరకూ పిటీషనర్లు బతికుండేలా చూడటం కోర్టుల కనీస బాధ్యత కానీ మరణశిక్ష అమలు జరపడాన్ని తాత్కాలికంగానైనా ఆపేందుకు ఆ కోర్టూ, డెడ్‌హాం కోర్టూ నిరాకరించడం వల్ల ఇక ఆ పని చేయగల అధికారమున్న వాడు గవర్నర్ తప్ప ఆ రాష్ట్రంలో మరొకడు లేడు. మళ్ళీ ఫుల్లర్ చేతుల్లోనే శాక్కో, వాంజెట్టి ప్రాణాలు ఇరుక్కున్నాయి కార్యరంగం మళ్ళీ స్టేట్ హౌస్‌కు మారింది.

ఆ రోజు ఉదయం గవర్నర్ ఫుల్లర్ రాష్ట్ర అటార్నీ జనరల్‌ను, మాజీ అటార్నీస్ జనరల్‌ను పిలిపించాడు. వారితోనూ, తన మంత్రి వర్గ సహచరులతోనూ రోజంతా ఎడతెగని చర్చలు జరుపుతూనే వున్నాడు. ఎటూ తేల్చడం లేదు పరిస్థితి కీడును శంకిస్తోంది. చివరి ప్రయత్నంగా అమెరికా సుప్రీం కోర్టులో వెంటనే హెబియస్ కార్పస్ రిట్ పిటీషన్ వేయాలని హిల్, థామ్సన్ నిర్ణయించారు. తన మాజీ క్లయింట్ల కోసం థామ్సన్ ప్రాణం కొట్టు మిట్టాడుతుండగా సలహా ఇచ్చేందుకు ఆయన హిల్‌ను కలిశాడు లాయర్ ముస్మానో ఖైదీల సంతకాల కోసం జైలుకు పరుగెత్తాడు.

ఆ రోజు ఉదయం నుంచి జరిగిందంతా శాక్కో, వాంజెట్టిలకు ముస్మానో వివరించాడు. వారిద్దరూ అప్పటికి 25 రోజులుగా ఆహారం ముట్టడం లేదు. ఈసారి కూడా పిటీషన్ మీద సంతకం పెట్టనన్నాడు శాక్కో.

> **"వాళ్ళు మా యిద్దర్నీ శిలువ వేయబోతున్నారు.**
> **ఏడేళ్ళుగా చీలలు కొడుతున్నారు.**
> **వీలైనంత త్వరగా దాన్ని కానిద్దాం."**

ముస్మానో చెప్పింది విని వాంజెట్టి చిరునవ్వు నవ్వాడు. తన కోటు జేబులోంచి రెండు పుస్తకాలు బయటికి తీశాడు. 'ద రైజ్ ఆఫ్ అమెరికన్ సివిలిజేషన్' గ్రంధ సంపుటాలవి. కొంత కాలం క్రితం మేడమ్ ఎవాన్స్ ఆయనకు వాటిని ఇచ్చింది. మసాచూసెట్స్ తలారి వాటిని పూర్తిగా చదివేందుకు తన కవకాశం ఇవ్వడేమోనని ఎవాన్స్‌కు చెప్పాడు. ఆ సందేహం ఇప్పుడు నిజమనిపించి ఆ రెండు పుస్తకాలనూ ముస్మానోకు బహుకరిస్తున్నట్టు రాసి వాటిని ఇవ్వబోయాడు.

> *"మిస్టర్ వాంజెట్టి! ఎడబాటుకు గుర్తుగా ఈ పుస్తకాలు నన్ను తీసుకోమంటున్నావు నేను వీటిని తీసుకుంటే, ఇప్పుడు మనం చివరిసారి కలిశామని నేను అంగీకరించినట్టవు తుంది. కానీ ఇది ఖచ్చితంగా శాశ్వతమైన ఎడబాటు కాదు '*

కోర్టులో తన క్లయింట్ల తరపున ఆత్మస్థైర్యంతో, ఆశతో పోరాడబోతున్న లాయర్ ముస్మానో మాటలవి.

ఆ మాటలకు శాక్కో నవ్వాడు.

"మిస్టర్ ముస్మానో! మీరు ఆ పుస్తకాలు తీసుకోవడం మంచిదని నాకు తెలుసు."

"సరే, నేను ఈ పుస్తకాలు తీసుకుంటాను. కానీ ఇప్పుడు, ఈ స్థలంలో కాదు. మీరిద్దరూ స్వేచ్ఛాజీవులైన తర్వాత జైలు బయట వాంజెట్టి నాకిస్తే తీసుకుంటాను. ఇప్పుడు మీ చేతుల్లో కలం ఉంది. ఈ హెబియస్ కార్పస్ పిటీషన్ మీద సంతకం పెట్టండి ప్లీజ్".

వాంజెట్టి మాత్రం సంతకం చేశాడు. ఆ రాత్రి, మరణశిక్ష అమలు జరిగే గదిలో మృత్యుయంత్రాలను సరి చేస్తున్న శబ్దాలు ఆ దృశ్యానికి భయానక నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నాయి. ఆ రోజు ఉదయం నుంచే మరణశిక్ష అమలుపర్చేందుకు జైలులో అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. కరెంటు కుర్చీ పనిని మెకానిక్కులు పరిశీలిస్తున్నారు. అదే రోజు శాక్కో, వాంజెట్టిలతో పాటు మృత్యువుకు ఎరకాబోతున్న బందిపోటు మెడైరోస్ శాక్కో పక్క గదిలోనే వున్నాడు. శాక్కో-వాంజెట్టి కేసుతో, వారిద్దరి జీవితంతో అతని జీవితం పెనవేసుకుపోయింది. మరణశిక్ష వాయిదా పడితే అతనూ బతుకుతాడు. లేకపోతే ఆ రోజు అతనికి కూడా చివరి రోజే. మెడైరోస్ ఎలాంటివాడైనా అతని పట్ల వాంజెట్టి మానవ ప్రేమను కనబర్చాడు. అతని మానాన అతన్ని వదిలేసేందుకు వాంజెట్టి ఇష్ట పడలేదు. రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి జైలు పాలైన తమకూ, రాజ్యహింసకు బలవ్వబోతున్న మెడైరోస్‌కు ఒక స్నేహపూర్వక అనుబంధం ఉందనుకున్నాడు.

> "ఈ రిట్‌గానీ, గవర్నర్ మంత్రి వర్గం గానీ కరెంటు కుర్చీల నోరు మూస్తాయి.
> రేపొద్దున మిమ్మల్ని చూసేందుకు వస్తాను."

శాక్కో, వాంజెట్టిలకు ధైర్యం చెప్పేందుకు ముస్మానో అలా అన్నాడు గానీ, ఆ రోజు ఏం జరుగుతుందో ఆయనకు తెలియదు. ఆ రాత్రి వారిద్దర్నీ మృత్యువు బలిగొనకుండా ఉంటుందన్న ఆశ చాలా మందికి లేదు.

వేసవి సెలవుల కోసం వచ్చి బోస్టన్ సమీపంలోని బేవర్లీలో ఉంటున్న అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలివర్ వెండెల్ హోమ్స్* ను డిఫెన్సు లాయర్లు కలిసి హెబియస్ కార్పస్ రిట్ పిటీషన్‌ను ఇచ్చారు. మరణశిక్ష వాయిదా వేసేందుకు ఆయన తిరస్కరించాడు. హిల్, థాంప్సన్‌లు నిరాశానిస్పృహలతో బోస్టన్‌కు తిరిగొచ్చారు. హడావిడిగా మరో పిటీషన్ తయారు

* అమెరికాలో *లిబరల్* న్యాయమూర్తిగా, ప్రజాస్వామిక వాదిగా పేరు పొందిన జస్టిస్ హోమ్స్ నిజాయితీకి ఈ నిర్ణయం ప్రశ్నార్థకమైంది. యూరప్‌లో శ్రమజీవులుగా బతికిన ఆయన పూర్వీకులు రాజకీయ ఖైదీలుగా అమెరికాకు వలస వచ్చారు. ప్రొఫెసర్ హెరాల్డ్ లాస్కీ (బ్రిటిష్ లేబర్ పార్టీ నేత-బ్రిటన్ పౌర హక్కుల సంఘం ఎన్.సి.సి.ఎల్ స్థాపకుడు)కి హోమ్స్ సన్నిహిత మిత్రుడు. భావ ప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకున్న అమెరికా కార్మిక నాయకుడు యూజిన్ డెబ్స్‌కు విధించిన శిక్షను ఖరారు చేసిన అపఖ్యాతి కూడా పొందాడు.

చేసి అమెరికా సర్క్యూట్ కోర్టులో దాఖలు చేశారు. దాని ఫలితమూ నిరాశాజనకమే. పామర్ దాడులు అన్యాయమైనవని ధైర్యంగా ప్రకటించిన ఫెడరల్ జిల్లా జడ్జి జార్జి ఆండర్సన్ కూడా జోక్యం చేసుకోలేనన్నాడు.

బోస్టన్ నగరంలో ముసురుకుంటున్న చీకట్లు ప్రజల మనసుల్లో కలవరం పర్చాయి. చార్లెస్ టౌన్ జైలు ఎత్తైన ప్రహరీ గోడ మీద, జైలు భవనం కప్పు మీదా మిరుమిట్లు గొలిపే ఫ్లడ్ లైట్లు భయానక కాంతులు విరజిమ్ముతూ నోరు తెరిచిన మృత్యువులా చూస్తున్నాయి. జైలు లోపలా, బయటా సాయుధ పోలీసులు యమభటుల్లా కాపలా కాస్తున్నారు. ఆ దగ్గరలోని సెయింట్ జాన్ ఎవాంజలిస్ట్ చర్చిలో శాక్కో, వాంజెట్టిల దగ్గరికి మృత్యువుని చేరనీయవద్దని క్రైస్తవులు జరుపుతున్న ప్రార్థనలు నేపథ్య సంగీతంగా మారాయి. రాత్రి తొమ్మిదయింది. ఇక మిగిలుంది మూడు గంటలే.

గవర్నర్ కార్యాలయంలో దీపాలారలేదు. దాని ముందు ఆ రోజంతా ప్రజలు ప్రదర్శన జరుపుతూనే వున్నారు. అమెరికా అంతటా ఆ రోజు నిరసన వ్యక్తమౌతోంది. రోచెస్టర్‌లో, ఇండియానా పోలీస్‌లో, బాల్టిమోర్‌లో, స్ప్రాటన్, టంపా పట్టణాల్లో సమ్మె చేస్తున్న కార్మికులు నిద్రపోలేదు. న్యూయార్క్‌లో పదిహేను వేల మంది నిరసన ప్రదర్శకులను పోలీసులు చెదరగొట్టారు. చికాగోలో అదే పరిస్థితి.

వివిధ దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల దగ్గర కట్టుదిట్టమైన కాపలా ఏర్పాట్లు చేసుకోమని అమెరికా నుంచి అత్యవసర టెలిగ్రాంలు ఆ ముందు రోజే వెళ్ళాయి. లాటిన్ అమెరికా దేశాల్లో ఆగస్టు 10న సార్వత్రిక సమ్మెలు జరిగాయి. మాంటెవీడియో పట్టణంలో అల్లర్లు చెలరేగాయి. బ్యూనోస్ ఎయిర్స్ నగరం బాంబులతో దద్దరిల్లింది. లండన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఎదుట గుమికూడిన ప్రదర్శకులను పోలీసులు నిర్దాక్షిణ్యంగా తరిమేశారు. పారిస్ అట్టుడికిపోయింది. హెమ్మింగ్వే రచన ఆధారంగా నిర్మిస్తోన్న ద సన్ ఆల్సో రైజెస్ సినిమాలో నటించేందుకు ఒక పారిస్ హోటల్లో బస చేసిన ప్రముఖ సినీనటి, డాన్సర్ ఇసనోరా డంకన్ అక్కడే బస చేసిన ఒక అమెరికన్ న్యాయమూర్తితో ఆ రోజు వాగ్వివాదానికి దిగింది. శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని వాదించింది. దేశ ఆంతరంగిక విధానంలో భాగంగా అయిష్టంగానైనా ఇటలీ నియంత ముస్సోలినీ శాక్కో, వాంజెట్టిల గురించి ఆ ముందు రోజు మాట్లాడక తప్పలేదు. శాక్కో తండ్రికి ఆగస్టు 9న పంపిన లేఖలో ముస్సోలినీ ఇలా పేర్కొన్నాడు:

> *ఎంతో కాలంగా తదేక దీక్షతో శాక్కో-వాంజెట్టి కేసు గురించే ఆలోచిస్తున్నాననీ, మరణశిక్ష నుంచి వారిని రక్షించేందుకు అంతర్జాతీయ నిబంధనలకు లోబడి నేను చేయగలిగిందంతా చేశాననీ మీకు తెలియజేయాలనుకుంటున్నాను.*

సర్క్యూట్ కోర్టులో తమ ప్రయత్నాలు విఫలమైన వెంటనే డిఫెన్స్ లాయర్ల కార్లు గవర్నర్ కార్యాలయానికి దూసుకు వెళ్ళాయి. మంత్రి వర్గంతో సమాలోచనలు జరుపుతున్న గవర్నర్

ముందు లాయర్ హిల్ వాదించడం మొదలు పెట్టాడు చలనం లేని రాతి మనుషుల్లా వారు ఆయన వాదనను ఆలకించారు

మరో వేపు జైల్లో మృత్యు యంత్రాన్ని పూర్తిగా సిద్ధం చేసి వుంచారు విద్యుత్ ఘాతం ఇచ్చేందుకు వీలుగా శాక్కో, వాంజెట్టి, మెడైరోస్‌ల తలల మీద వెంట్రుకలు కత్తిరించారు. అక్కడ ఎలక్ట్రోడ్‌లను అమర్చుతారు విద్యుత్ ప్రసారానికి అనువైన బట్టలు తొడిగారు శాక్కో, వాంజెట్టిల శవాలను వారి బంధువులు తెల్లవారి తీసుకెళ్ళవచ్చని అధికార ప్రకటన జారీ అయింది. మరణశిక్ష అమలుకు సాక్షులుగా పిలిపించబడ్డ వాళ్ళు కూడా జైలుకు వచ్చారు. పత్రికా విలేఖరులు జైలు బయట ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు

పదిన్నర కావచ్చింది జైలు వార్డెన్ హెండ్రీ విలేఖరులతో మాట్లాడుతూ మరణశిక్ష వాయిదా పడక పోవచ్చని చెప్పాడు.

శాక్కో, వాంజెట్టిల మరణశిక్షను ఆపమని కోరుతూ వందల కొద్ది టెలిగ్రాంలు గవర్నర్ కార్యాలయానికి చేరుతూనే వున్నాయి. నిర్విరామంగా మోగే ఫోన్లకు సమాధానాలు చెప్పలేక సిబ్బంది ఆ రోజంతా సతమతమౌతున్నారు. బయట వేలాది మంది ప్రజల నినాదాల హోరు చెవులు గింగురుమనిపిస్తోంది అలసి పోయిన లాయర్ హిల్ తన సర్వశక్తులూ కూడదీసుకుని రెండు గంటల పాటు గవర్నర్ ముందు వాదించాడు. వాదన పూర్తయే సరికి రాత్రి 11 గంటలయింది. గవర్నర్ ఏం నిర్ణయిస్తాడోననే ఉత్కంఠ బయల్దేరింది.

రాత్రి పదకొండు గంటల ఇరవై మూడు నిమిషాలకు గవర్నర్ తన నిర్ణయాన్ని ప్రకటించాడు. మరో ముప్పయి నిమిషాల్లో మరణశిక్ష అమలు జేస్తారనగా దాన్ని నిలిపేస్తూ టెలిగ్రాఫిక్ ఆదేశాలు జైలుకు చేరాయి.

మరుసటి రోజు ఎనిమిది కాలమ్‌ల పతాక శీర్షికన న్యూయార్క్ టైమ్స్ ఆ వార్తను ప్రచురించింది.

# 4

శాక్కో, వాంజెట్టిలకు చచ్చిబతికినంత పనైంది. కానీ ఆ ఆనందం శాశ్వితం కాదు. ఆగస్టు 22వ తేదీ అర్ధరాత్రి వరకే మరణశిక్షను గవర్నర్ వాయిదా వేశాడు. ఏ అద్భుతం జరగకపోతే మరో పన్నెండు రోజుల్లో వారిద్దరూ చనిపోతారు. ఆగస్టు 11న తన ఇరవై ఆరు రోజుల నిరాహార దీక్షను వాంజెట్టి విరమించాడు. మరో నాలుగు రోజులకు శాక్కో కూడా తన దీక్షను విరమించి భోజనం చేశాడు.

అదే రోజు కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాక్రమెంటో నగరంలో ఐదు లక్షల డాలర్ల స్టేట్ థియేటర్ బాంబు దాడికి ధ్వంసమైంది. శాక్కో-వాంజెట్టి కేసు లో జూరర్‌గా వ్యవహరించిన

లూయీ మెక్‌హోర్డ్ ఇల్లు ఆగస్టు 15న మిల్టన్‌లో బాంబులతో దద్దరిల్లింది స్వల్పగాయాలతో మెక్‌హోర్డ్ ప్రాణాలు దక్కించుకున్నాడు. అంతకుముందు రోజు బోస్టన్‌లో నిరసన సభను పోలీసులు భగ్నం చేశారు. అమెరికా మేధావులు కొందరు హింసను రెచ్చగొడుతున్నారని కొన్ని వార్తా పత్రికలు అక్కసు వెళ్ళగక్కాయి. ప్రభుత్వమే హింసను సృష్టించి, పైగా అభాండాలు వేస్తోందని మరి కొన్ని దినపత్రికలు బదులిచ్చాయి.

ప్రపంచ కార్మిక వర్గంతో గొంతు కలిపి సోవియట్ యూనియన్ వ్యక్తం చేసిన నిరసన వల్ల అమెరికా బూర్జువా వర్గం శాక్కో, వాంజెట్టిల మరణశిక్షను వాయిదా వేయాల్సి వచ్చిందని ఆగస్టు 11న సోవియట్ రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు నెల మొదటి రోజు నుంచీ అంతకు ముందూ, సోవియట్ రష్యాలో ప్రభుత్వమే పలు బహిరంగ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించింది ఆగస్టులో జరిగిన మొత్తం 170 సభలకు లక్ష మంది హాజరయ్యారని అంచనా.

యూరప్‌లోని పలు వార్తా పత్రికలు అమెరికా న్యాయవ్యవస్థను విమర్శిస్తూ వ్యాసాలు ప్రచురించాయి *లండన్ ఈవెనింగ్ పోస్ట్* ఇలా రాసింది:

> *వీళ్ళను చంపడాన్ని అర్థం చేసుకోగలిగిన కారణమేమీ మాకు కన్పించడం లేదు. దోషులైతే విధించాల్సిన శిక్ష కంటే ఎన్నో రెట్లు ఎక్కువగానే వాళ్ళు శిక్ష అనుభవించారు నిర్దోషులైనట్లయితే వీళ్ళనుభవించిన బాధను వర్ణించేందుకు పదాలు వెతకడం కష్టం*

ఈ విషాద నాటకాన్ని ముగించి వీళ్ళిద్దర్నీ విడుదల చేయమని *లండన్ డైలీన్యూస్* నిష్కర్షగా చెప్పింది. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ పత్రిక *న్యూలీడర్*‌లో హెచ్.ఎన్.బ్రెయిల్స్ ఫోర్డ్ రాసిన వ్యాసంలో *'నరబలుల వల్ల ఒక వ్యవస్థ రక్షించబడాల్సి వస్తే అది పతనమైనదని చెప్పడం సరైనదే'* నన్నాడు. శాక్కో, వాంజెట్టిల జీవితంతో ప్రభుత్వ చెలగాటం ఎవరూ సృష్టించలేనంత మంది రాడికల్స్‌ను సృష్టిస్తుందని హెచ్చరించాడు

అమెరికా అరాచక వాద సిద్ధాంతవేత్తల్లో ప్రముఖుడైన బెంజమిన్ టక్కర్ ఆగస్టు 12న ఫుల్లర్‌కు లేఖ రాశాడు:

> *కేవల న్యాయం పవిత్రమైనది కాదు 'స్వర్గం ఊడిపడ్డా న్యాయం జరగనిద్దాం' అనడం కంటే మూర్ఖమైన వాదన మరొకటి లేదు. న్యాయం ప్రయోజనం స్వర్గాన్ని సరైన చోట ఉంచడం కాదా? న్యాయం వల్ల స్వర్గం ఊడిపడితే ఆ న్యాయాన్ని వదిలేయడం మంచిది అన్ని విషయాలూ సాపేక్షికమే.*

కొందరు మేధావులు బోస్టన్‌లో సిటిజెన్స్ నేషనల్ కమిటీ పేరుతో ఒక సంస్థ స్థాపించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రముఖుల సంతకాలతో ఆగస్టు 15న ఈ కమిటీ గవర్నర్‌కి మెమోరాండం సమర్పించింది. సర్వే పత్రిక సంపాదకుడు పాల్ కెల్లాగ్ ఈ కమిటీ నాయకుల్లో ఒకడు.

జూరర్ మెక్ హార్డీ ఇంటి మీద బాంబు దాడి జరిగాక తీసిన ఫోటోలను, సుప్రీం జుడీషియల్ కోర్టులో పెండింగ్‌లో వున్న పిటీషన్ వార్తనూ పక్క పక్కనే ట్రాన్ స్క్రిప్ట్ పత్రిక ప్రచురించింది. బోస్టన్ నగరంలో షాపింగ్ చేసేందుకు చుట్టు పక్కల ఊళ్ళ జనం భయపడుతున్నారని హెరాల్డ్ వార్త రాసింది. "మూర్ఖులైన ప్రవాస అరాచక వాద ముఠా శాక్కొ, వాంజెట్టిల కోసం చేస్తున్న బాంబు దాడుల వల్ల, సృష్టిస్తున్న టెర్రరిజం వల్ల భయపడిన ప్రభుత్వం తన సొంత చట్టాలను అమలు జరుపుకొనే చావలేని దానిగా మారింద'ని ఆక్రోశం వెళ్ళగక్కిన ఒక లేఖను హెరాల్డ్ ప్రముఖంగా ప్రచురించింది. ఇదంతా సుప్రీం జుడీషియల్ కోర్టులో ఫుల్ బెంచి ముందు శాక్కొ-వాంజెట్టి కేసుపై వాదనలు జరగాల్సి వున్న ఆగస్టు 16న ప్రచురించబడటం గమనార్హం. అదేరోజు న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ సంపాదకీయం కాస్త ఉపశమనాన్నిచ్చింది. **హింసా చర్యలను, న్యాయపరమైన సమస్యలను విడదీసి చూడాలని ఆ దినపత్రిక అభిప్రాయపడింది.**

ఈ స్థితిలో ఆగస్టు 16న సుప్రీం కోర్టు ఫుల్ బెంచి ఎదుట వాదనలు జరిగాయి. కోర్టు ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటయింది. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి వచ్చారు. జడ్జి థేయర్ న్యాయ నిర్ణేతగా కాక, ముద్దాయిల విరోధిగా మారి కేసును విచారించినందువల్ల పైకి చట్టబద్ధంగా కనిపించినప్పటికీ కేసు విచారణ సక్రమమైనది కాదని లాయర్ ఆర్థర్ హిల్ వాదించాడు. అనేక దృష్టాంతాలను, పలు తీర్పులను ఉదహరించాడు. న్యాయపీఠం మీద ముగ్గురు న్యాయమూర్తులు ఆ వాదన విన్నారు.

అదే రోజు సాయంత్రం అటార్నీ జనరల్ ఆర్థర్ రీడింగ్ ప్రతివాదన చేశాడు. శిక్ష విధించాక ఈ పిటీషన్ చెల్లదన్నాడు. థేయర్ మనసులో ఏమున్నప్పటికీ జూరీ సభ్యులకు దాన్ని ఆయన వెల్లడించలేదు కాబట్టి జూరీపై థేయర్ ప్రభావం ఏ మాత్రం లేదని వాదించాడు. ఆగస్టు 18న న్యాయమూర్తులు తమ తీర్పును తయారు చేశారు. మరుసటి రోజు ఉదయం దానిని విడుదల చేయమని ఆదేశాలిచ్చి వేసవి సెలవులు గడిపేందుకు నగరం విడిచి వెళ్ళి పోయారు. తీర్పులో ఏం రాశారోననే ఉత్కంఠతో ప్రపంచం ఎదురు చూస్తోంది.

ఒక జడ్జి తర్వాత మరో జడ్జి తమకు మరణశిక్ష తప్పదని చెప్తుండటంతో తామిద్దరం ఆగస్టు 22న మరణించడం ఖాయమని రోజు రోజుకీ మరింత స్పష్టంగా శాక్కొ, వాంజెట్టిలకు అర్థమౌతోంది. బంధు మిత్రులకు వీడ్కోలు చెప్తూ లేఖలు రాయడం ప్రారంభించారు. పధ్నాలుగేళ్ళ తన కొడుకు డాంటేకు శాక్కొ వీడ్కోలు లేఖ రాశాడు:

> ***శుక్ర- సోమవారాల మధ్య ఏమీ జరక్కపోతే ఆగస్టు 22న సరిగ్గా అర్థరాత్రి వాళ్ళు మమ్మల్ని కరెంటుతో చంపుతారు.***
>
> ***డాంటే! ముగ్గురి జీవితాలు సమాధయ్యాయని నేనన్నప్పుడు, మాతో పాటు అదే సమయంలో కరెంటు కుర్చీకి ఆహుతి కాబోతున్న యువకుడు సెలెస్టినో మెడైరోస్***

గురించి చెప్పడం నా ఉద్దేశం. ఆ భయంకర మృత్యుగుహలో అంతనించకు ముందు రెండుసార్లున్నాడు. నిజమైన ప్రగతి నమ్మేటలతో దాన్ని నాశనం చెయ్యాలి. ఆ భయానక గృహం మసాచూసెట్స్ పౌరుల భవిష్యత్తును ఎప్పటికీ అవమాన పరుస్తూనే వుంటుంది. వాళ్ళు దానిని ధ్వంసం చేసి దాని స్థానంలో ఒక ఫ్యాక్టరీయో, ఒక పాఠశాలో స్థాపించాలి. ప్రపంచంలోని వందలాది పేద అనాథ బాలలకు చదువు చెప్పాలి.

ఆగస్టు 19 ఉదయం తొమ్మిది గంటలకు కోర్టు బీరువాను తెరచి అందులో భద్రపరచిన తీర్పును బయటపెట్టారు. ఉత్కంఠతో ఎదురు చూస్తున్న పత్రికా విలేఖరులు టెలిఫోన్ల దగ్గరికి పరుగెత్తారు. "శాక్కో, వాంజెట్టి డిఫీటెడ్" "పిటీషన్ డిస్ మిస్‌డ్", "శాక్కో, వాంజెట్టి మస్ట్ డై ఇన్ ఎలక్ట్రిక్ చైర్" శీర్షికలతో ఆ సాయంత్రం దిన పత్రికలు వార్తను ప్రచురించాయి.

శిక్ష ప్రకటించిన తర్వాత చాలా కాలానికి దాఖలైన పిటీషన్‌ను అనుమతించజాలమని సుప్రీం జుడీషియల్ కోర్టు ప్రకటించింది. సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ హెన్రీ బ్రాలీ రాసిన ఆ తీర్పుతో మిగతా ఇద్దరు న్యాయమూర్తులూ ఏకీభవించారు. జడ్జిథేయర్ పక్షపాతంగా వ్యవహరించాడా లేదా అనే ప్రశ్న వాస్తవాలకు సంబంధించిన ప్రశ్న (Question of Fact) అనీ, అది చట్టానికి సంబంధించిన ప్రశ్న (Question of Law) కాదనీ, అందువల్ల అది తమ అధికార పరిధిలోకి రాదనీ సాంకేతిక కారణాలను కోర్టు తన తీర్పుకు ఆధారం చేసుకుంది.

శాక్కో, వాంజెట్టిల లాయర్లు విస్తు పోయారు. తమ క్లయింట్లకు ప్రాణభిక్ష పెట్టమనీ, మరణశిక్షను తాత్కాలికంగా నిలిపేయమనీ కోరుతూ రెండు కోర్టుల్లో పిటీషన్లు దాఖలు చేశారు. సుపీరియర్ కోర్టులో, ఫెడరల్ జిల్లా కోర్టులో దాఖలైన ఆ పిటీషన్లు రెండూ తోసి పుచ్చబడ్డాయి.

ఇక మసాచూసెట్స్ కోర్టుల్లో శాక్కో వాంజెట్టి కేసు చరిత్ర ముగిసినట్టే.

సుప్రీం జుడీషియల్ కోర్టు ఫుల్ బెంచ తీర్పును కొన్ని పత్రికలు విమర్శించాయి. శాక్కో, వాంజెట్టిల కోసం పోరాడుతున్న న్యూయార్క్ వరల్డ్ సంపాదకుడు వాల్టర్ లిప్‌మన్ ఈ తీర్పుపై నిప్పులు గురిపించాడు. 'డౌట్ దట్ విల్ నాట్ డౌన్' శీర్షికన అసాధారణ రీతిలో అనేక వేల పదాలతో పూర్తి పేజీ సంపాదకీయం రాశాడు. అందులో ఫుల్లర్‌తో నేరుగా వాదనకు దిగాడు:

> శాక్కో-వాంజెట్టి కేసు అగమ్యగోచరంగా, అస్పష్టంగా ఉంది. సందేహావృతమై ఉంది. కేసు విచారణలోని నిష్పాక్షికతపై సందేహాలున్నాయి. సాక్ష్యాధారాలు సందేహాన్ని రేకెత్తిస్తున్నాయి. కేసును తగినంతగా పునఃపరిశీలన జరపకపోవడం సందేహాన్ని రేకెత్తిస్తోంది. గవర్నర్ విచారణ ఈ సందేహాలను నివృత్తి చేయలేదు. సలహా సంఘ నివేదిక ఈ సందేహాలకు సమాధానం చెప్పలేదు. పట్టించుకోకుండా ఉండలేనంత సందేహం అంతట వ్యాపించి వుంది. అంత సందేహాస్పద స్థితిలో ఏ మనిషీ చంపకూడదని మేం మనవిచేస్తున్నాం. . . .

*మరణశిక్ష అమలును నిలిపేయండి ఆగండి! అమెరికా ప్రభుత్వ గౌరవం మీ చేతుల్లో ఉంది. వినండి! పూర్తిగా సందేహాస్పదమైన కేసును వెనక్కు తిరిగి తీసుకోలేని విధంగా ముగించకండి*

సుప్రీం జుడీషియల్ కోర్టు తీర్పును గురించి లాయర్ ముస్మానో చెప్తుండగా వాంజెట్టి మధ్యలో కలుగజేసుకుని "ముస్మానో. ఇక ఏం జరిగిందో మీరు చెప్పనక్కర్లేదు" అన్నాడు కొంతసేపు మౌనం తర్వాత "లక్షల మంది జనాన్ని తెండి!" అంటూ పిచ్చిగా అరిచాడు ఆ రోజంతా అలా అరుస్తూనే వున్నాడు. వాంజెట్టికి మరోసారి మతి భ్రమించింది. అర్థం లేని పిచ్చి లేఖను వాంజెట్టి ఆ రోజు థామ్సన్‌కు రాశాడు.

*నూతన యుగం. సంవత్సరం-1*

*నా శత్రువులు అరుస్తూ నన్ను చంపేందుకు ప్రతి రాత్రీ నా మీదకు ఫిరంగులు ఎక్కుపెడుతున్నారు. ఈ ఆదేశాన్ని దయ చేసి సాధ్యమైనంత త్వరగా బోస్టన్‌లోని డిఫెన్స్ కమిటీకి పంపండి.*

*ప్రియమిత్రులారా!*

*ప్రజల్ని సమీకరించమని నేనిచ్చిన ఆదేశాలను ప్రపంచంలోని సకల దేశాలకూ మీరు రేడియో ద్వారా పంపారని ఆశిస్తాను. గత రాత్రి నేను సరిగా వీక్షించి వుంటే మహాసైనిక దళాలు వస్తున్నాయి. రియోగ్రాండె, పనామా కాలువలను దాటేందుకు జాగ్రత్తలన్నీ తీసుకోండి. కానీ, వీలైనంత మేర తీరాలను వాడుకోండి. ఇటలీ రాజుకు, పోప్‌కు నేను రాసింది మరోసారి గుర్తు చేయండి. నా సాక్షులంతా నాక్కావాలి. మీరు వేసే ప్రతి అడుగూ, ప్రతి చర్యా నాకు వెంటనే వైర్‌లెస్ ద్వారా తెలియపర్చండి.*

# 5

శాక్కో, వాంజెట్టిలను ఆగస్టు 19న వారి పాత మృత్యు కుహరాల్లోకి మార్చారు. మెదైరోస్‌ను కూడా అలాగే చేశారు. అక్కడికి రావడం శాక్కో, వాంజెట్టిలకు రెండవసారి, మెదైరోస్‌కు ఆరవసారి.

చనిపోబోతున్న తన అన్నయ్యను చివరి క్షణాల్లో చూసేందుకు వాంజెట్టి చెల్లెలు లూగియా ఆగస్టు 19నే న్యూయార్క్ చేరుకుంది. డిఫెన్స్ కమిటి కోశాధికారి ఫెలికని, రోజినా శాక్కో, మరో 300 మంది డిఫెన్స్ కమిటి అభిమానులు ఆమెకు స్వాగతం చెప్పారు మృత్యువు ఒడిలో ఉన్న వాంజెట్టిని ఆమె మరుసటి రోజు కలిసింది. అప్పటికి వాంజెట్టికి స్వస్థత చేకూరింది.

కరెంటు కుర్చీ ఉన్న గది పక్కనున్న మార్గం ద్వారా కాక మరో ద్వారం నుంచి లూగియాను లోపలికి వెళ్ళనీయమని రోజినా శాక్కో జైలు వార్డెన్ హెండ్రీని బ్రతిమాలింది. ఇనుప జల్లెడతో

మూసి వున్న కటకటాల తలుపు సందులోంచి కాక బయట నడవాలో తన సోదరుడిని కలిసేందుకు లూగియాను అనుమతించమని కూడా రోజినా అడిగింది. జైలు నిబంధనలను పక్కన బెట్టి రెండిటినీ వార్డెన్ అనుమతించాడు. వాంజెట్టి గది తలుపుల్ని తెరిచి బయటికి రానిచ్చారు.

పంధొమ్మిదేళ్ళ క్రితం తాను చూసిన ప్రియ సోదరిని వాంజెట్టి కౌగలించుకున్నాడు వాంజెట్టి చేతుల్లోనే ఆమె స్పృహ కోల్పోయింది. ఆమె పడిపోకుండా వార్డెన్ పట్టుకున్నాడు రోజినా నీళ్ళు చల్లింది. లూగియా తేరుకున్న తర్వాత వాంజెట్టితో కలిసి పెద్దగా ఏడ్చింది. దుఃఖం ముంచుకొస్తుండగా వాళ్ళిద్దరూ తమ బాల్యాన్ని నెమరేసుకున్నారు. వారి బాల్యంలో మధుర స్మృతుల్లేక పోయినా ఆ స్థితిలో అదే మధురమైనదిగా కన్పించింది. లూగియాను అమెరికాకు రప్పించినందుకు వాంజెట్టి చాలా బాధపడ్డాడు

**మరో మూడు రోజుల దూరంలో మృత్యువు పొంచి వుంది. మసాచూసెట్స్ రాష్ట్రంలో ఏ న్యాయస్థానానికి వెళ్ళినా శాక్కో వాంజెట్టిల పేరు చెప్తేనే తలుపులు మూసుకుంటున్న దారుణ పరిస్థితి ఇక తమ పోరాట రంగాన్ని అమెరికా సుప్రీం కోర్టుకు మార్చాలని డిఫెన్స్ లాయర్లు నిర్ణయించారు.**

అమెరికా రాష్ట్రాల్లో ఉన్న కోర్టుల తీర్పులపై అమెరికా సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకోవడమనేది అరుదైన సందర్భాల్లో మాత్రమే ఉంటుంది. ఆ తీర్పులు అమెరికా ఫెడరల్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించాయని చూపగలిగితే తప్ప అమెరికా సుప్రీం కోర్టు పిటీషన్ను స్వీకరించదు. పక్షపాతంతో గానీ, అక్రమమైన పద్ధతిలో గానీ, చట్ట వ్యతిరేకంగా గానీ కోర్టులో కేసు విచారణ జరిగినట్లయితే అది అమెరికా రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్టవుతుంది. పద్నాలుగవ రాజ్యాంగ సవరణ ప్రకారం సక్రమమైన, చట్ట పరమైన విచారణ జరపకుండా ఏ మనిషి స్వేచ్ఛనుగానీ, ప్రాణాన్ని గానీ ప్రభుత్వం హరించరాదు. దీన్నే డ్యూ ప్రాసెస్ క్లాజు అంటారు ఈ క్లాజును ఉల్లంఘించిన కేసులో తీర్పుపై అప్పీలు చేయవచ్చు లేదా నేరుగా హెబియస్ కార్పస్, సెర్షియోరరీ రిట్ పిటీషన్లు దాఖలు చేయవచ్చు. అమెరికా జాతి జీవనానికి అతి ముఖ్యమైన కేసుగా భావించబడితే కూడా సుప్రీం కోర్టు నేరుగా జోక్యం చేసుకునే వీలుంది.

అమెరికా సుప్రీం కోర్టులో దాఖలు చేసేందుకు డిఫెన్సు లాయర్లు ఒక పిటీషన్ తయారు చేశారు. ఈలోగా లాయర్ హిల్ మరో ప్రయత్నం చేశాడు. అమెరికా సుప్రీం కోర్టులో తాము దాఖలు చేయనున్న ఆ పిటీషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం శిక్ష అమలును తాత్కాలికంగా నిలిపేయమని మసాచూసెట్స్ సుప్రీం జుడీషియల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వాల్టర్ పెర్లీ హాల్‌ను లాయర్ హిల్ అభ్యర్థించాడు. జస్టిస్ హాల్ మొండిగా దాన్ని తిరస్కరించాడు. మరో లాయర్ ఎలియాస్ ఫీల్డ్ కూడా ఫెడరల్ సర్క్యూట్ కోర్టులో అలాంటి పిటీషన్ దాఖలు చేసి విఫలమయ్యాడు.

ఏ న్యాయమూర్తి అయినా కాపాడగలడేమోనని డిఫెన్స్ లాయర్లు రోజంతా ఒక కోర్టు నుంచి మరో కోర్టుకు కార్లలో హడావిడిగా తిరుగుతూ అలసి పోయారు. వారి పరిస్థితి ఫ్రాంజ్ కాఫ్కా నవల 'ద ట్రయల్' లో రాసిన విధంగా ఉందని ఈ కేసుపై రాసిన గ్రంథం* లో డేవిడ్ ఫెలిక్స్ పేర్కొన్నాడు.

*కాఫ్కా ట్రయల్'కు ఇది అమెరికా అనువాదం లాగా వుంది. నేరం ఇదీ అని కాఫ్కా తన రచనలో ఎక్కడా చెప్పలేదు నేరారోపణ ఎప్పుడూ లిఖితపూర్వకంగా లేదు చీకటి మూలల్లో దాక్కున్న అనామక న్యాయమూర్తుల చేతుల్లో న్యాయస్థానం ఉంది. మసాచూసెట్స్‌లో. . . . ఎక్కువ మందికి కాఫ్కా పీడకలలో బతుకుతున్నామన్న అభిప్రాయం ఉంది. జోసెఫ్ కె. (కాఫ్కా నవలా నాయకుడు) దోషిత్వం లాగా, శాక్కొ, వాంజెట్టిల దోషిత్వం కూడా ఆ కేసుతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ - జూరీ సభ్యులకు, న్యాయమూర్తులకు, ప్రభుత్వ లాయర్లకు, పరిపాలకులకు, సహాయం చేయని వారికీ, చేయగలిగినంత సహాయం చేయని వారికీ, ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సి ఉండి తెలియని వారికీ ప్రతి ఒక్కరికీ- అంటుకుంది*

సుప్రీం కోర్టులో దాఖలు చేయబోయే పిటీషన్ మీద సంతకాలు పెట్టించేందుకు మైకేల్ ముస్మానో జైలు దగ్గరికి వెళ్ళాడు. ఓరగా తెరిచిన తలుపుతో మృత్యువాటిక నోరు తెరుచుకున్న భూతంలా ఉంది. పరదాలో దాక్కున్న కరెంటు కుర్చీ వెక్కిరిస్తూ చూసింది. మరో మూడు రోజుల్లో మసాచూసెట్స్ తలారీ చేతులు ఆ పరదాను తొలగిస్తాయి. అయితే ఈ మూడు రోజుల్లో ఆ మృత్యు హస్తాలను అమెరికా న్యాయదేవత ఆపుతుందా?

ఆనాటి తన స్మృతులను ముస్మానో ఇలా పేర్కొన్నాడు:

*కరెంటు కుర్చీని, దాని చుట్టూ ఉన్న భయానక పరిసరాలను చూసి అవహేళనగా నవ్వాను. అవి నాకు భయంకరంగా కనిపించలేదు. చేవచచ్చినవిగా, నాటక రంగంపై కదిలే భ్రమాజనిత వస్తువుల్లా తోచాయి. దారి కానని దుర్గామారణ్యంలో దారి తప్పిన బాటసారులకు దారి చూపించే చిత్ర పటంలా సెర్షియోరరీ రిట్ పిటీషన్ను తీసి వారి ముందు పరిచాను. సంతోషంగా కాగితాలను విప్పి చూపాను వాస్తవం కాగలిగిన ఆశాభావాన్ని వాంజెట్టి గ్రహించాడు. ముభావంగా ఉండే శాక్కొ మొహంలోనూ సంతోషం ఉట్టి పడింది.*

ఆ పిటీషన్‌ను అమెరికా రాజధానీ నగరంలోని సుప్రీం కోర్టులో దాఖలు చేయాల్సి వుంది. ఆ రోజు రాత్రి ఎనిమిదింటికి వాషింగ్టన్ వెళ్ళే ఫెడరల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయల్దేరాడు ముస్మానో.

**ఉద్యమాలు, సామాజిక సంక్షోభాలు ప్రజల జ్ఞానాన్ని వృద్ధి చేస్తాయి.**

ముస్మానో వాషింగ్టన్ బయల్దేరిన తర్వాత అమెరికా సామాన్యులకు సైతం సెర్షియోరరీ రిట్ అనే పదం పరిచయమైంది. చట్టధిక్కారం జరిగిన కేసుల్లో, అధికారం హద్దు మీరిన సందర్భాల్లో ఈ రిట్‌ద్వారా కింది కోర్టు రికార్డును సుప్రీం కోర్టు పరిశీలించి తీర్పును రద్దు పర్చవచ్చు, తిరిగి విచారణకు ఆదేశించవచ్చు. అతి అరుదైన సందర్భాల్లో మాత్రమే ఈ రిట్‌ను జారీ చేస్తారు.

* ప్రొటెస్ట్: శాక్కొ-వాంజెట్టి అండ్ ఇంటలెక్చువల్స్.

పన్నెండు గంటల ప్రయాణం తర్వాత ఆగస్టు 20 ఉదయం 8 గంటలకు యువ న్యాయవాది ముస్మానో వాషింగ్టన్ చేరుకున్నాడు. అమెరికా సుప్రీం కోర్టుకు అవి వేసవి సెలవు రోజులు. కాబట్టి మొత్తం తొమ్మిది మంది న్యాయమూర్తుల్లో ఎవరి దగ్గరైనా పిటీషన్ దాఖలు చేయవచ్చు. పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన ఏ న్యాయమూర్తి అయినా సెలవుల అనంతరం కోర్టు తిరిగి ప్రారంభమయ్యే వరకూ శిక్ష అమలును నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేయవచ్చు.

కానీ శాక్కో, వాంజెట్టిల జీవితం ముగిసేందుకు ఇక మూడు రోజుల వ్యవధి కూడా లేని ఆ రోజున వాషింగ్టన్‌లో ముస్మానోకు ఒక కఠోర వాస్తవం తెలిసింది. ఏ ఒక్క న్యాయమూర్తి కూడా అక్కడ లేరు. సెలవులు గడిపేందుకు ఎక్కడెక్కడికో వెళ్ళిపోయారు. సీనియర్ లాయర్ ఆర్థర్ హిల్‌కు ఫోను చేసి ఈ విషయం చెప్పాడు ముస్మానో. హిల్ నాయకత్వంలో లాయర్ల బృందం కార్లు బోస్టన్ నుంచి బేవర్లీ పట్టణం దిశగా పరుగెత్తాయి. అక్కడ వేసవి విడిదిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆలివర్ వెండెల్ హోమ్స్ ఉన్నాడు. ఆయన అప్పటికే ఒకసారి శిక్ష నిలిపేసేందుకు నిరాకరించినా మసాచూసెట్స్ కోర్టులు తలుపులు మూసుకున్న క్షణాన మృత్యువును ముద్దాయిల దగ్గరికి రాకుండా హోమ్స్ ఉత్తర్వు జారీ చేస్తాడని హిల్ భావించాడు. జస్టిస్ హోమ్స్ మిత్రుడు హెరాల్డ్ లాస్కీ డిఫెన్స్ కమిటీకి బ్రిటన్ నుంచి సహాయపడుతున్నాడు. లాస్కీ అనేక ఉత్తరాల్లో శాక్కో-వాంజెట్టి కేసు గురించి హోమ్స్‌కు రాసి వున్నాడు. రెండు రోజుల క్రితమే హోమ్స్‌కు లాస్కీ లేఖరాస్తూ అట్లాంటిక్ మంత్లీలో ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ రాసిన వ్యాసం గొప్ప తనాన్ని వర్ణించాడు:

> *ఈ ఘటన విషాదమైన ముగింపుకు చేరాల్సిందేననుకొంటున్నాను. కానీ, తన చర్య అమెరికా పేరు ప్రతిష్టలను ఎంతగా మంట గలుపుతుందో ఫుల్లర్ లాంటి వాళ్ళు తెలుసుకునేలా చేయగలనని నేననుకుంటున్నాను. డ్రేఫస్ కేసు * తర్వాత యూరప్‌ను ఊపేసింది ఈ కేసే. నాకు. . . ఇది మరో డ్రేఫస్ కేసనిపిస్తోంది.*

---

*ఆల్ఫ్రెడ్ డ్రేఫస్ (1859-1935) ఫ్రెంచి సైనికాధికారి. సంపన్న యూదు జాతీయుడు. జర్మన్ ప్రభుత్వానికి ఫ్రెంచి సైనిక రహస్యాలు అందించాడన్న అభియోగంపై ఆయనపై సైనిక కోర్టులో విచారణ జరిపి 1894 లో యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. డ్రేఫస్ నిర్దోషి అనీ మరో సైనికాధికారి ఆ నేరం చేశాడనీ బయటపడింది. కేసును తిరిగి విచారించాలని ఉద్యమం చెలరేగింది. యూదు వ్యతిరేక ఉన్మాదానికి, రాజ్య వ్యవహారాల్లో క్రైస్తవ మతాధిపతుల జోక్యానికి నిరసన వెల్లువెత్తింది. ఎమిలీ జోలా, అనటోల్ ఫ్రాన్స్ లాంటి మహా రచయితలు ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. రెండవ సారి కేసు విచారణలో కూడా డ్రేఫస్‌నే దోషిగా తేల్చారు. డ్రేఫస్‌పై తప్పుడు సాక్ష్యం సృష్టించారని కొత్త సాక్ష్యాధారాలు లభ్యంకాగా 1899లో మళ్ళీ కేసును విచారించారు. తిరిగి డ్రేఫస్‌నే దోషిగా ప్రకటించి ఈసారి శిక్షను పదేళ్ళకు తగ్గించారు. ఉద్యమానికి తలొగ్గి ప్రభుత్వం చివరికి డ్రేఫస్‌కు క్షమాభిక్ష ప్రకటించింది. తిరిగి సైనికాధికారిగా నియమించి అత్యున్నత పురస్కారం 'లీజియన్ ఆఫ్ ఆనర్' బహూకరించింది. రాజ్య వ్యవహారాల్లో మత జోక్యానికి స్వస్తి పలికేందుకు ఈ ఉద్యమం దోహదం చేసింది.*

ఈ లేఖ లండన్ నుంచి ఇంకా అమెరికా చేరుకోకముందే సెర్షియోరరీ రిట్ పిటీషన్ జస్టిస్ హోమ్స్ చేతుల్లో ఉంది. శిక్ష నిలిపేసేందుకు అంతకు ముందు తిరస్కరించిన తనను 'అన్యాయభూతం'గా అభివర్ణిస్తున్నారని బాధపడుతూ ఆయన మూడు రోజుల క్రితమే తన మిత్రుడు లాస్కీకి లేఖ రాసివున్నాడు. అయినప్పటికీ, ఈసారి కూడా జస్టిస్ హోమ్స్ ఆ పిటీషన్‌ను నిర్దయగా తోసిపుచ్చి నిజంగానే 'అన్యాయభూతం' అయ్యాడు. అంతకు కొన్నేళ్ళ ముందు తనకు బాంబులు పోస్టు చేసిన అరాచకవాదులపై ఆయన అలా కసి తీర్చుకున్నాడేమో! అయితే ఒక ఉపశమనం మాత్రం చేకూర్చాడు. మరో న్యాయమూర్తి ఎదుట అదే పిటీషన్ దాఖలు చేసుకొనేందుకు తన నిర్ణయం అడ్డు కాబోదని సెలవిచ్చాడు.

మరుసటి రోజు ఆగస్టు 21 ఆదివారం. పిటీషన్ చేతపుచ్చుకుని ఉదయాన్నే జస్టిస్ లూయీ బ్రాండిస్ ఎదురుగా లాయర్ హిల్ నిలుచున్నాడు. బ్రాండిస్ భార్య, కూతురు డిఫెన్స్ కమిటీకి సహకారం అందిస్తూ ఉద్యమానికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. డెడ్‌హాం కోర్టులో కేసు విచారణ జరుగుతున్నంతకాలం శాక్కో కుటుంబానికి జస్టిస్ బ్రాండిస్ భార్య తమకు అక్కడున్న ఇంట్లో ఆశ్రయమిచ్చింది. అంతేకాకుండా, డిఫెన్స్ కమిటీలో రాత్రింబవళ్ళు కృషి చేస్తున్న మేడమ్ ఎలిజబెత్ ఎవాన్స్‌కు బ్రాండిస్ దగ్గరి బంధువు. ఇదంతా ఒక ఎత్తైతే బ్రాండిస్‌కు ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్‌కు ఉన్న సన్నిహిత సంబంధం మరో ఎత్తు. ఒక రకంగా ఫ్రాంక్ ఫర్టర్‌కు బ్రాండిస్ గురుతుల్యుడు. ఫ్రాంక్ ఫర్టర్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతి ఏటా బ్రాండిస్ కొంత డబ్బు పంపేవాడు. శాక్కో-వాంజెట్టి కేసులో ఫ్రాంక్ ఫర్టర్ నిమగ్నమయిన ఆ ఏడాది కాస్త ఎక్కువే డబ్బు పంపాడు. అందుకే బ్రాండిస్ సెర్షియోరరీ రిట్‌ను విచారణకు స్వీకరిస్తాడని కొండంత ఆశ లాయర్ హిల్‌కు ఉంది.

కానీ, బ్రాండిస్ పరిస్థితే శాక్కో, వాంజెట్టిల పాలిట శాపంగా తయారయింది. తన భార్య డిఫెన్స్ కమిటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నందున తాను రిట్‌ను జారీ చేయలేనని జస్టిస్ బ్రాండిస్ తెగేసి చెప్పాడు. రిట్ జారీ చేస్తే తనకు పక్షపాతం అంటగడతారన్నాడు. డిఫెన్స్ లాయర్లను ఇంటి బయటే నిలబెట్టి మూడే నిమిషాలు ముక్తసరిగా మాట్లాడి కసురుకుని పంపాడు.

హతాసులై వెనుదిరిగినా, డిఫెన్స్ లాయర్లు తమ ప్రయత్నాలు విరమించలేదు. మిగిలిన ఏడుగురు అమెరికా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఎక్కడెక్కడున్నారో ఆరా తీశారు. పత్రికాఫీసుల ద్వారా, మిత్రుల ద్వారా కొందరు న్యాయమూర్తుల ఆచూకీ కనిపెట్టగలిగారు.

మేన్ రాష్ట్ర సముద్ర తీరంలోని రాక్‌లాండ్ దీవిలో జస్టిస్ స్టోన్ విహార యాత్ర చేస్తున్నాడు. ఆగస్టు 22 అర్ధరాత్రి శాక్కో, వాంజెట్టిల హృదయ తంత్రులకు విద్యుద్ఘాతం తగిలేలోగా ఆ దీవికి కనీసం చేరగలమా అన్నది సందేహాస్పదమే. ఏమైనప్పటికీ మిగిలున్న ప్రతి చిన్న అవకాశాన్ని జార విడుచుకోరాదని భావించి లాయర్ హిల్ హుటాహుటిన అక్కడికి బయల్దేరి వెళ్ళాడు.

కోర్టుల బయట ఉద్యమం ఉధృతంగా నడుస్తోంది. కొత్తగా ఏర్పడిన సిటిజన్స్ నేషనల్ కమిటీ ఫర్ శాక్కో, వాంజెట్టి' స్టేట్ హౌస్ ముందున్న బెల్ వ్యూ హోటల్‌ను కార్యాలయంగా చేసుకుని కార్యక్రమాలు ఉధృతం చేసింది. డిఫెన్స్ కమిటీ తో విభేదాల వల్ల విడిగా స్థాపించబడిన ఈ కమిటీలో ఇసాక్ డాన్ లెవినె, రాబర్ట్ మోర్స్ లెవెట్ బోస్టన్ నగర ప్రముఖులు జాన్ డేవీ జాన్ ఆడమ్స్ ఆర్థిక శాస్త్రవేత్త జాన్ కామన్స్, జర్నలిస్టులు కొందరు, ఒకరిద్దరు విద్యావేత్తలు చేరారు. నవలా రచయిత్రి అన్నె కాథరినె పోర్టర్ కూడా దీన్లో చేరింది. వివిధ రంగాల్లో ప్రముఖులను కూడగట్టిన ఈ సంస్థ అధికార యంత్రాంగంపై గట్టిగా వత్తిడి తెచ్చి మరణశిక్ష నిలుపుదలకై కృషి చేసింది. మరో వైపు డిఫెన్స్ కమిటీ, ఇంకో వైపు అమెరికా కమ్యూనిస్టు పార్టీ తమ ప్రయత్నాలను తీవ్రతరం చేశాయి యూరప్ లాటిన్ అమెరికాలలో మంట మండుతోంది.

శాక్కో-వాంజెట్టి కేసు గురించి వ్యాఖ్యానించమని ఫ్రాన్స్‌లోని నార్మండీ సముద్ర తీరంలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రేఫస్‌ను జర్నలిస్టులు అడిగారు సందేహానికి తావున్న చోట మరణశిక్ష విధించడం సరైనది కాదని ఆయన చెప్పాడు. మరణశిక్ష పర్యవసానం అమెరికాలో భయంకరంగా ఉండగలదని హెచ్చరించాడు.

## 6

**వా**షింగ్టన్ నుంచి బోస్టన్‌కు తిరిగొచ్చిన లాయర్ ముస్మానో, ఆగస్టు 21న అమెరికా అధ్యక్షుడు కార్విన్ కూలిడ్జ్ కోసం టెలిఫోన్‌లో ప్రయత్నించాడు. మరణశిక్ష రద్దు చేసే సంపూర్ణ అధికారాలు అమెరికా అధ్యక్షుడికి ఉన్నాయి. ప్రెసిడెంట్ ఉడ్రో విల్సన్ 1918 లో కార్మిక నాయకులు మూనీ బిల్లింగ్స్‌ల మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చమని కాలిఫోర్నియా గవర్నర్‌ను అడిగిన దృష్టాంతం ముస్మానోకు గుర్తొచ్చింది శిక్ష రద్దు చేయక పోయినా ఫరవాలేదు కనీసం సుప్రీం కోర్టుకు సెలవులు అయిపోయే వరకూ వాయిదా వేస్తే చాలు. అధ్యక్ష ఎన్నికలల్లో తిరిగి పోటీ చేయనని ప్రకటించిన కూలిడ్జ్‌కి ఓట్ల గురించి పుల్లర్ కున్న భయం లేదు.

అమెరికా అధ్యక్షుడు సౌత్ డకోటాలో విశ్రాంతి తీసుకుంటున్నాడని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. ముస్మానో సుదీర్ఘమైన టెలిగ్రాఫిక్ పిటీషన్‌ను కూలిడ్జ్‌కి పంపాడు. పిటీషన్‌ను స్వయంగా అందజేసేందుకు అనుమతించమని కూడా అందులో కోరాడు. అలా అనుమతిస్తే వెంటనే సౌత్ డకోటాలో వాలేందుకు ఒక విమానాన్ని కూడా సిద్ధం చేసి పెట్టుకున్నాడు. పైలెట్‌ను అప్రమత్తంగా ఉంచాడు. ఏ క్షణంలోనైనా పిలుపు రావచ్చు.

రెండు గంటలు గడిచినప్పటికీ టెలిగ్రాం పిటీషన్‌కు సమాధానం రాలేదు. మరో టెలిగ్రాం పంపాడు ముస్మానో. మళ్ళీ జవాబు లేదు. అమెరికా అధ్యక్షుడికి టెలిఫోన్ కాల్ బుక్ చేశాడు. చాలా సేపటికి లైను కలిసింది. అధ్యక్షుడి కార్యదర్శి ఫోన్ ఎత్తాడు. తన టెలిగ్రాంల గురించి అడిగాడు ముస్మానో.

"ఏ టెలిగ్రాం?"

ముస్మానో తన దగ్గరున్న కాపీని చదివి వినిపించాడు ఫోన్లో. అలాంటి టెలిగ్రాం చూడలేదని చెప్పాడు కార్యదర్శి.

"పోనీ అధ్యక్షుల వారు దాన్ని అందుకున్నారా?"

తనకు తెలియదన్నాడు కార్యదర్శి.

"సరే తెలుసుకుని చెప్పగలరా?"

అమెరికా అధ్యక్షుడు నిద్రపోతున్నాడనీ, ఆయనను ఇబ్బంది పెట్టలేననీ సెలవిచ్చాడు కార్యదర్శి. అక్కడ మరెవరైనా ఆ టెలిగ్రాంను అందుకున్నారేమో తెలుసుకోమని కార్యదర్శిని ముస్మానో బ్రతిమాలాడు.

-ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత కార్యదర్శి గొంతు వినిపించింది. టెలిగ్రాం అక్కడికి చేరిందట! కానీ అందులోని అభ్యర్థన అధ్యక్షులవారి అధికార పరిధిలోకి రానిదట!

"అధ్యక్షుల వారితో నేను మాట్లాడవచ్చా?"

ముస్మానో దీనంగా అడిగాడు. ఆయన నిద్ర పోతున్నాడని మరోసారి చెప్పాడు కార్యదర్శి. ముందు రోజు చేపల వేటకు వెళ్ళి ఆయన బాగా అలసిసొలసి సేద తీర్చుకుంటున్నాడనీ, నిద్రాభంగం చేయడం భావ్యం కాదని చెప్పాడు. పైగా ఆ సాయంత్రం ఎల్లోస్టోన్ నేషనల్ పార్క్‌ను సందర్శించే పనుందట.

రేపు చంపబడబోయే ఇద్దరు మంచివాళ్ళ కోసం లాయర్‌గా తాను పని చేస్తున్నాననీ, విమానం సిద్ధంగా వుందనీ, అధ్యక్షుల వారిని నేరుగా కలిసే అవకాశం ఇప్పించమనీ ముస్మానో మరీ మరీ బ్రతిమాలాడు.

"కుదరదు. అధ్యక్షుల వారు సాయంత్రం బయల్దేరి వెళ్ళిపోవాలి."

"ఆయన ఎక్కడికెళ్తే నేనక్కడికి విమానంలో తక్షణం రాగలను"

"కుదరదు. అధ్యక్షుల వారికి ఇది పూర్తి విశ్రాంతి కాలం. ఆయన ఇవాళ అధికార హోదాలో ఎవర్నీ కలవరు."

"కానీ ఇది జీవన్మరణ సమస్య. మేం అడిగేదల్లా అమెరికా సుప్రీం కోర్టు మా సెర్షియోరరీ రిట్ పిటీషన్ మీద తీర్పు చెప్పే వరకూ మరణశిక్షను నిలిపేయమని మాత్రమే."

"మరణశిక్ష నిలిపేందుకు అధ్యక్షుడికి అధికారాల్లేవు."

"నాకది తెలుసు. కానీ, కేసును సుప్రీం కోర్టు వినేంత వరకూ మరణశిక్ష అమలు వాయిదా వేయడం తన అభిమతమని ఆయన మసాచూసెట్స్ గవర్నర్‌కు టెలిగ్రాం పంపితే గవర్నర్ తప్పక ఆయన అభ్యర్థనను గౌరవిస్తాడు. నేను అధ్యక్షుల వారితో నేరుగా మాట్లాడవచ్చా?"

"ఆయన నిద్ర పోతున్నాడని నేను మీకు చెప్పాను."

ఇక బతిమాలి లాభం లేదనుకున్నాడు ముస్మానో.

"సరే ఆయన్ను నిద్ర లేపండి."

ఆదేశిస్తున్నట్టు చెప్పాడు.

"సరే- ఇక చెప్పాల్సిందేమీ లేదు."

కార్యదర్శి కటువుగా అన్నాడు. అతను ఫోన్ పెట్టేయబోతున్నాడేమోనని ముస్మానోకు భయం వేసింది.

"క్షమించండి. అమర్యాదకరంగా మాట్లాడడం నా అభిమతం కాదు. నేనెంత బాధ పడుతున్నానో మీరర్థం చేసుకోవాలి. నిజానికి ప్రపంచం మొత్తం చనిపోబోతున్న ఈ ఇద్దరూ నేరస్థులు కారని నమ్ముతోంది. తాను ప్రపంచ నాయకురాలినని భావించే అమెరికా ప్రభుత్వం, ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టాల్సిన అమెరికా ప్రభుత్వం, ఈ పరిస్థితిని చూస్తూ ఊరుకోవడం తగదు. ఎంత స్వల్ప విషయమైనా, పిటీషనర్ ఎంత అల్పుడైనా ఉన్నత ప్రభుత్వాధినేతలకు అభ్యర్థన పంపుకోవచ్చని మనం గొప్పలు చెప్పుకుంటాం. ఇది న్యాయమైన విషయం. అధ్యక్షుల వారు దీన్ని పరిశీలించగలరని నేను ఖచ్చితంగా చెప్పగలను. . . . నేను అక్కడికి రావచ్చా? హుటాహుటిన బోస్టన్ నుంచి విమానంలో రాగలను."

"మీరు వచ్చినా మిమ్మల్ని అధ్యక్షుల వారు చూడరు."

అవతలి వేపు ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది. తర్వాత ముస్మానో అన్న మాటలు బోస్టన్‌లోనే ఉండి పోయాయి.

ఆ సాయంత్రం అమెరికా అధ్యక్షుడు బస చేసిన నక్షత్రాల హోటల్ చుట్టూ అసాధారణ సాయుధ బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారుల సలహాపై, అంతకు ముందు నిర్ణయించిన గదిలో కాక మరో గదిలో కూలిడ్జ్ విశ్రమించాడు.

# 7

ఆ ఆదివారం రోజు అమెరికాలో, యూరప్‌లో అనేక ఇతర ఖండాల్లో పలు చోట్ల నిరసన మిన్నుముట్టింది. హింసాకాండ చెలరేగింది. నిషేధాజ్ఞలను ధిక్కరించి బోస్టన్‌లోని స్టేట్ హౌస్ ముందు భారీ బందోబస్తు మధ్య ఇరవై వేల మంది ప్రదర్శకులు శాక్కో, వాంజెట్టిల మరణశిక్షను రద్దు చేయమని నినదించారు. పలువురు ప్రదర్శకులను పోలీసులు అరెస్టు చేసి హింసించారు. అయినా ప్రజలేమాత్రం భయపడకుండా పోలీసులతో యుద్ధానికి సన్నద్ధమయ్యారు. థేయర్‌ను, ఫుల్లర్‌ను, లోవెల్‌ను, జస్టిస్ బ్రాండిస్‌ను, జస్టిస్ హోమ్స్‌ను తిట్టి పోశారు. రోజినా శాక్కో, లూగియా వాంజెట్టిలు, అనేక మంది కమ్యూనిస్టు నాయకులు బోస్టన్‌లో బహిరంగ సభల్లో ప్రసంగించారు. మరుసటి రోజు న్యూయార్క్‌లో సమ్మెకు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలోని శాక్కో-వాంజెట్టి ఎమర్జెన్సీ కమిటీ, తాత్విక అరాచక వాదుల శాక్కో-వాంజెట్టి ఇంటర్నేషనల్ కమిటీ పిలుపునిచ్చాయి.

డిఫెన్స్ లాయర్లు తలోదిక్కూ వెళ్ళి తమ ఆఖరి ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నారు ఎక్కడ ఎ అధికారిని కలిస్తే పనౌతుందో, ఎ న్యాయమూర్తిని కలిస్తే ఫలితముంటుందో వారినల్లా కలుస్తూనే ఉన్నారు. వెర్మాంట్‌లో విడిది చేసిన అమెరికా అటార్నీ జనరల్ జాన్ సార్జంట్‌ను కలిసి మూడు గంటల పాటు వారు వాదించారు శాక్కో వాంజెట్టిల గురించి జస్టిస్ డిపార్ట్‌మెంట్ దగ్గరున్న సమాచారాన్ని బయట పెట్టమని అడిగారు. కానీ ఫైళ్ళు విప్పేందుకు ఆయన తిరస్కరించాడు. వాషింగ్టన్‌లో ఉన్న ఇన్‌చార్జి అటార్నీ జనరల్ జార్జి ఫర్నామ్ మాత్రం కొంత కరిగాడు. శాక్కో, వాంజెట్టిలు ఒక అరాచకవాద పత్రికకు చందాదారులని మాత్రమే బయటపెట్టాడు. తమ ఫైళ్ళలో వారి గురించి వున్న 'ముఖ్య విషయం' అదేనన్నాడు.

ఫుల్లర్ కార్యాలయం పిటీషన్లతో, టెలిగ్రాంలతో నిండిపోతోంది. అవిశ్రాంతంగా మోగుతున్న టెలిఫోన్లు మరణశిక్ష నిలిపేయవలసిందని వేడుకుంటున్నాయి.

సుదూరమైన రాక్‌లాండ్ దీవిలో వున్న జస్టిస్ స్టోన్ దగ్గరికి బయల్దేరిన లాయర్ హిల్ ఇంకా అక్కడికి చేరుకున్నాడన్న సమాచారం లేదు రెండు వందల మైళ్ళు ప్రయాణం చేయాలి సముద్ర తీరానికి చేరి హార్బర్‌లో నావ మాట్లాడుకుని వెళ్ళాల్సి వుంటుంది పొగ మంచు కమ్ముకుంటే గంటల తరబడి ప్రయాణం సాగక పోవచ్చు.

తాము చనిపోబోతున్నామనే వాస్తవం క్షణక్షణానికీ గడ్డకడుతుంటే ఆ రోజు శాక్కో, వాంజెట్టిలు పలు లేఖలు రాశారు. తమ కోసం ఏడేళ్ళుగా తీవ్ర పోరాటం చేస్తున్న డిఫెన్స్ కమిటీ కి ఆ సాయంత్రం లేఖ రాశారు:

*మసాచూసెట్స్ ప్రభుత్వ కారాగార మృత్యువాటిక నుంచి*
*ఆగస్టు 21, 1927*

*ప్రియమైన శాక్కో-వాంజెట్టి డిఫెన్స్ కమిటీ మిత్రులారా! కామ్రేడ్స్!*

*రేపు రాత్రి మేం చంపబడబోతున్నాం- అమెరికా సుప్రీం కోర్టు గానీ గవర్నర్ ఫుల్లర్ గానీ (మరణశిక్ష) నిలిపేస్తూ కొత్త ఆదేశాలు జారీ చేస్తే తప్ప.*

*మాకు ఆశ అడుగంటింది. మా కోసం ధైర్యంగా పోరాడుతున్న మన మిత్రుడు మైకేలేంజిలో ముస్మానో ఈ ఉదయం వాషింగ్టన్ నుంచి ఇక్కడికొచ్చాడు. టైముంటే ఈ సాయంత్రం మళ్ళీ వస్తానన్నాడు. రోజ్, లూగియాలు కూడా ఈ ఉదయం ఇక్కడే ఉన్నారు. వాళ్ళు కూడా ఈ సాయంత్రం మళ్ళీ వస్తామని వాగ్దానం చేశారు. కానీ ఇప్పుడు సాయంత్రం 5:30 అయింది. ఇప్పటికీ ఎవరూ రాలేదు. మాకు అందించాల్సిన శుభవార్త ఏమీ లేదని ఇది సూచిస్తోంది.*

అలాంటిదేదైనా వుంటే మీలో ఒకరు దాన్ని మాకు అందించేందుకు పరిగెత్తుకొచ్చే వాళ్ళే. మీ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయనీ, మా మరణశిక్షల్ని అమలు చేయకుండా ఆపేందుకు మీరు యింకా ప్రయత్నిస్తూ మిగిలున్న ఈ కొద్ది గంటలను గడుపుతున్నారని మాకు అర్థమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే, మేం ఓడిపోయామని భావిస్తున్నాం. కాబట్టి, మమ్మల్ని రక్షించేందుకు ఈ ఏడేళ్ళ నాలుగు నెలల పదకొండు రోజుల పోరాటంలో మీరు చేసిన కృషికి మా కృతజ్ఞతల్ని, అభినందనలను అందజేసేందుకు ఈ లేఖ రాయాలని నిర్ణయించాం.

మా పట్లా, మా కుటుంబాల పట్లా మీరు ప్రదర్శించిన సంఘీభావం గొప్పది. మేం ఓడి పోయి చనిపోబోతున్న వాస్తవం మీ సంఘీభావానికి మా కృతజ్ఞతాభి నందనలను ఏ మాత్రం తగ్గించలేదు.

మిత్రులారా! కామ్రేడ్స్! ఈ కేసు విచారణా విషాదం ముగియబోతోందిప్పుడు. మనమంతా ఒకే హృదయంగా ఐక్యమౌదాం. మనలో ఇద్దరం మాత్రమే మరణిస్తాం. కామ్రేడ్స్! మన భావాలు లక్షల మందిలో జీవిస్తాయి. మనం గెల్చాం. కానీ ఓడి పోలేదు. మన బాధలను, మన దుఃఖాల్ని మన పొరపాట్లను, మన అపజయాలను, ఆవేదనను భవిష్యత్ యుద్ధాల కోసం మహత్తర విముక్తి కోసం దాచుకుందాం.

ఈ విషాదకాల ఘడియల్లో మనందరం ఒకే హృదయంగా ఐక్యమౌదాం.

ప్రపంచంలో ఉన్న మిత్రులందరికీ, కామ్రేడ్స్‌కు మా శాల్యూట్స్.

ప్రేమానురాగాలు నిండిన హృదయాలతో మీ అందరినీ కౌగలించుకుంటూ చివరి సారి వీడ్కోలు చెప్తున్నాం. ఇప్పుడూ, ఎప్పుడూ మీరంతా చిరకాలం జీవించాలి. స్వేచ్ఛ వర్ధిల్లాలి.

చావు బతుకుల్లో మీ
బార్టొలోమియో వాంజెట్టి
నికోలా శాక్కొ

# 8

ఆదివారం. రాత్రయింది. బోస్టన్‌లో అగమ్యగోచరంగా ఉన్న లాయర్లకు అమెరికా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హోవర్డ్ టాఫ్ట్ అడ్రస్ దొరికింది. కానీ ఆయన కెనడాలో ఉన్నాడు.

ముస్మానో వెంటనే ఆయనకు ఒక టెలిగ్రాం పంపుతూ పిటీషన్ వేసేందుకు తాను ఎక్కడికి రావాలో చెప్పమని అందులో అడిగాడు. కాలహరణం జరగడం ఇష్టం లేక టెలిఫోన్ కూడా చేశాడు. జస్టిస్ టాఫ్ట్ టెలిఫోన్ ఎత్తాడు. నేరుగా అమెరికా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తే దొరికినందుకు ముస్మానో సంతోషించాడు. శాక్కొ, వాంజెట్టిల ప్రాణాలను కాపాడగలిగే సర్వాధికారాలున్న మనిషి దొరికినందుకు ఆనందంతో తబ్బిబ్బయ్యాడు.

*"గుడ్ ఈవినింగ్ మిస్టర్ చీఫ్ జస్టిస్"*

మాట్లాడుతోంది ఎవరని అడిగాడు టాఫ్ట్.

*"నేను శాక్కొ, వాంజెట్టిల లాయర్ యం.ఎ.ముస్మానోను. మిమ్మల్ని ఈ రకంగా ఇబ్బంది పెడుతున్నందుకు క్షమాపణలు. కానీ అత్యవసర పరిస్థితిలో మిమ్మల్ని వెంటనే కలవాల్సి వచ్చింది. అయినా ఈ విషయాన్ని మీరు టెలిఫోన్‌లో పరిష్కరించాలని నేను ఆశించను. స్వయంగా వచ్చి మిమ్మల్ని కలిసి నా అభ్యర్థన తెలియజేయాలని వుంది."*

*"మీరేం అడగాలనుకుంటున్నారు?"*

*"శాక్కొ-వాంజెట్టి కేసులో మరణశిక్ష నిలిపేయమని మా అభ్యర్థన. సెర్షియోరరీ రిట్ కోసం సుప్రీం కోర్టులో ఇప్పటికే పిటీషన్ దాఖలు చేసి వున్నాం."*

*"కానీ నేను మీ వాదన ఎలా వినగలను? నేను కనీసం అమెరికాలోనైనా లేను కదా!"*

*"నాకు తెలుసు యువరానర్. కానీ మీరు సరిహద్దు వరకు రావచ్చు. విమానం సిద్ధంగా ఉంది. నేను హుటాహుటిన బయల్దేరి రాగలను."*

*"మీరు మరీ అసాధారణమైన విషయం అడుగుతున్నారు."*

*"నాకు తెలుసు యువరానర్. కానీ క్లయింట్ల పట్ల నా బాధ్యత నా అభ్యర్థనను పూర్తిగా సమర్థిస్తుంది. మనం వెంటనే పని పూర్తి చేయాలి. రేపు అర్ధరాత్రికి మా క్లయింట్లు చనిపోవాల్సి వుంది."*

*"మీరు నా దగ్గరికే ఎందుకు రావాలో నాకు బోధ పడడం లేదు. ఆ సర్క్యూట్ కోర్టులో మిగిలిన జడ్జీలు ఉన్నారు కదా!"*

జస్టిస్ హోమ్స్, జస్టిస్ బ్రాండిస్‌లు పిటీషన్లు తోసి పుచ్చారనీ, జస్టిస్ స్టోన్ దగ్గరికి లాయర్ హిల్ వెళ్ళాడనీ, సరైన సమయానికి అక్కడికి చేరతాడని నమ్మకం లేదని ముస్మానో వివరించాడు. కేసు అమెరికా సుప్రీం కోర్టు వ్యవహారంగా మారినందువల్ల ఏం జరుగుతోందో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రధాన న్యాయమూర్తిగా టాఫ్ట్‌కు ఉందని ముస్మానో వాదించాడు. అమెరికా-కెనడా దేశాల సరిహద్దులో ఎక్కడికి ఆయన రాగలడో చెప్తే అక్కడికి విమానంలో క్షణాల మీద రాగలనని తెలిపాడు. అది టెలిఫోన్‌లో నిర్ణయించే స్వల్ప విషయం కాదన్నాడు టాఫ్ట్.

"యువరానర్, అందుకనే స్వయంగా పిటీషన్ అందజేసేందుకు నన్ను అనుమతించమని వినమ్రంగా వేడుకుంటున్నాను."

ఏం చెప్పదల్చుకున్నదీ వివరిస్తూ మరొక టెలిగ్రాం పంపమని న్యాయమూర్తి చెప్పాడు. కాస్త ఆధారం దొరికినట్లయింది. అంత సంభాషణ జరిగాక కూడా టెలిగ్రాఫిక్ పిటీషన్ను పంపమన్నాడంటే ఖచ్చితంగా మరణశిక్ష నిలిపేసేందుకే ననిపించింది.

రాత్రి 9:30 కు జస్టిస్ టాఫ్ట్‌కు ముస్మానో నుంచి టెలిగ్రాం వెళ్ళింది. ఆ టెలిగ్రాంకు సమాధానం రాగానే వెంటనే తనకు ఫోన్ చేసి చెప్పమని, ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యొద్దని టెలిగ్రాఫ్ కంపెనీకి చెప్పాడు ముస్మానో. ఏ క్షణంలోనైనా బయల్దేరే విధంగా విమానాశ్రయంలో విమానాన్ని సిద్ధంగా ఉంచమని పైలెట్‌కు మరొకసారి గుర్తు చేశాడు.

అక్కడ జైల్లో శాక్కొ కొడుకు డాంటేకి రాయాల్సిన ఉత్తరం పూర్తి చేశాడు వాంజెట్టి:

*ప్రియమైన డాంటే!*

*నాకింకా ఆశ వుంది. జీవించేందుకు, స్వేచ్ఛను అనుభవించేందుకు మాకున్న హక్కు కోసం చివరి నిమిషం దాకా పోరాడతాము. కానీ రాజ్యం, డబ్బు, అభివృద్ధి నిరోధక శక్తులు- ఇవన్నీ మమ్మల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే మేం స్వేచ్ఛావాదులం లేదా అరాచక వాదులం. . . . .*

*మీ నాన్న గురించి నాకు తెలిసిందంతా నీకిప్పుడు చెప్తాను. ఆయన నేరస్తుడు కాదు. నేనెప్పుడూ చూడనంత ధైర్యశాలి. ఏదో ఒక రోజు నేను చెప్తున్న విషయం నీకు అర్థమౌతుంది. స్వేచ్ఛ, న్యాయం అందరికీ దక్కాలని చేసిన పోరాటంలో మీనాన్న అమూల్యమైనవన్నీ త్యాగం చేశాడు. . . . .*

*గుర్తుంచుకో డాంటే, ఎప్పుడూ ఈ విషయం గుర్తుంచుకో- మేం నేరస్తులం కాదు. మాపై కేసు బనాయించి శిక్షించారు.*

*కేసును తిరిగి విచారించేందుకు నిరాకరించారు. చెప్పలేని చిత్రహింసాభరితమైన, అన్యాయమైన ఈ ఏడేళ్ళ నాలుగు నెలల పదిహేడు రోజుల తర్వాత మేం చంపబడితే అది నేనింతకు ముందు నీకు చెప్పిన కారణంగానే- ఎందుకంటే మేం పేదలం. ఒక మనిషిని మరొకరు దోచుకొనేందుకూ, పీడించేందుకూ మేం వ్యతిరేకులం. . . .*

ఆగస్టు 21 అర్ధరాత్రి అయింది. కాలం ఆగస్టు 22 దిశగా ప్రాణాంతకమైన వేగంతో పరిగెడుతోంది. అధికార వర్గం జోక్యం చేసుకొని ఆపకపోతే ఇక శాక్కొ, వాంజెట్టి జీవితంలో మిగిలున్నది ఇరవై నాలుగ్గంటలే.

జస్టిస్ టాఫ్ట్ నుంచి టెలిగ్రాంకు సమాధానం రాకపోవడం వల్ల ఆయనకు మరోసారి ఫోన్ చేశాడు ముస్మానో. ఫోన్ మోగుతోంది. కానీ ఎవరూ ఎత్తడం లేదు. సుదూర ప్రాంతాల్లోని మనుషుల్ని కలపగల యంత్రం మోత తప్ప మనిషి జాడ లేదు. అరగంటకొకసారి టెలిగ్రాఫ్ ఆఫీసుకు ఫోను చేసి టాఫ్ట్ నుంచి తనకేదైనా టెలిగ్రాం వచ్చిందేమో అడుగుతున్నాడు

ముస్సోనో. మధ్య మధ్యలో విమానాశ్రయం నుంచి పైలెట్ ఫోను. 'విమానం సిద్ధం చేయమంటారా ?'. రాత్రంతా నిరీక్షణ రాజ్యమేలింది. తెల్లవారు తుండగా అలిసి పోయి తన హోటల్ గదిలో టేబిల్ మీద తల వాల్చాడు ముస్మానో. అప్పటికి సరిగా నిద్రలేక వారం రోజులయింది.

టెలిఫోన్ మోగడంతో ముస్మానో మేలుకున్నాడు. వెస్టన్ యూనియన్ టెలిగ్రాఫ్ కార్యాలయం నుంచి ఫోను. గడియారంకేసి చూశాడు. ఉదయం ఏడు గంటల ఇరవై నిమిషాలు. టెలిగ్రాం వచ్చిందని టెలిఫోన్ ఆపరేటర్ చెప్పింది. అందులో 430 పదాలున్నాయనీ, 19 డాలర్ల 20 సెంట్లు చెల్లిస్తే తీసుకోవచ్చునని చెప్పింది. అంత పెద్ద టెలిగ్రాం అయితే తప్పక తనకు కావాల్సిందే అయి ఉంటుందని ఎక్కడో ఆశ.

టెలిగ్రాం చూసి నిశ్చేష్టుడయ్యాడు ముస్మానో. 'నో' అని చెప్పేందుకు జస్టిస్ టాఫ్టుకు 430 పదాలు కావాల్సి వచ్చాయి. రాత్రంతా పడిన శ్రమంతా వృధా.

జస్టిస్ టాఫ్ట్ సంగతి ముందుగానే తెలిసుంటే ముస్మానో నిరాశ పడేవాడు కాడు. ప్రొఫెసర్ ఫ్రాంక్ ఫర్టర్ ఈ కేసు గురించి రాసిన వ్యాసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అప్పటికే ఆయన విషం గక్కి ఉన్నాడు. యేల్ యూనివర్సిటీలోని న్యాయశాస్త్ర అధ్యాపకుల్లో కొందరు శాక్కో, వాంజెట్టిలను సమర్థించగా వారి నోరు మూయించమని ఆ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌కు ఆయన చెప్పాడు. ఈ సంగతులు తెలిసుంటే తాను టాఫ్ట్ మీద ఆశతో రాత్రంతా వృధా చేసి వుండే వాడిని కానని ముస్మానో తన జీవిత కథ 'వెర్డిక్ట్!' లో రాశాడు.

# 9

జస్టిస్ టాఫ్ట్ నుంచి టెలిగ్రాం అందగానే ఇక చేసేది లేక ముస్మానో గవర్నర్ కార్యాలయానికి పరిగెత్తాడు. గవర్నర్ కార్యదర్శి మెక్ డొనాల్డ్‌ను కలిసి మరణశిక్ష గురించి ఏం ఆలోచిస్తున్నారని అడిగాడు. ముద్దాయిలు నేరస్తులన్న అభిప్రాయంలో మార్పులేదని చెప్పాడు మెక్‌డొనాల్డ్.

అక్కడి నుంచి నేరుగా చార్లెస్ టౌన్ జైలు కెళ్ళి శాక్కో, వాంజెట్టిలను కలిశాడు. ఆగస్టు 10 నాటికన్నా మించిపోయింది లేదని చెప్పాడు. అమెరికా సుప్రీం కోర్టులో సెర్షియోరరీ రిట్ పెండింగ్‌లో ఉండగా అధికార గణం వారిని చంపబోదని ఆశాజనకంగా మాట్లాడాడు. అమెరికా కల్లోల మానసం నుంచి దూరంగా, ప్రశాంతమైన అట్లాంటిక్ మహా సముద్రంలోని రాక్‌లాండ్ దీవిలో విశ్రాంతి పొందుతున్న న్యాయమూర్తి హర్లాన్ స్టోన్‌ను లాయర్ హిల్ తప్పకుండా కలుసుకొంటాడనీ, ఆయన సెర్షియోరరీ రిట్‌ను విచారణకు స్వీకరించి శిక్షను నిలిపేస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. న్యాయమూర్తిగా స్టోన్ చరిత్ర తనలో ఆశ రేకెత్తిస్తోందని చెప్పి ఖైదీ లిద్దర్నీ ఉత్సాహపరిచే ప్రయత్నం చేశాడు.

కానీ, స్టోన్ కూడా ముస్మానో ఆశలు అడియాసలు చేశాడు. అమెరికా న్యాయశాస్త్ర చరిత్రలో గొప్ప న్యాయవేత్తగా పేరుగాంచి, ఆ తర్వాత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన జస్టిస్ స్టోన్ కూడా శిలాప్రతిమగా మారాడు. లాయర్ హిల్ కున్న కొండంత ఆశను వమ్ము చేశాడు.

జస్టిస్ టాఫ్ట్, హోమ్స్, బ్రాండిస్, స్టోన్ నలుగురూ పిటీషనర్లు దోషులని ప్రకటించకుండానే శిక్షను నిలుపు చేసేందుకు నిరాకరించారు. పిటేషన్‌పై ఏ విషయం తేలేవరకైనా పిటీషనర్లను సజీవంగా ఉండనివ్వాలని వారనుకోలేదు.

డిఫెన్స్ లాయర్లు బోస్టన్‌లో మరో ప్రయత్నం చేద్దామనుకున్నారు. లాయర్ ముస్మానోను సుపీరియర్ కోర్టు న్యాయమూర్తి సిస్కే దగ్గరికి పరిగెత్తించారు. ధేయర్‌తో సమాన హోదా కలిగిన సిస్కే అదే కోర్టు న్యాయమూర్తుల్లో ఒకడిగా శిక్షను నిలుపుదల చేసే అధికారం కలిగి వున్నాడని ముస్మానో వాదించాడు. ఏ గడ్డి పోచ దొరికినా వదల్లేని క్షణాలవి. ముస్మానో తన పెన్ కాప్ తీసి చేతుల్లో పట్టుకుని నిలుచున్నాడు 'స్టే' అనే అతి సాదాపదం కింద న్యాయమూర్తి సంతకం పెట్టేందుకు కనురెప్పపాటు ఆలస్యం కూడా జరగ్గూడదన్నట్టుగా ఉన్నాడు కానీ సిస్కే 'స్టే' అని రాయలేదు, 'నో' అని చెప్పాడు.

నిస్సహాయులై వెనుదిరిగిన ఆ యువ లాయర్లు మరో ప్రయత్నం చేశారు. అమెరికా సుప్రీం కోర్టులో రిట్ పెండింగ్‌లో ఉన్నందువల్ల కింది స్థాయిలో ఉన్న ఫెడరల్ జిల్లా కోర్టు శిక్షపై 'స్టే' యివ్వొచ్చని వాదించవచ్చనుకున్నారు. హెబియస్ కార్పస్ పిటీషన్‌ను యుద్ధ ప్రాతిపదిక మీద టైపు చేయించి సంతకాల కోసం ముస్మానో మళ్ళీ జైల్లో ప్రత్యక్ష మయ్యాడు. ఎప్పట్లాగే శాక్కో సంతకం పెట్టలేదు. వాంజెట్టి శ్రద్ధగా సంతకం పెట్టాడు.

వాంజెట్టి సంతకమైతే పెట్టాడు గానీ బతుకుతానన్న నమ్మకం లేదతనికి. ఆ రోజు ఉదయం రోజినా శాక్కో, లూగియా వాంజెట్టిలు కలిసినప్పటికే తన చావు ఖాయమైందని అర్థమైంది. జైలు డాక్టర్ జోసెఫ్ మెలాగ్లిన్‌కు తన చెల్లెలును పరిచయం చేసి తన శవాన్ని ఆమెకు అప్పజెప్పమని కోరాడు. **తన శవాన్ని తానే అప్పగించుకునే ఆ దృశ్యం అత్యంత వేదనాభరితంగా కనిపించింది.** అప్పటికే రోజ్, లూగియాలు కుంగిపోయి వున్నారు. ఇనుప జల్లెడ అమర్చి వున్న డెత్ సెల్ తలుపులకు మొహాలానించి వాళ్ళిద్దరూ ఖైదీలను ముద్దు పెట్టుకున్నారు. తలుపు కమ్మీలు అంగుళంపైగా మందంగా ఉండి స్పర్శకు అవకాశం యివ్వలేదు. ఆలింగనం చేసుకొనేందుకు జైలు అధికార్లు అనుమతించలేదు

మరోసారి భార్యను చూడాలని వుందని శాక్కో కబురు పెట్టడంతో సాయంత్రం 3 10కి మరోసారి రోజ్, లూగియా జైలుకొచ్చారు. అప్పటికి రోజ్ మరింత నీరసించి నిస్సహాయంగా వుంది. అందమైన ఆమె ముఖం వివర్ణమయి వుంది. జైలు ముఖద్వారం దగ్గరే ఆమె పెద్దగా ఏడ్చింది. అప్పటి దాకా ఆమె ఏనాడూ కంట నీరు పెట్టి ఎరగదు. ఒక గంట సేపు వాళ్ళిద్దరూ జైల్లో గడిపారు. ఆహార పదార్థాలు అందించే కంతలో నుంచి వాంజెట్టి తన చెల్లెలు చేతులు

పట్టుకుని బాధ పడ్డాడు. "లూగియా! ఇక్కడికెందుకొచ్చావు! నిన్ను నువ్వే ఎందుకింతగా కష్టపెట్టుకుంటున్నావు" అంటూ ఏడ్చాడు లూగియా కాసేపు క్రీస్తును ప్రార్థించింది.

పక్క గదిలో భార్యచేతులు పట్టుకుని శాక్కో నిల్చున్నాడు. "రోజినా నిన్ను ప్రేమిస్తున్నాను. ఎప్పుడూ ప్రేమిస్తాను" అన్నాడు. "నిక్. నేనూ నీతోనే చనిపోతున్నాను" అంటూ రోజినా బాధ పడింది. కటకటాల గుండా మరోసారి ముద్దు పెట్టుకున్నారు. పిల్లలిద్దర్నీ రోజినా వెంట తేలేదు. వారి పసి హృదయాలు ఈ విషాద భరిత క్షణాలను నమోదు చేయడం మంచిది కాదని భావించింది.

ఏడుస్తూ బయటికొచ్చారు రోజినా, లూగియా. వారి కారు స్టేట్ హౌస్ వేపు దూసుకు పోయింది దారి పొడవునా రోజినా ఏడుస్తూనే వుంది.

# 10

**లూ**గియా, రోజినాలు వెళ్ళి పోయిన కాసేపటికి శాక్కో, వాంజెట్టిల మాజీ లాయర్ థామ్సన్ జైలుకొచ్చాడు. చనిపోయేలోగా ఒకసారి మాట్లాడిపొమ్మని ఆయనకు ఆ రోజు ఉదయం వాంజెట్టి కబురు చేశాడు. న్యూ హాంప్ షైర్‌లో వున్న థామ్సన్‌కు ఆ కబురు అందగానే హుటాహుటిన బయల్దేరి చార్లెస్ టౌన్ జైలుకు చేరే సరికి సాయంత్రమయింది. జైలు వార్డెన్ ఆయనను నేరుగా వాంజెట్టి దగ్గరికి తీసుకెళ్ళాడు. థామ్సన్ వెళ్ళే సరికి వాంజెట్టి ఏదో రాసుకుంటున్నాడు. థామ్సన్ రాక గమనించి లేచి గౌరవ సూచకంగా కరచాలనం చేశాడు.

సెల్ తలుపుకు దగ్గరగా వేసిన కుర్చీలో కూర్చొని వారిద్దరూ మాట్లాడుకోవచ్చని జైలు వార్డెన్ సూచించాడు. కొంత దూరంలో నిల్చున్న గార్డు వారిద్దరి మధ్య సంభాషణ వినేందుకు చెవులు రిక్కించాడు. చనిపోబోతున్న ఖైదీకి, అతని తరపున పోరాడి ఓటమి పాలైన లాయర్‌కూ జరగబోతున్న సంభాషణ అది.

ఎలాంటి సందేహం లేకుండా తానూ, శాక్కో నిర్దోషులమనీ, తమకు ఏ నేరాలతో సంబంధం లేదనీ మరణ వాంగ్మూలం ఇచ్చాడు వాంజెట్టి. ప్రశాంత గంభీర వదనంతో, నిజాయితీతో వాంజెట్టి చెప్పిన ఆ మాటలను తాను పూర్తిగా విశ్వసించానని థామ్సన్ ప్రకటించాడు. **'వాంజెట్టీస్ లాస్ట్ స్టేట్‌మెంట్'** శీర్షికన ఈ సంభాషణను 1928 ఫిబ్రవరిలో అట్లాంటిక్ మంత్లీ పత్రిక ప్రచురించింది.

తాను అరాచకవాదిని కాకపోతే శిక్షించబడి వుండేవాడిని కాదని మరోసారి చెప్పాడు వాంజెట్టి. మిక్ బోడాను కలిస్తే ఫలితమేదైనా ఉంటుందా అని థామ్సన్ ప్రశ్నించగా అతని గురించి తనకు పెద్దగా తెలియదనీ, అతను మంచివాడేననీ చెప్పాడు. తాము నిర్దోషులమని అతను చెప్పగలిగే అవకాశం ఉంటుందని మాత్రం అన్నాడు.

సంభాషణను హింస-ప్రతిహింసల వేపు మళ్ళించాడు థామ్సన్. హింస-ప్రతిహింసలున్న చోట వాస్తవాలకు తక్కువ అవకాశాలుంటాయని అర్థమైందని థామ్సన్ చెప్పాడు. హింస ద్వారా, ప్రతీకార చర్యల ద్వారా పగ సాధించవద్దని తన కామ్రేడ్స్‌కు పిలుపునిస్తూ బహిరంగంగా ప్రకటించమని థామ్సన్ కోరగా అందుకు వాంజెట్టి సున్నితంగా తిరస్కరించాడు. తనకు జరిగిన అన్యాయానికి వ్యక్తిగత కక్ష తీర్చుకోవాలని కోరుకోవడం లేదనీ, ఆ విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనీ చెప్పాడు. అయితే, చరిత్ర గురించి తన అవగాహన మేరకు మానవజాతి పురోగమించేందుకు చేసే ఏ మహత్తర పోరాటమైనా బలీయమైన శక్తినీ, దురన్యాయాన్నీ ఢీకొని నిలదొక్కుకోవాల్సి వుంటుందన్నాడు. అందువల్ల, హింసను త్యజించమని తన స్నేహితులను కోరలేనని చెప్పాడు. అయితే ఆ పోరాటాల్లో స్త్రీలకూ, పిల్లలకూ ఏ ఇబ్బందైనా జరగడాన్ని తాను వ్యతిరేకిస్తున్నా నన్నాడు. ఆశ నిరాశల మధ్య తాము గడిపిన ఏడేళ్ళ జైలు జీవితంలో ఉన్న క్రూరత్వాన్ని గుర్తు చేసుకోమని వాంజెట్టి థామ్సన్‌ను కోరాడు. తనపై, శాక్కోపై అమలయిన క్రూరత్వాన్ని శిక్షించకుండా వదిలేస్తే ఎలా అని ప్రశ్నించాడు వాంజెట్టి. మానవజాతి ఔన్నత్యం కోసం జరిగిన పోరాటాల గురించీ, సోక్రటీస్, గెలీలియో, గియోర్డనొ బ్రూనొ గురించీ వాంజెట్టి ప్రస్తావించాడు. క్రైస్తవ మతం మతాధిపతుల భోగ్యంగా మారిపోయిందని విమర్శించాడు. చనిపోయే ముందు శత్రువులను క్షమించమని వాంజెట్టిని అంగీకరింపజేసేందుకు థామ్సన్ చాలా ప్రయత్నించాడు. శిలువపై ఉండి కూడా జీసస్ తన శత్రువులను క్షమించిన సంగతిని గుర్తు చేశాడు. చెప్పనలవి కాని రీతిలో తమను ఏడేళ్ళు హింసించిన వారిని ఎలా క్షమించగలమని ఎదురు ప్రశ్న వేశాడు వాంజెట్టి. నచ్చ జెప్పేందుకు ప్రయత్నించాడు థామ్సన్. కాసేపు మౌనం వహించి థామ్సన్ కళ్ళలోకి సూటిగా చూశాడు వాంజెట్టి. ఆ విషయం మరోసారి ఆలోచిస్తానని చెప్పాడు. కొంతసేపు చర్చ రకరకాల విషయాల మీదికి మళ్ళింది. దోపిడీ వ్యవస్థకు హింసాయుధమే సరైన సమాధానమని చెప్పాడు వాంజెట్టి. ఆ అభిప్రాయంతో థామ్సన్ ఏకీభవించలేదు.

> వాంజెట్టి మనోబలం చూసి, అతని విషయ పరిజ్ఞానం చూసి నేను ముగ్ధుణ్ణయ్యాను. కరడు గట్టిన వాడిలా అతను మాట్లాడలేదు. తన అభిప్రాయాలు సరైనవని గాఢంగా నమ్మినప్పటికీ తాను అంగీకరించలేని అభిప్రాయాలను ఓపిగ్గా విని ఆలోచించగలుగుతున్నాడు.*

---

* విలియం థామ్సన్: వాంజెట్టీస్ లాస్ట్ స్టేట్‌మెంట్

చనిపోతున్నానన్న భయం వాంజెట్టిలో ఏ మాత్రం కనిపించలేదు. ఒక 'మహామేధావి'ని, 'నిస్వార్థజీవి'ని, 'ఉన్నతాదర్శాల కోసం పోరాడుతున్న వాడి'ని వాంజెట్టిలో చూశానని థామ్సన్ చెప్పాడు.

ఆ తర్వాత శాక్కోతో థామ్సన్ సంభాషణ త్వరగానే ముగిసింది. తాత్విక చింతనతో ఉండే వాంజెట్టితో థామ్సన్ కున్నంత అనుబంధం శాక్కోతో లేదు. పైగా శాక్కోకూ ఆయనకూ మధ్య గతంలో కొన్ని అభిప్రాయబేధాలు పొడచూపాయి. అవి తమ వ్యక్తిగత సంబంధాన్ని ప్రభావితం చేయబోవని శాక్కో చెప్పాడు తన కోసం థామ్సన్ పడిన శ్రమకు శాక్కో కృతజ్ఞతలు తెలిపాడు

శాక్కో కూడా నిర్భయంగా ఉన్నాడనీ, మృత్యు భయం అతనిలో ఏ మాత్రం కన్పించలేదని థామ్సన్ రాశాడు. శాక్కో వ్యక్తిత్వం పూర్తి నిజాయితీతో కూడుకున్నదనీ, తమ మధ్య అంతకు ముందు ఎర్పడిన బేధాభిప్రాయాలను ప్రత్యేకంగా ప్రస్తావించక పోవడం అతని ఉదాత్తతను సూచిస్తోందని థామ్సన్ భావించాడు. కోర్టులో లాయర్లు చేసే ప్రయత్నాలన్నీ పనికి మాలినవనీ ఏ దోపిడీ వ్యవస్థా సంస్థా తనకు న్యాయం చేయదని గతంలో థామ్సన్‌తో శాక్కో వాదించాడు. థామ్సన్ మాత్రం న్యాయం తప్పక జరుగుతుందని నమ్మే వాడు. కానీ, ఇప్పుడు థామ్సన్ నమ్మకం తప్పు అని రుజువైంది. దాన్ని గురించి శాక్కో ప్రస్తావించక పోవడాన్ని శాక్కో గొప్పతనంగా థామ్సన్ అభివర్ణించాడు.

# 11

సాయంత్రం ఐదయింది. ఫెడరల్ జిల్లా జడ్జి జేమ్స్ లోవెల్ డిఫెన్స్ లాయర్ల పిటీషన్ తీసుకుని చదువుకున్నాడు. వారు చెప్పింది విన్నాడు. హార్వర్డ్ ప్రెసిడెంట్ లోవెల్‌కు ఈయన బంధువే. జడ్జి లోవెల్ అనేక న్యాయశాస్త్ర గ్రంధాలు తిరగేశాడు. తనకు శిక్ష నిలిపేసే అధికారమున్నట్టు ఎక్కడా కన్పించలేదని చెప్పాడు.

లాయర్ల కార్లు అక్కడి నుండి మరోసారి నేరుగా జస్టిస్ హోమ్స్ ఇంటి వేపు పరిగెత్తాయి మూడోసారి వేసిన పిటీషన్‌ను కూడా తోసి పుచ్చాడు హోమ్స్. ఇక మిగిలుంది కొద్ది గంటలే.

గవర్నర్‌ను కలిస్తే ప్రయోజనం ఉండొచ్చును కున్నాడు లాయర్ ముస్మానో.

నిరసన ధ్వనులతో హోరెత్తుతున్న మానవ సముద్రం మధ్య దీవిలా కనిపించింది గవర్నర్ కార్యాలయం. ఉదయం నుంచీ వేల మంది జనం భూమి బద్దలయ్యేలా, ఆకాశం చిల్లులు పడేలా కోటి గొంతుకల ఆక్రోశాన్ని వినిపిస్తున్నారు. శతకోటి జలపాతాల ఘోషను వినిపిస్తున్నారు. బోస్టన్ మైదానంలో అసంఖ్యాక జనం నేల ఈనినట్టు దిక్కులు పిక్కటిల్ల జేస్తున్నారు. కార్మికులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు, యుద్ధ

యోధులు, ఆలోచించగలిగిన అన్ని రంగాల ప్రజలు అక్కడున్నారు. శాక్కో, వాంజెట్టిలను ఆ రాత్రి చంపనీయకూడదని కంకణం కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ హౌస్ నుంచి చార్లెస్ టౌన్ జైలు దాకా 'మృత్యు ప్రస్థానం' (Death March) చేస్తున్నారు. గవర్నర్‌నూ, జడ్జీలనూ శపిస్తున్నారు. ఒకవైపు పోలీసులు అరెస్టు చేసి హింసిస్తూ కేసులు పెట్టి లాకప్‌లలో బంధిస్తుంటే, మరో వేపు మహాజన స్రవంతి కదిలొస్తూనే వుంది.

"శాక్కో, వాంజెట్టిలు హత్య చేయబడితే అమెరికన్లు ప్రపంచం ముఖంలోకి సూటిగా చూడలేరు" అనే వాక్యం రాసున్న బోర్డు పట్టుకొని ఒక మహిళ ప్రిన్స్‌టన్ పట్టణం నుంచి బోస్టన్ నగరానికి పాదయాత్ర జరిపింది. శాక్కో, వాంజెట్టిల బదులుగా తాను ఆహుతి అవుతానని ప్రకటించిన ఒక ఉపాధ్యాయురాలిని ఆ రోజు బోస్టన్‌లో ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. మృత్యు ప్రస్థానంలో పాల్గొన్న 172 మంది ప్రదర్శకులను అరెస్టు చేశారు. ప్రసిద్ధ కవయిత్రి ఎడ్నామిల్లే, ప్రొఫెసర్ హయస్, 'అమ్మ' బ్లూర్, నీగ్రో కమ్యూనిస్టు నాయకుడు విలియం పాటర్‌సన్ అరెస్టయిన వారిలో వున్నారు. అల్లరికి పాల్పడుతున్నారని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని 89 మందిపై కేసులు పెట్టి ఐదు నుంచి పది డాలర్ల జరిమానా వేసి వదిలిపెట్టారు

ఆ రోజు బోస్టన్ నగర పోలీసు బలగమంతా అప్రమత్తంగా ఉంది. బందోబస్తులో తలమునకలుగా ఉంది. గవర్నర్ ఫుల్లర్ కార్ల షోరూం మొదలుకొని అన్ని దుకాణాల దగ్గర, ప్రభుత్వ భవనాల దగ్గర పోలీసు కాపలా ఏర్పాటు చేశారు. హెలికాప్టర్లలో ప్రయాణిస్తూ ఆకాశం నుంచి బోస్టన్ వీధులను తనిఖీ చేస్తున్నారు. పోలీసుకార్లు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూనే వున్నాయి

ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు గవర్నర్ తన కార్యాలయానికి వచ్చాడు. సంతోషంగా జర్నలిస్టులతో మాట్లాడాడు. పలువురు మేధావులు ఆయనను కలిసి శిక్ష వాయిదా వేయమని రోజంతా అభ్యర్థిస్తూనే వున్నారు. గవర్నర్‌కు ఆ రోజు చేరిన తొమ్మిది వందల టెలిగ్రాంలలో ఆరు వందలు మరణశిక్షను నిలిపేయమని కోరాయి.

ఆ రోజు లూగియా రోమన్ కాథలిక్ చర్చి బిషప్ కార్డినల్ ఓ కోనెల్‌ను కలిసింది. ఆమెను సాదరంగా ఆహ్వానించిన కోనెల్ తర్వాత విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాజ్య వ్యవహారాలు, చర్చి వ్యవహారాలు వేర్వేరనీ, శాక్కో-వాంజెట్టి కేసులో జోక్యం చేసుకోజాలనని ప్రకటించాడు.

ప్రముఖ కవయిత్రి ఎడ్నా సెయింట్ విన్సెంట్ మిల్లె జస్టిస్ డినైడ్ ఇన్ మాసాచూసెట్స్ పేరిట రాసిన కవిత ఆ రోజు న్యూయార్క్ వరల్డ్ దినపత్రికలో ప్రచురించబడింది. ఆమె స్టేట్ హౌస్ ముందు పికెటింగుకు నాయకత్వం వహిస్తోంది. ఆమె చేతిలో ఉన్న అట్ట ముక్క మీద **వీళ్ళిద్దర్నీ చంపివట్టయితే మసాచూసెట్స్‌లో న్యాయం చనిపోయినట్టే** అని రాసుంది. ఆమె ఆ రోజు గవర్నర్‌కు రాసిన లేఖలో యిలా అంది:

*ఈ రాత్రి ప్రపంచం ప్రశ్నాపూరితమైన ఈ రాత్రి, ఘాటైన సందేహభరిత వాయువును మసాచూసెట్స్ ప్రతి ఉచ్ఛ్వాసలో శ్వాసకోశాల్లోకి పీలుస్తున్న వేళ, యూరప్ చూపులన్నీ పశ్చిమ దిశగా మళ్ళి మసాచూసెట్స్ వైపూ, వేదనా భరిత అమెరికా వైపూ సారించిన సమయాన- మీరింకా దాన్నే నిజమంటారా? మా సందేహపు క్రీనీడైనా మీ మనసును వికలం చేయదా? ఎందుకంటే మీ శక్తి ఎంత గొప్పదయినా అది ఒక మనిషికున్న బలహీనమైన శక్తే ఈ సమయంలో మీ శక్తి కంటే ఉన్నత శక్తి అవసరం లేదా?*

*లక్ష గొంతుకలతో మిమ్మల్నడుగుతున్నాము. మా సందేహాన్ని నివృత్తి చేయండి. మీ ఉన్నతాధికారం పెట్టగలిగే క్షమాభిక్ష పెట్టండి.*

*ఈ రాత్రి మసాచూసెట్స్‌కు ఒక మహా మనిషి అవసరం మీరే ఆ మనిషయ్యేందుకు ఇంకా సమయం మించి పోలేదు*

ఆమెకు గవర్నర్ ఆ రోజు ఇంటర్వ్యూ ఇచ్చాడు. కానీ ఆమె అభ్యర్థనకు గవర్నర్ మనసు కరగలేదు.

గవర్నర్ గదిలోకి వెళ్ళిన లాయర్ ముస్మానోను ఆయన కస్టమర్‌ను ఆహ్వానించినట్టుగా ఆహ్వానించాడు. పరిస్థితిని వివరించాడు ముస్మానో

అంతా విన్న గవర్నర్ ఏమన్నాడంటే -

*"నాకీ పద్ధతి అర్థం కావడం లేదు ముస్మానో! మొదట థామ్సన్ వచ్చాడు. 'నాకు కేసు వివరాలు క్షుణ్ణంగా తెలుసున'న్నాడు థామ్సన్ వెళ్ళిపోయాక హిల్ లోపలికొచ్చాడు. శిక్ష అమలును నిలిపేయమని చివరి సారి అడుగుతున్నానన్నాడు. హిల్ వెళ్ళాడు ముస్మానో వచ్చి మళ్ళీ శిక్ష నిలిపేయమంటున్నాడు."*

ఇదంతా చాలా మృదువుగా మాట్లాడుతూ గవర్నర్ తనెంత గొప్పగా మాట్లాడానో చూడమన్నట్టు తన లాయర్ వాగ్గిన్స్ వైపు చూశాడు. వాగ్గిన్స్ పెద్దగా నవ్వాడు

*"యువర్ ఎక్సలెన్సీ! మీరన్నదాన్ని విమర్శించాల్సిన అవసరం లేదు. నాకన్నా ముందొచ్చిన లాయర్లు చేసిన దాన్ని కూడా విమర్శించాల్సిన పని లేదనుకుంటా ఏమైనప్పటికీ, పెద్ద లాయర్లు చిన్న లాయర్లు అన్న ప్రశ్న కాదు కానీ ఇది ఇద్దరు వ్యక్తుల జీవితాలకు సంబంధించిన విషయం."*

*"ఇంకో రకంగా చెప్పాలంటే, నీకు మరోచోట సహాయం దొరక్క పోతే ఇక్కడికి వస్తావు.'*

గవర్నర్ మళ్ళీ వాగ్గిన్స్ వైపు చూశాడు. వాగ్గిన్స్‌మళ్ళీ నవ్వాడు.

*"కోర్టులెలా వున్నాయి? '*

గవర్నర్ వ్యంగ్యానికి ముస్మానో మతి పోయింది. కానీ చనిపోబోతున్న తన క్లయింట్ల కోసం అక్కడున్నాడాయన.

*"యువర్ ఎక్స్‌లెన్సీ! తొమ్మిది మంది సుప్రీం కోర్టు న్యాయమూర్తుల్లో నలుగురిని కనిపెట్టగలిగాం. మిగిలిన ఐదుగురి ఆచూకీ ఇంకా మాకు తెలియదు*

*'మీ క్లయింట్లు మన రాష్ట్రంలో వున్న అన్ని కోర్టుల వల్లా లాభం పొందలేదా?'*

*"అవును గవర్నర్ కానీ నిజాన్ని కనిపెట్టేందుకోసం రాష్ట్రంలో ఉన్న అధికార యంత్రాంగంలో మీరూ భాగమే. ఎక్కడ ఎలా జరిగినా ఈ కేసులో జరిగిన ఏ దోషాన్నయినా సరి చేయడం మీ అధికార పరిధిలోదే కదా'*

*'ముస్మానో! శిక్ష నిలిపేయాలని అటార్నీ జనరల్‌ను నువ్వు అంగీకరింపజేస్తే నేను నిలిపేస్తాను."*

చివరగా గవర్నర్ చెప్పిన మాటలు ముస్మానో చెవులకు సంగీతంలా వినిపించాయి. ఆశలు చిగిర్చాయి. వెంటనే ముస్మానో మసాచూసెట్స్ అటార్నీ జనరల్ ఆర్థర్ రీడింగ్ దగ్గర ప్రత్యక్షమయ్యాడు రెండు గంటల పాటు రీడింగ్‌తో వాదించాడు. తన క్లయింట్ల శిక్ష నిలిపేందుకు సిఫార్సు చేయమని ముస్మానో ఆయన్ను బ్రతిమాలాడు ఏడేళ్ళకు పైగా వేచి వున్న ప్రభుత్వం మరో రెండు నెలలు ఆగగలిగితే సుప్రీం కోర్టులో విషయం తేలుతుందని చెప్పాడు. ప్రపంచ ప్రజానీకాన్నుద్దేశించి ప్రసంగిస్తున్నట్టుగా ఉద్వేగభరితమైన ఉపన్యాసం చెప్పాడు. కేవలం చట్ట పరమైన వాదనకు సమయం కాదది

బాగా ఆలోచించాక గవర్నర్‌కు తన అభిప్రాయాన్ని చెప్తానన్నాడాయన.

ముస్మానో తిరిగి స్టేట్ హౌస్‌కు చేరుకున్నాడు. మళ్ళీ గవర్నర్‌ను కలిసి అభ్యర్థించాడు. ప్రాసిక్యూషన్ ఆరోపణ ఎలా తప్పో ఎత్తి చూపాడు. శాక్కో, వాంజెట్టి నిర్దోషులని భవిష్యత్తులో తేల్చేందుకు ఎక్కువ అవకాశాలున్నాయనీ, అందువల్ల సరిదిద్దుకో వీల్లేని భయానకమైన తప్పిదాన్ని చేయొద్దని ప్రాధేయపడ్డాడు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడే వరకూ ముద్దాయిలను ప్రాణాలతో వుంచితే పోయేదేమీ లేదని చెప్పాడు

ముస్మానో గవర్నర్‌తో మాట్లాడుతుండగా రోజ్, లూగియా అక్కడికొచ్చారు. అంతకు ముందే వాళ్ళు జైలును సందర్శించి ఖైదీలతో చివరి సారి మాట్లాడివచ్చారు.

ముస్మానో వాదన విని గవర్నర్ చలించలేదు. ఉద్రేక పడలేదు.

*"కేసు రికార్డంతా చదివాను నేనెక్కడ పొరపాటు పడ్డానో చూపగలిగితే ఇష్టపూర్తిగా నా అభిప్రాయాలు మార్చుకుంటాను కానీ నేను సరిగానే వ్యవహరిస్తున్నాను కుంటాను."*

గవర్నర్ అలా అనడంతోనే రోజినా ఆవేశం కట్టలు తెంచుకుంది.

*"గవర్నర్ ఫుల్లర్! మీరు సాక్ష్యాలన్నీ పరిశీలించానని చెప్తారు కానీ మీరు మా ఇంటికి ఎప్పుడూ రాలేదు. నిక్ ఎలాంటి జీవితం గడిపాడో ఎందుకు పరిశీలించరు? నేను నాజూకైన దాన్ని కాను. నాకు చదువు లేదు కానీ నిక్ నన్ను ప్రేమించినట్టుగా ఏ మగవాడైనా ఒక స్త్రీని*

ప్రేమిస్తే తన సంపదను కూడా ఆమెతో పంచుకుంటాడని నాకు తెలుసు పదిహేను వేల డాలర్లు దొంగిలించిన ముఠాలో నిక్ ఉన్నాడనీ, తన వాటా తాను సంపాయించాడనీ మీరంటారు. నిక్ ఆ దోపిడిలో పాల్గొని వుంటే తన వాటా సొమ్మును ఇంటికి తెచ్చి నాకు చూపించి వుండేవాడు బ్యాంకులో వేసేందుకు తన జీతాన్ని ఎప్పుడూ నాకే ఇచ్చేవాడు కార్మికుడిగా తన జీతం డబ్బు తప్ప 1920 ఏప్రిల్ 15న గానీ, ఆ తర్వాత ఏ రోజైనా గానీ నిక్ డబ్బును ఏ మాత్రం కూడా ఇంటికి తేలేదు గవర్నర్! గవర్నర్! నిక్ ఎంత నిర్దోషో మీరు చూడరా?'

గవర్నర్ మొహంలో ఏ మాత్రం జాలి, దయ కన్పించక పోవడంతో రోజినా తిరిగి చెప్పడం మొదలు పెట్టింది·

"గవర్నర్! మీకు కుటుంబం ఉంది ఒక సంసారి లాగా ఈ కేసును చూడండి. లోలా ఆండ్రూస్ లాంటిదాని మాటలు నమ్మి నా భర్తను, ఒక సంసారిని చంపనిస్తారా? నా భర్త నాతో ఎప్పుడూ మంచిగా, విశ్వసనీయంగా ప్రవర్తించేవాడు ఇంటి పట్ల ఎంతో శ్రద్ధగా ఉండేవాడు బందిపోట్లు వ్యవహరించే పద్ధతి అదేనా? ఆ రకమైన కథ మీద ఆధారపడి నా భర్తను మీరెలా చంపగలరు? కారు కింద నా భర్తను చూశానని మిస్ ఆండ్రూస్ చెప్తుంది. నా భర్తకు కార్ల గురించేమీ తెలియదు. ఎప్పుడూ కారు నడిపి ఎరగడు బాగు చేసి ఎరగడు. గవర్నర్! మీరు కార్ల వ్యాపారం చేస్తారు కదా. నా భర్తను మీరు పరీక్షించవచ్చు కదా? ఆయనకు కారుల గురించి ఏమైనా తెలుసేమో తెలుసుకోండి ఆయనకు ఏమీ తెలియకపోతే, ఆయన లోలా ఆండ్రూస్ చూసిన మనిషి కాలేదు-
పాపం ఈమె వాంజెట్టి చెల్లెలు. ఈమె అన్నయ్యను మీరెలా చంపగలరు? ఆయన నివసించిన . ప్లిమత్‌లో ఒక్కరు కూడా ఆయనొక చెడువని చేశాడని చెప్పనంత మంచి మనిషి ఆయన ఆ హత్యలు చేసిన వాళ్ళు నిర్దాక్షిణ్యమైన వాళ్ళని మీకు తెలుసు."

చెక్కిళ్ళపై నుంచి కన్నీళ్ళు రాలుతూ నేలమీది తివాచీని తడుపుతుంటే లూగియా కూడా గవర్నర్‌ను వేడుకుంది. ఆమె చెప్తున్న మాటలను వెంటనే ఇంగ్లీషులోకి అనువదించి ముస్మానో చెప్పాడు:

"యువర్ ఎక్సలెన్సీ! మా అన్నయ్యకు మీ మీద నమ్మకముంది మీరు కరచాలనం చేసినప్పుడు ఒక సోదరుడి కరచాలనంగా అతను అందుకున్నాడు. అతను ఖచ్చితంగా నిర్దోషి. దాని గురించి సందేహించనక్కర్లేదు దేవుడు దాన్ని పుస్తకాల్లో రాసి పెట్టాడు. ఈ సుదీర్ఘమైన కేసులో ఒకే ఒక్క సమస్యేమిటంటే దేవుడి చేతి రాతను అధికారంలో ఉన్నవాళ్ళు చదివేలా చేయడమే -
ప్లీజ్, ప్లీజ్, ప్లీజ్ గవర్నర్! మా అన్నయ్యను రక్షించండి. చనిపోవాల్సినంత వయసు లేదతనికి. గొప్ప మేధావి. సహృదయుడు నిర్దోషి. ప్లీజ్ గవర్నర్! శాక్కో మంచివాడు. అతన్ని కూడా రక్షించండి."

లాయర్లకు, జడ్జీలకు అర్థమైన విధంగా కేసు వారికి అర్థం కాదనీ, తానీ విషయంలో చేయగలిగిందేమీ లేదని రోజ్, లూగియాలతో గవర్నర్ చెప్పాడు.

*"కానీ గవర్నర్, మీరు కొంత చేయగలరని నాకు తెలుసు. మా అన్నయ్యను, శాక్కోను రక్షించేందుకు మీకు అత్యున్నతాధికారం ఉందని వాళ్ళు నాకు చెప్పారు. మీరు గవర్నర్. నా బార్టోని తిరిగి ఇటలీకి తీసుకువెళ్ళనివ్వండి. నేనొచ్చేముందు మా నాన్న 'బార్టోని వెనక్కి తీసుకురా' అని చెప్పాడు."*

*"అమెరికాను మంచి అవకాశాలున్న దేశంగా, స్వేచ్ఛా భూమిగా, ఆనందానికి న్యాయానికి దయకు నిలయంగా మేం ఇటలీలో భావిస్తాం. మీకు క్షమాభిక్ష పెట్టే అధికారం ఉంది. ఈ ఇద్దరు నిరుపేదలకు, హింసాపీడితులకు, ఇప్పటికే సుదీర్ఘమైన ఏడేళ్ళు బాధలనుభవించిన వాళ్ళకు మీరు క్షమాభిక్ష అనుగ్రహించలేరా? పందొమ్మిదేళ్ళ తర్వాత నేను బార్టోను చూసినప్పుడు నా హృదయం ఎలా ముక్కలైందో మీరు ఊహించుకోండి. బార్టో బలహీనంగా, సన్నగా ఉన్నాడు. నా గురించీ, తన కోసం బాధపడుతున్న లక్షలాది జనం గురించి బాధలో మునిగున్నాడు. అమెరికాలోని ఈ మహా మంచి ప్రభుత్వం వాళ్ళను ఇప్పటికే కావల్సినంత హింసించలేదా? ఓ! గవర్నర్! మీ ముందు మోకరిల్లి వేడుకుంటున్నా. అమెరికాకు దయామయ భూమిగా కాక, క్రూరమైన ప్రదేశంగా పేరు తేవద్దు. నేను దయాభిక్ష పెట్టమని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నా. దయాభిక్ష పెట్టండి."*

లూగియా ఉద్వేగంతో కూలబడిపోయింది.

*"క్షమించాలి. జరిగిన దానికి బాగా విచారిస్తున్నాను. అధికార పరిధికి లోబడి నేను చేయగలిగిందేమీ లేదు."*

గవర్నర్ రాతి విగ్రహంలాగా మాట్లాడాడు.

లూగియా ఏడ్చింది. రోజినా, ముస్మానో ఆమెను చెరో వేపూ పట్టుకుని ముందు గదిలోకి తీసుకెళ్ళారు. అక్కడ ఫెలికని, మిసెస్ జెస్సికా హెండర్సన్, గార్డెనర్ జాక్సన్, ఆయన సోదరి డాక్టర్ ఎడిత్ జాక్సన్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

ముస్మానో మళ్ళీ లోపలికెళ్ళాడు. అటార్నీ జనరల్ సిఫార్సు చేస్తే తను ఏదైనా చేయగలుగుతానని అంతకు ముందు చెప్పిందే మళ్ళీ చెప్పాడు గవర్నర్. ముస్మానో నిస్పృహాయంగా బయటికి వచ్చాడు. అప్పటికి రాత్రి పదకొండు గంటలయింది. మరో గంట గడిస్తే తలారి మీట నొక్కి, శాక్కో, వాంజెట్టిలను బలి చేస్తాడు. ఏడేళ్ళ పోరాటం ముగుస్తుంది. గవర్నర్‌గానీ, ఏ న్యాయమూర్తైనా గానీ 'స్టే' అనే అక్షరాల కింద సంతకం చేయక పోతే మరో గంటలో శాక్కో, వాంజెట్టిల ప్రాణాలు గాల్లో కలుస్తాయి.

కాసేపటికి ముస్మానోను లోపలికి రమ్మని గవర్నర్ కబురు పెట్టాడు.

*"ముస్మానో! ఇంతకు ముందే అటార్నీ జనరల్ నాకు లేఖ పంపాడు-"*

ముస్మానోలో ఉత్కంఠ పెరిగింది.

*"-మరణశిక్ష నిలిపేందుకు ఆయన సిఫార్సు చేయలేదు "*

ముస్మానో ఖిన్నుడయ్యాడు.

*'మీరేమంటారు గవర్నర్ ఫుల్లర్? '*

*"నాదీ అదే నిర్ణయం".*

*"ఆ మీ నిర్ణయం మీద మీరు ఎల్లకాలం నిలబడలేరు "*

*"అవును".*

ముస్మానో నీరసంగా బయటికి నడిచాడు. అక్కడున్న వాళ్ళ ముఖాల్లో చావు భయం తాండవిస్తోంది. స్టేట్‌హౌస్ బయటికి రాగానే వాళ్ళను పత్రికా విలేఖరులు చుట్టు ముట్టారు.

***"కథ ముగిసిందని చెప్పిన లాయర్ ముస్మానో - బోస్టన్ 11:07"***

అసోసియేటెడ్ ప్రెస్ విలేఖరి హడావిడిగా వార్త పంపాడు.

# 12

ప్రజా సైన్యం చుట్టుముట్టిన కోటలా వుంది చార్లెస్ టౌన్ జైలు. ఎనిమిది వందల మంది పోలీసులు నానా రకాల వాహనాల్లో తిరుగుతూ కాపలా కాస్తున్నారు. కొందరు గుర్రాల మీద మరి కొందరు మెషిన్‌గన్స్‌చేతబట్టి జైలు ప్రహరీ గోడ మీద నిల్చుని చుట్టూ దృక్కులు సారిస్తున్నారు. ఏ క్షణంలో ఏం జరిగినా ఎదుర్కొనేందుకు అప్రమత్తులై వున్నారు. బోస్టన్ హార్బర్‌లో కూడా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటైంది. జైలు దగ్గర్లో ఉన్న నదిలో పోలీసు బోట్లు తిరుగుతున్నాయి. జైలుచుట్టూ తాళ్ళు కట్టి బారికేడ్లు ఏర్పాటు చేశారు. జైలు ప్రధాన ద్వారం నుంచి వెయ్యి అడుగుల దూరంలో జనాన్ని ఆపేశారు. ఉద్రేకపూరితులైన ప్రజా సముద్రపు నినాదాల హోరుతో ఆ ప్రాంతం యుద్ధసీమలా ఉంది. వందలాది ప్రైవేటు వాహనాలు ఆ ప్రదేశమంతా ఆగి వున్నాయి. జైలు కప్పు మీది సెర్చిలైట్లు భయానకంగా వెలుగుతున్నాయి. జైలు దగ్గరలో ఉన్న బ్రిడ్జి మీద రాకపోకలను నిషేధించారు. సమీపంలోని మురికి వాడల్లో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు.

ఆ రోజు జైల్లో జరగనున్న హింసాకాండ వార్తను తక్షణం అందించేందుకు ప్రత్యేకంగా ఒక ప్రెస్ రూంను ఏర్పాటు చేశారు. అమెరికా తంతి తపాలా శాఖ ఆ రూంలో పదహారు టెలిఫోన్ కనెక్షన్లను ఏర్పాటుచేసింది. వాటిల్లో నాలుగింటిని విదేశీ విలేఖరుల కోసం కేటాయించారు. పత్రికా విలేఖరులతో ఆ గది కిక్కిరిసి పోయింది.

స్టేట్‌హౌస్ నుంచి చార్లెస్ టౌన్ జైలుకు ముస్మానో చేరే సరికి రాత్రి పదకొండు గంటల ఇరవై ఐదు నిమిషాలయింది. నేరుగా జైలు వార్డెన్ గదికి వెళ్ళాడు మరణశిక్ష అమలు జరపబోయేందుకు వార్డెన్ వెళ్ళబోతున్నాడు వార్డెన్ గదిలోకి హడావిడిగా పరిగెత్తుకొచ్చిన ముస్మానో ఆయన దారికి అడ్డంగా నిలబడ్డాడు.

"వార్డెన్! ఈ రాత్రి మీరీ పని చేయనక్కర్లేదు మరణశిక్ష అమలు జరిపేందుకు చట్ట ప్రకారం మీకు వారం రోజుల గడువుంది.* ఈ రాత్రికి మీరు శిక్ష నిలిపేయండి. న్యాయస్థానాలు రేపు శిక్షను నిలిపేస్తాయని నేను ఖచ్చితంగా చెప్పగలను మా కేసు అమెరికా సుప్రీం కోర్టులో ఉంది మీరు దాన్ని వెంటనే చేయాల్సిన అవసరం లేనప్పుడు తిరిగి సరిదిద్దలేని చర్య చేపట్టవద్దు '

గబగబా చెప్పుకు పోయాడు ముస్మానో. వార్డెన్ హెంఢ్రీ తన పని తాను చేసుకుపోయే మూడ్‌లో ఉన్నాడు.

'మిస్టర్ ముస్మానో! క్షమించండి మీ అభ్యర్థనను నేను మన్నించలేను ఇంకా చెప్పాలంటే- వాళ్ళు చావడానికి సిద్ధంగా ఉన్నారు '

ఆశ్చర్యపోయాడు ముస్మానో.

"గుడ్ గాడ్! చావడానికి సిద్ధం!? వాళ్ళిద్దరూ మరణించబోవడం లేదని చెప్తే వాళ్ళు నిరాశపడతారని మీరనుకుంటున్నారా?'

'వాళ్ళు తర్వాతైనా ఈ వారంలో చావాల్సిందే కదా! '

మీకెలా తెలుసు? కేసు ఇంకా కోర్టులో నడుస్తోంది వాళ్ళను చం వద్దని రేపు కోర్టులు చెప్పినట్టయితే వాళ్ళిద్దర్నీ మీరెలా చంపగలరు? '

"డెత్ వారెంట్ నా దగ్గరుందనీ ఆగస్టు 22తో ప్రారంభమయ్యే వారంలో వాళ్ళను చంపమని అది నన్నాదేశిస్తోందని మాత్రమే నాకు తెలుసు ఆ వారం ప్రారంభమైంది. నా విధి నిర్వహణలో నేనున్నాను. '

"కానీ వార్డెన్ మీ విధి మిమ్మల్ని భూతంగా ఉండమని బలవంతపెట్టదు రెండు కోడిపిల్లలనో, రెండు కుక్కలనో చంపినట్టుగా మనుషులను చంపడం గురించి మీరెలా మాట్లాడగలరు? వాళ్ళు కుక్కలూ, కోడి పిల్లలూ అయినప్పటికీ కోర్టులలో వాళ్ళ అప్పీలు పెండింగ్‌లో ఉండగా కోర్టు నిర్ణయం మీరు తెలుసుకునే వరకూ చట్ట ప్రకారం మీరు వాళ్ళను చంపలేరు '

"కాదు. ఈ విషయాన్ని ప్రభుత్వం నాకు విడిచి పెట్టలేదు."

---

* అమెరికా చట్టాల ప్రకారం మరణశిక్ష అమలుకు ఒక తేదీ నుంచి వారం రోజుల గడువు నిర్ణయిస్తారు ఆ వారంలో ఏ రోజున శిక్ష అమలు చేయాలో నిర్ణయించే అధికారం జైలు వార్డెన్‌ది ఈ కేసులో వారంలో మొదటి రోజునే శిక్ష అమలు చేయాలని నిర్ణయించారు

ఈ మాటలంటూ వార్డెన్ ముందుకు సాగాడు. ముస్మానో ఆయన వెంట పడ్డాడు హడావిడిగా ఆయన పక్కనే నడుస్తూ మాట్లాడుతున్నాడు. ఒక గేటు దగ్గర వార్డెన్ ఆగిపోయాడు. అది దాటి ముస్మానో లోపలికి రాకూడదని చెప్పాడు. వార్డెన్ కళ్ళలోకి సూటిగా చూశాడు ముస్మానో.

"వార్డెన్! ఈ విషయాన్ని మీకు వదిలిపెట్టలేదని అనడం ద్వారా మీరు చెప్పదల్చిందేమిటి?'

వార్డెన్ ఇబ్బంది పడ్డాడు మెల్లగా జవాబిచ్చాడు.

'రేపేదన్నా జరిగి ఈ కేసు మళ్ళీ మొదలెత్తుకుంటే, ఈ కేసును ముగించనందుకు వాళ్ళు నన్ను తప్పు పడతారు "

"వార్డెన్ హెండ్రీ! చట్ట బద్ధతకు వ్యతిరేకంగా జరిగే పందెం కాదిది. ఏదైనా జరిగి రేపు ఈ కేసులో పునర్విచారణకు ఆదేశిస్తే వీళ్ళిద్దర్నీ బతికుండనిచ్చినందుకు మీరు సంతోషించాలి మీరు గుడ్డిగా చంపలేరు."

"మిస్టర్ ముస్మానో. నేను మీకెంత అవకాశమిచ్చానో మీకు తెలుసు మిమ్మల్ని వారానికి మూడు నాలుగు సార్లు ఖైదీలను కలవనిచ్చాను. మీరు వారితో మాట్లాడే సమయాన్ని కూడా నేను నియంత్రించలేదు "

"అవును అది నిజమే. మీరు చేసిన దానికి మీకు కృతజ్ఞుడిని. మీరు సహృదయులని కూడా నేను చెప్పాలనుకుంటున్నాను."

"సరే! గుడ్డిగా నేను చంపుతున్నానని చెప్పొద్దు. నేనసలు చంపడం లేదు. నాకిచ్చిన ఆదేశాలను అమలు పరుస్తున్నాను "

"కానీ మీకిచ్చిన ఉత్తర్వులలో ఈ రాత్రే మరణశిక్ష అమలు జరపమని లేదు '

"మిస్టర్ ముస్మానో! ఈ విషయం మీకంటే, నాకంటే పెద్దది. నాకు తెల్పిందల్లా నేను చేయడానికి పనొకటుందని - నేను దాన్ని చేయబోతున్నాను."

"కానీ శిక్ష వాయిదా వేయమని గవర్నర్ ఆదేశిస్తే?"

"గవర్నర్ ఈ పని ఆపేయమని చెప్తే సహజంగా ఆయన చెప్పింది చేస్తాను. హి ఈజ్ మై బాస్" అని వార్డెన్ హెండ్రీ మృత్యుకుహరం వేపు వేగంగా నడుస్తూ వెళ్ళి పోయాడు. సమయం మరో పది నిమిషాలు ముందుకు నడిచింది. పదకొండు గంటల ముప్పై ఐదు నిమిషాలయింది. శాక్కొ, వాంజెట్టిల ప్రాణాలు మరో ఇరవై ఐదు నిమిషాలే ఉంటాయి.

ముస్మానో టెలిఫోన్ దగ్గరికి పరిగెత్తాడు. గవర్నర్ కార్యాలయానికి ఫోన్ చేశాడు. టెలిఫోన్ ఆపరేటర్ ఫోనెత్తాడు.

"ఆపరేటర్! ఇది చావు బతుకులకు సంబంధించిన సమస్య గవర్నర్ గారు ఆఫీసులో ఉన్నారని నాకు తెలుసు. ఆయనకు కలపండి."

కాసేపు భరించలేని నిశ్శబ్దం. కర్ణకఠోరమైన నిశ్శబ్దం.

"ఆయన ఆఫీసు రూంకు రింగ్ చేస్తే సమాధానం లేదు."

'ఆయన కార్యదర్శిని కలిసేందుకు ప్రయత్నించండి దయ చేసి త్వరగా'

ఉద్విగ్నభరిత నిశ్శబ్దం. క్షణాలు యుగాలే.

ఆపరేటర్ గొంతు మళ్ళీ వినిపించింది.

'మీరేం మాట్లాడాలనుకుంటున్నారో చెప్పమని అడుగుతున్నారు'

'నన్నాయనతో మాట్లాడనివ్వండి"

'తను పని వత్తిడిలో ఉన్నానంటున్నారు'

'గవర్నర్‌గారు శిక్ష వాయిదా వేయమని టెలిఫోన్‌లో చెప్తే వార్డెన్ వాయిదా వేస్తానన్నాడని చెప్పండి ఈ వారంలో ఎప్పుడైనా వారెంట్‌ను అమలు పర్చవచ్చు కాబట్టి అధికార పూర్వకమైన వాయిదా అక్కర్లేదు ఈ వారంలోగా మేం కలవాల్సిన ఐదుగురు న్యాయమూర్తుల్లో ఒకరినో, ఎక్కువ మందినో కలుస్తామనేది స్పష్టం'

"సరే ఆయనకు మీరు చెప్పింది చెప్తాను

"నేను ఫోన్‌లో ఎదురు చూడనా?

అవతలి వేపు ఫోన్ పెట్టేసిన శబ్దం వినిపించింది. అప్పుడు సమయం పదకొండు గంటల నలభైఐదు నిమిషాలయింది సరిగ్గా మరో పదిహేను నిమిషాల్లో ముగ్గురు ఖైదీలు ఒకరి తర్వాత ఒకరు చంపబడతారు.

ముస్మానో స్టేట్ హౌస్‌కు మరోసారి ఫోన్ చేశాడు గవర్నర్‌కు కనెక్షన్ ఇవ్వమని ఆపరేటర్‌ను అడిగాడు. కనీసం గవర్నర్ కార్యదర్శినైనా కలవాలన్నాడు. కానీ ఫలితం శూన్యం.

వంద మంది పత్రికా విలేఖరులు గుమిగూడారు. మరణశిక్షకు సాక్షిగా అధికారికంగా నియమించబడ్డ అసోసియేటెడ్ ప్రెస్ విలేఖరి అప్పటికే డెత్ ఛాంబర్ వేపు వెళ్ళిపోయాడు

పన్నెండు కావస్తోంది

"వాళ్ళ పని వాళ్ళు చేసుకుపోతూ వుండి వుంటారు అన్నారెవరో.

**క్రీస్తు శకం పంథొమ్మిది వందల ఇరవై ఏడవ సంవత్సరం ఎనిమిదవ నెల ఇరవై రెండవ తేదీ నుంచి కాలం ఇరవై మూడులోకి ప్రవహించబోతోంది. శాక్కో, వాంజెట్టిల శరీరాల్లోకి విద్యుత్తు ప్రసరించబోతోంది.**

# విద్యుత్ సింహాసనంపై

*ఛార్లెస్ టౌన్ జైలు,* మసాచూసెట్స్, మంగళవారం, ఆగస్టు 23 - సౌత్ బ్రెయిన్‌ట్రీలో 1920 ఏప్రిల్ 15న జరిగిన హత్యలకు విధించిన శిక్ష అనుభవిస్తూ నికొలా శాక్కో, బార్టొలోమియో వాంజెట్టి ఈ రోజు ఉదయం కరెంటు కుర్చీలో మరణించారు.

శాక్కో 12:11కి కరెంటు కుర్చీ దగ్గరికి నడిచాడు. 12:19కి చనిపోయాడని ప్రకటించారు.

వాంజెట్టి 12:20కి మృత్యువాటికలోకి ప్రవేశించాడు. 12:26కి ప్రాణం పోయిందని నిర్ధారించారు.

శాక్కో, వాంజెట్టీలు తాము అమాయకులమని చివరి వరకూ ఘోషిస్తూనే ఉన్నారు. అమెరికా న్యాయశాస్త్ర చరిత్రలో అంతకు ముందెన్నడూ లేని విధంగా న్యాయస్థానాల్లోనూ బయటా పోరాడినప్పటికీ, వాళ్ళు నిర్దోషులని నమ్మిన వాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

వారితో పాటు యువ పోర్చుగీసు సెలెస్టినో మెడైరోస్ కూడా మరణించాడు. సౌత్ బ్రెయిన్ ట్రీ హత్యానేరంలో తాను పాల్గొన్నాననీ, శాక్కో, వాంజెట్టి తనతో పాటు లేరనీ అతను "ఒప్పుకొని" తనపై మరణశిక్ష అమలును ఏడుసార్లు వాయిదా వేయించుకున్నాడు. ఒక బ్యాంక్ కాషియర్‌ను చంపినందుకు శిక్షగా అతను మృతి చెందాడు.

వారు కరెంటు కుర్చీని సమీపిస్తున్న సమయంలోనూ, వారి శరీరాల్లోకి విద్యుత్ ప్రసరిస్తున్న సమయంలోనూ మరణశిక్ష విధించబడిన వాళ్ళిద్దరి తరపున ఏడేళ్ళుగా జరుగుతున్న చట్టపరమైన యుద్ధం కొనసాగుతూనే ఉంది- విలియమ్స్ టౌన్‌లోని ఫెడరల్ జడ్జి జార్జి ఆండర్సన్‌ను హెబియస్ కార్పస్ రిట్ స్వీకరించమని అడిగేందుకు ఒక లాయర్ విమానంలో ప్రయాణిస్తూనే ఉన్నాడు.

మతాచార్యుల తోడు లేకుండానే వారు (కరెంటు) కుర్చీ దగ్గరికి నడిచారు. జైలు

మఠాధికారి ఫాదర్ మైకేల్ మర్ఫీ పన్నెండు గంటలకు ఒక నిమిషం ముందు వరకూ వేచి చూసి జైలు నుంచి వెళ్ళిపోయాడు. జైలు గార్డులు కుర్చీలో తనను బెల్టులతో బిగిస్తూ విద్యుత్ వాహకాలు అమర్చుతుండగా శాక్కో "అరాచకం వర్ధిల్లాలి!" అని అరిచాడు. తన కుటుంబాన్ని జాగ్రత్తగా చూడమని అభ్యర్థించాడు. వాంజెట్టి తన నిర్దోషిత్వాన్ని ప్రకటిస్తూ చివరగా కొంచెం సేపు మాట్లాడాడు.

అతిగా తినడం వల్ల మెదైరోస్ కొంచెం వళ్ళు తెలియని స్థితిలో కుర్చీ వద్దకు నడిచాడు. అతను నిర్లక్ష్యంగా భుజాలు ఎగరేశాడు. ఏమీ మాట్లాడలేదు.

శాక్కో, వాంజెట్టిల మరణంతో (ముఖ్యంగా సాదరంగా కరచాలనం చేసి, తన పట్ల ఆదరణ చూపినందుకు కృతజ్ఞతలు చెప్పిన వాంజెట్టి స్మృతితో) వార్డెన్ హెండ్రీ విషాదంలో మునిగిపోయాడు.

చట్టప్రకారం తాను చెప్పాల్సిన మాటలను ఉచ్ఛరించడం వార్డెన్‌కు బాగా కష్టమైంది.

"కోర్టు విధించిన శిక్ష చట్ట ప్రకారం అమలు జరుపబడగా మీరు మరణించారని చట్ట ప్రకారం నేనిప్పుడు ప్రకటిస్తున్నాను."

ఆ మాటలు అధికారిక సాక్షులకు వినిపించలేదు.

. . . . . . ..

అంతకు ముందు సాక్షులు జైలు గుండా నడిచివార్డెన్‌తో పాటు మృత్యు గృహానికి చేరుకున్నారు. వారి స్థానాల్లో నిల్చున్నారు. తర్వాత మెదైరోస్‌ను గార్డులు అక్కడికి తెచ్చారు. ఆసరా లేకుండానే అతను నడిచాడు. ఇద్దరు గార్డులు అతనికి చెరో వైపు నడిచారు. అతన్ని కుర్చీలో కూర్చోబెట్టి 12.03 కి బెల్టులు బిగించారు. 12:09కి ప్రాణం పోయిందని ప్రకటించారు.

. . . . . . . .

తర్వాత వంతు శాక్కోది. అతని సెల్ మెదైరోస్ సెల్ ప్రక్కనే ఉంది. ఒక గార్డు తలుపు తీశాడు. శాక్కో సిద్ధంగా ఉన్నాడు. సుదీర్ఘ కాలం నిర్బంధంలో ఉండడం వల్ల అతని ముఖం పాలిపోయి వుంది. ఒక్క మాటైనా మాట్లాడకుండా గార్డుల మధ్య నిల్చున్నాడు. మెల్లగానే అయినా నిటారుగా నడుస్తూ మృత్యువాటిక వరకూ ఉన్న పదిహేడడుగులు నడిచాడు. ఎలాంటి ఆసరా అక్కర్లేకుండానే కుర్చీలో కూర్చున్నాడు. గార్డులు తమ పని పూర్తి చేస్తుండగా శాక్కో ఇటాలియన్‌లో "అరాచకం వర్ధిల్లాలి" అని అరిచాడు.

ఇంగ్లీషులో బిగ్గరగా ఇలా అన్నాడు:

"నా భార్యకు, బిడ్డకు, నాస్నేహితులందరికీ వీడ్కోలు" -

ఆయనకు ఇద్దరు పిల్లలు - దాంటేకు పధ్నాలుగేళ్ళు. ఐనెజ్‌కు ఆరేళ్ళు. కానీ ఇంగ్లీషు

మాట్లాడటంలో ఆయనకున్న ఇబ్బంది, అప్పుడున్న ఉద్విగ్న క్షణాలు ఆ తప్పు దొర్లడానికి కారణాలు

"గుడ్ ఈవెనింగ్ జంటిల్మెన్" అని హుందాగా అన్నాడు. తర్వాత చివరి మాటలు ఉచ్చరించాడు:

"అమ్మా వీడ్కోలు"

ఇక చెప్పేదేమీ లేదని శాక్కో తృప్తి పడే వరకూ వార్డెన్ హెండ్రీ ఆగాడు. తర్వాత ఆయన స్విచ్ నొక్కమని సైగ చేశాడు. 12.19.02కు శాక్కో చనిపోయాడని ప్రకటించారు.

వాంజెట్టి (సెల్) తలుపు తెరిచారు. ఆయన కూడా ప్రశాంతంగా ఉన్నాడు. ఇద్దరు గార్డులతోనూ కరచాలనం చేసి వారితో పాటు నడిచాడు. ఆయనకు శాక్కో కంటే కరెంటు కుర్చీ నాలుగడుగులు ఎక్కువ దూరంలో ఉంది. మృత్యువాటికలోకి ప్రవేశించాక వార్డెన్‌తో కరచాలనం చేసి ఇలా అన్నాడు:

"వార్డెన్, నాకోసం మీరు చేసినదాని కంతటికీ మీకు కృతజ్ఞత చెప్పాలనుకుంటున్నాను"

వాంజెట్టి ఇంగ్లీషులో మాట్లాడాడు. మాట్లాడినంత సేపూ ఆయన గొంతు ప్రశాంతంగా ఉంది. స్వరంలో కాస్తయినా జీరగానీ, వణుకుగానీ లేవు.

తర్వాత సాక్షుల నుద్దేశించి ఆయన ఇలా అన్నాడు:

"నేను నిర్దోషినని చెప్పాలనుకుంటున్నాను. కొన్నిసార్లు కొంత పాపం మినహా నేనెప్పుడు ఏ నేరమూ చేయలేదు"

గత ఏప్రిల్‌లో వాంజెట్టిని ఏప్రిల్ 10తో మొదలయ్యే వారంలో చనిపోవాల్సిందిగా శిక్ష విధించినప్పుడు డెడ్‌హాం కోర్టు హాలులో జడ్జి థేయర్ నుద్దేశిస్తూ అతడు చెప్పిన మాటలే అవి. గవర్నర్ సలహా సంఘం కేసును విచారిస్తున్నందున అప్పుడు శిక్షను వాయిదా వేశారు.

నెమ్మదిగా ప్రశాంతంగా ఇంకా ఇలా చెప్పాడతను.

"మీరు నా కోసం చేసినదానికంతా కృతజ్ఞతలు. నేను అన్ని నేరాల్లోనూ నిర్దోషినే. ఇదేకాదు. అన్నిటిలోనూ, నేను నిర్దోషిని".

చివరగా ఇలా చెప్పాడు:

"నాకు చేస్తున్న దానికి కొందరిని క్షమించాలనుకుంటున్నాను."

మృత్యువాటికలోకి వాంజెట్టి12:20:30కి అడుగు పెట్టాడు. 12:26:55కు ఆయన మరణించాడని ప్రకటించారు. *

---

* మరణశిక్ష అమలుకు సాక్షిగా అనుమతించబడ్డ అసోసియేటెడ్‌ప్రెస్ విలేఖరి కథనం ఆధారంగా న్యూయార్క్ టైమ్స్‌లో విలేఖరి లూయీ స్టార్క్ ఈ వార్త రాశాడు.

# 2

శాక్కొ, వాంజెట్టిలు మరణించారని తెలియగానే జైలు బయట చేరిన ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ఒక మానవ మహాసముద్రం జైలును చుట్టుముట్టిందా అన్నట్టుగా ఉంది. బారికేడ్లను ఛేదించుకొని ప్రజలు జైలు వేపు వస్తారేమోనని పోలీసులు భయపడి జనాన్ని చెదరగొట్టారు.

బోస్టన్‌లోని సాలెమ్ స్ట్రీట్‌లో ఐదొందల మంది ఇటాలియన్లు జరుపుతున్న సభను పోలీసులు భగ్నం చేశారు. బంకర్‌హిల్ మాన్యుమెంట్ దగ్గర ప్రదర్శనకి అనుమతించలేదు. స్టేట్ హౌస్ ఎదురుగా ఉన్న మైదానంలో నిరసన సభ జరిపేందుకు కూడా ఇటాలియన్లు విఫల యత్నం చేశారు.

జైలు వెలుపల జరిగిన ఉద్యమాన్ని గురించి న్యూయార్క్ టైమ్స్ వార్త ఇలా పేర్కొంది:

*బంకర్‌హిల్ వరకూ వెళ్ళే ఊరేగింపులో కలిసేందుకు థామస్ స్క్వేర్‌లో పోగయిన రెండు వందల మందిని చెదరగొట్టడం మామూలు పోలీసులకు సాధ్యపడలేదు. అశ్వారూఢులైన పోలీసులు లాఠీ చార్జి జరిపి వారిని వెనక్కి తరిమితే చాలా మంది గాయపడ్డారు. పలువురు అరెస్టయ్యారు.*
*ప్రధాన వీధి పొడవునా వెయ్యికి పైగా కార్లు నిలిచి పోయి ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసుల, పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. రకరకాల వాహనాలతో వీధంతా గందరగోళంగా తయారైంది. పోలీసులు కేకలేస్తుంటే, వారి గుర్రాల గిట్టల ఇనుప నాదాలు పేవ్‌మెంట్ మీద ధ్వని పుట్టిస్తుంటే, వందలాది కారు డ్రైవర్లు అదే పనిగా హారన్లు మోగిస్తుంటే ఆ ప్రదేశమంతా బీభత్స ధ్వనుల మయమయింది.*
*సినిమా ఫోటోగ్రాఫర్లు కాల్షియం టార్చిలైట్లు ఎత్తి పట్టుకుని - గుర్రాలపై కూర్చుని భయానకంగా తిరుగుతున్న పోలీసులపై వెలుగు ప్రసరిస్తూ,ముదురు బూడిద రంగు జైలు గోడలపై కదులుతున్న వారి నిశ్శబ్ద నీడలను ఆడిస్తుంటే అదొక అసహజ యుద్ధ దృశ్యంగా గోచరించింది.*

బోస్టన్ దినపత్రికల కార్యాలయాల ముందు వేలాది మంది జనం పోగయ్యారు. శాక్కొ, వాంజెట్టిల గురించి ఎప్పటి వార్తల[illegible]ప తెలియపర్చేందుకు ఏర్పాటు చేసిన బోర్డుల మీదరాసిన మరణవార్త చదివి జనం కొయ్యబారి పోయారు. మామూలుగా రాత్రి పదింటికే ముగిసే రేడియో ప్రసారాలు ఆ రోజు మరణవార్తను ప్రసారం చేసిన తర్వాతే కార్యక్రమాలను ముగించాయి.

కొందరు మిత్రులతో కలిసి ఒక ఇంట్లో ఉన్న రోజీనా, లూగియాలు మరణవార్త వినగానే పెద్ద ఎత్తున రోదించారు. వారి ఏడుపులు ఆ ప్రాంతమంతా ధ్వనించాయి. ప్రొఫెసర్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్, ఆయన భార్య మేరియోన్ డెన్‌మన్‌లు ఆ రాత్రి విషాద వదనాల్తో గమ్యం లేని బాటసారుల్లా, పిచ్చిపట్టినట్టు బోస్టన్ వీధుల్లో నడిచారు. నిర్మానుష్యమైన ఓ వీధిలో వారు

నడుస్తున్నపుడు మరణవార్త రేడియోలో విని ఖిన్నులయ్యారు. మేరియోన్ రోడ్డుపైనే కుప్పగూలి పోయింది. డిఫెన్స్ కమిటీ కార్యాలయమంతటా విషాదమేఘాలు కమ్ముకున్నాయి.

అమెరికాలోని అసంఖ్యాక నగరాల్లో,పట్టణాల్లో శాక్కో-వాంజెట్టి డిఫెన్స్ కమిటీ కార్యాలయాల ముందు ఆ రాత్రి జనం పెద్ద సంఖ్యలో పోగయ్యారు. శాక్కో, వాంజెట్టి నిర్దోషులని నినదించారు.

కొలరాడోలో మౌన ప్రదర్శనలు జరిగాయి. మరణ శిక్ష అమలు జరిపే సమయంలో కూడా శిక్షను ఆపమని అభ్యర్థిస్తూ డెన్‌వర్‌లో విజ్ఞాపన పత్రాల మీద సంతకాలు సేకరిస్తూనే ఉన్నారు. గవర్నర్‌కు టెలిగ్రాంలు పంపుతూనే ఉన్నారు. బోస్టన్ స్టేట్‌హౌస్‌కు ఫోన్ కనెక్షన్ కావాలని టెలిఫోన్ ఆపరేటర్లను బ్రతిమాలుతూనే ఉన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని డిఫెన్స్ కమిటీ కార్యాలయంలో టెలిగ్రాంలు రాస్తూనే ఉన్నారు. అర్థరాత్రి కల్లా దేశవ్యాప్తంగా ప్రజలు తండోపతండాలుగా తమ ప్రాంతంలోని డిఫెన్స్ కమిటీ కార్యాలయాలకు చేరుకుని శాక్కో, వాంజెట్టిలకు ఏం జరిగిందో తెలుసుకునేందుకు ప్రయత్నించారు.

పలు నగరాల్లో ప్రజలు పిచ్చి వాళ్ళలా ప్రవర్తించారు. తమ సమీప బంధువులు మరణిస్తే ఏడ్చేపద్ధతిలో కొందరు యూదులు వీధుల్లో చేరి బట్టలు చించుకు ఏడ్చారు. మరికొందరు ఆత్మాహుతికి ప్రయత్నించారు. న్యూయార్క్ యూనియన్ స్క్వేర్‌లో పదిహేను వేల మంది జనం పోగయ్యారు. మరణవార్త తెలియగానే వాళ్ళంతా పెద్దగా ఏడ్చారు. కొందరు మూర్ఛపోయారు.

చాలా మంది అమెరికన్లకు ఆ రాత్రి మర్చిపోలేని పీడకల లాంటిది. తమ జీవితాల్లో జరిగిన అత్యంత విషాద ఘటనగా వారికి అది గుర్తుండి పోయింది. ప్రముఖ అమెరికన్ శిల్పి, కార్టూనిస్టు బెన్ షాన్ ఆ కాలాన్ని గుర్తు చేసుకుంటూ తాను అమెరికా అంతర్యుద్ధ కాలంలో జీవించి లేనందుకు తెగ బాధపడే వాడిననీ, కానీ శాక్కో-వాంజెట్టి ఉద్యమ కాలంలో జీవించడం ఆ కొరతను తీర్చిందని అన్నాడు.

శాక్కో, వాంజెట్టిలు మరణించిన రాత్రి ప్రపంచమంతటా నిరసనోద్యమ జ్వాల అట్టుడికి పోయింది. మాస్కో నుంచి మెల్‌బోర్న్ వరకూ నిరసన ధ్వనులతో భూగోళం దద్దరిల్లింది. యూరప్‌లో పలు చోట్ల హింసాకాండ చెలరేగింది. పలు దేశాల్లో అమెరికా రాయబార కార్యాలయాలు బాంబుదాడులతో దద్దరిల్లాయి. అగ్నికి ఆహుతయ్యాయి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పలు దేశాల్లో నిరసనోద్యమానికి నాయకత్వం వహించి నడిపింది.

శాక్కో, వాంజెట్టిలను చంపే సమయానికి ఇంగ్లాండ్‌లో ఉదయం ఆరు గంటలయింది. ఆ రాత్రంతా జాగారం చేసిన బొగ్గు గని కార్మికులూ, బట్టల మిల్లు శ్రామికులూ, ఓడ రేవు పనివాళ్ళూ చావు వార్త విని హతాసులయ్యారు. ఎర్రజెండాలు చేతపట్టుకుని బకింగ్‌హాం పాలెస్ ముందూ, హైడ్ పార్క్‌లోనూ ఊరేగింపులు జరిపారు. అమెరికా రాయబార కార్యాలయం వేపు వెళ్ళేందుకు ప్రయత్నించారు. కాని పోలీసులు అనుమతించలేదు. పోలీసులు లాఠీ చార్జి చేయగా నలభై మందిగాయపడ్డారు. లండన్ వీధుల్లో జరిగిన పోలీసుల కాల్పుల్లో ఒకరు చనిపోయారు.

శాక్కో, వాంజెట్టిలు చనిపోయిన మరుక్షణం పారిస్‌లో కమ్యూనిస్టు దినపత్రిక లాహూమనైట్ ప్రత్యేక సంచిక విడుదల చేసింది. **'వాళ్ళు హత్య చేయబడ్డారు' అని మాత్రమే నల్లటి అక్షరాలతో పెద్దగా అచ్చేసి పారిస్ వీధుల్లో ఉచితంగా పంచిపెట్టారు.** పాలెస్ డి లా బాస్టిల్ ఎదురుగా పదిహేను వేల మంది పోగయ్యారు. లారీ చార్జి చేస్తున్న పోలీసులతో వారు నిర్భయంగా తలపడ్డారు. దుకాణాలు ధ్వంసమయ్యాయి వంద మంది జనం, నలభై ముగ్గురు పోలీసులు గాయపడ్డారు రెండు వందల యాభై మంది ప్రదర్శకులను దౌర్జన్యంగా పోలీసులు అరెస్టు చేశారు ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఐదు వేల మంది జనం ఐదు బృందాలుగా పారిస్ నగర వీధుల్లో ఊరేగింపు జరిపారు. వారు అమెరికా రాయబార కార్యాలయం దగ్గరకి రాగానే పోలీసులు దాడి చేశారు కాఫీ హోటళ్ళలో, దుకాణాల్లో ఉన్న వస్తువులతో ప్రజలు పోలీసులను ఎదుర్కొన్నారు. రెస్టారెంట్లు క్లబ్బులు ధ్వంసమయ్యాయి. వీధి దీపాలు పగిలి వీధులు గాజు పెంకులతో రకరకాల వస్తువుల శకలాలతో యుద్ధ భూమిని తలపించాయి. మేడే సందర్భంగా 1920-21లో పారిస్ నగరంలో జరిగిన విధ్వంసం తర్వాత మళ్ళీ అంత పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని ఫ్రెంచి పోలీసు శాఖ ప్రకటించింది. పారిస్‌లో నివసిస్తున్న అమెరికన్లపైకూడా ప్రజలు కోపాన్ని ప్రదర్శించారు ఆ రోజుల్లో అక్కడ గడిపిన అమెరికన్ మేధావి ఎలియట్ పాల్ 'ద లాస్ట్ టైం ఐసా పారిస్' గ్రంథంలో తన జ్ఞాపకాలను ఇలా పేర్కొన్నాడు:

> తీవ్రమైన అవమాన భారంతో ఒంటరిగా నేను పారిస్‌లో గడిపిన ఒకే ఒక సందర్భం 1927 ఆగస్టు 22వ తేదీ రాత్రి సుదూరంలో ఉన్న నా స్వస్థలం మసాచూసెట్స్‌లో ఆ రాత్రి ఒక మంచి కార్మికుడిని ఒక పేద శ్రామికుడిని ఏడేళ్ళ మానసిక హింస తర్వాత చేయని నేరానికి చంపేశారు బేకన్ హిల్*లో వికృతీకరించబడిన విషయం నేనున్న వీధిలో ఉండేవారికీ, పారిస్ కార్మికులకూ చాలా స్పష్టంగా తెలిసింది అదేమిటంటే- శాక్కో వాంజెట్టిలు అరాచక వాదులు కాబట్టి, విదేశీయులు కాబట్టి హత్య చేయబడుతున్నారనీ, జడ్జి థేయర్ గవర్నర్ ఫుల్లర్ సంపన్నుల కోసం వాళ్ళను బలి చేస్తున్నారనీ ..

స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా వీధుల్లో ఐదు వేల మంది ఉద్యమకారులు అమెరికన్ కార్లను ధ్వంసం చేశారు అమెరికా వస్తువులమ్మే షాపులపై దాడి చేశారు. అమెరికన్ సినిమాలను ప్రదర్శిస్తున్న థియేటర్లకు నిప్పు పెట్టారు. అమెరికా రాయబార కార్యాలయాన్ని నాశనం చేశారు. నానాజాతిసమితి భవనం మీద ప్రజలు దాడి చేశారు. దేశమంతటా అసాధారణ హింస చెలరేగింది. ప్రజలను అదుపు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ సాయుధ బలగాలు రంగంలోకి దిగాయి.

---

* బోస్టన్‌లో స్టేట్ హౌస్ ఉన్న ప్రాంతం

వైమర్ రిపబ్లిక్ చరిత్రలోనే అతి గొప్ప ప్రజా ప్రదర్శన బెర్లిన్‌లో ఆ రోజు జరిగింది. ప్రదర్శకులపై పోలీసులు అమానుష దాడికి తలపడ్డారు. అల్లర్లు చెలరేగి బెర్లిన్ నగరంలో ఆస్తులు పెద్ద ఎత్తున ధ్వంసమయ్యాయి. బ్రెమెన్, విల్‌హెల్మ్, ఫావెన్,హంబర్గ్ నగరాల్లో హింసాత్మక ప్రదర్శనలు జరిగాయి. స్టట్ గార్ట్‌లో రెండు గంటల పాటు కాగడాల ప్రదర్శన జరిగింది. లీప్జిగ్‌లో పోలీసు కాల్పుల్లో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఆ వారంలో జర్మనీలో పోలీసు కాల్పుల్లో ఆరుగురు ఉద్యమకారులు చనిపోయారు.

కోపెన్ హేగన్, గోథెన్ బర్గ్, హెన్సింగ్ ఫోర్ట్, నాన్సీ, లయన్స్ నగరాల్లో ఉధృతంగా ఉద్యమం సాగింది. బుకారెస్ట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలోకి ప్రజలు ప్రవేశించకుండా పోలీసు, మిలిటరీ బలగాలు నిరోధించలేక పోయాయి. కాసబ్లాంకాలో అమెరికా జాతీయ పతాకాన్ని దగ్ధం చేశారు. వార్సాలో ఆ రోజు ప్రదర్శనలను నిషేధించారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన జనాన్ని పోలీసులు చెదరగొట్టారు. సోవియట్ రష్యాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల మీద,కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాల మీద ఎర్రజెండాలను అవనతం చేశారు. మాస్కో వీధుల్లో ప్రజలు నిరసన గొంతుక వినిపించారు. స్వీడన్‌లో కూడా నిరసన వ్యక్తమైంది.

శాక్కో, వాంజెట్టిల మాతృదేశం ఇటలీలో ఫాసిజం రాజ్యమేలుతున్నప్పటికీ ప్రజల వత్తిడికి ప్రభుత్వం తలొగ్గాల్సొచ్చింది. శాక్కో, వాంజెట్టిలకు క్షమాభిక్ష పెట్టడం తనకు ఇష్టమేనని ముస్సోలినీ ఆ ముందు రోజు ప్రకటించాల్సి వచ్చింది. శాక్కో, వాంజెట్టిల మరణవార్తను ఇటలీ దిన పత్రికలన్నీ మొదటి పేజీలో అచ్చేశాయి. ఆ రోజు ఇటలీ ప్రజలు శోక సాగరంలో మునిగిపోయారు.

అర్జెంటీనాలో సార్వత్రిక సమ్మె జరిగింది. బ్యూనోస్ ఎయిర్స్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పోగై అమెరికా ప్రభుత్వ రాక్షసత్వాన్ని నిరసించారు. ఉరుగ్వేలో సమ్మెలు, ప్రదర్శనలు జరిగాయి. ప్రజల వత్తిడికి లొంగి ఉరుగ్వే శాసనసభ శాక్కో-వాంజెట్టి కేసును సమీక్షించమని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాల్సొచ్చింది. చిలీ, పెరూ, బ్రెజిల్, బొలీవియా, మెక్సికో దేశాల్లో ప్రజా ఉద్యమం చెలరేగింది.

ఎక్కడో ఉన్న ఆస్ట్రేలియా లోని సిడ్నీ నగరంలో కూడా ఓడ రేవు కార్మికులు ఆ రోజు సమ్మె చేశారు. జపాన్ రాజధాని టోక్యోలో అమెరికా రాయబార కార్యాలయం ముందు ప్రజలపై లాఠీ చార్జి జరిగింది. బొంబాయిలో సైతం బట్టల మిల్లు కార్మికులు సమ్మె చేసి ఊరేగింపు, నిరసన సభ నిర్వహించారు. చైనాలోని షాంఘైలో కూడా నిరసన వ్యక్తమైంది. పౌర హక్కుల ఉద్యమ పటంలో అప్పటికి పేరు కూడా కనిపించని ఆఫ్రికాలోని జోహెన్నెస్ బర్గ్ నగరంలో టౌన్ హాల్ మెట్ల మీద అమెరికా జాతీయ పతాకాన్ని తగుల బెట్టారు. పోర్చుగల్‌లో కూడా శాక్కో, వాంజెట్టిల నిర్దోషిత్వాన్ని ఆ రోజు ప్రజలు చాటి చెప్పారు.

ప్రపంచమంతా ఆ రోజు ఒకే గొంతుకతో
శాక్కో, వాంజెట్టిల కోసం కోటి జలపాతాల ఘోషను వినిపించింది.

# 3

శవపరీక్ష జరిపాక శాక్కో,వాంజెట్టిల మృత దేహాలను జైలు అధికార్లు ఆగస్టు 23 సాయంత్రం బంధువులకు అప్పజెప్పారు. ఆ రోజు మంగళవారం. ఆదివారం నాడు అంతిమ యాత్ర జరపాలని డిఫెన్స్ కమిటీ నిర్ణయించింది ఆ రోజు ట్రాఫిక్ సమస్య కూడా అంతగా ఉండదు

బోస్టన్ నగర నిబంధనల ప్రకారం చనిపోయిన నాలుగు రోజుల్లోగా అంతిమ సంస్కారం జరపాలి. బోస్టన్ మున్సిపల్ అధికారులతో డిఫెన్స్ కమిటి చర్చించిన మీదట హెల్త్ కమీషనర్ ఆ గడువును మరో రెండు రోజుల పాటు పెంచాడు.

ప్రజల సందర్శనార్థం మృతదేహాలను డిఫెన్స్ కమిటి కార్యాలయంలోనే ఉంచాలని మొదట అనుకున్నారు కానీ శవ పేటికలు కమిటీ కార్యాలయ భవనంలోకి ప్రవేశించడం ఇబ్బంది కావడంతో ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు బోస్టన్‌లో జాన్ లాంగోన్ అనే ఆసామీ శవాల సందర్శనార్థం అన్ని ఏర్పాట్లున్న ఒక షాపును నడుపుతుంటాడు బోస్టన్‌లో మరణించే ప్రతి ఇటాలియన్ మృత దేహాన్ని లాంగోన్ ఫ్యునరల్ పార్లర్ లోనే ఉంచి అంతిమ యాత్రకు తీసుకెళ్తారు. శాక్కో, వాంజెట్టిల భౌతిక కాయాలను కూడా అక్కడే ఉంచారు. హనోవర్ స్ట్రీట్‌లో డిఫెన్స్ కమిటి కార్యాలయానికి అది దగ్గరే. శవపేటికలను పుష్పగుచ్ఛాలతో అలంకరించారు మృతదేహాలకు నీలి రంగు సూట్లు తెల్లచొక్కాలు, టైలు కట్టారు బుధవారం సాయంత్రం నుంచీ ప్రజల సందర్శనార్థం గేట్లు తెరిచారు

బుధవారం రాత్రికే ఎనిమిది వేల మంది ప్రజలు మృతదేహాలను సందర్శించి తమ ప్రియతమ అమరవీరులకు నివాళులర్పించారు మర్నాడు ఉదయం ఆరు గంటల నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో బారులు తీరి నిల్చున్నారు నాలుగు గంటల పాటు నడిస్తే గాని మృతదేహాలున్న చోటుకు చేరలేనంత పెద్ద క్యూలు ప్రత్యక్షమయ్యాయి. ఆదివారం నాటికి సుమారు లక్ష మంది ప్రజలు లాంగోన్ పార్లర్‌ను సందర్శించారని అంచనా. మృతదేహాలుంచిన గది పుష్పగుచ్ఛాలతో నిండి పోయింది. 'మసాచూసెట్స్ హంతకి', 'ప్రతీకారం' లాంటి పదాలు రాసున్న కాగితాలను పుష్పగుచ్ఛాలతో పాటు మృత దేహాల మీద ఉంచారు. దూర ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేకమైన బస్సులలో ప్రజలు తరలి వచ్చారు **"ఈ అరాచక వాద లంజా కొడుకులను నేనేం చేశానో చూశారా?- "జడ్జి వెబ్‌స్టర్ థేయర్"** అని రాసివున్న ప్లేకార్డ్ పట్టుకుని మేరీ డొనొవాన్ శవపేటికల దగ్గర నిల్చోగా ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. దాన్ని ప్రశ్నించిన ఉద్యమ నాయకుడు పోవర్స్ హాప్‌గుడ్‌ను పోలీసులు కొట్టారు.

"గుర్తుంచుకోండి! న్యాయానికి శిలువ వేశారు. 22 ఆగస్టు, 1927" అని నల్లక్షరాలతో రాసి వున్న ఎర్రగుడ్డలను వేల సంఖ్యలో తయారు చేయించి చేతులకు కట్టుకుని ప్రజలు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

బుధవారం (ఆగస్టు 23) రోజే సెలెస్టినో మెడైరోస్ మృతదేహానికి న్యూబెడ్ ఫోర్డ్‌లో అంత్యక్రియలు జరిగాయి. అతని బంధువులు, స్నేహితులుహాజరయ్యారు.

శాక్కొ, వాంజెట్టిల అంతిమ యాత్రను ఆదివారంనాడు ఇటాలియన్ సాంప్రదాయ పద్ధతిలో జరిపారు. రెండు గుర్రాలు ముందు నడవగా వాటి వెనుక పెద్ద గులాబీ పుష్పగుచ్ఛాలను పట్టుకుని ఇద్దరు మనుషులు నడిచారు. వారితర్వాత శవపేటికలు మోస్తూ డిఫెన్స్ కమిటీ నాయకులు నడిచారు. రెండు వాహనాలు, వాటి మధ్య విషాద సంగీతం ఆలాపిస్తూ వాద్య బృందం నడిచింది. బంధువులు, డిఫెన్స్ కమిటీ నాయకులు, సానుభూతిపరులూ అనుసరించారు. అనేక కార్లు బారులు తీరి యాత్రలో పాల్గొన్నాయి.

మధ్యాహ్నం రెండింటికి ఎనిమిది వేల మందితో ఊరేగింపు ప్రారంభమై పోలీసులు సూచించిన మార్గంలో మెల్లగా మౌనంగా కదిలింది. సన్నటి వర్షపు తుంపర్లు ఆ దృశ్యానికి మరింత విషాద నేపథ్యాన్ని సమకూర్చాయి. పోలీసులు అభ్యంతర పెట్టడంతో కొంతసేపయ్యాక శవపేటికలను వాహనాలపై అమర్చారు. స్టేట్ హౌస్ వేపు వెళ్ళేందుకు ఊరేగింపును అనుమతించలేదు. గుర్రాల మీద, మోటారు సైకిళ్ళ మీద,కార్ల మీద పోలీసులు అనుసరించారు. రెండు లక్షల మంది జనం బోస్టన్ నగర వీధుల్లో నిలబడి గౌరవ సూచకంగా టోపీలు తీసి పట్టుకుని ఈ విషాద యాత్రను వీక్షించారు. శవపేటికలపై దారిపొడవునా పుష్పగుచ్ఛాలుంచారు.

అంతిమ యాత్ర కొంత దూరం అలా సాగాక పోలీసులు విరుచుకుపడ్డారు. లాఠీ చార్జి చేసి కొందరిని తరిమి కొట్టారు. పోలీసులకు తోడు వర్షం కూడా పెద్దదవడంతో కొంత మంది ఆగిపోయారు. బోస్టన్‌కు నైరుతి దిశగా ఎనిమిది మైళ్ళదూరంలో ఉన్న ఫారెస్ట్ హిల్స్ స్మశానానికి ఐదు వేల మందితో ఆ శవ యాత్ర చేరింది. వర్షాన్ని, పోలీసులను తప్పించుకొని అడ్డదార్లలో మరి కొందరు అక్కడికి చేరుకున్నారు.

స్మశాన వాటికలో డిఫెన్స్ కమిటి శాక్కొ, వాంజెట్టిలకు ఘనంగా నివాళులర్పించింది. కమిటీ నాయకులు క్లుప్తంగా తమ సందేశాలనువినిపించారు. డిఫెన్స్ కమిటి తరపున గార్డైనర్ జాక్సన్ రాసిన ఎలిజీని మేరీ డొనొవాన్ రుద్ధకంఠంతో చదివింది:

> *మీరు ఇటాలియన్ అరాచక వాదులైనందువల్ల మసాచూసెట్స్, అమెరికాలు మిమ్మల్ని చంపాయి. హత్య చేశాయి.. . . మిమ్మల్ని చంపిన వాళ్ళు అమాయకులు కారు. కావాలనే కిరాతకంగా వారీ పని చేశారు . . .*
>
> *శాక్కొ! వాంజెట్టి! మీరు పురాతన రోమ్ సామ్రాజ్యానంతరం ప్రపంచం చూసిన అతి దారుణ ధనస్వామ్య బాధితులు.*

వాంజెట్టి ఒక సందర్భంలో నార్త్ అట్లాంటిక్ న్యూస్ పేపర్ ఎలియన్ – (NANA) విలేఖరికి చెప్పిన వాక్యాలను డొనొవాన్ ఉల్లేఖించింది:

> ఇదిలా జరక్కపోయినట్టైతే, మా భావాలను వెక్కిరించే మనుషులతో వాదిస్తూ వీధుల్లో గడిపే వాడిని. అనామకుడిగా, గుర్తింపు లేకుండా చనిపోయే వాడిని. అది ఓటమి. ఇది మా ఔన్నత్యం, మా విజయం. ఈ యాదృచ్ఛిక ఘటన జరక్కపోయినట్లయితే సహజీవనం కోసం, న్యాయం కోసం,మనిషిని మనిషి అర్థం చేసుకోవడం కోసం మేం ఇప్పుడు చేసిన పనులు మా జీవిత కాలంలో ఎన్నడూ చేయగలమని ఆశించలేం.

చివరగా వారు ప్రతిజ్ఞ చేసారు:

**మీ అమరత్వంలో మేం పోరాడి విజయం సాధిస్తాం**

ఆ తర్వాత శాక్కో, వాంజెట్టిల మృతదేహాలకు అంతిమ సంస్కారం జరిగింది.

# వ్యక్తిత్వం

**జీవిత కార్యాచరణ,** మనోభావాలు, రాజకీయ చైతన్యం, సంస్కారం కలిసి అభివ్యక్తీకరించ బడిన వ్యక్తిత్వం శాక్కో, వాంజెట్టిలను అమెరికా వ్యవస్థ ముందు మహోన్నత కథానాయకులుగా నిలబెట్టాయి. ఆరోపిత నేరాలకూ, వారి వ్యక్తిత్వ వికాసానికీ మధ్య నున్న అగాధం అమెరికా క్రూర వ్యవస్థకు మింగుడు పడని ప్రశ్నగా మిగిలింది. శాక్కో, వాంజెట్టిల రాజకీయ, తాత్విక భావాలతో ఏకీభవించని వారు కూడా వారి వ్యక్తిత్వాన్ని అభిమానించక తప్పలేదు.

అరెస్టయ్యే నాటికి అంటే 1920 మే 5 వరకూ వారి జీవిత కార్యాచరణ ఒక ఎత్తైతే అప్పటి నుంచి మరణించే వరకూ ఏడేళ్ళ నిర్బంధంలో వారు ప్రదర్శించిన ఔన్నత్యం మరొక ఎత్తు. నిర్బంధం వారి కార్యాచరణ పరిధిని జైలు నాలుగ్గోడలకు, కోర్టు ఆవరణకు పరిమితం చేసినప్పటికీ ఆ పరిధిలో కూడా వారి వ్యక్తిత్వ వికాసం వారిని ప్రపంచ మానవాళి ముందు మహోన్నత మానవతా మూర్తులుగా, పోరాట యోధులుగా నిలిపింది. జైలులో వారి ప్రవర్తనలో, జైలు నుంచి రాసిన పలు లేఖల్లో, తన జీవితం గురించి 1923 లో వాంజెట్టి రాసిన కరపత్రం 'ద స్టోరీ ఆఫ్ ఎ ప్రొలిటేరియన్ లైఫ్'లో, కోర్టులో చెప్పిన సాక్ష్యంలో, మరణశిక్ష విధించినప్పుడు చేసిన ప్రసంగాలలో, గవర్నర్‌పుల్లర్‌కు వాంజెట్టి రాసి పంపిన పిటీషన్‌లో, థామ్సన్‌తో వాంజెట్టి జరిపిన చివరి సంభాషణలో, చనిపోయే చివరి క్షణాల్లో వారి వ్యక్తిత్వం అద్భుతంగా ఆవిష్కారమైంది.

వాంజెట్టితో పోల్చితే శాక్కో ప్రాముఖ్యం కొంత తగ్గే మాట నిజం. తన పదునైన ఆలోచనలతో, స్పష్టమైన అభిప్రాయాలతో, అద్భుత గ్రహణ శక్తితో వాంజెట్టి ఒక తరం అమెరికా మేధావులకు హీరో అయ్యాడన్నది వాస్తవం. అంత మాత్రం చేత శాక్కో వ్యక్తిత్వాన్ని తక్కువగా అంచనా వేయలేము. అసమ సమాజంతో సంఘర్షించి స్వేచ్ఛాయుత సమాజం కోసం రాజీ లేని పోరాటానికి నడుం బిగించిన పారిశ్రామిక కార్మికుడుగా, ప్రేమాస్పదుడైన జీవిత భాగస్వామిగా, బాధ్యతాయుతమైన తండ్రిగా శాక్కో వ్యక్తిత్వాన్ని తప్పక పరిగణించాలి.

# 2

అరెస్టయ్యే నాటికి శాక్కో 3-కె షూ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. యజమాని మైకేల్ కెల్లికి శాక్కో అంటే అభిమానం. ఫ్యాక్టరీ మొత్తాన్నీ ఒక్కొక్కసారి శాక్కోకే అప్పజెప్పేవాడు. ఆయన శాక్కో గురించి ఇలా అంటాడు:

*ఉదయం నాలుగ్గంటలకు పెరటి తోటలో, ఏడింటికి ఫ్యాక్టరీలో, రాత్రి భోజనానంతరం తిరిగి తోటలో తొమ్మిది పదింటి వరకూ గడిపే మనిషి శాక్కో. మొక్కలకు నీళ్ళు పోసి తన అవసరాలకు మించి కూరగాయలు పండించి పేదవాళ్ళ కిచ్చేందుకై నా కందజేస్తాడు అలాంటిమనిషి 'బందిపోటు' కాదు*

శ్రమలో లీనమై శ్రమైక జీవన సౌందర్యంతో పాటు శాక్కో ప్రకృతినీ ఆరాధించాడు జైలు నుంచిరాసిన ఒక లేఖలో శాక్కో బాల్య స్మృతులను నెమరు వేసుకుంటూ ఇలా అంటాడు:

*నేనే కవినైతే అందంగా వెలుగుతున్న సూర్యుడి అరుణ కిరణాలను, ప్రకాశవంతమైన నీలి ఆకాశాన్ని నా తోట నుంచీ అందులోని పూల నుంచీ వచ్చే పరిమళాన్ని విశాలమైన పచ్చిక బయళ్ళలో గడ్డి పూలు వెదజల్లే సువాసనలను పక్షుల ఆనందగానాన్ని వర్ణించి వుండే వాడిని*

ప్రేమించి పెళ్ళి చేసుకున్న అద్భుత సౌందర్యరాసి రోజినా స్మృతులు శాక్కో జైలుజీవితాన్ని మరింత దుర్భరం చేశాయి ఆ స్మృతులు శాక్కోను చనిపోయే క్షణం దాకా వెంటాడాయి. జైల్లో ఆ స్మృతులు కొద్ది కాలం ఆయనకు మతిభ్రమించేందుకు కూడా కారణభూతమయ్యాయి:

*కొన్నేళ్ళ క్రితం మేం ప్రేమించుకున్న రోజున నేను మొదటి సారిగా నా ప్రియమైన రోజినాకు అందమైన నీలిరంగు సూట్ కొనిచ్చాను. ఆ తీపి గుర్తు నా మదిలో ఇంకా మిగిలే వుంది నేను కొత్త నీలిరంగు సూట్‌లో **1912** మే డే రోజు ఉదయాన్నే రోజినాను చూసేందుకు వెళ్ళాను. షాపింగ్ చేసేందుకు రోజినాను నాతో పంపమని ఆమె తండ్రిని అడిగాను. ఆయన సరేనన్నారు. మధ్యాహ్నం తర్వాత ఒంటిగంటకు మేమిద్దరం బజారుకెళ్ళాం. పెద్ద షాపుకు వెళ్ళి గోధుమ రంగు టోపీ, తెల్ల లోదుస్తులు, నీలం సూట్, గోధుమ రంగు మేజోళ్ళు, గోధుమ రంగు బూట్లు కొన్నాం. అవి ధరించాక ఆమె ఎంత అందంగా ఉందో మీరు ఊహించ గలరనుకుంటాను ఇప్పటి బాధలు ఆమెను ముసలమ్మగా మార్చేశాయి*

శాక్కో జైలులో ఉన్న కాలంలో రోజినా బాధలు వర్ణనాతీతం. శాక్కో గురించిన దిగులుకు తోడు ఇద్దరు పిల్లల పెంపకం ఆమెను బాగా కుంగదీసింది. ఆమెను అమితంగా ప్రేమించిన శాక్కో తను త్వరగా మరణిస్తే రోజినా మనోవేదన త్వరగా అంతమౌతుందనే నిర్ణయానికి వచ్చాడు చివరి రోజు జైల్లో వారిద్దరి కలయిక, తీరని ఎడబాటు ఒక విషాద భరిత ప్రేమ కావ్యం.

జైల్లో ఉండగాఎదిగిన కొడుకు డాంటేకు, జైలు కెళ్ళాక పుట్టి, తండ్రిని ఖైదీగాతప్ప స్వేచ్ఛా జీవిగా ఒక్కసారి కూడా చూడని కూతురు ఐనెజ్‌కు తన గురించి, సమాజ పోకడ గురించి, పేదప్రజల గురించి పలు విషయాలు అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నించాడు శాక్కో. జైలు కొచ్చినప్పుడల్లా కూతురుకు తన శక్తి కొద్ది చిన్న చిన్న బహుమతులు ఇచ్చేవాడు.

ఆరేళ్ళ ఐనెజ్‌కు 1927 జులై 19న చార్లెస్ టౌన్ జైలు నుంచి రాసిన లేఖలో తన హృదయ స్పందనలను అర్థమయ్యేలా చెప్పేందుకు శాక్కో తీవ్రంగా ప్రయత్నించాడు:

> *బాల్యదశలో ఉన్న నీకు అర్థమయ్యేలా చెప్పడం చాలా కష్టం. కానీ మీ నాన్న హృదయానికి నువ్వెంత ప్రియమైన దానివో నీకు అర్థమయ్యేలా చెప్పేందుకు హృదయ పూర్వకంగా నేను ప్రయత్నిస్తున్నాను. ఆ ప్రయత్నంలో నేను విఫలమైతే, నువ్వీ ఉత్తరాన్ని దాచుకుని రాబోయే కాలంలో చదువుకుంటావనీ, ఈ లేఖ రాయడంలో నీ తండ్రి అనుభవించిన హృదయానురాగాన్ని నువ్వు కూడా అనుభవిస్తావనీ అనుకొంటాను. . . .*

> *. . . మరణిస్తున్న ఈ పాత వ్యవస్థ తాలూకు మనుషులు నీ సోదరుడి కౌగిలి నుంచి దీనురాలైన మీ అమ్మ ఒడి నుంచీ నన్ను విడదీశారు. కానీ మీ నాన్న విశ్వాసానికున్న స్వతంత్ర శక్తి ఇంకా జీవించే వుంది. నేను దాని కోసమే జీవించాను. ఏదో ఒక రోజు ప్రియమైన మీ అమ్మ కౌగిలిలోకి చేరేందుకై మన మిత్రుల మధ్య, కామ్రేడ్ల మధ్య తిరిగి ఉండగలిగేందుకై మళ్ళీ జీవిస్తాననే స్వప్నం కోసమే నేను బతుకుతున్నాను.*

పేదల పట్ల స్నేహభావం చూపమని, వారికి సహాయ పడమని తన చిన్నారి కొడుకుకు మరో లేఖలో శాక్కో ఉద్బోధించాడు. తమను చంపినా తమ భావాలను చంపలేరని, భవిష్యత్ తరాల కోసం అవి నిలిచి ఉంటాయని చెప్పాడు. జైళ్లను ధ్వంసం చేసి, పాఠశాలలుగామార్చి పేద పిల్లలకు విద్యా బోధన చేసేందుకు వినియోగించాలని చెప్పాడు.

తన శత్రు భాషను అర్థం చేసుకోవడం శాక్కోకు చివరికి తప్పనిసరి అయింది. సెరైజ్ జాక్ అనే అమెరికన్ వనిత ఆయనకు జైల్లో ఆంగ్ల భాష నేర్పింది. వచ్చీ రాని ఇంగ్లీషులో శాక్కో పలు గ్రంథాలు చదివాడు. జార్జి వాషింగ్టన్, థామస్‌జెఫర్సన్, అబ్రహాం లింకన్‌ల జీవితచరిత్రలను అధ్యయనం చేశాడు. తమ కేసు గురించి అట్లాంటిక్ మంత్లీలో ఫెలిక్స్ ఫ్రాంక్ ఫర్టర్ రాసిన వ్యాసాన్ని, డాస్ పాస్సోస్ రాసిన ' ఫేసింగ్‌ద ఛైర్' ను బెట్రండ్ రస్సెల్ రాసిన 'వై మెన్ ఫైట్' ను గాంధీ, యూజిన్ డెబ్స్ రచనలను ఆయన చదివాడు.

సమాజాన్ని శాక్కో బాగానే అర్థం చేసుకున్నాడు. దోపిడీ దారులుగా, దోపిడీకి గురయ్యే వారిగా సామాజికవ్యవస్థ రెండుగా విడిపోయి వుండటాన్ని గమనించాడు. తన సామాజిక విశ్లేషణను ఆయన ప్రత్యేకంగా వివరించలేదు. కానీ ఆర్థిక పునాదిగా రెండు పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్న వర్గా లేర్పడి ఉన్నాయని పలు సందర్భాల్లో ప్రస్తావించాడు. మేడమ్ జాక్‌కు

రాసిన ఒక లేఖలో తనకు ఓ రాత్రి వచ్చిన కలను వివరించినప్పుడు శాక్కో సమాజాన్ని ఎలా అవగాహన చేసుకున్నాడో మనకర్థమౌతుంది:

పెన్సిల్వేనియా గని కార్మికుల సమ్మెలో తాను పాల్గొన్నట్లు ఓ రోజు శాక్కో కలగన్నాడు. అందులో సమ్మె చేస్తున్న కార్మికులను యజమానులు ఇళ్ళలోంచితరిమేస్తారు. కార్మికులంతా ఒక శిబిరంలో తలదాచుకుంటారు వారిపై సాయుధ సైనికులు దాడి చేస్తారు ఆ సమయంలో అక్కడున్న శాక్కో కార్మికుల మధ్యన ఒక ఎత్తయిన ప్రదేశం మీద నిలబడి కార్మికులను పారిపోవద్దని ఉపన్యాసం చెప్తాడు. వెన్ను చూపడం పిరికి చర్య అవుతుందంటాడు. యజమానుల మాటలు విని తమ సోదర కార్మికులపైన కాల్పులు జరపవద్దని సైనికులకు విజ్ఞప్తి చేస్తాడు. సైనికుల స్వేచ్ఛ కోసం కూడా ఆ సమ్మె జరుగుతోందని చెప్తాడు. ఉపన్యాసం ముగుస్తుండగా శాక్కోపైకి ఒక సైనికుడు తుపాకీ పేలుస్తాడు గుండెలోకి తూటా దూసుకెళ్ళగా శాక్కో కింద పడి పోతాడు వెంటనే ఆయనకు మెలకువొస్తుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది

మనిషిని మనిషి దోచు కోవడం ఆగనంత వరకూ వర్గ పోరాటం తప్పదని ఒక సందర్భంలో శాక్కో రాశాడు తను దోపిడీకి గురౌతున్న వర్గానికి చెందిన వాడిని కాబట్టే శిక్షింపబడుతున్నానని ఆయన గట్టిగా నమ్మాడు. శిక్ష విధించిన న్యాయమూర్తికి కూడాఅదే చెప్పాడు. శాక్కో భావాలు మార్క్సిజానికి దగ్గరగా ఉన్నాయనీ, అరాచక వాదినని శాక్కో చెప్పుకోక పోయినట్లయితే ఆయనను ఔత్సాహిక కమ్యూనిస్టుగానో, సోషలిస్టుగానో పరిగణించవచ్చని ఒక అమెరికన్ మేధావి అభిప్రాయపడ్డాడు.

శాక్కో, వాంజెట్టిల అనుబంధం ఏడేళ్ళ జైలు జీవితంలో మరింత గాఢమైంది. కొన్ని చిరు అభిప్రాయ భేదాలు, మనస్పర్థలు తలెత్తినప్పటికీ వారి మధ్య ఆప్యాయత చివరి వరకూ చెక్కు చెదరలేదు. శాక్కో మేధావి కానప్పటికీ అతని మాటల్లో నిజాయితీ వాంజెట్టిని ఆకర్షించింది శాక్కో గురించి వాంజెట్టి కోర్టులో చెప్పిన విషయాల ద్వారా శాక్కో వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. చనిపోయే ముందు వాంజెట్టి శాక్కో కొడుక్కి రాసిన లేఖలో ఇలా రాశాడు:

*మీ నాన్న గురించి నాకు తెలిసినదంతా ఇప్పుడు చెప్తాను. ఆయన నేరస్తుడు కాదు. నేనెన్నడూ చూడనంత ధైర్యశాలి. అందరికీ స్వేచ్ఛ కావాలని, న్యాయం దొరకాలని చేసినపోరాటంలో మానవ హృదయానికీ, ఆత్మకూ ప్రియమైన, పవిత్రమైన ప్రతి దాన్ని మీ నాన్న త్యాగం చేశాడు. కొంత కాలం తర్వాత నీకీ విషయం బోధ పడుతుంది. ఆ రోజు నువ్వు మీ నాన్నను చూసి గర్వపడతావు. నీకు తగినంత ధైర్యముంటే-క్రూరత్వానికీ, స్వేచ్ఛకూ మధ్య జరుగుతున్న పోరాటంలో ఆయన స్థానాన్ని భర్తీ చేస్తావు. మా పేర్లలో, మా రక్తంలో ఉన్న నిజాయితీని నిరూపిస్తావు.*

# 3

"**ఆలోచనల, అనుభూతుల, ఉద్వేగాల సజీవ ఉప్పెనను నేను**" అని ప్రకటించుకున్న వాంజెట్టి తన చురుకైన పరిణత ఆలోచనలతో, మానవత ఉట్టి పడే అనుభూతులతో, మానవ సహజ ఉద్వేగంతో అమెరికా సమాజం ముందు కాల్పనిక కథానాయకుడిగా నిల్చి పోయాడు. 'చేపలమ్ముకునే వీధి తత్వవేత్త' అని, సోక్రటిస్‌తో పోల్చదగిన మహామనిషి అని లాయర్ ముస్మానో చేత అభినందనలందుకున్నాడు. న్యాయవాద యోధుడు థామ్సన్ దృష్టిలో వాంజెట్టికి, జీసస్‌కు ఔన్నత్యంలో పోలిక వుంది. వాంజెట్టి రాసిన లేఖలు ఇంగ్లీషు భాషా సాహిత్యంలో ప్రకాశించాయి. కొందరు ఆ లేఖల సంకలనాన్ని ప్లేటో 'అపాలజీ'గ్రంధంతో పోల్చారు. వాంజెట్టి కోర్టు ఉపన్యాసాల్లోని కొన్ని భాగాలు కవితలుగా పరిగణించబడి, ఆధునిక అమెరికన్ కవితల సరసన చోటు చేసుకున్నాయి. అరెస్టయ్యే నాటికి వచ్చీ రాని ఇంగ్లీషు భాషను సొంతం చేసుకున్న వాంజెట్టి భాషా పండితులను ఆశ్చర్యపర్చే విధంగా ఇంగ్లీషు పద ప్రయోగం చేశాడని ప్రొఫెసర్ లూయీ జొగిన్ ప్రస్తుతించాడు.

పదమూడేళ్ళ వయసులో పాఠశాలను వదిలి పెట్టి కాయకష్టం చేస్తూ జీవనాన్ని ప్రారంభించిన వాంజెట్టి జీవితాన్ని కాచి వడపోశాడు వర్గ పోరాటమే లక్ష్యంగా అరాచక వాద భావాలను ప్రచారం చేస్తూ చివరి వరకూ పోరాడాడు. అరెస్టయ్యేరోజున వాంజెట్టి ఒక మీటింగు కోసంరాసిన కరపత్రం యిది:

*సోదర కార్మికులారా! మీరు అన్ని యుద్ధాల్లోనూ పోరాడారు మీరు పెట్టుబడిదారులందరి కోసం పని చేశారు. మీ శ్రమ ఫలాలను, విజయాల ఫలితాలను మీరు పొందారా? గతం మీకు తృప్తి నిస్తుందా? వర్తమానం మీపై చిరునవ్వులు కురిపిస్తుందా? భవిష్యత్తు మీకేదైనా హామీనిస్తుందా? మీరు మానవులుగా బతగ్గలిగే, మానవులుగా చావగలిగే ఓ చెక్క నేలైనా మీకు కన్పించిందా? ఈ ప్రశ్నల గురించీ, ఈ వాదన గురించీ, అస్తిత్వం కోసం పోరాటం అనే అంశంపై బార్టొలోమియో వాంజెట్టి ప్రసంగిస్తాడు. ప్రవేశం ఉచితం! అందరికీ చర్చించే స్వేచ్ఛ! మీతో మహిళలను కూడా తీసుకురండి.*

అరెస్టయ్యే నాటికి వాంజెట్టికి ఇంగ్లీషు సరిగా రాదు. అందు వల్ల శత్రువు తనపై ప్రకటించిన భీకర యుద్ధంలో తాను నష్టపోతున్నానని భావించాడు. కోర్టు నియమించిన అనువాదకుడి వల్ల కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. తన జీవితాన్ని రక్షించుకోవాలంటే తన శత్రువు భాష నేర్చుకోవడం తప్పని సరి అనిఅనుకున్నాడు. మేడమ్ వర్జీనియా మెక్ మెకన్ వాంజెట్టికి జైలులో ఇంగ్లీషు నేర్పింది. అద్భుత గ్రహణ శక్తి వల్ల వేగంగా నేర్చుకోగలిగాడు. వ్యాకరణ దోషాలు కొన్ని వున్నప్పటికీ ఆయన వాక్య నిర్మాణం, పద ప్రయోగం ఇంగ్లీషు భాషా పండితులను సైతం ఆశ్చర్యపర్చింది. వచనంలో కవిత్వాన్ని ప్రయోగించాడు. మరణ శిక్ష విధించినపుడు వాంజెట్టి

చేసిన కోర్టు ఉపన్యాసం ఆయన భావ గాఢతకు, భాషా పాండిత్యానికీ నిదర్శనంగా పేర్కొంటారు అది జీవిత మనోవేదన నుంచి వెలువడిన సహజకవిత్వంగా మిగిలి పోయింది.

తన తాత్విక, రాజకీయ భావాలను, వైయక్తిక అనుభూతులను ఉన్నత స్థాయి సైద్ధాంతిక సూత్రీకరణల రూపంలో వ్యక్త పర్చగలిగిన మేధస్సు చేపలమ్ముకునే వాంజెట్టికి ఉందంటే నమ్మశక్యం కాదు:

*తరచుగా నా మనసు కల్లోల భరితమౌతుంది తరచుగా అది ఆలోచనారహితమౌతుంది*
*మరింత తరచుగా నేను నాఆలోచనలను వ్యక్తీకరించలేక పోతున్నాను*

*ఈ అంతర్గత నాటక సారాంశం వ్యక్తీకరణ గురించే కాదు- నా సొంత ఆలోచనలను అభిప్రాయాలను అనుభూతిని నా ఉద్వేగాలను, నమ్మకాలను, ఆశయాలను నేను సందేహించడం గురించి కూడా నేనొక విషయాన్ని ఆలోచించేటప్పుడూ, అర్థం చేసుకునేందుకు ప్రయత్నించినప్పుడూ దాన్ని నేను స్థల కాలాల్లో చూస్తాను అంతకు ముందూ ఆ తర్వాత ఉన్న అనేక విషయాల సంబంధంలో దాన్ని పరిశీలిస్తాను. ఆ సంబంధాలను గతంలోకి భవిష్యత్తులోకి అనుసరిస్తూ వెళ్ళి తెలియని మహాసముద్రంలో దాన్ని ముంచి నేనూ మునిగి పోతాను*

ఇలా ఆలోచించగలిగిన వాంజెట్టి విశిష్టత, వ్యక్తిత్వం లాయర్ థామ్సన్‌ను అమితంగా ఆకర్షించింది. ఒక సంతాప సభలో ఆయన ఇలా పేర్కొన్నాడు·

***వాంజెట్టికి చదువుంటే హార్వర్డ్ కాలేజీలో ప్రొఫెసర్ అయ్యుండేవాడు.***
***నాకు తెలిసిన సహజ మేధాసంపన్నుల్లో వాంజెట్టి ఒకడు.***

ఎమర్సన్ గురించి షెల్లీ కవితల గురించి వాంజెట్టి థామ్సన్‌తో మాట్లాడేవాడు వాంజెట్టి ఉపయోగించే ఇంగ్లీషు పదాలకు అర్థాలను థామ్సన్ నిఘంటువుల్లో వెతకాల్సి వచ్చేది.

వాంజెట్టికి ఎన్నో సందేహాలు. సమాధానాలు సంతృప్తి నివ్వలేక పోయేవి. *"జీవితం నా అవగాహనను పెంచింది. కానీ నా వ్యక్తీకరణ శక్తిని తగ్గించింది"* అంటాడాయన. ప్రతి విద్యార్థికి ఎదురైనట్టే మెదడులోకి చేరే విషయాలకు వ్యక్తీకరించబడే వాటికీ మధ్య అసమానత ఆయనకు ఎదురైంది దానిని పరిష్కరించుకోనేందుకు వాంజెట్టి పలు లేఖలు రాశాడు. ఆ లేఖలు శాక్కో లేఖలు కలిపి మేరియోన్ డెన్‌మన్ ఫ్రాంక్ ఫర్టర్, గార్డెనర్ జాక్సన్‌ల సంపాదకత్వంలో 1928 లో పుస్తకంగా వచ్చాయి.

పుస్తకాలు తెగ చదివే వాంజెట్టి జైల్లో తన విరామ సమయాన్ని అందుకోసమే ఎక్కువగా వెచ్చించాడు. మార్క్స్, డార్విన్, స్పెన్సర్, గోర్కి, విక్టర్ హ్యూగో, టాల్‌స్టాయ్, ఎమిలీ జోలా రచనలను, ప్రాచీన, ఆధునిక ప్రపంచ చరిత్రను అధ్యయనం చేశాడు. రాజనీతి శాస్త్రం, తత్వశాస్త్రం మతం వాంజెట్టికి అభిమాన విషయాలు. తీవ్ర ఉద్విగ్న భరిత క్షణాల్లో కూడా

వాంజెట్టి అధ్యయనాన్ని ఆపలేదు. ఆయనకు జైలు అధికారుల సహకారం కూడా లభించింది. డోస్టోవస్కీ లేఖలు, మార్కస్ అరెలియస్ 'మెడియేషన్స్', టాల్‌స్టాయ్ 'రిసరెక్షన్', రవీంద్రనాథ టాగోర్ రచనలు, కొన్ని వేదాంత గ్రంథాలు, రెనన్ రాసిన 'లైఫ్ ఆఫ్ జీసస్' చదివాడు. అనటోల్ ఫ్రాన్స్ రాసిన 'పెంగ్విన్ ఐలెండ్'ను 1925 లోనే చదివేశాడు.నాగరికత అని పిలవబడే వర్తమాన ప్రపంచాన్ని ధ్వంసం చేసి మానవుడు తిరిగి ఆదిమ జీవితానికి వెళ్తాడని, ఆతర్వాత మెల్లగా ప్రస్తుత పరిస్థితికి చేరుకుంటాడని ఆ నవలలో చెప్పిన అభిప్రాయం వాంజెట్టికి నచ్చింది. ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో అరాచక వాదం గురించి క్రోపోట్కిన్ రాసిన వ్యాసం ఆయన అభిమాన రచనల్లో ఒకటి. తనేంటో అర్థం చేసుకోవాలంటే ఆ వ్యాసాన్ని చదవవలసిందిగా గవర్నర్ ఫుల్లర్‌కు పంపిన పిటీషన్‌లో సూచించాడు. అరాచకవాద తత్వవేత్త ప్రౌఢన్ రచనలు వాంజెట్టిని అమితంగా ఆకర్షించాయి. ప్రౌఢన్‌రాసిన 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ' చదివాడు.

ప్రౌఢన్ రాసిన ఒక గ్రంథాన్ని ఇటాలియన్ భాష నుంచి ఇంగ్లీషులోకి అనువదించేందుకు ప్రయత్నించాడు. తన స్నేహితులు అందించిన అమెరికన్ సాహిత్యాన్ని కొంత మేరకు ఆకళింపు చేసుకున్నాడు. జాక్‌లండన్ 'ఏస్సే ఆన్ రివోల్ట్', విలియం జేమ్స్ 'సైకాలజీ' 'అమెరికన్ పోయిమ్స్," సింక్లేర్‌లెవిస్ 'ఎల్‌మీర్ గాంట్రీ,' అప్టన్ సింక్లేర్ 'జిమ్మీ హిగ్గిన్స్' కూడా వాంజెట్టి చదివిన రచనల్లో చోటు చేసుకున్నాయి. థోరే రాసిన 'ఫ్రెండ్ షిప్', ఎమర్సన్ ' పొలిటిక్స్', 'నేచర్', ' న్యూ ఇంగ్లాండ్ రిఫార్మ్'కూడా పూర్తి చేశాడు. బియర్డ్ రాసిన 'ద రైజ్ ఆఫ్ అమెరికన్ సివిలైజేషన్' ను మాత్రం పూర్తి చేయలేదు. చేయక ముందే కరెంటు కుర్చీకి ఆహుతయ్యాడు.

అరాచక వాదులు రాజ్యవ్యవస్థను, వ్యవస్థీకృత అధికారాన్ని తీవ్రంగా ద్వేషించారు. స్వేచ్ఛాయుత మానవ సమాజాన్ని, రాజ్యంలేని వ్యవస్థను ఆకాంక్షించారు. సోషలిస్టు వ్యవస్థను కమ్యూనిస్టు వ్యవస్థకు వెళ్ళేమార్గ మధ్య వ్యవస్థగా అరాచకవాదులు అంగీకరించలేదు. ఆ వ్యవస్థను కూడా క్రూరమైన అణిచివేతను ప్రయోగించే దశగా వర్ణించారు. రష్యాలో లెనిన్, స్టాలిన్‌ల నాయకత్వంలో అరాచక వాదులను వేటాడి చంపారని వాంజెట్టి ఒక చోట ప్రస్తావించాడు. రష్యాలో లెనిన్ నాయకత్వంలో విజయవంతమైన విప్లవం రాజ్యవ్యవస్థను మరో రూపంలో ప్రజలపై రుద్దినందువల్ల అది చేసే మేలేమీ లేదని వాంజెట్టి భావించాడు:

*రష్యాలో ఇది జరిగింది: జారిజం ఒక విప్లవం ద్వారా ధ్వంసం చేయబడింది; కొంత మంది యజమానుల ఆస్తులను స్వాధీన పర్చుకున్నారు; ఒక పార్టీ అధికారంలోకి వచ్చింది. దోపిడీని ఆపింది. ప్రజల అనుభవంలో వున్న సామాజిక ఆస్తిని తాను స్వాధీనం చేసుకుంది. ఆ క్షణం నుంచి విప్లవం తిరోగమించింది. ఒక చిన్న పార్టీకి చెందిన కొద్ది మంది నాయకులు రష్యాకు ఏకైక వాస్తవ నేతలయ్యారు.*

రష్యా విప్లవ నాయకత్వం పట్ల వాంజెట్టికి గౌరవం లేక పోయినా లెనిన్ మరణవార్త విని కంట తడి పెట్టాడు:

*లెనిన్ గతించాడు. ఆయన అనుద్దేశపూరితంగా రష్యా విప్లవాన్ని నాశనం చేశాడని నేను*

*నమ్మాను నా కామ్రేడ్స్ పలువురిని ఆయన జైలు పాలు చేశాడు చంపాడు అయినా ఆయన మంచిదని నిజమని నమ్మిన దాని కోసం పలు బాధలను అనుభవించాడు వీరోచితంగా శ్రమించాడు ఆయన మృతి గురించి, అంత్యక్రియల(?) గురించి చదివినప్పుడు నా కళ్ళలో నీళ్ళు నిండినట్టయింది.*

పెట్టుబడిదారీ రచయితలు, పత్రికలు లెనిన్ గురించి అవాస్తవాలు రాసి ఆయనపై బురదజల్లడాన్ని వాంజెట్టి వ్యతిరేకించాడు.

మనిషికి ఆత్మగౌరవం చాలా ముఖ్యమని వాంజెట్టి అభిప్రాయం. మనిషి ఆత్మగౌరవాన్ని హుందాతనాన్ని అసమాన వ్యవస్థ పలు రకాలుగా ధ్వంసం చేస్తుంది. న్యాయం గురించి వాంజెట్టి అభిప్రాయాలు కూడా ఆత్మ గౌరవం, హుందాతనం చుట్టూ పరిభ్రమిస్తాయి. మానవుల ఔన్నత్యం, దోషరాహిత్యం వారు ఎక్కువ స్వేచ్ఛను అనుభవించేలా చేయడం ద్వారా సాధ్యపడతాయని పీడన ద్వారా సాధ్యపడవని అంటాడు హింస ద్వారా మానవ సమాజ విముక్తి సాధ్యమేనని చెప్తాడు: అయితే అనవసర హింసను మాత్రం వ్యతిరేకించాడు:

*నేను తీవ్ర విధ్వంసకుడిని తీవ్ర హింసాత్మకుడిని వాస్తవ వాదిని నిష్పక్షపాతిని కొన్ని సార్లు నా ఆలోచనలు నాకే భయానకంగా తోస్తాయి దేవుడికీ నా శత్రువులకూ నా మాటలు అప్రియమైనవి*

హింసను విడనాడమని సహచరులకు సలహా ఇవ్వవలసిందిగా మరణించే రోజు లాయర్ థామ్సన్ అడిగితే సాధ్యం కాదన్నాడు వాంజెట్టి తన శత్రువులను క్షమించమని అడిగితే మొదట మౌనం వహించాడు థామ్సన్ మీది గౌరవంతో ఆ విషయాన్ని తర్వాత ఆలోచిస్తానని చెప్పాడు కరెంటు కుర్చీలో కూర్చున్న తర్వాత తన మాట నిలబెట్టుకున్నాడు శత్రువుల్లో కొందరిని క్షమిస్తున్నానని చెప్పాడు

వ్యక్తిగతసంబంధాల విషయంలో వాంజెట్టిది మృదువైన ఆప్యాయమైన ప్రజాస్వామిక వైఖరి తన శత్రువులైన థేయర్, ఫుల్లర్‌లను హంతకులు గా అభివర్ణించినా వ్యక్తిగత వైరుధ్యంతో కాక వారిని వ్యవస్థకు ప్రతినిధులుగా చూశాడు.

అవివాహితుడుగా బతికిన వాంజెట్టి పెళ్ళి ప్రస్తావన ఏనాడూ చేయలేదు. ఆయన భగ్న ప్రేమికుడని ఇటలీలోని మిలన్ నగరం నుంచి కొన్ని వార్తలు వెలువడ్డాయి. కాని వాటిని నమ్మేందుకు ఏ ఆధారాలూ లేవు. అర్థం కాని జబ్బుతో భయంకరంగా మృత్యువాత పడిన తల్లి స్మృతులు లైంగికత పట్ల వాంజెట్టి వైముఖ్యానికి కారణమై ఉండవచ్చని అంటారు. ఐతే సహజ లైంగిక విషయాల గురించి చర్చించేందుకు ఆయన ఏ మాత్రం సంకోచపడేవాడు కాదు.

దీర్ఘకాల జైలుజీవితం, అనిశ్చిత భవిష్యత్తు వాంజెట్టి మేధస్సుపై ఘోర ప్రభావాన్ని వేసిన సందర్భాలున్నాయి 1925 లో ఐదు నెలల పాటు పిచ్చాసుపత్రిలో గడిపాడు. తర్వాత కూడా కొంత కాలం ఆయన మతిభ్రమించింది త్వరగా కోలుకొని ధీరోదాత్తమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించి విషాద వాస్తవాన్ని కఠోర దీక్షతో భరించాడు.

# సాహిత్యం

**శాక్కో-వాంజెట్టి కేసు** గురించి వివిధ రూపాల్లో విస్తృత సాహిత్య సృజన జరిగింది. వార్తా పత్రికల సంపాదకీయాల్లో, వార్తా కథనాల్లో, వ్యాసాల్లో, ఇంటర్వ్యూలు, కవితలు, కథలు,నవలల్లో, చరిత్ర గ్రంధాల్లో, న్యాయశాస్త్ర గ్రంధాల్లో దాని గురించి కోట్ల పదాలు రాయబడ్డాయి. హార్వర్డ్ లా రివ్యూ నుంచి ట్రూ డిటెక్టివ్ మిస్టరీస్ వరకూ అనేక పత్రికలు ఈ కేసు గురించి ప్రచురించాయి. ప్రపంచంలో మరే ఇతర కేసు గురించి వెలువడనంత సాహిత్యం శాక్కో-వాంజెట్టి కేసు పై వెలువడింది. కేసు తొలి దశ నుంచి ఇప్పటి వరకూ ఇంగ్లీషులో అనేక ఇతర భాషల్లో నిరంతరాయంగా పలు రచనలు వెలువడుతూనే ఉన్నాయి.అయితే ఈ సాహిత్యం మొత్తంలో శాక్కో, వాంజెట్టిలను తప్ప వారి శత్రు కూటమిని సమర్థించిన సాహితీవేత్త ఒక్కరు కూడా లేక పోవడం విశేషం.

## కవిత్వం

శాక్కో-వాంజెట్టి కేసు గురించి ఇంగ్లీషులో 1948వరకూ 144 కవితలు అచ్చయ్యాయని అంచనా. వీటిలో కొన్నిటిని ఎంపిక చేసి రెండు సంపుటాలుగా వెలువరించారు. న్యాయవ్యవస్థ ప్రభుత్వ వ్యవస్థల క్రౌర్యం నుంచి మొత్తం అమెరికా సమాజపు వికృతత్వం వరకూ, శాక్కో వాంజెట్టిల జైలు జీవితం నుంచి ఉద్యమ ఔన్నత్యం దాకా అన్ని విషయాలూ అమెరికన్ కవితాగానానికి వస్తువులయ్యాయి. శాక్కో వాంజెట్టిల మరణం తమ అంతరాత్మ మరణంగా, తమను సజీవంగా దహనం చేయడంగా కవులు ఆక్రోశించారు. కేసు ప్రారంభమైన నాటి నుంచి, వాళ్ళిద్దరూ మరణించిన చాలా కాలంవరకూ కవితలు వెలువడుతూనే ఉన్నాయి.

ఉద్యమం ఉచ్ఛ స్థాయిలో ఉన్న కాలంలో ఉద్యమంలో స్వయంగా పాల్గొని పోలీసు నిర్బంధానికి గురైన కవయిత్రులు ఎడ్నా సెయింట్ విన్సెంట్ మిల్లే, లోలా రిట్జ్‌లు. వీరు అద్భుత కవిత్వాన్ని సృష్టించారని విమర్శకుల అంచనా. కేసుపై వెలువడిన కవితల్లో పన్నెండింటిని గొప్ప కవితలని అంచనా వేయగా అందులో వీరిద్దరూ రాసిన ఐదు కవితలు చోటు చేసుకోవడం

విశేషం. ఎడ్నా విరచిత 'జస్టిస్ డినైడ్ ఇన్ మసాచూసెట్స్', 'టు సానెట్స్ ఇన్ మెమొరి' అనే రెండు కవితలు 'ఫియర్' అనే కవితా వ్యాసం ఆ గొప్ప కవితల జాబితాలో చేరాయి ఫియర్ వ్యాసం అయినా దానిలోని కవితావేశం రీత్యా గొప్ప కవితగా విమర్శకులు భావించారు శాక్కో, వాంజెట్టిలను చంపనిచ్చిన మర్యాదస్తుల నిర్లిప్తత మీద, వారి కున్న భయాల గురించి ఆమె కసి ఈ వ్యాసాన్ని కవితగా మార్చింది

*రెండు పేర్లున్నాయి వాటిని మీరు నన్ను ప్రస్తావించనివ్వరు వాటి నాదమీకు గిట్టదు. మనుషులంతా చనిపోవాల్సిందేనని మీరంటారు వాళ్ళు చనిపోయారు. వాళ్ళ పేర్లు వాళ్ళతో పాటే నశించవచ్చు అవి నీటి అలలకు చెరిగి పోయే ఇసుక మీది రాతలేనని మీరంటారు మర్చిపోదాం అంటారు మీరు దాన్దేముంది! అదేమంత పెద్ద విషయం?*

*మీరన్నది నిజమే. అదేమంత పెద్ద విషయం కాకపోవచ్చు ఇంతకంటే సుందరమైన ప్రపంచంలో ఇది ఇంతకంటే పెద్ద విషయం అయ్యుండేది చర్చి చేసిన నేరాలలో మచ్చలు పడి విశాలమైన క్రైస్తవ మతం ముఖం మీద ఈ మరక నల్లగా కన్పించదు రాజ్యం చేసిన నేరాలలో తూట్లు పడ్డ, గాయపడ్డ స్వేచ్ఛ మీద ఈ చిరుగును గుర్తించడమే మహా కష్టం*

*అవును మీరన్నది నిజమే మనుషులు చనిపోతారని మరచి పోవడం మంచిది ఇప్పటి దాకా మనం మృత్యువును ఓడించే, లోబరచుకొనే, డబ్బుతో కొనేసే మార్గమేదీ కనిపెట్టలేదు ఏ క్షణంలోనైనా ఆకాశం మనపై విరిగి పడవచ్చు. బంగారు మృత్యుహస్తం అగాధం నుంచి బయటికి పొడుచుకు రావచ్చు. ఏ క్షణంలోనైనా గాలి విజృంభించి మన ఇళ్ళ కప్పులను ఊడ్చేసి మనల్ని ధూళిగా మార్చవచ్చు అదీకాకపోతే, ఏమైనప్పటికీ మనం త్వరలో చావడం ఖాయం. ఇలా జరుగుతుందని మర్చిపోవడం మంచిది*

అలా ప్రారంభమైన ఈ సుదీర్ఘ కవితావ్యాసంలో శాక్కో వాంజెట్టిల పేర్ల ప్రస్తావన ఎక్కడా లేదు కానీ వారి గురించి అద్భుతంగా ప్రస్తావన వుంది వారిద్దరూ మరణించినందుకు, పరిస్థితి ప్రశాంతంగా ఉన్నందుకు ఆనందించే వర్గాన్ని కవయిత్రి దుయ్యబడుతుంది. ఆమె అరాచకవాది కాదు. అందువల్లే తానీ విషయాలు స్వేచ్ఛగా చెప్పగలుగుతున్నా నంటుంది అరాచకవాదులంటే బాంబులు వేసే వారని భద్రజీవులు అనుకోవడం సరికాదనీ, నిఘంటు అర్థం వేరేననీ చెప్తుంది. మానవులు స్వాభావికంగా మంచివారనీ, వారి మానాన వారినొదిలేస్తే తమను తాము ప్రశాంతంగా పాలించుకోగలరని నమ్మే వాళ్ళే అరాచకవాదులని నిఘంటు అర్థాన్ని ఉల్లేఖిస్తుంది న్యాయం కోర్టు హాలు తలుపు మీదున్న రాతిబొమ్మ అయిన చోట సమాజ తంత్రులను మీటినందుకు శాక్కో, వాంజెట్టిలను చంపేశారని ఎడ్నా ఆక్రోశించింది.

ఈ కవితా వ్యాసం 1927 నవంబర్9న అవుట్‌లుక్ పత్రికలో ప్రచురించబడింది. వ్యాసాన్ని కొనియాడుతూ, విమర్శిస్తూ వందలాది పాఠకులు లేఖలు రాశారు. ఆ పత్రిక సంపాదకుడి కోరిక

మేరకు ఆ లేఖలను ఓ సైకాలజిస్టు చదివి పాఠకుల మనోవిశ్లేషణ చేస్తూ ఒక వ్యాసం రాశాడు. అలా చాలా కాలం వరకూ ఈ వ్యాసం గురించి చర్చ జరిగింది.

లోలా రిట్జ్ రాసిన 'టు ఇన్ ద డెత్ హౌస్' 72 పాదాల సుదీర్ఘ కవిత. 1928 లో ఇది అచ్చయింది. ఈమెదే 384 పాదాల సుదీర్ఘ కవిత 'త్రీ మెన్‌డై' 1935 లో వెలువడింది. ఇవి రెండూ కూడా పన్నెండు గొప్ప కవితల్లో చోటు చేసుకున్నాయి. ప్రముఖమైన పన్నెండు కవితల్లో మిగిలినవి ఇవి: 'ద కండెమ్డ్' (విటర్ బైనర్), 'నాట్ శాక్కొ, వాంజెట్టి' (కౌ- టీ కుల్సెన్) 'ఫ్లేమ్స్' (మెర్రిల్‌రూట్), 'ఫర్ సెయింట్ బార్టొలోమియోస్ డే' (మాల్కొమ్ క్రౌలీ) 'ప్రెయర్ ఇన్ మసాచూసెట్స్' (ఆర్థర్ డేవిడ్ ఫికే), 'జంటిల్మెన్ ఆఫ్ మసాచూసెట్స్' (జెరోమ్ రొరొటి), 'ఫర్ ద ఆనర్ ఆఫ్ మసాచూసెట్స్' (బి.డి.అల్లిసన్). చివరిది 72 పాదాల సుదీర్ఘ కవిత.

ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన ప్రముఖ నవలా రచయిత జాన్ డాస్ పాస్సోస్ కవిత 'దే ఆర్ డెడ్‌నౌ'కు కథా వస్తువు శాక్కొ, వాంజెట్టి జైలు జీవితమే:

ఇది కవిత కాదు
ఇది బూడిదరంగు జైలు దుస్తుల్లో ఉన్న ఇద్దరి కథ
ఒకరు శల్యమైన తన చేతుల వేపు చూస్తున్నారు
ఏడేళ్ళుగా శ్రమ ఎరుగని చేతులవి
ఒక ఏడాది ఎంత పొడవైందో మీకు తెలుసా
శూన్య స్వప్నాల ఉక్కిరి బిక్కిరితో ఖాళీగా ఉన్న
జైలుగదిలో
రోజంటే మంచం మీద ఇరవై మూడు గంటలైన వేళ
రోజుకు ఎన్ని గంటలో మీకు తెలుసా

...........

వాళ్ళిప్పుడు మృతులు
నల్ల మరమనుషులు గెల్చారు
వాళ్ళు దారుణంగా దహించబడ్డారు
వాళ్ళ మాంసం మసాచూసెట్స్ గాల్లో కలిసింది
వాళ్ళ స్వప్నాలు గాల్లో కలిశాయి
"వాళ్ళిప్పుడు మృతులు"
గవర్నర్ కార్యదర్శి గవర్నర్ చెవి కొరుకుతాడు

సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నుంచి హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడి దాకా అందరూ వాళ్ళిద్దరు చనిపోయినందుకు సంతోషిస్తారని చెప్తూ పాస్సోస్ తన కవితను ఇలా ముగిస్తాడు:

*స్వప్నాల నుంచి వాళ్ళు విముక్తమయ్యారు*
*జిడ్డోడే జైలు దుస్తుల నుంచి వారు విడుదలయ్యారు*
*ఒకే పాట పాడుతూ*
*వారి గొంతుకలు వేయి రెట్లు ప్రతి ధ్వనిస్తాయి*
*మసాచూసెట్స్ కర్ణభేరిని పగులగొట్టేందుకై-*
*సాహసముంటే నువ్వు దాన్ని పద్యంగా మార్చు*

'అవర్ మర్డర్డ్ కామ్రేడ్స్' శీర్షికన రాసిన కవితలో కవి మేయర్ ఇద్దరు మహాయోధులకు వీడ్కోలు చెప్తాడు. మరోకవి బర్న్స్ ఇలా హెచ్చరిస్తాడు:

*క్రూరమైన మనుషుల్లారా జాగ్రత్త! మీరు చంపిన క్రీస్తులు*
*మాతో దృఢంగా నడుస్తారిప్పటికీ.....*
*అఖండ మానవాళి న్యాయస్థానంలో*
*మీరు మూఢులుగా అంధులుగా శిక్షించబడతారు*

ఇవన్నీ ఒక ఎత్తైతే, వాంజెట్టి కోర్టు ఉపన్యాసంలో శాక్కో గురించి చెప్పిన వాక్యాలు కొన్ని ఒక ఆధునిక అమెరికన్ కవితా సంకలనంలో కవితగా అచ్చుకావడం విశేషం. శాక్కో వాంజెట్టిలను చంపడాన్ని సమర్థిస్తూ ఒక్క కవిత కూడా వెలువడక పోవడం విశేషం.

## నవలలు

పలు ప్రఖ్యాత నవలలకు కూడా శాక్కో-వాంజెట్టి గాథ కథా వస్తువైంది. ప్రముఖ ఇంగ్లీషు, అమెరికన్ నవలాకారులు హెచ్.జి.వెల్స్, అప్టన్ సింక్లేర్, హోవర్డ్ ఫాస్ట్, జాన్‌డాస్ పాసోస్ ఈ సమకాలీన వాస్తవ గాథను నవలలుగా మార్చారు. ఫ్రెంచి భాషలో కూడా 1950 లోపే ఒక నవల అచ్చయింది.

1927-1950 మధ్య కాలంలో ఈ కేసు గురించి ఇంగ్లీషులో వెలువడిన నవలలు ఇవి:

**బోస్టన్** *(అప్టన్ సింక్లేర్-1928)* **మిస్టర్ బ్లెట్స్‌వర్తీ ఆన్ ట్రాంపోల్ ఐలెండ్** *(హెచ్.జి.వెల్స్-1928)* **పే డే** *(నాథన్ ఆష్-1930)* **వియ్ యాక్సెప్ట్ విత్ ప్లెషర్** *(బెర్నార్డ్ డీ వోటో-1934)* **ద బిగ్‌మనీ** *(జాన్ డాస్ పాసోస్-1936)* **జేక్‌హోం** *(రూత్ మెక్‌కెన్నీ- 1943)*

**బెర్నార్డ్ క్లేర్** *(జేమ్స్ ఫారెల్-1946)*

**ద పాషన్ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి** *(హోవర్డ్ ఫాస్ట్- 1949)*

*'బోస్టన్', 'జేక్‌హోం', 'ద పాషన్ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి '* లకు పూర్తి కథావస్తువు శాక్కో, వాంజెట్టి కేసే.

అప్టన్ సింక్లేర్ 'బోస్టన్ ' ఏడు వందల యాభై ఐదు పేజీలున్న సుదీర్ఘ నవల. ఆయన

రాసిన గొప్ప నవలల్లో ఇదొకటని విమర్శకుల అంచనా. శాక్కొ, వాంజెట్టిలు మరణించిన రోజున ఈ నవల రాసేందుకు సింక్లేర్ నిశ్చయించుకున్నాడు. శాక్కొ, వాంజెట్టిల గురించి నవల రాయవలసిందని అభ్యర్థిస్తూ ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల నుంచి సింక్లేర్‌కు టెలిగ్రాంలు అందాయి. అందుబాటులో వున్న సమాచారాన్నంతా అధ్యయనం చేశాడు. అవాస్తమైన విషయాలు తన నవలలో లేకుండా సింక్లేర్ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఉద్యమంలో మొదటి నుంచీ చివరి వరకూ పని చేసిన పన్నెండు మంది ఉద్యమనాయకులకు నవల వ్రాత ప్రతిని చూపించి సరిదిద్దాడు. సంపన్నులు, దరిద్రులు, వారి జీవితాల మధ్య వ్యత్యాసం, శాక్కొ-వాంజెట్టి కేసు వలన ఇరు వర్గాల మధ్య తలెత్తిన భావ సంఘర్షణ ఈ నవలలో అద్భుతంగా చిత్రించబడ్డాయి.

ఒక మాజీ గవర్నర్ మరణించగా ఆయన కూతుళ్ళు ఆస్తి కోసం ఘర్షణ పడతారు. వృద్ధాప్యంలో ఉన్న గవర్నర్ భార్య కొర్నెలియా జీవితం పట్ల విసుగుతో ఆస్తిని, కుటుంబాన్ని వదిలేసి స్వతంత్రంగా బతికేందుకు నిర్ణయించుకుని రహస్యంగా ఇంటి నుంచి బయట పడుతుంది. ప్లిమత్ పట్టణానికి చేరి కాయకష్టం చేస్తూ పొట్ట పోసుకుంటూ బ్రినీ కుటుంబానికి దగ్గరౌతుంది. ఆమెకు వాంజెట్టి పరిచయమౌతాడు. ఒక ఏడాది గడిచాక మనుమరాలు బెట్టీ ఆమెను గుర్తు పట్టి తిరిగి స్వగృహానికి తీసుకెళ్తుంది. కొర్నెలియా, బెట్టీలు సమాజాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. పామర్ రెయిడ్స్ కాలం వచ్చే సరికి వారిద్దరూ యూరప్‌లో ఉంటారు. స్వదేశంలో ఏం జరుగుతోందో వాళ్ళకు తెలియదు. వాంజెట్టి అరెస్టయ్యాడని కొన్నాళ్ళకు వాళ్ళకు తెలుస్తుంది. తిరిగి అమెరికా వచ్చేస్తారు. కొర్నెలియా అప్పటి నుంచీ డిఫెన్స్ కమిటీ లో ఉండి తీవ్రంగా కృషి చేస్తుంది. శాక్కొ, వాంజెట్టిలను చంపిన రోజున ఆమె తీవ్ర మనోవేదనకు గురౌతుంది. బోస్టన్ నగరంలో 1921 నుంచి 1927 వరకు జరిగిన పోరాటంలోని ఎన్నో ఘటనలను సింక్లేర్ పూర్తివివరాలతో నవలా కథనంలో ఇమిడ్చాడు.

ప్రపంచ ప్రఖ్యాత బ్రిటీష్ నవలాకారుడు హెచ్.జి.వెల్స్ తన 'మిస్టర్ బ్లెట్స్‌వర్తీ ఆన్ రాంపోల్ ఐలెండ్' నవలలో ఈ కేసు గురించి ప్రతిభావంతంగా చర్చించాడు. అనాగరికులైన ఆటవికులు నివశించే రాంపోల్‌దీవికి ప్రమాదవశాత్తూ నవలా నాయకుడు చేరుకుంటాడు. భయంకర యుద్ధ దేవుడు ఆర్డమ్‌నూ, చరిత్ర పూర్వయుగం నాటి మెగాథెరియనూ ద్వీపవాసులు వేటాడుతుంటారు. కొంత కాలానికి నవలా నాయకుడు స్వదేశమైన ఇంగ్లాండ్‌కు చేరుకుంటాడు. శాక్కొ - వాంజెట్టి కేసు గురించి తెలుసుకుని తాను ఇంకా రాంపోల్‌దీవిలోనే ఆటవికుల మధ్య ఉన్నట్టుగా భ్రమపడి పిచ్చివాడౌతాడు. స్వస్థత చేకూరాక ఇలా అంటాడు:

> *మసాచూసెట్స్‌లో శాక్కొ, వాంజెట్టిలపై కేసు విచారణ, అప్పీళ్ళు, వాయిదాలు, జాప్యాలు, తిరిగి విచారణలూ, మరణశిక్ష అమలూ వీటన్నిటి వల్ల నా మెదడుపై చాలా కాలం పేరుకున్న వత్తిళ్ళ ఫలితంగా నేననుభవించిన నిగూఢమైన సంక్షోభాన్ని గ్రేవ్స్ ఒక్కడికి మాత్రమే చెప్పగలిగాను.*

*వారికి విధించిన శిక్షను పున: పరిశీలించడం ఒక ఉన్నత సమాజపు నైతిక మేధోపరమైన విలువలకు గీటురాయి కాగలిగే విషయాల్లో ఒకటని నేను నమ్మాను నా ఈ అభిప్రాయం తప్పయితే, నేను హార్వర్డ్‌కు చెందిన ఫ్రాంక్ ఫర్టర్‌తో పాటు, ప్రముఖ న్యాయవేత్త థామ్సన్‌తో పాటు పొరపడిన వాణ్ణవుతాను*

శాక్కో, వాంజెట్టి ఘటనలో అమెరికా రాజ్యవ్యవస్థ వైఖరి చూసి రాంపోల్ ద్వీపవాసుల యుద్ధ దేవుడు ఆర్డమ్ తిరిగి యుద్ధం ప్రకటించినట్టుగా నవలా నాయకుడు భ్రమకు లోనౌతాడు. అమెరికాను రాంపోల్ దీవితోనూ, శాక్కో, వాంజెట్టిలను ఎక్కడినుంచో అక్కడికొచ్చి బలైపోయిన దురదృష్టవంతులుగాను పోల్చుకుంటాడు

మొదటి శ్రేణి అమెరికన్ నవలా రచయిత జాన్ డాస్ పాస్సోస్ తన ఇరవై ఐదో ఏట 'త్రీ సోల్జర్స్' నవలతో 1921 లో అమెరికా సాహితీ రంగంలోకి అడుగు పెట్టాడు. శాక్కో, వాంజెట్టిల కోసం తీవ్ర కృషి చేశాడు. కరపత్రాలు రాశాడు పికెటింగులలో పాల్గొని అరెస్టయ్యాడు. ఆ ఏడేళ్ళు ఉద్యమంలో పాలుపంచుకొన్నాడు. అమెరికా సామాజిక వ్యవస్థ గురించి ఆయన అభిప్రాయాలు ఆ క్రమంలోనే రూపొందాయి ఆయన వ్యక్తిత్వ వికాసానికి ఉద్యమం బాగా దోహపడింది. ఆ కాలంలో సమాజంలో పరస్పర విరుద్ధమైన రెండు వర్గాల మధ్య ఘర్షణను స్వయంగా దర్శించగలిగాడు.

అమెరికా సామాజిక వ్యవస్థను శవపరీక్ష చేస్తూ పాస్సోస్ 'యు ఎస్ ఎ' పేరిట1500 పేజీల సుదీర్ఘమైన మూడు నవలల మాలికను ఆ తర్వాతి కాలంలో రాశాడు సాంప్రదాయ విరుద్ధమైన రీతిలో సాగే ఈ నవలలో ఒకటి నుంచి పదమూడు పేజీల విస్తీర్ణంలో బ్రాకెట్లలో 'కెమెరా ఐ' 'న్యూస్‌రీల్' అనే విభాగాలు పొదగబడ్డాయి. ఈ మూడు నవలల్లో మొదటి రెండింటిలో కేసు గురించిన ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ చివరి నవల '*ద బిగ్‌మనీ*' లో మేరీ ఫ్రెంచ్ అనే పాత్రను ప్రవేశపెట్టి ఆమె డిఫెన్స్ కమిటీలో పని చేయడం గురించి, ఉద్యమంపై పోలీసు నిర్బంధం గురించి కథనాన్ని నడిపాడు. అందులో '*న్యూస్ రీల్*', '*ద కెమెరా ఐ*' భాగాల్లో కేసు గురించి ప్రత్యక్షంగా ప్రస్తావించాడు. '*న్యూస్ రీల్ LXVI*' లో పరస్పర విరుద్ధమైన, అసందర్భమైన వార్తా శీర్షికలను ఒక చోట కూర్చాడు. చివరగా వాటిలో ఎలాంటి సంబంధంలేని శాక్కో లేఖను ఉల్లేఖించి శాక్కో మానవ హృదయాన్ని దర్శింప చేశాడు. '*ద కెమెరా ఐ(49)*'లో వాంజెట్టిని ప్రాసిక్యూట్ చేయడం ఎంత అన్యాయమో వివరిస్తాడు. '*ద కెమెరా ఐ (50)*'లో అమెరికా పేద,సంపన్న జాతులుగా విడిపోవడాన్ని ప్రస్తావిస్తాడు. డబ్బు లేక పోవడం గానే కాక ప్రజలకు కనీసం తమ ప్రాణాన్ని రక్షించుకొనే అధికారం లేక పోవడంగా కూడా ఈ అంతరాన్ని గమనించమని కోరతాడు. కవితావేశంతో సాగిన ఈ ప్రస్తావన ఇలా నడుస్తుంది:

*వాళ్ళు మనల్ని వీధుల్లో చెదరగొట్టారు. వాళ్ళు బలవంతులు. వాళ్ళు ధనవంతులు. వాళ్ళు రాజకీయ వేత్తలను, పత్రికా సంపాదకులనూ, ముసలి న్యాయమూర్తులనూ, ఖ్యాతి గడించిన*

*అల్పులమూ,విద్యావేత్తలమూ కొంటారు,తొలిగిస్తారు. (వినండి! వాణిజ్యవేత్తలారా! విద్యావేత్తలారా! న్యాయమూర్తుల్లారా! అమెరికా తన ద్రోహులను మర్చిపోదు) తుపాకులు పట్టుకొని యూనిఫారం తొడుక్కున్న, పోలీసు కార్లున్న, పహారా వాహనాలున్న మనుషుల్ని కిరాయికి తీసుకుంటారు.*

*వారి కిరాయి మనుషులు న్యాయపీఠం మీద ఆసీనులౌతారు. బల్లల మీదకాళ్ళు పెట్టుకుని స్టేట్ హౌస్ భవనంలో కూర్చుంటారు. వారికి మన విశ్వాసాలు తెలియవు. వారికి డాలర్లున్నాయి. తుపాకులున్నాయి. సాయుధ బలగాలున్నాయి. అధికారం మొలిచే తావులున్నాయి.*

*వారు కరెంటు కుర్చీని తయారు చేశారు. మీట నొక్కేందుకు తలారిని కిరాయికి తీసుకున్నారు.*

*సరే కానీయండి మనం రెండు జాతులం!*

ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న పాస్సోస్ ఈ కేసు గురించి పూర్తినవల రాయక పోవడం అసంతృప్తిగా మిగిలిపోయింది. కానీ, 'ద బిగ్ మనీ'లో కొన్ని పేజీలే అయినా కేసు గురించిన ప్రస్తావన శక్తివంతమైనదని, లోటును కొంత వరకు తీర్చగలిగిందనీ నవలా విమర్శకులు భావించారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుంచి 1930 లలో వచ్చిన ఆర్థిక సంక్షోభం వరకూ అమెరికా మేధోరంగంలో జరిగిన ఏకైక ప్రముఖ ఘటనగా 'యు.ఎస్.ఎ' కీర్తించబడింది.

శాక్కో, వాంజెట్టి మృతి చెందిన రెండు దశాబ్దాల తర్వాత ప్రముఖ అమెరికన్ నవలా రచయిత హోవర్డ్ ఫాస్ట్ 'ద పాషన్ ఆఫ్ శాక్కో అండ్‌వాంజెట్టి' ప్రచురించాడు. రెండు వందలకు పైగా పేజీలున్న ఈ నవలలో శాక్కో, వాంజెట్టి జీవితంలో చివరి 18 గంటల ఉద్విగ్నభరిత ఘట్టాలను, జైలుజీవితాన్ని, ప్రపంచ వ్యాప్త నిరసనోద్యమాన్ని, అద్భుతమైన శైలిలో హృదయాలకు హత్తుకునేటట్టు చిత్రించాడు. వాస్తవ పాత్రలతో డాక్యుమెంటరీ రూపంలో సాగే ఈ నవలలో శాక్కో, వాంజెట్టి, మెడైరోస్ పేర్లు తప్ప మరే పాత్రకూ పేరు లేదు. పాత్రల హోదాలను బట్టి పాఠకులు వాటిని పోల్చుకోవచ్చు. న్యాయమూర్తి థేయర్ మనస్సాక్షిని, శాక్కో, వాంజెట్టిల జైలుజీవితాన్ని చిత్రీకరించిన తీరు గొప్పది. శిక్ష విధించే సమయంలో శాక్కో, వాంజెట్టిలు చేసిన ఉపన్యాసాల పూర్తి పాఠాన్ని రచయిత ఇందులో పేర్కొన్నాడు. మెడైరోస్‌పాత్రను కూడాసానుభూతి ఉట్టిపడేలా మానవతా దృక్పథంతో మలిచాడు. ఇటలీలో వాంజెట్టి గ్రామానికి చెందిన కొందరు పెద్దలు నియంత ముస్సోలినీని కలిసి మరణశిక్ష రద్దు చేయించేందుకు చివరి నిమిషంలో చేసిన ప్రయత్నాలూ, రోజినా, లూగియా చివరి రోజు గవర్నర్‌ను కలిసినప్పటి హృదయవిదారక దృశ్యం, మరణశిక్ష అమలును వర్ణించిన తీరూ పాఠకుల గుండెలను కరిగిస్తాయి.

కమ్యూనిస్టు నవలా రచయిత్రి రూత్ మెక్‌కెన్నీ రాసిన 'జేక్‌హోం' నవల పలు విమర్శలకు గురైనా మంచి నవలగా మాత్రం పేరు తెచ్చుకుంది. డిఫెన్స్ కమిటీ పని తీరు పట్ల, లిబరల్ భావాలున్న 'మితవాద' న్యాయవాదుల, మేధావుల ఎత్తుగడల పట్ల అమెరికన్ కమ్యూనిస్టుల విమర్శను ఈనవల ప్రతిబింబించింది. డిఫెన్స్ కమిటీ నాయకుల పాత్రలకు ఈ నవల

అన్యాయం చేసిందని కొందరు విమర్శించారు. కార్మిక నాయకుడు జేక్ డిఫెన్స్ కమిటీ లో చేసిన పని, నిధుల వసూళ్ళకోసం జరిగిన పర్యటనల సందర్భంగా కమిటీకి ఎదురైన అనుభవాలు ఈ నవలలో చక్కగా వివరించబడ్డాయని విమర్శకుల భావన. ఉద్యమం కథాంశంగా సాగిన ఈ నవలలో డిఫెన్స్ కమిటీ కి చెందిన వివిధ నాయకుల లక్షణాలను కలబోసి కొత్త పాత్రలను రచయిత్రి సృష్టించింది.

పలు నవలలు రచించిన బెర్నార్డ్ డీ వోటో ప్రఖ్యాత విమర్శకుడు పత్రికా సంపాదకుడు, చరిత్రకారుడూ కూడా.ఆయన 1934 లో ప్రచురించిన 'వియ్ యాక్సెప్ట్ విత్ ప్లెషర్' నవలలో బోస్టన్ నగర నేపథ్యంలో 1927 లో ఐదుగురు యువకులు శాక్కో-వాంజెట్టి ఉద్యమానికి ప్రభావితమైన తీరు కథాంశం. వారిలో నలుగురు డిఫెన్స్ కమిటీలో వివిధ స్థాయిల్లో పని చేస్తారు. పోలీసులతో తన్నులు తింటారు. ఐదో వాడు ఏ పనీ చేయడు. నిర్లిప్తంగా ఉంటాడు. శాక్కో, వాంజెట్టిలు నేరస్తులా కాదా అన్న మీమాంసలో పడకుండా వారి గురించిన వ్యక్తిగత విషయాలుగా కాక సమాజంపై ఉద్యమ ప్రభావాన్ని ఈ నవల చక్కగా వివరిస్తుంది.

శాక్కో, వాంజెట్టిలు చని పోయిన రోజు న్యూయార్క్‌లో నివసించే జిమ్ అనే యువకుడి జీవితంలోని కొన్ని గంటలను నాథన్ యాష్ 'పే డే' నవలగా రూపుదిద్దాడు. రాజకీయ పరిజ్ఞానం లేని పేద జిమ్ ఊహాలోకాల్లో విహరిస్తుంటాడు. అయితే తన వ్యక్తిగత జీవితంలోని వైఫల్యాల కన్నా ముఖ్యమైన గొప్ప సామాజిక ఘటనేదో జరుగుతోందని అతనికి అస్పష్టంగా తెలుస్తుంటుంది. పత్రికల్లో ఉద్యమ వార్తలు చదువుతాడు. 'శాక్కో, వాంజెట్టి రెడ్స్ కాబట్టే వారు అందుకు తగిన మూల్యం చెల్లించాల్సిందే' నంటూ గొణుక్కుంటాడు. నిరసన ప్రదర్శనలో అతని పక్కింటి అమ్మాయి పాల్గొంటుంది. ఆమెను పోలీసులు కొడుతుంటే జిమ్ రక్షిస్తాడు. జిమ్‌కు పోలీసుల మీద బాగా కోపం వస్తుంది. వెంటనే ఉద్యమంలోకి దూకుతాడు. ఒక యువ పోలీసు అధికారి జిమ్ పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరించడంతో మళ్ళీ ఆలోచనలో పడతాడు. తన పాత ఊహా ప్రపంచంలోకి జారుకుంటాడు. శాక్కో, వాంజెట్టిలను సమర్థించే పత్రికా విలేఖరికీ, వ్యతిరేకించే సెనెటర్‌కూ మధ్య ఒక బార్‌లో జరిగిన వాదోపవాదాలు విని జిమ్ మళ్ళీ ఉద్యమం గురించిఆలోచిస్తాడు. తనసోదరుడు యుద్ధంలో చనిపోయినప్పుడు 'ఎవరు మాట్లాడారు?' అని ప్రశ్నించుకుని ఏదేమైతే తనకేమిటని మళ్లీ నిర్లిప్తతలోకి జారుకుంటాడు. వ్యక్తుల జీవితం కంటే సామాజిక ఘటన ఎలా గొప్పదో ఈ నవలలో చూపించిన తీరు ప్రశంసలందుకుంది.

జేమ్స్ ఫారెల్ నవల 'బెర్నార్డ్ క్లేర్' 1946 లో అచ్చయింది. శాక్కో, వాంజెట్టిలను చంపిన రోజున న్యూయార్క్ యూనియన్ స్క్వేర్‌లో నిరసనోద్యమంలో పాల్గొన్న రచయిత స్వీయ అనుభవాలే ఈ నవలగా రూపుదాల్చాయి. ఒక పేద యువకుడి వెలుగు నీడల జీవిత నేపథ్యంలో శాక్కో- వాంజెట్టి ఉద్యమాన్ని ఈ నవల వివరిస్తుంది. నవలా నాయకుడిని 1927

మార్చి- ఆగస్టు మధ్య కాలంలో జరిగిన ఉద్యమం ఆకర్షిస్తుంది తన సాటి కార్మికులు గుమాస్తాలు శాక్కో, వాంజెట్టిల పట్ల వ్యతిరేకత ప్రదర్శించడం చూసి అతను విస్తుపోతాడు అరాచక వాదులనూ, కమ్యూనిస్టులనూ చంపేయాలని సాధారణ ప్రజలు అభిప్రాయపడటం అతన్ని ఆశ్చర్య పరుస్తుంది. శాక్కో, వాంజెట్టిల మరణవార్తను దినపత్రికలో చదివి బెర్నార్డ్ ఏడుస్తాడు. *'సూర్యుడిది ఎర్రజెండా! డబ్బుది ఆకుపచ్చ జెండా! మృత్యువుది నల్లజెండా....'* శాక్కో, వాంజెట్టిలు ఎర్రజెండా కోసం చనిపోయారు అంటూ బాధపడతాడు. మరణశిక్ష అమలు జరిపిన రాత్రి నాటి ఉద్వేగ భరిత సన్నివేశాలు పోలీసుల బలప్రయోగం ఘట్టాలూ, మరణవార్త విని కొందరికి హిస్టీరియా వచ్చిన విషాదభరిత దృశ్యాలూ ఈ నవలలో కళ్ళకు కట్టుకునేలా చిత్రించబడ్డాయి.

నవలలు కాక ఈ కేసు గురించిన వచన రచనల్లో *'హెవెన్‌లీ డిస్‌కోర్సు'* ను పేర్కొనవచ్చు. అనటోల్ ఫ్రాన్స్, మార్క్ ట్వెయిన్ కోవకు చెందిన రచయిత ఛార్లెస్ ఎర్‌స్కైన్ స్కాట్‌వుడ్ తన 75వ ఏట ఈ వ్యంగ్య రచన చేశాడు. తాత్విక అరాచకవాద భావాలను నమ్మే ఈ అగ్రగణ్య రచయిత అందులో ఒక ప్రకరణాన్ని *శాక్కో- వాంజెట్టి* కేసు కు కేటాయించాడు దాని శీర్షిక *'గాడ్ ఈజ్ ఇన్ హిజ్ హెవెన్- ఆల్ ఈజ్ రాంగ్ విత్ ద వరల్డ్'* . స్వర్గం నేపథ్యంగా కథ సాగుతుంది. దేవుడి ఎదుట శాక్కో, వాంజెట్టిలు హాజరై తమ కథ వినిపిస్తారు. మార్క్ ట్వెయిన్, అబ్రహాం లింకన్ లాంటి అమెరికా ప్రముఖులు అక్కడ ఉండి ఆ కథను వింటారు. మసాచూసెట్స్‌లో శాక్కో-వాంజెట్టి కేసులో విచారణ జరిగిన తీరును వారంతా నిరసిస్తారు. లాయర్ వృత్తిలో ఉన్న రచయితకు కేసు వివరాలు బాగా తెలుసు. వాటన్నిటినీ ఆయన తన రచనలో వివరంగా చెప్పాడు. బ్రిటీషు, అమెరికన్ నేర విచారణా పద్ధతులూ, ప్రాక్టార్, సాల్సెడో, స్లెయిన్, గార్డ్ గురించిన వివరాలూ, ఆయుధ నిపుణుల సాక్ష్యం, అపరాధ భావన, థేయర్ పక్షపాతం, శాక్కో జీవితం,మెడైరోస్ నేరం ఒప్పుకున్న సంగతులూ వివరంగా ఇందులో రచయిత చర్చించాడు. గవర్నర్ సలహా సంఘం సభ్యులు యాజమాన్య వర్గం వారేనని చెప్పి పాలక వర్గ రక్తపిపాసత్వాన్ని ఎండగట్టాడు ఇవన్నీ తెలుసుకున్న దేవుడు కోపం పట్టలేక పోతాడు. శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని ప్రకటిస్తాడు.

## నాటకాలు

శాక్కో, వాంజెట్టి మరణానంతరం మొదటి రెండు దశాబ్దాల్లో ఐదు ఇంగ్లీషు నాటకాలు, ఒక ఫ్రెంచి నాటకం వెలువడ్డాయి. ఈ నాటకాలు అమెరికన్ రంగ స్థలంపై ప్రదర్శనకు కూడా నో· .కున్నాయి. ఒక నాటకాన్ని చలన చిత్రంగా నిర్మించారు.

ప్రముఖ అమెరికన్ నాటక రచయిత మాక్స్‌వెల్ ఆండర్సన్ రాసిన రెండు నాటకాలు వీటిలో ముఖ్యమైనవి. హెరాల్డ్ హికర్సన్ తోకలిసి 1928 లో ఆయన *'గాడ్స్ ఆఫ్ లైట్నింగ్'* నాటకం

సృష్టించాడు. 1935 లో ఇదే కథా వస్తువుగా 'వింటర్ సెట్' అనే నాటకాన్నికూడా మాక్స్వెల్ రూపొందించాడు.

ఒక కార్మిక వాడలో బందిపోటు సువోరిన్ నడిపే రెస్టారెంట్‌లో 'గాడ్స్ ఆఫ్ లైట్నింగ్' ప్రారంభమౌతుంది. మెడైరోస్, మోరెల్లిలను కలబోసి సృష్టించిన పాత్ర సువోరిన్. ఆ రెస్టారెంట్ ఉన్న భవనంలోనే మరో గదిలో కార్మిక నాయకులు, అరాచక వాదులు సమావేశమౌతారు. మాక్‌రెడీ, కాప్రరో అనబడే అరాచకవాదులను హత్య- బందిపోటు దొంగతనం కేసులో పోలీసులు అరెస్టు చేస్తారు. కాప్రరో పాత్ర శాక్కో, వాంజెట్టిల లక్షణాల మిశ్రమం కాగా, మాక్‌రెడీ రచయిత సృష్టించిన పాత్ర. రెండవ అంకం జిల్లా అటార్నీ కార్యాలయంలో ప్రారంభమౌతుంది. జిల్లా అటార్నీ సాక్షులను ఇంటర్వ్యూ చేస్తాడు. ప్రాసిక్యూషన్ సాక్ష్యాల బలహీనతలను ఈ దృశ్యంద్వారా రచయిత బయట పెట్టాడు. తర్వాత దృశ్యం కోర్టులో నడుస్తుంది. నేరాన్ని తానే చేశానని సువోరిన్ అంగీకరించి అందులో కాప్రరో, మాక్‌రెడీలకు ప్రమేయం లేదని చెప్తాడు. అయినప్పటికీ కోర్టు సువోరిన్‌ను నమ్మదు. కోర్టు తీర్పు మీద న్యాయశాస్త్ర పరమైన చర్చను తర్వాత దృశ్యంలో చూపిస్తాడు. మూడవ అంకం సువోరిన్ రెస్టారెంట్‌లో నడుస్తుంది. వేరే కేసులో తనకు విధించిన మరణ శిక్షను తప్పించుకొనేందుకు సువోరిన్ జైలు నుంచి పారిపోయి మతాధికారి వేషంలో అక్కడ ప్రత్యక్షమౌతాడు. కాప్రరో, మాక్‌లు చంపబడ్డారనే వార్త విని సువోరిన్ కూతురు అన్యాయం జరిగిందని వాపోవడంతో నాటకం ముగుస్తుంది.

'గాడ్స్ ఆఫ్ లైట్నింగ్' రచించిన పదేళ్ళ తర్వాత మాక్స్వెల్ 'వింటర్ సెట్' నాటకం రాసి మొదటి నాటకంలోని లోపాలను సరిదిద్దుకున్నాడు. అద్భుతమైన రసవత్తర ఘట్టాలతో 'వింటర్ సెట్' రూపుదిద్దుకుంది.

నరహంతక బందిపోటు ట్రోక్ చేసిన ఒక హత్య కేసులో బార్టొలోమియో రొమాగ్నను ఇరికిస్తారు. అతనిపై న్యాయమూర్తి గాంట్ విధించిన మరణశిక్షను అమలు జరుపుతారు. కేసును తిరిగి పరిశోధించి నిజాన్ని బయట పెట్టేందుకు ప్రొఫెసర్ హోబ్‌హౌస్ ప్రయత్నిస్తుంటాడు. భయకంపిత ప్రాణి గార్త్ఎస్‌డ్రాస్ సాక్ష్యంతో నిజాలు వెలుగు చూస్తాయని ఆయన గ్రహిస్తాడు. చనిపోయిన రొమాగ్న కొడుకు మియో కూడా సత్యాన్వేషణకు మరో వేపు కృషి చేస్తుంటాడు. ఎస్‌డ్రాస్ చెల్లెల్ని మియో ప్రేమిస్తాడు. రెండవ అంకం ఎస్‌డ్రాస్ అద్దె కొంపలో ప్రారంభమౌతుంది. విధివశాత్తు ఎస్‌డ్రాస్ ఇంటికి చేరిన జడ్జి గాంట్‌కు మియోకు మధ్య రొమాగ్న గురించి వేడి వేడి చర్చ జరుగుతుంది. ఆ సమయంలో ట్రోక్ అక్కడికొస్తాడు. కాసేపటికి తూటా గాయాలతో రక్తం కారుతుండగా ట్రోక్ అనుచరుడు షాడో ప్రవేశిస్తాడు. రొమాగ్నను శిక్షించిన నేరానికి ట్రోక్ పథకం రచించగా, తానూ గార్త్ అనే వ్యక్తీ అందులో పాల్గొన్నామని చెప్పి చనిపోతాడు. తన తండ్రిని అన్యాయంగా చంపించిన న్యాయమూర్తిని మియో నిలదీస్తాడు. వ్యవస్థ పరువు కన్నా వ్యక్తి పరువు గొప్పది కాదని గార్త్ బుకాయిస్తాడు. చివరికి మియోను, అతన్ని రక్షించేందుకు

ప్రయత్నించిన అతని ప్రేయసిని ట్రోక్ బృందం కాల్చిచంపడంతో నాటకం ముగుస్తుంది.

శ్యామూల్ బెహర్మన్‌రాసిన 'రెయిన్ ఫ్రం హెవెన్' సీరియస్ నాటకం. విద్యావంతులైన వ్యక్తుల జీవితానుభవాలను నాటకంగా మలిచి అందులో లేల్ విన్‌గేట్ అనే అందమైన యువతిపై శాక్కో-వాంజెట్టి కేసు ప్రభావాన్ని రచయిత చక్కగా చిత్రించాడు. ఆమె రైల్లో ప్రయాణిస్తూ తన అనుభూతులను గుర్తి చేసుకుంటుంది. శాక్కో-వాంజెట్టి కేసు గురించిన వివరాలు ఆమెకు తెలుసు. చనిపోయే రోజు వాంజెట్టి రాసిన వీడ్కోలు లేఖ ఆమెను బాగా కదిలిస్తుంది. మృత్యుగృహంలో చావు బతుకుల్లో ఉన్న వాంజెట్టిని ఊహించుకుని బాధ పడుతుంది. దుఃఖాన్ని ఆపుకోలే ఏడుస్తుంటుంది. అదే బోగీలో ప్రయాణిస్తున్న అపరిచిత వ్యక్తి ఆమెను భగ్న ప్రేమికురాలని భ్రమ పడి ఓదార్చబోతాడు. తాను విఫల ప్రేమికురాలిని కాననీ, శాక్కో, వాంజెట్టిల కోసం ఏడుస్తున్నానని చెప్తుంది. వ్యక్తి జీవితంలో సామాజిక ఘటనకున్న ప్రాముఖ్యాన్ని రచయిత ప్రతిభావంతంగా చెప్పగలిగాడు.

ప్రముఖ అమెరికన్ నాటక రచయితలు జేమ్స్ థర్బర్,ఎలియట్ నూజెంట్ రాసిన 'ద మేల్ ఏనిమల్' హాస్య నాటకం. ఒక విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్ క్లాసులో విద్యార్థులకు పాఠం చెప్తుంటాడు. వాంజెట్టి రాసిన ఒక లేఖలోసాహిత్య విలువలు ఎలా ఉన్నాయో విద్యార్థులకు వివరిస్తాడు. ఆ పాఠం చెప్పేందుకు ప్రొఫెసర్ ప్రయత్నాలు, అది చెప్తే ఉద్యోగం ఊడిపోతుందని విశ్వవిద్యాలయ పాలకవర్గం బెదిరింపులూ ఈ నాటకంలో కథాంశం. మేధోస్వాతంత్ర్యానికీ, వ్యాపార వర్గ ప్రయోజనాలకూ మధ్య ఘర్షణను అద్భుతంగా చిత్రిస్తూ, శాక్కో-వాంజెట్టి ఘటన కాలం నాటి సామాజిక వాతావరణాన్ని ఈనాటకం రక్తి కట్టిస్తుంది.

అమెరికన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ (ఎ.బి.సి) 1947లో రేడియో నాటకంగా ప్రసారం చేసిన 'దోజ్ సెన్సేషనల్ ఇయర్స్'లో ఒక భాగంగా 'ద శాక్కో-వాంజెట్టి కేసు'ప్రసారమైంది. దీని వ్యవధి అర్థగంట మాత్రమే. మరణశిక్ష విధించినప్పుడు వాంజెట్టి యిచ్చిన ఉపన్యాసంతో ప్రారంభమైన ఈ నాటకంలో లాయర్ ముస్మానో, వాంజెట్టిల మధ్య జరిగిన చర్చ ద్వారా వాంజెట్టి రాజకీయ అభిప్రాయాల గాఢత్వాన్ని రచయిత వెల్లడించాడు. శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని నమ్మిన ఒక పత్రికా విలేకరికి, వారు దోషులని నమ్మిన అతని తల్లికి జరిగిన వాదన ద్వారా ఆ నాటి సమాజంలో నెలకొన్న భావ సంఘర్షణను రచయిత వివరించాడు.

## ఇతర సాహిత్య కళా రూపాలు

కవిత్వం, నవల, నాటక రూపాల్లోనే కాకుండా వివిధ ఇతర సాహిత్యకళా రూపాల్లో కూడా ఈ కేసు ప్రతిఫలించింది. కరపత్రాలు, లేఖలు, అనుభవాలు, పత్రికా రచనలు, సంపాదకీయాలు, చలనచిత్రాలు, డాక్యుమెంటరీలు, టీవీ సీరియల్స్, పెయింటింగ్స్, శిల్పాలు, కార్టూన్లు వగైరా పలు రూపాలలో ఈ కేసు జీవించింది.

ప్రముఖ అమెరికన్ శిల్పకారుడు, చిత్రకారుడు బెన్ షాన్ 'ద పాషన్ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి' శీర్షికన గీసిన ఇరవై మూడు చిత్రాలు 1932 లో ప్రదర్శించబడ్డాయి. బెన్‌షాన్ తయారు చేసిన అరవై అడుగుల పొడవు, పన్నెండడుగుల ఎత్తున్న స్మారక చిహ్నం సిరాక్యూస్ విశ్వవిద్యాలయాన్ని అలంకరించింది. 1927 లో స్టేట్ హౌస్ ముందు జరిగిన పికెటింగ్‌లో బెన్‌షాన్ స్వయంగా పాల్గొన్నాడు.

మాక్స్‌వెల్ ఆండర్సన్ నాటకం 'వింటర్ సెట్'ను హాలివుడ్‌లో సినిమాగా చిత్రీకరించారు. 'శాక్కో-వాంజెట్టి' పేరుతో గ్లూలియానొ మోంటాల్డో దర్శకత్వంలో టెక్నికలర్ సినిమా 1971 లో విడుదలైంది.

శాక్కో, వాంజెట్టి జైలు నుంచి రాసిన లేఖలు 'ద లెటర్స్ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి' పేరిట 1928లో పుస్తకంగా అచ్చయ్యాయి. మేరియోన్ డెన్‌మన్ ఫ్రాంక్ ఫర్టర్, గార్డెనర్ జాక్సన్ సంపాదకత్వం వహించారు.

## రిఫరెన్స్ గ్రంథాలు

బ్రెయిన్ ట్రీ కేసు డాక్యుమెంట్లు ఐదు సంపుటాలుగా, బ్రిడ్జ్‌వాటర్ కేసు రికార్డు దానికి అనుబంధంగా మరో సంపుటంగా 1928-29 సంవత్సరాల్లో అచ్చయ్యాయి. ఆరు వేల పేజీలున్న ఈ పుస్తకాల ప్రచురణ బాధ్యతను అమెరికాలోని పది మంది ప్రముఖ మేధావులు, బడా పారిశ్రామిక వేత్తలు (ఎలిహు రూట్, జాన్ డేవి, జాన్ రాక్‌ఫెల్లర్ జూనియర్ వగైరా) చేపట్టి వాటిని అమ్మెరికాలోని అన్ని ప్రముఖ గ్రంథాలయాలకు ఉచితంగా అందజేశారు.

కేసుతో ఉద్యమంతో సంబంధం ఉన్న పలువురు మేధావులు లాయర్లు తమ అనుభవాలను గ్రంథ రూపంలో నిక్షిప్తం చేశారు. మైకేల్ ముస్మానో 'ఆఫ్టర్ ట్వల్వ్ ఇయర్స్', హెర్బర్ట్ ఎహర్మన్ 'ద అన్‌ట్రైడ్ కేస్', అన్నె కాథరినా పోర్టర్ 'ద నెవర్ ఎండింగ్ రాంగ్' ఈ కోవకు చెందినవి. మెడైరోస్-మోరెల్లి గురించి తన పరిశోధనను హెర్బర్ట్ ఎహర్మన్ 'ద అన్‌ట్రైడ్ కేస్' (1933)లో వివరించాడు. కేసులో సాక్ష్యాధారాలను ఆసాంతం విశ్లేషిస్తూ 1969 లో ఆయనే 'ద కేస్ దట్ విల్ నాట్ డై' రాశాడు.'ఆఫ్టర్ ట్వల్వ్ ఇయర్స్' లో లాయర్ ముస్మానో ఈ కేసు గురించి తన అనుభవాలను పూర్తిగా వివరించారు. ఆయనే లాయర్‌గా తన అనుభవాలను వివరిస్తూ రాసిన వెర్డిక్ట్‌లో శాక్కో-వాంజెట్టి కేసు గురించి క్లుప్తంగా వివరించాడు. సాహిత్య శాస్త్ర ప్రొఫెసర్ లూయీ జౌగిన్, లా ప్రొఫెసర్ ఎడ్మండ్ మోర్గన్ ఇరువైయ్యేళ్ళ తీవ్ర కృషి ఫలితంగా 1948 లో 'ద లెగసీ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి' గ్రంథాన్ని సృష్టించారు. కేసులో సాక్ష్యాధారాలగురించి, శాక్కో,వాంజెట్టి జీవితం గురించి కేసుపై వెలువడిన సాహిత్యం గురించి, సామాజిక ప్రతి స్పందన గురించి సాధికారంగా సమగ్రంగా వివరించిన అద్భుతపరిశోధనా గ్రంథం ఇది. ఫ్రాంక్ ఫర్టర్ 1927 మార్చిలో అట్లాంటిక్ మంత్లీ లో రాసిన 'దకేస్ ఆఫ్ శాక్కో అండ్ వాంజెట్టి: ఎ

క్రిటికల్ ఎనాలిసిస్ ఫర్ లాయర్స్ అండ్ లేమెన్' కూడా ఆ తర్వాత పుస్తకంగా వచ్చింది. శాక్కొ-వాంజెట్టి ఉద్యమంలో మేధావుల పాత్రను డేవిడ్‌ఫెలిక్స్ రాసిన 'ప్రొటెస్ట్: శాక్కొ వాంజెట్టి అండ్ ద ఇంటలెక్చువల్స్' (1965) వివరిస్తుంది. శాక్కొ, వాంజెట్టిలు ఇటాలియన్ ప్రవాసులైనందువల్ల చంపబడ్డారని పేర్కొంటూ, అమెరికాలో ప్రవాసుల చరిత్ర నేపథ్యంలో ఈ కేసు గురించి వివరించే గ్రంథం రాబర్ట్ స్ట్రాస్ ఫ్యుయర్‌లిక్ట్ రచించిన 'జస్టిస్ క్రూసిఫైడ్: ద స్టోరీ ఆఫ్ శాక్కొ అండ్ వాంజెట్టి' (1977). రాబర్ట్ వీక్స్ సంపాదకత్వంలో వెలువడిన 'కామన్‌వెల్త్ వర్సెస్ శాక్కొ అండ్ వాంజెట్టి' (1958) ఈ కేసు గురించి వివరించే చక్కటి పాఠ్య గ్రంథం. ఫ్రాన్సిస్ రసెల్ 'ట్రాజెడీ ఇన్ డెడ్‌హాం' (1962), 'ద కేస్ రిజాల్వ్‌డ్' (1986) అనే రెండు గ్రంథాలను రాశాడు. అయితే శాక్కొ, వాంజెట్టిలు నిర్దోషులని తాను మొదటి గ్రంథంలో ప్రతిపాదించిన విషయాలను రెండవ గ్రంథంలో ఖండించాడు. శాక్కొ, వాంజెట్టిలను సమర్థిస్తూ ప్రఖ్యాత అమెరికన్ మేధావి పాల్‌ఆరిచ్ 1991లో 'శాక్కొ అండ్ వాంజెట్టి- ద ఎనార్కిస్ట్ బేగ్రౌండ్' ప్రచురించారు. ఎథెల్‌బర్ట్ గ్రాబిల్ 1927 లో రాసిన 37 పేజీల 'శాక్కొ అండ్‌వాంజెట్టి ఇన్ ద స్కేల్స్ ఆఫ్ జస్టిస్' ప్రాసిక్యూషన్‌ను పూర్తిగా సమర్థిస్తూ రాయబడిన ఒకే ఒక పుస్తకం. శాక్కొ, వాంజెట్టిలు దోషులేనని వాదిస్తూ బోస్టన్ లాయర్ రాబర్ట్ మాంట్‌గోమరి 1960 లో 'శాక్కొ-వాంజెట్టి: ద మర్డర్ అండ్ ద మిత్' రాశారు. ఇవి కాక కేసు గురించి వెలువడ్డ యూజిన్‌లయన్ 'ద లైఫ్ అండ్ డెత్ ఆఫ్ శాక్కొ అండ్ వాంజెట్టి' (1927) ఫ్రాంకెల్ ఒస్మండ్ 'ద శాక్కొ-వాంజెట్టి కేస్' (1931), కూడా ప్రముఖమైన గ్రంథాలే.

ఇవే కాక పలు రిఫరెన్స్ గ్రంథాల్లో, ఎన్‌సైక్లోపీడియాల్లో శాక్కొ-వాంజెట్టి కేసు గురించిన ప్రస్తావన ఉంది: డిక్షనరీ ఆఫ్ అమెరికన్ బయోగ్రఫీ, ఒన్లీ ఎస్టర్‌డే (అల్లెన్), ఆన్ నేటివ్ గ్రౌండ్స్ (ఆల్ప్రెడ్ కజిన్), ట్వంటీస్ (జె.జె.హాఫ్‌మన్), ద అమెరికన్ ఎర్త్‌క్వేక్ (ఎడ్మండ్ విల్సన్), ద ప్రాపర్ బోస్టోనియన్స్ (క్లీవ్‌లాండ్ అమోరి), ద క్రైసిస్ ఆఫ్ ఓల్డ్ ఆర్డర్ (ఆర్థర్ ష్లెసింజర్) .....ఇలా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. దాదాపు ఈ రచయితలంతా తమ గ్రంథాల్లో శాక్కొ,వాంజెట్టిల పక్షాన్నే న్యాయముందని చెప్పారు.

ఇంగ్లీషు భాషలోనే కాక పలుఇతర భాషల్లో కూడా ఈ కేసు గురించి చాలా గ్రంథాలు వెలువడ్డాయి. 'ద లెగసీ ఆఫ్ శాక్కొ వాంజెట్టి' రష్యన్ భాషలోకి అనువదించబడింది.

**శాక్కొ వాంజెట్టి కేసుపై వెలువడిన సాహిత్యం విలువైన సామాజిక విమర్శను ప్రపంచం ముందుంచింది. ఈ కేసులో సాహితీ ప్రపంచపు తీర్పు, సామాజిక శాస్త్రవేత్తల, న్యాయవేత్తల, చరిత్రకారుల తీర్పు శాక్కొ, వాంజెట్టిల వేపే న్యాయం ఉందని నిరూపించింది. ఈ తీర్పును సమర్థవంతంగా సవాలు చేసేందుకు ఇప్పటి వరకూ ఎవరూ సాహసించలేదని చెప్పవచ్చు.**

## సంకెళ్ళలో



కేసు విచారణ జరుగుతున్న కాలంలో శాక్కో, వాంజెట్టిలను కోర్టునుంచి డెడ్హాం జైలుకు తీసుకెళ్తున్న దృశ్యం.

## గుబురు మీసాలు



బార్టొలోమియో వాంజెట్టి

వాంజెట్టికి ఉన్న పొడవైన గుబురు మీసాలను చూడవచ్చు.

## అమర వీరులు



శాక్కొ వాంజెట్టి

## హంతక ప్రముఖులు



| | | |
|---|---|---|
| డెడ్‌హాం | మసాచూసెట్స్ | హార్వర్డ్ |
| జడ్జి | గవర్నర్ | ప్రెసిడెంట్ |
| వెబ్‌స్టర్ | ఆల్వాన్ | లారెన్స్ |
| ˊ మర్ | ఫుల్లర్ | లోవెల్ |



డిఫెన్స్ లాయర్లు విలియం థాంప్సన్, హెర్బర్ట్ ఎహర్మన్ బోస్టన్‌లోని గవర్నర్ కార్యాలయం (స్టేట్ హౌస్) నుంచి బయటికి వస్తున్న దృశ్యం.
ఫోటోలో కుడివైపు చివర ఉన్నది థామస్ ఓ కోనర్
1927 జూలై 21

అంతిమ యాత్ర



సంస్మరణ




న్యూయార్క్ యూనియన్ స్క్వేర్ లో
సంస్మరణ సభ

# ఉపసంహారం

*శాక్కో, వాంజెట్టిలు* మరణానంతరం కూడా వారు నిర్దోషులని ప్రకటింపజేసేందుకు జరిగిన ఉద్యమం మరో యాభై ఏళ్ళ పాటు కొనసాగింది.

కమిటీ టు విండికేట్ శాక్కో అండ్ వాంజెట్టి పేరిట టామ్ ఓ కోనర్ నాయకత్వంలో ఒకసంస్థ ఏర్పడి అందుకోసం తీవ్ర కృషి జరిపింది. ఆర్డినో ఫెలికని, గార్డెనర్ జాక్సన్, రోగర్ బాల్డ్విన్, జాన్ ఛాంబర్లేన్, హోవర్డ్ లిండ్‌సే, యూజీన్ రోస్టో, ఆర్థర్ స్క్లీసింజర్, జాన్ డాస్ పాస్సోస్, యూజీన్ లయన్స్, నార్మన్ థామస్, గెరాల్డ్ జాక్సన్ లాంటి పలువురు మేధావులు, పౌర హక్కుల నాయకులు ఈ కృషిలో నిమగ్నమయ్యారు. లాయర్లు ఎహర్మన్, ముస్మానోలు తమ జీవితాంతం శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని చాటి చెప్పారు. ఐన్ స్టీన్ లాంటి మేధావులు శాక్కో, వాంజెట్టిలు నిర్దోషులని ప్రకటింపజేసేందుకు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారు.

శాక్కో, వాంజెట్టిల దగ్గర దొరికిన రివాల్వర్‌లపై పలు పరిశోధనలు యాభైయ్యేదేళ్ళ దాకా - 1983 వరకూ జరిగాయి. ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ శాక్కో, వాంజెట్టిల నిర్దోషిత్వాన్నే నిరూపించాయి.

న్యాయమూర్తి థేయర్ ఇంటి మీద 1932 లో బాంబు దాడి జరిగింది. ఆయన భార్య తీవ్రంగా గాయ పడింది. ఇల్లు నేల మట్టమైంది. మనోవేదనతో థేయర్ కొంత కాలానికి చనిపోయాడు.

శాక్కో-వాంజెట్టి కేసు లో సాక్ష్యాధారాలకు సంబంధించిన అంశాల పరిశీలన జరిపేందుకు సుప్రీం జుడీషియల్ కోర్టుకు అధికారం లేనందువల్ల నష్టం జరిగిందని పరోక్షంగా ప్రభుత్వం అంగీకరించింది. మసాచూసెట్స్ శాసనసభ 1939 లో చాప్టర్ 341 పేరిట చట్టాన్ని సవరించి సుప్రీం జుడీషియల్ కోర్టు అధికార పరిధిని పెంచింది. ఆ సవరణ ప్రకారం మరణశిక్ష విధించబడిన ప్రతి కేసులోనూ సుప్రీం జుడీషియల్ కోర్టుకు చట్టపరమైన అంశాలనే కాక, సాక్ష్యాధారాల గురించిన అంశాలపై కూడా పరిశీలన జరిపే అధికారంఉంటుంది. క్రింది కోర్టు తీర్పు సాక్ష్యాధారాలకు గానీ, చట్టానికి గానీ వ్యతిరేకమైతే, కొత్తగా కనుగొన్న సాక్ష్యాలు తీర్పుకు

విరుద్ధమైతే, లేదా న్యాయంచేసేందుకు అవసరమైన ఏ ఇతర కారణం రీత్యా గానీ తిరిగి కేసు విచారణ జరపమని ఆదేశించే అధికారం ఆ కోర్టుకు ఉంటుంది.

విండికేషన్‌కమిటీ చేసిన కృషి ఫలితంగా 1959 లో మసాచూసెట్స్ శాసనసభ ముందుకు ఒక బిల్లు వచ్చింది. చనిపోయిన తర్వాత కూడా ముద్దాయిలకు క్షమాభిక్ష పెట్టగలిగే విధంగా చట్టానికి సవరణ ప్రతిపాదించారు. అప్పటికి సుప్రీం జుడీషియల్ కోర్టు న్యాయమూర్తి అయిన ముస్మానో శాక్కో, వాంజెట్టిలు దోషులు ఎందుక్కారో సుదీర్ఘంగా శాసన సభలో వివరించాడు. అయితే లెజిస్లేటివ్ కమిటీ ఆ బిల్లును ఆమోదించేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు.

ఆ తర్వాత కూడా విండికేషన్ కమిటీ తన ప్రయత్నాలను విరమించలేదు.యాభై ఏళ్ళు కృషి జరిపి పాక్షికంగా విజయం సాధించగలిగింది.

మసాచూసెట్స్ రాష్ట్ర గవర్నర్ మైకేల్ డుకాకిస్ 1977 ఆగస్టు 23వ 'నికోలా శాక్కో, బార్టొలోమియో వాంజెట్టి జ్ఞాపక దినం'గా ప్రకటించాడు. ఆ రోజు కిక్కిరిసిన సెనేట్ ఛాంబర్‌లో సంచలనాత్మక ప్రకటనచేశాడు. శాక్కో,వాంజెట్టిలు దోషులా కాదాఅని తాను చెప్పబోవప్పటికీ, వారి కుటుంబాలకూ, వారసులకూ, మసాచూసెట్స్ రాష్ట్ర ప్రభుత్వానికీ అంటుకున్న కళంకాన్ని తొలగిస్తున్నట్టు ఆయన ప్రకటించాడు.

# రాజ్యహింస గురించి ఇంకొంచెం ఆలోచిద్దాం

**రాజ్యం** ప్రయోజనాలను రాజ్యం కాపాడుకోదు. దానికి కాళ్లు చేతులు తల తోక వుండవు. దాని ప్రయోజనాలను మనుషులు కాపాడతారు. వీళ్లు రాజ్యం భద్రతను తమ భద్రతగా భావించే మనుషులు. రాజ్యం భద్రతకు సంబంధించిన భావజాలాన్ని స్వంతం చేసుకున్న మనుషులు. రాజ్యం అభద్రమైతే భయపడే మనుషులు.

నిజంగానే వాళ్ల అవసరాలు రాజ్యం భద్రతతో ముడిపడి ఉండవచ్చును. అంటే వాళ్లు ఆ భద్రత వల్ల ప్రత్యక్షంగా ప్రయోజనం పొందేవాళ్లు కావచ్చును. లేదా, తమ అవసరాలేవీ తీరకున్నా, రాజ్య భద్రతను వ్యక్తం చేసే భావజాలంలోని ఏదో ఒక ప్రబలమైన అంశం పట్ల ఆకర్షితులయిన వారు కావచ్చు. అదీ కాకపోతే, రాజ్యం అభద్రమైపోతే సంఘ జీవితం కూడ అభద్రమయిపోతుంది కాబట్టి, అభద్రతకు వెరచే మామూలు మనుషులు కావచ్చు.

ఈ మూడు రకాలలో మొదటి రకం కేవలం సమాజంలోని ప్రధాన పెత్తందారీ వర్గాలకు (అంటే వేరే ఎవ్వరి చేతా ఏ రకమైన అణచివేతకూ గురి కాని వర్గాలకు) పరిమితం కాదు.ప్రధాన పెత్తందారీ వర్గాలు సమాజంలో ఎప్పుడయినా ఒక చిన్న మైనారిటీయే కాబట్టి రాజ్యం భద్రత వల్ల ప్రత్యక్షంగా ప్రయోజనం పొందేది, దానిని తమ భద్రతగా భావించేది, ఆ వర్గాలు మాత్రమే అయితే అదొక పెద్ద సమస్య కాదు. కానీ అది నిజం కాదని మనకు అనుభవపూర్వకంగా తెలుసు. సమాజంలో అనేక మంది అనేక రకాల పెత్తనాన్ని అనుభవిస్తుంటారు.ఏ సమాజంలోనయినా ఆధిపత్యం దొంతరలు దొంతరలుగా నెలకొని ఉంటుంది. కమ్యూనిస్టు పార్టీలకు అలవాటయిన విప్లవ వ్యూహ రచన దృష్టితో చూసినప్పుడు ఏదో ఒక రూపంలో పెత్తనాన్ని అనుభవించే వారంతా పాలక వర్గంలో భాగంగా కనిపించకపోవచ్చు. కానీ అంత మాత్రం చేత ఆ పెత్తనాన్ని వదులుకోవడానికి వాళ్లు సిద్దంగా ఉంటారనుకోకూడదు. రాజ్యం భద్రతతో ఆ పెత్తనం ముడిపడి ఉంటుంది కాబట్టి వాళ్లలో చాలా మంది రాజ్యం భద్రతను తమ భద్రతగా భావించి దానిని కాపాడడానికి ఆరాటపడుతుంటారు.ఉదాహరణకు అమెరికాలో ఆదివాసీలు (రెడ్ ఇండియన్లు) తప్ప తక్కిన వాళ్లందరూ యూరప్ నుండి ఆఫ్రికా ఆసియాల

నుండి వలస వచ్చిన వారే అయినా, తొలుత వచ్చిన వారికి చాలా ప్రతిష్ఠ ఉంది. అమెరికా ప్రజాస్వామ్యానికీ సంస్కృతికీ ఆద్యులు వాళ్లేనన్న గుర్తింపు ఉంది. దేశభద్రతకు భంగం కలిగితే ఆ ప్రతిష్ఠకు దెబ్బ కాబట్టి తమను తాము అసలు సిసలు అమెరికన్లుగా భావించే వారు తమకంటే తరువాత వలస వచ్చిన వారి దేశద్రోహకర చర్యలను ఎంత మాత్రం సహించరు.

రెండవ రకాన్ని గురించి అర్థం చేసుకోవడానికి భావజాలాన్ని గురించి కొంత అవగాహన కావాలి. వ్యవస్థను భద్రంగా నిలబెట్టడానికి ఉపయోగపడే ఆలోచనలూ ఆశలూ విశ్వాసాలూ ప్రజల ప్రాపంచిక దృక్పథంలో భాగం అవుతాయనీ, ఆ 'భావజాలం' వ్యవస్థ భద్రతకు దోహదపడే ఒక ప్రబల శక్తి అనీ గుర్తించిన సామాజిక తత్వవేత్తలలో మార్క్స్ ఒకడు. ప్రతీ సమాజంలోనూ *'పాలక వర్గాల భావాలే పాలక భావాలు'* అని ఆయన అంటాడు. కానీ ఆయన పూర్తి చేయని ఈ విశ్లేషణను మనం పూర్తి చేసుకుంటే తప్ప భావజాలాన్ని గురించి సమగ్రమైన అవగాహన ఏర్పడదు. భావజాలాన్ని కేవలం ఆధిపత్య వర్గాల ప్రయోజనాల భావాత్మక వ్యక్తీకరణగా అర్థం చేసుకుంటే సరిపోదు అది విషయాన్ని ఒక వైపు నుండి మాత్రమే చూడడం అవుతుంది. మనుషులకు స్వాభావికమైన మానసిక అవసరాలనూ మానసిక స్థితులనూ ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు ఉపయోగపడే రీతిలో భావజాలం విపులీకరిస్తుంది, విశదీకరిస్తుంది. తద్వారా ఆ వ్యవస్థకు అందులో బ్రతికే వారందరి ఆమోదం సంపాదించే ప్రయత్నం చేస్తుంది వ్యవస్థను కదిలించే ఏ ప్రయత్నాన్నయినా తమ వ్యక్తిత్వానికే దెబ్బగా సామాన్య మనుషులు భావించే లాగ చేస్తుంది. అటువంటి ప్రయత్నాల పట్ల వ్యతిరేకత రేకెత్తిస్తుంది. పాలక భావాలు మనుషుల మెదళ్ల మీద బయటి నుండి రుద్దబడవు. మనుషులకు స్వాభావికమైన అనుభూతులను ఆకాంక్షలను మానసిక స్థితులను ఒక ప్రత్యేక రూపంలో విపులీకరించడం ద్వారా పాలక భావాలు సమాజ భావజాలం అవుతాయి. భావజాలం పాలక వర్గాల అవసరాలమీద ఒక కాలు పెట్టి నిలబడితే, మనుషులకు స్వాభావికమైన మానసిక అవసరాలు,స్థితులపైన దాని రెండవ కాలు నిలబడుతుంది.

ఈ మానసిక స్థితులలో అభద్రత ఒకటి. దీనిని అర్థం చేసుకుంటే మనం మూడవ రకాన్ని గుర్తించగలుగుతాము. నిత్య జీవితంలో అభద్రతకు భయపడడం మనిషికి సర్వత్రా ఉండే లక్షణాలలో ఒకటి. అది రాజ్యం భద్రతకూ వ్యవస్థ భద్రతకూ చాలా దోహదం చేస్తుంది. అది ఏదో ఒక భావజాలం రూపంలో వ్యక్తం కావచ్చును గానీ దానంతటది-భావజాల సంబంధమైన విషయం కాదు. భావజాలాలతో సంబంధం లేకుండానే అభద్రతా భయం రాజ్య భద్రతకు దోహదం చేయగలదు.

అభద్రతా భయాన్ని బూర్జువా లేక పెటీబూర్జువా లక్షణంగా భావించడం మార్క్సిస్టులకు పరిపాటి అయింది ('మధ్యతరగతి అభద్రత' అంటుంటారు - పేదవాళ్లలో అభద్రత లేనట్టు). కానీ అభద్రత అనేది కేవలం ఆస్తికి సంబంధించిన విషయం కానవసరం లేదు. మనుషులు

తమదిగా భావించే ఏ విషయాన్ని గురించయినా అభద్రతకు లోను కాగలరు. అది ఆస్తి కావచ్చు, జీవనం కావచ్చు, అనుబంధం కావచ్చు, ప్రాణం కావచ్చు, 'నాది' అనుకునే ఐడెంటిటీ ఏదయినా కావచ్చు. నిత్య జీవితంలో అలవాటయిపోయిన క్రమబద్ధత సహితం కావచ్చు. మానవ ప్రవర్తనలో వ్యక్తమయ్యే ఏ ఒక్క గుణమూ ఒక వర్గానికో ఒక వ్యవస్థకో పరిమితం కాదు. దాని వ్యక్తీకరణ రూపం, పరిధి, పరిమితులు, అవకాశం, అవసరం, అనుమతి, ఆమోదం మాత్రం వ్యవస్థను బట్టి వర్గాన్ని బట్టి మారుతాయి.

అభద్రతా భయం యధాస్థితికి ఆకర్షణ కల్పిస్తుంది. ఒక వ్యవస్థ కొన్నాళ్లు నిలిస్తే దానిలో మనుషుల జీవితం ఒక మూసలో పడిపోతుంది. అనేక రకాల సంతృప్తిని దాని ఇరుకు సందులలోనే వెతుక్కోవడం మనుషులు నేర్చుకుంటారు పూర్తి సంతృప్తి కావాలన్న కోరిక చచ్చిపోతుందని కాదు. దాని కోసం ప్రయత్నిస్తూనే ఉంటారు. కానీ ఆ ప్రయత్నం అలవాటయిపోయిన తమ జీవిత భద్రతకు భంగం కలిగిస్తే మనుషులు దానిని చాలా సులభంగా నిరసించగలరు. ఆ అభద్ర స్థితిలో ఈ జీవితం చాలా అందంగా కనిపించనూ గలదు.

అభద్రతా భయం వల్ల ఆకర్షణీయంగా కనిపించే యధాస్థితికి ఆపైన పాలక భావజాలం ముస్తాబు చేయగలదు. యధాస్థితే 'మన సంస్కృతి', 'మన సంప్రదాయం'. అదే నిజమైన స్వేచ్ఛ, నిజమయిన సమానత్వం. వ్యవస్థలోని యధాస్థితి 'దేశం'తో 'జాతి'తో సమానార్థకం దానిని ఆమోదించడమే దేశభక్తి, జాతీయత. దానిని తిరస్కరించే వాళ్లు దేశద్రోహులు, జాతికి శత్రువులు. ఈ విధంగా, వ్యవస్థలోని యధాస్థితి వల్ల ప్రయోజనం పొందే వర్గాలనే కాక ప్రయోజనం పొందని వారిలో చాలా మందిని కూడా యధాస్థితిని సంరక్షించే కర్తవ్యంలో రాజ్యం సమీకరించగలదు.

వ్యవస్థనూ రాజ్యాన్నీ వ్యతిరేకించే వాళ్లు విజాతీయు లయినట్లయితే ఇది ఇంకా సులభం అయిపోతుంది. జాతి, మతం, భాష, ప్రాంతాల ప్రాతిపదికన 'నావాళ్లు' 'పరాయివాళ్లు' అని ఈ ప్రపంచాన్ని వర్గీకరించుకొని ఆ ప్రాతిపదిక మీద ప్రేమనూ ద్వేషాన్నీ పెంచుకోగలగడం మనిషికి ఉన్న అత్యంత స్వాభావికమైన గుణాలలో ఒకటి. దీనిని తమ నిత్య జీవిత ప్రవర్తనలో సహజంగానే అధిగమించగల నైతిక సంస్కృతిని మనుషులు పెంచుకోగలిగే వరకు సమిష్టి సంఘ జీవితం సాధ్యం కాదు. దీని అర్థం మనుషులు పరాయివాళ్లను ఎప్పుడూ ద్వేషిస్తుంటారని కాదు. మామూలు సమయాలలో మనుషులు తమవారిలాగే పరాయి వాళ్లను కూడ దయగా చూడగలరు, స్నేహంగా ఉండగలరు. ఈ మామూలు సమయం అనే దానిలో మామూలు అభద్రత కూడ ఉండవచ్చును. అది పూర్తిగా భద్రమైన స్థితి కానవసరంలేదు. కానీ తమకు అలవాటు లేని అభద్ర స్థితి దాపురించినప్పుడు ఈ నీగ్రోలు, ఈ తురకవాళ్లు, ఈ అరవవాళ్లు, ఈ బెంగాలీలు మా కష్టాలన్నిటికీ కారణం అంటూ విజాతీయులపైన సులభంగా

మనుషులు ద్వేషం పెంచుకోగలరు. వ్యవస్థ భద్రతకు అవసరమైన రాజ్య భావ జాలానికి ఈ గుణం ఎంత బాగా ఉపయోగపడుతుందో ఈ శతాబ్దపు చరిత్ర చక్కగా రుజువు చేసింది. సోవియట్ రష్యా, చైనా వంటి దేశాలు సహితం అనేక సందర్భాలలో రాజ్యం వెనుక ప్రజలను సమీకరించడానికి విప్లవ ఉత్తేజం కంటె 'తనవాళ్లు-పరాయివాళ్లు' అనే జాతీయతా భావాన్ని ఎక్కువగా వాడుకున్నాయి. ప్రపంచంలో మానవ సమూహాలమధ్య దూరాలు తగ్గిపోయి వేరు వేరుగా బ్రతుకుతున్న జాతులు ఒకదాని కొకటి ఎన్నడూ లేనంత దగ్గర అవుతున్నాయి. జాతి విద్వేషం బాగా పెరగడానికి దీని నుండి అవకాశం ఏర్పడింది. అవసరం ఆయా దేశాలలో ఆధిపత్యం చలాయిస్తున్న వర్గాలకు, ప్రపంచ పెట్టుబడికి ఉంది. ఈ విద్వేషానికి వ్యతిరేకమైన ప్రజాతంత్ర సంస్కృతి లేనే లేదని కాదు. అందరినీ సమంగా ప్రేమించడం అనేది ఏ నాడయినా - క్రీస్తు చెప్పినా, సూఫీలు చెప్పినా- మానవతా భావనలో భాగమే. ఆధునిక ప్రజాతంత్ర సంస్కృతిలో కూడ ఈ విలువకు ప్రాముఖ్యం ఉంది. కానీ విద్వేషాన్ని అధిగమించడానికి, ఇప్పటికింకా ఇదంతా సరిపోదు. ఆ సంగతి రోజూ చూస్తూనే ఉన్నాము.

శాక్కో-వాంజెట్టీలు ఇటాలియన్లు కాకపోయినట్లయితే, వాళ్లు అరాచక వాదులయినా కమ్యూనిస్టులే అయినా వారికి ఇంత అన్యాయం జరిగి ఉండేదా? ఏదో ఒక దశలో ఒక న్యాయమూర్తయినా ఒక అధికారి అయినా జోక్యం చేసుకునేవారు కాదా? అమెరికా సమాజంలోనే వీరి విషయంలో వచ్చిన దాని కంటె ఎక్కువ వ్యతిరేకత వచ్చి ఉండేది కాదా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పడానికి పెద్దగా కష్టపడనవసరం లేదు. అమెరికా పాలక వర్గం, రాజ్యాంగ యంత్రం, కరడు గట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకులయిన జడ్జి థేయర్ వంటి వారి విషయం వేరే. వాళ్లకు శాక్కో, వాంజెట్టిలు ఇటాలియన్లయినా ఇంగ్లీషు మాట్లాడే అమెరికన్లయినా ఒకటే అయి ఉండవచ్చు. బోల్షెవిజం ప్రభావం గురించి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నిజంగానే చాలా భయపడిన రోజులవి. అయితే రాజ్యాంగయంత్రం సమాజ ఆమోద అనామోదాలతో నిమిత్తం లేకుండా పని చేయజాలదు. అది సహజంగా లభించకపోతే పనిగట్టుకొని కల్పించవలసి ఉంటుంది. పత్రికాస్వేచ్ఛ, సమాచార స్వేచ్ఛ, బహిరంగ నేరవిచారణ హక్కులుగా ఉన్న అమెరికా వంటి దేశాలలో అది మరీ అవసరం. నిర్బంధానికీ అణచివేతకూ సామాజిక ఆమోదం ఉన్నా, లేక కల్గించగలిగినా, రాజ్యాంగ యంత్రం తన పని సులభంగా చేసుకు పోగలుగుతుంది.

ఏ తిరుగుబాటు దార్లపైనయినా ద్వేషాన్ని కల్గించడానికి మనుషులలోని మామూలు అభద్రతా భావాన్ని వ్యవస్థలు వాడుకుంటాయి. పైగా ఈ కేసు సందర్భంగా అరాచక వాదులు, వారి సానుభూతిపరులు, తమ నిరసనను అనేక బాంబు దాడుల రూపంలో వ్యక్తం చేసారు కాబట్టి ప్రజలలోని అభ్రదతా భయాన్ని వాడుకోవడం ఎట్లాగ · సులభమే అయ్యేది. అయితే ఈ తిరుగుబాటుదారులు విజాతీయులు కావడం రాజ్యం కర్తవ్యాన్ని మరింత సులభతరం చేసింది. ఇటాలియన్లయిన శాక్కో, వాంజెట్టిలు అక్కడ బ్రతుకు తెరువు లేక అమెరికా వచ్చి ఇక్కడ పని

సంపాదించుకొని హాయిగా తింటూ యుద్ధమొచ్చినప్పుడు మాత్రం ఈ దేశం పట్ల కనీస భక్తి ప్రదర్శించకుండా శాంతివాదులమంటూ తప్పించుకు తిరిగారన్న అభియోగాన్ని ప్రాసిక్యూటర్ నేర్పుగా వాడుకుంటాడు. దానికీ వారిపైన ఉన్న కేసుకూ ఏమీ సంబంధం లేదు. అయితే జూరర్ల మనస్సులో విజాతీయుల పట్ల మామూలుగా ఉండే పరాయి భావనను వాడుకొని దేశాభిమానాన్ని రెచ్చగొట్టడానికి ఇది బాగా ఉపయోగపడింది. కార్మిక వర్గానికీ దిగువ మధ్య తరగతికీ చెందిన జూరర్లు ప్రాసిక్యూషన్ కేసుకున్న బలాబలాలతో నిమిత్తం లేకుండా విజాతీయ వ్యతిరేక దేశ దురభిమానం ప్రభావంలో శాక్కొ వాంజెట్టీలు నేరస్తులేనని నిర్ధారించగలిగారు.

ఈ అసందర్భమైన దేశదురభిమానం మొత్తంగా అమెరికా సమాజంలో నెలకొనడం వల్ల ఆ తరువాతి దశలో కూడా తమ విధి నిర్వహణలో కనీస ప్రజాతంత్ర దృక్పథం కనబరచ వలసిన అవసరం న్యాయమూర్తులకూ పత్రికా సంపాదకులకూ లేకుండా పోయింది. 'ప్రజలేమనుకుంటారో' అని భయపడవలసిన అవసరం వారికి లేకుండా పోయింది. నిజానికి, ప్రజాతంత్ర దృక్పథం కనబరిస్తేనే 'ప్రజలేమనుకుంటారో' అని బెదరి పోవలసి వచ్చింది కాబట్టే ఉదారవాదులుగా పేరు పొందిన అమెరికా న్యాయమూర్తులు కొందరు సహితం శాక్కొ వాంజెట్టిల పిటిషన్లు ఆమోదించడానికి సిద్ధపడనట్టున్నారు. (కాదనుకుంటే, ఉదారవాదులుగా వారికుండే ప్రతిష్టనే మనం శంకించవలసి ఉంటుంది.) న్యాయం కోసం ధైర్యం చేసి మాట్లాడిన వారు - పత్రికలు, న్యాయశాస్త్ర కోవిదులు, కార్మికులు, మామూలు ప్రజలు-చాలా మందే ఆనాటి అమెరికాలో ఉన్నప్పటికీ శాక్కొ వాంజెట్టీల ప్రాణాలు కాపాడడానికి వారి పట్టుదల సరిపోలేదు.

ఈ కథను ఇంకొక కోణం నుండి చూద్దాం. శాక్కొ వాంజెట్టిలు అమెరికా సమాజంలో అసమ్మతి వాదులు, పాలక వర్గంలో అసమ్మతి వాదులు కారు. వ్యవస్థ లోపలి అసమ్మతివాదులు కారు. వాళ్ళు వ్యవస్థకే అసమ్మతివాదులు. దోపిడీ, అసమానత, హింస లేని సమాజం నెలకొల్పాలనేది వాళ్ళ లక్ష్యం. ఆ నూతన వ్యవస్థ స్వరూపం ఎట్లాంటిదో వాళ్ళకు తెలియక పోవచ్చు. దానిని ఎట్లా నెలకొల్పాలో తెలియకపోవచ్చు. కమ్యూనిస్టుల నమూనాయే 70 సంవత్సరాల ప్రయోగం తర్వాత సందేహాస్పదంగా తయారయింది. అరాచక వాదులకు ఆ మాత్రం నమూనా కూడా ఏ రోజూ లేదు. అయినప్పటికీ వారి అసమ్మతి అమెరికా రాజ్యాంగ యంత్రం దృష్టిలో చిన్న విషయం కాదు. 1920 ల చివరి దాకా 'విప్లవం' అనేది ఈ రోజో రేపో సిద్ధించే మార్పనే ఉత్సాహం యూరప్‌లో ప్రబలంగా ఉండింది. పాలక వర్గాలలో దానికి తగిన భయం కూడా ఉండింది. 'విప్లవం' రావాలంటే ఎన్ని అడ్డంకులున్నాయో ఎవరికీ అర్థం కాని ఆరోజులలో (ఈ రోజయినా అర్థం చేసుకోవడానికి అందరూ సిద్ధంగా ఉన్నారని కాదు) బోల్షివిజం ప్రపంచమంతటినీ త్వరలో ఆక్రమించేసుకుంటుందని పెట్టుబడిదారులూ ఇతర సంప్రదాయ వాదులూ నిజంగానే భయపడ్డారు. ఇటువైపు విప్లవాన్ని ఆహ్వానించిన వారిలో ఉత్సాహం, సంఘీభావం, చెప్పుకోదగ్గ

మోతాదులో ఉన్నాయి. ఆ వాతావరణం దాదాపు మృగ్యమయిపోయిన ఈ రోజు మనం దానిని ఊహించుకొని అనుభూతి చెందవలసిందే. శాక్కొ వాంజెట్టిల కథలో రాజ్యం నిర్దాక్షిణ్యతకే కాక విప్లవ అభిమానుల ప్రపంచ వ్యాప్త సంఘీభావానికి కూడా ఉదాహరణలు కనిపిస్తాయి.

తన ఉనికికే ప్రమాదకరమని తాను-వాస్తవికంగానో అవాస్తవికంగానో- నమ్మిన అసమ్మతివాదుల విషయంలో రాజ్యం చాలా నిర్దాక్షిణ్యంగా ఉంటుంది. తన సమాజంలో మామూలుగా ఆదరించే విలువలను సహితం తృణీకరించి వారిని శిక్షిస్తుంది. న్యాయ విచారణలో నిష్పాక్షికంగా సాక్ష్యాన్ని మదింపు వేయవలసిన న్యాయమూర్తి ఆ నిష్పాక్షికత పాటించడు. ముద్దాయిలపైన జారీలో అప్రస్తుతమయిన ద్వేషాన్ని రెచ్చగొట్టడం తప్పని తెలిసీ ప్రాసిక్యూటర్ ఆపనే చేస్తాడు. ముద్దాయిలపైన కేసేదీ లేదని నమ్మే పోలీస్ అధికారిని తొలగించి, ముద్దాయిల రాజకీయాల పట్ల కసి ఉన్న పోలీస్ అధికారి చేత నేరపరిశోధన జరిపిస్తారు. కోర్టులో సత్యం చెప్పక తప్పదని తెలిసీ, సత్యం చెప్పిన వారి ఉద్యోగాలు పీకి వేయిస్తారు.

ఇది అందరికీ తెలిసిన ఒక రాజకీయ సత్యమే. రాజ్యహింస గురించి మనకు అనుభవం లేక పోలేదు, అవగాహన అసలే లేక పోలేదు. కానీ ఈ సత్యాన్ని గురించి మనం ఎంతగా ఆందోళన చెందాలో అంతగా చెందుతున్నామా? చాలా మంది దృష్టిలో రాజ్యహింస అనేది మానవ అస్తిత్వానికి సంబంధించిన ఒక మౌలిక సమస్య కాదు. అది కేవలం 'ప్రస్తుత వ్యవస్థ'లో ప్రజలు, ప్రజా ఉద్యమాలు ఎదుర్కొనే సమస్య. రేపు రాబోయే ప్రజా రాజ్యంలో రాజ్యమే సమాజాన్ని విప్లవీకరించే సాధనం కాబట్టి అప్పుడు జరిగే రాజ్యహింసను విప్లవం అనాలి. ఆ తరువాత రాజ్యమే అదృశ్యమయి పోతుంది కాబట్టి రాజ్యహింస కూడ దానితో బాటు అదృశ్యమయిపోతుంది.

మనిషి సంఘ జీవితాన్ని నియంత్రించడానికి ఉత్పన్నమయిన వ్యవస్థలలో రాజ్యం ఒకటి. ఈ నియంత్రణ అనే అవసరం వర్గ సమాజం చేత కృత్రిమంగా కల్పించబడినది కాదు. సంఘ జీవితానికి అదెప్పుడయినా అవసరమే. అయితే సమాజంలో అసమానతలు, ఆధిపత్యం ఉన్నంత కాలం ఈ నియంత్రణ అనేది నిష్పాక్షికంగా, సమాజానికి అతీతంగా జరగదు. అది సమాజంలో కొందరి పక్షాన మరికొందరిని నియంత్రించే స్వభావాన్ని సంతరించుకుంటుంది. అసమానతలు, ఆధిపత్యం పోవాలని మనం కోరుకున్నట్టే సామాజిక జీవితానికి రాజ్యం అనే ఒక బాహ్య నియంత్రణాధికారి అవసరం లేకుండా సమాజం స్వయం నియంత్రితం కావాలని కూడా కోరుకుంటున్నాము. మనుషులు తమ ముందు ఉంచుకున్న అనేక ఉన్నత ఆదర్శాలలో ఈ రాజ్యరహిత సమాజం ఒకటి. దానినొక ఆదర్శంగా కాక ఒక చారిత్రక దశగా అర్థం చేసుకోవడం వల్ల ఆ చారిత్రక దశను అందుకోవడానికి జరిగే విప్లవ కృషిపైన ప్రస్తుత వ్యవస్థ ప్రయోగించే హింసే ప్రామాణికమైన రాజ్యహింస అయింది. ఆ తరువాత రాజ్యమే ఉండదు కాబట్టి రాజ్యహింస గురించి ఇంత కంటే ఎక్కువ ఆలోచించవలసిన అవసరం లేకుండా పోయింది.

అంతేకాదు. రాజ్యం ప్రయోగించే హింసను అసమాన వ్యవస్థలో నియంత్రణాధికారానికి ఉండే ఒక లక్షణంగా గుర్తించేబదులు రాజ్యం అంటేనే హింస అని సిద్ధాంతీకరించడం జరిగింది. దీని ఫలితంగా రాజ్యం నిర్వహించే నియంత్రణా కర్తవ్యంలోని ఇతర అంశాలు లెక్కలోకి రాకుండా పోయాయి. దీని పర్యవసానంగా కమ్యూనిస్టు పాలనలోని రాజ్యాలు ఆ ఇతర కర్తవ్యాలను కూడా హింసాత్మకంగానే నిర్వర్తించినా విమర్శించే మార్క్సిస్టులు లేకుండా పోయారు. రాజ్యం అంటేనే హింస అనే సిద్ధాంతం కమ్యూనిస్టు పాలిత రాజ్యాలలో సర్వత్రా అలుముకున్న అనాగరికమైన హింసను సమర్థించుకోవడానికి పనికొచ్చింది.

ప్రస్తుత విషయానికి తిరిగి వద్దాము. శాక్కొ వాంజెట్టిలకు జరిగిన అన్యాయాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? అది కేవలం అమెరికా పెట్టుబడిదారీ రాజ్యంలో ప్రజాస్వామ్యానికుండే పరిమితులను (లేక దాని 'అసలు స్వరూపాన్ని')ఎత్తిచూపించే వికారమైన ఉదంతమా? కానీ ఇరవయ్యవ శతాబ్దంలో శాక్కొ వాంజెట్టిలు కోకొల్లలు. అన్ని దేశాలలోనూ రాజకీయ అసమ్మతిని సహించని రాజ్యహింసకు బలయిన ఉద్యమకారులు వేల సంఖ్యలో ఉన్నారు. అమెరికాలో కమ్యూనిస్టులు, భారతదేశంలో కమ్యూనిస్టులే కాక కాశ్మీరీ పంజాబీ నాగా మిజో జాతీయవాదులు, సోవియట్ రష్యా చైనా వంటి కమ్యూనిస్టు పాలిత దేశాలలో పాలక పార్టీతో గానీ దాని అగ్ర నాయకునితో గానీ విభేదించిన వారు, అన్ని మూడవ ప్రపంచ దేశాలలోనూ సరిహద్దు ప్రాంతాలలో నివసించే అల్ప సంఖ్యాక జాతీయులు- శాక్కొ వాంజెట్టీలు ఈ శతాబ్దంలో నిజంగానే కోకొల్లలు.

సోషలిస్టు దేశాలలోని శాక్కొ వాంజెట్టీల గురించే కొంచెం సేపు మాట్లాడుకుందాం. వ్యక్తుల కథలు కాదు, దాని సిద్ధాంత మూలాల గురించి మాట్లాడుకుందాం. రాజ్యరహిత సమాజంతో సహా అన్ని సమ సమాజ ఆదర్శాలు ఒక చారిత్రక దశలో సాధ్యం అవుతాయనీ ఆ చారిత్రక దశను సాధించడంలో రాజ్యమే ఒకసాధనంగా పని చేస్తుందనీ సిద్ధాంతీకరించడంలోనే లోపం ఉంది. దానికి మూలం మార్క్సులోనే ఉంది. ఆయన ఆలోచనలకు ఆయన అనుచరులు ఇచ్చిన వికృత రూపం మార్క్సుకు ఆమోదనీయం అయి ఉండేది కాదు. ఆయన బ్రతికి ఉంటే దానిని గట్టిగా వ్యతిరేకించి ఉండేవాడు. కానీ దాని తాత్విక మూలం ఆయన రచనలలోనే ఉంది. కార్మికవర్గం పెట్టుబడిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకొని కార్మిక రాజ్యాన్ని నెలకొల్పి సమష్టి ఉత్పత్తి వ్యవస్థను రూపొందిస్తుందనీ, అక్కడితో ఇప్పటి వరకు మానవ జాతి కన్న అన్ని కలలనూ సఫలం చేసే ప్రాతిపదిక ఏర్పడుతుందనీ మార్క్సు సిద్ధాంతీకరించాడు. కార్మిక వర్గం ఒక దశ వరకు సోషలిజం పట్ల కొంత ఉత్సాహం చూపించినప్పటికీ ఈ మహత్తర కర్తవ్యాన్ని తన మీద వేసుకునేటట్టు కనిపించలేదని గమనించిన కమ్యూనిస్టులు ఆ కర్తవ్య పూరణను తమ బాధ్యతగా నెత్తిన వేసుకొని తామే కార్మిక వర్గమైనట్టు వ్యవహరించడంతో మార్క్సు ఆలోచనల వక్రీకరణకు పునాది పడింది. ఈ కమ్యూనిస్టు పార్టీలలో కొన్నిటికి తక్కువ ప్రజా పునాది

ఉండిఉండవచ్చు. కొన్నిటికి ఎక్కువ ఉండి ఉండవచ్చు. కానీ అవి నెలకొల్పినవి కమ్యూనిస్టు పార్టీ నియంతృత్వాలే తప్ప కార్మికవర్గ నియంతృత్వాలు కావు.

ఈ విధంగా నెలకొన్న 'కార్మిక రాజ్యాల' న్నీ ఒకటి రెండు తరాలలో దిగజారాయి. అవి 'దిగజారిన కార్మిక రాజ్యాలు'గా మారిపోయాయని ట్రాట్స్కీ వాదులు, 'బూర్జువా రాజ్యాలు'గా మారిపోయాయని మావోయిస్టులు, కరడు గట్టిన బ్యూరోక్రాట్ రాజ్యాలుగా మారిపోయాయని కొంతమంది మార్క్సిస్టు మేధావులు సిద్ధాంతీకరించారు. ఏ పేరు పెట్టినా అవన్నీ దిగజారాయనేది అందరూ ఒప్పుకుంటున్న సత్యం. అధికారం రుచి మరిగిన కమ్యూనిస్టు లందరూ రివిజనిస్టులు, కాకపోతే రెనెగేడ్లు, కాకపోతే బ్యూరోక్రాట్‌లు అయ్యారు. ఏదయినా ఒక విషయం మన అనుభవంలో క్రమం తప్పకుండా పదే పదే జరిగితే అక్కడొక సూత్రం ఇమిడి ఉందని భావించడం శాస్త్రీయ దృక్పథం. కానీ ఈ విషయంలో మాత్రం మార్క్సిస్టులు శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించదలుచుకోలేదు. రాజ్యరహిత సమాజం నిర్మించమని చెప్పి సంపూర్ణ రాజ్యాధికారం ఒకరి చేతిలో పెడితే వాళ్ళు రాజ్యరహిత సమాజాన్ని నిర్మించే బదులు ఒక నూతన నిరంకుశ రాజ్యాన్ని నిర్మించే ప్రమాదం ఉంది అనే సూత్రాన్ని ఇరవయ్యవ శతాబ్దపు కమ్యూనిస్టు ప్రయోగం చరిత్ర నుండి గుణపాఠంగా స్వీకరించవలసి ఉంటుంది. (ఈ పతనానికి కారణం అధికారం రుచి తలకెక్కడం మాత్రమే ననుకోనవసరం లేదు. ఆ విశ్లేషణలోకి పోవడానికి ఇది సందర్భంకాదు.)

అటువంటప్పుడు ఆ పతనాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన ప్రజాస్వామ్యం ప్రజలకు లేక పోవడం ప్రమాదకరం అని కూడా అంగీకరించవలసి ఉంటుంది. కానీ విప్లవం పేరిట రాజ్యానికి సర్వాధికారాలూ ఇచ్చేసి ఆ రాజ్యమే రాజ్య రహిత సమాజాన్నీ కమ్యూనిజాన్నీ నిర్మించే సాధనం అని సిద్ధాంతీకరించిన తరువాత ఆ రాజ్యం దిగజారిందని చెప్పి దానిపైన పోరాటం చేయడానికి ప్రజలకు ప్రజాస్వామ్యం కావాలంటే ఎక్కడి నుంచి వస్తుంది? కార్మిక రాజ్యం పతనమై బూర్జువా వ్యవస్థను పునరుద్ధరించింది కాబట్టి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని కూడ పునరుద్ధరించాలని డిమాండ్ చేయాలా? ప్రజాస్వామ్యాన్ని గురించి ఇంత కృత్రిమంగా ఆలోచించవలసిన అవసరం ఏముంది?

సమసమాజ సాధనకు సంబంధించిన మార్క్స్ సూత్రీకరణలను ఇంకొంచెం లోతుగానే ప్రశ్నించడం అవసరం. సమానత్వం, సమష్టి జీవితం, రాజ్యరహిత సమాజం మొదలయిన సమసమాజ ఆదర్శాలన్నిటికీ ప్రాతిపదిక కల్పించే 'పునాది' ఒకటేదయినా ఉండగలదా? సమష్టి ఉత్పత్తి వ్యవస్థ దానికి పునాది కల్పిస్తుందని మార్క్స్ భావన. కానీ అన్ని సమసమాజ ఆదర్శాలూ తీరిన తరువాతే సమష్టి ఉత్పత్తి వ్యవస్థ సాధ్యం అవుతుంది. అన్ని రకాల అసమానతలు, అరమరికలు పోనిదే మనుషులు తమ ఉత్పత్తి క్రియను సమష్టిగా నిర్వహించుకునే వ్యవస్థ సాధ్యం కాదు. కమ్యూనిస్టు భావనలోని ఆదర్శాలలో ఏ ఒక్కటీ వేరే ఏ ఒక్కదానికీ ప్రాతిపదిక

కాదు, పర్యవసానం కాదు. అన్నీ ఒక క్రమంలో సాధ్యం కావలసినవే (అసలు సాధ్యం అంటూ అయితే). ఈ క్రమంలో సామాజిక ఆర్థిక సమానత్వం కోసం పోరాటాలు, నూతన సామాజిక సంస్కృతి కోసం జరగవలసిన కృషి, కలగలసి జరగవలసి ఉంటుంది. ఆ సంస్కృతిలో ఒక అంశం, రాజ్య నియంత్రణ స్థానంలో సమాజ స్వయం నియంత్రణను నెలకొల్పడం.

సమసమాజ ఆదర్శాల కోసం పోరాటాలు, సాంస్కృతిక కృషి, అనంతంగా సాగుతూనే ఉంటాయి. ప్రతీ చారిత్రక దశలోనూ సమాజం కొంత ప్రగతిని సాధించి ఒక రూపంలో వ్యవస్థితమవుతుంది. అది తీసుకునే రూపం ఆపైన ప్రగతినీ అభ్యుదయాన్నీ సాధించడానికి ఏ మేరకు అవకాశం కల్పిస్తే ఆ మేరకు మాత్రమే అభ్యుదయం నిరాటంకంగా సాగుతుంది. అంతకు మించిన అభ్యుదయాన్ని ఆ వ్యవస్థను కాపాడే రాజ్యం ప్రతిఘటిస్తుంది. దానిని సాధించదలచుకున్న వాళ్లు రాజ్యంపైన పోరాడవలసి ఉంటుంది. రాజ్యహింసను ఎదుర్కోవలసి ఉంటుంది. ఏదయినా ఒక చారిత్రక దశలో నెలకొన్న రాజ్యానికి 'కార్మిక రాజ్యం' లేక 'ప్రజారాజ్యం' అని పేరు పెట్టి,ఆ రాజ్యం రాజ్యరహిత సమాజాన్ని నిర్మించి తాను పక్కకు తప్పుకుంటుందని సిద్ధాంతం చేసి, సకల చారిత్రక సద్గుణాలకు అది ప్రతిబింబం అని చెప్పి, దాని చేతిలో నియంతృత్వ అధికారాలు పెట్టడం చాలా ప్రమాదకరం. ప్రతీ దశలోనూ రాజ్యాన్నీ ప్రభుత్వాన్నీ ధిక్కరించే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. రాజ్యం వ్యవహారాలు ప్రజలకు తేటతెల్లంగా తెలియాలి. రాజ్యం సహించడానికి సిద్ధంగా లేని ప్రగతి కోసం ఆచరణకు పూనుకునే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. అటువంటి ఆచరణకు పూనుకునే వాళ్లను దేశ భద్రత పేరిటనో విప్లవం పేరిటనో అణచివేసే అధికారం రాజ్యానికి ఉండడానికి వీలులేదు.

కమ్యూనిస్టు పాలిత దేశాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 'సోషలిజంలో ప్రజాస్వామ్యం' అనే అంశం మీద కొంత కాలంగా చర్చ జరుగుతూ ఉంది. (మన దగ్గర కాదనుకోండి) ఆ దేశాలలో ప్రజలెవ్వరికీ రాజ్యం వెలుపల స్వేచ్ఛ లేదు. (స్టాలిన్ పాలనలో రాజ్యం లోపల కూడా స్వేచ్ఛ లేదు.) తిరోగమనానికే కాక పురోగమనానికి కూడా కమ్యూనిస్టుపాలకులు స్వేచ్ఛ ఇవ్వలేదు. ఆ రాజ్యమే పతనమయినప్పుడు ఇది సమస్యాత్మకంగా తయారయింది. దీనిని దృష్టిలో ఉంచుకొని సోషలిస్టు వ్యవస్థలో ప్రజా వ్యతిరేకులకు ప్రజాస్వామ్యం ఉండకూడదు గానీ ప్రజలకు ఉండాలనీ, అసత్యానికి స్వేచ్ఛ ఉండకూడదు గానీ సత్యానికి ఉండాలనీ కొన్ని ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. ఇది విన ముచ్చటయిన పరిష్కారం. పైగా కొత్తది కూడా కాదు. లెనిన్ కాలంలోనే రోజాలగ్జెంబర్గ్ బోల్షెవిక్‌ల నియంతృత్వవైఖరిని నిరసిస్తూ కార్మిక వర్గానికి పార్టీ వెలుపల కూడా స్వేచ్ఛ ఉండాలనీ కార్మిక వ్యతిరేక శక్తులను మాత్రం నిర్దాక్షిణ్యంగా అణచి వేయాలనీ అనింది. ఇది వినడానికి బాగానే ఉంటుంది. కానీ ఎవరు ప్రజలు, ఎవరు ప్రజాద్రోహులు, ఏది సత్యం, ఏది అసత్యం, ఏది కార్మిక వర్గ దృక్పథం, ఏది కార్మిక వ్యతిరేక దృక్పథం అని తేల్చేది ఎవరు?

స్వేచ్ఛను అనుమతించవలసిన వాళ్లే తాము ఎవరికి అనుమతించేదీ నిర్ణయిస్తారు. అంటే రాజ్యమే నిర్ణయిస్తుంది. కానీ మనం చర్చిస్తున్నది రాజ్యం దిగజారితే ఏమవుతుంది అన్న ప్రశ్ననే కద ? అప్పుడు వాళ్లు ఎ సత్యాన్ని అనుమతిస్తారు? దేనిని అసత్యంగా గుర్తిస్తారు? వాళ్లు చెప్పేదే కార్మిక వర్గ దృక్పథం. తక్కినదేదయినా కార్మిక వ్యతిరేకం. దానికి స్వేచ్ఛ ఉండదు. దానిని అనుసరించే వాళ్లకు ప్రజాస్వామ్యం ఉండదు. అప్పుడేమవుతుంది? సిద్ధాంతరీత్యానే సకల చారిత్రక సద్గుణాలు, విజ్ఞత కార్మికరాజ్యానికి ఆపాదించబడ్డాయి. కాబట్టి ఆ రాజ్యానికి వెలుపల సత్యం ఎక్కడిది జ్ఞానం ఎక్కడిది? ఆ రాజ్యానికి వెలుపల ఉండేదంతా తిరోగమనమే అయినప్పుడు దానికి స్వేచ్ఛ ఎక్కడిది?

నిజానికి పతనావస్థ దాకా పోనక్కర లేదు. రాజ్యాధికారం చేతిలో ఉన్న వాళ్లు ఇంకా అభ్యుదయవాదులు గానే ఉంటూ కూడా తమ ఆదేశాలతో విభేదించే వాళ్ల పట్ల అసహనాన్ని ప్రదర్శించవచ్చు. అధికారం మనుషులలో పెత్తందారీ లక్షణాలు కల్గించడానికి వారు పూర్తిగా దిగజారనవసరమేమీ లేదు. తమ అవగాహనకు అప్పటికింకా అందని విషయాల పట్ల వారు అసహనాన్ని ప్రదర్శించవచ్చు. కానీ అవే నిజానికి ప్రగతిశీల భావాలు కావచ్చు. తాము నిర్దేశించిన విప్లవ పంథాకు వ్యతిరేకంగా చేపట్టే రాజకీయ ఆచరణను ప్రత్యామ్నాయ రాజకీయ ఆచరణగా గుర్తించక ప్రజావ్యతిరేక పంథా అని దూషించవచ్చు. కమ్యూనిజం సాధనకు సంబంధించిన ప్రత్యామ్నాయ అవగాహనలన్నిటినీ ప్రజా వ్యతిరేక కార్యకలాపాలుగా చిత్రీకరించి అణచి వేసిన ఉదాహరణలు ఈ శతాబ్దపు కమ్యూనిస్టు పాలనలలో కోకొల్లలు.

శాక్కొ, వాంజెట్టిలనే తీసుకుందాం వాళ్లు 'ప్రజల' కిందికి వస్తారా, 'ప్రజాద్రోహులు' కిందికి వస్తారా? వాళ్లకు ఒక కమ్యూనిస్టు పాలిత రాజ్యంలో ఇంత కంటే న్యాయం జరిగి ఉండేదా? వాళ్లు అరాచక వాదులు. వాళ్లు రాజ్యాన్ని ద్వేషిస్తారు. బూర్జువా రాజ్యాన్నే కాదు. కమ్యూనిజం సాధన కోసం ఏర్పడిన కార్మిక రాజ్యాన్ని కూడ ద్వేషిస్తారు. దానికి వ్యతిరేకంగా ప్రజలను 'రెచ్చగొడతారు.' మరి కమ్యూనిస్టు ప్రభుత్వం వాళ్లను ప్రజా ద్రోహులుగా చూస్తుందా, లేక ఒక ప్రత్యామ్నాయ విముక్తి మార్గాన్ని అనుసరించే తోటి విప్లవకారులుగా గుర్తిస్తుందా? వాళ్లు యుద్ధంలో పాల్గొనరు. యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలలో ప్రచారం చేస్తారు. కానీ కమ్యూనిస్టు ప్రభుత్వం సామ్రాజ్యవాదం పేరు మీదనో ఇంకేదో పేరు మీదనో యుద్ధాలు చేస్తూనే ఉంటుంది. దానిలో పాల్గొన వద్దని ప్రజలను 'రెచ్చగొట్టే' అరాచకవాదులు దేశద్రోహులా, లేక ప్రత్యామ్నాయ రాజకీయ కార్యకర్తలా? బూర్జువా వ్యవస్థలాగే కమ్యూనిస్టు పాలనకు కూడా అరాచకవాదులు అసమ్మతి వాదులు. వ్యవస్థలోపలి అసమ్మతి వాదులు కారు. వ్యవస్థకే అసమ్మతి వాదులు.

శాక్కొ వాంజెట్టిలకు అమెరికాలో ఎంత అన్యాయం జరిగిందో వారి వంటి అరాచకవాదులకు (రష్యాలో వీరిని సోషల్ రెవల్యూషనరీలు అనే వారు) అన్ని కమ్యూనిస్టు పాలిత దేశాలలోనూ అంతే అన్యాయం జరిగింది. వారిని పాలక కమ్యూనిస్టు పార్టీలు దేశద్రోహులుగా, విప్లవ

విద్రోహులుగా చిత్రీకరించాయి. లెనిన్ ప్రభుత్వం అరాచకవాదులను తీవ్రంగా అణచివేసిందని వాంజెట్టి అంటాడు. అమెరికాలో శాక్కో వాంజెట్టిలకు కనీసం ఒక డిఫెన్స్ కమిటీ ఏర్పడింది. కోర్టులో కొట్లాట జరిగింది. బయట సంవాదం జరిగింది. వారి కథ చరిత్రకెక్కింది. వాళ్లు అన్యాయంగా చనిపోయినా అనామకంగా చనిపోలేదు. రష్యాలో అటువంటి అవకాశమే లేదు. స్టాలిన్ హయాంలోనయితే బుఖారిన్ వంటి బోల్షెవిక్ అగ్రనాయకులకే దిక్కు లేదు. స్టాలిన్‌ను వ్యతిరేకించిన పాపానికి కోర్టులో చేతులు కట్టుకొని నిలబడి తాము సోషలిజానికి వ్యతిరేకంగా కుట్ర చేసామని ఒప్పేసుకొని శిక్షను ఆహ్వానించవలసి వచ్చింది. ఇంక ఒక చేపలమ్ముకునే వాడికీ, ఒక చెప్పులు కుట్టే వాడికీ దిక్కే ముంటుంది?

ప్రజలకూ ప్రజాభ్యుదయానికీ ప్రజాస్వామ్యం వర్తిస్తుంది గానీ ప్రజాద్రోహులకు వర్తించదని సూత్రీకరిస్తే, ప్రజాభ్యుదయానికి అత్యున్నత ప్రతినిధి తానే కాబట్టి తనను వ్యతిరేకించే వాళ్లంతా ప్రజాద్రోహులేనంటుంది 'కార్మిక రాజ్యం'. తనకు వెలుపల స్వేచ్ఛ ఉండజాలదంటుంది. ఈ తర్కం ఫలితంగానే అన్ని కమ్యూనిస్టు పాలిత దేశాలలోనూ ప్రజలకూ, ప్రజా ద్రోహులకూ ఎవరికీ ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఇది సమాజానికి నష్టకరంగా పరిణమించడానికి ఈ 'కార్మిక రాజ్యం' దిగజారి కమ్యూనిస్టు వ్యతిరేక రాజ్యంగా మారనవసరమేమీ లేదు. అది ఇంకా అభ్యుదయ పంథాలో ఉంటూ ఉండగానే ఈ వైఖరి చాలా నష్టం కలిగించగలదు. అన్ని సమస్యలకూ పరిష్కారం ఏ ఒక్కరికో అర్థం అవుతుందనుకోవడం పొరబాటు.అన్ని విషయాలూ ఏ ఒక్కరికీ అనుభవం కావు, అవగాహన కావు. సృజనశీలం ఏ ఒక్కరిలోనూ ఎప్పటికీ ఇంకిపోకుండ ఉండదు. పైగా అధికారంనుండి పుట్టే జడత్వం, అసహనం ఎప్పటికయినా కొత్త ఆలోచనలకు ప్రతిబంధకంగానే ఉంటాయి. ఈ మేరకు సమస్యను మావో గుర్తించాడు. రాజ్యం ప్రజలను చైతన్యవంతులను చేసి తన వ్యవహారాలలో భాగస్వాములను చేయాలని గుర్తించాడు. రాజ్యం బ్యూరోక్రాటిక్‌గా మారిపోకుండా ఉండడానికి ఇది అవసరం అని గుర్తించాడు. కానీ ఇది రాజ్యంలోపలి స్వేచ్ఛే తప్ప రాజ్యం వెలుపలి స్వేచ్ఛ కాదు. రాజ్యమే రెండుగా చీలి ఒక భాగం తిరోగమనం వైపు, ఒకటి పురోగమనం వైపు నిలిచినప్పుడు తిరోగమనాన్ని 'బొంబార్డ్' చేయమని మావో అన్నాడు. అంతే తప్ప కార్మిక నియంతృత్వానికి వెలుపల ప్రజలకు స్వేచ్ఛ ఉండాలనేది మావో భావన కాదు. లెనిన్, ట్రాట్స్కీ, స్టాలిన్, మావో లెవ్వరూ కార్మికరాజ్యానికి వెలుపల ప్రజలకు స్వేచ్ఛ ఉండగలదని ఒప్పుకోలేదు. ఒక్క రోజాలగ్జెంబర్గ్ మాత్రమే కార్మిక రాజ్యానికి వెలుపల సహితం కార్మికులకు స్వేచ్ఛ ఉండాలనింది. కానీ ఎవరు కార్మికులు అనేది కార్మిక రాజ్యమే నిర్ణయిస్తుందికాబట్టి ఇది సమస్యకు పరిష్కారం కాదు.

మరయితే ప్రజాస్వామ్యానికి ఏ పరిమితులూ ఉండకూడదా అని ఎవ్వరూ ఆవేశపడనవసరం లేదు. నిజానికి ఈ సమస్యకు సులభమైన పరిష్కారమేదీ లేదు. ప్రజాస్వామ్యానికి ఉండగల పరిమితుల గురించి, పరిధి గురించి బూర్జువా వ్యవస్థ కనీసం రెండు శతాబ్దాలుగా తన తాత్విక

చట్రంలో చాలా చర్చ జరిపింది. రాజకీయ ప్రజాస్వామ్యం బూర్జువా వ్యవస్థలోనే పుట్టి కాలక్రమంలో చాలా ఎదిగింది. అది ఎదగడానికి అసమ్మతి ఉద్యమాలు చాలా దోహదం చేసాయి. బూర్జువా వ్యవస్థను తిరస్కరిస్తూనే రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఒక నాగరికతా విలువగా గౌరవించిన వామపక్ష మేధావులు కూడా చర్చకు మేలుచేసారు. ఈ సంప్రదాయాన్ని సీరియస్‌గా తీసుకొని దానికున్న బూర్జువా పరిమితులను ఏ విధంగా తొలగించాలో ఆలోచించి సమ సమాజ ఆదర్శాల సాధనకు అనుకూలంగా దానిని మలచుకోవడం అవసరం. ముందు బూర్జువా ప్రజాస్వామ్యం ఒక తిట్టు మాట కాదనీ, శాక్కో వాంజెట్టీల సమస్య 'ప్రస్తుత వ్యవస్థ'కు సంబంధించిన సమస్య మాత్రమే కాదనీ, రాజ్యరహిత సమాజం ఒక ఆదర్శమే తప్ప మార్క్స్ ఊహించినట్టు 'మానవచరిత్ర పూర్వదశ' (ది ప్రీహిస్టరీ ఆఫ్ మాన్‌కైండ్) అంతాన సిద్ధించబోయే చారిత్రక దశ కాదనీ గుర్తించడం అవసరం.

బూర్జువాప్రజాస్వామ్యం అనే భావనకు మార్క్సిస్టు సిద్ధాంత సంప్రదాయంలో ఉన్న స్థానాన్ని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు.కానీ కొన్ని మౌలికమయిన విషయాలను ప్రస్తావించాలి. బూర్జువా ప్రజాస్వామ్యం అనేది సారాంశంలో బూర్జువా నియంతృత్వానికి ఒక రూపం మాత్రమేననే లెనినిస్టు సూత్రీకరణను తిరస్కరించవలసి ఉంది. సంక్షోభ సమయంలో బూర్జువా పాలక వర్గాలు ప్రజాస్వామ్యాన్ని వదిలి పెట్టి నియంతృత్వాన్ని ఆశ్రయిస్తారనడం వేరు. సారాంశంలో బూర్జువా ప్రజాస్వామ్యం బూర్జువా నియంతృత్వమేననడం వేరు. రాజకీయ వ్యవస్థ ఆర్థిక వ్యవస్థను అనుసరించే ఉంటుందని అనుకున్నా, నియంతృత్వ రూపంలో కాక ఒక నిర్దిష్టమైన ప్రజాస్వామ్య రూపంలో పరిపాలించడమే బూర్జువా వ్యవస్థలో రాజ్యానికి తగిన రూపం. అయితే రాజకీయ వ్యవస్థలోనూ రాజ్యాంగ యంత్రంలోనూ ఉన్న విలువలన్నీ ఆర్థిక వ్యవస్థ అవసరాల కోసం పుట్టినవి కావు. మధ్యయుగాలలో ఫ్యూడల్ వ్యవస్థ ఏర్పరచిన ఆటంకాలు, అవరోధాల నుండి పెట్టుబడికి అవసరమయిన విముక్తి బూర్జువా విప్లవానికి ప్రధాన చోదక శక్తి అని ఒప్పుకుందాం. అయితే ఈ భౌతిక అవసరం సమాజంలోని మనుషుల ఆలోచనలలో స్వేచ్ఛ, స్వతంత్రం, వివేచన, లౌకికత మొదలయిన విలువల రూపం తీసుకోవడంతో ఆ మార్పు కేవలం ఆర్థిక వ్యవస్థకు పరిమితం కాకుండా సమాజంలోని అన్ని రంగాలకూ విస్తరించింది. నిర్దిష్టమైన భౌతిక పరిస్థితుల నుంచి పుట్టే ఆలోచనలు సార్వత్రిక స్వభావం గల విలువల రూపం తీసుకోవడం మనిషి ఆలోచనా రీతికి ఉండే విలక్షణమయిన గుణం. ఈ గుణాన్నీ దాని పర్యవసానాలనూ జాగ్రత్తగా అధ్యయనం చేస్తే మార్క్సిజంలోని లోపాలను అర్థం చేసుకోవడానికీ సవరించడానికీ అవసరమయిన తాత్విక పరికరాలు దొరుకుతాయి. మానవ చైతన్యానికి ఉండే ఈ గుణం కారణంగా ఒక అవసరం నుంచి పుట్టిన ఆలోచన ఆ అవసరంతో నిమిత్తం లేని ఇతర జీవిత రంగాలపైన కూడా ప్రభావం వేయగలదు. మార్పును సాధించగలదు. అన్ని రంగాలలోనూ వచ్చిన మార్పులు చివరికి స్థిరీకరణ చెందేటప్పటికి పరస్పర సారూప్యత,


సమన్వయం లేకుండా ఉండదు. నిజానికి అన్ని రంగాలలోని మార్పులలోనూ తరచుగా ఒక సామాన్య తాత్విక సూత్రం అంతర్లీనంగా ఉంటుంది. అది ఆ వ్యవస్థ ప్రాపంచిక దృక్పథాన్ని సూచిస్తుంది. అయితే వివిధసామాజిక రంగాలలో వచ్చే మార్పు సరిగ్గా 'పునాది'కి అవసరమయిన మేరకు వచ్చి ఆగిపోనక్కర లేదు. ఆ రంగాలలో కృషిచేసే వారు అందుకోసం మాత్రమే కృషి చేయనప్పటికీ చివరికి 'పునాది'కి అనుగుణ్యమైన రూపంలోనే 'ఉపరితలం' మారుతుందనుకునే యాంత్రికమైన అవగాహనకు, 'పునాది'లో పుట్టిన భౌతిక అవసరం విలువల రూపంలో, ఆదర్శాల రూపంలో వ్యక్తం కావడం వల్ల వివిధ ఇతర జీవిత రంగాలపైన కూడా ఆ విలువల దృష్టి ప్రసరించి పోరాటాలు, సంఘర్షణల ద్వారా అన్ని జీవిత రంగాలలోనూ తదనుసారం మార్పు వస్తుందనే అవగాహనకూ మౌలికమైన తేడాయే ఉంది. ఫ్యూడల్ నియంత్రణ నుండి పెట్టుబడికి అవసరమైన విముక్తి స్వేచ్ఛ, స్వతంత్రం, లౌకికత, వివేచన మొదలయిన విలువల రూపంలో వ్యక్తం కావడం వల్ల ఆ విలువల చేత ప్రేరితమైన మానవ ఆచరణ వైవాహిక సంబంధం నుండి రాజకీయ వ్యవస్థ దాకా అన్ని రంగాలలోనూ మార్పును సాధించింది. ఈ మార్పంతా బూర్జువా ప్రాపంచిక దృక్పథానికి లోబడి ఉన్నప్పటికీ పెట్టుబడిదార్ల అవసరాలకు పరిమితమయి నిలిచిపోలేదు. ఆ మార్పుకు బూర్జువా పరిమితులున్నప్పటికీ అది కేవలం బూర్జువా వర్గ ప్రయోజనాలను కాపాడే మార్పు కాదు. విజ్ఞాన శాస్త్రం బూర్జువా వ్యవస్థ పరిధిలోనే మానవాళికి శాశ్వతంగా ఉపకరించగల జ్ఞానాన్నీ భౌతిక సంపదనూ సాధించినట్టే, స్వేచ్ఛ స్వతంత్రం మొదలయిన విలువల వెలుగులో 'ఉపరితల' రంగాలలో సాధించిన మార్పు కూడా బూర్జువా ప్రాపంచికదృక్పథం పరిధిలోనే మానవాళికి శాశ్వత నైతిక సంపదను సమకూర్చి పెట్టింది. ప్రజాస్వామ్య హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, సంప్రదాయాలు దీనిలో ముఖ్యమైనవి. వీటి కుండే బూర్జువా తాత్విక పరిమితులను తొలగించి సమసమాజం దిశగా, రాజ్య రహిత సమాజం దిశగా, ఈ నైతిక సంపదను ఏ విధంగా కొనసాగించాలని ఆలోచించాలి తప్ప బూర్జువా ప్రజాస్వామ్యం అనే దాన్ని ఒక తిట్టు మాటగా ఉపయోగించి దానిలోని సాంస్కృతిక పురోగతిని తిరస్కరించే నియంతృత్వం ద్వారా రాజ్యరహిత సమాజం నెలకొంటుందనుకోవడంలో అర్థం లేదు.

1-6-1995

– కె.బాలగోపాల్

44026


ప్రజా చరిత్ర మే 29, 1824 పాటుకెట్‌లో నేత పనిచేసే స్త్రీలు పురుషులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు అది అమెరికాలో స్త్రీ పురుష కార్మికులు సంయుక్తంగా చేసిన మొట్టమొదటి సమ్మె




ప్రజాచరిత్ర జనవరి 14, 1879 పెన్సిల్వేనియా బొగ్గు గనుల్లో పనిచేసే మోల్లీ మాక్వైర్స్ (రాడికల్ కార్మికులు) లో మిగిలున్న వారిని ఉరి తీశారు



ప్రజా చరిత్ర మే 26, 1894 : ఎనిమిది గంటల పనిదినం కోసం కొలరాడో రాష్ట్రంలోని క్రిపుల్ క్రీక్‌లో గని కార్మికులు సమ్మె చేశారు




ప్రజాచరిత్ర జూన్ 26, 1894 పుల్‌మాన్ సమ్మె యూజీన్‌డెబ్స్ నాయకత్వం వహించారు. అమెరికన్ రైల్వే యూనియన్ ప్రారంభించబడింది.




ప్రజాచరిత్ర జూన్ 29, 1905 ఇండస్ట్రియల్ వర్కర్స్ ఆఫ్ ద వరల్డ్ "వేతన వ్యవస్థ"ను రద్దు చేసేందుకు పుట్టింది మదర్ జోన్స్ ఎలిజబెత్ గుర్లీఫ్లిన్, లూసీ పార్సన్స్, యూజీన్ డెబ్స్, బిల్ హేవుడ్ సంస్థాపక సభ్యులు




ప్రజాచరిత్ర ఆగస్టు 1, 1917 : ఐ.డబ్ల్యు.డబ్ల్యు. కార్యకర్త ఫ్రాంక్ లిటిల్‌ను ఉరితీశారు.




ప్రజాచరిత్ర ఫిబ్రవరి 6, 1919 : సీటెల్‌లో సార్వత్రిక సమ్మె. సమ్మె చేస్తున్న ఓడరేవు కార్మికులకు మద్దతుగా 65,000 మంది కార్మికులు సమ్మె చేశారు.




ప్రజాచరిత్ర సెప్టెంబర్ 22, 1919 : ఉక్కు పరిశ్రమ కార్మికుల మహత్తర సమ్మె. 3,65,000 మంది కార్మికులు పాల్గొన్నారు. దేశంలోని దాదాపు ప్రతి మిల్లూ మూత పడింది. ఆక్రమంలో 22 మంది కార్మికులు చనిపోయారు. వేలాది మంది గాయపడ్డారు.



ప్రజాచరిత్ర జనవరి 2, 1920 : "రెడ్- వ్యతిరేక" పామర్ దాడులు 5000 మంది అరెస్టయ్యారు. 3000 మంది జైలు పాలయ్యారు. వందల మంది అమెరికా నుంచి బహిష్కరించబడ్డారు.




ప్రజాచరిత్ర సెప్టెంబర్ 2, 1921 : వెస్ట్ వర్జీనియా గని కార్మికుల సమ్మె. గని యజమానుల విమానాల నుంచి సమ్మె చేస్తున్న కార్మికులపై బాంబు దాడి.




ప్రజాచరిత్ర ఆగస్టు 22, 1927: కేసులో ఇరికించబడ్డ కార్మిక నాయకులు శాక్కొ, వాంజెట్టి కరెంటు కుర్చీలో చంపబడ్డారు.



ప్రజాచరిత్ర గస్ట్ 22, 1927 : గుర్తుంచుకోండి 22 ఆగస్ట్ 1927న న్యాయానికి శిలువ వేశారు.



# BIBLIOGRAPHY


1. Arblaster, Anthony. *The Relevance of Anarchism in The socialist Register - 1971*. Ed. by Ralph Miliband & John Saville (London: Merlin Book Club, 1971)
2. Avrich, Paul. *Sacco and Vanzetti - The Anarchist Background* (Princeton : Princeton University Press, 1991)
3. Care, Verginia Spencer. *Dos Passos - A Life.* (Garden City, N.Y: Doubleday & Co., Inc., 1984)
4. Chomsky. Noam. *Notes on Anarchism in For Reasons of State.* (New York: Vantage Books, 1973)
5. Dos Passos, John, *U.S.A.* (New York: Harcourt, 1936)
6. Ehrmann, B. Herbert. *The Case that will not Die - Commonwealth Vs. Sacco and Vanzetti* (Boston: Little, Brown and Company, 1969)
7. Fast, Howard. *The Passion of Sacco and Vanzetti: A New England Legend.* (London: The Bodley Head, 1954)
8. Felix, David. *Protest: Sacco - Vanzetti and the Intellectuals* (Bloomington: Indiana University Press, 1965)
9. Frankfurter, Felix. *The Case of Sacco and Vanzetti: A Critical Analysis in The World of Law (Vol:II) Ed. by* Ephrain London (New York: Simon and Schuster, 1960)
10. Feuerlicht, Roberta Strauss. *Justice Crucified - The Story of Sacco and Vanzetti* (New York: Mc Graw - Hill Book Company, 1981)
11. Hardegree Jr., Joseph. *Left Political Parties in the United States: Some Historical Lessons in Which Side We Are On* (Oakland : I.R.T.F.F.S.A., 1980)
12. Joughin, G. Louis and Edmund M. Morgan. *The Legacy of Sacco and Vanzetti* (New Jersey: Princeton University Press, 1978)
13. Lansberg, Melvin. *Dos Passo's Path to U.S.A.* (Colorado: The Colorado Associated University Press, 1972)
14. Leon and Baker. *Brandies and Frankfurter - A Duel Biography* (New York: Harper & Row, 1984)
15. Musmanno, Michael. A. *Verdict!* (London: Peter Davies, 1958)
16. Porter, Katherine Anne. *The Never Ending wrong* (Boston: Little, Brown and Co. 1977)
17. Russel, Francis, *Sacco & Vanzetti: The Case Resolved* (New York: Harper & Row, 1986)
18. Sinclair, Upton. *Boston* (New York: Albert & Charles Boni, 1928)
19. Thompson, William G. *Vanzetti's Last Statement in Atlantic Monthly,* 141: 254 - 57 (February, 1928)
20. Urovsky, Melvin. I. *Felix Frankfurter - Judicial Restraint and Individual Liberties* (Boston: Twayne Publishers, 1991)
21. Weeks, Robert Percy (Ed.,). *Commonwealth Vs. Sacco and Vanzetti* (New Jersey: Prentice - Hall, Inc., 1962)

సమకాలీన అమెరికా సమాజంలో లక్షల మెదళ్ళను కదిలించి ఒక తరం మేధావులకు హీరోలయిన చెప్పులుకుట్టి బతికిన శాక్కొ, చేపలమ్మి జీవించిన వాంజెట్టిల వ్యథార్త జీవిత యథార్థ దృశ్యమే ఈ గ్రంథం. గత శతాబ్దపు చివరి దశకంలో యూరప్‌ను డ్రేఫస్ కేసు కుదిపితే, శాక్కొ-వాంజెట్టి కేసు రెండవ దశకంలో ప్రపంచాన్ని ఊపేసింది. తమ రాజకీయ అభిప్రాయాల కారణంగా తప్పుడు కేసులో ఇరికించబడిన ఈ సాదాసీదా తాత్విక అరాచక వాదుల కోసం ప్రపంచమంతా ఒకే గొంతుకై నినదించింది. అరాచకవాదుల, కమ్యూనిస్టుల నుంచి లిబరల్ మేధావుల దాకా వీరికోసం న్యాయస్థానాల్లోనూ, బయటా అవిశ్రాంతంగా యాభై ఏళ్ళపాటు పోరాడారు. టొరాంటో నుంచి టోక్యో దాకా, అలాస్కా నుండి ఆస్ట్రేలియా దాకా, సాధారణ కార్మికులనుంచి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తల దాకా ఎందరో వీరిద్దరి కోసం ఉద్యమించారు.

1976 ఎమర్జెన్సీ చీకటిరోజుల్లో ముషీరాబాద్ జైల్లో ఉరితీయబడిన రైతాంగ నక్సలైట్ యోధులు భూమయ్య, కిష్టాగౌడ్‌ల గురించి శ్రీశ్రీ రాసిన 'భూమ్యాకాశాలు' కవిత ద్వారా తెలుగు పాఠకులకు శాక్కొ, వాంజెట్టిలు పరిచయమయ్యారు. కాగా, ఇది శాక్కొ-వాంజెట్టిల గురించి రచించబడిన తొలి తెలుగు పుస్తకం. ఇరవయ్యొకటవ శతాబ్దాన్ని తనదిగా ప్రకటించు కునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో దాని నిజస్వరూపాన్ని సందర్శించేందుకూ, రాజకీయ, సామాజిక, ఆర్థిక, ప్రజాస్వామ్య అవసరాన్ని, విలువలని గుర్తించేందుకూ ఈ గ్రంథం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.




పర్‌స్పెక్టివ్స్

సామాజిక శాస్త్రం / సాహిత్యం

PERSPECTIVES